

సద్గురు శ్రీ నాన్నగారు, జిన్నూరు

అమృత వాహిని - 2

# అమృత వాహిని - 2

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# అమృత వాహిని – 2

(సద్గురు శ్రీ నాన్నగారి ప్రవచనముల నుండి సేకరించినది)

సేకరణ

**సాగిరాజు రామకృష్ణంరాజు**

ప్రధమ ముద్రణ 2018
ప్రతులు - 1000

సర్వ హక్కులు:

**సాగిరాజు రామకృష్ణంరాజు**
**శ్రీ రమణ నిలయం**
**అర్ధవరం – 534 197**

వెల: రూ॥ **140**

డిజైన్డ్ బై
**అనన్య గ్రాఫిక్స్, పాలకొల్లు**
**9397151342**


సలహా సంప్రదింపులకు, ప్రతులకు:

**సాగిరాజు రామకృష్ణంరాజు**
శ్రీ రమణ నిలయం, ఎలిమెంటరీ స్కూల్ ఎదుట, అర్ధవరం - 534 197,
గణపవరం మండలం, ప॥గో॥జిల్లా, **సెల్: 9491968966**

**డి.వి. శ్రీరామరాజు**
మహర్షి టవర్స్, S1, డోర్ నెం: 2-13-13, శివరావుపేట,
భీమవరం - 534 202, ప॥గో॥జిల్లా, **సెల్: 9949396851**

**బి. భిక్షపతి**
ప్లాట్ నెంబరు- 108, బ్లాక్ నెంబరు- 5, ప్రజానివాస్ ఫేస్-2,
మోహన్ నగర్, హైదరాబాద్ - 500 035 **సెల్: 9949515234**





# అంకితం

## భగవాన్ శ్రీరమణమహర్షి పాదపద్మములకు

# విషయ సూచిక


పరిచయం ............................................................................ V

గ్రంథ పరిచయం ................................................................ VIII

కృతజ్ఞతలు ........................................................................ IX

1. ప్రేమ, భక్తి........................................................................ 1

2. జ్ఞానము, జ్ఞాని .................................................................. 17

3. మనస్సు - అహంకారము ...................................................... 29

4. సమాజం - మతం ............................................................... 45

5. సంపద ............................................................................. 54

6. ఈశ్వరుడు ........................................................................ 57

7. సత్సంగము ....................................................................... 62

8. నిష్కామ కర్మ...................................................................... 67

9. భగవాన్ ............................................................................ 72

10. బంధ స్వరూపము, సామరస్యము ........................................ 82

11. సాధనా రహస్యాలు ......................................................... 191

12. గురు వైభవము .............................................................. 306






# పరిచయం

మనం సత్య స్వరూపులమే కాని దానిని అనుభవంలోకి తెచ్చుకొంటే స్వేఛ్ఛను పొందుతాము. దానికి సద్గురువును ఆశ్రయించి వారు చూపిన బాటలో నడవాలని మన శాస్త్రాలు చెబుతున్నాయి. ఎంత చదివినా అవగాహన అణు మాత్రమే. సత్యాన్ని కనిపెట్టనక్కరలేదు అడ్డుగా ఉన్న అజ్ఞానాన్ని తొలగించుకోవటమే. అజ్ఞానం ప్రధానంగా ఈ రూపాలలో ఉంటుంది 1. శరీరమే ఆత్మ అనుకోవటం, 2. తాను సర్వ స్వతంత్రుడనని భ్రమించటం, 3. తనను తాను రక్షించుకోగలనని భావించటం, 4. సంసార భోగానుభవాలే జన్మ సాఫల్యమని భ్రమించటం, 5. బంధువులు, స్నేహితులే సర్వస్వం అని తలవటం. ఇవి అన్నీ జీవ లక్షణాలు అని మార్పు చెందేవి, నశించే వాటిపై దృష్టిని పెట్టక శాశ్వత సుఖ స్వరూపమైన ఆత్మ నీవని దాని మీద నీ దృష్టిని పెట్టమని శ్రీ నాన్నగారి ఉవాచ. మూడు కాలాలకు, మూడు అవస్థలకు అతీతంగా మనం ఉన్నామని శాస్త్రీయంగా విశ్లేషణ చేసి నిగ్గుతేల్చుతారు. మూఢ నమ్మకాలను వారు ఎన్నడూ అంగీకరించరు. “నేను ఎవఁడను?” అనే విచారణా మార్గాన్ని విస్తృత రూపకల్పన చేసి, వినూత్న శైలిలో తేనెలొలికే తేట మాటలతో సమాజాన్ని మేలుకొల్పటానికి భగవాన్ శ్రీ నాన్నగారిని ఎన్నుకొన్నారు. శ్రీ నాన్నగారి మాటలు స్పష్టంగా, నిర్దుష్టంగా, సంశయాలకు, ఊహలకు అతీతంగా, అద్భుతమైన ప్రేమను కురిపిస్తూ ఉండటం వలన సాధకుల హృదయాలను అవి తాకుతాయి. ఆయన ఏనాడు, ఎవరి నుంచి, దేని నుంచి ఎటువంటి ప్రాముఖ్యత కోసం ఎదురు చూడలేదు. బుద్ధుని దయ, సమత్వం, శంకరుల వివేకం, సూక్ష్మ దృష్టి తాత్త్విక దృక్పథం, గాంధీజీలోని సేవా నిరతి స్పష్టంగా కనిపిస్తాయి. ఆశ్రితుల కష్టాలను, కలతలతో నిండిన కన్నీటిగాథలను వింటూ, ఓదారుస్తూ, శాంతి సమాధానాలు అందిస్తూ పిలుపు కాదనక ఊరూరు తిరుగుతూనే ఉంటారు. వారి దర్శనమే దుఃఖితులకు పెద్ద ఊరట. వారి బోధలో మర్మం లేదు, పెడమార్గం లేదు. సంకుచితత్త్వం కానరాదు. ఎవరి ఇష్ట దైవాన్ని వారు ఆరాధించటాన్ని ప్రోత్సాహమిస్తారు. వారి మాటలు స్వఛ్ఛం, సరళం, సులభం, అంతేకాదు అరువు తెచ్చుకొన్న వాక్యాలు ఉండవు. విజ్ఞాన గని. ప్రతీవారు వారి వారి శక్తి సామర్థ్యాన్ని బట్టి వారి మాటలను గ్రహిస్తారు. ఒక్కొక్కసారి సాధకుడు ఎంత అల్ప స్థాయిలో ఉన్నా వారి స్థాయికి దిగి వచ్చి చెబుతారు. అక్కడ అల్పులు అధికులు అనే భేదం లేదు. ఆ మాటలలో నిర్మలత్వం, సహజత్వం పవిత్రత కనిపిస్తాయి. తల్లి బిడ్డ చెడిపోతూ ఉంటే ప్రేమతో హితబోధ చేస్తుంది. వినకపోతే దండిస్తుంది. చివరిగా ఏడుస్తు (ఘోష)తో చెబుతుంది. అలాగే గురువులు, వేదం ఘోషిస్తూ చెబుతారు. దానినే వేద ఘోష అంటారు. గురువు హితబోధను వినకపోతే వాని ప్రారబ్ధంలోని దుఃఖ కరమైన దానిని సాధకునిలో ప్రవేశపెట్టి సరి చేస్తాడు.

దాని వలన ఫలితం లేకపోతే శిష్యుని స్థాయికి దిగి వచ్చి "మనం" అనే పదంతో హితవు చెబుతారు. శ్రీ నాన్నగారి ప్రవచనంలో "మనం" అనేది తరచుగా చూడవచ్చును. వారి సాధారణ జీవితాన్ని, సునిశితమైన విషయ విశ్లేషణ ఉన్నతమైన భావాలు ప్రస్ఫుటంగా చూడవచ్చును. కలి కల్మషాలైన వికార స్వభావాలు, అత్యాశలను, అహంకారాన్ని సమూలంగా పెరికించే నేర్పు వారి ప్రవచనంలో ఉంటుంది. "మీరు తప్పచేసినా నాకు ఇష్టమే కాని స్వంత ఆలోచన విడిచి పెట్టకండి" అంటారు. సాధకుడు ఎంత పాపిని అనుకొన్నా వారు వానిని ఉన్నత శిఖరాలకు చేర్చుతారు. నీవు ఆత్మవని బరోసా ఇస్తారు. అహం మూలాన్వేషణలో గట్టి కృషి చేస్తే అది అదృశ్యమౌతుందని సత్యం నీకు ఎరుక పడుతుంది అంటారు. పైకి వారిది జ్ఞాన బోధగా కనిపించినా హృదయం నిండా భక్తి తొణికిసలాడుతుంది. అజ్ఞానమనే అంధకారాన్ని మాటలతో తొలగించే మానవ రూపిగా ఉన్న పరమాత్మగా శ్రీ నాన్నగారు గోచరిస్తారు. వారిలో పరోపకారం, త్యాగం, వైరాగ్యం మూర్తీభవించా యని అసూయ లేని సహజమైన కళ్ళతో ప్రత్యక్షంగా చూచినవారు ఎవరైనా వాటిని గుర్తించగలరు. మనం దుఃఖ మిశ్రితమైన సుఖాలనే నిజమని, శాశ్వతమని భ్రమించి, శాశ్వతానందాన్ని గుర్తించలేకపోతున్నాము. దానికి గురువు కావాలి, సమకాలీన జ్ఞానిని, పూర్వ జన్మ పుణ్య సంస్కారం పండిన వారు మాత్రమే గుర్తించగలరు. తత్త్వజ్ఞాన శోభితులైన శ్రీ నాన్నగారు అంతఃకరణమును శుద్ధి చేయు విద్యను తన వద్దనే ఉంచుకొనక జ్ఞానయజ్ఞాల ద్వారా, జిజ్ఞాసువులకు అందచేస్తున్నారు. భక్తుల అజ్ఞానాన్ని రాసి రంపాన్ని పెడుతున్నారు. "మీ స్వంత సమస్య అయిన మీ అహంకారాన్ని పరిష్కరించుకొని శాంతి స్వరూపులు కండి" అంటారు. ఆ బోధ మోడువారిన జీవితాలను కూడా చిగురింపచేస్తుంది. వారి మనస్సును ఆత్మ వైపుకు మరలించే ఆ ప్రక్రియ అపూర్వం. చిల్లర విషయాలను చింతిస్తూ చితికిపోక, సత్యంపై దృష్టి సాగిస్తే సుందర రూపాన్ని పొందుతారు. అసత్యం, అనిత్యమైన సంసార మాయా రూపాలకోసం, గౌరవాల కోసం జీవిత కాలాన్ని అంతా బుగ్గిపాలు చేసుకొంటున్నాము. దీనిలో కొంత కాలాన్ని అయినా నీ స్వంత విషయమైన అహంకార నిర్మూలన కోసం ఖర్చు చెయ్యి. గమ్యాన్ని మర్చిపోకు. కాలాన్ని సద్వినియోగం చేసుకోకపోతే మీరే కష్టాలను కొని తెచ్చు కొంటారు" అంటారు. శ్రీ నాన్నగారి హృదయం నుండి జాలు వారిన ఈ పలుకులు వినండి. "ప్రియమైన ఆత్మ బంధువుల్లారా! మీ బుద్ధికి విషయం అందేటట్లు చెప్పకపోతే ఆ దోషం నాది కాని మీది కాదు. నాలో శాంతి, పవిత్రత ఉంటే మీరు మర్చిపోవాలన్నా నా మాటలు మిమ్ములను వెన్నంటి తరుముతాయి. ప్యూరిటీ ఉన్నచోట, క్లారిటీ ఉంటుంది. అరచేతిలోని వస్తువును ఎలా చూడగలమో అలాగే నేను విషయాన్ని మీకు తెలపకపోతే మీ మనస్సుకు అందించలేకపోతే నాలో పవిత్రత లేనట్లే. నా మీద మీకు ప్రేమ లేనప్పుడు మీకు ప్రేమ కలిగేటట్లు చేయవలసిన బాధ్యత నాదే. గురు అనుగ్రహమంటే





ధ్యానం చెయ్యమని చెప్పటం కాదు. వస్తువును మీకు అందియ్యటమే. నేను చూస్తున్నాను అంటే నా హృదయం నుంచి చూడాలి. నేను మిమ్మలను తాకుతున్నాను అంటే నా హృదయంతో తాకాలి నేను మాట్లాడుతున్నాను అంటే హృదయంతో మాట్లాడాలి అప్పడే మీకు ప్రయోజనం. సత్‌ఫలితాలు వర్షిస్తాయి. గురువు ప్రేమ స్వరూపుడు శాంతి స్వరూపుడు. అది తప్పించి ఇంకోటి ఇయ్యలేడు. నిరంతరం మీ క్షేమాన్ని కోరే వాడే గురువు. ఇలా పోల్చి చెప్పటం కూడా సరిపోదు. ఏదో ఒక పద్ధతిలో ఇలా చెబుతున్నాను అంతే "అన్నారు". "అంతే" అన్న పదంలోనే ఉంది అంతులేని అర్థం. మన బుద్ధికి అది అందదు. శ్రీ నాన్నగారు రమణుడై మాట్లాడుతారు. రమణ వాణి ఆ బాణీని శ్రీ నాన్నగారి తేటతెల్లమైన వారి వైఖరీ వాణిలో వినాలి. రమణ మార్గాన్ని తెలుసు కోవాలంటే ఈ గ్రంథం చిన్న ప్రయత్నమే. అహంకారంలో ఇరుక్కుపోయి దుఃఖితులై వేదనను అనుభవించే వారిని అందుండి విడుదల చెయ్యటంలో శ్రీ నాన్నగారి ఎత్తుగడలు, ఆవేదనా రమణీయాన్ని వర్ణించలేను. దానిని కొలిచే పాత్రలు నా దగ్గర లేవు. కొలవలేను, అనుభవిస్తూ, పరవశిస్తూ దానిని కొంచెం మీకు వినయ పూర్వకంగా సమర్పిస్తున్నాను. ఏమైనా పొరపాట్లు దొర్లితే అవి నావి మాత్రమే. వారి మౌన సన్నిధిలో మనస్సు ద్రవింపచేసే భాషకందని భావనను, భావించలేను మీకు తెలుపలేను. వారి ఆ బోధలోని అంశాలు చెప్పినవే చెప్పినట్లు అనిపించినా అవి భిన్న భిన్న కోణాలలో తత్త్వాన్ని దర్శింపచెయ్యటానికి మాత్రమే అని ఇందలి విషయాలు ఆయా అంశాల మీద మాట్లాడినవి. భక్తుల మానసిక స్థితి, స్థాయి అవగాహనా శక్తిని దృష్టిలో పెట్టుకొని వారి వారి సాధనలో వారి స్థాయిని, నిరుత్సాహ పరచకుండా తృప్తి పరచటానికి మాత్రమే అలా చెప్పటం జరిగింది. ఆ మాటలు పరస్పరం విరుద్ధంగా ఉండవచ్చును. ఉదాహరణకు జపం చెయ్యండి, ధ్యానం చెయ్యండి అన్నవి మరో సందర్భంలో, జపి ఎవరు? ధ్యానించే వాడు ఎవరు అనేవి, విరుద్ధంగా అనుకోవచ్చును. ఆపై మాటలు సాధకుని ఒక్కొక్క మెట్టుపైకి ఎక్కించటానికి అని అర్థం చేసుకోవాలి. ఆ మాటల ప్రయోజనం పరిమితులను తెలుపుతూ నిజతత్త్వాన్ని పొందే తుది మార్గాన్ని చూపుతారు. అన్ని మార్గాలను సమన్వయం చేసుకోమని ఏ మార్గాన్ని కించ పర్చవలసిన పని లేదని చెబుతూ భగవాన్ చెప్పిన అత్యున్నతమైన ఉపదేశం "ధ్యానించకు ఊరికే ఉండు - నేను ఉన్నానని భావించకు" దాన్ని శ్రీ నాన్నగారు విశ్లేషణాత్మకంగా చెబుతారు. అనుభవాన్ని, దృష్టాంతాలను, యుక్తిని కలబోసి, సత్య ప్రయోజనం ఆత్మానుభవానికి ఎలా సంబంధం పెట్టుకోవాలో, ఎలా కృతార్థులు అవుతారో సమగ్రంగా చెబుతూ త్రివిధ దీక్షల ద్వారా అనుగ్రహిస్తారు. పై మాటలలో నిజాన్ని ఈ గ్రంథ పరిశీలనలో తెలుసుకోవచ్చును.

సాగిరాజు రామకృష్ణంరాజు
అర్థవరం

# గ్రంథపరిచయం

భగవతారమైన శ్రీరమణమహర్షి కారణజన్ములు. ఆధునిక కాలంలో జపము, తపము, యజ్ఞము సాధ్యంకాని తరుణంలో మానవాళికి ఆధ్యాత్మికంగా ఉపయోగపడే మార్గాన్ని చూపటానికి అవతరించారు శ్రీభగవాన్. అత్యవసరమైతే తప్ప ఎక్కువగా మాట్లాడేవారు కారు శ్రీభగవాన్. వారి కొద్దిపాటి మాటలను మౌనాన్ని అర్థం చేసుకొని, ఆ మౌనబోధని జీర్ణం చేసకోవటమే గాక అసంఖ్యాకులకు తమదైనరీతిలో అరవై సంవత్సరాలుగా ప్రవచిస్తున్న మహనీయులు శ్రీజిన్నూరు నాన్నగారు. శాస్త్రాలను, ఆ పరిభాషను వల్లె వేయకుండా నిత్యజీవితంలో మనకి తారసిల్లే పరిస్థితులను ఉదహరిస్తూ జనరంజకంగా ప్రవచనాలు చేస్తున్నారు శ్రీనాన్నగారు. ఆధ్యాత్మిక జీవితం వేరు, లౌకిక జీవితం వేరు కావని శ్రీనాన్నగారు తమ అనుగ్రహభాషణలలో స్పష్టంచేస్తారు. అంటే రోజుకు గంటో, అరగంటో పూజ, ధ్యానమో చేసేసి మిగిలిన సమయాన్నంతా ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించవచ్చు అనే అభిప్రాయాన్ని పోగొడ్తారు శ్రీ నాన్నగారు.

శ్రీనాన్నగారి ఉపన్యాసాల సంకలనమే ఈ గ్రంథం. సంకలనకర్త శ్రీసాగిరాజు రామకృష్ణంరాజుగారు. ఈయనికి శ్రీనాన్నగారి పట్ల భక్తి ఉండటమే కాక నాన్నగారి బోధనలని ఆకళింపు చేసుకొనే శక్తి ఉంది. తాను గ్రహించిన దానిని నలుగురికీ ఉపయోగపడాలనే తపనతో ఈ అమూల్యమైన సంకలనాన్ని చేసారు. ఇందుకు వారిని మనసారా అభినందిస్తున్నాను.

ఈ గ్రంథం ఇప్పటి వారికే కాక భావితరాలవారికి కూడా ఉపయోగపడుతుందనే నా నమ్మకం.

తమ గ్రంథానికి ముందు మాటలు రాసే అవకాశం నాకిచ్చిన శ్రీరామకృష్ణంరాజు గారికి కృతజ్ఞుడను.

**పింగళి సూర్యసుందరం**

హైదరాబాద్
ది॥ 26-10-2017





# కృతజ్ఞతలు

సద్గురు శ్రీనాన్నగారి ప్రవచనాలు 1984 సం॥ నుండి 2004 సం॥వరకూ సేకరించినది. 'అమృతవాహినిగా మొదటి భాగం 342 పేజీలతో వెలువడి మూడు ముద్రణలతో కొనసాగుతున్నది. తిరిగి 2005 నుండి 2017 సం॥ వరకూ 'అమృతవాహిని' రెండవ భాగంగా ఈ గ్రంథం రూపుదిద్దుకొన్నది. ఈ రెండు గ్రంథాలు ముద్రణకు అనుమతించిన శ్రీసద్గురు నాన్నగారి పాదపద్మములకు నమస్కరిస్తున్నాను.

ఈ గ్రంధానికి గ్రంధ పరిచయం వ్రాసిన హైదరాబాద్ వాస్తవ్యులు శ్రీ పింగళి సూర్యసుందరం గారికి దానికి సహకరించిన శ్రీమతి ఎస్. స్వరాజ్యలక్ష్మిగారికి నా నమస్సులు తెలుపుకొంటున్నాను. అలాగే ఈ గ్రంధానికి ప్రోత్సాహం చేసిన జిన్నూరు కె. లక్ష్మిగారికి మాధవిగారికి మరియు అర్థవరం భక్తులు అచ్చుపొరపాట్ల విషయంలో సహకరించిన నళినాంబ గారికి, కె. త్రినాధరాజు, నా మనుమరాలు శిరీషకు, ఎస్.దుర్గగారికి, డి.టి.పి చేసిన అనన్య గ్రాఫిక్స్ శ్రీసాయిగారికి నా కృతజ్ఞతలు.





శృంగేరి శారదా మాత

# 1. భక్తి - ప్రేమ

1. రెండు చేతులు రెండు కాళ్ళు లేని ఒక భక్తునకు భగవంతుడు ప్రత్యక్షమై నీకు కాళ్ళు కావాలా? చేతులు కావాలా? ఏదో ఒకటి కోరుకో అంటే ఆ భక్తుడు ఇలా అన్నాడు "నాకు కాళ్ళ కన్నా చేతులే ముఖ్యము. ఎందుకంటే చేతులతో నీ పాదాలను సేవించుకుంటాను" అన్నాడు. అది భక్తుని యొక్క గొప్పతనం. అలాగే మరో భక్తుడు "రామా ఈ కంటికి ఉన్న గుడ్డితనాన్ని పోగొట్టు అని నేను నిన్ను అడుగను. నాలో ఉన్న చైతన్యాన్ని నాకు ఎరుకపరచు" అన్నాడు. నామంలో ఏముంది అనుకోకండి విత్తనం చిన్నదైనా పెద్ద వృక్షమౌతుంది. దాని నీడలో మీరు చల్లగా ఉండవచ్చును. మీరు ఇతరుల నీడలో అంటే (వారి దయ, దాక్షిణ్యాలతో) ఉండనక్కరలేదు. నామం నీడలోనే ఉండి చాలామంది సుఖపడతారు. నామంలో భక్తుడి లక్షణం ఇలా ఉంటుంది : బెంగ, దుఃఖము ఉండదు. జరిగిపోయిన సంఘటనలు తలచుకుని వ్యధచెందడు, మనస్సు తీసుకువచ్చే అలజడులను పట్టించుకోడు. నిజమైన భక్తి ఉంటే కుటుంబపరంగా ఎన్ని కష్టాలు వచ్చినా నిలబడతాడు. సహనం, వైరాగ్యం భక్తి యొక్క పిల్లలు. "రామనామం చెయ్యకపోతే పుట్టలో ఉన్న పాముకు, నీకు తేడా ఏమున్నది? పండితుకన్నా భగవంతుని పట్ల పరిపూర్ణ విశ్వాసం ఉన్న చీమ మెరుగు" అన్నారు గురునానక్. సుధాముడు చివరిగా మూడు వరాలను కృష్ణుడిని అడిగాడు. "1. జనన మరణ చక్రం నుండి బయటపడాలంటే నీమాయ దారి ఇవ్వాలి. నీ పాదాలయందు భక్తి ఉండేటట్లు చెయ్యి. 2. నీవు అంటే బాగా ఇష్టపడే వారియందు ప్రేమ ఉండేటట్లు చూడు. 3. నాకు ఏది మంచిది అని అనుకొంటున్నానో అది ఇతరులకు కూడా మంచిదే కాబట్టి ఆ మంచి ఇతరులకు కూడా మంచిదే కాబట్టి ఆ మంచి ఇతరులకు కలిగేటట్లు చెయ్యి" అన్నాడు. అది భక్తుని లక్షణం. ప్రేమ ఉన్న వానికి కాలం తెలియదు. మన మనస్సుని భగవంతుని నామంలో నానబెట్టుకొంటూ ఉంటే అది కరిగి పోతుంది. అప్పుడు నీకు బ్రహ్మం తెలియబడుతుంది. సత్‌కర్మవల్ల, సౌమ్యంగా





జీవించడం వల్ల, పూర్వజన్మ పుణ్య సంస్కారం వల్ల భక్తి కలుగుతుంది. భక్తికి మించిన సంపద మరెక్కడా లేదు. భక్తికి నిరాడంబరమైన జీవితం మంచిది. ప్రస్తుతం విలాసవంతమైన జీవితాలకు అలవాటుపడుతున్నారు. భక్తుల చరిత్రలను చూస్తూ ఉంటే వారు ఏ మతంలో ఉన్నా సామాన్య జీవితం గడిపిన వారే, చిన్న ఆర్థిక స్థితిలో ఉన్నవారే.

2. భక్తిలో నీ సంకల్పం ఉంటుంది, ఈశ్వర సంకల్పం ఉంటుంది. శరణాగతిలో ఈశ్వర సంకల్పం ఒక్కటే ఉంటుంది. శరణాగతిలో దుఃఖం వచ్చే అవకాశం లేదు. ఒక అమ్మగార్కి పక్షవాతం వచ్చింది. ఒకరోజు రాత్రి 2 గంటల సమయంలో కొడుకును పిలిచి మంచినీళ్ళు కావాలని అడిగింది. కొడుకు వచ్చేటప్పటికి నిద్రలోకి జారుకుంది. తెల్లవారుఝామున 5 గంటల వరకు కూర్చుని ఉన్న కొడుకుని చూసి తల్లి అంటుంది "ఎందుకు ఇన్ని గంటలు నిద్రపోకుండా నా దగ్గరే ఉన్నావు. లేపితే లేచి నీళ్ళు త్రాగుదును కదా!" అనగా కొడుకు ఇలా అంటాడు "నీకు నిద్రాభంగం కలగటం నాకు ఇష్టం లేదు. నేను నిద్రపోతే మెలకువ రాకపోవచ్చు. నీవు లేచి నీళ్ళు త్రాగలేవు కదా!" అన్నాడు. అది మాతృప్రేమ యొక్క వైభవం.

రాముడు అన్నాడు "పనికి పనే ఫలితం అంటే పెద్దలను ప్రేమగా చూడటమే ఫలితం. మిమ్ములను చూసే శక్తి భక్తికి ఉంది. యోగాభ్యాసాలు రామనామానికి సరిపోవు. అంతర్యామిగా మనలో ఉన్న ఈశ్వరునికి, మనకూ ఉన్న దూరాన్ని తగ్గించేదే భక్తి. భక్తి మార్గంలో రూపం - నామం ఉంటుంది. దానివల్ల ఫలితం నామరూపాలకు అతీతంగా ఉన్న సత్యాన్ని తెలుసుకోవడానికే. గోపికలకు కృష్ణుని మీద ఉన్న భక్తి వలె, ఆంజనేయ స్వామికి రాముని మీద ఉన్న భక్తి వలె మీరు భక్తిని పెంచుకోండి. ఈశ్వరుని మీద భక్తి, విశ్వాసం లేకపోవడం వల్లనే జీవితంలో ఈ ఆందోళనలు, ప్రశ్నలు కలుగుతున్నాయి. నిజ భక్తుడు ముక్తిని కోరుకోడు. "నీ ఇష్టమే నా ఇష్టం". ఆ తలంపు కూడా రాదు. అడిగే సమస్యే లేదు. అడిగి సంకల్పించుకొనే వాడు లేడు. ఈ పని చేసాము, ఈ ఫలితం ఎప్పుడు వస్తుంది? అనుకొనే

వాడికి ఆరాటం వస్తుంది, అందులోంచి అశాంతి వస్తుంది. లాల్‌బహదూర్ శాస్త్రిగారు ఊరు వెళుతూ ఉంటే తల్లి, భార్య సాగనంపడానికి స్టేషన్‌కి వచ్చారు. ట్రైన్ కదులుతూ ఉంటే గబగబా కాగితంలో ఏదో వ్రాసి భార్య చేతిలో పెట్టారు. అది తల్లి చూచింది. ఇంటికి వచ్చాక కోడలితో ఇలా అంది "అబ్బాయి నాకు తెలియకుండా నీకు ఏమి వ్రాసి ఇచ్చాడు? అది ఏమిటి? అది ఏమిటి?" అని అడగటం ప్రారంభించింది. చివరకు కోడలు ఆ కాగితాన్ని తెచ్చి అత్తగారి చేతిలో పెట్టింది. అందులో ఆయన ఇలా వ్రాసాడు "ఇక నుండి నేను ఊరు నుండి తిరిగి వచ్చేవరకు మా అమ్మకు కొడుకైనా, కోడలైనా అంతా నీవే నేను లేని లోటు అమ్మకు కనిపించకూడదు. జాగ్రత్త". అది ప్రేమ భావన. భక్తుడు ముందు ఆత్మస్తుతి, పరనింద విడిచిపెట్టాలి. దానివల్ల భావకాలుష్యం ఎక్కువైపోతుంది. భక్తి లేకుండా ఏదీ రాదు.

3. గోపికలు అంటారు "మనస్సే సాధన చేస్తుంది, చలిస్తుంది". అది లేనప్పుడు సాధన ఏమిటి? పరాభక్తి ఆత్మజ్ఞానంతో సమానం. మనస్సుని కృష్ణునికి ఇచ్చేసారు. అది మధురభక్తి. భక్తి ఉన్నచోట జ్ఞానం, జ్ఞానం ఉన్న చోట భక్తి వస్తుంది. శరీర వికారాలనుబట్టి జ్ఞానాన్ని విలువ కట్టలేము. కుబ్జ ఇస్త్రీ చేసేది, అష్టావక్రుడు ఎన్నో వంకర్లు, అల్లాడి కుప్పస్వామి కూడా వికారంగా ఉంటాడు. కాని "లా"లో ఆయన ఏది చెబితే అదే ఫైనల్. రూపాన్ని బట్టి శక్తి ఉండదు. రాముడు అరణ్యానికి వెడుతూ లక్ష్మణునితో "నీవు అయోధ్యలోనే ఉండి భోగభాగ్యాలు అనుభవించు. అడవికి రావడం ఎందుకు?" అనగా ఆయన "మీరు చెప్పింది నిజమే. నాకు మీ పాదాలు కావాలి. అవి అయోధ్యలో దొరకవు కదా!" అన్నాడు. వాడికి మోక్షం రాకపోతే ఎవరికి వస్తుంది? అది ప్రేమ అంటే. అలాగే ఒక ప్రముఖుడిని అమెరికా వారు "మీరు ఇండియా వెళ్ళకండి అన్ని సౌకర్యాలు మీకు ఇక్కడే కల్పిస్తాము" అనగా ఆయన "నాకు కాశీ నగరం అంటే ఇష్టం. ఇక్కడికి కాశీ వస్తుందా?" అన్నారు. భక్తుడు కష్టాలను ఆనందంగా అనుభవిస్తాడు. భక్తిలేనివాడు ప్రారబ్ధాన్ని ఏడుస్తూ అనుభవిస్తాడు. భక్తిని గురించి పరమహంసగారు





అంటారు "ఒక చీమ పెద్ద పంచదార రాశిని సమీపించి ఒక పలుకు తినగా కడుపు నిండిపోయింది. ఇంకొక పలుకు నోట కరచుకుని రేపు వచ్చి ఈ రాశిని తినేస్తాను అంది. అలాగే కొందరు శ్రవణానందాన్ని, భగవంతుని పాదాలను స్మరించడం వల్ల వచ్చే ఆనందాన్ని భరించలేక మాకు మోక్షం వద్దు ఈ భక్తి వల్ల వచ్చే ఆనందం చాలు అనే భక్తులు ఉన్నారు".

4. మంచి గురువు కావాలనే వారే కాని మంచి భక్తుడిగా ఉండాలని ఆలోచించరు. నిజంగా మంచి భక్తుడిగా ఉంటే గురువే నీ దగ్గరకి వస్తాడు. భక్తి వల్ల జ్ఞానం వస్తుందా? జ్ఞానం వల్ల భక్తి వస్తుందా? అంటే చిత్తశుద్ధితో సత్‌కర్మ చేస్తే నీకు భక్తి కలుగుతుంది. శ్రీకృష్ణ చైతన్యులు వారికి జ్ఞానం కలిగిన తరువాత పరాభక్తి కలిగింది. అది ఇటునుండి అటు రావచ్చు, అటునుండి ఇటు రావచ్చు వాదనలు అనవసరం. భక్తి కలిగితే విశ్వాసం కుదురుతుంది. విశ్వాసం వల్లనే ధ్యానం చేస్తాము. తులసీదాస్ "సీత మీద, రాముని మీద భక్తిలేని మీ బంధువులను, స్నేహితులను వదిలి వేయండి" అన్నారు. కామక్రోధాలు రామనామం చేసుకొంటే పోతాయి. భక్తి లేని వాళ్ళకి, భక్తి ఉన్న వాళ్ళకి కూడా దోషాలు ఉంటాయి. కాని భక్తి ఉన్నవారికి లోపల భగవంతుడు "ఇది నీ బలహీనత ఇందులో నుండి నీవు బయట పడు" అని ప్రేరణ కలుగజేస్తాడు. బలహీనతలోంచి బయటకు రావడానికి సహాయం చేస్తాడు. ప్రేమకు వ్యాపారం ఉండదు. కోరికకు వ్యాపారం ఉంటుంది. రామానుజులు రాముని ఆలయంలో రామునితో ఇలా అన్నాడు "నాకు ఏమీ అక్కరలేదు. నీ పాదాలను ఆశ్రయించాను. ఓరామా! నిన్ను చూడటానికి చాలామంది వస్తున్నారు. నీకు దిష్టి తగులు తుందని బాధగా ఉంది". అది మధుర భావన. నారదుడు ఇద్దరు భక్తుల వద్దకు వచ్చారు. వారు నారదుడిని "వైకుంఠంలో నారాయణుడు ఏమి చేస్తూ ఉంటాడు?" అని అడిగితే "సూది బెజ్జంలోనుండి ఒంటెను, ఏనుగును లాగుతున్నాడు" అనగా ఒకడు "భగవంతునికి ఏదైనా సాధ్యమే" అని ఆనందించాడు. రెండవ వాడు "వాడు దేవుడే అయినా సూది బెజ్జంలోంచి

ఏనుగును ఎలా లాగగలడు?" అన్నాడు. దానిపై "వాడు దేవుని మీద విశ్వాసం కలవాడు. నీకు అది లేదు. ఆ విశ్వాసాన్ని నీవు సంపాదించుకో. అందుకోసమే నేను నీ దగ్గరకు వచ్చాను" అన్నారు. మనకి తుకారాంకి, మీరాకి ఉన్నంత భక్తి ఉండాలని కాదు. మనలో ఈశ్వరునిపై కనీస భక్తి కూడా లేదు. అందుకే మనస్సు కుదురుగా ఉండటం లేదు. మనలో పెద్ద లోపం అదే. ఈశ్వరుని పాదాల మీద భక్తి లేకపోతే ఎంతధనం ఉన్నా శాంతి రాదు. తినడానికి, ఉండడానికి, కట్టుకోవడానికి లోటు లేదు. ఇంకా శాంతి లేదంటే భక్తి లేదని అర్థం. మంచిగంధంతో శరీరాన్ని పూసుకున్నా, బట్టలకు సెంటు వ్రాసుకున్నా, ఖరీదైన బట్టలు వేసుకున్న ఆకలి పోదు. అన్నం తిన్న వానికే ఆకలి తీరుతుంది. అలాగే భక్తి లేకపోతే శాంతి రాదు. భక్తి ఉంటే చిరాకు, భయం పోతుంది. "మీకు ఉన్న భక్తి నిజమైతే ఆ భక్తి ముక్తిని అడగదు" అన్నారు వ్యాసుల వారు.

5. శత్రువుని చూచి "బాగా ఏడుస్తున్నాడు" అనుకునేవాడు భక్తుడు కాదు. వాళ్ళ దురదృష్టాన్ని గురించి ఆనందించేవారిని రాక్షసులు అంటారు. బాహ్యంగా ఎవరైనా దుఃఖపడుతుంటే వారికి శాంతి కలగాలనే భావన మీకు రాకపోతే మీకు భక్తి ఏమిటి? గడ్డిమేటుకి అగ్గిపుల్ల గీసి అంటిస్తే మేటు కాలిపోతుంది. మీకు ఉన్న భక్తి వల్ల మీలోని పాపపుణ్యాలు కాలిపోవాలి. రజోగుణం, తమోగుణం ఉన్నవానికి ముక్తి ఏమిటి? వ్యాసుల వారు "ఇంద్రియాలను అదుపు చేయడం కష్టం. కేశవుని పాదాలను ఆశ్రయిస్తే అన్ని ఇంద్రియాలను జయించవచ్చును" అన్నారు. తుకారాం "జేబులో డబ్బు పోయినట్లు మనకి తెలియదు. అలాగే రంగనిపై నాకు ఉన్న భక్తి వల్ల నాలో ఉన్న జీవలక్షణాలు నాకు తెలియకుండా పోయాయి. అంతేకాని నా తెలివితేటలవల్ల పోగొట్టుకోలేదు" అన్నారు. నామం అత్యంత బలీయమైనది. భగవంతుని ఇలా ప్రార్థించాలి - "నీవు కల్పించే విషయాలు నాకు అక్కరలేదు. నీవే కావాలి అని". ప్రేమ లేకుండా పరమాత్మ స్వాధీనం కాడు. మీకు అవసరం లేని తలంపులు అన్నీ జపంతో తొలగిపోతాయి. మీరు జపంతో





నిరంతరము ఉంటే భయం పోతుంది, శరణాగతి అబ్బుతుంది. శరణాగతి వల్ల మన చేతుల్లో ఏమీ లేదని తెలుస్తుంది. భక్తిని పెంచుకుంటే బుద్ధిలోని దోషాలు పోతాయి, నశిస్తాయి. గీతాసారం అంతా (రాజవిద్య, రాజగుహ్య యోగంలో ఉంది) "ఎవరైతే నన్ను నిరంతరం అనన్య చింతనతో స్మరిస్తారో వారి యోగ క్షేమాలను నేనే చూస్తాను" అన్నారు. మనకు భక్తి పెరుగుతూ ఉంటే మనస్సు యొక్క చాపల్యం తగ్గిపోతుంది. ప్రత్యేకంగా సాధన చెయ్యనక్కరలేదు. దేహాన్ని పరమాత్మ ఇచ్చాడు. ఆయన్ని స్మరించడం మానేస్తున్నాము. ఉపాసన అవసరం. కృతజ్ఞత ఎలా ఉంటుందో తెలియని వానికి భక్తి, ఉపాసన కుదరదు. ఉద్రేకం ప్రధానం కాదు. ఆలోచన ప్రధానం. వివేకంగా ఉంటే ఆనందం దాని అంతట అదే వస్తుంది. ముక్తి గొడవ మనకు వద్దు. అది మన చేతిలో లేదు, మనకి భక్తి సరిగా ఉందో లేదో చూసుకోవాలి. భక్తి మన చేతుల్లో ఉంది. (గీతలో భక్తి యోగం చదువుతూ ఉండండి).

6. ప్రేమ జ్ఞానం యొక్క స్వరూపం. మనలో ప్రేమ ఉంటేనే ఇతరులను మనం ప్రేమిస్తాము. భగవంతుడు సర్వజ్ఞుడు, సర్వసాక్షి, కర్మఫలదాత. ఇట్టివాడు అని తెలిసాక ఆయన మీద భక్తి కలుగుతుంది. మీ కుటుంబ సభ్యులకు కలిగే అనారోగ్యానికి, ఈతిబాధలకు మీరు దుఃఖానికి గురి అయితే మీరు భక్తులు ఎలా అవుతారు? నామ అపచారం ఉండ కూడదు. అంటే నామాన్ని యాంత్రికంగా చేయకూడదు. ప్రేమపూరితంగా చేస్తే ఆ భక్తి అప్పటికప్పడు ఫలిస్తుంది. భక్తి ప్రత్యక్ష ఫలితాన్ని ఇస్తుంది. భక్తులు రాజకీయాలకు, ప్రచారాలకు దూరంగా ఉండాలి. పంచదార ఫ్యాక్టరీ నుండి పంచదార ఎలా తయారవుతుందో అలాగే భక్తి నుండి శాంతి, జ్ఞానం, ఆనందం ఉత్పత్తి అవుతాయి. అవతారపురుషులను, జ్ఞానులను ఆరాధించడం వలన అది సాధ్యమవుతుంది. ఎంతోకొంత కరుణాగుణం లేకపోతే వాడిని రంపం పెట్టి కోసినా వాడికి భక్తి రాదు. తోటి మానవుల పట్ల ఆప్యాయత, ప్రేమ కావాలి. గోపికలకు పాండిత్యం లేదు. శ్రీకృష్ణ చైతన్య గొప్ప పండితుడు,

సన్యాసి. ఆయన ఇలా అన్నారు "పాండిత్యం, ఆస్తులు లేని గోపికలకు కృష్ణుడి మీద ఉన్న భక్తి, ప్రేమ కూడా నాకు పరమాత్మ మీద లేదు" అన్నారు. ఆయనకు కృష్ణా అంటే సమాధిస్థితి వచ్చేది. "గాలి లేకుండా బ్రతకగలరు కానీ పరమాత్మ మీద ప్రేమ లేకుండా బ్రతకలేని స్థితి గోపికలది. వారిలో ఉన్న ప్రేమతో ఏకాగ్రతతో, పవిత్రతతో కృష్ణుడిని ప్రేమించారు. కుటుంబ సభ్యులు ఏమనుకుంటారో అనే లెక్క లేదు వారికి. ఆ భక్తి నాకు ఉంటే చాలు, గోపికల యొక్క పాద ధూళి మన శరీరంపై పడితే చాలు మనం తరిస్తాము" అన్నారు శ్రీకృష్ణ చైతన్య.

7. గోపికలు ఇలా అన్నారు "మేము పరమాత్మ వంకే చూస్తూ ఉంటాము. అసలు బురద వంక చూడము. ఆయన లీలలే చెప్పకుంటూ ఉంటాము. ఈ లోపల బురద ఎలా వచ్చిందో అలాగే పోతుంది (ప్రారబ్ధం నుండి వచ్చే క్లేశాలు)". మనం నిద్రలో ఉండగా శరీరం మీద నుండి పాము ప్రాకి వెళ్ళింది అనుకోండి. దాని సంగతి మనకు తెలియదు. అలాగే పరమాత్మ ధ్యాస వస్తే బురద ధ్యాస తెలియదు. ప్రారబ్ధం మీకు మంచి రోజులు తీసుకొని వచ్చినా, చెడ్డ రోజులు తీసుకొని వచ్చినా అందులో మీరు కలిసిపోకండి. అది వచ్చి వెళ్ళిపోతుంది. మీ సాధనలో మీరు ఉండండి. గమ్యం మరచి పోకండి. పరమాత్మ పాదాలను విడిచిపెట్టకండి. కొందరు చిన్న కష్టం వచ్చినా పెద్దది చేసుకొంటారు. అది పనికి రాదు. నీకు ఉన్న ధనాన్ని, పదవిని నీవు ఎలా కాపాడుకొంటావో అంతకంటే ఎక్కువగా మానవుడు శాంతిని, ధైర్యాన్ని కాపాడుకోవాలి. ఈ రెండింటిని కాపాడుకోకపోతే భక్తి నిలువదు. ఎక్కడ భక్తి ఉంటుందో అక్కడ సహనం, ప్రకాశం, జ్ఞానం ఉంటుంది. అక్కడే మోక్షం ఉంటుంది. జ్ఞానం, వైరాగ్యం భక్తి యొక్క పిల్లలు. దయ నుంచే ప్రేమ పుడుతుంది. దయలేని వాడు ప్రపంచాన్ని ప్రేమించలేడు. "నీవు ఎవరికైనా సహాయ సహకారాలు అందిస్తే వారిని ఉద్ధరించడానికి కాదు. నిన్ను నీవు ఉద్ధరించుకోవడానికే" అన్నారు లింకన్. ఆకలి వేసినవాడు అన్నంకోసం ఎలా చూస్తాడో భక్తి ఉన్న వాడు భగవంతుని





కోసం అలా చూస్తాడు. శివుడికి పేదవాళ్ళ దేవుడని పేరు. ఆయన మీద చెంబుడు నీళ్ళు పోస్తే చాలు సంతోషిస్తాడు. శివభక్తులు శివలింగంపై నీళ్ళు పోస్తూ, శివనామాలు చదువుతూ, నేను నిన్ను నీళ్ళు పెట్టి కడుగు తున్నాను నీవు నన్ను అనుగ్రహంతో నా బుద్ధిని కడుగు అంటారు. కుచేలుడి దగ్గర ఉన్న గొప్పతనం ఏమిటంటే దారిద్ర్యంతో బాధపడుతున్నా నన్ను ఎందుకు దారిద్ర్యంలో పడేశావని అడగలేదు, ఈశ్వరుడిని తిట్టుకోలేదు, స్నేహితులను, బంధువులను తిట్టుకోలేదు. దారిద్ర్యాన్ని చల్లగా, ప్రశాంతంగా అనుభ వించాడు. ప్రకోపం లేకుండా, ఉద్రేకం లేకుండా చూసుకున్నాడు. కృష్ణుడు మన స్నేహితులు వారి సహాయం పొందుదాము అనే ఆలోచనే రాలేదు. కుచేలుడు దారిద్ర్యం అనుభవించే ప్రణాళిక ముగిసింది. అప్పుడు భార్య "కృష్ణుని సహాయం అడగవచ్చు కదా!" అన్నమాట కూడా ఈశ్వరుడు ఆమెతో అనిపించాడు. అప్పుడు కూడా ఆయన ధనం కోసం వెళ్ళలేదు. ఈ వంకతో దర్శనం చేసుకోవచ్చు అనుకున్నాడు. అది ఆయన వైభవం. మన భగవంతునికి అర్చన చేసేటప్పుడు, నామాన్ని స్మరించేటప్పుడు, ఆయన రూపాన్ని ధ్యానించేటప్పుడు యాంత్రికంగా చేయకూడదు. ప్రేమగా, ప్రీతిగా చేస్తే ఈశ్వరుడు సరాసరి తన హృదయంలోనికి తీసుకుంటాడు. ఆకలి తగ్గించుకోవడానికి, శరీరాన్ని నిలబెట్టుకోవడానికి అన్నం తింటున్నాము. రోగాన్ని తగ్గించుకోవడానికి మందు వాడుతున్నాము. అలాగే మనలో ఉన్న చెడు గుణాలను తగ్గించుకోవడానికి భక్తి అవసరం. గుణాల నుండి బయట పడలేకపోతే మనస్సు బాహ్యముఖమై పునర్జన్మ తప్పదు. ఈశ్వరుని దయ లేకుండా అమృతానుభవం పొందాలనే తలంపే రాదు.

8. మీకు రోగం వస్తే డాక్టర్ దగ్గరకు వెళతారు. మీ రోగం మందుల వల్ల తగ్గాలా? లేక ఆపరేషన్ చెయ్యాలా? అనేది డాక్టర్ నిర్ణయం. మనం ఆయనతో "ఎలా బాగుంటే అలా చెయ్యండి" అంటాము. మీకు డాక్టర్ మీద ఉన్న నమ్మకం భగవంతుడు చెప్పే మాటల మీద లేదు. నీ మంచి చెడులు అన్నీ భగవంతుడికే విడిచిపెడితే ఎప్పుడు ఎలా చెయ్యాలో అంతా

ఆయనే చూసుకుంటాడు. ఈ బెంగలు, చింతలు, దుఃఖాలు నీకు ఎందుకు? ఇది అంతా మాయే. బెంగ పెట్టుకునేది ఏమీ లేదు. దుఃఖ కారణం ఉన్నా ఆయనకు వదిలేస్తే ఆయనే చూసుకొంటాడు. అదే నిజమైన భక్తి. మనుషులు రకరకాలుగా ఉంటారు. గుణాలు వేరు, రంగులు వేరు, ధనవంతులని, ధనహీనులని, చదువుకున్నవారని, చదువులేనివారని రకరకాల మనుషులు ఇవి అన్నీ బాహ్యావిషయాలు. కానీ అందరిలోనూ సద్వస్తువు సమానంగా ఉంది. భక్తుడు అందరిలోనూ ఉన్న సద్వస్తువును చూడటం నేర్చుకోవాలి. అన్ని కాలాల్లోను, అన్ని అవస్థలలోనూ అద్వైతభావన విడిచిపెట్టకూడదు. ఇది నేర్చుకుంటే ఆ సద్వస్తువు దయ నీకు కలుగుతుంది. గుణాల యొక్క వేగం వలన హృదయంలో ఉన్న పరమాత్మను మరచి పోయాము. భక్తి సంపాదించడం సామాన్యమైన విషయంకాదు. విద్య, ధనం, అధికారం సంపాదించవచ్చు కాని భక్తిని సంపాదించడం కష్టం. పూర్వ జన్మలో సజ్జన సాంగత్యం చేసి, సత్కర్మ చేస్తే కాని భక్తి కలుగదు. భక్తి పులి లాంటిది. అజ్ఞానమనే నిద్ర నుండి మేల్కొలిపేది. మనకి డబ్బు విలువ, చదువు విలువ తెలుస్తున్నది. భక్తి విలువ తెలియడం లేదు. జీవిత విధానంలో శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం బాగుండాలి. అంటే మనస్స నిర్మలంగా, నిశ్చలంగా ఉండాలంటే, మీరు జీవించే పది రోజులు సుఖంగా ఉండాలి అంటే భక్తి అవసరం. సస్వరూప అనుసంధానమే భక్తి. రాధాకృష్ణుల కౌగిలింత అద్భుతంగా ఉంటుంది. అక్కడ దేహ వాసన లేదు. అది లౌకికం కాదు. దేహమే తాను కాదని రాధకి తెలుసు, కృష్ణుడికి తెలుసు. ఉన్నది ఒక్కటే వస్తువు. అందుచేత ఆనందం ఆనందాన్ని కౌగిలించుకుంటున్నది. అది మనకి అర్థంకాక పెడర్థాలు తీస్తాము. వారిది అభౌతికమైన ప్రేమ. రోజులు క్షణాల క్రింద వెళ్ళిపోయేవి. కృష్ణలీల ప్రాకృత బుద్ధి ఉన్న వారికి అర్థంకాదు. కృష్ణుడు అక్కడ ఇలా చేసాడు, ఇక్కడ అలా చేసాడు అనుకుంటాము. అసలు ప్రకృతికి సంబంధించిన వాసనగాని, పాపంకాని, దోషంకాని పరమాత్మకు లేదు. మన బుద్ధిలో ఉన్న దోషం వల్ల ఉన్నట్లుగా





అనిపిస్తుంది. దానికి కారణం మనకు భక్తి లేదు, ప్రేమ లేదు, వివేకం లేదు, క్రమశిక్షణ లేదు. జీవితాన్ని జాగ్రత్తగా నియమించుకుంటే, మనది క్రమశిక్షణ గల జీవితం అయితే ఈశ్వర సాక్షాత్కారం దానంతట అదే కలుగుతుంది.

9. మన దృష్టిలో పెద్ద పని అని, చిన్న పని అని ఉంటుంది. కానీ ప్రేమ ఉన్న వానికి అన్నిపనులు సమానమే. పనిని చాకిరీ అనుకొని చేసే వాడికి దాని తాలూకు ఫలితం చుట్టుకుంటుంది. పనిని ప్రేమగా చేసేవాడు యోగి అవుతాడు. శ్రీకృష్ణుడు సమాధి స్థితిలోనే దేహం ధరించాడు, సమాధి స్థితిలోనే దేహం విడిచిపెట్టాడు. కృష్ణుడు మనకి పుట్టినట్లు, చనిపోయినట్లు కనిపించవచ్చు అది నూటికి నూరుపాళ్ళు అబద్ధం. ఆయన పుట్టలేదు, చనిపోలేదు. ఈ రహస్యం మీకు అర్థం అయితే మిమ్మల్ని మోక్షంతో అలంకరిస్తాను అన్నాడు పరమాత్మ. భక్తిని ఆరోజుకారోజు పెంచుకుంటే మీ మనస్సులో ఎన్ని బలహీనతలు ఉన్నా మిమ్మల్ని ఆటంకం పెట్టవు. ఆ పెంట కుప్ప ఎంత ఉన్నా భక్తి అనే నిప్పరవ్వ పడితే ఆ పాపరాశి అంతా కాలిబూడిద అవుతుంది. వైభవం అంతా భక్తిలోనే ఉంది. మనలో ఏ స్వరూపం అయితే ఉందో దానిని మనకు అందకుండా ఏ గుణాలు అడ్డుపడుతున్నాయో ఆ గుణాలన్నీ భక్తిలో కాలి బూడిద అవుతాయి. రామకృష్ణ పరమహంసగారితో ఒకరు "మీ భార్య పుట్టింటి వద్ద విరోచనాలు ఎక్కువైపోయి పోయే పరిస్థితిలో ఉన్నారు" అని చెప్పగా అయ్యో నా భార్య పోతుందా అని అనకుండా "ఆత్మానుభవం పొందకుండా దేహం విడిచిపెడితే మరల ఎన్ని జన్మలు ఎత్తాలో" అన్నారు. ఆమెను భార్యగా చూడలేదు. ఆమె కూడా జీవుడే జ్ఞానం పొందకుండా పోతే శరీరం ఎందుకు వచ్చినట్లు అనుకున్నారు? అది ఈశ్వరుని కరుణ. ఈశ్వరునిపై విశ్వాసం కరుణ ఉండాలి. కర్పూరాన్ని వెలిగిస్తే శేషం లేకుండా ఎలా కరిగిపోతుందో అలాగే నీ మనస్సు ఈశ్వరునిలో లీనమై ఉంటే అది కరిగిపోతుంది. పాండురంగనితో తుకారాం అన్నాడు "నా గౌరవం, అగౌరవం అన్నీ నీవే తీసేసావు. నాకు ఎందుకు అవి?" అది మనస్సు నశించిన తరువాత అన్న మాట. భార్యాభర్తల మధ్య ఉన్న ప్రేమ

రజోగుణ ప్రేమ. పెళ్లైన కొత్తలో ఉన్న ప్రేమ ముసలితనం వచ్చాక ఉండదు అప్పుడు ఒకరిని ఒకరు తిట్టుకుంటారు. అది నూటికి నూరుపాళ్ళు అబద్ధమైన ప్రేమ, రజోగుణ ప్రేమ. ఈశ్వరునిపై నీకున్న ప్రేమే నిజమైన ప్రేమ. భగవంతుడిని ఎవరైతే నమ్ముతారో వారికి సంసారమనే నది మోకాళ్ళ లోతులో ఉండి నడిచి అవతల తీరానికి (సత్య దర్శనానికి) వెళ్ళగలరు, తరించగలరు. భగవంతుని నామంపై రుచి దొరికితే లోకసంబంధమైన రుచులు అన్నీ నశించిపోతాయి. భగవంతుని మీద నూటికి నూరుపాళ్ళు విశ్వాసం ఉంటే ఒక్క తలంపు కూడా రానేరాదు. ఈశ్వరుడు మనకు ఆపదలో కించిత్తు కూడా సహాయం చెయ్యకపోయినా ఆయన మీద మనకి కించిత్తు కూడా భక్తి తగ్గకపోతే అప్పుడు ఆయన అనుగ్రహానికి పాత్రులమవుతాము. వివేకానంద అన్నారు "విగ్రహారాధన వల్ల పరమహంసలు అయితే విగ్రహారాధనను ప్రోత్సహిస్తాను" అని. పరమహంసగారు కాళీమాతకు నైవేద్యం పెట్టేటప్పుడు వేడి పదార్థాలు పెడితే నాలుక కాలుతుందని చల్లారిన తరువాత పెట్టేవారు, ఉక్కబోస్తే విసినకర్రతో విసిరేవారు. అంటే భగవంతుడి పట్ల సజీవమైన విశ్వాసం ఉండాలని అర్థం.

10. "దేవుని మీద నాకు ఇష్టం ఉంది, ప్రీతి ఉంది. ఆయన వేరుగా ఉండాలని, నేను వేరుగా ఉండాలని అనుకుంటున్నాను. నా కోరిక బలపరచండి" అని భగవాన్‌ని అడిగితే ఆయన "నది సముద్రం దగ్గరకు వెళుతుంది అనుకోండి నది నేను వేరుగా ఉండాలి, నేను వేరుగా ఉండాలి అనుకుంటే కుదురుతుందా? సముద్రం తనలో ఐక్యం చేసుకుంటుంది. అలాగే నీ భక్తి నిజమైతే, నీ తపన నిజమైతే నిన్ను ఆయనలో ఐక్యం చేసు కుంటాడు. నువ్వు వేరుగా ఉండాలన్నా సాధ్యం కాదు" అన్నారు. "దేహం నేను కాకపోయినా దేహం నేను అనే బుద్ధిని కల్పించావు. దానితో ఈ బాధలు వచ్చాయి" అంటారు సాధకులు. భగవంతుని స్మరణ వలన, ఈశ్వరునితో చుట్టరికం వలన దేహబుద్ధి తగ్గుతుంది. దేవునిపట్ల అనురాగం, ఆప్యాయత ఎలా ఉండాలి అంటే మన పిల్లల్ని మనం ముద్దు పెట్టుకుంటాము





అనుకోండి మొదటి ముద్దు ఆప్యాయంగా పెట్టుకుంటాము అలా నాలుగు సార్లు పెట్టుకుంటే ఆఖరి ముద్దు అంత తీపిగా ఉండదు. "మొదటి ముద్దు ఎంత తీపిగా ఉంటుందో అంతటి ఆప్యాయతతో నన్ను స్మరించుకుంటూ, నాకు నచ్చిన పని చేస్తూ ఉంటే అలా చేయగా చేయగా ఏరకంగా అయితే మీరు సిద్ధి పొందుతారో దాని తాలూకా బుద్ధిని ఇస్తాను. దేహబుద్ధితో నన్ను పట్టుకోలేవు" అని పరమాత్మ చెప్పాడు. గుడికి వెళ్ళడం దేనికి అంటే ఆ గుడిలో ఉన్న దేవుడు మన హృదయంలో కూడా ఉన్నాడని తెలుసుకోవడానికే. లోపల ఉన్న సత్యం మనకి తెలుస్తూ ఉంటే మన దేహమే దేవాలయం అవుతుంది. కర్తృత్వం శరణాగతిని చేయనివ్వదు. కొందరు సాష్టాంగ నమస్కారం చేస్తారు. వారు అంటారు "శరీరాన్ని వంచలేనప్పుడు అహంకారాన్ని ఎలా వంచగలవు? ఎలా జయించగలవు?" అని. దూడని కట్రాడుకి కట్టినప్పుడు ఎలా పడి ఉంటుందో అలాగే నీ మనస్సుని పరమాత్మునితో కట్టేస్తే అది తత్ రూపం చెందుతుంది. మనస్సుని వదిలేస్తే ప్రకృతిలో పడిపోయి అపవిత్రమవుతుంది. జీవితానికి మాధుర్యం చేకూర్చేది భక్తి. ఐన్‌స్టీన్ విడాకులు తీసుకున్న భార్యతో "ఎప్పుడైనా బస్టాండ్‌లో కాని, రైల్వే స్టేషన్‌లోకానీ కనిపిస్తే బాగున్నావా ఆల్‌బర్ట్ అని పలుకరించు. నాకు నోబుల్ బహుమతి వచ్చింది. ఆ ధనంలో నీకు సగం ఇస్తాను. నీ ఇష్టమైన వ్యక్తిని వివాహం చేసుకొని సుఖంగా ఉండు" అన్నారు. తనను హింసించిన వారితో కూడా అలా మాట్లాడటం వారి గొప్పతనం, వారి ప్రేమకు నిదర్శనం. గుడిలో విగ్రహాన్ని చూచి దానిని భగవంతునిగా నమ్మని వానికి అది విగ్రహమే. గుడికి వెళ్ళి పూజ చేయించుకొని నమ్మిన వానికి అది దేవుడే. దాని వల్ల మనస్సు, ఇంద్రియాలుకు కంట్రోల్ నేర్పుతుంది. పూజ మంచి బుద్ధి నేర్పుతుంది.

11. ఆధ్యాత్మిక అభివృద్ధికి పవిత్రత కావాలి. అది లేనివారికి ఈశ్వరునిపై విశ్వాసం కుదరదు. జ్యోతి రామలింగస్వామి అనేవారు "ఈ లోకానికి, పరలోకానికి సంబంధించినవి ఈశ్వరుని అడగటమేమిటి? నీవే

కావాలి అది ఒక్కటే నేర్చుకో" అని. శబరి గురించి త్యాగరాజు "నీ భాగ్యం ఇట్టిదని ఎలా చెప్పగలను. మాట్లాడుతూనే రామునిలో ఐక్యమైనావు" అన్నారు. మనకు ఈశ్వరునిపై ఏకాగ్రత ఐదు నిమిషాలు ఉంటుంది. శబరికి రాముని మీద ఏకాగ్రత నిరంతరం ఉంది. అందుకే సాఫల్యం చెందింది. ఈ పని నావల్లే అయ్యింది అని ఏ భక్తుడైనా అంటే వాడు భక్తుడు కాడు. శరీరాన్ని ఈశ్వరుడు ఉపయోగించుకుంటాడు అంతే. భక్తుని శరీరము, మనస్సు ఈశ్వరుని స్వాధీనంలో ఉంటాయి. భక్తుడు అంటే ప్రేమ, యోగ్యత, ఆప్యాయత, పూజ, సేవ గలవాడని ఇలా పదిపేర్లు ఉన్నాయి. మన మనస్సులో కల్మషం ఉండటం వల్ల భక్తి కుదరడంలేదు. దాని విలువ తెలియడం లేదు. రామకృష్ణ పరమహంస తల్లి అంత్యక్రియలలో నిప్పు పెడుతూ "నేను నీ కడుపులో పుట్టాను. ధన్యురాలవు అనలేదు. భగవంతుడిని నీ కడుపులో మోసావు. నీవు ధన్యురాలవు" అన్నారు. రామకృష్ణ పరమహంస మహావిష్ణువు అంశ. వివేకానందుడు శివాంశ సంభూతుడు. అమెరికాలో వివేకానందకు, అచ్యుతానందకు ఒకే గదిలో ప్రక్కప్రక్కనే పరుపులతో కూడిన మంచాలు వేస్తే అచ్యుతానంద అనుకున్నారు స్వామితో సమానంగా పడుకోవడం ఏమిటి? అని పరుపు క్రింద వేసుకొని పడుకున్నారు. అది స్వామి పట్ల భక్తి. గోపికలు కృష్ణునితో "మేము మట్టిలాంటి వాళ్ళము. మోడులాంటి వాళ్ళము. నీవు ఇచ్చిన ప్రేమతోనే నిన్ను ప్రేమిస్తున్నాము. మేము నిన్ను ప్రేమిస్తుంటే నీవు సంతోషిస్తున్నావు. మేము ఎవరము నిన్ను ప్రేమించడానికి" అన్నారు. అది ఎరుకతో కూడిన ప్రేమ. ఈశ్వరునిపై మనకి భక్తి కలగాలి కారణం కనబడకూడదు. దానిని జాగ్రత్తగా కాపాడుకోవాలి. నిష్కామభక్తిని అలవాటు చేసుకుంటే కొత్త సంస్కారాలు రావు, పాత సంస్కారాలు కాలిపోతాయి. రామకృష్ణులు "చెట్టు మీద పక్షులు ఉంటే డప్పు కొడితే పక్షులు ఎగిరిపోతాయి. అలాగే మీ వాసనలు ఒక్కోసారి బుసలు కొడుతూ మిమ్మల్ని బాధకు గురిచేస్తే భగవంతుని నామాన్ని మనస్ఫూర్తిగా స్మరిస్తే మీ వాసనలు ఎగిరిపోతాయి" అన్నారు. తులసీదాస్ రామాయణం గురించి





బాపు "సీతా రాములది ప్రేమ జీవితం. అసలు భార్యా, భర్తలు అలా ఉండ గలరా?" అని అనుకున్నారు. "భక్తిలోంచి ప్రేమ రాకపోతే అది భక్తా? కారణ భక్తులకు భగవంతుని పట్ల విశ్వాసం చలిస్తూ ఉంటుంది" అన్నారు రామానుజులు. మనం డబ్బును, భూములను, బంధువులను ఆశ్రయిస్తాము. భగవంతుడిని, గురువును ఆశ్రయించిన వాడు మాత్రమే భక్తుడు. భాగవతంలో ఒక భక్తుడు "ఓ నారాయణా నాకు మోక్షాన్ని ఇవ్వకు. దానిని నేను కోరను. నీవు అందరి హృదయంలోను ఉండి వారి వారి ప్రారబ్ధాన్ని బట్టి ఆడిస్తున్నావు కదా! నేను అందరి హృదయాలలోను ఉండేటట్లు చెయ్యి. అప్పుడు నేను ఏమి చేస్తాను అంటే వారి దుఃఖాన్ని నేను భరిస్తాను. ఆ శక్తిని నీవు నాకు ఇవ్వు. వారి పుణ్యము, వారి శాంతి వారికే ఇచ్చెయ్యి" అన్నాడు. ఈ మాటలను మనం ఊహించలేము. అటువంటి భక్తులు ఉంటారని కూడా మనం ఊహించలేము. బంగారాన్ని శుద్ధి చేయడానికి మండుతున్న కొలిమిలో పడేస్తాము. అలాగే మనస్సు శుద్ధి అవ్వడానికి భక్తిలో పడెయ్యి.

12. జ్ఞానానికి భక్తి పంచదారలాంటిది. ఆ రెండింటినీ విడదీసి చూడకండి. ఐన్‌స్టీన్ సత్యానికి భక్తుడు. ఏనాడో చేసిన పాడుకర్మ ఇప్పుడు ఎదురైంది అని అనుకోకు, ఇతరులను తిట్టిపోయకు, శాంతిని పోగొట్టుకోకు, రజోగుణంలో పడిపోకు, ఈశ్వరుని పాదాలు విడిచిపెట్టకు. నీవు ఏదిగా ఉన్నావో అదిగా ఉండటానికి భక్తి ఉపయోగపడుతుంది. భగవంతుడిని అది కావాలి, ఇది కావాలి అని అడగవద్దు. ఆయనతో వ్యాపారం చెయ్యకు. నీకు ఏది మంచిదో ఆయనకు తెలుసు. ఆయన ఇచ్చినది వద్దు అనకు. ఆయన ఏది అనుగ్రహిస్తే అదే ప్రసాదంగా స్వీకరించు. అది శరణాగతి చెందినవాని లక్షణం. అనుకూలమైన భార్య దొరకడంకంటే, నచ్చిన ఉద్యోగం దొరికినవానికంటే సత్యాన్వేషకుడు అదృష్టవంతుడు. ఎందుకంటే అతను సత్యాన్వేషణ చేస్తున్నాడు. ఆ ప్రయాణంలో ఉన్నాడు. భక్తులు అందరూ సత్యాన్వేషకులు కారు. మాణిక్య వాచకరులు "నాకు శరీరం గుర్తుకు వస్తూ

ఉంటే నేను భక్తుడను ఎలా అవుతాను" అనేవారు. మనం మినపపప్పు నానబెట్టి నానిన తరువాత రుబ్బుతాము. అలాగే నామాన్ని చేయడం మొదలు పెట్టాక అది మీ హృదయంలో కరగాలి. ఒకరోజు నామం చేసి జ్ఞానం రాలేదేమిటి? అని ఎదురు చూడక చిరకాలం ప్రేమతో చెయ్యాలి. భగవంతునితో ప్రేమ ఎలా ఉండాలి అంటే "నీవే ఉన్నావు నేను లేను" అనాలి. నీ మనస్సుకు, ఇంద్రియాలకు ఆ వాసుదేవుడు తప్ప మరేమీ కనపడకూడదు. వాడే నిజమైన భక్తుడు. అదే యోగంగా మారిపోతుంది. అటుకులను పాలలో నానబెడతాము. అలాగే వాసుదేవుడిని నీ మనస్సులో నానబెట్టాలి. వివేకానందుడు అమెరికా వెళ్ళి వచ్చాక వివేకానందుడు పెద్దవాడు అని లాటూ అనే భక్తుడు దూరం దూరంగా ఉండేవాడు. వివేకానందుడు అతనితో "నీవు నా లాటూవు. నేను నీ నరేన్‌ని నాకు దూరంగా ఎందుకు ఉంటున్నావు?" అన్నారు. ఈ ప్రేమను మనం భరించలేము. మాయలో ఉంటే అవినయం వస్తుంది. సత్యం నుంచి దూరం చేసేది కామం. "శివుని సమీపానికి రావాలంటే ప్రేమ కావాలి" అన్నారు శంకరులు. మనుషుల ప్రేమలు నిత్యంగా ఉండవు. నిజమైన ప్రేమ దివ్య ప్రేమ. అలౌకికమైన ప్రేమ చనిపోయే వరకు ఉంటుంది. భగవంతుని పట్ల భక్తిగా ఉండటం వలన భావశుద్ధి కలుగుతుంది. రామకృష్ణుడు "కాముకుడికి కామం మీద ఎంత ఇష్టం ఉంటుందో లోభికి లోభిత్వం మీద ఎంత ఇష్టం ఉంటుందో అలాగే భగవంతుని మీద భక్తునకు అంత విశ్వాసం ఉంటే భగవంతుడు వ్యక్తం అవుతాడు" అన్నారు. లోపల వికారం లేకపోతే దేనిమీదా వికారం ఉండదు. భక్తిలేని జ్ఞానం పొడిగా ఉంటుంది. భయం ఉన్నచోటుకి దుఃఖం పరిగెత్తు కుంటూ వస్తుంది. గీతలో "ఎవరు ఇతరులను చూసి భయపడరో వారు నిజ భక్తులు". శ్రీనివాసశాస్త్రిగారు చెన్నైలో రామాయణం గురించి ఒక గంట చెబుతానని అరగంట మాట్లాడి చెప్పలేక వెళ్ళిపోయారు. ఆ భక్తి మనకి ఎక్కడిది? నిజ భక్తుడు భగవంతుడిని సద్బుద్ధిని ప్రసాదించమని కోరుకుంటాడు. రామనామం లక్ష్మీప్రదమైనది, ఉచ్ఛరించడం తేలిక. ఆ





నామం మన రక్తంలో భాగం అయిపోవాలి. తుకారామ్ "ఈ సృష్టిలో ధనం వల్లకాని, మరి ఏ ఇతర ప్రకృతి పదార్థాల వల్లకాని తరింపగలమా? ఒక్క భక్తి వల్ల తప్పించి" అన్నారు.

13. "నామ స్మరణ భగవంతుని ప్రేమించడానికి ఉపయోగపడు తుంది. లౌకికానికి చావులు, పుట్టుకలు కాని, భక్తికి చావులు పుట్టుకలు లేవు. శరీరం పుడుతుంది కాని, భక్తి ఎప్పుడూ హృదయంలో ఉండేదే. శరీరం మరణించినా నీ భక్తి నీకూడా వచ్చేస్తుంది. అది అమరత్వాన్ని ప్రసాదిస్తుంది" అన్నారు తుకారాం. రామకృష్ణ పరమహంస చిన్నప్పుడు "అనరా బాబూ, అనరా బాబూ గోవిందుడే గురువని అనరా బాబూ, శరీరము, మనస్సు, ప్రపంచం అంతా గోవిందుడేయని అనరా బాబూ, ఎన్ని దుర్గుణాలు ఉన్నా సత్సంగం చెయ్యరాబాబు, దుర్విషయాలు దుస్సాంగత్యం, దుర్గుణాలు వదలి సత్సంగం చెయ్యరా బాబు అనరా బాబు గోవిందుడే గురువని అనరా బాబు" అని పాడుకునేవారు. భాగవతాన్ని మధ్వాచార్యులు ప్రచారం చేసారు. గొప్ప సంస్కృత పండితుడు. ధర్మస్థలి మంజునాధుడిది. అక్కడ అబద్ధాలు చెప్పరు. ప్రాయశ్చిత్తానికి ఉనికిపట్టు అంటారు. భక్తిలో ఉద్రేకం ఉంటుంది. జ్ఞానం శాంతంగా ఉంటుంది. భగవంతునితో అనుసంధానం చేసేదే భక్తి. ప్రేమకి వ్యాపారం ఉండదు. భక్తి చాలా దూరం తీసుకువెడుతుంది. కొందరు ఇంటికి వచ్చిన బంధువులు భగవంతుడు మిమ్మల్ని క్షేమంగా చూడాలి అని చెప్పి వెళతారు. కొందరు భక్తులు వేసవికాలం ఉక్కబోస్తే గురువుగారి ఫొటోకి విసినకర్రతో విసిరేవారు ఉన్నారు. రాధ కృష్ణుడికి భార్యకాదు, ఒక గోపిక. ఆమెకు కృష్ణుని పట్ల హద్దులు లేని అపారమైన ప్రేమ, ఆప్యాయత ఉంది. అది భౌతిక సంబంధమైనది కాదు. దైవీ ప్రేమ. రాధ హృదయంలో కృష్ణుడికి తప్పించి మిగతా వారికి స్థానం లేదు.

# 2. జ్ఞానము – జ్ఞాని

1. తలంపులకు, ఇంద్రియాలకు అతీతంగా ఉంటూ ఏదైతే స్వతంత్రంగా ఉంటుందో అదే నిజమైన సుఖం. రాముడు లంకను జయించి రాజ్యాన్ని, అంతులేని సంపదను విభీషణుడికి ఇస్తూ "శివ భక్తుడైన రావణాసురునికి అంతులేని సంపదలను శివుడు ప్రసాదించాడు. దానినే నీకు ఇస్తున్నాను. ఇందులో నా గొప్పతనం ఏమీ లేదు. శివుడు ఇచ్చినదే నేను నీకు ఇస్తున్నాను" అన్నాడు. వ్యక్తిభావన లేని రాముని గొప్పతనాన్ని ఈ మాటల్లో మనం గ్రహించాలి. ప్రపంచంలో ఖరీదైన స్థలం (టోక్యో) నీకు డబ్బు ఉంటే ఆ స్థలాన్ని కొనవచ్చుకాని, నీకు మిలియన్ల కోట్లు ఉన్నా శాంతిని కొనలేవు. శాంతికి వెలలేదు. వెలకట్టలేని దానిని వెలతో ఎలా కొంటాము. అదే జ్ఞానము. "మిమ్మల్ని సుఖపెట్టడానికి నాకు చేతనైనది నేను చేస్తున్నాను" అన్నాడు బుద్ధుడు. ఎంత అద్భుతంగా చెబుతున్నారో ఆలోచించండి. నిర్వాణ సుఖం కన్నా ఎక్కువ సుఖం ఇచ్చేది ఎక్కడైనా ఉందా? నిర్వాణసుఖంలో నా మాటలకు అందని విషయాలు ఉండవచ్చును. దానిని ఎలా చెప్పగలను అంటే భగవంతుడు సాకారుడు, నిరాకారుడు ఆ రెండింటికి అతీతంగా ఉండవచ్చును. దాన్ని గురించి ఎలా చెప్పను అని దాని అర్థం. జ్ఞాని కష్టపడి జ్ఞానాన్ని సంపాదించుకున్నా తనవద్దనే ఉంచుకొని శాంతిని పొందుదామనుకున్నా కుదరదు. ఆ ఉపాధి నుండి అఖండంగా శాంతి ప్రవహిస్తూనే ఉంటుంది. మహావరదలో నదిసుడులు తిరుగుతూ కంటికి అందనంత వేగంగా వెళ్ళిపోతుంది. ఆగు చూస్తాను అంటే ఆగదు. అలాగే జ్ఞాని హృదయం నుంచి శాంతి ప్రవహిస్తుంది. వారి సన్నిధిలో శాంతి ప్రవహిస్తూ ఉంటుంది. బుద్ధుడు పదిమందిలో ఉండగా ఒకరు అంటారు "ఈ బుద్ధుని ఉపాధి ద్వారా ప్రవహిస్తున్న ప్రేమ ప్రవాహం ముందు ఒకవేళ భగవంతుడు ఉంటే ఆయన హృదయంలో ఇంత ప్రేమ, ఆనందం ఉంటుందా?" అంటే బుద్ధుని సమాధానంలో అందమైన వ్యక్తీకరణ చూడండి "నిర్వాణ సుఖం కోసం అందరితోనూ వెళ్ళవలసిన పని ఏముంది?





ఒంటరిగానే వెళ్ళు" అన్నారు. జ్ఞాని ప్రేమించకుండా ఉండలేడు. ఒక్క జ్ఞాని మాత్రమే సుఖాన్ని పంచిపెట్టగలడు. అది ఆయనకే సాధ్యం.

2. సాధువు అంటే హృదయాన్ని ఖాళీ చేసుకున్నవాడు అని అర్థం. అంపశయ్యపై ఉన్న భీష్ముడు కర్ణునితో ఇలా అంటాడు "నీకు బాధ కలిగే మాటలు ఎన్నో అన్నాను, కారణం నీవు బాగుపడటం నాకు ముఖ్యం. దుర్యోధనుని స్నేహం విడిచిపెడతావని అలా అన్నాను. అది నీ బాగు కోసమే". అది జ్ఞాన సంబంధమైన మాట. ద్వితీయం లేనిదే అద్వితీయం. గాంధీజీ గారికి చిరాకు, విసుగు లేదు. విరోధులు వచ్చినా నిర్లక్ష్యంగా ఉండేవారు కాదు, విసుగు లేకుండా మాట్లాడేవారు. జ్ఞాని ఆ సమస్థితిలో ఉంటాడు. ఫలకాంక్ష లేకుండా ప్రేమించేవాడు ఒక్క జ్ఞాని మాత్రమే. మీకు భగవంతుని మీద పరిపూర్ణ విశ్వాసం కుదిరితే మీ ప్రారబ్దంలో జరిగే కర్మలను తుడిచేస్తాడు. భగవంతుడు అంతటా ఉన్నాడు. అంతటా ఉన్నవానికి అన్నీ తెలుస్తాయి. భగవంతునికి (జ్ఞానికి) తెలియదనుకోవడం మన మూర్ఖత్వానికి నిదర్శనం. ఆకాశంలో సూర్యుడు ఎలా నిలకడగా ఉంటాడో అలాగే నీవు హృదయంలో నిలకడగా ఉండటమే జ్ఞానం. ఇది ప్రకృతి జీవలక్షణాలు సహజంగా వచ్చేస్తూ ఉంటాయి. నీ మనస్సులోకి ద్వేషం వస్తూ ఉంటే దానిని గుర్తించి తొలగించుకోవడమే సాధన. జ్ఞాని గతిని (ఆత్మను) చూస్తాడు. ప్రారబ్ధాన్ని చూడడు. నేను మీకు ఒక విషయాన్ని ఎక్కువ ప్రయత్నం చేసి, కష్టపడి మీకు విషయాన్ని చెపుతున్నాను అంటే సహజంగా చెప్పడం లేదు అని అర్థం. జ్ఞాని ఒక విషయాన్ని సహజంగా విశదీకరించి చెప్పగలడు. కర్తృత్వం రాత్రి నిద్రలో లేదు. పగలు (మెలకువలో) కర్తృత్వ బుద్ధి ఎలా వస్తున్నదో గమనించడమే జ్ఞానం. సత్యానికి ప్రతీక శివుడు, సౌందర్యానికి ప్రతీక విష్ణువు. ఈ రెండు వేరు వేరు కావు. ఒకటి లేకుంటే రెండవది ఉండదు. రామునికి ఉన్నంత కృతజ్ఞత ఎక్కడా కనిపించదు. శాస్త్ర ధర్మాన్ని పూర్తిగా తెలుసుకున్నవాడు రాముడు రూపం దాల్చిన ధర్మం. ఒకే మాట ఒకే బాణం, ఒకే సతి రామునికి వర్తిస్తాయి. రాముడు

ప్రియదర్శినుడు

3. అన్ని వాంఛలను నెరవేర్చే వాడు, అందరినీ సంతృప్తి పరచేవాడు సిద్దార్థుడు. రాజభవనంలో పుట్టవలసినవాడు చెట్టుక్రింద పుట్టాడు. చుట్టరికం దేహానికి సంబంధించినది. స్నేహం మనస్సుకు సంబంధించినది. మాయావతి యొక్క స్నేహితురాలి ఆనందం ఎటువంటిదో చెప్పలేము. మాయావతి కుమారుని నామకరణం రోజుకు తన ప్రాణ స్నేహితురాలిని రప్పించుకొని ఆమె ఒడిలో బిడ్డను పెట్టగా ఆమె తదేకధ్యానంతో బిడ్డను చూస్తూ ఉండిపోయింది. ఒకరు అన్నారు బయట వాళ్ళు చాలామంది చూడవలసిన వారు ఉన్నారు అనగా ఆమె ఇలా అంది "ఇక నుంచి ఏ ఆడపిల్ల పెళ్లి చేసుకోకూడదు. చేసుకున్నా ఇటువంటి బిడ్డ మరలా పుట్టడు" అని ఇంటికి వెళ్లిపోయింది. నెల రోజులకు మాయావతి చనిపోయింది. అప్పుడు స్నేహితురాలు ఇలా అంది "భూమియే మాయావతి రూపంలో జన్మించి బుద్ధుడిని కని వెళ్లిపోయింది" అంది. సిద్దార్థుడు బుద్ధుడు అయిన తరువాత సమీప గ్రామానికి బుద్ధుడు వస్తున్నాడని తెలిసి ఆవిడ బుద్ధుని సమీపానికి వెళ్లి నిలబడింది. బుద్ధుడు లేచి నీవు మా అమ్మ స్నేహితురాలవు అనలేదు "అమ్మా" అని పిలిచాడు. ఆ మాటకు స్నేహితురాలు అనుకుంది "నేను బుద్ధుని చేత 'అమ్మా' అని పిలిపించుకున్నాను. నా జీవితం సార్థకత చెందింది. నాలోని అహం బీజం ఉంటే దాన్ని నిర్మూలన చేసాడు. నాకు పునర్జన్మ లేదు. ఆత్మబోధ చెయ్యకుండానే 'అమ్మా' అని అహంకారాన్ని నిర్మూలించాడు" అంది. ఒక జ్ఞానిని అజ్ఞాని గుర్తించలేడు. కిరసనాయిల్ దీపాన్ని ప్రత్యేకించి ఆర్పనక్కరలేదు. కిరోసిన్ అయిపోతే అదే ఆరిపోతుంది. అలాగే నీలో తృష్ణ ఆరిపోతే నీ మనస్సు నాశనమవుతుంది. సత్య సాక్షాత్కారం పొందిన వానిని "ఋషి" అంటారు. మీరు అందమైన శరీరాన్ని చూడటం కాదు అందమైన గుణాలను చూడాలి. అలా చూడకపోతే మీకు జ్ఞానం ఏమిటి? మనస్సు ద్వారా సంపాదించే సాపేక్షిక జ్ఞానం వల్ల చావు పుట్టుకలకు సిద్ధం కావాలి. ఆత్మజ్ఞానం పూర్ణజ్ఞానం అనుభవానికి సంబంధించినది.





దీనివల్ల జన్మ రాహిత్యం కలుగుతుంది. అది భక్తి వల్ల, వివేకం వల్ల, జ్ఞానం వల్ల, భగవంతుని అనుగ్రహం వల్ల వస్తుంది. చెప్పేవాడిని, వినేవాడిని నేనే అని జ్ఞాని అనుకుంటాడు. జ్ఞానికి ఇతరులు లేరు. ఇద్దరూ ఒక్కటే అయితే ఒకరిని ఉద్ధరిస్తున్నాను అనే భావన రాదు. వస్తే అతను పతనమైనట్లే. చిత్త శుద్ధిలోను, కపటం లేకపోవడం లోను రామకృష్ణుడికి సాటి ఎవరూ లేరు (అరుదుగా ఉంటారు).

4. కారణం అర్థం అయ్యేలా చేస్తే కార్యం పోతుంది (బోధ వల్ల). సాంఖ్యం అంటే జ్ఞాన మార్గం. యోగం అంటే కర్మ సంబంధమైనట్టిది. అది ధర్మం గురించి చెపుతుంది. మనో దేహములను దాటిన వానిని మనవాడే అని వారికి నమస్కరిస్తాము. నీవు ప్రస్తుతం చూస్తున్న ప్రకృతి దృశ్యాలు అన్నీ ఆత్మానుభవంలో రోతగా తయారవుతాయి. లెక్కలు తెలియకుండా జీవితం గడపడం ఎంత కష్టమో జ్ఞానం లేకుండా జీవితం గడపడం కూడా అంతే కష్టం. రామకృష్ణుడు, రమణుడు సత్య మార్గాన్ని తేలిక పరిచారు అంటే మూఢ నమ్మకాలలో ఉండే అజ్ఞానాన్ని తొలగించారు. కంకర రోడ్డు వంటి మతాన్ని సిమెంటు రోడ్డుగా చేసారు. వారు అసత్యాన్ని వదిలేసి సత్యాన్ని తెలిపి మనలను గమ్యానికి దగ్గర చేసారు. "వేద" అంటే జ్ఞానం. దక్షిణామూర్తిలో వ్యక్తి భావన లేదు. దేనితోను తాదాత్మ్యం లేదు. అది ఎలా ఉందో అలా ఉంది. వారి మౌనం ద్వారా జ్ఞాన బోధ జరిగింది. జిజ్ఞాస వల్ల జ్ఞానం వస్తుంది. జ్ఞానం వల్ల ఆచరించాలనే బుద్ధి కలుగుతుంది. ఆచరించడం వల్ల ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఒక యూరోపియన్ ఇలా అన్నాడు "ఏమీ అక్కరలేని వాడు రాముడు, సృష్టినంతా ఆకర్షించేవాడు కృష్ణుడు" అని. "అస్తి" అంటే ఉన్నది. అదే పరబ్రహ్మం. బాధలేని మనిషి లేడు ఒక్క జ్ఞాని తప్ప. స్వరూప జ్ఞానం కలవారు అమృత స్వరూపులు అవుతారు. మృత్యువు నుండి బయటపడతారు. స్వరూపం నుండి సుఖము, శాంతి, ఆనందము వేరు కావు. ఆత్మజ్ఞానం కలిగిన తరువాత చావు పుట్టుకలకు అర్థం లేదు. అద్వైత అనుభవం రాగానే ద్వైతభావనలోంచి బయటపడతాము.

5. "నా జన్మ రహస్యం, నా కర్మ రహస్యం తెలుసుకుంటే మోక్షం వస్తుంది" అన్నాడు శ్రీకృష్ణుడు. ఆయన పుట్టలేదు. పుట్టిన వాని వలె కనిపిస్తాడు. పుట్టిన వానికి మరణం ఉంటుంది. శ్రీకృష్ణుడు యోనిలోంచి జన్మించలేదు. శంఖు, చక్ర గదాధులు ధరించి తల్లితండ్రులకు దర్శనమిస్తాడు. యోనిలోంచి రాకుండా ఎలా సాధ్యం అనుకోవచ్చు. అది మనకి తెలియని రహస్యాలలో ఒకటి. సత్‌పదార్థాన్ని ఉన్నది ఉన్నట్లుగా తెలుసుకున్నవాడు జ్ఞాని. రాముడు చేసి చూపించాడు. కృష్ణుడు చేయకుండా చెప్పి చేయించాడు. తామరాకు మీద నీటి బొట్టులా వ్యవహరించాడు. యోగ మాయ దుర్గ యశోద గర్భం నుంచి వచ్చినది. కంసుడు ఆ దుర్గను చంపడానికి కత్తిపైకి ఎత్తితే అది ఎగిరిపోయింది. అప్పడు ఆకాశవాణి "నిన్ను చంపేవాడు పుట్టాడు, ఎదుగు తున్నాడు" అంది. అవతారపురుషులు వేరు, జ్ఞానులు వేరు. అవతారపురుషు లకు జ్ఞానం ఉంటుంది, శక్తి ఉంటుంది. జ్ఞానికి జ్ఞానం ఉంటుంది. జ్ఞానం కూడా భక్తి మిశ్రమమై ఉంటేనే మాధుర్యం. గారె రుచివేరు, పాకంగారె రుచివేరు. సాపేక్షికం రెలిటివ్ నాలెడ్జ్ గురించి ఐన్‌స్టీన్ "నీకు ఇష్టమైన వ్యక్తి షడన్‌గా వచ్చి నీ ప్రక్కన కూర్చుంటే ఒక గంట ఒక నిమిషంలా గడిచిపోతుంది, ఇష్టంలేని వ్యక్తి కూర్చుంటే ఒక నిమిషం ఒక రోజులా గడుస్తుంది" అన్నారు. రాధ, కృష్ణుని చూస్తుంటే గంట నిమిషంలా గడిచిపోయింది. సాధన అలా సాగిపోవాలి. భగవంతుని మాటలు అర్థంకాక ఆ మాటలు వ్యర్థం అనుకొంటాము. ఆత్మ చూడబడేదే కాని మనసుతో చూచేది కాదు. మహాత్మాగాంధీ 1920లో రామకృష్ణుడు నివసించిన దక్షిణేశ్వరం వెళ్ళి అక్కడి ప్రజలతో ఇలా అన్నారు "నేను మీకు దేశ భక్తిని పెంపొందించడానికి రాలేదు. ఏ మహాత్ముని దర్శనం వల్ల, స్మరణ వల్ల శాంతిని పొందుతున్నానో వారికి కృతజ్ఞత తెలపడానికి వచ్చాను" అన్నారు. జ్ఞాని వైభవం అది.

6. బుద్ధుడిని "నీవు అవతార పురుషుడవు" అంటే ఆయన "నేను మీబోటి సామాన్యమైన మనిషినే" అనేవారు. "జ్ఞానం యూనిఫారంగా





ఉంటుంది. అజ్ఞానం యూనిఫారంగా ఉండదు. జ్ఞానికి ఈ ప్రపంచంలో ఆకర్షించే వస్తువు అంటూ ఏదీ లేదు. ఆత్మానుభవంలో మైండ్ కంట్రోల్, సరైన ఆలోచన, సరైన ప్రవర్తన వస్తుంది. మీ గురించి మీరు తెలుసు కోవడమే ఆత్మజ్ఞానం. జ్ఞానం అంటే అడ్డు వచ్చే సంస్కారాలను పోగొట్టు కోవడమే. బ్రహ్మాన్ని గురించే సత్యం, జ్ఞానం, అనంతం, బ్రహ్మం అని చెప్పారు. అది మన హృదయంలో ఉంది. అదే సత్యం. దానిని తెలుసుకునే వరకు ఎవరికీ దుఃఖం తొలగదు. జ్ఞానిని ప్రపంచం అంతా వదిలేసింది అనుకోండి వాడి సుఖం రవ్వంత అయినా తగ్గదు. మంగలి కత్తితో నీ తలమీద ఉన్న జుట్టును ఎలా గొరిగేస్తాడో అలాగే జ్ఞానమనే కత్తితో నీ లోపల ఉన్న అజ్ఞానాన్ని గొరిగెయ్యి. అప్పుడు లోపల ఉన్న బ్రహ్మం నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది" అని ముండకోపనిషత్తు అంటోంది. మనం ఋషులను, అవతారపురుష లను గురించి శ్రవణం చెయ్యాలి. వారు అమృతాన్ని వర్షంలా కురిపిస్తారు. మనస్సు నేను కాదు అని తెలుసుకో. నేను ఎవడను? అనే విచారణ యొక్క ప్రయోజనం అదే. చైతన్యానికి నీవు వేరుగా లేవు. వేరుగా ఉన్నాను అనేది తలంపు మాత్రమే. ఆ తలంపు పోగొట్టుకోవడానికే నేను ఎవడను? అనే విచారణ. మనిషి జీవితాన్ని పెనవేసుకొన్న అహంభావనను తొలగించ డానికే అరుణాచలం ఆవిర్భవించింది.

7. నామ, రూప, క్రియలను ప్రక్కన పెడితే ఉన్నది నారాయణుడే. అన్ని జ్ఞానాలకు, అన్ని ప్రయత్నాలకు, అన్ని సాధనలకు పరిసమాప్తి ఆత్మజ్ఞానం. పతంజలి చెప్పిన సమాధి స్థితిలో వాడికి స్వరూప స్మృతి ఉంటుంది. లోపల ఆనందం ఉంటుంది. పని ఆగిపోతుంది. ఇంద్రియాలు, మనస్సు, శరీరము పని చేయవు. ఆ అనుభవంలోనుండి బయటకు వచ్చాక తాను పొందిన ఆనందాన్ని శాంతిని చెపుతాడు. శ్రీకృష్ణుడు చెప్పిన సమాధి అలాకాదు తాను లోపల స్వరూపస్థితిలో ఉంటాడు. అలౌకికమైన శాంతిని, అద్భుతమైన ఆనందాన్ని అనుభవిస్తూ ఉంటాడు. దేహము, ఇంద్రియములు, మనస్సు పని చేస్తూనే ఉంటాయి. లోపల శాంతి ఉంటుంది. బయట పని జరిగి

పోతుంది. ప్రపంచం లేదు, దేవుడు లేడు అని మనం అనుకుంటున్నాము. జ్ఞానికి ప్రపంచమే దేవుడు, దేవుడే ప్రపంచం. జ్ఞాని ప్రపంచాన్ని బ్రహ్మంగానే చూస్తాడు. నీవు ప్రపంచాన్ని ప్రపంచంగా చూసినా అది బ్రహ్మమే. బ్రహ్మంగా చూసినా బ్రహ్మమే. అయితే ప్రపంచాన్ని ప్రపంచంగా చూడటం వలన రాగ ద్వేషాలు, పుణ్య పాపాలు, భయము, దుఃఖము అన్నీ వచ్చేస్తాయి. దుఃఖంలో మునిగిపోతావు. ఒకసారి పూనాలో మసూచి వచ్చింది. వందమంది చనిపోయారు. అందులో తిలక్ గారి మనుమడు కూడా ఉన్నాడు. వారిని పరామర్శించడానికి వెళ్ళినవారు తిలక్‌గారు శాంతిగా ఉండటం చూసి ఎలా ఉండగలుగుతున్నారు అంటే ఆయన "మా మనుమడు ఒక్కడేనా తొంభైతొమ్మిది మంది చనిపోయారు. అందులో మా మనుమడు ఒకడు. మా మనుమడేనా మనిషి? వారు కాదా?" అని అడిగారు. ఇక ఆయనకు దుఃఖం ఏమిటి? ఎందుచేతనంటే వారు భగవద్గీతను ఆశ్రయించారు. మమకారం లేని మనిషి కుటుంబంలో ఉన్నా సన్యాసితో సమానం.

8. ఒక జ్ఞాని అన్నారు "నీవు సంసారంలో ఉండి తరించగలవు". అప్పుడు నీ జ్ఞానం ఎంతవరకు అందుతుంది అంటే ట్యూబ్‌లైట్ కాంతి ఎంత దూరం వెళుతుందో అంతదూరం నీ జ్ఞానం ఇతరులకు వెళుతుంది. గౌతమ బుద్ధుడు ఒక మహా సామ్రాజ్యాన్ని వదిలాడు. అన్నీ విడిచి వచ్చాడు. ఆయన జ్ఞానం కొండలు, నదులు దాటుతుంది. సూర్యుని కాంతి ఎంతదూరం ప్రసారమవుతుందో అంతదూరము ఆయనలోని జ్ఞానం ప్రసారమవుతుంది. బుద్ధుని హృదయంలో నీవు నేను అనే బేదబుద్ధి లేదు. ఆకాశం ఎంత విశాలమో, సముద్రం ఎంత లోతుగా ఉంటుందో అటువంటి హృదయం ఆయనది. వివేకానందుడు ఇలా అన్నారు "శంకరులు బాగా చదువుకున్నారు. కాని బుద్ధుని హృదయం శంకరులకు రాలేదు" అన్నారు. కొంతమందికి కొంపలు అంటించే జ్ఞానం ఉంటుంది. అది జ్ఞానం కాదు. ఆత్మజ్ఞానం అఖండమైన జ్ఞానం, అదే నిజమైన జ్ఞానం. కంచి పరమాచార్యులలో





రాగ-ద్వేషాలు లేవు మంచి ఉంటే ప్రోత్సహించేవారు. జ్ఞాన సంపన్నుడు. ఏది ఉండటం వల్ల నీవు ఉన్నావని తెలుస్తున్నదో అదే నీవై ఉన్నావు. అది నీ అనుభవంలో లేదు. మనస్సు, శరీరము, బుద్ధి అవి నీవు కాదు. కాని వాటిని నీవు అనుకొంటున్నావు. అదే అజ్ఞానం. కోరిక నెరవేరినప్పుడు మీ మనస్సు అది ఎక్కడ పుట్టి వచ్చిందో అక్కడికి వెళ్ళిపోతుంది. అప్పుడు లోపల ఉన్న శాంతిని కొంత పీల్చుకుంటుంది. మరల దానిని విడిచిపెట్టి బయటకు వచ్చేస్తుంది. మరలా అశాంతి వచ్చేస్తుంది. మనస్సు సహజంగా, నిర్మలంగా హృదయంలో ఉంటే శాంతి దొరుకుతుంది. మనస్సు ఎక్కడా వాలకుండా ఉండటమే వైరాగ్యము. మనస్సు తన స్వస్థానాన్ని విడిచిపెట్టకుండా ఉండటమే జ్ఞానం. ధనవంతుడు తనకు ధనముంటే పరవాలేదు, నేను ధనవంతుడను ఏ లోటూ రాదు అనుకుంటాడు. అలాగే పండితుడు తనకు పాండిత్యం ఉంది, సంఘం నన్ను ఆదరిస్తుంది అనుకుంటాడు. అలాగే అధికారి. ఇవన్నీ నేనుతో తాదాత్మ్యం పొందడం వల్లనే. కాని ఏ జ్ఞాని నేను జ్ఞానిని అనుకోడు. కారణం అక్కడ "నేను" లేదు కాబట్టి. నీలో ఒక సత్వదార్ఢ్యం లేకపోతే నేను-నేను అనే తలంపే రాదు. ఎంత డబ్బు ఉన్నా తృప్తి లేనప్పుడు వాడికి జ్ఞానం ఏమిటి? జాగ్రదవస్థ పొడుగాటి అబద్ధం. స్వప్నావస్థ పొట్టి అబద్ధం. నటన కోసం కూడా కోపం తెచ్చుకోనివాడు బుద్ధుడు. డివైన్ లైఫ్‌లో అరవింద్ ఆత్మ గురించి ఇలా అన్నారు. "ది ఫ్రీడమ్, ది కామ్, ది బ్లిస్, ది నాలెడ్జ్, ది పవర్, ది పీస్, ది బ్యూటీ" అని. స్వామి వివేకానంద అమెరికా వెళ్ళి వచ్చిన తరువాత కలకత్తాలో సన్మానం చేస్తూ ఉంటే "ఈ కలకత్తాలో జీవించే వాడిని, ఈ దుమ్ములో తిరిగేవాడిని ఎందుకు ఇలా కల్పించుకుంటారు" అన్నారు.

9. ఇప్పుడు "నేను ఫలానా వ్యక్తిని" అనుకుంటున్నావు కదా! దేహం తోటి, మనస్సు తోటి, పరిసరాల తోటి తాదాత్మ్యం పొందే వ్యక్తి ఉన్నాడు కదా! జ్ఞానం రాగానే ఆ వ్యక్తి కనబడకుండా పోతాడు. అదే జ్ఞానం. శరీర సౌందర్యం కంటే గుణ సౌందర్యం గొప్పది. దానికన్నా ఆత్మ సౌందర్యం కోటిరెట్లు గొప్పది. ప్రపంచాన్ని అంతా పరిపాలన చేసే వ్యక్తికన్నా నీకు ఆత్మానుభవం కలిగితే

దానికన్నా ఎన్నోరెట్లు సుఖం కలుగుతుంది. ప్రపంచంలో ఉన్న శాస్త్రాలు అన్నీ మూట కట్టి ఒక ప్రక్కన పెట్టినా జ్ఞాని చూపు ముందు అవి ఎందుకూ కొరగావు. బ్రాహ్మీస్థితి వచ్చిన తరువాత ఆ ఉపాధిని నాలుగు గోడల మధ్య ఉంచడు. కొందరితో ప్రవచనాలను ఏర్పాటు చేయిస్తాడు ఈశ్వరుడు. రజోగుణం ఉన్నప్పుడు మనస్సు బాహ్యాముఖానికి గెంటుకుంటూ పోతుంది. జ్ఞాని మూడు గుణాలు తాను కాదని తెలిసి దేనితోనూ కలవడు. ఉదాహరణకి ఫేన్ ఆఫ్ చేసినా ఒకేసారి ఆగిపోదు. శక్తి లేకపోయినా కొంతసేపు తిరుగుతుంది. అలాగే జ్ఞానికి మూడు గుణాలు వచ్చినా వాటికి శక్తిలేక బంధించకుండా వెళ్ళిపోతాయి. బ్రహ్మానికి పరిమితులు లేవు. చైతన్యం యొక్క అనుభవం ఉంటేనే నేను చెయ్యను, నేను చేస్తాను అనే సంకల్పం ఉండదు. మూడు గుణాలను దాటిన వాడిని నిర్గుణుడు అంటారు. శ్రీరామకృష్ణులు "తెలివి తక్కువ వాళ్ళు అందరికంటే నేనే ఎక్కువ తెలివి తక్కువ వాడిని. అందుకే భగవంతుని మీద పరిపూర్ణ విశ్వాసం కలుగుతున్నది. మీ వలె నాకు తెలివితేటలు ఉంటే భగవంతుని మీద విశ్వాసం కలుగదేమో అంటూ ఈశ్వరచంద్ర విద్యాసాగరునితో "నాగురించి పేపర్‌లో ఏమీ వ్రాయకు. అర్హత ఉన్నవారు వస్తారు" అన్నారు. తరువాత విద్యాసాగరులు మరణిస్తే ఇకనుంచి కలకత్తా ఎవరి గురించి వెళ్ళాలి అన్నారు. ఆయనమీద ఉన్న ప్రేమ అది.

10. ఏసును శిలువ వేయడం చూచిన తల్లి "యహోవా శక్తిని ఇచ్చాడు కాబట్టి నీవు భరిస్తున్నావు అని అంటూ ఉంటే ఏసు అనుకుంటాడు "నేను మరణిస్తే మా అమ్మకు నీడలేదు, ఇల్లులేదు ఎలా బ్రతుకుతుందో" అని బాధపడ్డాడు. మహాత్ములు వారి బాధలను పట్టించుకోకుండా ఇతరుల శ్రేయస్సు గురించి ఆలోచిస్తారు. ఇప్పుడు "తల్లి తండ్రులు ఎప్పుడు చనిపోతారో" అనుకునే రోజుల్లో జీవిస్తున్నాము. సదాచారం లేనివాడు ఆచార్యుడు కాలేడు. అతనికి పాండిత్యం, వివేకం, వైరాగ్యం ఉన్నా సరిపోదు. సాధారణంగా పెద్దలు ఇలా చెప్పబడింది అంటారు. మనం వారి గురించి అనుకోవాలని వారు అనుకోరు. ఎందుచేతనంటే అక్కడ దేహభావన లేదు.





విషయం ప్రధానం. ఎవరు చెబుతున్నారు అనేది ప్రధానం కాదు. స్వార్థ చింతన లేనివాడు ప్రతీవాడు దేవుడే అన్నారు వివేకానంద. 'క్షరం' కంటికి కనిపించేది ప్రతీది నశించేదే. 'అక్షరం' అంటే చాలామంది నశించనిది అంటారు. కానీ శంకరులు దానికి అద్భుతమైన నిర్వచనాన్ని ఇలా చెప్పారు. "అక్షరం అంటే 'మాయ' అది నశించదు. మిమ్మల్ని, మీ సంతానాన్ని పీడించేది 'మాయ'. అది చనిపోదు, ఉంటుంది. నశించే వాటికి, నశించని మాయకు నేను అతీతుడను" అని అర్థం. అందుకే ఆయనను పురుషోత్తముడు అన్నారు. గీతలో పురుషోత్తమ ప్రాప్తి యోగంలో శంకరులు ఈ భాష్యం చెప్పారు. వ్యక్తిగా చూసుకుంటే బుద్ధుడు అంతటి గొప్పవాడు లేడు (పపంచంలో). "పుస్తకాలలో 'గీత' అంతటి గ్రంథం లేదు. లోతైన బుద్ధిగలవాడు వ్యాసుడు" అన్నారు వివేకానంద. శివుడు అంటే జ్ఞానం, శాంతి, మంగళం నిరాడబరం. కాఫీ కప్పులో పోస్తూ ఉంటే ఆ కప్పు నిండిన తరువాత కాఫీ క్రిందికి కారిపోతుంది. జ్ఞాని హృదయంలో నిండిపోయిన శాంతినే మీకు పంచిపెడుతూ ఉంటాడు. మనందరికి తల్లి ఉంది. దేవుడి తల్లి మౌనం. మనో నాశనం కలిగాక వచ్చే మౌనంలో ఆనందం ఉంటుంది.

11. నిష్ప్రపంచ స్థితిని పొందిన జ్ఞానికి కీర్తికాంక్ష ఏమిటి? "బ్రహ్మంను తెలుసుకున్నవాడు బ్రహ్మమే అవుతాడు" అని ఉపనిషత్తులు చెపుతున్నాయి. కృష్ణుడు "జ్ఞాని నా స్వరూపాన్ని పొందుతాడు" అన్నాడు. ఇక్కడ బేధం ఉంది. కృష్ణునికి ఉన్న శక్తిని జ్ఞాని పొందలేడు. నా స్వరూపాన్ని పొందుతాడు అన్నాడు కాని నేనైపోతానని చెప్పలేదు. కాని ఆనందంలో సమానమే. బుద్ధునితో మాట్లాడకుండా, ఆయన రచనలు చదవకుండా, ఆయనతో స్నేహం చేయకుండా కేవలం ఆయన ముఖం చూసి కొన్ని వందలమంది ఆత్మానుభవం పొందారు. గాంధీజీ "ప్రపంచంలో నన్ను ఎవ్వరూ ఇంతవరకు అవమానం చేయలేకపోయారు కారణం అవమానాన్ని నేను అంగీకరిస్తే కదా!" అన్నారు. మనం ఇతరులను ద్వేషిస్తూ ఉంటే మనం విషం త్రాగుతున్నామని మనకు తెలియడం లేదు. ద్వేషం విషంతో సమానం.

ఐన్‌స్టీన్ "ఎవ్విరిథింగ్ హేపెన్స్ ఇన్ ఇట్స్ ఓన్ టైమ్" అన్నారు. సద్వస్తువు శాంతిసాగరం, ఆనందసాగరం. అవతారపురుషులు అందరూ అందులో నుండి వచ్చిన కెరటాలే. అవతారపురుషులు కన్నీరుపెట్టుకున్నారంటే ఆ టైంలో శరీరం అలా రియాక్ట్ అవుతుంది. అది పంచభూత లక్షణం. ఏసు "ఉన్న వస్తువు ఏదైతే ఉందో అదే నేను" అన్నాడు. అంతేకాని యహోవా నేను అనలేదు.

12. రామకృష్ణుడు "మీలాగే నాకు శరీరం ఉందని, మనస్సు ఉందని నన్ను మీ బుద్ధికి అంటగడతారా? ఈ నోరు ఒక్కటే కాదు ప్రపంచంలో నోళ్ళు అన్నీ నావే. అంటే ఆయన యూనివర్శల్ అని అర్థం. కవులు, ఆరేటర్సు విషయాన్ని మేకప్ చేసి చెపుతారు. ఆయన యదార్థంగానే చెప్పేవారు. మీకు చెయ్యి ఎక్కడ పెడితే అక్కడ నీళ్ళు దొరుకుతుంటే నదితో పని ఏముంది? జ్ఞానికి అంతటా ఆనందం కలుగుతుంది. సుఖాలకోసం, భోగాలకోసం బయట ఎందుకు వెతుకుతాడు? మీకు అమృతనాడి తెరచుకుంటే సముద్రంలో ఎంత నీరు ఉందో అంత ఆనందం, శాంతి వస్తుంది. దేనితోను పనిలేదు. ఈ ప్రపంచంలో దేవునితో, శరీరంతో పని ఏముంది? ఇవి ఒట్టి మాటలు కావు. మీకు అనుభవం అవుతుంది. ఏనుగు మీద కూర్చున్న వానికి గాడిద మీద కూర్చోవాలని ఉంటుందా? వారాలు, తిథులు పనిలేదు. నేను బాలగంగాధర్ తిలక్‌గారి ఇంటికి వెళితే అక్కడ గోడ మీద ఇలా వ్రాసి ఉంది "ఆకాశం వచ్చి నా నెత్తిమీద పడిపోయినా నా పని నేను మానను" అలాగే నా మాటలలో చెప్పే పని నేను మానను" అన్నారు. ఏసు కొండమీద చెప్పినవి "టెన్ కమేండ్‌మెంట్స్" అంటారు. రామకృష్ణుడు "భగవంతుడు ఒక్కడే ఉన్నాడు మనం లేము అని తెలుసు కోవడమే జ్ఞానం" అన్నారు. "మేన్ ఈజ్ మోర్టల్ - జ్ఞాని ఇమ్మోర్టల్" నాగార్జునా చార్యుడు కెమిస్ట్రీలో పెద్దవాడు. మహాయానం తీసుకొచ్చినది ఆయనే. హీనాయానం అంటే నేను తరిస్తే సరిపోతుంది అనుకోవడం. ఆత్మానుభవం పొందినవాడికి ఏ ఆకర్షణ ఉండదు. ఆత్మానుభవం పొందినవాడికి





పంచభూతాలతో నిండిన ఈ ప్రపంచం కాకి రెట్టలా ఉంటుంది. వారికి రాత్రి, పగలు, స్వప్నాలు, నిద్రలు ఉండవు. ఎరుక ఒక్కటే మిగులుతుంది. రామ కార్యాన్ని మరచిన సుగ్రీవునికి బుద్ధి చెప్పడానికి ఆంజనేయులు లక్ష్మణుని మాటలు విని ఆందోళనతో 'తార'ను శాంతింపచేయమనగా ఆమె అంది "మాకు కృతజ్ఞత ఉంది. మరచిపోయాము. అసలే కోతులము, చంచలం లేకుండా ఎలా ఉండ గలము? రఘు కుల వంశంలో క్షమా గుణం ఉంది. మమ్మల్ని క్షమించ"మని అనగా ఆశ్చర్యపోయారు. కృష్ణుడితో సమానంగా చెప్పగల జ్ఞాని తార. అలాగే మండోదరి, సుమిత్ర కూడా. వారిని ప్రాతఃకాలం తలచుకోవచ్చు (స్మరింప దగ్గవారు). రాముడు రాజు సామాన్యులు సమీపించడానికి సాహసించలేరు. కృష్ణుడు అందుబాటులో ఉన్న దేవుడు. గోవులను కాసాడు. మనం నవ్వితే నవ్వుతాడు, మనం ఏడిస్తే బాధపడతాడు.

13. రామకృష్ణుడు "నీలో పాడు చేసే బలహీనతలు అనే గుణాలు నీవు తీసుకోలేకపోతే నీ భక్తి నిజం అయితే నీ అవగుణాలను నేను నాకేస్తాను" అన్నారు. ఈ మాట చెప్పడానికి ఎంత ధైర్యం, ఆత్మవిశ్వాసం ఉండాలి. బుద్ధుని ముఖంలో ఎప్పుడూ చిరునవ్వు చూడలేదు. కారణం ఈ లోకంలో ఆశ్చర్య పడేది సంతోషించేది ఏముంది అని ఆయన భావన. బైబిల్‌లో "అయామ్ దట్ అయామ్" "ఉన్నాను. ఆ ఉన్నదేదో నేనై ఉన్నాను". నేను నేను అనే నేను ఎవడను అని ప్రశ్నించుకోవాలి. నేను అసలు లేను. లేదు అని తెలుసుకోవడమే ఈ ప్రశ్నకు అర్థం. నేను ఎవడను అనే దానికన్నా ఇది తేలిక. జ్ఞాని అన్ని పరిస్థితులలోను, అన్ని చోట్ల స్థిరంగా ఉంటాడు. శంకరులు ఈ కనిపించేది అంతా స్వప్నమని ఎందుకు చెప్పారంటే "స్వప్నంలో పాము కనిపిస్తే మెలకువ వస్తుంది. అజ్ఞాన నిద్రలో ఉన్న నీకు 'బోధ అవసరం'" అన్నారు. మనం చిన్న మొక్క నాటితే మొదట ఆకులు, రొబ్బలు, చివరకు పండు వస్తుంది. అలాగే మనం చేసే యజ్ఞాలు, యాగాలు, కర్మలు అన్నీ ఆకులు, రొబ్బలు. ఆత్మజ్ఞానం పండు వంటిది. మన లక్ష్యం ఆత్మజ్ఞానం

పొందడం. గీతను జ్ఞాన యోగమని ఒకరు వర్ణీకరిస్తే శంకరులు అభ్యాస యోగమన్నారు. సాక్షాత్తు ఉన్న దానిని పొందితే వానిని సాక్షాత్కారం పొందిన వాడు అంటారు. మీరా దగ్గరకు ఒక దుర్మార్గుడు వచ్చి "మీ శరీరాన్ని ఎంజాయ్ చెయ్యాలని ఉంది" అన్నాడు. అప్పుడు మీరా అంది "దానిదేముంది నీ కూడా వంద మందిని తీసుకొచ్చి ఎంజాయ్ చెయ్యి" అంది. దానికి అతను తలదించుకొని వెళ్లిపోయాడు. దేహబుద్ధి ఉన్నవాళ్ళు అందరూ స్త్రీలే.

## 3. మనస్సు – అహంకారము

1. కఠినంగా మాట అన్నవాడు పిశాచంగా ఉంటాడు. సహజంగా ఉన్నవాడు దేవుడు అవుతాడు. మనం తక్కువ మాట్లాడటం వల్ల మాయ తగ్గుతుంది. ఎక్కువ మాట్లాడితే మాయ పెరుగుతుంది. ఎంతవరకు మాట్లాడాలో అంతవరకే మాట్లాడాలి. తక్కువ మాట్లాడితే తక్కువ శక్తి ఖర్చు అవుతుంది. తత్త్వం తెలిసేవరకు నీవు విషయ సుఖాలకు దూరంగా ఉన్నా బుద్ధిలో ఉన్న సంస్కారాల వల్ల వాటిలో ఉండే రుచి నీకు పోదు. పుష్పంలో ఉన్న సువాసన గాలి మోసుకుపోతుంది. నీలో ఉన్న సంస్కారాలను జీవుడు మోసుకుపోతుంది. మీ దేహంలో ఉన్న ఎముకలు, రక్త మాంసాలు వగైరా అన్నీ నా దేహంలోనూ ఉన్నాయి. అయితే మీ దేహమంటే మీకు ఎందుకు అంత ఇష్టం అంటే అహంకారం, మమకారం వల్ల. అహంభావన వెనకాలే ఆత్మ ఉంది. అహంకారం వెనుకకు చూడలేకపోతుంది. వెనక్కి చూడగలిగితే ఆత్మానుభవం కలుగుతుంది. మన అహంకారాన్ని ఎలా పోగొట్టుకోవాలి? అనే ప్రయత్నంలోనే అహంకారంతో పేచీ పెట్టుకుంటున్నాము. "కర్తురాజ్ఞాయ" అనేది ఒక్కటే గుర్తు పెట్టుకోండి. అంటే కర్త అయిన ఈశ్వరుని యొక్క ఆజ్ఞ వల్లనే కర్మ ఫలిస్తుంది. అది ఒక్కటే జీవితానికి సరిపోతుంది. అది గుర్తు పెట్టుకుంటే మనస్సు శాంతిస్తుంది. పూర్వ జన్మలో చెడు కర్మలు చేసినవారు భగవంతుడిని నమ్మరు. సైతాన్‌ని నమ్ముతారు. వారి చెడు కర్మలు భగవంతుడిని నమ్మ నివ్వవు. మనస్సు బాహ్యముఖానికి వస్తే అంతా దుమ్ము. అది విషయాలను, వస్తువులను





చూస్తూ ఉంటే చివరకు మిగిలేది దుమ్ము. చిన్న మర్రి విత్తనం నుండి పెద్ద వృక్షం ఎలా వ్యాప్తి చెందినదో దేహం నేను అనే భావన అనేక వేల జన్మలను తీసుకొస్తుంది. శతృత్వం వలననే వేలాది జన్మలు సంక్రమిస్తాయి. మాయ నిన్ను ఆడిస్తున్నది. ఈశ్వరుని చేతిలో మాయ బంధీగా ఉన్నది. ఆయనని మాయ ఆడించలేదు. అందుకే ఈశ్వరుని శరణాగతి పొందితే మాయ మనకి దారి ఇస్తుంది. మీరు చిన్న విషపదార్థం తిన్నా చిన్నదే కదా అని అనుకున్నా అది కాసేపటికి కళ్ళు తిరగడం, పొట్ట ఉబ్బడం వంటి ఎన్నో వికార లక్షణాలు మీకు సంక్రమిస్తాయి. అలాగే దేహం నేను అనే చిన్న తలంపులో నుండి (మాయ) వికార లక్షణాలు అన్నీ వచ్చేస్తాయి. మాయనంతా దేహం నేను అనే తలంపులో పెట్టాడు. ఇప్పుడు నేను ఉన్నాను. మరణించిన తరువాత ఉండను అనుకోవచ్చును. కారణం దేహం నేను అనే తలంపు అంతే ఆ తలంపు జీవితంలో అనేక చెడ్డలను తీసుకొస్తుంది.

2. మీకు అనేకమంది స్నేహితులు చుట్టాలు ఉన్నారు, పాఠాలు చెప్పే గురువులు ఉన్నారు. మీకు అర్థబలం, అంగబలం ఉన్నా మీ ఇంద్రియాలు, మనస్సు తీసుకొని వచ్చే సుఖాల వల్ల మీరు సుఖపడే అవకాశం లేదు. నీవు నీ మనస్సుని నియమించుకోవడం వల్ల అది చేసే ఉపకారం, సుఖం ఎవరూ తీసుకొని రాలేరు. ప్రాణంలేని శవానికి దాహంలేదు, అన్నం అక్కర్లేదు. మనస్సు లేనివారికి బెంగలేదు. అహంభావన నశించినప్పుడు మనస్సు, శరీరము దూది వలె తేలికగా ఉంటుంది. అహంకారం అనే దీపం ఆరిపోయే వరకు నిర్వాణసుఖం రాదు. బుద్ధుడు అంగళీమాలకుడితో అంటాడు "ఎంతోమందిని చంపావు, నీ అహంకారాన్ని చంపుకోలేదు". అంగుళీమాలుడు బుద్ధుని శిష్యుడై మరణించగా కొందరు బుద్ధునితో "అతను స్వర్గానికి వెళ్ళాడా? లేక నరకానికి వెళ్ళాడా?" అని అడిగితే "రెండూ కాదు అతడు నిర్వాణ సుఖాన్ని పొందాడు" అన్నాడు బుద్ధుడు. అది గురువు యొక్క వైభవం. బహుజన్మల నుండి వాసనలు బహుజన్మల కృషి వలన గాని పోవు. విషయాలలో ఉన్న వెలితి నీకు తెలిసి ఉండాలి. విషం అంతా రాగద్వేషాలలో

ఉంది. నీవు కాని శరీరంతో, మనస్సుతో, ఇంద్రియాలతో, కులంతో, దేశంతో నీవు తాదాత్మ్యం పొందితే నీకు మిగిలేది దుఃఖము, అశాంతి. నేను-నాది అనేవి ముల్లులు. గడ్డిపరకకైనా విలువ ఉంది కాని వాటికి విలువ లేదు. మనం ఆ రెండింటిని బంగారు కడ్డీల వలె చూసుకుంటున్నాము. ఈ రెంటి నుండి విడుదల పొందేవరకు బ్రహ్మానుభవం కలగదు. మనిషి తనకు తాను ఎందుకు పొగుడుకుంటాడు. అంటే ఎదుటి వాడి దృష్టిలో తను గొప్పగా ఉండాలి. వాడు జీరో అయినా గొప్పవాడిని అనుకుంటాడు. వాడిలోని వెలితిని కప్పిపుచ్చుకోవడానికి, అదే మిథ్యావాదం అని వాడికి తెలియదు. మిమ్మల్ని ఎవరైనా మీరు చాలా మంచివారు అన్నా అది మాయే. మంచి చెడు మాయలోనే ఉన్నాయి. అవి గమ్యం కాదు.

3. అజ్ఞాని ఎంత జాగ్రత్తగా ఉన్నా అతని నోటినుండి అనవసరపు మాటలు వస్తాయి. అహంభావన ఇది అని తెలుసుకోవడానికి కొన్నివేల జన్మలు పడుతుంది. ఒక మనిషి దుర్మార్గంలో ఉండి పూజ చేసినా, జపం చేసినా సత్యం తెలియబడదు. ఎందుకంటే సన్మార్గంలో ఉండి సాధన చేస్తూ ఉన్న వారికే సత్యం దొరకడం లేదు. దుర్మార్గ వాసనలలో ఉన్న వారికి ఏం తెలుస్తుంది? అసూయ, భయం సంసార లక్షణాలు. నేను ఒకడను ఉన్నాను అనుకుంటే నీకు ఆత్మజ్ఞానం కలుగదు. కోపము, భయము శారీరక, మానసిక ఆరోగ్యములు చెడగొడతాయి. నేను అనే తలంపు పెద్దది అయితే మనస్సు అవుతుంది. అహంకారమే సమస్యలను సృష్టిస్తుంది. కుటుంబ సభ్యుల ఫీలింగ్ వల్ల సమస్యలు వస్తాయి. దుఃఖ కారణం బయటలేదు. కర్తృత్వం వల్లనే దుఃఖం వస్తుంది. జీవితంలో నేర్చుకునే పాఠాలు ఎక్కువే. నీరు ఉంటే బుడగలు వస్తాయి. అలాగే నేను అనే సరికి తలంపులు వస్తాయి. మాయ కొలతలు వేస్తుంది. బ్రహ్మానికి కొలతలు తెలియవు. ఇష్టాలు అయిష్టాలు పెరిగితే ధర్మాన్ని ఆచరించే బుద్ధి పోతుంది. సద్బుద్ధి తగ్గిపోతుంది. మీ ఇంటి వద్ద మీ పనులు మీరు చేసుకోండి. మిగిలిన కాలాన్ని భగవంతుని పాదాలను ఆశ్రయించి జీవించండి. ఆసక్తి అహంభావాన్ని పెంచుతుంది.





సంఘ రాహిత్యంగా జీవించండి. అసత్యమైన 'నేను'ను విడిచిపెట్టడమే సాధన. పొంగిపోవడం, కృంగిపోవడం అసత్యం. ఆ సంగతి తెలియక మీ మైండ్‌ని బేలన్స్ చేసుకోలేకపోతున్నారు. పట్టుపురుగు తాను అల్లుకున్న గూటిలో తానే బంధించబడి చనిపోతుంది. అలాగే మనం కోరుకునేది మంచో, చెడో తెలియక వెర్రికోరికలతో అశాంతితో ఉంటున్నాము. బంగారు లేడి ఉండదు. బంగారు లేడి ఉండదని సీతకు తెలుసు. ఆ సమయంలో బుద్ధి భ్రమించింది. అదే మాయ. మనం కూడా భగవంతుని మాటను అతిక్రమిస్తే రాక్షసుల చేతిలో పడతాము. పాడు లోకాలకు వెళతాము. దానినే లక్ష్మణరేఖ అంటారు.

4. గుణాలు తాళ్ళు. అవి మనల్ని సత్యం వైపుకి వెళ్ళనివ్వవు. అవే బంధిస్తాయి. రైలు దాటిపోతూ ఉంటే పరిగెత్తుకొని ఎలా పట్టుకుంటామో రజోగుణంలో ఉన్నవాడు తన పొరపాట్లను సరిచేసుకోకుండా ఇతరులను విమర్శించడానికి హడావిడి పడిపోతాడు. తల్లికి కూతురు మీద ప్రేమ ఉంటుంది. పెద్ద అయిన తరువాత తనను చూస్తుందనే భావంతో అలా ఉంటుంది. కానీ ఈశ్వర ప్రేమలో అటువంటిది ఏమీ ఉండదు. అది ఉన్నతమైనది. నేను అనే రెండు అక్షరాలలోనే ఎంతో విషం ఉంది. మహిమలు, భోగాలు, వరాలకోసం మనస్సు ఉత్సాహం చూపుతుంది. అలా ఉండకుండా అది ఉండలేదు. బంగారం చూచినవాడు దాని నాణ్యతను జాగ్రత్తగా చూసి, తూకం వేసి రేటు చెబుతాడు. అలాగే ఆధ్యాత్మికంగా చెప్పాలంటే బంగారంలాంటి మాటను భగవాన్ చెప్పారు. "అహంకారం ఉంటే అంతా ఉంది. అహంకారమే కోరిక, పుట్టుక, చావు. అహంకారం నిజాన్ని అబద్ధంగాను, అబద్ధాన్ని నిజంగాను కనిపింపచేస్తుంది" అన్నారు. దుఃఖం అసత్యం వల్ల వస్తుంది. అహంకారం నుంచి "అధ్యాస" (అంటే సత్యం అసత్యంగాను, అసత్యం సత్యంగాను కనిపింపచేసేది) దాని తరువాతే దుఃఖం వస్తుంది. అహంకారానికి ఆవరణ ఉంటుంది. (అంటే బంధువులు, స్నేహితులు అని గోడ కట్టుకోవడం) అదే గొయ్యి, నుయ్యి ఈశ్వరుని

అనుగ్రహం లేకపోతే అందులోనుండి విడుదల పొందలేము. మీసాలు, గెడ్డాలు పెంచుకోవడం తేలికేకాని అజ్ఞానమనే ఆ గొయ్యిలోనుండి బయట పడడం అంత తేలిక కాదు. శాస్త్రప్రమాణం మీ మీద లేదు, సమాజ ప్రభావం మీ మీద పడుతూ ఉంటే అది నిజమనుకుంటే నీవు అవివేకి. ఏదైతే మరచి పోవాలి అనుకుంటున్నావో అదే గుర్తుకు వస్తున్నాయి అంటే అదే మాయ. ప్రతీ నామ-రూప ఆకర్షణ చివరకు దుఃఖాన్ని తీసుకొని వస్తుంది. ఇతరులు మనలను గౌరవించాలనే ఆలోచన రావడం అంటే లోపల వెలితి ఉండబట్టే స్తుంది. మనం సుఖంగా ఉండడానికి ఇతరులు కారణం ఏమిటి?

5. ఇష్ట-అయిష్టాలు వచ్చాక తెలివి తేటల విలువ లేదు. కీర్తి కాంక్ష కూడా స్వార్థమే. స్వార్థపరుడికి సత్యం తెలియబడదు. దేహానికి వచ్చే రోగాలు భరించగలం కానీ, మనస్సుకి వచ్చిన రోగాలు భరించడం చాలా కష్టం. దుర్మార్గం - చెడ్డ అంతా మనస్సు వల్లనే చిన్న గొడవలను కూడా అది పెద్ద గొడవగా చేసేస్తుంది. జప, ధ్యానాల వల్ల మనస్సుకు నిగ్రహం కలుగుతుంది. మనస్సే దుమ్ము. దానికి మరలా ఇతర గొడవలు కలుగజేసుకొని మరింత దుమ్ము పులుముకోకుండా చూసుకోవాలి. ఇష్ట అయిష్టాలు తగ్గిపోతే మనస్సు చాపల్యం తగ్గిపోతుంది. జీవలక్షణం గుర్తింపు కోరుకుంటుంది. ఎన్నికల్లో నిలబడేవాడు గుర్తింపు కోరుకుంటాడు. సాధనకు గుర్తింపులు ఎందుకు? ఏమి చేసుకుంటాడు. అహంకార, మమకారాల వల్లనే దేహాభిమానం కలుగుతుంది. దేహాభిమానం నశించకుండా ముక్తిలేదు. నిరంతరం మార్పు చెందేదే సంసారం. శరీరం నిజంకాదు. ఆలోచనలు మారుతూ ఉంటాయి. వాటి మీద దృష్టి పెట్టుకోకూడదు. లౌకికుడు పనిని కర్తవ్యంగా చేస్తాడు. ఆ పనినే భక్తుడు పూజగా చేస్తాడు. లౌకికుడు ప్రజలను పీడించి సంపాదించినది డబ్బు కాదు రక్తం. ఇష్టఅయిష్టాలు లేకపోతే బాధలు ఈ నిమిషంలో తగ్గిపోతాయి. దేహాభిమానం ఉన్నవాడు ఎవడూ స్వతంత్రుడు కాడు. ఇష్ట-అయిష్టాలకు మించిన బాధ ప్రపంచంలో మరియొకటి లేదు. మనస్సు కల్పితం. కాని మనస్సు పుట్టినచోటు కల్పితం కాదు. మీ అమ్మాయిని





మీరు ఎంతో ప్రేమిస్తారు. ఒక్కో సందర్భంలో మీ అమ్మాయి అహంకారం లోంచి వచ్చిన కోపానికి మీలో ఉన్న అహంకారం బాధగా మారిపోతుంది. కోపం పట్టుకుంది మీ అహంకారం దానితో మీకు బాధపట్టుకొచ్చింది. మీ అమ్మాయి మీకు ఫోన్ చెయ్యకపోతే తండ్రిగా తన గురించి ఎంత కష్టపడ్డాను అని మీ అహంకారం పెరుగుతుంది. ఒకవేళ మీ అమ్మాయి ఫోన్ చేస్తే మీరు మాట్లాడటం మొదలుపెడితే మీ అమ్మాయి "ముందు ఫోను అమ్మకి ఇవ్వండి" అంటే మీ అహంకారం పెరిగి ఎంత కష్టపడి చదివించాను నా మాటకు విలువ లేదు దానికి ఎంత కోపమో అని బాధకు గురి అవుతారు. ఇది అంతా అహంకారం అనే విలాసం. అది స్వప్నమనే ఎరుక మీకు వస్తే దుఃఖం రాదు. "నేను" అనే అహంకారం విజృంభిస్తుంటే నీ పాదాన్ని దాని మీద పెట్టి అణగదొక్కాలి. అది సాధకుడి లక్షణం. అహంకారంతో మీరు కలిసిపోకూడదు.

6. మనం ఎన్ని శవాలను మోసామో శరీరం నేను అనే తలంపు ఎన్ని శవాలను మోయిస్తుందో! మనస్సు నశిస్తే మాట నశిస్తుంది, దృశ్యము నశిస్తుంది. మనం నేను-నేను అంటూ ఉంటాము. అది అజ్ఞానంలోంచి వచ్చిన 'పిలక'. దాన్ని మోసుకొని తిరుగుతున్నాము. దుంపలోనుండి పిలక వస్తుంది. ఎవరి మనస్సు వారికే శిక్ష. "ఇగో" మేటర్ లేకుండా ఉండలేదు. అజ్ఞాని జాగ్రదవస్థ మాత్రమే నిజం అనుకుంటాడు. జ్ఞాని మూడు అవస్థలు అబద్ధమని వాటిలో ఉండేది జీవుడని గ్రహిస్తాడు. అజ్ఞానికి శాస్త్రప్రమాణం కాదు. జాగ్రదావస్థే అతనికి ప్రమాణం. శక్తికి మించి పనులు చెయ్యకూడదు. శక్తివంతునితో విరోధం పెట్టుకోకూడదు. ఒక టైం వస్తుంది. అంతవరకు ఓర్పుగా ఉండాలి. మయ సభను చూచిన దుర్యోధనునికి పాండవుల మీద అసూయ కలిగింది. నాశనం చెయ్యాలి అని అనుకోలేదు. నీళ్ళు ఉన్నాయని దుర్యోధనుడు తన పంచెను పైకెత్తితే ద్రౌపది నవ్వింది. దాన్ని పరాభవంగా భావించి వాళ్ళను నాశనం చేయాలనేబుద్ధి కలిగింది. తరువాత ద్రౌపదికి వివేకం కలిగి "ఎందుకు నవ్వానా! ఆయన రారాజు" అని

పశ్చాత్తాపం పడింది. అది కృష్ణుని మాయ. ఆ మాయ కమ్మి నవ్వించింది కృష్ణుని పన్నాగం. అలాగే నారదుడు ఒక చెట్టు వద్దకు వచ్చి "నీవు బలవంతుడవు ఆకులు, కాయలతో అలరారుతున్నావు" అనగా ఆ వృక్షానికి గర్వం కలిగి "అవును. నన్ను ఎవరూ ఏమీ చేయలేరు. వాయు దేవుడు కూడా ఏమీ చెయ్యలేడు" అన్నది. అప్పడు వాయుదేవుడు వచ్చి "రేపు వస్తాను. చూద్దాము" అనగా చెట్టుకు భయం కలిగి ఆకులు, కాయలు రాల్చుకుని మోడుబారిపోగా వాయుదేవుడు వచ్చి "ఏమిటి? ఇలా అయ్యావు" అనగా "నాకన్నా నీవు బలవంతుడవు. నీ దెబ్బకు నేలకు ఒరిగిపోగలను" అన్నది. దాని అర్థం బలవంతునితో విరోధం పనికిరాదు. శ్రీకృష్ణుడు "మీకు పొగడ్త వద్దు, విమర్శ వద్దు. మీ పని ఏదో మీరు చేసుకోండి" అన్నాడు.

7. మనస్సు విజృంభిస్తే రాక్షసుడు చేసే పనులు చేయిస్తుంది. పరిస్థితులు మనకు అనుకూలంగా ఉంటే అది భగవంతుని అనుగ్రహమే. కాని మన తెలివి తేటల వల్లే సఫలత సాధించాము అని గర్వంగా అనుకుంటే అదే అహంకారం. కర్మ మార్గం మంచిదే కాని మనం అంతఃకరణ శుద్ధిని గ్రహించాలి. లేని దానికి కాలంతోను, కర్మతోను సంబంధం ఉంటుంది. ఆత్మకు వీటితో సంబంధం లేదు. మనస్సు అనే దానిని మాయతో తయారు చేసారు. ఉన్న వస్తువు ఉన్నట్లుగా కనబడకపోవడం వల్లనే అనేక రకాలుగా కనబడి "మాయ" ప్రారంభమవుతుంది. కామం, క్రోధం వేరు భావన వల్ల వస్తుంది. వేరుబుద్ధి 'మాయ' అహంకారం లేని వానికి కర్మలతో పనిలేదు. మన మనస్సు పరిపరివిధాలుగా ఎందుకు పరుగెడుతుంది? లోపల ఉన్న ఆనందం దొరకక. మమకారం డిపెండెంటుగా ఉంటుంది. ప్రేమ డిపెండెంటుగా ఉండదు. కుటుంబ సభ్యుల ప్రేమ మమకారం. మీ ప్రేమను కులానికో, మతానికో, జాతికో పరిమితం చెయ్యకండి. సూది దారం చేసి పనిచెయ్యదు. మనస్సు సూది లాంటిది. ఐక్యత దానికి ఇష్టం ఉండదు. జ్ఞాని ఏ ప్రాంతానికి వెళ్ళినా స్వతంత్రంగా ఉంటాడు. మనస్సు లేని వానికి జన్మలు లేవు. చూపు లేని వానికి దృశ్యం లేదు. శ్రీకృష్ణుడు "మాయ నాది





నా మాయను నన్ను ఆశ్రయించకుండా ఎలా జయించగలరు?" అన్నాడు. విమర్శలకు కారణం అసూయ. రజోగుణం ఉన్నవాడు సంపాదిస్తాడు కాని లోభిత్వం ఉంటుంది. సత్త్వగుణం ఉన్నవాడు జ్ఞానం సంపాదించాలనే కాంక్షతో ఉంటాడు. అహంకారం వల్ల అపకారం ఎక్కువగా ఉంటుంది. వినయం వల్ల ఉపకారం వచ్చి చేరుతుంది. సంపాదించడం ఒక పనే, దానిని మరొకరు తగలేయడం కూడా పనే. రామకృష్ణులు "నేను-నేను అంటే నాకు సిగ్గు వస్తున్నది పెంట అంతా అందులోనే వుంది" అని అన్నారు. చెఱకుగెడలో రసం తీసేస్తే పిప్పి ఎలా ఉంటుందో బ్రహ్మానుభవం పొందితే ఈ లోకంలో ఉన్న రూపాలు అన్నీ అలా కనిపిస్తాయి. నామరూపాలు 'మాయ' ఆడుకునే ఆట మాత్రమే. మాయ ఎలా ఉంటుంది అంటే ఈ మాయను వదిలించుకొన్నాము అంటే ఆ మాయే మరో రూపంలో వ్యక్తమవుతుంది. ఆ గోతుల్లోంచి బయటకు రాలేము. దానికి ఈశ్వరుని దయ కావాలి.

8. దేహం నేను అని అభిమానపడే వాడే జీవుడు. మన మనస్సు ఊహించిన ఊహే అహంకారం. వాసన తెచ్చిపెట్టుకోవడం తేలిక పోగొట్టుకోవడం కష్టం. పండితులు, ధనవంతులు 'ఎ' క్లాస్ జైలులో ఉన్నవాళ్ళు. చదువు లేనివాళ్ళు 'బి' క్లాస్ జైలులో ఉన్నవాళ్ళు. ఇద్దరికీ జైలే. 'ఎ' క్లాస్ జైలు వాళ్ళకి దోమతెరలు ఉదయం ఇడ్లీ, కాఫీ ఇస్తారు. 'బి' క్లాస్ జైలులో ఉన్నవారికి గంజి కూడు. ఎవరి మనో పరిధిలో వాళ్ళు బాధపడతారు. జ్ఞాని స్వేచ్ఛాజీవి. మీ గురించి ఇతరులు ఏమనుకుంటున్నారు అనేది అహంకారం. మిమ్మల్ని పొగిడినా, విమర్శించినా మీ గురించి మీరు వివేకంగా అంచనా వేసుకోవడం ముఖ్యం. తలంపే బేధాన్ని సృష్టిస్తుంది. జగత్తు, జీవుడు, ఈశ్వరుడు ఒక ముద్ద అయితే కాని భయం పోదు. మనస్సు ఉంటేనే కష్టం వస్తుంది. మనస్సు లేకపోతే రాత్రి లేదు, పగలు లేదు. నీకు నిద్రలో ఏదీ లేదు. మనస్సు రూపాన్ని పట్టుకుంటుంది, అరూపన్ని పట్టుకోలేదు. మమకారం కూడా ఫీలింగే. గుర్రాన్ని నీటి దగ్గరకు తీసుకొని వెళ్ళి నీళ్ళు త్రాగమంటాము. అది త్రాగకపోతే మనం ఏమీ చెయ్యలేము. కొందరిని

సుఖపెడదామన్నా వారి బుద్ధి సరిగా లేకపోతే వారు సుఖపడరు. వారి బుద్ధి సుఖపడనియ్యదు. శరీరం చేసేదానికన్నా మనస్సు చేసే పని వల్లనే ఎక్కువ అపకారం జరుగుతుంది. చిన్న విత్తనంలోంచి కొమ్మలు, రెమ్మలు, ఆకులు, కాండం ఎలా వచ్చి పెద్ద వృక్షం అవుతుందో, అలాగే కామ వాసన లోంచి కోపం, అసూయ, ద్వేషం, ఇలా పెద్ద మనస్సు వచ్చేస్తుంది. మనస్సు అనేక కల్పనలు చేస్తుంది. నీవు ఏదిగా ఉన్నావో దాని తాలూకు బుద్ధిని నీకు కల్పించనివ్వదు. అదే మాయ. మన అభివృద్ధిని ఇతరులు ఆపేస్తున్నారు అనుకుంటాము. అదే మాయ. మనలో సూక్ష్మ శరీరం ఉంది. అది మన కళ్ళకు కనబడదు. అది ఒంటరిగా ఉండదు. ఇంద్రియాలను జతవేసుకొని ఇష్టాలను, అయిష్టాలను తీర్చుకుంటుంది. ఒకరికి ఉపకారం చేస్తుంది, ఒకరికి అపకారం చేస్తుంది. ఎంతసేపూ కోలాటం ఉండాలి. ఏవో గొడవలు వేసుకొని తిరుగుతుంది. మీరు పాట బాగా పాడారు అంటే లోపలికి తీసుకుంటుంది. మంచి పనులు చెయ్యండి, నా జోలికి రాకండి అని చెబుతుంది. నిప్పు ఈ సూక్ష్మశరీరాన్ని స్మశానంలో కాల్చదు. ఆత్మజ్ఞానమే కాలుస్తుంది. మనకి అనుకూలంగా ఉన్న వారిని మంచి వారిగాను, మనకు వ్యతిరేకంగా ఉన్నవారిని చెడ్డవారిగాను అనుకుంటాము. దానికి కారణం స్వార్థం, వ్యక్తిభావన పూసలదండలో పూసలు అన్నింటికి లోపల దారం ఆధారంగా ఉంది. అలాగే మనకు వచ్చే తలంపులకు ఆలోచనలకు అన్నింటికి ఆధారంగా ఉన్నది దేహం నేను అనే తలంపు.

9. ఈ మనస్సు గొడవ ఏమిటి? పడలేకపోతున్నాము అంటారు. మనస్సు అనేది లేనేలేదు. అది ఒక భ్రాంతి. ఉన్నది ఒక్కటే. నీకు కోరికలు ఎక్కువగా వస్తుంటే నీ మనస్సు కుదురుగా లేదని అర్థం. నీకు కోరికలు పెరుగుతూ ఉంటే దేహభావన పెరిగిపోతుంది. అశాంతి విడిచిపెట్టదు. మనస్సును నియమించుకోవడం వల్ల గొప్పతనం వస్తుంది. మనస్సులో శాంతి ఉంటే మాటలో శాంతి వస్తుంది. మాటలో శాంతి ఉంటే చేతలో శాంతి ఉంటుంది. నాకు విరోధులు ఉన్నారు అని మనస్సు అంటుంది.





దానిని అధిగమిస్తే విరోధులు లేరు. ఉన్నా ఇబ్బంది లేదు. మనం చెప్పులు వేసుకొని వెళితే రోడ్డుమీద ముళ్ళు ఉన్నా ఇబ్బంది లేదు. మనస్సును జయిస్తే విరోధులు ఉన్నా ఇబ్బంది లేదు. ఇది అంతా మీ మనస్సును జయించడానికి భగవంతుడు చేసే పన్నాగం. ప్రపంచంలో ఎక్కడా ఏదీ లేదని అర్థం అయితే మనస్సుకు లోచూపు కలుగుతుంది. అప్పుడు ఆత్మజ్ఞానం కలుగుతుంది. కొంతమందికి పాండిత్యం ఉంటుంది. శబ్ధం యొక్క అర్థం తెలుస్తూ ఉంటుంది. కాని ఆ శబ్ధం ఎందుకు పుట్టబడింది అని అంత లోతులలోకి వెళ్ళలేరు. దాని హృదయాన్ని పట్టుకోలేరు. ఎందుచేతనంటే వారికి ఉన్న గర్వం అంత లోతుకు వెళ్ళనివ్వదు. గాలి, నీరు, నిప్పు ఎటువంటిదో మనం నేను నేను అనుకుంటున్నాము కదా ఆ నేను కూడా ప్రకృతే. ఈ నేనును విడిచిపెడితే వాడు ప్రకృతిని దాటి నారాయణ స్వరూపాన్ని పొందుతాడు. వచ్చిన బుద్ధి వేరు, చెప్పిన బుద్ధి వేరు. మీ పిల్లల్ని మీరు "బాగా చదువుకో పెద్దవాడవు అవుతావు" అంటే కొంత బుద్ధి వస్తుంది. అది ఎంతకాలం ఉంటుందో తెలియదు. సొంతంగా ఉన్న బుద్ధి నిలకడగా ఉంటుంది. వాసనలు హృదయంలో ఉంటాయి. అవి మెదడులోకి వచ్చాక తెలుస్తాయి. అంత వరకూ తెలియదు.

10. నీవు వేరు - నేను వేరు అనే భావన వస్తే 'మాయ' వస్తుంది. అభేదస్థితిని చేరుకోవడమే మన జీవిత లక్ష్యం. సీరియస్‌గా ఆలోచించడం కూడా అహంకారమే. మీకు భక్తి ఉంది అనుకోండి అది మీ కుటుంబ సభ్యులకు తెలియాలని భక్తి అనుకోదు. మీ అహంకారమే అనుకుంటుంది. దేహభావన ఉన్నంతవరకూ కామ భావన వెంటాడుతుంది. ఆత్మానందం రుచి చూసిన తరువాత కామచింతన పోతుంది. "దేహాన్ని, మనస్సును, ఇంద్రియాలను, బుద్ధిని నమ్మడానికి వీల్లేదు. నన్ను తప్ప" అన్నారు వాసుదేవ స్వామివారు. డాక్టరు మీకు అన్ని పరీక్షలు చేసి మీకు ఏ రోగమూ లేదు మీ అనుమానాలు నిజం కాదు. ఫీలింగ్ మాత్రమే ఏ దోషము లేదు అంటాడు. అలాగే కల్పితమైన నేను లేదు. అనుమానం వల్లనే అశాంతి

వస్తున్నది. ఉంటే గాఢనిద్రలో ఉండాలి కదా! కాబట్టి అహంకారమనేది లేనే లేదు, ఉన్నట్లుగా కనిపిస్తున్నది. నిన్ను పీడించేది నీ అహంకారమే, ఇతరులు కాదు. పోనీ దానిని విడిచిపెట్టేద్దాము అంటే దానికి మించిన ఇష్టమైనది మనకి లేదు. విడిచిపెట్టలేకపోతున్నాము. కీర్తి అంటే మాయ. మన మనస్సు మంచిది కాదు అనుకోవడం కన్నా దానిని బాగుచేసుకోవాలి. బాగా సారా తాగినవాడు కారుని ఎలా నడుపుతాడో మన బుద్ధి పాడైపోతే అది మన శరీరాన్ని అలా నడుపుతుంది. మనస్సుని కూడా ఎంతవరకు ఉపయోగించాలో అంతవరకే ఉపయోగించాలి. కాని ఎక్కువగా ఉపయోగిస్తే పిచ్చివాడవు అవుతావు. వ్యవహారాల్లోకి అతిగా వెళ్ళకూడదు. మధ్యే మార్గం మంచిది. శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకుంటే శరీరం ఉన్నా లేని వానితో సమానం. మనస్సు యొక్క స్థూల రూపమే శరీరం. ఆశ అనే దానికి ముగింపు అంటూ ఉండదు. ఆత్మానందంలోనే పూర్ణానందం పొందుతాడు. సరైన అవగాహన లేకపోవడం వల్లనే దేహం లేకపోతే మనం ఉండలేము అనుకుంటున్నాము. దానివల్లనే పునర్జన్మలు తెచ్చుకొని యాతనలకు గురి అవుతున్నాము. మనస్సుకు మరో పేరు యాతనా శరీరము. మనస్సుకు వేరుగా మాయ ఎక్కడో ఉంది అనుకుంటున్నారు. మరలా మాయలో పడడానికి అదీ ఒక మాయే. మనం నమ్మినా నమ్మకపోయినా శాస్త్రం నిజం. అది నిజం అని నమ్మడానికి వందలాది సంవత్సరాలు తపస్సు చేయడం, శరీరము, మనస్సు, మాట అన్నీ తపోమయం అవ్వాలి. లోపల అజ్ఞానం ఉన్నప్పుడు, బంధం ఉన్నప్పుడు వాడు డబ్బు ఉన్నవాడు చదువుకున్నవాడు అయినా మూర్ఖుడే. బయట డబ్బు, చదువు ఉంటుంది. వాడి స్వభావం ఎక్కడికి పోతుంది. లోపల ఉన్న సత్య వస్తువును వదిలేసి అజ్ఞానం వెంట వెళ్ళవద్దు. కుటుంబ సభ్యులను వాళ్ళు మనమూ ఒకటే అనుకోవడమే మాయ. మీకు నాది అనే తలంపు ఉన్నప్పుడు మీకు ఒక్క ఎకరం పొలం ఉంటే చాలు సంతోషం వచ్చేస్తుంది. నాది అనే తలంపు లేనప్పుడు వెయ్యి ఎకరాలు పొలం ఉన్నా సంతోషం రాదు.





11. డబ్బు, అధికారము, చదువు సంపాదించడం కన్నా మనో నిగ్రహం సంపాదించడం కష్టం. మానవ స్వభావంలో అత్యంత లోతైనది 'నేను' అనే తలంపు. శరీరం మీద నిప్ప పడితే ఎంత బాధగా ఉంటుందో అలాగే ప్రారబ్ధం అనుభవించినపుడు అంత బాధగా ఉంటుంది. నీటిలో దిగినవానికే లోతు తెలుస్తుంది. అలాగే ప్రారబ్ధం అనుభవించిన వానికే తెలుస్తుంది. దానిని ప్రశాంతంగా అనుభవిస్తే ఆ రకమైన ప్రారబ్ధం వచ్చే జన్మకు రాదు. ప్రారబ్ధ బాధలో దైవనామాన్ని స్మరించుకోవాలి. సోక్రటీస్ విషం త్రాగినప్పుడు చెంచాతో రసగుల్లా తింటూ ఉంటే ఎంత ఆనందంగా ఉంటుందో విషాన్ని కూడా అలా ఆనందంగా త్రాగాడు. దురాశ, ద్వేషం ఉండటం వల్ల మనిషి పాడైపోతాడు. మీకు ఇష్టం లేనివారు తప్ప చేస్తే దానిని పెద్దది చేసి చెపుతారు. అదే మీకు ఇష్టమైన వారు తప్ప చేసారు అనుకోండి అందులో పెద్ద విశేషమేముంది అంటారు. ఇది అహంకారం చేసే మోసం. వ్యక్తిభావనే ఈ గారడీ అంతా చేస్తుంది. ఈ అడవిలోంచి బయటకు రాకపోతే జ్ఞానం కలుగదు. మనిషి ఏదైనా పొరపాటు చేస్తే అజ్ఞానంలోనే చేస్తాడు, జ్ఞానంలో చెయ్యడు. మనస్సులో ఉన్న బురద తొలగించుకోవాలి. మనస్సును సంస్కరించుకోవాలి అనే సంకల్పం రావడం లేదు. దానికి శివుని అనుగ్రహం లేనిదే అది సాధ్యం కాదు. పనికి రానివారు పనికిమాలిన ఆలోచనలు, పనికిరాని పనులు, పనికిరాని మాటలు మాట్లాడతారు. దాని నివారణకు మనసుతో శివుని ధ్యానం చెయ్యాలి. ఆహారశుద్ధి లేకుండా బుద్ధిశుద్ధి కాదు. "నేను" అనే తలంపు నరం మీద పుండు లాంటిది. అది నిన్ను సుఖపడనివ్వదు. అన్నం తిని మీ శరీరం బ్రతుకుతున్నది. నేను-నాది అనే శరీరమే నేను అనే ఆహారంతో మనస్సు బ్రతుకుతున్నది. 'నేను' స్వార్థపూరితమైనది. భయం కల్పితం, చుట్టాలు కల్పితం, అన్నీ మనస్సు యొక్క కల్పితాలే. వారు విరోధులు, వీరు స్నేహితులు అని కాలాన్ని పాడుచేసుకోవడమే. నా శరీరాన్ని నేను ఎలా చూసుకొంటున్నానో, మీ శరీరాన్ని మీరు అలా చూసుకుంటే ప్రేమ ఏమిటి?

ప్రపంచం యొక్క మాయ అంతా దానిలోనే ఉంది. రూపబుద్ధి-నామబుద్ధి జీవుడికి హద్దులు. జీవుడు ఈ హద్దుల్లోనే ఉంటాడు. మిమ్మల్ని ఎవరైనా విమర్శిస్తే మీకు దుఃఖం వస్తుంది. స్తోత్రం చేస్తే పొంగు వస్తుంది. దేహం నేను అనే బుద్ధిలోంచే ఇవి రెండూ వస్తాయి. ఈ రెండు హద్దులు దాటకుండా నీవు ఏ మార్గంలో ప్రయాణం చేసినా నీకు ఆత్మజ్ఞానం కలుగదు.

12. కామం ఇంద్రియాలలోను, మనస్సులోను, బుద్ధిలోను అంతటా వ్యాపించి ఉంటుంది. కామం నీకు శత్రువు కాదు. బుద్ధిమంతులకు, సాధకులకు అది శత్రువు. మానవుని స్వభావంలో దేహము నేను అనే తలంపు ఉన్నంత లోతుగా ఏ తలంపూ ఉండదు. దీని అందానికి గౌరవాలు కావాలి, సన్మానాలు కావాలి, స్వర్గానికి వెళతాను అంటుంది. స్నేహాలు బంధుత్వాలు మాయ యొక్క కల్పితం. చిన్న మనస్సు, అభివృద్ధి చెందిన మనస్సును అర్థం చేసుకోలేదు. ఒకవేళ ప్రయత్నం చేసినా తప్పగా అర్థం చేసుకుంటుంది. దొంగవాడు దొంగతనం చేసేటప్పుడు తేలు కుట్టినా గొడవ చెయ్యడు. చేస్తే పట్టుబడి బాధల్లో పడతాడు. అలాగే ప్రతీ కుటుంబంలోనూ పేచీలు ఉంటాయి. దానిని బయటకు చెప్పకోరు. చెప్పకుంటే గౌరవం పోతుందని. కానీ దానికంటే అహంకారం పెట్టే బాధలు అధికంగా ఉంటాయి. కాలము, కర్మ, పుట్టుక, చావు మనస్సులో ఉంటాయి. నా గురించి ఏమను కుంటున్నారు అనేది అహంకారమే. అలా అది కంగారుపడుతుంది. అలా అనుకునే కొలది అహంకారం నశించదు. నీటిలో కనిపించే ప్రతిబింబం కదులుతుంది. గట్టుమీద ఉన్న నీ రూపం కదలదు. అలాగే నీకు లాభ నష్టాలు వచ్చినప్పడు అహంకారమే కదులుతుంది. నీలో ఉన్న చైతన్యం కదలదు. నీవు చైతన్యానివి. నీకు ఈ రహస్యం అర్థం అయితే మనస్సు వెంటనే పడిపోతుంది. ఇష్ట అయిష్టాలు తలంపుల రూపంలో వస్తాయి. అవే బంధాలు. ఎముకలు, కండరాలు లేకుండా దేహం లేదు. తలంపులు లేకుండా మనస్సు లేదు. అహంభావన ఉంటే మనిషి అది లేకపోతే మహర్షి. “ఏ పని అయినా నీ ద్వారా జరిగితే ఆ సంకల్పం దేవునిది” పరికరాలు





ఆయనవే, శక్తి ఆయనదే, చేసింది ఆయనే. నీవు ఎక్కడ ఉన్నావు? చేసిన పనిని నేను చేసాను అని గుర్తు చేసేదే అహంకారం. కారణం దానికి ఆహారం అదే కాబట్టి. “మీకు దేహం నేను అనే తలంపు ఉంది. వాడే నాయకుడు. వాడే ఇతర తలంపులను లీడ్ చేస్తాడు. వాడి వెనకాలే ఇతర తలంపులు అన్నీ వస్తున్నాయి. ఆ నాయకుడిని చంపేయండి. మిగతావారు అంతా చెల్లాచెదురైపోతారు. ఆకారాలు, వికారాలు, జనన, మరణాలు ఇవన్నీ ఆ నాయకుడినిబట్టి వస్తున్నాయి. వాడిని చంపితే నీవు లేవు, నేను లేను, జన్మలూ లేవు, ఏమీ లేవు. ఎవరూ లేకపోతే ఉన్నదేదో ఉంటుంది” అంటారు భగవాన్. కుంజుస్వామి భగవాన్‌తో “నేను ఒక ఆశ్రమానికి వెళితే మీది ఏ ఆశ్రమం? భగవాన్ బోధ ప్రత్యేకత ఏమిటి? అని ఏదో అంటున్నారు. కాబట్టి నేను పాండిత్యం సంపాదించి మీ పేరు అంతటా వ్యాప్తి చేస్తాను” అనగా “ఒరేయ్ కుంజూ నీవు మాయలో పడకురా! ముందు తపస్సు చేసి సిద్ధి పొందు. అప్పడు నీ మాటకు ఫలితం ఉంటుంది” అన్నారు.

13. “ఇంట్లో వ్యతిరేకత లేకేపోతే కొందరికి జరుగుబాటు కోపం ఉంటుంది. ఆ కోపం వారికి ఎక్కువైపోతుంది. దానితో పరుషవాక్యాలు మాట్లాడతారు. పనికిరాని నాసిరకం తలకాయలు గొప్ప గొప్ప మాటలను తిరస్కరిస్తాయి” అన్నారు ఐన్‌స్టీన్. గాలి వీయకపోతే చెట్టు ఆకులు కదలవు. అలాగే నీకు ఇష్ట-అయిష్టాలు లేకపోతే నీ మనస్సు చలించదు. పండితుడైనా పామరుడైనా అహంకారం సంతృప్తి కోసమే జీవిస్తాడు. శరీరాన్ని మనస్సే కల్పించుకొంది. ఎందుకంటే శరీరం లేకపోతే అది ఉండలేదు (శరీరాన్ని ఉపయోగించుకోవడానికే) కోరికలన్నీ మనస్సులో ఉంటాయి. అవి నెరవేర్చు కోవడానికి శరీరం ఉండాలి. మనో నాశనమైతే శరీరాలు రావు, పునర్జన్మ లేదు. బోధ అంటే ఒక్క ఆత్మజ్ఞానానికి సంబంధించినదే బోధ. మిగిలినది అంతా బాధే. మనస్సుకు పొంగు వస్తే స్వరూపానికి దూరం అవుతాము. మనసులో బలహీనతలు ఉన్నా, వాడు స్వార్థపరుడు, దుర్మార్గుడు కాకపోతే ఎప్పడో ఒకప్పడు జ్ఞానం కలుగుతుంది. మొహమాటం అనేది సిగ్గుకాదు.

అదొక బలహీనత. మనసులో ఉన్న బలహీనతల్లో అది ఒకటి. వ్యక్తిభావన లేనప్పుడే నిరహంకార స్థితి ఏర్పడుతుంది. అహంకారం ఉన్నప్పుడు మమకారం వస్తుంది. మమకారం ఉన్నప్పుడు శాంతి స్థితి కలుగదు. స్తోత్రాలు, విమర్శలు నిజం ఎందుకు అనిపిస్తుంది అంటే దేహాత్మభావన వల్ల 'నేను' అనేవాడు దాన్ని సందేహించడం లేదు, దానిని అనుమానించడం లేదు. అందుచేతనే అది బలపడిపోతున్నది. దానిని అంటిపెట్టుకుని పూజలు జపాలు చేస్తే ప్రయోజనం లేదు. సముద్రంలో కెరటాలు సహజం. అలాగే మనస్సులో తలంపులు సహజం. అంతఃకరణలో దోషాలు ఉన్నవాడికి భగవంతుడు ఒకడు ఉన్నాడనే స్థిరబుద్ధి కలుగదు. సంపదలు, గౌరవాలు అనే ప్రదర్శనలోకి వెళితే వ్యక్తిభావనలోకి వెళ్ళిపోతాము. మిల్టన్ "స్వప్నావస్థ పొడిగింపే జాగ్రదవస్థ" అన్నారు. నిద్రలో స్వప్నాలు వస్తాయి, జాగ్రదావస్థలో జన్మలు వస్తాయి. నీతో తప్పు చేయించేది మమకారం. మనుషులను చంపేది మమకారం. దాని వల్లనే మనం బెంగపెట్టుకోవడం, ఏడవడం, మంచం పట్టడం. మమకారం ఉంటే చావు కూడా సహజంగా రాదు. ఏడుస్తూ దిక్కులేని చావు చస్తావు. ఈశ్వరుని శరణాగతి చెందిన వాడికి దుఃఖం దుఃఖం క్రింద కనబడదు. ఇది దుఃఖమని, ఇది సుఖమని విడదీసేది మనస్సే.

14. కొంతమంది నవ్వితే వెటకారంగా నవ్వుతారు. వాళ్ళు విషం కక్కుతున్నారా? అనిపిస్తుంది. అది మనకు తెలుస్తుంది. దాని వల్ల అలా నవ్విన వాళ్ళే పాడైపోతారని వాళ్ళకి తెలియదు. ఏసు "తండ్రీ వాళ్ళు ఏమి చేస్తున్నారో వాళ్ళకి తెలియడంలేదు. వాళ్ళని క్షమించి ఆశీర్వదించు" అంటాడు. దానిని మనం కూడా అలవరచుకోవాలి. మనల్ని హేళన చేసే వారిని చూసి మనం జాలిపడాలి. ఈ దేహమే నేను అనుకొనేవాడే నరకాసురుడు. వాడు చావకుండా నీకు ఆత్మజ్ఞానం వచ్చే అవకాశమే లేదు. నేడు టీవీలలో ఉపన్యాసాలు ఇచ్చేవారు ఆత్మజ్ఞానం లేకుండానే ఆత్మానుభవాన్ని చెప్పేస్తున్నారు. దాన్ని కొన్ని క్షణాలైనా అనుభవించి చెప్పాలి కదా! జ్ఞాని అనేకంలో ఏకత్వాన్ని చూస్తాడు. అజ్ఞాని ఏకత్వంలో అనేకత్వాన్ని





చూస్తాడు. "నేను" లేనప్పుడు బెంగ ఏమిటి? బుద్ధిశుద్ధిగా ఉన్నప్పుడు ఎంత దుఃఖం వచ్చినా భరించగలము. మనస్సు మనకి నౌకరుగా ఉంటే మనం ఎలా చెబితే అలా వింటుంది. అది యజమాని అయితే మనల్ని తొక్కేస్తుంది. పదవి అనేది నూటికి నూరుపాళ్ళు అహంకారమే. ఆత్మస్తుతి పరనింద ఇవి రెండూ పెద్ద రోగాలు. మన అహంకారానికి పొగడ్త ధూప, దీప, నైవేద్యాలు అవసరం. అహంకారం మంచి మాటలను అంగీకరించదు. ద్వితీయం ఉన్నప్పుడు రాగద్వేషాలు తప్పవు. "నేను"ను విడగొట్టుకోవాలి (నేను ఎవడను అనే విచారణ ద్వారా). దేహం నేను అనే తలంపుకే నేను చనిపోతున్నాను అనే తలంపు వస్తున్నది. నిద్ర నీ మనస్సు యొక్క కల్పితమే. విషయాలే మాయ. లేని దానిని ఉంది అనుకొంటున్నావు. కాబట్టి ఆ 'నేను'కే బాధ. ఆ నేను లేదని తెలిస్తే ఉన్నది ఒక్కటే. మన అవసరాలకు మించి వచ్చే సంకల్పాలు అన్నీ మనస్సు కల్పించినవే. మనస్సులోకి ఏ గుణాలు వచ్చినా అవి దేహం మీద ప్రతిబింబిస్తాయి. వివేకానంద "మిత్రమా! ఆత్మను దుఃఖ పెట్టే శక్తి ఈ ప్రపంచంలో ఉందా? నిజం గందరగోళం అయ్యే పరిస్థితి వస్తుందా? ఈ ప్రపంచంలో ఏమీ లేని దానికి ఎందుకు గందరగోళపడతావు? అన్నీ ఊరికే కల్పించుకుంటున్నావు. ఈ భూమి మీదకు వచ్చిన పని మరచిపోతే దుఃఖంతోనే ఉంటావు. మెలకువ వచ్చాక 'నేను' అనే తలంపు వచ్చాక ఆ పాపం వస్తుంది. కక్షలు కార్పణ్యాలు వస్తాయి" అన్నారు. వ్యక్తిభావనే అన్ని బాధలకు కారణమవుతున్నది. మనం పెద్ద పెద్ద గదులు కడుతున్నాము కానీ మనస్సు చిన్నదిగా ఉంటుంది. కోరిక కూడా మనస్సు పరుగెడుతుంది. మనస్సు బలహీనంగా ఉంటే విచారం వస్తుంది. మానసిక పరిస్థితులు నిలువవు. అవిద్య వల్ల, అజ్ఞానం వల్ల రాగం పుడుతుంది. అహంభావన వేరు, ఆత్మవిశ్వాసం వేరు.

# 4. సమాజం - మతం

1. నీవు ప్రపంచానికి ఉపయోగపడాలి అంటే నీ తలకాయలోని ఆలోచనలను వదులుకోవాలి. ప్రపంచం అంటే పిచ్చి ఆసుపత్రి. పిచ్చి ఆసుపత్రిలో పెట్టిన వాళ్ళను పిచ్చి తగ్గితే బయటకు విడిచిపెడతారు, ఎక్కువ పిచ్చి ఉంటే బయట తిరగనివ్వరు. అలాగే నీవు మనోపరిధిలో ఉంటే మోక్షం రాదు. తిరిగి నిన్ను ఈ ప్రపంచం అనే పిచ్చి ఆసుపత్రిలోనే ఉంచేస్తాడు ఈశ్వరుడు. అంటే సత్యాన్వేషణ కోసం ఈ భూమి మీదకే పంపించేస్తాడు. బుద్ధుడు వెయ్యి ఆవుల పాలను వదులుకున్నాడు. ఎవరో ఒకరు త్రాగుతారని. సత్యాన్వేషణ కోసం ప్రపంచాన్ని వదులుకున్నాడు. శుద్ధోధనుడు అనుకున్నాడు అసలు త్రాగేవాడే వెళ్ళిపోయాడని. మీరు ఒక విషం కలిపిన ఆహారాన్ని తిని ఆలస్యంగా దానిని గుర్తించారు అనుకోండి శరీరానికి హాని చేసి మరణించే అవకాశం ఉంటుంది. అలాగే మీరు ఇతర మతాల వారు ప్రలోభ పెట్టిన మత మార్పిడికి అంగీకరిస్తే జీవితం వ్యర్థం అవుతుంది. సత్యాన్ని తెలుసుకోవడానికి మతం మార్చుకోవలసిన అవసరం లేదు. "డబ్బు ఉన్నవారు, చదువుకున్నవారు, అధికారం ఉన్నవారు సుఖపడిపోతున్నారు" అనుకోవడం తెలివి తక్కువ తనానికి, మూర్ఖత్వానికి, అజ్ఞానానికి కొండ గుర్తు. "అందరిలో ఉన్న పరమాత్మను సమానంగా చూస్తే భగవంతుని పూజించినట్లే" అన్నారు గాంధీజీ. సాధనలో నీవు పడిపోవచ్చు, లేచి ప్రయత్నించి జ్ఞాన శిఖరాన్ని అధిరోహించాలి. సాధకులు ఎవరైనా పడిపోతే (సాధనలో) అంటే దుఃఖం లోకి వెళ్ళిపోతే అసలు సాధన చెయ్యనివారు వారిని ఆక్షేపిస్తున్నారు. అది ఎలా ఉంటుంది అంటే బాగా నడిచేవాడు ఒక్కోసారి కాలు జారి పడిపోవచ్చు. దానిని చూచి అసలు నడకరాని వాళ్ళు, పోలియోవాళ్ళు వారిని అపహాస్యం చేసినట్లు నవ్వుతూ ఉంటారు. ఇది లోకం. దానిని సాధకుడు పట్టించుకోకూడదు. మీ దేహమే మీది కానప్పుడు మిమ్మల్ని విమర్శించినా, పొగిడినా వాళ్ళు దేహంతో అనే మాటలు నిజం కావు అని గ్రహించాలి.

2. ప్రకృతి విషయాలు ఎలా ఉంటాయి అంటే మీరు ఎవరికైనా





ఉపకారం చేసారంటే వారి శత్రువులు అంతా మీ శత్రువులు అవుతారు. అలాగే మీరు ఎవరికైనా అపకారం చేస్తే వారి శత్రువులు అంతా సంతోషిస్తారు. ఇది అంతా ప్రకృతి చేసే పని. ప్రతీ వ్యక్తి ఇష్టఅయిష్టాలతో తాదాత్మ్యం పొందితే శాంతిని పొందలేరు. ఎవరైతే మనలను పాడుచేస్తారో వాళ్ళ కొంపల చుట్టూ తిరుగుతాము. ఎందుచేత? వాళ్ళు పాడుచేస్తారని తెలియక. మన జీవితం వ్యాపార సంస్కృతిగా తయారైనది. లాభం ఉంటేనే చుట్టాలు, విద్యార్జనలో వ్యాపారం. ఈ వ్యాపార సంస్కృతిలో మహాత్ములు రావడం కష్టంగా ఉంటుంది. కానీ ఎంతోకొంత స్వార్థం లేకపోతే సృష్టి యొక్క ఆగమనం ఆగిపోతుంది. నేటి సమాజం చాలా అశాంతి. వ్యాపార సంస్కృతిలో పడిపోయింది. ఒక మనిషి నూటికి నూరుపాళ్ళు చెడ్డవాడైనా నీకు ఒక గ్లాసు మంచి నీళ్ళు ఇస్తే, లేదా ఒక ఉపకారం చేసినా వాడు నీ దృష్టిలో మంచివాడు ఇది లోకం తీరు. మనుషులను చూస్తుంటే భిన్నంగా కనిపిస్తారు. కానీ అంతరంగంలో ఒక్క వస్తువే నడిపిస్తుంది. ఈ విషయం జ్ఞాని మాత్రమే అనుభవ పూర్వకంగా గుర్తిస్తాడు. తులసీదాస్ "నారాయణుడు దశరథ రాముడే" అన్నారు. కబీరు "నారాయణుడు ఆత్మారాముడే" అన్నారు. తులసీదాస్ రామునితోపాటు కల్యాణ గుణాలను కూడా కలుపుకున్నాడు. గాంధీజీ "స్వరాజ్యాన్ని సురాజ్యం (రామరాజ్యం) చెయ్యాలి" అన్నారు. తులసీదాస్ "కైకలాంటివారు, మంధరలాంటివారు, సూర్పణకలాంటివారు ఉన్నంత కాలం రామరాజ్యం రాదు" అన్నారు. వర్షం వస్తే గొడుగు వేసుకుంటాము, ముళ్ళు ఉంటే చెప్పలు వేసుకుంటాము. అలాగే లోకంలో అనేక రకాల మనుషులు ఉంటారు. నీ మనస్సుకు సహనం అనే చెప్పలు వేసుకుంటే లోకంలో ఉన్న మనుషులు నీకు గాయం చెయ్యరు. సంస్కారవంతమైన పెద్దవారు ఏమీ అనుకోరు. "చిన్న మనస్సు గలవారే మేము పెద్దవాళ్ళము, మమ్మల్ని అందరూ గౌరవించాలి" అనుకుంటారు. మాటలు తగ్గించుకోవాలి. కొందరు అనవసరంగా మాట్లాడతారు. ఎందుకంటే అన్నీ మాకే తెలుసు అని ఇతరులు అనుకోవాలని. వాళ్ళు తింగరివాళ్ళు. వాళ్ళకు ఇంతకుముందు

ఉన్న గౌరవాన్ని పోగొట్టుకుంటారు. అన్నీ తెలుసున్నవారు అణిగి ఉంటారు. ఏమీ తెలియనివారే ఎగిరెగిరి పడతారు. మాటల్లో విశేషం లేదు. మాట వెనుక బుద్ధి మంచిదై ఉండాలి. బుద్ధి పాడయ్యాక నీకు ఎంత సంపద ఉన్నా పేకాట, త్రాగుడుతో పాడైపోతాడు.

3. రాజేంద్రప్రసాద్ దేశ అధ్యక్షులుగా ఉన్నప్పుడు (పదిమంది సంతానం) వారి జీతం ఆనాడు పదివేలు. నాకు అంత జీతం అవసరం లేదు. ఆరు వేలు చాలు అన్నాడు. రెండవసారి కూడా ఎన్నికల్లో గెలిచి ఐదు వేలు చాలు అన్నారు. వారు దేవతలు. వారి ఔన్నత్యం, వారి గొప్పతనం అటువంటిది. ఏనుగు బ్రతికినా, మరణించినా దాని విలువ దానికే ఉంటుంది. వారికే భగవంతుడు ఆత్మానుభవాన్ని కలుగజేస్తాడు. స్వామి శివానందతో ఒక సాధకుడు "అయ్యా వాడిని నమ్మితే వాడు అలా చేసాడు, వీడిని నమ్మితే వీడు పూర్తిగా ముంచేసాడు" అనగా "ఎక్కడ జాలి చూపించ కూడదో అక్కడ జాలి చూపించావు, దయ చూపించావు. అందుచేత అనుభవించు. పోతాయి" అన్నారు. చెడు ఆలోచనతో ఉన్న నమ్మకద్రోహులపై జాలి దయ చూపితే పాముకు పాలుపోసి పెంచితే కాటేసినట్లు కాటువేసి ప్రమాదాన్ని కలుగజేస్తారు. వ్యవహారంలో జాలి, దయ చూపడంలో చిత్ర హింసలకు గురికావలసి ఉంటుంది. ఆధ్యాత్మిక జీవితానికి పెను ఆటంకాలను కల్పించుకున్నవారు అవుతారు. మంచి వాడు చెడ్డవానితో స్నేహం చేస్తే మంచి వాళ్లను చంపి ప్రక్కకు తప్పకుంటారు. వాళ్ల కుయుక్తులు మంచి వారికి తెలియవు. మహా భారత యుద్ధంలో ద్రోణాచార్యులు, భీష్ముడు ముందు చనిపోయారు. ఆఖరున దుర్యోధనుడు చనిపోయాడు.

4. మన మతం వైదిక మతం. దానికి ఆధారం వేదం. అది సనాతన మతం. ఆ వైదిక మతాన్నే ఇంగ్లీష్ వాళ్లు హైందవ మతం అంటారు. కొందరు మాటల్లో అందం చూపుతారు. నిజమైన భక్తుడు డాంభీకంగా మాట్లాడడు, పని చెయ్యడు. లౌకికులు దానికి వ్యతిరేఖం. పనిని కూడా ప్రేమతో, యోగంగా ఎవరు చేస్తారో వారు తరిస్తారు. రాముడు లేడు అని కోర్టులో





అఫిడవిట్ దాఖలు చేసినవాడు లేడు. రాముడు ఉన్నాడు. రామాయణంలో ఉన్న నదులు, స్థలాలు కల్పితమా? మీరు ఎవరి దగ్గరైనా అప్పు తెచ్చుకుంటే ఇచ్చినవాడు మన దగ్గర అప్పు తీసుకున్నాడు అనుకుంటాడు. మనం కూడా వారి దగ్గర అప్పు తెచ్చుకున్నాము అనుకుంటాము. అప్పు తీర్చేస్తే అన్నీ మరచి పోతాము. అలాగే కుటుంబ సభ్యులతో అనుబంధం వాళ్ళు జీవించి ఉండగా మనవాళ్లు అనుకుంటాము. ఉభయులు మరణిస్తే అన్నీ మరచి పోతాము. చావుపుట్టుకలు శరీరానికి సంబంధించినవి. వారి బాధ్యత మనది అని ఉభయులు అనుకొంటారు. చుట్టాలు మన పట్ల "డబ్బులేకపోతే అవమానంగా, డబ్బు ఉంటే ద్వేషంగా" చూస్తారు. ఇది అహంకార లక్షణం. ప్రహ్లాదుడు అన్నాడు "మీరు ఎంత చదివినా అర్థ కామాలు (కోరికలు) తప్ప వాటి వల్ల మోక్షం రాదు" అని. బాగా చదువుకున్నవాడు వాడికి భార్య, సంసారం తప్ప ఏమీ అక్కరలేదు. కష్టపడి చదివించిన తల్లితండ్రులను చూడడు. భార్య ఉమ్మి వేయవలసి వస్తే ఆమె సింక్ దగ్గరకు వెళ్లడం కష్టమని తన చేతుల్లోకి వేయమని దానిని సింక్‌లో వేసి చేతులు కడుక్కుంటాడు. అది అతని పని. రామకృష్ణ పరమహంసగారు "నిరంతరం ప్రకృతి మనుషులతో స్నేహం చెయ్యకు, వాళ్ల గాలి కూడా శోకకుండా చూసుకోవాలి. భక్తులు అంత జాగ్రత్తగా ఉండాలి. వారి ఒక్కమాట కూడా సరిగా ఉండదు" అన్నారు. సహృదయం ఉన్నవాడు సాధువు. ఎర్రబట్టలు కట్టుకున్నవారంతా సాధువులు కాదు. బాహ్యజీవితాన్ని చూచి వ్యక్తుల విలువ కట్టకూడదు. లోపల జీవితంలోని విలువలను చూచి గౌరవించాలి. ఒక మనిషి మంచి గుణాలతో ఉంటే సరిపోదు. స్వార్థం లేకుండా జీవించేవాడు మాత్రమే పరమ పవిత్రుడు కలియుగానికి కామ-క్రోధాలు రాజులు. శ్రీకృష్ణచైతన్య "లోకం ఒక పాములాంటిది. ముట్టుకుంటే మెత్తగా, కాలు మీద అది పాకినా మెత్తగా ఉంటుంది. కానీ నోటినిండా విషం. అలాగే లోకం కూడా విషపూరిత మైనదే" అన్నారు.

5. సంఘ దోషం ఉన్నవాడు హృదయంలోకి వెళ్లలేడు. ఆ దోషం

లేని వాడు తన కర్తవ్యాన్ని సరిగ్గా చేస్తాడు. ప్రపంచం నీ యోగ్యత గల తలంపులను, నీ బలహీనత గల ఆలోచనలను తెలుపుతుంది. ప్రపంచాన్ని అద్దంలా ఉపయోగించుకొని సరిచేసుకోవడమే సాధన. థామస్ జఫర్‌సన్స్ “లోకంలో సత్పురుషులు తక్కువగా ఉంటారు. కొందరు అమాయకులు ఉంటారు. మోసగాళ్ళు అందరూ తెలివి తక్కువ వారిని మోసం చేస్తారు. మొదటిసారి మోసం చేస్తే అది మోసం చేసిన వాడిదే. అదే వ్యక్తిచే మరల అతనినే మోసగింపబడితే అది వీడిదే పొరపాటు అంటే అమాయకుడిదే అవుతుంది” అన్నారు. “మానవుడు సబ్జక్టును ప్రోపర్‌గా అర్థం చేసుకోలేక పోతున్నాడని మతాలు అన్నీ దేవుడిని సపోర్టుకోసం ప్రతిపాదించాయి” అన్నారు ఐన్‌స్టీన్. ప్రపంచం ఎలా ఉంది అంటే నీవు పాడైపోతే నిన్ను పట్టించు కోదు, నీవు బాగుపడితే అసూయ పడుతుంది. మిమ్మల్ని ఎవరైనా పొగిడినా విమర్శించినా దానిని లోపలకి తీసుకోకూడదు. తీసుకుంటే విషం ప్రవేశిస్తుంది. మీరు చేసిన సాధన అంతా పాడైపోతుంది. శరీరానికి గాయం తగిలితే వైద్యం చేయించుకుని సరిచేసుకోవచ్చును. మనస్సుకు గాయం అయితే గురువు అనుగ్రహం కావాలి. కాలం కలసి వస్తే గానీ అది పోదు. బుద్ధిమంతుడికి చిన్న ఉపకారం చేస్తే జీవితం పొడవునా అది గుర్తుపెట్టు కుంటాడు. దుష్టుడికి ఎన్ని ఉపకారాలు చేసినా అప్పటికప్పుడు మరచి పోతాడు. జరిగేది ఈశ్వర సంకల్పం. దానితో నీవు రాజీపడలేనప్పుడు దుఃఖం వస్తుంది. నీవు ఎవరి యోగ, క్షేమాలగురించి ఈశ్వరుని ప్రార్థించి, ప్రార్థించి కృషి చేస్తావో చివరకు వారే విరోధులు అవుతారు. ఇది ప్రారబ్ధం యొక్క క్రియ. మనిషికి ధైర్యం అవసరం. ధైర్యం లేకపోతే ఇంద్రియ నిగ్రహం, మనో నిగ్రహం రాదు. నీవు లోకాన్ని చూసి జడిస్తే లోకం నిన్ను తరుముకొని వస్తుంది. జడవకపోతే అది నిన్ను ఏమీ చెయ్యదు. ఒక చుట్టం మీ ఇంటికి వస్తే వాడు వచ్చి వెళ్ళిన జాడ కూడా తెలియదు. వాడు సత్త్వగుణం గలవాడు. ఒక్కో చుట్టం వస్తే కొంప అంతా అల్లరిచేసి వెళతాడు. వాడు రజోగుణం కలవాడు. ఒక్కో చుట్టం వచ్చి మూడు రాత్రులు ఉండి వెళతాను అంటాడు.





శివరాత్రి, సంక్రాంతి, నవరాత్రులతో వాడికి సంవత్సరం అయిపోతుంది. వాడు తమోగుణం కలవాడు. మనం అభివృద్ధిలోకి రావాలంటే సత్త్వగుణం పెంచు కోవాలి. మిగిలిన రెండు గుణాలు వదిలించుకోవాలి. పాముని చూసి ఎలా పారిపోతావో అలాగే ఈ లోక వ్యవహారాలలో నుండి దూరంగా పారిపొండి. “లౌకికులు కాకులు, పురుగులు. ఎదుటి మనిషిలో ఔన్నత్యం వారికి తెలియదు. వారితో జాగ్రత్తగా ఉండాలి” అని రామకృష్ణులు అన్నారు.

6. మానవ స్వభావాలే స్వార్థపూరితమైనవి. కుటుంబ సభ్యుల స్వభావాలు ఇంకా స్వార్థపూరితం. అందులో నిజం లేదు. ఒక్క జ్ఞాని మాత్రమే స్వార్థం లేని ప్రేమతో ఉంటాడు. గీతలో భగవంతుడు ఇలా అన్నారు “నేను శరీరం ధరించకపోతే భగవంతుడు లేడు అనుకుంటారు. శరీరాన్ని ధరిస్తే మనలాగే శరీరం ధరించాడు వీడు దేవుడు ఏమిటి? అని నన్ను అనుమానిస్తున్నారు. అది లోకం తీరు” అన్నారు. ఆంధ్రా యూనివర్శిటీ వారు చలంగారికి “ ‘కళా ప్రపూర్ణ’ ఇస్తాము దయచేయండి” అంటే “దాని వల్ల నాకు ఏమి కలసి వస్తుంది? రాను” అన్నారు. అది సాధన వైభవం. నూటికి ఒక్కడే అలా సత్త్వగుణంలో ఉంటాడు. ధనానికి బలం ఉంది. కానీ దానికంటే ధర్మానికి ఉన్న బలం గొప్పది. ఆడంబరమైన మాటలు, అహంకారమైన మాటలు పలికేవారు ఎందుకూ పనికిరారు. వారు పని ఏమీ చెయ్యరు. డబ్బా మాటలు చెప్పి వెళ్ళిపోతారు. ఎక్కువ మాట్లాడే వాడికి ఏమీ తెలియదు. తెలుసున్నవారు ఎక్కువ మాట్లాడరు. ఈ కపటాలు, ఈ మాయ ఎవరికి కనిపిస్తున్నాయి? లౌకికులకే కనిపిస్తున్నాయి. ఎవరైతే మంచివారు కాదో వారు ఇతరుల మీద చాడీలు చెబుతారు. వాళ్ళ చెడ్డ తనాన్ని కప్పి పుచ్చుకోవడానికి మన మైండ్‌ని ఆయన వైపునుండి బయటకు మళ్ళిస్తారు. కంచి పరమాచార్యులవారికి పదకొండు సంవత్సరాల వయస్సులో ఒక మోసగాడు తారసపడి “నీ మురుగులు బాగాలేవు, అదే బంగారంతో బాగా ఉండేలా చేస్తాను” అంటే ఇచ్చారట. అది ఆ నాటి అమాయకత్వం అన్నారు పరమాచార్యులు. గారడీవాడు డబ్బును డబ్బాలోంచి తీస్తాడు,

కత్తులతో పొడుచుకుంటాడు అలాగే ఈశ్వరుడు కూడా గారడీ పనులు చేసి ఆశ్చర్యం కలిగేలా చేస్తాడు. ఆయనకు అది ఒక లీల, ఒక ఆట. ఎన్నో సంఘటనలు మన ముందు ఉంచుతాడు. మనలను మోసం చెయ్యడానికి ఒక వ్యక్తిని మంచి నమ్మకం కల వ్యక్తిలా మన దగ్గరకి పంపిస్తాడు. వాడు ఒక గడ్డిపరకలాంటి వస్తువు పోతే పది రూపాయలు ప్రయాణం ఖర్చు పెట్టుకొని మన ఇంటికి తీసుకొస్తాడు. అదేమిటయ్యా ఇంత చిన్న విషయానికి ఇంత ఖర్చు పెట్టుకొని రావడం ఏమిటి? అని ఆయనను మనం అంటాము. ఇలా కొంత నటింపచేస్తాడు. మనం పూర్తిగా ఒక వ్యక్తిని నమ్మి ఆయన చేతిలో మన ఇంటి తాళం చెవి పెట్టి ఊరు వెళ్ళి వస్తాము అని చెబితే అలాగే అని మనం వెళ్ళిన వెంటనే మన ఇంట్లో ప్రవేశించి బంగారాన్ని మూటకట్టుకుని ఉడాయిస్తాడు. మోసంలో పడే యోగం ఉంటే మన తెలివి పని చెయ్యదు.

7. ఈ జీవకోటినంతా సమానం చేసినా మళ్ళీ నాలుగు సంవత్సరాలలో హెచ్చుతగ్గులు వచ్చేస్తాయి. నాలుగు రూపాయలు సంపాదించుకునేవారు ఉంటారు, పాడు చేసుకునేవారు ఉంటారు. మన చేతి వ్రేళ్ళే సమానంగా ఉండవు కాబట్టి ఎవరితోనూ పోల్చుకోకుండా మీ సంసారాన్ని బట్టి మీరు ఉండండి. దుర్జనుడు తన బలహీనతలను బయటకు కనబడకుండా కోటు మీద కోటు వేసుకొని ఎదుటివాడి బలహీనతలను టామ్-టామ్ చేస్తాడు. ఎవరినైనా క్షమించగలము కానీ కృతఘ్నుడిని క్షమించలేము. కొంతమంది అంటారు "మేము వారిని లెక్కచేయము, వీరిని లెక్కచేయము" అని. అలా అనే నీ మనస్సును లెక్క చెయ్యడం మానెయ్యి. అది దాని గూటిలో పడిపోతుంది. నీకు అశాంతి ఎక్కడ నుండి వస్తున్నదో సోధించు. ఆ కారణాన్ని చంపెయ్యి. కారణాలు అన్నీ మనస్సులోంచే వస్తున్నాయి. దానిని చంపెయ్యి. ఇక ఏదీ మిగలదు. మన మనస్సును మనమే నమ్మడానికి వీల్లేదు. కారణం దానికి స్వతంత్ర శక్తి లేదు. నీ దేహము, నీ మనస్సు ఒక అతీత శక్తి ఆధీనంలో ఉన్నాయి. మనస్సు





మీరు కాదు, అది అమృతానుభవానికి అడ్డు వచ్చేది. అదే మరణానంతరం మీ కూడా వస్తుందని గుర్తు పెట్టుకోండి. గాలిని మూట కట్టడం ఎంత కష్టమో మనస్సును ఆపడం అంత కష్టం. "కీర్తి కాంక్ష ఉన్నవాడి దగ్గరకు వెళ్ళి సలహాలు అడగవద్దు. కారణం వారు ఎంతసేపు ఈ సలహా చెప్పడం వల్ల గౌరవం వస్తుందా? రాదా? అని చూసుకుంటాడు. వాస్తవ పరిస్థితులకు దూరంగా ఉంటారు. వారు సరైన సలహాలు ఇవ్వలేరు. వారికి ఒక నమస్కారం పెట్టి వదిలేయండి" అన్నారు మిల్టన్. ఈ ప్రపంచం గురించి బుద్ధుడు "బట్టల నిండా సెంటు రాసుకున్నా మనస్సు నిండా కామవాసనలు ఉంటాయి" అన్నారు. మధ్వాచార్యులు "కలియుగం కపటయుగం, కలహాల యుగం, చెడ్డమాటలు వెయ్యి చెవులతో వింటారు. వారికి లోపల ఆశ ఉంటుంది కాని పని చెయ్యరు. వాళ్ళ కన్నా పాకీ పని చేసేవారు మేలైన వారు" అన్నారు. వ్యక్తి బాగుపడకుండా సమాజం బాగుపడదు. జన సమూహమే సమాజం. సత్యాన్ని ప్రియంగా చెప్పేమాట కూడా తపస్సుతో సమానం. ఇతరులను గాయపరిచే మాటలవల్ల చివరకు మనకే అవమానాలు వస్తాయి. గాంధీగారి ఇంట్లో డబ్బుపోతూ ఉంటే గాంధీ గారి తండ్రి భార్యను తిట్టిపోస్తూ ఉండేవారు. అనవసరంగా తల్లిని తిట్టిపోస్తూ ఉంటే బాధతో తండ్రిగారికి గాంధీజీ పశ్చాతాపంలో ఇలా ఉత్తరం వ్రాసారు "ఆ సొమ్ము నేనే దొంగిలించాను". దానితో తండ్రి గాంధీగారిని తిట్టలేదు, కొట్టలేదు, కన్నీరు పెట్టుకున్నారు. దానికి గాంధీజీ "ఆ కన్నీరే నా పాపాన్ని కడిగేసి సత్ప్రవర్తన కలుగజేసింది" అన్నారు. అలాగే మనలో ఉన్న దొంగ నేనును మనం పట్టుకోలేము. మనం దేవుని కన్నీటితో ప్రార్థించగా ఆ దొంగ నేను నుండి విముక్తి పొందుతాము. ఈ మనస్సు చనిపోయే వరకు అది కల్పించిన విషయాల చుట్టూ తిరుగుతూ ఉంటుంది. ఏదైతే కల్పించినదో అదే దానికి నిజమనిపిస్తుంది. ఏదో ఒక రోజు శరీరం చనిపోతుంది. మళ్ళీ ఆ మనస్సే కొత్త దేహాన్ని తొడుగుతుంది. అదే పునర్జన్మ.

8. ప్రతీ ఒక్క హిందూ హృదయంలో రాముడు ఉంటాడు. పూర్వం

తెలివితేటలు తక్కువగా ఉన్నప్పుడు సదాచారంగా, సంతృప్తిగా ఉండేవారు. నేడు టెక్నాలజీ, సైన్సు పెరిగి తెలివి ఎక్కువైనది. కానీ కొత్త సమస్యలు వస్తున్నాయి. క్రమశిక్షణ తక్కువగా ఉంది. అసంతృప్తి ఎక్కువైనది. తెలివి తక్కువ వారితో స్నేహాలు ప్రమాదాలు తెచ్చిపెడతాయి. ప్రపంచంలో చాలా జరుగుతున్నాయి. అవి అన్నీ కోరికల వల్లనే. చదువుకున్నవారు కూడా తల్లితండ్రులు కూడా కుటుంబ సభ్యులే అనే విషయం మరచిపోతున్నారు. పెడితే తింటారు, తిడితే పడరు. రోజులు అలా మారాయి. వివేకానంద “ఎవరైనా మా సంస్థకు విరాళం ఇస్తే మేము నిలబడి పుచ్చుకుంటాము. ఇచ్చేవాడు మాకు నమస్కారం పెట్టాలి. మేము స్వీకరించకపోతే ఎవరికి ఇస్తారు?” అనేవారు. కొందరు స్మశానానికి వెళ్లేవరకు ప్రపంచంలో ఏదో ప్రకృతి విషయం తీసుకొని నాకుతూ ఉంటారు. భగవంతుని మాట స్వీకరించరు. బాహ్యంగా శరీరం అందంగా లేకపోయినా హృదయంలో అందం ఉంటే బాహ్యవికారాన్ని అధిగమించవచ్చు. బాహ్యంగా అందంగా ఉన్నా హృదయంలో అందం లేకపోతే దానిని పూరించలేము. శాస్త్రం తెలిసిన వాడిని పూర్వం శాస్త్రి అనేవారు. స్మార్తులు స్మృతిని ఆధారంగా చేసుకునేవారు. వారు సూర్యుడిని, గణపతిని, సుబ్రహ్మణ్యుడిని, శివుడిని, విష్ణువుని ఆరాధించే వారు. దానిని పయాతిపూజ అంటారు. రామానుజులకు పూర్వం అందరూ విభూతి ధారణ అడ్డంగా పెట్టుకునేవారు. ఏసు “లోకం చిత్రమైనది. పది మంది కుష్ఠు రోగులకు వ్యాధి నయం చేస్తే ఒక్కడే కృతజ్ఞత చూపాడు” అన్నారు. ఒక భార్య భర్తతో “వారింటికి వెళ్ళి చూసి వద్దాము” అంటే “వాళ్ళు మంచివాళ్ళు కాదు” అన్నాడట. “అలాగైతే మనలను కూడా కొంతమంది మంచివాళ్ళు కాదు అంటే మనమూ చెడ్డవాళ్ళమేనా?” అంది. అది అద్భుతమైన సమాధానం. బుద్ధిజంలో నైతిక విలువలు ఎక్కువ చూపించారు. శీలం బౌద్ధమతానికి కేంద్రం. వారు దేవుడిని కేంద్రంగా పెట్టుకోలేదు. బుద్ధుడు తత్త్వం తక్కువ చెప్పాడు. రెండూ అవసరమే. హిందూ, క్రైస్తవ మతాలు భగవంతుడిని కేంద్రంగా పెట్టుకున్నాయి.





# 5. సంపద

1. లక్ష్మి అంటే కల్యాణ గుణాలను కలిగి ఉండటం. కుటుంబం ఐకమత్యంగా ఉండటం కూడా లక్ష్మితో సమానం. ధనవంతుడు ఎవడూ ధనవంతుడు కాడు. అతనికి ఉన్న ధనాన్ని ఇతరుల కష్టసుఖాలకు నిష్కామంగా ఖర్చుపెట్టినవాడే నిజమైన ధనవంతుడు. డబ్బు బాగా ఉన్న సాధకునకు దాన్ని ఎలా దాచాలి? ఎలాంటి చోట పెడితే సురక్షితంగా ఎక్కువ వడ్డీ వస్తుంది అనే ఆలోచనతో భక్తి మీద దృష్టి పెట్టలేరు. డబ్బు మాయ. మనం పెట్టిన సొమ్ము గలవాడు దివాళా తీస్తే మనకు మానసిక క్షోభ వచ్చేస్తుంది. సాధకులకు సాధువులతో సహవాసం మంచిది. డబ్బు లేకపోతే దుఃఖం. డబ్బు ఉంటే గర్వం. నిదానం లేదు. సాధకునకు అది లక్షణం కాదు. బైబిల్‌లో ఒక మాట ఉంది. ఒకేసారి నీవు దేవుడిని, ధనాన్ని ఆరాధించలేవు. “డబ్బు ఉంది కదా! అని అవసరాల కోసం ఖర్చు పెట్టేస్తే డబ్బున్న వాడిలో కనిపిస్తూ పేదవాడివి అవుతావు” అన్నాడు మిల్టన్. డబ్బు ఉండటం వల్ల నష్టం లేదు. ఆ డబ్బు భోగానికి ఉపయోగిస్తే పాడైపోతావు అన్నారు. రేపు డబ్బు వస్తుందంటే ఈరోజు అప్పు చేసేవారు ఉన్నారు. చివరకు అప్పులు మిగులుతాయి. ఒక అమెరికా కోటీశ్వరునితో ఒక విలేఖరి ఇలా అన్నాడు “మీ ఆదాయంలో 50% ఖర్చుపెట్టేస్తున్నారు. మిగుల్చుకోవచ్చు కదా” అంటే “డబ్బు అంటే నాకు ఇష్టంలేక కాదు. నా శాంతికోసం, నా ఆనందం కోసం నేను ఖర్చు పెట్టుకొంటున్నాను” అన్నాడు. దానం అంటే పంచుకోవడం. ఈ సృష్టిలో ఎంతో సంపద ఉంది. నీకు భగవంతుడు కేటాయించిన సంపదను ఎవరూ ఆపరు. ప్రారబ్ధంలో లేనిది నీవు కోరినా రాదు.

2. మనకు ఏ అలవాట్లు లేకపోతే పర్సులో డబ్బు, ఇంటిలో డబ్బు ఎల్లప్పుడూ ఉంటాయి. మధ్యలో ‘సిరి’ వస్తే నరం మీద కురుపు వేసినంత సలుపుగా ఉంటుంది. ఆ సంపద మనతో గంతులు వేయిస్తుంది. దానిని గ్రహించుకోలేకపోతుంటే నీవు గంతులు వేస్తూనే ఉంటావు. అన్ని సౌకర్యాలు,

సంపదలు ఉండవచ్చు కానీ అణిగి ఉండాలి. వేదానికి మూలం జ్ఞానం, లోకానికి మూలం ధనం. సాధన చేసేవాడికి పాపం పోతుంది. జప, తపాల వల్ల బుద్ధిలోని దోషాలు పోతాయి. శాశ్వత శాంతికి వారసుడవు అవుతావు. అది జ్ఞాన వైభవం. డబ్బున్న వాడికి వీపు మీద కురుపు వేస్తే క్షణాల్లో ఊరంతా తెలిసిపోతుంది. డబ్బులేని వాడికి కేన్సర్ వచ్చినా ఎవరికీ తెలియదు. అది డబ్బు చేసే పని. అర్థకామాలు విచ్చలవిడిగా ఉండకూడదు. ధర్మవిరుద్ధంగా సంపాదించాలనే బుద్ధి కలుగకూడదు. అర్థబలం, అంగబలం, అధికారబలం ఉన్నా ఇతరులను పీడించకూడదు. పరమహంసగారు "జీవునికి రెండు బలమైన వాసనలు ఉంటాయి. 1. ధనకాంక్ష, 2. ఇల్లు భార్యల అనుబంధం" అన్నారు. మీరు ఆర్థికంగా పాడైపోతే బంధువులు ఎవరూ మీ దగ్గరకు రారు. మన డబ్బు మనకు అహంకారాన్ని తెచ్చిపెడుతూ ఉంటే అలా అహంకారాన్ని పెంచే డబ్బు లేకపోవడమే మంచిది. మన అస్థిత్వాన్ని దేహానికే పరిమితం చేసుకున్నాము. అందులోంచి బయటకు రావడమే నిజమైన ఐశ్వర్యం. డబ్బు సంపాదించినప్పుడే అది ఎప్పుడు పోవాలో నిర్ణయించబడి ఉంటుంది. అది మనకు తెలియదు. మనిషి పుట్టాడు అంటే చనిపోయాడనే అర్థం. ఏదైనా వచ్చింది అంటే అది పోతుంది అని అర్థం. దేహప్రారబ్ధాన్ని బట్టి డబ్బు వస్తుంది. తెలివితేటలను బట్టిరాదు. ఇది జ్ఞాపకం పెట్టుకోండి. అయితే ఆ డబ్బు నిజం కాదని తెలుసుకోవాలి.

3. డబ్బు సంపాదించడం మహావ్యసనం. కొందరు చనిపోయే వరకు అలాగే ఉంటారు. ఏసు "మొత్తం దేశంలో ఉన్న సంపదను అంతా నొల్లుకొని సంపాదించావు అనుకో నీవు ఎవరివో నీకు తెలియనప్పుడు నీవు అనుభవించే నష్టం నీవు చనిపోయిన తరువాత తెలుస్తుంది 'బయట ఏదో ఉంది అని నొల్లుకున్నాను, చివరకు ఏమీ లేదు గుల్ల అయిపోయానని' నీకు తెలుస్తుంది" అన్నారు. అహంకారం దాని సంతృప్తి కోసం ఎక్కువ సంపాదించాలని కోరుకుంటుంది. ఒక ఆంగ్లసామెత "ముందు సంపాదించిన దానిని ప్రజలకు ఎలా సద్వినియోగం చేయాలో తెలుసుకొని





తరువాత సంపాదించడం మొదలుపెట్టు" అన్నది. మీరు పనిచేసుకుంటూ నాలుగు రూపాయలు సంపాదించుకోండి. సంపాదనే ముఖ్యం అని సంపాదన మొదలుపెడితే మీరు పాపం చెయ్యకుండా ఉండలేరు. ఐశ్వర్యం అంటే ఒక ధనమేకాదు. శాంతి, ధైర్యం, క్షమ, దక్షత, విద్య, అర్హత, యోగ్యత ఇవన్నీ ఐశ్వర్యంలో భాగాలే. ఇవన్నీ గుప్త ధనాలు. ఇవి జీవుడిని పవిత్రం చేస్తాయి. డబ్బు పెట్టి ఖరీదైన మంచం, భోగాలు కొనుక్కోవచ్చు కానీ, నిద్రను, మోక్షాన్ని కొనలేవు. ధనము, చదువు ఉన్నా తెలివితేటలు లేకపోతే సుఖంగా ఉండలేము. సంపద ఉంటే యోగానికి ఉపయోగించుకోండి. భోగాలకు ఉపయోగించుకోకండి. మీరు ధర్మంగా ఉంటే మిమ్మల్ని అర్థం (సంపద) వరిస్తుంది. మీరు అధర్మంగా ఉంటే అనర్థం మిమ్మల్ని వరిస్తుంది. ఇవి గుర్తు పెట్టుకోండి. ఎక్కువగా ఇయ్యి, ఎక్కువగా తీసుకుంటావు. సంస్థ మీద అజమాయిషీ చేసే నేర్పు నీకు లేకపోతే నీ సంస్థని బాధ్యత లేని అవినీతి పరులు దివాళా తీయిస్తారు. అది కూడా దోషమే. గుర్తింపులు, కీర్తి కోరుకున్న వారు ఎంత ధనం ఉన్నా లోపల పేదవారే. అవి త్రాగుబోతు లక్షణాలు. ఆత్మానందం మాత్రమే కోరుకోవాలి. పరుల ధనంపై ఆధారపడితే బానిసత్వం వస్తుంది. సత్రంలో ఊరికే భోజనం పెడుతున్నారు అంటే అది ఎప్పుడు మూసేస్తారో తెలియదు. విపరీతంగా ధనవంతుడు అవ్వాలంటే ఎంతోకొంత పాపం చెయ్యవలసి వస్తుంది. "పెడితే పుడుతుంది" నానుడి. ఉసిరికాయను సాకుగా తీసుకుని కనక వర్షం కురిపించారు శంకరాచార్యులు వారు. దానినే కనక ధారా స్తోత్రం అంటారు. వారు ఇరువది తరాల వారైనా ఆ సంపద అలాగే ఉంది. అది ఆచార్యుల వారి వైభవం. ధనవంతులను, చదువుకొన్న వాళ్ళను పరమహంసగారు ఎప్పుడూ గౌరవించలేదు. కారణం వారిలో స్వార్థం ఉంటుంది. ఉప్పు నీరు ఎంత త్రాగినా సంతృప్తి ఉండదు. డబ్బు సంపాదనాపరులలో సంతృప్తి ఉండదు. లక్ష్మీదేవి అనుగ్రహం ఉంటే సాధన శాంతంగా సాగుతుంది. డబ్బు ఎప్పుడు సంపాదించాలో అప్పుడే దానిని పూర్తిగా ఖర్చుపెట్టేవాడిని కూడా భగవంతుడే నిర్ణయిస్తాడు.

# 6. ఈశ్వరుడు

1. పనికిరాని వస్తువులు, పాడైపోయి కుళ్ళిపోయిన వస్తువులు మనం ఇతరులకు ఇస్తే వచ్చే జన్మలో ఆ పాడైపోయిన వాటినే మనచేత తినిపించేటట్లు చేస్తాడు ఈశ్వరుడు. మీ చైతన్యస్థాయి పెరగడానికి మీ పరిస్థితులు అన్నీ అనుకూలంగా ఉన్నా, ప్రశాంతంగా ఉన్నా భగవంతుడు కారణం లేకుండానే అశాంతిని కలుగజేసే తలంపులను కల్పిస్తాడు. కారణం నీ లోపల ఉన్న అజ్ఞానం పోవాలి. అలా చెయ్యకపోతే వేలాది జన్మలు కొట్టుకు పోతావు. అజ్ఞానికి పక్షపాతం ఉంటుంది. భగవంతునికి పక్షపాతం ఉండదు. నీవు అర్హతను సంపాదిస్తే అనుగ్రహిస్తాడు. చంటిపిల్లవాడి దగ్గర నుండి ఒక పండు ఇవ్వమంటే వాడికి ఇవ్వాలని ఉంటే ఇస్తాడు. కానీ మనం బలవంతంగా తీసుకోలేము. అలాగే భగవంతుడు కూడా. అనుగ్రహం ఇవ్వమని అందరూ ప్రార్థించినా ఇవ్వడు. ఎవరికి ఇవ్వాలని ఉంటే వారికే ఇస్తాడు. ఈశ్వరుని పాదాలు ఆశ్రయించకుండా అనుగ్రహాన్ని ఇవ్వడు. ఆయనే ఈ బొమ్మలను ఆడించేవాడు. ఎవరిచేతనైనా కఠినంగా మాట్లాడించేవాడు ఆయనే. ఆయన ప్రేరణ లేనిదే ఎవ్వరూ ఏమీ అనలేరు. బయటి వ్యక్తులు నిమిత్త కారణంగా వ్యవహరిస్తారు. మనకి భయం ఎందుకు కలుగుతున్నది అంటే ఈశ్వరుని యొక్క శక్తి తెలియకపోవడంచేత దుఃఖం, అశాంతి వస్తున్నాయి. అరూపమే నీ స్వరూపం. కృష్ణుని గురించి చెప్పాలంటే పుట్టుక ఎటువంటిదో తెలియనివాడు, చావు ఎటువంటిదో తెలియనివాడు. శరీరం ధరిస్తే ఎవరు గుర్తించగలరు? భగవంతుడు అంతటా ఉన్నాడో లేడో మనకి తెలియకపోయినా అంతటా మాయ ఉంది. దానికోసం కాశీ, రామేశ్వరం వెళ్ళనక్కరలేదు. త్రికరణశుద్ధి లేకపోవడమే మాయ. 'ఐశ్వర్యం' అనే పదం ఈశ్వరునిలోంచి వచ్చినదే. చైతన్యం వల్లనే జడమైన బుద్ధి, శరీరము పనిచేస్తున్నాయి. ఆ చైతన్యం తప్పకుంటే శరీరం జడమే. మీకు తెలివి ఇచ్చిన వానికి, మనస్సు ఇచ్చిన వానికి తెలివి లేకుండా ఉంటాడా?





మీరు ఎవరికైనా పది రూపాయలు ఇస్తే ప్రతిఫలం ఆశించి ఇస్తున్నారా? గౌరవం కోసం ఇస్తున్నారా? పని పని కోసమే ఇస్తున్నావా? అని ఈశ్వరుడు చూసుకొని మీకు మార్కులు ఇస్తాడు.

2. నీకు బెంగ పెట్టుకునే కారణం ఉన్నా మీరు ప్రశాంతంగా ఉంటే ఈశ్వరుడు దానిని చూచి అయ్యో ఎంత కష్టం ఉన్నా బెంగపెట్టుకోవడం లేదు, వాడికి అనుగ్రహం ఇవ్వాలి, ఇవ్వకపోతే ఎలా అని ఆయనే బెంగ పెట్టుకుంటాడు. ఈశ్వరుడు కారణాలు అన్నిటికన్నా కారణం. "భగవంతుని అనుగ్రహం ఘనీభవిస్తే ఎలా ఉంటుందో చూడాలని ఉంటే అరుణగిరిని చూడవచ్చును" అన్నారు భగవాన్. జర్మనీ గురువు గారిని ఒకరు ఇలా ప్రశ్నించారు "మిమ్మల్ని చూడడానికి అందరూ ఎందుకు వస్తున్నారు?" అనగా "నేను ఏమీ చెయ్యడం లేదు, సాధించలేదు" అని అన్నారు. దాని అర్థం ఏమిటి? చైతన్యం ఏమీ చెయ్యదు, సాధించదు. ఆత్మ ఏదిగా ఉన్నదో అది అయి ఉన్నాడు. ఆ మాట ఎవరికీ అర్థం కాదు. సాధించేది, చూచేది మనస్సే అనుకుంటుంది. తెలిసింది, తెలియదు అని బుద్ధి అనుకుంటుంది. చైతన్యం ఏమీ అనుకోదు. బుడబుక్కల మనస్సే అన్నీ అనుకుంటుంది.

3. విష్ణువు అంటే యజ్ఞమని వేదంలో ఉంది. మనమంతా సున్నాలం. అంతా భగవంతుని సంకల్పం వల్లనే జరిగిపోతున్నది. భగవంతుని విడిచిపెట్టి ఏ వ్యక్తి అయినా ఉన్నాడా? ఉన్నదే ఈశ్వరుడు. అన్నం వండినప్పుడు గరిటెను ఎలా ఉపయోగిస్తామో అలాగే కర్మ పరిపాకం పూర్తి కావడానికి ఈశ్వరుడు మనలను ఉపయోగించుకుంటున్నాడు. ఈశ్వరుడు లేకుండా జీవుడు, ప్రకృతి రాదు. భగవంతుని మరో పేరే ప్రపంచం. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు ఈశ్వరుడని తెలియకపోడవం పుణ్యబలం లేకపోవడం వల్లనే. ఆ అవతార పురుషులు కళ్ళతో చూసి చంపగలరు. గడ్డిపరక మంత్రించి సృష్టిని భస్మం చేయగలరు. దేవతా పురుషులను నీ పాడుబుద్ధితో కొలిచి నీకన్నా తక్కువ వాడు అనుకుంటున్నావు. రాగ ద్వేషాలు

లేని అవతార పురుషుడు ఏ పని ఎందుకు చేస్తున్నాడో నీ బుద్ధికి అందదు. వాళ్ళ విశ్వ ప్రేమ దృష్టితో చూస్తే అర్థం అవుతుంది. కాలుడికి - కాలానికి అందని సత్‌పదార్థం నీ హృదయంలో ఉంది. శ్రీకృష్ణుడు దేవాది దేవుడు. నోటి నిండా వెన్నపూస, హృదయం నిండా ఆనందం, చేతి నిండా పని. భగవంతుడు ఒక్కడే పరిపాలకుడు. నీవు మంచి చేసినా, చెడు చేసినా ఆయన సంకల్పమే నెరవేరుతుంది. మేము మంచి వాళ్ళము అంటారు. నిజంగా మీరు మనస్సులో మంచిగా ఉన్నారా? ధర్మామీటరు మీ జ్వరాన్ని తెలుపుతుంది. అలాగే నీవు ఎలా మంచిగా ఉన్నావో ఈశ్వరుడు కొలుస్తాడు. భగవంతుడు ఉన్నాడా? అంటే బుద్ధుడు ఉన్నాడనీ చెప్పలేదు, లేడనీ చెప్పలేదు. కారణం ఆ రెండింటికి ఆవల ఉంది ఆ సత్‌పదార్థం. అది అనుభవైకవేద్యం. బుద్ధుడికి సృష్టి అక్కరలేదు. బద్ధుడికే సృష్టి. శివుడు మేథమెటిక్స్, పార్వతి ఫిజిక్స్ రెండూ ఒక్కటే. కంటికి రెండుగా కనిపించవచ్చు. శివుడు మహా నిరాడంబరుడు. అటువంటి వానిని భర్తగా స్వీకరించడం గొప్ప విషయం. చక్రం కాలానికి, శంఖం వైకుంఠానికీ గుర్తులు. ఈశ్వరుడు నీకు జ్ఞాపకం వస్తూ ఉంటే అది నీ తెలివి వల్ల కాదు, అనుగ్రహం వల్లనే. భగవాన్ అరుణాచల నామం వినడం, అరుణాచలం వెళ్ళడం, అక్కడ బోధ చెయ్యడం అన్నీ మనస్సుతో చేసుకున్న సంకల్పాలు కావు. అంతా అనుగ్రహమే అలా చేయించింది.

4. ముక్కులో గాలి ఎందుకు తిరుగుతన్నది అంటే ఆ దేహానికి ఒక ప్రారబ్ధం ఉంటుంది. దానిని అనుభవించడానికి అక్కడ ప్రాణం నిలబెట్టాడు ఈశ్వరుడు. గోపికల యొక్క ప్రేమ ఆపుకోలేని ప్రేమ. "ఆ ప్రేమ ప్రవాహంలో, ఆ భక్తి ప్రవాహంలో ఒకవేళ బురద ఉన్నా ఆ ప్రవాహంలో కొట్టుకొని పోతుంది. అప్పుడు కూడా మాకు కనిపించేది నీ పాదాలే" అంటారు గోపికలు. మనం తరించడానికి పెద్ద సాధన చెయ్యనక్కరలేదు. పరమాత్మ పాదాల మీద భక్తి ఉంటే చాలు. దేవుడు దేవునిగానే వస్తున్నాడు, దేవునిగానే వెళ్ళిపోతున్నాడు. ఆయన వైభవం అది. మనం జీవులుగా





వచ్చాము. కానీ వెళ్ళినప్పుడు ప్రేమను అలవరచుకొని ఉంటే దేవుడై వెళతాము. అంతర్యామి యొక్క వైభవం తెలియక ఆయన శక్తి, జ్ఞానం వ్యాపకత్వం, యజమానత్వం ఇవి అన్నీ నీకు అవగాహన లేకపోవడం వల్ల నేను ఏదో చేస్తున్నాను అనుకొంటున్నావు. ఈశ్వరుని శరణు వేడుకో. అంతటా ఉన్నవాడు ఆయనే. మనల్ని ఆడించేవాడు ఆయనే. మీరు ఒక్కోసారి పెద్ద ఘనకార్యం చేయవచ్చు. ఫలితం చిన్నది రావచ్చును. అలాగే ఒకేసారి చిన్నపని చేసినా ఫలితం పెద్దది రావచ్చు. ఎందుచేతనంటే జడవస్తువులను ఫలితాన్ని నిర్ణయించే శక్తి లేదు. ఫలితాన్ని నిర్ణయించేవాడు ఈశ్వరుడే. అదే "కర్తురాజ్ఞేయా" అంటే. జ్ఞానం ఎలా వస్తుంది అంటే భగవంతుడు చేస్తున్నాడు అనే విషయం తెలియకపోవడం ఒక పొరపాటు. పైగా నేను చేస్తున్నాను అనుకోవడం ఇంకొక పొరపాటు. ఈ జీవకోటిని, పంచభూతాలను నియమించేవాడు ఈశ్వరుడే. సృష్టి అంటే ఈశ్వరుడి యొక్క స్థూల రూపం. దేవుడు మనలను స్మరిస్తే మనం పవిత్రులము అవుతాము. మోక్షం ఇచ్చేది ఆయనే. భగవంతుని యొక్క శక్తి తెలిసిన తరువాత గాని ఆయన మాట యొక్క విలువ తెలియదు. 'భగ' అంటే ఐశ్వర్యం. భగవంతుడు అంటే ఐశ్వర్యవంతుడు. "ఈశ్వరుని సంకల్పం లేకుండా రూపము రాదు. ఈశ్వర సంకల్పం ఎంత నియమంగా ఉంటుంది అంటే ఇల్లు కట్టుకునేటప్పుడు ఇంజనీరు చేసిన డిజైన్‌ని తాపీమేస్త్రి తు.చ. తప్పకుండా నిర్మిస్తాడు. అలాగే మనం పుట్టినప్పడే ఎప్పుడు ఎక్కడ ఏది ఎలా జరగాలో అలా జరిగిపోయేలా ఈశ్వరుడు నిర్ణయించాడు. ప్రపంచాన్ని నడిపేది ఆయనే. సోక్రటీస్ జైలులో ఉండగా సన్నిహితులు ఆయన మరణాన్ని గురించి సోకించగా "నా శరీరం మరణించడం మీ శరీరాలు కొంతకాలం జీవించడం ఈశ్వర నిర్ణయంలో ఉంది. దానిని గౌరవిద్దాం" అన్నారు.

5. అవతార పురుషులకు ప్రారబ్ధం లేదు. దుష్టుడు చేసే చెడ్డ, మంచివాళ్ళు చేసే మంచి సమిష్టి ప్రారబ్ధం వల్లనే అవతార పురుషులు వస్తారు. ఈశ్వరుడు సర్వసాక్షి అంతా చూస్తున్నాడు. ఎవ్వరూ చూడకుండా

మేము చేసేస్తున్నాము అనుకోవద్దు. వాటిని కూడా ఆయన లోపల ఉండి చూస్తున్నాడు. వాడు నిన్ను ఏమీ అనడు. రికార్డు చేస్తాడు. ఇది మనం గుర్తుపెట్టుకుంటే కొన్ని చెడ్డపనులు చేయడం మానేస్తాము. ఈశ్వరుడు మనిషిని జమిందారుని ఎందుకు చేస్తాడో మనకి తెలియదు, నిన్ను ఎందుకు దరిద్రుణ్ణి చేస్తాడో తెలియదు. దానికి పూర్వజన్మకి సంబంధం ఉంటుంది. మరల దానికి రాబోయే జన్మకి సంబంధం ఉంటుంది. అది మనకి తెలియదు, మన కళ్ళకి కనబడదు. మన బుద్ధి దానిని గ్రహించలేదు. కర్మఫలం ఈశ్వరుడు పంచిపెడతాడు. అందుచేత ఈశ్వరునికి లొంగి ఉండవలసిందే. బ్రహ్మం 'శూన్యం'లా కనిపిస్తుంది కానీ శూన్యం కాదు. ఏసు నేను బ్రహ్మం కన్నా ముందు ఉన్నాను అంటే అది చైతన్యానికి చెంది స్థితి. మనకు మన గృహంలో ఉన్నవారే మన కుటుంబంగా భావిస్తాము. ఈ ప్రపంచం అంతా భగవంతుని కుటుంబమే. మీ అందరికీ ఇళ్ళు ఉన్నట్లే భగవంతునికి ఇల్లు ఉంది అది దేవాలయం. అది అద్దె ఇల్లు. ఈశ్వరుడికి సొంత ఇల్లు మన హృదయమే. మీరు దేవాలయానికి వెళితే నా జీవితం నీ పాదాల దగ్గర పెడుతున్నాను అనండి. మనకి శివుడు అవ్యక్తం. అందులోంచే ఆకాశము, వాయువు, అగ్ని, నీళ్ళు, భూమి వచ్చాయి. ఈ జీవకోటి వచ్చింది. ఇది సృష్టి క్రమం. పంచభూతాలే సృష్టి. శివుడు లయ కారకుడుకాని శుభ కారకుడే. ఈ సృష్టి పూర్తిగా అంతరిస్తే కానీ కొత్త సృష్టి రాదు. శరీరం పాడై మరణిస్తే కానీ తిరిగి శరీరం రాదు. అదే లయకారకుడు అంటే. పగలు రంగులు, రూపాలు, గుణాలు, ద్వేషాలు, విరోధులు ఉన్నారు. రాత్రి నిద్రలో ఏమీ లేవు. వాటిని లయం చేసాడు శివుడు. అంతేకాని నాశనం చేసేవాడు అనేమాట తప్పు.

6. ఈశ్వరుడు అంటే సగుణ బ్రహ్మం. నియామకుడు. భగవంతుణ్ణి ఒక రూపంగా పేరు పెట్టి పిలవాలంటే నారాయణ, నారాయణ అని పిలవాలి అంది వేదం. భగవంతుని నీడే ఈ ప్రపంచం. భగవంతునికి ఎన్నెన్ని కల్యాణ గుణాలు ఉన్నాయో అన్నీ ఉన్న వానిని పూర్ణావతారం అంటారు. అది





శ్రీకృష్ణునిలో ఉంది. వారు నివశించినది బృందావనం, రేపల్లె, ద్వారక, మధుర. భగవంతుడు శ్రవణ ప్రియుడు, ధ్యాన ప్రియుడు, భక్తి ప్రియుడు. ఈశ్వరుడు అనే పదం సాపేక్షికంగా అంటారు. బ్రహ్మానికి సంకల్పం లేదు. మహాత్ములు భక్తుల కష్టాలను, దుఃఖాలను తనవిగా భావిస్తారు. ఈశ్వరుడు గోడలాంటివాడు కాదు. ఆయన నీ ప్రార్థనకు స్పందిస్తాడు. నీ జీవిత విధానానికి స్పందిస్తాడు. నీ జీవ లక్షణాలు నశింపచేయడానికి నీ మనస్సును హృదయంలో ముంచుతాడు. నీ ఉపకార బుద్ధికి, నీ జీవన విధానానికి స్పందిస్తాడు.

# 7. సత్సంగము

1. చీకటిని గురించి ఆలోచించడంలో ప్రయోజనం ఏముంది? వెలుగును గురించి ఆలోచించాలి, (ఆత్మను) బోధించాలి. కొబ్బరిచెట్టు ఎక్కడం రాదు. కాయలు కోసి నా దగ్గర ఉంచుకుంటాను అనుకోవడం ఎటువంటిదో ఆ రీతిగా కొందరికి సాధన ఉండదు, సహృదయం ఉండదు. మీకు బోధిస్తాము రండి అంటారు. గురువు అవుదామని గాలి మేడలు కట్టుకోకూడదు. సత్సంగము వదలకూడదు. సబ్జక్టు ప్రవాహంలా రావాలి. అందు వ్యక్తిభావన ఉండకూడదు. మాటకు - మనస్సుకు - చేతకు సంబంధం లేని వానికి జ్ఞానం ఎలా వస్తుంది? నలుగురితో కలసి చర్చించుకోవడమే సాధన అనుకోకండి. ఏ పరిస్థితిలో ఉన్నా భగవంతునితోనూ, గురువుతోనూ అనుసంధానం కలిగి ఉండటం కూడా సత్సంగమే. ఆరోగ్యంగా ఉన్న వానికి డాక్టరు అక్కరలేదు. అజ్ఞానికి జ్ఞాన సంబంధమన మాటలు ఎక్కువ ప్రయోజనం లేదు. జ్ఞానికి మాటలు అక్కరలేదు. జిజ్ఞాసువులకే బోధ. శ్రీకృష్ణుడు అన్నారు ఉద్ధవునితో "అధ్యయనం కంటే సత్కర్మ కన్నా, ధ్యానం కన్నా సత్సంగం వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. కారణం సద్గురువుల భావనా తరంగాలు నీ మీద పడతాయి" అని. అజ్ఞానం పోవాలంటే గురువు యొక్క దయ అవసరం. బైబిల్‌లో "వాక్యము దేవుడై ఉన్నది" అని ఉంది. భగవంతుడు చెప్పిన వాక్యాన్ని శ్రవణం చేసి, దానిని

మననం చేసుకొని, దానిని జీవితంలో ఆచరింపచేసుకోవాలి. అప్పుడు మనస్సు పవిత్రమవుతుంది. బోధ శరీరానికి కాదు, మనస్సుకి, శ్రవణం చేయగా చేయగా మనస్సు పవిత్రమవుతుంది. అప్పుడు లోపల జ్ఞాన స్వరూపుడు ఆకర్షించుకుంటాడు. ఈశ్వరునిలో ఉన్న సారమే వాక్య రూపంలో వస్తుంది. మనకి శాస్త్రం అర్థం కాదు అనుకోండి, అర్థం అయ్యే బుద్ధిని ప్రసాదించమని ఈశ్వరుని ప్రార్థించాలి. ఒక వాక్య విషయం అర్థం అయ్యే కొలది ప్రతిఘటన తగ్గిపోతుంది. నూటికి 90% సబ్జక్టు అవగాహన తోనే అన్నీ వచ్చేస్తాయి. మనం చేసేది 10% మాత్రమే. మనకు వాక్యం అర్థం అయితే జీవితాన్నే మార్చివేస్తుంది. మా టీచింగ్ లక్ష్యం దుఃఖం లేని స్థితికి భక్తుడు వెళ్ళాలి. ఇప్పుడు, అప్పుడు పరిస్థితులు బాగుంటే సుఖంగా ఉండటం నిజంకాదు. పూర్ణంగా శేషం లేకుండా దుఃఖం నశించాలి. అప్పడే నిజమైన సుఖం. ఆ స్థితికి తీసుకొని వెళ్ళడానికే ఈ బోధ. ఈ బోధతో (బోధ మనకి అర్థం అయితే) ఇంట్లో ఉన్న వ్యక్తి యొక్క విధానం నష్టాన్ని, కష్టాన్ని కలుగజేస్తే వాడిని బాగుచెయ్యడానికి ప్రయత్నం చేస్తాము కానీ వాడిని విడిచిపెట్టము. బాధను పోగొట్టడానికే బోధ. పని చేయడం మానేసి అంతా బ్రహ్మమే అనుకుంటే భోజనం ఎలా వస్తుంది?

2. గురువుతో మానసిక అనుబంధం పెట్టుకుంటే అది సత్సంగమవుతుంది. గురువు సత్యమే. భగవద్గీత చదివితే పనిలో, మాటలో కూడా ఔన్నత్యం కనిపిస్తుంది. భగవద్గీత కూడా మామూలుగా చదివితే అర్థం కాదు. మొట్టికాయలు తగిలిన తరువాత అంటే ఇంట్లో సభ్యులను ప్రేమించి, ప్రేమించి వాళ్ళు వ్యతిరేకమైన మాటల్ని మనం తట్టుకోలేము. ఆ మాటలే మొట్టికాయల్లా తగులుతాయి. అప్పడు "భగవంతుడు ఎంత బాగా చెప్పాడు" అనిపిస్తుంది. అప్పటివరకు గీత విలువ మనకి తెలియదు. మంచి గాలి పీల్చుకోవాలని అనుకుంటాము. చెడుగాలి దగ్గర ఉండలేము. అలాగే చెడు స్నేహాలు, చెడు పుస్తకాల విషయంలో దగ్గరగా ఉండకూడదు. కొన్ని స్నేహాలు అద్భుతంగా ఉంటాయి. అలాగే సద్వస్తువు అద్భుతంగా ఉంటుంది.





శ్రవణం వల్ల ఏది పొందాలో అది తెలుస్తుంది. మననం వలన పొందవలసిన దానిని పొందుతాము. మీరు కాని దానిలో నుండి మీరు విడుదల పొందుతారు (మీ ఆచరణ నిజమైతే) సత్సంగం వలన తెలివిపెరుగుతుంది. జ్ఞానం పట్ల ప్రీతి పెరుగుతుంది. విషయ చింతన తగ్గి దైవచింతన పెరుగుతుంది. జన్మాంతరాలలో వచ్చే చెడు తలంపులు కాలి బూడిద అవుతాయి. ఎన్నో జన్మల పుణ్య సంస్కారం ఉంటేనే సత్సంగం దొరుకుతుంది. లేకపోతే ఆ బుద్ధి పుట్టదు. మీకు మంచితనం లేకపోయినా నేను మంచి వాడిని అని మీరు అనుకోవడం కాదు ఈశ్వరుడు అనుకోవాలి. నీవే అనుకుంటే నీవు పూర్తిగా పాడైపోయిన వాడివే. మంచితనంతో పాటు వివేకం పెంచుకోవాలి. సజ్జన సాంగత్యం వల్ల లోకం మీద ఉన్న మోహం తగ్గిపోతుంది.

3. సత్పురుషుని కోపం నీటి మీద రాతలా ఉంటుంది. నీచుని కోపం చచ్చేవరకు ఉంటుంది. సత్‌గ్రంథ పఠనం కూడా సత్పురుషుల సహాయంలా మీకు ఉపయోగపడుతుంది. సజ్జన సాంగత్యంలో నీ బుద్ధిలోని దోషాలు, వారి ప్రభావం వల్ల బయటకు వస్తాయి. సుభాషితాలు ఈ కృత్రిమమైన 'నేను' బాగుపడడానికే. సబ్జక్టును గ్రహించడానికి మెదడును ఉపయోగించాలి. బోధకు ప్రాముఖ్యం ఇవ్వాలి. శ్రవణం చేయడం వలన రోగం తగ్గకపోయినా రోగం తెలుసుకోవచ్చును. మన మనస్సులో ఏముందో మనకు తెలుస్తుంది. ఇరువది నాలుగు గంటలు మనం లోకం గొడవల్లోనే ఉంటున్నాము. ఈ లోకం గొడవలు మనలను నరకానికి వెళ్ళడానికి మెట్లు కడతాయి. కొన్ని సత్సంగాలు అరగంట ఏదో చదివి ఊరిగొడవలు చెప్పకుంటారు. మనం నరకానికి వెళ్ళే యోగం ఉంది కాబట్టే లోకం గొడవలు విడిచిపెట్టలేకపోతున్నాము. లోకం గొడవల వల్ల లాభం లేదు. చనిపోయాక చీకటి లోకాలకు వెళ్ళిపోతాము. సత్‌గ్రంథ పఠనం వల్ల దానిని నీవు ఎంజాయ్ చేయడం వలన, ఇతరులకు చెప్పడం వలన ఆ సత్యాన్ని అనుభవంలోకి తెచ్చుకోవాలనే బుద్ధి పుడుతుంది. అంతేకాదు మీరు

సత్సంగంలో మాట్లాడుతూ ఉంటే దాని ప్రయోజనం "ఈ మాటలను మనం ఎంతవరకు ఆచరిస్తున్నాము? ఆ మాట వల్ల ఎంతవరకు పవిత్రతను సంతరించుకొన్నాము అనే ఎరుక కలుగుతుంది. భయపడేవాడు సభలో మాట్లాడితే పొరపాటు మాటలు వస్తాయి. విశ్వనాథ సత్యనారాయణగారిని శ్రీశ్రీ "రోజూ రామాయణం చదువుకోవడం ఏమిటి?" అంటే "రోజూ అన్నం ఎందుకు తింటున్నావు? ఏదైనా తినవచ్చు కదా! రామాయణం అన్నం లాంటిది" అన్నారు. సాధు సాంగత్యం వల్ల అన్ని బలహీనతలు నశిస్తాయి. మానవ పురోగమనానికి ముందు సత్కర్మ పుణ్య బలం ఉండాలి. పాయసం నోట్లో పోసుకుంటే ఎలా ఉంటుందో, వేసవికాలం ఉక్కబోసినప్పుడు చల్లటి గాలి వీస్తే ఎలా ఉంటుందో సబ్జక్టును ఎంజాయ్ చేసినప్పుడు అంత ఆనందం కలుగుతుంది. ఈ ఒక్క మాటలో ఉన్న ఆనందం చాలు. మనం పోయినా ఫరవాలేదు అనిపిస్తుంది అది సత్సంగ వైభవం.

4. మనం స్నేహాలు సత్పురుషులు, వివేకవంతులతో చేస్తే ఆ స్నేహాలు బ్రహ్మానుభవానికి సహాయం చేస్తాయి. సత్యానుభవానికి ప్రయత్నం చేస్తాము. గీతాపారాయణం వల్ల దుఃఖం తగ్గుతుంది. దానితో భూమినంతా వెలుగుతో నింపవచ్చును. అది మోక్షశాస్త్రం. అందులో పరమాత్మ "మీ లోపల నేను లేను, నా లోపల మీరు ఉన్నారు" అంటే సముద్రంలో నీటికి పరిమితులు లేవు. బుడగకు పరిమితం ఉంది. మన జీవితం నీటి బుడగ అని అర్థం. ప్రాణం లేని శరీరం ఎటువంటిదో భగవద్గీత లేని ఇల్లు అటువంటిదే. వేదాంతం వినడానికి అర్హత ఉండాలి. అందరూ వినవచ్చు కానీ గుండెకు పట్టదు. దానికి పుణ్యబలం, క్రమశిక్షణ, వైరాగ్యం ఉండాలి. జ్ఞానానికి పెట్టుబడి వైరాగ్యం. మనస్సు నిర్మలం చేసుకొని ఎంతోకొంత బుద్ధి సూక్ష్మత పెంచుకొని వేదాంతం వినాలి. ఆచార్యులవారు స్తోత్ర గ్రంథాలు వ్రాసారు. ఒకరు ఆచార్యుల వారితో "దేవతలు కూడా దుఃఖపడ్డారు. అలాంటివారు మన దుఃఖాలను ఎలా తీర్చగలరు? అనగా వాళ్ళు దుఃఖపడ్డా అసత్యమనే ఎరుక ఉంటుంది. నీ దుఃఖాన్ని తొలగించే శక్తి వారికి ఉంది. ఆ గ్రంథాలు చదవడం





వలన నీ బుద్ధి నీ ఆధీనంలో ఉంటుంది" అన్నారు. శంకరులు వ్రాసిన భాష్య గ్రంథాలను భాష్య దీపాలు అంటారు. అజ్ఞానమనే చీకటిలోనుండి వెలుతురులోకి అవి తీసుకొని వస్తాయి. సంవత్సరం పొడవునా గురువు నీకు అందించే సహాయ సహకారములకు కృతజ్ఞత తెలుపడానికే, వారి ఋణం తీర్చుకోవడానికే గురుపూర్ణిమ ఏర్పాటు చేసారు. వారు చెప్పిన సందేశం జ్ఞాపకం పెట్టుకోవాలి. గీతలో చెప్పిన దైవీసంపద సంపాదిస్తే ఆత్మానుభవం కలుగుతుంది. ఆ సంపదకు నాయకుడు ధైర్యం. రాగద్వేషాలు ఉన్నవాడు ప్రవచనానికి పనికిరాడు. భౌతిక వనరులు అయిన స్థలాలు, మేడలు, డబ్బు పెట్టి కొనుక్కోవచ్చుగానీ సత్పురుషుణ్ణి డబ్బుపెట్టి కొనలేరు. టీచింగ్ చేసేవాళ్ళు వాళ్ళ జీవితం నేర్పిన పాఠాల్ని, దెబ్బతిన్న అనుభవాలను టీచింగ్‌లో జోడించి చెబితే వినేవాళ్ళు కూడా నేర్చుకుంటారు. తమ అనుభవాల్ని కలిపితే టీచింగ్ కూడా మధురంగా ఉంటుంది. శ్రీకృష్ణుడు గీతలో చెప్పిన దైవీ సంపదలో ఏసు కొండ మీద ప్రసంగం కూడా అలాగే ఉంటుంది.

5. రామాయణం చదువుతూ ఉండటం వల్ల నైతిక విలువలు పెరుగుతాయి. త్యాగరాజు తండ్రి తంజావూరు మహారాజు వద్ద రామాయణం చదువుతూ ఉండటం, త్యాగరాజు కూడా వెళ్ళి వాటిని వినడం వల్ల రామునిలో ఇన్ని కళ్యాణగుణాలు ఉన్నాయా అని వాటిని సంపాదించాలి అనే సంకల్పం కలిగింది. ఆయనకు భౌతిక సంపదపై ఆసక్తి పోయింది. రామునిపై ఇరువది నాలుగు వేల కీర్తనలు వ్రాసారు. శంకరాచార్యుల వారు నూటికి 80% బోధతోనే సత్యం దగ్గరకు తీసుకొనిపోతారు. అవగాహన ముఖ్యం. మొక్క వేయకుండా, మొక్క వేసినా నీళ్ళు పోసి పెంచకుండా, రక్షణ లేకుండా అది కాయ కాస్తుందా? అసలు సద్విషయం తెలియకుండా వస్తువును అనుభవిద్దామనే ఆసక్తి, ప్రయత్నం ఎలా చేస్తావు? ఆచార్యులవారు "పాండిత్యం అంటే పదాల ఆడంబరం కాదు, ఏది సత్యమో, ఏది అసత్యమో గ్రహింపు సమత్వం రావాలి" అన్నారు. మీరు భయరహిత, మరణ రహిత స్థితిని పొందడానికి ఈ సభలు ఉపయోగపడతాయి. ఉజ్జయినికి ముప్పది

మైళ్ళ పరిధిలో భూమిలోని ఏ చెట్టు ఫలమైనా తియ్యగా ఉంటుంది. కాళిదాసు అక్కడే నివశించాడు. శ్రీ నాన్నగారి పెంకుటిల్లు తీసేసిన తరువాత ఒకరు ఒక కవితలో "ఆ అరుగు మీద ఎన్ని మధుర విషయాలు జరిగాయి. ఎంతమంది వచ్చి శాంతిని పొందివెళ్ళారు" అని వ్రాసారు. "పోస్టాఫీసు ప్రవచనాలు ఇంకా అద్భుతం. అవి నీళ్ళు కలపని పాలు. సత్త్వగుణాన్ని ప్రకాశింప చేయాలి. గీత మొదటి ఆరు అధ్యాయాలు కర్మయోగం గురించి, రెండవ ఆరు అధ్యాయాలు భక్తి గురించి, చివరి ఆరు అధ్యాయాలు జ్ఞానం గురించి చెప్పారు. ప్రసంగాలు సహృదయంతో విననప్పడు చప్పగా ఉంటాయి.

## 8. నిష్కామ కర్మ

1. స్వార్థం లేకుండా నీవు చేసే పనుల వల్ల పని అద్భుతంగా జరిగి పోతుంది. మంచి మాటలు వస్తాయి. "దయ" అంటే అన్నవస్త్రాలు లేక నిజంగా ఎవరు దుఃఖపడుతున్నారో తెలుసుకొని నిష్కామంగా, నిరాడంబరంగా సహాయం చేసే పనినే దయ అంటారు. మంచిగా ఆలోచించకుండా మంచి పనులు చేయలేము. నీ ప్రవర్తన సరియైనది అయితే నీ ద్వారా గొప్ప పనులు జరుగుతాయి. ఒక జ్ఞాని "అథారిటీ వల్ల మొరాలిటీ రాదు. మొరాలిటీ అంటే నీతిగా ఉండటం. అధికారంలో ఉన్నా మని నీతులు గురించి చెబితే ఎవరూ ఆలోచించరు, ఆచరించరు" అన్నారు గాంధీజీ. ఆచరించి ఇతరులకు చెప్పాలి. దానం జరగడం వేరు, దానం ఇవ్వడం వేరు. ఇవ్వడంలో ఇచ్చేవాడు ఉంటాడు. దానం జరగడంలో ఇచ్చేవాడు ఉండడు. ఈ సూక్ష్మ దృష్టి గ్రహించాలి. అది అర్థంకాకపోవడం వల్లనే జన్మలు పెరుగుతున్నాయి. కదిలే కారు వల్ల దుమ్ము వస్తుంది. ఆగిన కారు వల్ల దుమ్ము రాదు. అలాగే మీరు కొన్ని మంచి పనులు చేస్తూ ఉంటే విమర్శలు వస్తాయి. ఏమీ చెయ్యని వాడిపైన విమర్శలు రావు. "నిందా స్తుతులను సమానంగా చూసుకోవాలి" అనే కృష్ణుని మాటలను నీవు ఆచరించినప్పడే కృతార్థుడవు అవుతావు. పుస్తకాలు వల్లించడం వల్ల అనుభవం రాదు. మీ మంచి మాటల వల్ల ఎవరికి శాంతి కలిగినా అది





కూడా నీవే. నీవు చేసే పనిలో అపేక్ష ఉండకూడదు. ఫలితం భగవంతుని దగ్గరే ఉందని గ్రహించాలి. మీరు చేసే పని వల్ల పదిమందికీ ఉపకారం జరిగితే అది కూడా దానమే. కర్తృత్వం కారణం దుఃఖ కార్యం. కర్తృత్వం అనేది ప్రకృతి వాసన. కర్తృత్వం పోవాలంటే నిష్కామంగా పనిచేస్తే పోతుంది. ఎన్ని యుగాలు బుద్ధుని పేరు ఉంటే అన్ని యుగాలు బుద్ధునికి పాయసం పెట్టి ఆ శరీరాన్ని నిలిపిన సుజాత పేరు ఉంటుంది. కారణం బుద్ధుని ఉపాధిని బ్రతికించినది సుజాత. సహృదయంతో చేసిన పని శాశ్వత మవుతుంది. ఆంజనేయస్వామి చేసిన కర్మ మనం అర్థం చేసుకుంటే మనకు మోక్షం కలుగుతుంది. కర్మ చేసి వదలాలి. దాని గురించి చిలవలు, పలవలు అల్లుకోకూడదు. అదే నిష్కామ కర్మ.

2. రాగానికి, ద్వేషానికి మించిన దోషం మరియొకటి ఈ సృష్టిలో లేదు. రాగ రహిత స్థితి, రోగ రహిత స్థితి పొందితే మనస్సు చలించదు. నువ్వు వేరు, నేను వేరు అనే బేధబుద్ధి పెట్టుకోవడమే పాపం. అది తెలుసుకోలేక నేను పుణ్యాత్ముడను అనుకోవడం పాపలక్షణం. పుణ్య పాపాలను అనుభవించేది దొంగ నేనే. ఇది నీవు గ్రహిస్తే ఈ క్షణంలో జ్ఞానం వస్తుంది. శవంతో తాదాత్మ్యం పొందే నేనుకు జ్ఞానం రానేరాదు. మంచి పని చేసి మనం మన అహంకారానికి అర్పించుకొంటున్నాము. అలా కాకుండా దానిని దేవునికి అర్పించాలి. అదే నిష్కామ కర్మ. యజ్ఞము అంటేనే సేవ. ఇతరుల సుఖంకోసం చేసే పనిలో మనకు ఆధ్యాత్మిక అభివృద్ధి జరుగుతుంది. దానం అంటే సేవ. అది శాంతచిత్తంతో చేయాలి. మీరు చేసే దానం వల్ల మీకు బాధ రాకూడదు. శాంతి కలగాలి, నిష్కామ కర్మ వల్ల కూడా నారాయణుని పూజించవచ్చును అని గ్రహించాలి. కర్మ సిద్ధాంతం అంతా "నేను" అనే దాని మీదే ఆధారపడి ఉంది. కర్మసిద్ధాంతం గురించి వేలాది గ్రంథాలు వస్తున్నాయి. "దొంగ నేను పోతే కర్మసిద్ధాంతం ఏమి చేస్తుంది" అన్నారు భగవాన్. ఆ మర్మానికి ఈ ఒక్క మాట చాలు. టాంటాంల కోసం సహాయం చేస్తే ఇచ్చుకున్నవారు, పుచ్చుకున్నవారు కూడా సుఖపడరు.

గుణాలను బట్టి కర్మలు, కర్మలను బట్టే జన్మలు. బుద్ధి కర్మానుసారే అంటారు. సత్ కర్మ లేకపోతే మోక్షం పొందాలనే బుద్ధి కలుగదు. కర్మదోషం గురువు మీద బుద్ధి కలుగనివ్వదు. కర్మ రహస్యం తెలుసుకొని పనిచేస్తే మనకు కోరికలు రావు. ఈ పని నేను చేస్తున్నాను అనే తలంపు వల్లనే అలసి పోతున్నాము. ఒక మంచి పనికి డబ్బు ఇస్తాము కానీ ప్రాణం ఇవ్వలేము. కానీ జటాయువు సీత రక్షణకోసం ప్రాణాలు ఇచ్చింది. రాముని ఒడిలో ప్రాణం వదిలింది. దశరధునికి లేని వైభవం అది. శాంతి జ్ఞానేశ్వర్ గీతా వ్యాఖ్యానం వ్రాసారు. ఆయనకు చాలా మహిమలు ఉన్నాయి. ఒకడు తన మహిమలను ఆయన ముందు ప్రదర్శించడానికి పులి మీద స్వారీ చేస్తూ వస్తున్నాడు. జానేశ్వర్ వాడి గర్వాన్ని అణచడానికి ఆయన అనుకున్న గోడకు "నీవు ఆయనకు ఎదురుగా వెళ్ళు" అనగా గోడ కదలి వెళ్ళింది. ఆయన నిర్ఘాంతపోయాడు. అప్పుడు జ్ఞానేశ్వర్ ఇలా అంటాడు "ఈ మహిమల వల్ల నీకు ఏమీ కలసిరాదు. కర్మఫల కాంక్షతో పని చేస్తే తప్పనిసరిగా శరీరం వచ్చి తీరుతుంది. మీ ఇంటి దగ్గర పిల్లలు ఏదైనా చదివి విషయాన్ని చెబుతుంటే మీరు ఎలా వింటారో నా మాటలను అలా వినండి" అన్నారు. జఢ పదార్థమైన గోడను నడిపించిన ఆ అమృతమూర్తి మాటలు అలా ఉంటాయి.

3. భగవంతునిపై నిష్కామ భక్తిలో ఉన్నా, నిష్కామ ప్రేమతో ఉన్నా, నిష్కామ శరణగాతితో ఉన్నా బ్రహ్మానుభవం కలుగుతుంది. దేహబుద్ధి లేని వానికి నీవు ఏరకమైన సన్మానాలు, గౌరవాలు చేసినా అవి ఈశ్వరునికే చెందుతాయి. అవి ఈశ్వరుని మెడలో హారంగా పడతాయి. ఇతరులకోసం జీవించేవాడు సజీవంగా ఉంటాడు. ఇతరుల క్షేమంకోసం కనీసం మనస్సుతో కూడా ఆలోచించనివాడు, వాడు జీవించు ఉన్నా శవంతో సమానం. కర్మ యోగి అంటే వాడు స్వార్థ ప్రేరితుడుగా ఆలోచించడు, పని చెయ్యడు. నీకు స్వార్థం లేకుండా ఒక పని చేస్తే, ఒక తలంపు వస్తే అది నిన్ను బంధించదు సరికదా నీ బుద్ధిని బాగుచేస్తుంది. బంధంలో నుండి బయటకు రావడానికి అది నీకు సహకరిస్తుంది. లోపల స్వార్థం





పెట్టుకొని తలంపులు వస్తూ ఉంటే నీకు అశాంతి, దుఃఖం రాకుండా ఎలా ఉంటుంది? "ఎవడి బుద్ధి అయితే సమానంగా, నిర్మలంగా, కామ్య కర్మలు లేకుండా ఉంటుందో, నిష్కామ కర్మలు ఎవడైతే చేస్తాడో, వాడికి మాత్రమే నారాయణుడు ఎరుకలోకి వస్తాడు" అని ఉపనిషత్ అంది. ధనవంతుడు ఏదైనా ఇస్తే పుచ్చుకొని పేదవాళ్ళకు ఇవ్వండి. మతంగ మహర్షి శబరి యొక్క సేవాభావానికి పొంగిపోయి ఆత్మజ్ఞానం ఆమెకు చెప్పకుండా ఉండలేక చెప్పారు. "నీళ్ళతో శరీరాన్ని ఎలా శుభ్రం చేసుంకుంటారో అలాగే సత్కర్మ నిష్కామంగా చేసి సూక్ష్మశరీరాన్ని (మనస్సును) సంస్కరించుకోవాలి" అన్నారు తిరువాళ్వార్. కర్మమార్గంలో రెండు ప్రయోజనాలు ఉన్నాయి. ఇతరుల క్షేమం కోరుతూ, భగవంతుని ప్రీతి కోసం పని చేస్తే సంసార యాత్ర సుఖంగా వెళ్ళిపోతుంది. నీవు మోక్షానికి వెళ్ళిపోతావు. మీ ఇంట్లో ఎవరైనా ముసలివారు ఉన్నారు అనుకోండి వాళ్ళను మీ వారు అనుకోవద్దు, భగవంతుడి వారు అనుకోండి. అలా అనుకుంటే ప్రేమగా సేవ చెయ్యగల్గుతారు. మనం అనుకొన్నా అనుకోకపోయినా వారు భగవంతుని వారే. ఎందుచేతనంటే చనిపోతే వారికి మనకి సంబంధం ఉండదు. భగవంతునిలో ఐక్యం అయ్యేవరకు ఆయన వారిని విడిచిపెట్టడు. బఫెట్ అమెరికాలో రెండవ ధనవంతుడు. రూపాయి సంపాదనలో పావలా కుటుంబానికి ఖర్చుపెడతాడు. మొదట్లో చిన్న డాబా కట్టుకున్నాడు. ఎంత డబ్బు సంపాదించినా డాబా మారలేదు. ఇది మాకు సరిపోతుంది అంటాడు. సామాజిక సేవలో తెరవెనుక ఉండి సేవా కార్యక్రమాలు చేస్తాడు. సాదా కారులోనే వెళతాడు. సంపద వాడి నెత్తిమీద పెట్టుకోడు. మదర్ థెరిస్సాని చివరి రోజుల్లో ఒకరు "మీలా మేము వేలాది మందికి ఎలా సాయం చెయ్యగలం" అని అడిగితే "ఒక్క మనిషికైనా నిష్కామంగా సాయం చెయ్యి చాలు" అన్నారు.

4. కర్తలేని కర్మ అద్భుతం. అక్కడ మనిషి కనబడడు. తెరమీద కనబడకూడదు, పని జరిగిపోతూ ఉండాలి. భాగవతంలో రంతి దేవుడు

"ఏ ప్రారబ్ధం అనుభవించడానికి ఈ శరీరం వచ్చిందో ఆ ప్రారబ్ధమే ఈ శరీరాన్ని పోషిస్తుంది అన్నారు. కష్టసుఖాలకు ఆయన చలించలేదు. కష్టం వస్తే ప్రారబ్ధానికి వచ్చింది అనుకొన్నారు. మలయాళ స్వామి "గుమ్మడి గింజలు నేలలో పాతిపెడితే పెట్టిన చోటకాయదు, పాదు దూరంగా పాకి అక్కడ కాయలు కాస్తాయి. అలాగే కొందరు తమ సేవను కుటుంబానికే కాక నిష్కామంగా బయట వ్యక్తులకు సాయం చేస్తారు" అన్నారు. మర్యాద నేర్చుకోవాలన్నా, ఆశ్రమాన్ని నడపాలన్నా, కన్‌హన్‌గాడ్‌లో ఉన్న రామదాసుగారు స్థాపించిన ఆనంద ఆశ్రమాన్ని దర్శించి నేర్చుకోవాలి. అక్కడికి వచ్చిన భక్తులను మన ఇంటికి వచ్చిన ఆడపిల్లని ఎంత ఆదరణగా ఆహ్వానించి చూచి, తిరిగి అంత ఆదరణగా సాగనంపుతామో అలాగే ఆశ్రమ నిర్వహణ జరుగుతుంది. ఎవరికైనా ఉపకారం చేస్తే వాళ్ళకు ఉపకారం చేసాము అనుకుంటే అక్కడ ద్వైత బుద్ధి వచ్చేస్తుంది. చొక్కాలకు, లాగూలకు జేబులు ఉంటాయి. ఒక జేబులో డబ్బులు తీసి ఇంకొక జేబులో పెట్టుకుంటే ఎవరికైనా ఇచ్చాము అనుకుంటామా? రెండూ నీవే. కర్మయోగంలో గొప్పతనం మంచి భావాలు, చెడు భావాలు నీకు తెలుస్తాయి. గుడిలోకి వెళ్ళి తీర్థ ప్రసాదాలు స్వీకరించడం కన్నా నిష్కామ కర్మ చేయడం వల్ల నా శరీరంలోంచి వచ్చిన చెమట గొప్ప విషయం. అంటే ప్రార్థించే పెదవుల కన్నా, సాయం చేసే చేతులు మిన్న అని భావన. నేను ఆయనకు ఎంతో సేవ చేసాను అనుకుంటే దాని వల్ల మీకు ఉద్రేకం వస్తుంది. సేవ వల్ల కూడా జాగ్రత్తగా ఉండాలి. దానం అంటే పంచుకోవడం అని అర్థం. "పని చెయ్యడంలో నీవు అకర్తవైనా కర్తగానే చెయ్యి. ఎందుచేతనంటే నీ ఇష్టం వచ్చినట్లు చేసేసి భగవంతుడు చేయించాడు అంటే కుదరదు. నీవు బాధ్యత వహించాలి" అన్నారు పరమహంసగారు.

5. నీవు చేసే కర్మ నీ కామాన్ని జయించేటట్లు ఉండాలి. కామం ఉండకూడదు. దానినే త్యాగరాజు "ఎంతటి వారైనా కామినీ కాంచనాలకు దాసులే కదా!" అన్నారు. కర్మ ఫలితం ఆశించక పోయినా వస్తుంది. కానీ





ఆశించకపోతే బంధించదు. మన దైనందిన జీవితంలో ఫలకాంక్ష లేకుండా పనిచేస్తే, అది యజ్ఞంతో సమానం. మనం చేసే కర్మలో భక్తి ఉండాలి, జ్ఞానం ఉండాలి. రెండూ కలిపి చేసినప్పడే సఫలమవుతుంది. పది మందికి ఉపయోగపడుతుంది. అలా కర్మలు చేసేవారు ధన్యులు. కొందరు దేశ సేవ, గ్రామ సేవ చెయ్యక్కర్లేదు వాళ్ళ ఇంట్లో వాళ్ళను సరిగా చూస్తే సరిపోతుంది. నీవు చేసే మంచిపనులు ప్రస్తుతం ప్రజలు గుర్తించలేక పోయినా కాలప్రవాహంలో ఈశ్వరుడు దానిని గుర్తింప చేస్తాడు.

# 9. భగవాన్

1. రమణ మహర్షి జ్ఞాని అనడం కన్నా జ్ఞానమే శరీరం ధరించింది అనడం మంచిది. ఒకరు భగవాన్‌న్ని "నన్ను నేను తెలుసుకోవాలని ఉంది" అన్నారు. భగవాన్ "నీ లోపల 'నేను' తెలుసుకోవాలని ఉంది అంటోంది కదా! దానిని అడుగు నన్ను అడుగుతావేమిటి ఆ నేను నీదే. ఆ నేనునే అడుగు నేను ఎవడను? అని" అన్నారు. ఒకరు భగవాన్ దగ్గరకు వచ్చి "ఏమిటి ఈ లోకం గోల?" అనగా "ఏమిటి ఈ గోల అని అనేవాడిని తెలుసుకోవడానికే ఈ గోల" అన్నారు. మరియొకరు "ఈ సృష్టిలో ఎంతో దుఃఖం ఉంది, ఎంతో వైవిధ్యం ఉంది, ఈ సృష్టి ప్రయోజనం ఏమిటి?" అనగా "ఈ అడిగేవాడిని తెలుసుకోవడానికే ఈ సృష్టి ఉంది" అన్నారు. భగవాన్ వద్ద ఒకరు "దేవుని గురించి రెండు మాటలు చెప్పండి" అంటే "పరాయిగా ఉన్న దేవుని గురించి, లోకం గురించి అడుగుతావేమిటి? అన్నీ తెలుసుకోవాలనే నేను ఎవరు? నిన్ను గురించి నీవు అడగవేమిటి? దాన్ని అడుగు" అన్నారు. "దేహం నేను కాదు అని తెలుస్తున్నది. నిద్రలో దేహం నేను అనే తలంపు పోతున్నది. చనిపోయినప్పడు దేహంతో సంబంధం పోతున్నది. కానీ జన్మ వస్తున్నది. దీనికి కారణం ఏమిటి?" అని భగవాన్‌ని ప్రశ్నిస్తే ఆయన "నేను చనిపోయానని అనుకున్నవాడు పుడతాడు, నేను పుట్టాను అనుకున్నవాడు చనిపోతాడు. పూర్వజన్మలో నీవు చేసిన పాప, పుణ్య కర్మలు అన్నీ దేహం నేను అనే తలంపుతోనే చేసావు. కాబట్టి దేహం

నేను అనే తలంపుతోనే నీవు వాటి నన్నింటినీ అనుభవింపచేస్తాడు ఈశ్వరుడు. ఆయన కర్మఫలదాత. దేహం నేను కాను అనే తాడును తెంపగలిగితే మాయ ఏమీ చెయ్యదు. దూడ త్రాడును తెంపేసుకుంటే చేతిలో కర్ర ఉన్నా యజమాని ఏమీ చేయలేడు. కట్రాడుకు కట్టేసిన దూడనే యజమాని కొట్టగలడు. అలాగే దేహం నేను అనే తలంపును తెంచుకుంటే ఈశ్వరుడు నీ కర్మ ఫలితాన్ని పంపే అవకాశం లేదు. దుఃఖం అహంభావనకు వస్తుంది. అనుభవించే వాడు లేకపోతే ఈశ్వరుడు దానిని వెనుకకు తీసుకోవలసిందే. కాబట్టి దేహాభిమానాన్ని సత్వగుణంతో నెమ్మది నెమ్మదిగా తొలగించుకొంటే సత్యంలో ఐక్యం అవుతావు" అన్నారు.

2. భగవాన్ సెంట్రల్ ఐడియా ఇది. "మీకు అనేక సౌకర్యాలు ఉంటే ప్రయోజనం ఏమిటి? ఆ ప్రయోజనాల నుండి, ఆ సౌకర్యాల నుంచి శాంతి రాదు. కంట్రోల్ నుంచి శాంతి వస్తుంది" అన్నారు. భగవాన్ వద్ద ఒకరు "వాళ్ళు అలా అన్నారు, వీళ్ళు ఇలా అన్నారు అనగా ఆ విషయం గురించి ఎవరు ఆలోచించమన్నారు. వాళ్ళు మంచివారే. వాసన యొక్క ప్రేరణ వల్ల అలా మాట్లాడుతున్నారు. ఇల్లు అంతా తుడుచుకుని పెంటలో వేయవలసిన చెత్తలో ఇవి ఉన్నాయి, అవి ఉన్నాయి అనుకోవడం లాంటిదే నీ మాటలు" అన్నారు. మరియొకరు "హాలులో వాడు నిద్రపోతున్నాడు" అంటే "వాడు నిద్రపోతే నీకు నష్టం ఏమిటి అన్నాడు" ఇంకొకడు. అప్పుడు భగవాన్ "అలా అనకండి వారు జ్ఞానం సంపాదించడానికి రాలేదు. ఎవరు నిద్రపోతున్నారో చూచే నిమిత్తం వచ్చారు" అన్నారు. భగవాన్‌ని "ఆత్మని ఎలా ధ్యానం చెయ్యాలి?" అనగా "అది ఎలా ఉందో అలా ద్యానం చెయ్యి" అన్నారు. భగవాన్ వద్ద ఎవరైనా సబ్జెక్టు ప్రధానంగా ఉన్న అంశం అడిగితే చెప్పేవారు. ప్రశ్నిద్దామని అడిగితే మౌనంగా ఉండేవారు. వారు ఏమనుకున్నా వారికి బాధలేదు. అంతా భగవంతుడే ఉన్నాడు, విమర్శలోను, స్తోత్రంలోనూ ఆయనే ఉన్నాడు. ఒక దొరగారు భగవాన్‌తో "నేను ఫలానా వారికి సాయం చెయ్యాలని అనుకొంటున్నాను చెయ్యమంటారా?" అని అడుగగా





"చేయడానికి నీవు ఎవరవు? చెయ్యకుండా ఉండడానికి నీవు ఎవరవు? అసలు నీవు ఎవరవు?" అన్నారు. ప్రతీ మాటలోనూ భగవంతుడు ఉన్నాడు. భగవాన్ ఇంటి నుంచి బయటకి వెళ్ళాలి అనుకొన్నప్పుడు ఎక్కడికి వెళ్ళాలి? అని అనుకోగా అరుణాచలం, అరుణాచలం అనే స్ఫురణ వచ్చింది. ఒకరు భగవాన్‌తో "నేను మా అమ్మ కడుపులో ఉండగా బాధ పెట్టానట" అనగా "అది మరచిపోతే ఏదీ లేదు. మొయ్యడంలోనే సత్యానుభవానికి అడ్డు వస్తున్నది" అన్నారు. ఒకరు భగవాన్‌తో "నేను గతజన్మలో పుణ్యం చేసుకోలేదు" అనగా "పుణ్యం చేసుకోకపోతే నా దగ్గరకు ఎలా రాగలిగావు" అన్నారు. మరియొకరు "భగవాన్ మేము ఆ యాత్ర చేసి వచ్చాము, ఈ యాత్ర చేసి వచ్చాము" అంటే "మీరు వెళ్ళడం మంచిదే, అక్కడ ఏమీ లేదని వెళ్ళి వచ్చిన తరువాత తెలుస్తుంది. అదీ మంచిదే" అన్నారు. ఏ శక్తి అయితే ఈ సృష్టిని నడిపిస్తోందో దానికి భిన్నంగా భగవాన్ లేరు. ఆయన ఈ సృష్టిలో ఏ ఉపద్రవం జరిగినా ఆశ్చర్యపడరు. కారణం అది ఎలా జరగాలో అలా జరుగు చున్నది అన్న సంగతి ఆయనకు తెలుసు. మనకు తెలియదు కాబట్టి మనం ఆందోళన చెందుతున్నాము. మీకు ఆత్మానుభవం అయితే విధి ఏమీ చెయ్యదు. అది జ్ఞాన వైభవం.

3. గాఢ నిద్రకు మించిన గురువు లేడు. "కీర్తికాంక్ష ఒక దురాలోచన" అన్నారు భగవాన్. భగవాన్ అద్భుతమైన మాట అన్నారు "నీ సంకల్పమే నెరవేరుగాక". నీవు అంటూ ఏమీ లేవు అంతా ఆయన సంకల్పమే నెరవేరుతుంది. భగవాన్ సమక్షంలో ఎవరికైనా విషయం అర్థం కాకపోతే ఇలా అనేవారు "ఏమి చేస్తాము వారు ఆ స్థాయికి రాలేదు" అని సహనంగా ఉండేవారు. ఎవరైనా "మాకు కష్టాలు ఎక్కువై దుఃఖంలో ఉన్నాము" అంటే "అవి అంతర్ముఖం అవ్వడానికి సహకరిస్తాయి. మంచివే కదా!" అనేవారు. భగవాన్ ఫొటోను ఒకరు గాంధీగారికి చూపిస్తే వారి రచనల పుస్తకాన్ని ఒక ప్రక్కన పెట్టి "ఎంత అద్భుతమైన ముఖము, ఎంత అందమైన కళ్ళు" అన్నారు. భగవాన్ అన్నారు "అజ్ఞానికి జన్మలు ఉన్నాయి. జ్ఞానికి జన్మలు

ఉన్నాయా" అన్నారు. ఒకరు అందమైన చీర కట్టుకొని వస్తే ఇంకొకరికి నిరాశ కలిగింది. ఆ నిరాశను పోగొట్టడానికి ఎవరు మంచి చీర కట్టుకున్నా, మనమే కట్టుకున్నాము, ఎవరు మంచి నగలు పెట్టుకున్నా మనమే పెట్టుకున్నాము అనుకుంటే అసూయరాదు. అది సబ్జక్టు అనేవారు. భగవాన్ వద్ద ఒకరు "నేను నేను" అనగా "ఈశ్వరునికి భిన్నంగా నీవు చేసేది ఏమీ లేదు. నీవు ఉన్నావని ఎవరు చెప్పారు?" అన్నారు. భగవాన్ పాదపూజలు, దండలు ఇష్టపడరు. సబ్జక్టు ప్రధానం. ఒకరు "ప్రపంచానికి సహాయం చెయ్యాలి అనుకొంటున్నాను" అనగా భగవాన్ నీవు ఎవరివో నీకు తెలిస్తే అప్పుడు ప్రపంచం నీకు భిన్నంగా కనిపిస్తే ఉపకారం చేద్దువుగాని అంటూ దేహాభిమానం ఉన్న ప్రతీ వాడూ పాలేరే" అన్నారు. "శరణాగతిలో ద్వైతం లేదు, అంతా అద్వైతమే" అన్నారు భగవాన్.

4. ''అసలు నీవు ఎవరవు?'' అనే అన్వేషణలోనే నీకు తెలియకుండానే పవిత్రత వచ్చేస్తుంది. అది నిన్ను వరిస్తుంది అన్నారు భగవాన్. "మీకు ఎప్పుడైనా స్వప్నాలు వస్తాయా?" అని భగవాన్‌ని అడిగితే "వస్తే నష్టం ఏమిటి? స్వప్నం వచ్చినప్పుడు అది స్వప్నమే అని తెలిసినప్పుడు ఎన్ని వస్తే నాకేల?" అన్నారు. మనకి స్వప్నం వస్తే ఆ సమయంలో అదే నిజం అనుకుంటాము. సంతోషాలకు, బాధలకు గురి అవుతాము. కానీ జ్ఞానికి ఆ సమస్య ఏమీ ఉండదు. అది జ్ఞాని వైభవం. భగవాన్ వద్దకు ఒక భక్తుడు బాధతో వచ్చి ఇలా అన్నాడు. "నన్ను మరచిపోయావా? దానికి భగవాన్ అతని వంక చూచి "ఏ అనుగ్రహమైతే నిన్ను ఇక్కడికి తీసుకొచ్చిందో అది ఎప్పుడూ ఉంటుంది. నీవు తరించే వరకు అది నిన్ను విడిచిపెట్టదు" అన్నారు. అది అహంకారం చెప్పిన మాట కాదు, ఈ సృష్టి అంతటికీ ఏ పరమాత్మ అయితే ఆధారంగా ఉన్నాడో ఆయన వాణి. "దుఃఖానికి బాహ్యంగా కనిపించే కారణాలు అన్నీ నూటికి నూరుశాతం అబద్ధం" అని భగవాన్ చెప్పారు. "నిన్ను నీవు తెలుసుకుంటే నీవు అన్నీ తెలుసుకున్నవాడివే. నిన్ను నీవు తెసుకోకపోతే ఎన్ని నేర్చుకున్నా, ఎన్ని తెలుసుకున్నా ఏమీ తెలియని





వాడివే" అన్నారు భగవాన్. "భగవంతునికన్నా నీలో భిన్నంగా మనస్సు అనేవాడు ఒకడు ఉన్నాడు. వాడు మాయమయ్యే వరకు నీకు ఆత్మజ్ఞానం కలుగదు" అన్నారు భగవాన్.

5. భగవాన్ గురించి రాధాకృష్ణన్ "సముద్రంలో ఓడలకు ఒడ్డు తెలియడానికి లైట్‌హౌస్ ఎలా ఉపయోగపడుతుందో బ్రాహ్మీస్థితిని పొందిన వాడు ఎలా ఉండాలో తెలియడం కోసం భగవాన్ ఉపయోగపడతారు" అన్నారు. మాకు ఆత్మజ్ఞానం ఎప్పుడు కలుగుతుంది అని భగవాన్‌ని అడిగితే "నీవు చేసిన కర్మలు ఖర్చు అయ్యాక వస్తుందిలే" అనేవారు. "నేను మంచి వాడిని, నేను చెడ్డవాడిని అని అనుకొంటారు. దానిని దేనితో అంటావు? మనస్సుతోనే కదా! మనస్సు నీవు కాదు కదా! అనుకోవడం దేనికి?" అన్నారు భగవాన్. భగవాన్ వద్దకు నలుగురు పెద్ద మనుషులు ఒక అబ్బాయిని తీసుకొచ్చి వీడు తప్పు చేసాడు. మందలించండి అంటే "ఒరేయ్ అబ్బాయి ఈ పెద్ద మనుషులు కూడా తప్పు చేస్తున్నారు. కానీ పైకి కనబడటం లేదు. అలాగే నీవు నేర్చుకో. తప్పు చేయడం మానవద్దు" అన్నారు. అంటే భగవాన్ ఎవరిని మందలించినట్టు? దాని అర్థం మీరు తప్పు చేయని వారైతే మందలించవచ్చును. ఆ ప్రభావం వాడి మీద పడుతుంది. నా దగ్గరకు తీసుకొని రావడం ప్రచారానికే కదా! అని అర్థం. భగవాన్ కోపం నీటిమీద రాత. ఈరోజు కోపం తెచ్చుకుంటే, రేపు ఎంతో ఆప్యాయంగా మాట్లాడతారు. నిన్న కోపం వచ్చింది అనే ఆలోచన కూడా రాదు. భగవాన్ "నీలో ఉన్న ఈశ్వరుని తెలుసుకోలేకపోతే నీ శరీరాన్ని, మనస్సును ఏమి చేసుకుంటావు" అన్నారు. భగవాన్ వద్దకు కొందరు భక్తులు వచ్చి "గిరి ప్రదక్షిణ చెయ్యలేము, మీ చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నాము" అంటే "నేను అంతటా వ్యాపించి ఉన్నాను ఎలా ప్రదక్షిణ చెయ్యగలరు?" అన్నారు. భగవాన్ ఒకరిని లోచూపు అలవాటు చేసుకో అంటే అతను "కళ్ళు మూసుకుంటే చీకటిగా ఉంది" అన్నాడు. "ఆ చీకటిని చూచేవాడు ఒకడు ఉన్నాడు. నిరంతరం వాడిని చూడు. వాడి చేష్టలు గమనించడమే లోచూపు" అన్నారు. "అందరికీ

డిగ్రీలు ఉన్నాయి. నాకూ డిగ్రీ ఉంది. అది ఏమిటి అంటే 'పనిలేని వాడు' అనే డిగ్రీ ఉంది" అన్నారు భగవాన్. అంటే బ్రాహ్మీస్థితిలో ఉన్నవాడు ఈశ్వరుడు ఎలా ఆడిస్తే అలా ఆడేవాడని అర్థం. దక్షిణామూర్తి మౌన సన్నిధిలో జ్ఞానం వచ్చింది అని మురుగనార్ అంటే భగవాన్ "దక్షిణామూర్తి బోధించి, బోధించి మౌనం వహిస్తే అందులోనుంచే జ్ఞానం వచ్చింది" అనగా ఆ విషయం పురాణాల్లో ఎక్కడా లేదే అనగా భగవాన్ "పురాణాల్లో ఎక్కడా లేకపోవచ్చును అది అంతే" అన్నారు. అది తిరుగులేని సత్యం. సద్గురువులను కలవడానికి కాలం కలసిరావాలి. గణపతిశాస్త్రిగారు భగవాన్‌ని మొదట దర్శించినా స్పందన కానరాలేదు. తరువాత ఈశ్వరుడు అంతఃస్ఫురణ కలిగాక, కాలం కలసి వచ్చాక మరలా కలిసారు. నేను ఈ శరీరంతో భగవాన్‌ని చూడలేదు. గత జన్మలో విరూపాక్ష గుహలో ఉండగా చూచినట్లు స్ఫురిస్తుంది. ఆ దర్శనం యొక్క అగ్ని వెంటాడుతూ ఈ జన్మలో మనస్సును అంటించి నశింప జేసింది. గణపతి శాస్త్రిగారి అనుబంధం తక్కువ సమయంలో జరిగింది.

6. భగవాన్‌తో ఒకరు "మీకు కేన్సర్ వచ్చింది, మేము చూస్తున్నాము, మీరు అనుభవిస్తున్నారు. ప్రారబ్ధం లేకపోవడం ఏమిటి?" అంటే "చూచే మీరు ప్రారబ్ధం అని అనుకుంటున్నారు. నేను అనుకోవడం లేదు అనుకొనే వాడు ఎప్పుడో ఇంటి వద్ద చనిపోయాడు. మనస్సు బాహ్యముఖమైన వానికే ప్రారబ్ధం. లోపలకు వెళ్ళేవాడు అనుకోడు" అన్నారు. భగవాన్‌ని ఒకరు "మిమ్మల్ని వారు విమర్శిస్తున్నారు. మీరు ఎందుకు ప్రశాంతంగా ఉంటున్నారు" అని అడిగితే వారు ఎందుకు విమర్శిస్తున్నారో నాకు అర్థమవుతున్నది. నేను ఎందుకు ఉద్రేకపడాలి" అన్నారు. "నువ్వు నేను-నేను అని అంటున్నావు కదా! ఆ నేనుని అంటిపెట్టుకొని ఈ శతృత్వాలు అన్నీ ఉన్నాయి. ఈ నేను పోతే అన్నీ పోతాయి. నేను పోకపోతే అవి నీ కూడానే ఉంటాయి" అన్నారు. "ప్రారబ్ధాన్ని ఆందోళనతో అనుభవించకు, సహనంగా అనుభవించు అంటారే" అని భగవాన్‌ని అడిగితే "ప్రారబ్ధం శరీరానికే కదా! శరీరమే నెంబర్ 1 అబద్ధం. దానికి ప్రారబ్ధం అని ఇంకో అబద్ధాన్ని కల్పించారు. ప్రారబ్ధం నిజం





అనుకోవడం వల్లనే ఆందోళన చెందుతున్నారు. ఒక అబద్ధాన్ని తీసుకొచ్చి ఇంకొక అబద్ధానికి కట్టేస్తున్నారు అదే అల్లరి. నూటకి నూరుపాళ్ళు నేను-నాది అనేది లేదు. ఈశ్వరుడు ఒక్కడే ఉన్నాడని గ్రహింపు నీకు అనుభవంలోకి రావాలి. అదే భక్తి. అదే జ్ఞానం. ఉన్న ఆత్మ తెలియనప్పుడు లేనిది ఉంది అనుకొంటాము" అన్నారు. ఒకరు భగవాన్‌ని "మీరు దేవుణ్ణి చూసారా అంటే దేవుణ్ణి చూసేవాడు ఇక్కడ ఎవరూ లేడు. ఉంటే కదా చూడడానికి" అన్నారు. అదే పూర్ణ శరణాగతి. భగవాన్ మాయ గురించి "నీ దురాలోచనలు, నీ స్వార్థం, నీ అలవాట్లు, నీ వాసనలు, నీ సంస్కారాలు ఇవే మాయ" అన్నారు. భగవాన్ "అసలు దేహబుద్ధి లేనివానికి ఈశ్వర సంకల్పం ఏమిటి?" అన్నారు. అంటే ఈశ్వర సంకల్పాన్ని కూడా దాటించి మనలను తీసుకొని వెళుతున్నారు. భగవాన్‌కి "కేన్సర్ వల్ల బాధగా ఉందా!" అంటే "ఈ చేతికి బాధగా ఉంది" అన్నారు. నాకు బాధగా ఉంది అనలేదు. శివుని మూడవ నేత్రం నుండి వెలువడిన అగ్నిని గంగానది కూడా భరించ లేకపోతే అప్పుడు పార్వతి శరవణ భవ అనే తటాకంగా ఏర్పడగా అందుండి సుబ్రహ్మణ్యుడు శరీరం ధరించాడు.

7. భగవాన్ బోధలో సూక్ష్మత ఏమిటి అంటే నీ తలంపుకు స్వతంత్రత లేదు. నీ వల్లే సమస్య వస్తున్నది. నీ తలంపుకు నీవే ప్రాణం పోస్తున్నావు. ఒక సమస్య తీరితే ఒక సమస్య వస్తున్నది. సముద్రం వద్దకు వెళ్ళి కెరటాలు తగ్గిన తరువాత స్నానం చేద్దామనుకోవడం ఎటువంటిదో తలంపులు తగ్గాక సాధన చేద్దాం అనుకోవడం అటువంటిదే. తలంపులకు ప్రాణం పోస్తూ ఉంటే ఎప్పటికీ ఒడ్డుకు చేరలేవు. మృత్యువు కూడా తలంపే. వాళ్ళు నన్ను తిడుతున్నారు అంటే "ఆ నేను ఉంటేనే అవతలి వాళ్ళు ఉంటారు. నీవే లేనప్పుడు అవతలి వాళ్ళు లేరు" అన్నారు. ప్రపంచం ఉందా? అంటే "ప్రపంచం ఉందని ఎవరు అంటున్నారు. నీవే ఆ నేనును ఊడగొట్టుకుంటే ఏమీ లేదు" అన్నారు. నిజంలో ఉంటే చర్చ ఏమి ఉంటుంది. నిజంలో ఉండటానికి గురువనుగ్రహం కావాలి. భగవాన్‌తో ఒకరు మీ అనుగ్రహం నాకు

తెలుస్తుంది అన్నాడు. నాకు నీకు సంబంధం ఏమిటి? అంటే కంగారు పడతారు. దాని అర్థం ఏమిటంటే ఇద్దరు ఉంటే సంబంధం, ఇద్దరు లేనప్పుడు తెలియడం ఏమిటి? అని. మీ వల్ల మాకు ఉపకారం జరిగింది అంటే "ఆ సంగతి నాకు తెలియదు" అంటారు. నీకు ఉపకారం జరిగింది నిజమే కానీ అది దేహం నేను అనే దానికే. ఆయన కోణంలో అది లేదు. భగవాన్‌తో ఒకరు "కాశీ వెళుతున్నాము వస్తారా?" అంటే "చూచేవాడు ఒకడు ఉంటే వెళ్ళవచ్చు. లేనప్పుడు ఎక్కడికి వెళతాము" అన్నారు భగవాన్. "ఎప్పుడూ ఏమీ జరగలేదు. ఉపద్రవాల గురించి మీ మనస్సు అలా అనిపిస్తున్నది" అన్నారు భగవాన్. "మీకు చెడ్డ ప్రారబ్ధం ఉన్నప్పుడు అది మిమ్మల్ని తాకకపోతే మిమ్మల్ని ఏమి చేస్తుంది" అన్నారు. భగవాన్‌ని ఒకరు "చైతన్యం అంతటా ఉంది అంటున్నారు మరి హృదయంలో వెతకడం ఎందుకు?" అనగా "అంతటా ఉన్నది అనే విషయం తెలియక నీవు దేహానికే పరిమితుడై ఉన్నావని అనుకోవడం వల్ల అలా చెప్పవలసి వచ్చింది" అన్నారు భగవాన్. ప్రపంచం లేదని చెప్పారు అలాగే జీవించారు. కృతయుగంలో మౌనంగా ఉన్న దక్షిణామూర్తి, శంకరులు, రమణులు. సుబ్బరామయ్యగారితో భగవాన్ చివరి ఘడియల్లో "ఏమి కావాలి?" అంటే "అభయం కావాలి" అనగా "భయం వస్తూ ఉంటుంది, పోతూ ఉంటుంది. అది ఊహలను బట్టి వస్తుంది. నిజంగా లేదు. అది చాలా చిన్న విషయం" అన్నారు భగవాన్. మనం భగవాన్ గురించే ఆలోచించాలి. రమణాశ్రమం గొడవలు మనకు వద్దు. గుఱ్ఱానికి గంతలు కడితే ప్రక్క చూపులు లేకుండా నిదానంగా చూచి వెళుతుంది. రమణుని సమాధి, ఆయన మాటలు ముఖ్యము. "కావ్య కంఠ గణపతి మునిలాంటివారు ఎప్పుడో కానీ ఉద్భవించరు" అన్నారు. జ్ఞాన సంబందర్ పదహారవ ఏట మరణించారు. భగవాన్‌కి పదహారవ ఏట జ్ఞానం కలిగింది. జ్ఞాన సంబందర్ భక్తి గురించి బోధించేవారు.

8. రామకృష్ణులు సాధనలో చాలా శ్రమ పడ్డారు. భగవాన్‌కు అది తెలియదు. దోసకాయ పాదునుండి విడిపోయినట్లు ఒక్క సెకనులో జ్ఞానం





పొందారు. ప్రపంచంలో ఎవరికీ లేని దుఃఖం నీకు వచ్చినా అందులో నుండి బాధపడకుండా విడుదల పొందే బోధ భగవాన్ బోధ. అది ఆయన వైభవం. భగవాన్ "నీకంటే భగవంతుడు వేరుగా ఉన్నాడా? అది ప్రశ్న కాదు, భగవంతుని కన్నా నీవు వేరుగా ఉన్నావా? అనేది ప్రశ్న. ఇక్కడ నీవు కాదు ప్రధానం భగవంతుడే. అలా విచారణ చేస్తే సమాధానం, ఉన్నది భగవంతుడే అని తెలుస్తుంది. భగవాన్‌ని ఒకరు "మీరు ఇంటి నుంచి మూడు రూపాయలు దొంగిలించి అరుణాచలం వచ్చారు. అలా అబద్ధం చెప్పారు కదా! దాని ఫలితం మీకు రాదా?" అని అడిగితే "ఏ ఈశ్వరుడు అయితే అబద్ధం చెప్పించాడో ఆయనే అనుభవిస్తాడు" అన్నారు. భగవాన్‌కు కొటేషన్స్ అంటే ఇష్టం ఉండదు. ఒకరు భగవాన్‌ని "మావలే మీరు కర్మలు చేస్తున్నారు కదా!" అంటే "నేను దేహమా? నేను ఆత్మను. ఆత్మ కర్మ చేస్తుందా? నేను చేస్తున్నాను అనే భావన నాకు లేదు. కర్మలో అకర్మను చేస్తున్నాను" అన్నారు. మనస్సును ఎలా నశింపు చెయ్యాలి అని భగవాన్‌ని అడిగితే "అది ఉంటే కదా నశింపు చేయడానికి" అన్నారు. జప, ధ్యానాలు చేస్తున్నాము అంటే అలాగే అంటారు. "నీ దుఃఖంలో నుండి బయటకు వచ్చే దారిని చూపిస్తారు. నీకు శాంతి ఇస్తాను నన్ను అనుసరించు" అనలేదు. ఇవ్వడం అంటే ఇవ్వడమే. "నీకు ఆత్మానుభవం కలిగితే అధైర్య పడేది ఏదీ లేదు" అన్నారు భగవాన్. ధైర్యం కూడా సాధనకు పెట్టుబడి. అపరోక్ష అనుభూతి గురించి శంకరుల కన్నా భగవాన్ అద్భుతంగా చెప్పారు. భగవాన్ "గురువు అనుగ్రహం బుద్ధికి అందదు. దానిని ఎలా చెప్పను" అన్నారు. ఆయనను ఒకరు "మీరు మాకు సహాయం ఏదైనా చేస్తారా?" అంటే "అలా అనకూడదు. మా దగ్గర ఉన్నది అనుగ్రహం ఒక్కటే. అదే ఇస్తాను. దానికి మించి మా దగ్గర ఏదీ లేదు" అన్నారు. సద్గురువు నీ లోపలే ఉన్నాడు అంటున్నారు నాకు కనిపించాలి కదా! అంటే "కనిపించే గురువే చెబుతున్నాడు నీ లోపలే ఉన్నాడు" అన్నారు. "సాధన చెయ్యాలి అంటే అభ్యాసం చెయ్యాలి అనుకొంటున్నాను" అనగా "ఆ బుద్ధి కూడా

గురువనుగ్రహం వల్లనే వస్తుంది. అసలు నీవు లేనే లేవు పో.... పో...." అన్నారు. భగవాన్ ప్రత్యేకత ఏమిటంటే మిమ్మల్ని ప్రేమిస్తున్నట్లు మీ ప్రక్కవారికి కూడా తెలియనివ్వడు. భగవాన్ జయంతి మన కంటికి వెలుగు, ప్రపంచానికి వెలుగు. మురుగునార్ భగవాన్‌తో "నేను కుక్కను. నాలాంటి వానికే జ్ఞానమిస్తే మహాత్ములకు, యోగులకు ఇవ్వలేవా" అన్నారు. భగవాన్ దగ్గరకు ఒకరు వచ్చి మేము బాగానే ఉన్నాము అనగా "నీవు బాగున్నది నిద్రలోనే కదా! ఈ బాగు కూడా కలలో భాగమే. నీకు దుఃఖం వచ్చినా కలలో భాగమే" అన్నారు.

9. భగవాన్ సమక్షంలో కొందరు కళ్ళు మూసుకొని ధ్యానం చేస్తూ ఉంటే గణపతి శాస్త్రిగారు ఇలా అన్నారు. "సూర్యుని వెలుగును ఆనందించ కుండా కిరసనాయిల్ దీపాలు ఎందుకు వెలిగించుకుంటారు" అన్నారు. శ్రీ నాన్నగారు "భగవాన్ అంటే నాకు ఇష్టమే, నేను ప్రయత్నం చేసి తెచ్చుకేలేదు. ఆయన మీద నాకు ఉన్న ఇష్టానికి కారణం కూడా ఆయనే. నా శిరస్సుపై భగవాన్ గొడుగు ఉంది. నేను క్రోధంతో ఉన్నా నన్ను వదలలేదు" అన్నారు. భగవాన్‌తో ఒకరు "ఈ ప్రపంచం బాధపెడుతోంది ఎలా వదిలించుకోవాలి" అని అడిగితే "ప్రపంచాన్ని చూడమని ఎవరు చెప్పారు?" అది ఉపనిషత్‌లలో లేని అద్భుతమైన సమాధానం. భగవాన్ వద్దకు పాములు, పులులు వస్తే "పోరా.... పో..." అనేవారు. వాటిలో అంతర్యామిగా ఉన్నవారు ఆయనే. ఒకరు "హృదయం ఎక్కడ ఉంది?" అని అడిగితే "చెపుతాను తెలుసుకోగలవా?" అన్నారు. చాడ్విక్ పూర్వజన్మలో భగవాన్ తండ్రి అని చెపుతారు. భగవాన్ శరీరం విడిచిపెట్టాక లండన్‌కు విమానం టిక్కెట్టు కొనుక్కొని రెండు గంటల్లో బయలుదేరుతుంది అనగా తిరిగి తిరువణ్ణామలై వచ్చి పదహారు సంవత్సరాలు ఉండిపోయారు. భగవాన్ కేన్సర్ చివరి దశలో డాక్టర్లతో ఆయన "పుండును తరచు కోయడంలో ప్రయోజనం లేదు. ఆయన శరీరం సజీవంగా ఉన్నా లేకపోయినా వ్యత్యాసం లేదు. ఆపరేషన్ వల్ల ప్రయోజనం లేదు" అన్నారు. మనం పాములను పట్టుకోవడానికి వెళితే అవి కరిచేస్తాయి.





అదే పాములు పట్టేవాడు వస్తే వాడి దగ్గర ఏదో వాసన గలది ఉంటుంది. అది కరవదు. అలాగే స్వరూపజ్ఞానం గల వాడిని ఇంద్రియాలు ఏమీ ముట్టుకోవు. వాడి జోలికి రావు. అది జ్ఞాన వైభవం. అన్నం పెట్టడం గొప్ప విషయమేగానీ, దానికంటే పునర్జన్మ రాకుండా చేసే జ్ఞానదానం గొప్ప. ఏసు "అడగండి ఇవ్వబడుతుంది" అన్నాడు. భగవాన్ "అడగకండి ఇస్తే తీసుకోండి" అన్నారు. రామదాస్‌గారు కొంతకాలం భగవాన్ దగ్గరకు వచ్చి ఉన్నారు. భగవాన్ గురించి ఆయన ఏమన్నారంటే "ఒక ఎవరెస్ట్ శిఖరం - ఒక సూర్యుడు" అన్నారు. ఈ ఆశ్రమ వాసులకే కాదు ప్రపంచానికే ఒక వెలుగు" అన్నారు. భగవాన్ డెస్టినీ మీద ఎంత నమ్మకమో చూడండి. "పాము కరవబడే ప్రారబ్ధం నా శరీరానికి ఉంటే అది ఆగుతుందా?" అన్నారు.

## 10. బంధ స్వరూపము - సామరస్యము

1. బండి వెనకాల నీడ ఎలా వస్తుందో లోక వాసన ఉంటే దుఃఖం కూడా అలాగే వస్తుంది. ఆరోగ్యంగా ఉంటే డాక్టరు వద్దకు వెళ్లవలసిన పని లేదు. మీరు దుఃఖ రహిత స్థితిలో ఉంటే ఎక్కడికీ వెళ్లనవసరం లేదు. మీకు దుఃఖంగా ఉంటే దుఃఖ రహిత స్థితిలో ఉన్న వారితో స్నేహం చెయ్యండి. మీకు డబ్బు అవసరం లేనప్పుడు బ్యాంక్‌కు వెళ్లవలసిన పని లేదు. అలాగే మీరు శాంతంగా (శాంతిగా) ఉండండి. అలా ఉంటే మంచివాళ్ళు అనుకున్న వారితో కూడా స్నేహం పనికిరాదు. స్నేహం మత్తులాంటిది. జీవితాన్ని శాంతిగా ఎంజాయ్ చెయ్యాలి. ఎప్పుడు చచ్చిపోతామో అని బెంగతో ఉండకూడదు. మన శరీరం ఎప్పుడో ఒకప్పుడు చనిపోతుంది. ఇప్పుడే చనిపోతున్నాము అని ఎందుకు అనుకోవాలి. జన్మ రాహిత్యం ఎప్పుడు కలుగుతుంది అంటే 100% సుఖం అనుభవించినప్పుడు. కష్టపడిపోతున్నాము అనుకుంటే మీ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు ఉంటుంది. చిన్న చిన్న గెడపల్లాంటి సంస్కారాలు కూడా దాటకపోతే వేయి జన్మలు పడుతుంది. ప్రకృతి సుఖాలు అన్నీ ఒట్టిగడ్డి లాంటివి. నిజమైన సుఖము, శాంతి, తీపి మన హృదయములో ఉన్న సద్వస్తువులోనే ఉంది. ఆ మాధుర్యం సృష్టిలో

ఎక్కడా లేదు. జీవితంలో ఏమైనా మధుర క్షణాలు ఉంటే అవి గురువు ద్వారా వచ్చిన తుంపరలే అని గుర్తుంచుకోండి. నీ మనో ప్రవాహానికి ఎదురుగా వెళ్ళు, వివేకాన్ని కాపాడుకో, నీ మనస్సు ఎటుగంతులు వేయమంటే అటు వేయకు. వాళ్ళతో మాట్లాడకు అని నీ మనస్సు అంటే దాని మాట వినకు, నీ తెలివిని పెంచుకో, సమయస్ఫూర్తిని పెంచుకోవాలి. మీరు ఎప్పుడైనా కృంగిపోయారు అనుకోండి, ఆ కృంగు మీలో ఉన్న భ్రాంతికే, అజ్ఞానానికే, మాయకే. ఈ శరీరం వికారం, మనస్సు కోపం, ఇంద్రియాలన్నీ వికారాలే, ఈ సృష్టి అంతా వికారమే, వికారం లేనిది ఆత్మ ఒక్కటే. వికారాలలో ఉండి వికార రహిత స్థితిని కలిగి ఉంటే వికారం లేని పరమాత్మ మనలను తీసుకొంటుంది. శారీరక బాధను అనుభవించవచ్చును కానీ మానసిక బాధను అనుభవించలేము, మానవుడు శాంతిని, ధైర్యాన్ని కాపాడుకోవాలి. అలా చెయ్యకపోతే నీ భక్తి నిలవదు.

2. మనస్సుకు చాపల్యం ఎక్కువ అయ్యేకొలది సంఘంలో దుమ్ము అంతా నొల్లుకుంటుంది. మనస్సు అణిగిపోతే శాంతి లభిస్తుంది. అన్నీ నావే అనుకోకపోయినా కొన్నింటినైనా నావి అనుకుంటున్నావు. అంతా ఈశ్వరునిదే. ఏది తిన్నా ఈశ్వరునిదే అని తిను. ఎవరికి ఇచ్చినా ఈశ్వరునిదే అని భావించు. అంతే కానీ నీది అనుకుంటే మమకారం, అహంకారం ప్రారంభమవుతుంది. సమాజంలో నిందా స్తుతి ఉంటుంది. మీలో సమస్థితి లేకపోతే గందరగోళంలో పడతారు. లోచూపు రాదు. పతనమైపోతారు. నామ, రూప, క్రియా శక్తిని వదిలితే కానీ నీకు దుఃఖం పోదు. మీ అమ్మాయిని గారాభంగా పెంచి, ఆస్తితో, బంగారు నగలతో, మరో అందమైన వాడు, చదువుకొన్నవాడు, ధనవంతునితో ఘనంగా పెళ్ళి చేసి అత్తవారింటికి పంపించినప్పుడు ఏడుస్తారు. కారణం ఎటాచ్‌మెంట్. మీరు ఎవ్వరినీ ఉద్ధరించనక్కర్లేదు. మిమ్మల్ని మీరు హింసపెట్టుకోకండి. భక్తి పేరు మీద ద్వేషాన్ని, పగను ప్రచారం చెయ్యకూడదు. చెడు ఆహారం మీరు తింటే వెంటనే కడుపులో పోటురాదు. ఒక అరగంట తరువాత ప్రారంభ





మవుతుంది. అలాగే చెడు కర్మలు చేసినప్పుడు సంతోషంగానే ఉంటుంది. ఫలితం ప్రారంభం అయ్యాక ఏడుపు వస్తుంది. అప్పు చేసేటప్పుడు సంతోషంగానే ఉంటుంది. తీర్చేటప్పుడు ఏడుపు వస్తుంది. అంటే విలాసాల కోసం అప్పు చేసేవారికి. అలాగే ఒకరిని హింసిస్తే అది వెంటనే ఫలితంలోకి రాదు. ఫలితం వచ్చినప్పుడు మీరే హింసపడతారు. కొందరు అన్నీ ఉన్నా ఏడుస్తారు. కారణం దేహభావన. శరణాగతి అంటే "నేను-నేను" అంటున్నావు కదా! దానిని ఈశ్వరునికి అర్పించడమే. చేలో పెట్టిన నీరు ఏదో రకంగా పోయింది అనుకోండి. దాన్ని గురించి బాధపడితే ప్రయోజనం లేదు. కొత్త నీరు పెట్టుకొని సుఖంగా ఉండాలి. అలాగే జరిగిపోయిన గొడవల్లో, జరిగిన లోటుపాట్లను, నష్టాలను గురించి జుట్టుపట్టుకొని పీక్కుంటే ప్రయోజనం లేదు. వర్తమానంలో జీవించాలి.

3. ప్రపంచంవల్ల దుఃఖం రావడం లేదు, ప్రపంచంతో అనుసంధానం వల్లనే దుఃఖం వస్తున్నది. కోరిక వల్ల దుఃఖం వస్తుంది. ప్రేమ వల్ల రాదు. కుటుంబ సభ్యులతో అనుబంధం వల్ల దుఃఖం వస్తుంది. ఇరవైనాలుగు గంటలు చనిపోయే శరీరం గురించే ఆలోచిస్తూ ఉంటే చావు లేని వస్తువు నీకు ఎలా తెలుస్తుంది? సత్వగుణం పెంచుకోవాలి. సాధ్యమైనంత వరకూ రియాక్షన్ లేకుండా ఉండాలి. అవతలివాళ్ళు అసూయతో విమర్శిస్తే మీరు ఆత్మ విశ్వాసం లేకుండా రియాక్షన్ అయితే ఎన్నటికీ మీకు సత్యం తెలియదు. స్వప్నాలు మెలకువలో రావు. నిద్రలో వస్తాయి. అలాగే అజ్ఞానమనే నిద్రలో పుట్టుకలు, చావులు అనే స్వప్నాలు జరిగిపోతూ ఉంటాయి. మనలను భగవంతుడు రూప, నామములనే ఎరను పెట్టి జనన, మరణ చక్రంలో బంధిస్తున్నాడు. అది అంతా హీనమైనది. ఎలుకల బోనులో ఎరను ఊరికే పెట్టరు. ఎలుకను బంధించడానికే. మనల్ని మాయ అనే ఎలుకల బోనులో ఈశ్వరుడు పడేస్తున్నాడు. అందులోనుండి బయట పడలేకపోతున్నాము. అహంకారంతో ఉన్న జీవితం దొంగ జీవితం, మనో శరీరాలతో కూడిన జీవితం దొంగ జీవితం. అహంకారం రహితమైనప్పుడే నిజమైన జీవితం

ప్రారంభమవుతుంది. (పేరు అనేది అత్తరులాంటిది) సబ్జక్టు మీకు అర్థం కాకపోతే ఎన్ని వందల జన్మలు ఎత్తినా ఆత్మానుభవం కలుగదు. ప్రయోజనం ఏమీ లేదు. మనం స్వతంత్రమైన సుఖం, ఆనందం పొందే స్థితి గలవారమే. కానీ మనస్సు శరీరాల స్వభావాలను ఆత్మకు ఆరోపించుకొంటున్నాము. దీనినే అహంకారము అంటారు. దుర్యోధనుడు, దుశ్శాసనుడు, శకుని ఇలాంటి వారిని దుష్టచతుష్టయము అంటారు. వీళ్ళు బయట కనిపిస్తారు. వాళ్ళ సలహాలను తీసుకుంటే నైతిక పతనం, అధోగతి పాలవుతాము. దుష్ట చతుష్టయము కోరిక, కోపము, లోభము, ఈర్ష్య ఇవి లోపల శత్రువులు. వీరు మనకి తెలివి తేటల్ని కలుగనివ్వరు. మోక్ష దిశగా మనల్ని వెళ్ళనివ్వరు. బంధువులని, స్నేహితులని మనం పోగుచేసుకున్న వారు మరణానంతరం మన కూడా రారు. ఇది నిజం. వాళ్ళు వ్యతిరేకమైతే దుఃఖం వచ్చేస్తుంది. మనకి వివేకం పెరిగే కొలది బయట దేహాలతోనూ, ఇంద్రియాలతోనూ జతకట్టడం మానేస్తాము. అవసరం లేని మాటలు మాట్లాడితే బుద్ధి పాడైపోతుంది.

4. ఎంతోకాలం సాధన చెయ్యకపోతే సిద్ధి కలుగదు. మనుషుల ప్రేమ నిజంకాదు. ఈ ప్రేమల మీద ఆధారపడితే భవిష్యత్తులో దుఃఖం, అశాంతి తప్పదు. ఎదుటివారి మీద ఆధారపడి వారి ప్రేమను పొందుదాము అనుకోవడం మన బలహీనత. మన చేతకాని తనానికి నిదర్శనం. భగవంతుని మీద ప్రేమే నిజమైనది. దానివల్ల నిజమైన శాంతి కలుగుతుంది. జీవితమే ఒక నాటకం. నాటకంలో పాత్రలలో ప్రేమ ఎటువంటిదో కుటుంబ సభ్యుల మీద ఆధారపడే ప్రేమలు కూడా అటువంటివే. మనం కుటుంబ సభ్యులను విపరీతంగా ప్రేమిస్తే, వాళ్ళు మాట్లాడటం మానేస్తే మీకు దుఃఖం వచ్చేస్తుంది. మనం కాని గొడవలన్నీ మనం అనుకుని వాటిని భుజాన వేసుకొని తిరుగుతున్నాము. అదే అహంకారం. మనకు జన్మ ఉంది. కర్మ ఉంది. కృష్ణుడికి కర్మ లేదు. ఈ కర్మలు ఎవరు అనుభవిస్తున్నారు? మనస్సే. అది చిరిగిపోతే ఏమీ లేదు. హృదయంలో ఉన్న శాంతిని, శక్తిని అందుకోలేక





బయట గౌరవాల కోసం ప్రాకులాడుతున్నారు. నిజమైన శాంతిని పొందితే బయట గొప్పలతో పనిలేదు. అయిష్టం ఎంత దోషమో, ఇష్టం కూడా అంతే దోషం. ఇవి మనస్సుకి సంబంధించినవి మాత్రమే. ఇష్టమైన వారు వ్యతిరేఖమైతే కుళ్ళిపోయి, కృంగిపోయి బెంగపెట్టుకొని తలబాదుకుంటూ ఏడుస్తూ చస్తారు. మీరు మేక పిల్లలు, గొర్రె పిల్లలు కాదు. మీరు సింహాలు. "అహం బ్రహ్మోస్మి" అని గర్జించాలి. మీరు కాని దానితో కలిస్తే బ్రతికి ఉండగానే దుఃఖంలో ఏడుస్తూ, చనిపోయాక నరకానికి పోతారు. చిన్న, చిన్న విషయాలలో, చిన్న చిన్న మాటల్లో జాగ్రత్త పడితే ఎన్నో ఘనకార్యాలు చెయ్యవచ్చును. అలవాట్లే బహుజన్మలు తీసుకువస్తాయి. ఆలోచనే అలవాటుగా మారుతుంది. ఇప్పటివరకు ఏడ్చాము. ఇంకా ఎన్ని ఏళ్ళు ఏడుస్తాము. కుటుంబ సభ్యుల ప్రేమ మీద ఆధారపడి ఏడుస్తూ కూర్చోవడ మేనా? స్వతంత్రమైన సుఖం పొందలేరా? చచ్చిపోయే తుక్కులాంటి దేహాన్ని నీవు అనుకుంటావు. మానవ ప్రేమ శాంతి, కాంతి ఇవ్వదు. కుటుంబ సభ్యులు అయిష్టంగా మారడంతో పడే బాధకన్నా ఒక బియ్యం బస్తా నెత్తిమీద పెట్టుకొని మోయడం తేలిక. చాపల్యంతో కూడిన మనస్సుకు ఏమీ తెలియదు. భగవంతుని ప్రేమ ఒక్కటే నిజం అని తెలిసే వరకు సత్యం తెలియబడదు. విపరీత భావాలు, రాంగ్ థింకింగ్ ఉన్నంత కాలం సత్యం తెలియదు.

5. ఆకలి లేని వాడు అన్నం తినలేడు. వైరాగ్యం లేనివాడు జ్ఞానాన్ని పొందలేడు. వైరాగ్యం లేనప్పుడు ధనము, అధికారము, అందము, చదువు ఇవన్నీ గొప్పగా కనిపిస్తాయి. నీవు బ్రతుకు, కానీ ఎవరి మీదా ఆధారపడి బ్రతకకు. అలా ఆధారపడి బ్రతికితే బ్రతికి ఉండగా దుఃఖం, చనిపోయాక నరకం అనుభవించాలి. అందరూ నా పట్ల ఎలా ఉన్నారు? అనే విషయాలు నీకు అనవసరం. అందరిపట్ల మనం ఎలా ఉన్నాము అనేది పరిశీలించుకొని బాగా వ్యవహరించు. నీ ప్రవర్తనను బట్టి భగవంతుడు మార్కులు ఇస్తాడు. మోక్షాన్ని ప్రసాదిస్తాడు. ద్వేషించే వారిని ద్వేషించడం జీవలక్షణం. దానివల్ల

నీకు మోక్షం రాదు. కారణం సూక్ష్మంగానూ, కార్యం స్థూలంగానూ ఉంటుంది. ఈ సృష్టికి కారణం ఈశ్వరుడు. ఆయనను కనిపెట్టడం కష్టం. మీకు దుఃఖం వస్తూ ఉంటే కారణం సూక్ష్మంగా ఉంటుంది. దానిని కనిపెట్టలేరు. దానిని (దుఃఖ కారణాన్ని) గ్రహించగలిగితే దుఃఖంలోంచి బయటకు రావచ్చు. విషయ చింతన చేసేవాడు అపవిత్రుడు అవుతాడు. అహంకారం పెరుగుతుంది. దానివల్ల చావు పుట్టుకలలో పడి నలిగిపోతావు. దుఃఖం లేని పదార్థంతో ఏకమైతే బయట పరిస్థితుల వల్ల వచ్చే దుఃఖం నిన్ను అంటదు. విషయాలను స్మరిస్తే ఆకర్షణ కలిగి కోరిక పుడుతుంది. తలంపు రాకుండా చూసుకోవాలి. మనం ఎవరికైనా ఉపకారం చేస్తే వాళ్ళు అపకారం చెయ్యవచ్చును. మన మనస్సుకు గాయం చెయ్యవచ్చును. నీవు రాగ-ద్వేషాలను తగ్గించుకోకపోతే అవి నీకు చెడును కలుగజేస్తాయి. నేను అనే తలంపు రాకుండా నాది అనే తలంపు రాదు. మీరు గడ్డి పరకను నాది అనుకుంటే పునర్జన్మ తప్పదు. దానిని ఎవరూ ఆపలేరు. జీవితంలో ఏది ఎదురైనా ఒక్కటిమాత్రం గుర్తుంచుకోండి మంచి జరుగుతున్నా, చెడు జరుగుతున్నా అన్నీ తొలగిపోతాయి. నీ ఉపాధి నీకు సుఖ, దుఃఖాలను కలుగజేసినా అది కూడా తొలగిపోతుంది. ఈ మాటను మంత్రంగా భావించండి. చిన్న ఆలోచనే అయినా చిన్న ఊసే కదా అనుకుంటే ఆ విషయంలో అజాగ్రత్తగా ఉంటే అది చెడు తలంపు అయితే పునర్జన్మను తీసుకొని వస్తుంది. నునుపుగా ఉన్న రాయిపై చిన్న నీటిబొట్టు ఉంటే అడుగు వేస్తే కాలు జారి ప్రమాదానికి దారి తీసినట్టుగా చిన్న చెడు తలంపు వల్ల జీవితం వ్యర్థమయమవుతుంది. ఆసక్తి లేకపోతే భయం రావలసిన పని లేదు.

6. పూర్వజన్మలో చేసిన కర్మలను బట్టే చుట్టాలు వస్తారు. కానీ నీవు వివేకంతో స్నేహితులను ఎన్నుకోవచ్చును, మంచి పుస్తకాలను ఎన్నుకోవచ్చును. చుట్టాలు ఎలాగైనా తప్పరు. భీష్ముడు మాటను పోషించుకోవడానికి అధర్మంలో ఉన్నవానితో కలసి ఉండవలసి వచ్చింది. అది ఆయన తలరాత. ఎవరైనా తలరాతను తప్పించుకోలేరు. చెడు తలంపులను నీవు





పెంచుకుంటే అది నీ చావును తీసుకొస్తుంది. ఏ కారణం వల్ల, ఏ సంస్కారం వల్ల ఈ శరీరం వచ్చిందో తెలుసుకోకుండా, దానిని పరిష్కారం చేసుకోకుండా ఇంకా ఏదో మంచి జన్మ రావాలని ప్రకృతి విషయాలను ఆస్వాధించడం ఏమి ప్రయోజనం? చేతిలో ఉన్న బంగారాన్ని వదిలి పెంకు ముక్కల్ని ఏరుకున్నట్లు ప్రస్తుత అవకాశాల్ని వదలి మంచి జన్మ రావాలి అని భావించడం అటువంటిదే. స్నేహాలను బట్టే బుద్ధి పుడుతుంది. ఒక గూటిలో రెండు చిలుకలు ఉన్నాయి. ఒక దొంగ ఒక చిలుకను పట్టుకొని వెళ్ళాడు, రెండవ చిలుక ఒక సాధువు వద్ద ఉన్నది. ఒకరోజు రాజుగారు ప్రజావాణిని తెలుసుకుందామని బయలుదేరి ఆ దొంగ ఇంటికి వెళ్ళారు. ఆ దొంగ పెంచుతున్న చిలుక "పట్టుకోండి, తన్నండి, చంపండి" అంటుంది. ఆ రాజుగారే సాధువు ఇంటికి వెళ్ళారు. ఆయన పెంచిన చిలుక "దయ చేయండి మా స్వామి వస్తారు, కూర్చోండి" అంటుంది. ఒకే గూటి చిలుకలే అయినా సహవాసంలో అంత దోషం ఉంటుంది. మనం ఏ జంతువును ఇష్టంగా తింటున్నామో ఆ జంతువుగానే జన్మించి ఇతరులు మనల్ని తినే పరిస్థితి వస్తుంది. అది భగవంతుని చట్టం.

7. రావణాసురునిలో గుణాలు ఉన్నాయి కాబట్టి లోక మోహంలో ఆయన పడ్డాడు. రాముడు గుణాతీతుడు కాబట్టి లోకం ఆయన్ని మోహింపచేయలేకపోయింది. రామాయణం వల్ల నేర్చుకునేది క్రమశిక్షణ. క్రమశిక్షణ లేని ధనము, చదువు మనల్ని పాడుచేస్తాయి. అంతఃకరణాన్ని అదుపులో పెట్టుకొనే పనే పని. దానికన్నా ఇతరమైనవి, ముఖ్య పని ఏదీ లేదు. క్రమశిక్షణ లేనివాడు ఇహానికి, పరానికి కూడా పనికిరాడు. అణకువగా ఉన్న వాడికే ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఊహించుకోవడం వల్ల నిరుత్సాహం కలుగుతుంది. ఊహ లేకపోతే నిరుత్సాహం లేదు. ద్వంద్వాల మధ్య ఎవరైతే పాఠాలు నేర్చుకుంటారో వారే తరిస్తారు. మరణం అంటే ఒక బుడగలోంచి ఇంకొక బుడగలోకి వెళ్ళటం. కొంతమందికి ఇతరులతో పొగించుకోవడం ఇష్టం. అదే సంస్కారంగా మారి కోటి జన్మలు తీసుకొస్తుంది. బాపూజీ

వినోభాబావే చేసే పనులను శ్లాఘిస్తూ నాలుగు వాక్యాలు వ్రాసి పోస్టు చేసి పంపించారు. దానిని వినోభాబావే చదివి ముక్కలు ముక్కలుగా చింపి పారేసారు. అదే కొందరైతే ఫొటో కట్టించుకుని అందరికీ చూపుతారు. దాని గురించి వినోభాబావేని అడిగితే "ఆ ఉత్తరాన్ని రోజూ చదువుకుంటే నాకు అహంకారం పెరుగుతుంది" అన్నారు. మనం సహజంగా నార్మల్‌గా జీవించాలి అని అనుకొంటూ ఉండగానే వేలాది జన్మలు దొర్లిపోతున్నాయి. అనుకోవడం వేరు, ఉండటం వేరు. నీవు ప్రకృతిని కళ్లతో చూడు. కానీ ప్రశాంతంగా చూడు. దుఃఖం వచ్చిన, సుఖం వచ్చినా సాత్వికంగా చూస్తూ ఇది అంతా స్వప్నంగా పరిశీలిస్తూ చిరునవ్వు నవ్వుకోగలిగితే నీకు వివేక వైరాగ్యాలు కలుగుతాయి. దానివల్ల నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. ప్రతిఘటన వద్దు, ప్రకోపం వద్దు. క్రియేషన్‌ని ప్రశాంతంగా చూడు క్రియేటర్ దగ్గరకు వెళ్ళిపోతావు. రూపబుద్ధి లేనివాడిని ప్రారబ్ధం ఏమి చేస్తుంది? పత్తా లేకుండా పోతుంది. "డబ్బు ఉన్న వాళ్లంతా మేము డబ్బున్నవాళ్లము, వాళ్ళు పేదవాళ్ళు అనుకుంటారు". "డబ్బు లేని వారు మేము పేదవాళ్లము, వాళ్ళు డబ్బున్న వాళ్ళు అనుకుంటారు". ఇద్దరూ పిచ్చివాళ్ళే. సమానంగా ఉండాలి. ఆత్మ అందరిలోనూ సమానంగా ఉంది. సామాన్య సంసారం గల వాళ్ళు భగవంతుని ఎక్కువ స్మరించుకొంటారు. అది భగవంతుని దయ.

8. ఇతరులకు మనం సేవ చెయ్యకపోయినా ఇతరులతో సేవ చేయించుకోకుండా ఉంటే చాలు. ఇష్టాలకు, అయిష్టాలకు దూరంగా ఉండండి. ఈశ్వరుడు మీ పట్ల ఏ పని చెయ్యాలో ఆ పని చేసుకొని పోతాడు. నీవు తరిస్తావు. చిన్న చిన్న విషయాలకోసం మనుషులను దూరం చేసుకోకండి, వాటికోసం అశాంతికి గురికాకండి, గమ్యాన్ని మరచిపోకండి. కోపం వల్లనే మరణం తొందరగా వస్తుంది. ప్రపంచంలో అన్నిటికంటే బరువైనది గతాన్ని మొయ్యడం. దానికన్నా రోడ్డు రోలర్ తేలిక. మనిషికి దుఃఖమనేది లేదు. గతాన్ని తలపెట్టుకోవడమే. కష్టపడి పనిచేసేవాడికి గతం గుర్తుకురాదు. సోమరిపోతులా ఉన్నవాడికే గతం గుర్తుకు వస్తుంది.





సోమరితనమే దుబారా. జీవిత సారాన్ని పిండి చేసిన అందమైన మాటలివి. "ఏ మనిషికైనా దుఃఖం వస్తూ ఉంటే దానికి ఇతరులు కారణం కాదు. తను చేసుకున్నదే అని తెలుసుకోవడమే జ్ఞానం". దానిని తెలుసుకోవడానికి జ్ఞానం కావాలి. ఈ మాటను మనస్సులో రుబ్బుకోండి "నా దుఃఖానికి నేనే కారణం" అని. నేను సబ్జక్టు, నీవు ఆబ్జక్టు. ఇది ఫైనల్ మాట. సబ్జక్టు ఉన్నప్పుడే ఆబ్జక్టు. నేను వచ్చాక నీవు వస్తావు. "నేను" లెస్ అయితే "నీవు" లెస్ అవుతావు. నీ ఆలోచనే మనస్సులో ముద్ర వేస్తుంది. కాబట్టి అజాగ్రత్త పనికిరాదు. ఒక బెంగ తరువాత ఒక బెంగ, ఒక పరాభవం తరువాత, ఇంకో భంగపాటు, ఒక భూకంపం తరువాత మరో భూకంపం. అవి ఏమీ లేకుండా కుటుంబం అంతా సుఖంగా ఉన్నాము అనుకోండి ఎవరో ఒకరు కుటుంబంలో జారిపోతారు. ఇది అంతా ప్రకృతి పని. అధిష్ఠానం ఈశ్వరుడు అని మరచిపోకండి. మీ మొఖం ఆయన వైపు తిప్పండి. ఈశ్వరుడు ఒకడు ఉన్నాడు అనే నమ్మకం కావాలి. శరణాగతిలోనే మనస్సు అణిగి ఉంటుంది. అందులో అది కరిగిపోతుంది. శరీరాన్ని చూచేవాడు ఛండాలుడు, పరమాత్మను చూచేవాడు పండితుడు. అల్లాడి కృష్ణస్వామి ఇలా అన్నారు "నా ముఖంలో ఉన్న వికారాలను చూడకండి, నా మాటల్లో అందం, సౌందర్యం చూడండి, ఆనందించండి" అని.

9. మీ కుటుంబ సభ్యులను ఎవరినైనా మీరు ప్రేమిస్తే వాళ్లకోసం వాళ్లను ప్రేమిస్తున్నారా? లేక రేపు మిమ్మల్ని చూస్తాడని మీకోసం ప్రేమిస్తున్నారా? అని గమనించండి. మీలో ప్రేమించేది ఎవరు? అహంకారం. మన బుద్ధి పాడైపోవడం వల్ల ఈ రీజన్ తెలియడం లేదు. ఈ పాడు బుద్ధి అర్థం చేసుకోదు. మిమ్మల్ని మీరు చూసుకోవడం మానేసి లోకాన్ని చూడడానికి అలవాటు పడిపోయారు. అందుకే కల్లోలంలోకి వెళ్ళిపోతున్నారు. దానికి కారణం కోరిక, కోపము, భయము. భగవంతుని సంకల్పం ఒక ప్రక్కన పెట్టేసి నేనే వీళ్ళని ఉద్ధరిస్తున్నాను అనుకొంటే అది మాయ. నేను నా పిల్లల్ని చదివించడం వల్లనే వారు బాగుపడ్డారు అనుకోవడం పాడు

బుద్ధి. ఇల్లు, ఒళ్ళు ప్రాణం తీసేస్తాయి అంటే ఇంటికి తాళం వేసి బయటకు వెళితే ఇంట్లో దొంగలు పడతారేమోనని నీకు కుదురు ఉండదు. ఒళ్ళు అంటే అద్దంలో ఒళ్ళంతా చూచుకోవడం. ఇది చచ్చేదాకానే మీ కూడా వస్తుంది. అది నీడ అని మీరు అనుకోవడం లేదు. అందువల్లనే మీకు దుఃఖం వస్తున్నది. జీవుడుతో తాదాత్మ్యం వల్లనే దుఃఖం వస్తుంది. మంచివాడు మనకు అపకారం చెయ్యాలన్నా చెయ్యలేడు. కారణం వాడి మంచితనం ఆ పని చెయ్యనివ్వదు. చెడ్డవాడిని మంచివాడు అనుకొంటే ప్రమాదం. తాడుని పాము అనుకొంటే ప్రమాదం లేదు, భయం కలుగుతుంది కరవదు కానీ పాముని త్రాడు అనుకుంటే ప్రమాదం కరచి చంపేస్తుంది. లోకాన్ని నిజం అనుకొంటున్నావు. కానీ నిజం వలె కనిపిస్తుంది. నిన్ను విమర్శించిన వారిని, పొగిడిన వారిని నిజం అనుకోవడం వల్ల దుఃఖం, సంతోషం కలుగుతున్నాయి. అనిజాన్ని నిజం అనుకొంటున్నావు. అదే మాయ. కర్మ ఫలితం ఒక కాలంలో వస్తుంది ఒక కాలంలో పోతుంది. మంత్రి పదవి ఒక కాలంలో వస్తుంది ఒక కాలంలో పోతుంది. కానీ జీవుడు అనుకుంటాడు ఈ పదవి శాశ్వతంగా ఉంటుందని. అదే మాయ. దేహమే శాశ్వతంగా ఉండదు.

10. ప్యూరిఫైయింగ్ ప్రాసెస్ అంటే ఆపరేషన్‌కి ముందు అనేక పరీక్షలు చేస్తారు. శరీరానికి బిపి, షుగర్‌లాంటి పరీక్షలు పెడతారు. ఆహారం పెట్టకుండా ముందు జాగ్రత్త పడతారు. ఇలా అన్ని పరీక్షలు అయిన తరువాత బల్ల ఎక్కిస్తారు. అలాగే నీవు పవిత్రుడవు అవడానికి నీలో సహనం, వైరాగ్యం కలగడానికి నీ కుటుంబ సభ్యులను ఒంపు పెట్టుకొని మిమ్మల్ని ద్వేషించేలా చేస్తాడు. ఈశ్వరుడు తద్వారా వారి మనస్సు నిజంకాదని, మాటపడే నేను నిజంకాదని గ్రహించే శక్తిని ఇస్తాడు. అలా నీవు పవిత్రం అయ్యేవరకు ఎవరినో ఒకరిని ఒంపు పెట్టుకొని గిల్లి తిట్టిస్తాడు ఈశ్వరుడు. ఇవన్నీ నిజం కాదని పూర్ణంగా తెలిస్తే దుఃఖం రాదు. శాంతి సామ్రాజ్యానికి అధిపతివి అవుతావు. దీనినే గౌడపాదుడు కారికల్లో "ఈ ప్రపంచం నిజం కాదని





నిజంలా కనిపిస్తున్నదని అది మనస్సుకు చెందినదని" అన్నారు. ఈ వాక్యాన్ని ఆయుధంగా తీసుకుంటే ప్రపంచాన్ని జయించవచ్చును. ఎవరో ఏదో తనకు వ్యతిరేఖంగా పనులు చేస్తున్నారు అనే తలంపు వల్లనే మనస్సు బయటకి వెళ్ళిపోతున్నది. సబ్జక్టు మిస్ అవుతున్నావు. నీ దుఃఖానికి, దేవునికి సంబంధం లేదు. ప్రతీదానికి దేవునితో ముడిపెట్టకండి. ధనకాంక్ష, కీర్తికాంక్ష, అధికార కాంక్ష అవి అన్నీ పాడైపోవడానికే. వీటివల్ల నీలో పునర్జన్మ భీజాలు పడిపోతాయి. అవి వచ్చినవి వచ్చినట్లు పోవు. మనం దేవుని హుండీలో డబ్బులు వేస్తాము. విలువైన బంగారు వస్తువులను వేస్తాము. మనకు ఇష్టమైన జుట్టును ఇవ్వలేము. అది శరీరంలో ఒక భాగమని బంధించు కోవడం వల్లనే. మన పూర్వీకులు జుట్టు ఇవ్వమంటారు. పూర్ణ అర్పణకు సంకేతంగా, దీనిని పూర్వం నుంచి ఆచారంలో పెట్టారు పెద్దలు. "దేహం నేను అనే బుద్ధి ఉంది. దానికి అదనంగా సోమరితనం ఉంటే ఇతరులను పోషించనక్కరలేదు. నీ పొట్ట కూడా గడవదు" అంది గీత.

11. తెలివి ఎంత ముఖ్యమో ప్రవర్తన కూడా అంతే ముఖ్యం. నిగ్రహం అవసరం. ఎల్‌కేజీ=నిగ్రహం, యుకేజీ=సంయమనం. మనస్సును కట్టేసుకోవడం కంటే సంయమనం గ్రేట్. సంయమనమంటే ఇంద్రియాలను సమయం వచ్చినప్పుడు వాడుకోవడం. అవసరం వచ్చినప్పుడు నోటితో మాట్లాడటం. నిన్ను అవమానించేవాడు నిజంకాదు, అవమానం నిజం కాదు. కానీ నిజంలా కనిపిస్తున్నది కాబట్టి దుఃఖం వస్తున్నది. ప్రపంచాన్ని నీవు ఎలా ఎదుర్కోవాలో నీకు తెలియకపోవడం వల్ల పొంగు, కృంగు పొందుతున్నావు. పారమార్థిక దృష్టితో చూస్తే పూర్వజన్మ కూడా అబద్ధం. వ్యావహారిక దృష్టితో చూస్తే పూర్వజన్మ నిజం. సహనంతో జీవించాలి. భోగ ప్రవృత్తి ఆనందమయ కోశానిది. నేను ఇది చేసాను, ఇది మంచిది అని చెప్పడం విజ్ఞానమయకోశం నుంచి వచ్చింది. అజ్ఞానమంతా భోగ ప్రవృత్తి లోనే ఉంది. కర్తృత్వాన్ని జయించవచ్చును కానీ భోగప్రవృత్తిని జయించడం చాలా కష్టం. సినిమా చేసేటప్పుడు తలుపులు అన్నీ మూసేస్తారు. రాత్రి

అయితే లైట్లు అన్నీ తీసేస్తారు. అప్పడు బొమ్మలు బాగా కనిపిస్తాయి. తలుపులు వేయకుండా, లైట్లు తీయకుండా సినిమా వేసినా బొమ్మలు కనిపించవు. అలాగే నీవు చిన్న చిన్న బుద్ధిలో ఉన్నప్పడే ప్రపంచం కనిపిస్తుంది. నీ బుద్ధి విశాలమై ఆత్మ వెలుగును చూస్తుంటే ఆ వెలుగులో ప్రపంచం కనబడదు. అంజనుడు అంటే మాయగలవాడు, నిరంజనుడు అంటే మాయ లేనివాడు పరమాత్మ అని అర్థం. ఎండ్రిన్ త్రాగమని ఎవరైనా ఇస్తే త్రాగము. అది చేసే చెడు మనకు తెలుసుకాబట్టి. అలాగే విషయ సుఖాల్లో ఉన్న సుఖం ఎంతో, దుఃఖం ఎంతో తెలిస్తే దాని మీ వ్యామోహం పెట్టుకోము. ఈ శరీరం ఒక మట్టి ముద్ద. దీనికి ఎవరో ఒక పేరు పెట్టారు. ఇవి రెండూ నిజం అనుకొన్నంత కాలం ముక్తి లేదు. ఇవి రెండూ నేను కాదని తెలిసేవరకూ జ్ఞానం కలుగదు. అవి రెండూ నిజం అనుకొన్నంతకాలం కర్మలు చేయడం మానవు. మీ అస్థిత్వమైన ఆత్మమీద మీకు నమ్మకం కలగనంతకాలం మీరు ఎంతమంది దేవతలను ఆరాధించినా ముక్తి లభించదు. ప్రతీది ఊహించు కోవడం వల్లనే అశాంతి, భయం వస్తుంది. త్యాగికి వాసన పడదు భోగికి వాసన పడుతుంది. రాగద్వేషాలు నిజం అనుకోవడం వల్లనే నరకాన్ని చూస్తున్నాము.

12. మనిషికి ధనం ఉన్నా, అధికారం ఉన్నా, చదువు ఉన్నా దుఃఖం వచ్చేస్తుంది. కోరిక, ఆకాంక్ష ఎక్కువ అవుతూ ఉంటాయి. వేశ్యవలలో నుండి బయటపడగలము కానీ స్తోత్రాలకు, నమ్మకాలకు అలవాటు పడ్డవాడు బయటకు రాలేడు. ముళ్ళ కంపల మధ్య నుండి జాగ్రత్తగా బయటపడ్డట్టే రాగద్వేషాల మధ్య నుండి జాగ్రత్తగా బయటపడాలి. అవి నిజం అనుకోవడం వల్లనే దుఃఖం వస్తుంది. చెఱకు గెడను యంత్రంలో పెడితేనే రసం వస్తుంది. బంగారాన్ని పుటంవేసి కాల్చితేనే మేలిమి బంగారం అవుతుంది. అలాగే కష్టాలు, నష్టాలు, అవమానాలు నీకు సత్యానుభవం కలుగజేయడానికే ఏర్పాటు చేయబడినవి. ఒక వర్తకుడు రైతు దగ్గర ధాన్యం కొని బియ్యానికై మిల్లులో ఆడిస్తే తవుడు, దూగర, నూకలు, బియ్యం వస్తాయి. వర్తకుడు





బియ్యం కోసమే కొంటాడు కానీ మిగతవాన్నీ కామన్‌గా వచ్చేస్తాయి. అలాగే నీవు ఇష్టంగా భగవదనుభవాన్ని పొందాలి అనుకుంటే దానితోపాటు కీర్తి, ధనము రావచ్చును. అవి అవుట్ ప్రొడక్ట్స్. వాటి మీద ఆధారపడకూడదు. జీవితంలో అన్నీ తలంపులే. ఈశ్వరుడు ఒకడు ఉన్నాడనే విశ్వాసం నీకు నిజంగా కలిగితే ముందు బెంగలు పోతాయి. మనం నోటితో ఈశ్వర నిర్ణయం వల్ల అన్నీ జరుగుతున్నాయి అంటాము. మీకు ఆ విశ్వాసం నిజం అయితే మీరు నిర్మలంగా ఎందుకు ఉండలేకపోతున్నారు? కారణం అక్కడ విశ్వాసం లేదనే అర్థం. మంచి జరిగితే ఈశ్వర సంకల్పం అనుకొన్నప్పడు చెడు జరిగినా ఈశ్వర సంకల్పం అని ఎందుకు అనుకోలేకపోతున్నాము? ఒకటిగా ఉన్నది అనేకంగా కనిపిస్తున్నది అంటే దాని మర్మం తెలుసుకొనే వరకు అది అలాగే కనిపిస్తుంది. దాని స్వభావం అంతే. తాడు తాడుగా కనిపిస్తే పాము లేదు. శరీరాన్ని ఎక్కువ సుఖపెట్టేస్తే అది ఒక అలవాటుగా మారిపోతుంది. (సాధకులకు అమృతానుభవానికి అది పెద్ద అవరోధం). మీరు ఇంటి వద్ద ఉండగా ప్రశాంతంగా ఆలోచించండి. మనస్సు కదలడానికి ఇష్టమైనా ఉండాలి, అయిష్టమైనా ఉండాలి. అవి రెండూ ఆపగలిగితే మీ మనస్సుకు చాపల్యం లేదు. విషయం అర్థం అయితే మనస్సును కంట్రోల్ చేసే పని లేదు. పొగడ్తలను శ్రవణం చేయడం వల్ల గమ్యాన్ని తప్పిపోతాము.

13. రామకృష్ణ పరమహంసగారు అంటారు "ఒక చెయ్యి 'లీల' మరో చెయ్యి 'నిశ్చయం'. నిశ్చయం (ఆత్మ యొక్క నీడ) లీల. మరణానికి మరణం లేని స్థితి గురించి చెబుతూ మాయ అంటే లీల. నాకు నిశ్చయం ఎంతో లీలా అంతే. నిశ్చయం లేకపోతే లీల లేదు" అన్నారు. ఆధ్యాత్మికానికి, లౌకికానికి బేధం లేదు. లోక రూపంలో ఉన్నవాడు కూడా పరమాత్మే. ఇది ఒక లీల. చనిపోయే వరకు ఏడవకండి. లీలను ఎంజాయ్ చెయ్యండి. లాభనష్టాలు రావచ్చును. లాభం ద్వారా, నష్టం ద్వారా మీ మైండ్ ట్రైనింగ్ పొందాలి. ఈశ్వరుడి లీల ఎలా ఉంటుందంటే ఆయనే మీకు బాగా ఇష్టమైన వారితో తిట్టిస్తాడు. కారణం మీరు చనిపోయేటప్పడు వాళ్ళు మీ తలంపులోకి

రాకుండా అది ఉపయోగపడుతుంది. వాల్మీకి రామాయణం వ్రాస్తూ నీ వైభవం వల్ల, నీ తేజస్సు వల్ల వ్రాయగలిగాను కానీ నావల్ల ఇది జరిగేది కాదు. అది శరణాగతి. ఇష్టాలు, అయిష్టాలు లేకపోతే మనస్సు బయటకు వెళ్ళదు. లోకం మనలను ముట్టుకోదు. అభ్యాసం, వివేకం, వైరాగ్యం సాధనకు ఉండాలి. ఇతరులు నిన్ను పొగుడుతూ ఉంటే అది నిజం అనుకుంటే "నీకన్నా వాళ్ళు ఇతరులు" అనే భావం నీలో పాతుకుపోతుంది. అదే అహంకారాన్ని బలపరుస్తుంది. మీ ఇంటికి మీరు యజమానులు. మీ ఇంట్లో సభ్యులు మీ మాట వినరు. దానివల్ల దుఃఖం వస్తుంది. అది పునర్జన్మను తీసుకొస్తుంది. మీ మాట వినకపోతే నష్టం ఏమిటి? ఇది ప్రధాన అంశం. రాగద్వేషాలు లేనివాడే నిత్య సన్యాసి. ఎవరినైనా మీరు విమర్శిస్తే అది పరిణామంలో మీ ఇంటికే వస్తుంది. ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోకి వచ్చేవారు లౌకికులతో స్నేహం చేస్తే ఆ దరిద్రం మీకూ వస్తుంది. నీ హృదయంలో ఉన్న ఆనందం, శాంతి నీ మనస్సుకు అందనంత కాలం ఎన్ని జన్మలు ఎత్తినా కూర్చుని ఏడవవలసిందే. నీలో ఏదో ప్రత్యేకత ఉంది అనుకుంటే నీవు పతనం అవుతావు.

14. నూటకి 30% రోగాలు శారీరకంగా వస్తాయి. మిగిలిన 70% రోగాలు మనస్సు దుఃఖం పొందడం వల్ల వస్తాయని శాస్త్రం చెబుతుంది. దీనికి పరిష్కారం మనోపరిధిని మనం అధిగమించాలి. ఆహార నియమం పాటించాలి. కర్మమార్గం లేబొరేటరీ సైడ్, జ్ఞానమార్గం థీరియాటికల్ సైడ్. రెండూ బాగా వికశించాలంటే భక్తిని ఉపయోగించుకోవాలి. ఎమోషన్ గల మనుషులు భక్తి మార్గాన్ని ఉపయోగించుకోవడానికి ఇష్టపడతారు. మనకి ఇది మంచిదని తెలుస్తుంది. కానీ చెయ్యలేము. కారణం సంస్కారాల వల్ల మనిషిని చూస్తే అసూయ వస్తూ ఉంటే కర్మమార్గంలో విఫలమవుతాడు. మీ మనస్సుతో మీరు తాదాత్మ్యం పొందకపోతే ఎవరూ ఏమీ చెయ్యలేరు. మీ పరువు, ప్రతిష్ఠలు అన్నీ మనోపరిధిలోనివే. మన అసూయతలు వ్యక్తుల మీద కలుగుతూ ఉంటే భగవంతునికన్నా భిన్నంగా ఉన్నామనే భావం





బలపడుతుంది. అదే అజ్ఞానం. శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గితే అనేక రోగాలు నిన్ను పీడిస్తాయి. అలాగే నీకు మనో నిగ్రహం లేదు అనుకో, మానసిక బలం లేదు అనుకో అనేక ఆకర్షణలకు లొంగిపోతావు. అదే నీకు మనోబలం లేదు అనడానికి నిదర్శనం. అదీ నిజమే - ఇదీ నిజమే అనుకొంటే ఎన్ని నిజాలు ఉన్నాయి. ఈ ప్రకృతి దృశ్యాలు అన్నీ నిజం ఎలా అవుతాయి, భగవంతుడు ఒక్కడే నిజం. దానిని గ్రహించాలి సాధకుడు. "మనం మన స్వార్థాన్ని వదిలివేసే పనే యజ్ఞము". అదే త్యాగము అన్నారు పరమాత్మ. "దేహంలోకి 'నేను' ఎలా వచ్చిందో తెలియదు. అది ఎక్కడ నుండి వచ్చిందో అక్కడికి పంపడమే విచారణ" అన్నారు భగవాన్. "నీకు జ్ఞానం కలగాలి అంటే ప్రారబ్ధం అనుభవిస్తే పోతుంది" అన్నారు. కోరిక వస్తే వెంటనే ఉద్రేకం వస్తుంది. ఉద్రేకం వల్ల మానసిక, శారీరక వ్యాధులు కలుగుతాయి. చాలామందికి అజ్ఞానం రావడానికి కారణం కుయుక్తులు, కుచేష్టలు. వాడి కళ్ళతో ఇతరుల దోషాలు చూస్తూ ఉంటే వాడిని వెయ్యి కళ్ళతో చూచేవాడు ఒకడు ఉన్నాడని వాడికి తెలియడంలేదు.

15. లోకం లోకంగానే ఉంది. దాన్ని అధిగమిస్తే ప్రపంచం నిన్ను బంధించదు. భగవంతుడు ఒక నియమం పెడితే కపటభక్తులు దానికి పెడర్థాలు తీస్తారు. వారు ఇలా అన్నారు అనుకోకండి, వారిని అధిగమించాలి. మీ మానసిక, శారీరక బాధలే గొప్పవి అనుకోకండి. ఆ బాధలు గాడిదకు వచ్చాయి అనుకోండి. గాడిద మిమ్మల్ని ఒక తన్ను తన్ని వెళ్ళిపోతుంది. అవి భగవంతుడు పంపిన గాడిదలే. మీ గర్వాన్ని, పొగరుబోతుతనాన్ని తన్ని వెళ్ళిపోతాయి. తిట్టించుకోవడాలు, విమర్శలకు గురికావడం గాడిద తన్నులు, దానితో మీ మనస్సు సరిఅయిపోతుంది. వాసన యొక్క వేగం ఒక్కసారే తగ్గదు. నెమ్మదిగా తగ్గుతుంది. సబ్జెక్టును మననం చేసుకోవాలి. మనిషి అయిన తరువాత ద్వేషం రాకుండా ఉండదు. దానిని దులిపేసుకోవాలి. ద్వేషం వల్ల మనకు ఉపకారం ఉండదు పైగా అపకారం. స్వార్థం ఉన్నవాడి కన్నా స్వార్థం లేనివాడే అన్ని సౌకర్యాలు పొందుతాడు. ఆ సంగతి స్వార్థపరుడికి

తెలియదు. ద్వేషం ఉన్నచోట కోపం వస్తుంది. రాగం ఉన్నంతకాలం కోరిక వస్తుంది, ఈ విషయం అందరికీ తెలియదు. ఆ ద్వేషం కుటుంబ సభ్యులపై కావచ్చు, బయట వ్యక్తులపై కావచ్చు. భగవంతుని కన్నా మనం భిన్నంగా లేము, ఉన్నామని అనుకొంటున్నాము. అక్కడి నుండే దుఃఖం, వేదన ప్రారంభమవుతాయి. నిష్ఠ లేకుండా క్రమశిక్షణ లేకుండా జ్ఞానం వచ్చే అవకాశం లేదు. బాధపడేవాడు లేనప్పుడు బాధ ఎక్కడ ఉంటుంది? కొంతమంది భక్తులు ఇలా అనుకొంటారు "వాళ్ళ కుటుంబ విషయాలు ఎవరికీ తెలియకూడదు. దేశంలోని విషయాలన్నీ వారికి తెలియాలి" అది భక్తా? భగవాన్ "ఇతరుల గొడవలలోకి వెళ్ళకండి" అన్నారు. మనం చూసే దృశ్యాలు, మాటలు బాగుంటే అప్పుడు మాత్రమే మనం పవిత్రం అవుతాము, అభేద స్థితిలో ఉంటాము. అప్పుడు చూచేవాడు, వినేవాడు ఉండడు. మనస్సులో బలహీనమైన సంస్కారాలు ఎలా పనిచేస్తున్నాయో చూసుకోవాలి. వాడిలో ఈ లోపం ఉంది అనేవాడు ద్వేషరహిత స్థితికి సాధన చెయ్యకపోతే కొన్ని జన్మలు వృథా అయిపోతాయి. లోపాల పాపమే ద్వేషంగా మారిపోతుంది.

16. "యోగం" అంటే మనస్సును భగవంతునిలో ఐక్యం చేయడమే. సమాయత్తం చేయడమే యోగం. మీకు ఎక్కడైనా చెడ్డవాళ్ళు కనిపిస్తే అది మీ మనస్సులో ఉన్న చెడ్డతనమే. వాళ్ళు చెడ్డవాళ్ళుగా కనిపిస్తారు. ఆ సంగతి మీకు తెలియదు. చెడ్డవాళ్ళు అని ద్వేషం పెట్టుకుంటే వాళ్ళ కంటే మీరే ముందు చెడ్డవాళ్ళు అయిపోతారు. అది మనస్సు చేసే పని మాత్రమే. సృష్టిలో పొరపాటు కనిపిస్తే అది మనస్సులో పొరపాటు. మనకంటే ధర్మరాజు చాలా గొప్పవాడు. "జూదం" అనే విధి అతి బలీయమైనది. ఆ దేహం ఎలా నడవాలో అలాగ విధి నడిపిస్తుంది. అర్థం చేసుకోవడం కష్టం. విమర్శించడం తేలిక. బాహ్యంగా ఎంత గొప్పగా ఉన్నా స్వప్నమే. మనస్సు బాగుపడాలి. అందరూ పాడైపోవడానికి ప్రధాన కారణాలు రూపదృష్టిలో ఉండటం, గత జీవితాన్ని తలపెట్టుకోవడం. వ్యర్థమైన ఊహల్లో, ఆలోచనలతో





జీవిస్తూ చనిపోతున్నారు. దేహప్రారబ్ధంలో ఏమి జరిగినా అది అంతా అబద్ధమే. గతంలో మీ మనస్సు ఉంటే శక్తి నష్టం, కాలం వ్యర్థం. మన గొయ్యి మనమే తవ్వుకొంటూ అందులోనే పడిచనిపోతున్నాము. హేల్‌కాట్ "మనం ఏరోజుకారోజు ఎంతవరకు బుద్ధి సూక్ష్మత పెరుగుతున్నది, ఎంతవరకు చైతన్యస్థాయి పెరుగుతున్నది అని ప్రతీరోజూ సాయంకాలం చూసుకోవాలి" అన్నారు. లంకలో సీత ఆంజనేయునితో "ఈ సృష్టిలో చిన్న పొరపాటు చెయ్యని వారు ఎవరూ ఉండరు. ఒకవేళ ఉంటే దానిని సరిచేసుకునేవాడు గొప్పవాడు" అన్నది. నిప్పు నిప్పుని కాల్చదు. మనమే నిప్పు అయితే మనలను అది కాల్చదు. నిప్పుకు వేడితనం స్వభావం. పవిత్రుడు నేను పవిత్రుడను అనుకోడు. అది ఆయన గుణం కాదు, ఆయన స్వభావం. మీకు ఆ స్వభావం ఇంకా రాలేదు. అదే తానైనప్పుడు అనుకోవడం ఉండదు. కోరికకు వ్యాపారానికి సంబంధం ఉంటుంది. ప్రేమకి వ్యాపారానికి సంబంధం ఉండదు. కోరికలోంచే కోపం వస్తుంది. దానివల్ల ఆలోచనాస్థాయి తగ్గిపోతుంది. అవసరంలేని విషయాలు తగ్గించుకుంటే మనకు సమయం కలసి వస్తుంది. ప్రాణాయామం స్థూల బుద్ధి ఉన్నవానికి పనిచేస్తుంది. ఇష్టం లేని తలంపులు వచ్చేస్తూ ఉంటే దుఃఖం వచ్చేస్తుంది. మీకు జీవించడానికి సరిపడ ఆస్తి ఉంది. కానీ నీ తలంపుల వల్ల దుఃఖం వచ్చేస్తూ ఉంటే ఆస్తి ప్రయోజనం ఏమిటి?

17. మన గురించి మనం అంచనా వేసుకోవడానికి వివేకం కావాలి. మన గురించి మనకు తెలియదు. పైగా విమర్శించడం. మీరు ఎంతమంది మీద తీర్పులు చెప్పినా మీ మీద కూడా తీర్పులు చెప్పేవాడు ఒకడు ఉన్నాడని మరచిపోకండి. కర్తృత్వ రహితునకు దుఃఖంలేదు. మనకు అవసరం లేని విషయాలు తలపెట్టుకున్నామా ఆ ప్రకృతి ప్రవాహంలో కొట్టుకొని పోతాము. నీ జీవితం వృథా అయిపోతుంది. ఈ లోకం మిర్రర్ లోపల ఏదైనా ఆకర్షణ కలిగితే అది నీవే తీసుకోవాలి. ఎవరైనా నిన్ను ఏదైనా అంటే అది మన పొరపాటే వారు మంచివారు, వీరు చెడ్డవారు

అని చెప్పేది నీ మైండే. మన మనస్సు బయటు వెళితే ఎంజాయ్‌మెంట్ లోపలకు వెళితే ఆత్మ. మనశ్శాంతి ఉంటే శరీర అనారోగ్యాన్ని మందులతో ఐదు రోజుల్లో తగ్గించుకోవచ్చు. మనశ్శాంతి లేకపోతే పది రోజులకు కూడా తగ్గడం కష్టం, కాబట్టి మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. ఇతరులను చూచి మనం అసూయ, ద్వేషం పెట్టుకుంటే శారీరక, మానసిక ఆరోగ్యాలు రెండూ చెడిపోతాయి. కోరిక, కోపం, లోభం ఈ మూడు విడిచిపెట్టాలి. కోరిక లేకపోతే కోపం, లోభిత్వం అసూయ రావు. కోపంతో ఉన్నవాడు ఎదుటివాడి మంచిమాటలను గ్రహించలేడు. ఎందుకూపనికిరానివి గర్వం, సోమరితనం. మనం వాటి వెంట తిరుగుతున్నాము. సముద్రంలో బుడగలు పుడతాయి. అటూఇటూ కదులుతాయి. అందులోనే లయం అవుతాయి. అలాగే మనం దేవునిలోనే ఉన్నాము. అందులో ఉండి అటూ ఇటూ కదులుతాము. బుడగలాగే ఈ శరీరం పోతుంది. బుడగకు నామ, రూప స్థితి కలుగుతుంది అది పోతుంది. అలాగే మన శరీరం పోవచ్చును మనం అంతా ఆత్మ స్వరూపులమే. ఓర్పు తగ్గిపోయేకొలది జీవితం విఫలం అవుతుంది. రామాయణం పారాయణం చేస్తే బుద్ధి వికశిస్తుంది. చావు అంత అబద్ధమైన విషయం మరియొకటి లేదు. నీకు ఏదైనా దుఃఖం వస్తూ ఉంటే అది మీలో ఎంతోకొంత స్వార్థం ఉందని కొండగుర్తు. దేహ ప్రారబ్ధం మన మనస్సుని సుడిగుండంలో పడ్డ వస్తువులా తిప్పుతుంది. సుడిగుండంలోనుండి బయటకు రావాలంటే గురువనుగ్రహం ఉండాలి. లేకపోతే సుడిగుండం పెద్ద ఆంబోతును కూడా సుడిక్రిందకు లాగేస్తుంది. మనమూ అంతే.

18. బుద్ధి పక్వానికి రానివాళ్ళ మాట మనం వినకూడదు. వాళ్ళు కుళ్ళిపోతారు, ఇతరులను కుళ్ళిపోయేలా చేస్తారు. మనం రాజకీయం గురించి, సాహిత్యం గురించి మాట్లాడుకోరాదు. దానివల్ల లాభం లేదు కదా! నష్టం వస్తుంది. మనసు అంతర్ముఖం అయితేనే ఆత్మవైపుకు వెళ్ళి సత్యదర్శనం జరుగుతుంది. మన మనస్సును రాజకీయాల వైపు, కుళ్ళిన





భావాలు కలవారి మాటలవైపు పోకూడదు. వాళ్ళు బాగా మాట్లాడారు అనే వాళ్ళ ఉపన్యాసాలు వినడంకన్నా జైలులో ఉండి రావడం మంచిది. అందరి హృదయాలలోను నారాయణుడు ఉన్నాడు. ఎవరిని ప్రేమిస్తాము? ఎవరిని ద్వేషిస్తాము? ద్వేషించడానికి, ప్రేమించడానికి ఎవరు ఉన్నారు? శోధించ కుండా స్నేహం చెయ్యకండి. మంచి కాని మందు త్రాగి మంచి చేస్తుంది అని బుద్ధి పెట్టుకున్నా ఏ శ్రేయస్సు కలుగదు. అలాగే శ్రేయస్సు కలగని క్రియల యందు బుద్ధి పెట్టుకోకు. పెట్టుకుంటే అధోగతే. అమ్మా! అని నోటి నిండా మాట్లాడని కొడుకు కోసం స్మశానంలోకి రాని సంతానంకోసం నీ ఆత్మ విచారణ ఆపుచేస్తావా? వాళ్ళను ఉద్ధరిద్దాము అనుకుంటావు. వాళ్ళ కోసం పైసా పైసా పొదుపు చేస్తావు. ఎవరి భయం వల్ల సూర్యుడు ఉదయిస్తున్నాడో, వాయువు వీస్తున్నాడో వాడు నీ హృదయంలోనే ఉన్నాడు. ఆయనకు శరణు వేడు. ఆయనతో రాజీ పడకపోతే మిగిలేది పాడులోకాలు. ఈశ్వర ఇష్టం, నీ ఇష్టం చేసుకుంటే శాంతి మిగులుతుంది. మనం లేము ఉన్నది ఈశ్వరుడే. నీ ప్రేమ ఇద్దరికో, ముగ్గురికో. ఈశ్వర ప్రేమ విశ్వ వ్యాప్తము. శాంతి, మోక్షము పిత్రార్జితము వల్ల వచ్చేది కాదు. కష్టపడి సంపాదించుకోవాలి.

19. వివేకము, అవివేకము సాధనే. వివేకము అంటే ఇది మంచి, ఇది చెడు అని ఆలోచించడం. అవివేకము అంటే ఏది మనకు ఉపయోగం, ఏది మనకు ఉపయోగం లేనిది అనే విచక్షణ లేకపోవడం, అందరి భావాలను భుజాన వేసుకొని తిరగడం అవివేకంతో ఉన్నప్పుడు తెలియదు. వివేకం వచ్చాక తెలుస్తుంది. అవసరాలు పెంచుకుంటే మనస్సు పాడైపోతుంది. అవసరాలు మనకూడా రావు. పాడైపోయిన నీ మనస్సు నీ కూడా వచ్చేస్తుంది. చాలామంది కర్మలు అనుభవిస్తున్నాము అంటారు. భగవాన్ దీనిపై "కర్మలను అనుభవించకండి" అన్నారు. జరిగిపోయిన గొడవలు తలపెట్టుకోవడమే కర్మలు. కర్మలు అనుభవిస్తున్నాము అనే మాటే వదిలేయండి. దేనికి కర్మలు అనుభవిస్తున్నారు? జరిగిపోయిన గొడవలు

మరచిపోతే శరీరం మీద తల దూదిపింజలా అయిపోతుంది. అంతేకాదు అది మరచిపోతే అంతరదృష్టి కలుగుతుంది. ఒక పనిని అలవాటుగా చేస్తే అది అలవాటుగా మారిపోతుంది. చెయ్యడం మానేస్తే ఏమీ లేదు. ప్రారబ్ధం అనుభవించే మనస్సు, శరీరము మనం కానప్పుడు ప్రారబ్ధం అనుభిస్తున్నాము అనే ఏడుపు ఎందుకు? ఏదో జరిగిపోయింది అని అశాంతి తెచ్చిపెట్టు కుంటున్నారు. ఆ స్థితితో నీవు తాదాత్మ్యం చెందితే ఏదిగా ఉన్నావో అది నీకు ఎలా తెలుస్తుంది? దేహ ప్రారబ్ధంతో తాదాత్మ్యం పొందకుండా ఉంటే మీ బండెడు దుఃఖం బండెడు ఆనందంగా మారిపోతుంది. ఇది మీరు అవగాహన చేసుకోవాలి. మీరు జీవితాన్ని అవగాహనతో జీవిస్తే సత్యం దానంతట అది తెలియబడుతుంది. తప్పడు తాదాత్మ్యం వల్ల తెలియబడదు. సబ్జక్టును శ్రవణం చేయడం వల్ల ఆత్మలాభం కలుగుతుంది. నీకు వచ్చే గౌరవం అగౌరవం నిజం కాదు. అది నిజం అనుకుంటే మీకు శని పట్టుకున్నట్లే. మంచివాడు, చెడ్డవాడు మనస్సుకు సంబంధించినవి. మంచివాడు చెడ్డవాడు కావచ్చు, చెడ్డవాడు మంచివాడు కావచ్చు. జీవకోటి పంచభూతాలే. అదే ప్రపంచము. జీవుడు దైవాన్ని అర్థం చేసుకోలేడు. దేహం నీవు కాదు. కాకపోయినా దేహం నేను అనే తలంపు నీకు ఉంది. అది ముడి. ఆ ముడిని నీ తెలివితేటలవల్ల విప్పకోలేవు. భగవంతుని దయ వల్ల మాత్రమే దాన్ని విప్పకోగలవు. మన మనస్సు దేహంతో తాదాత్మ్యం పొందడం వల్ల కష్టాల్లోను, నష్టాల్లోను ఏడుస్తున్నావు. ఆత్మకు ఏడుపు లేదు. అది దేనితోనూ తాదాత్మ్యం పొందడం లేదు. మనకు భిన్నంగా ఏదో ఉన్నదని చైతన్యానికి తెలియదు. చైతన్యం అంటే ఉండటమే.

20. అంతర్ముఖమైన మనస్సు శాంతిని సంపాదిస్తుంది. బయటకు వెళ్ళిన మనస్సు దుమ్ము, అశాంతి తీసుకొస్తుంది. అంతుర్ముఖమైన మనస్సు జ్ఞాని చెప్పే మాటల యొక్క విలువను గ్రహిస్తుంది. బహిర్ముఖమైన మనస్సు కోటిజన్మలైనా సత్యాన్ని గ్రహించలేదు. అంతర్ముఖమైన మనస్సు గురువు చెప్పే మాటలను వినడం వలన వాని జీవిత విధానమే మారిపోయేలా





చేస్తుంది. నీవు ఏదిగా ఉన్నావో అది ఎరుకలోకి వస్తుంది. మీ పూర్వజన్మ, భవిష్యత్ జన్మల వంటి గొడవల్లోకి వెళ్ళకండి. మీరు చావు పుట్టుకలు లేని చైతన్యం. ఈ విషయం మీరు గ్రహించాలి. చైతన్యంలో జీవించండి. ప్రతీరోజూ మీ మనస్సును హృదయంలో ఎంత "టైం" ఉంచుతారో అంత వరకూ మీ హృదయంలో ఉన్న రోతలు అన్నీ కరిగిపోతాయి. మీరు పవిత్రులు అవుతారు. సత్యానుభవం కలిగాక పరిస్థితుల ప్రభావం మీ మీద పడదు. జ్ఞాపకాలు మరచిపోతే కర్మ అనుభవిస్తున్నాను అనేవాడు ఉండడు. మరచిపోకపోతే వారిపై పగ తీర్చుకోవలసి వస్తుంది. భగవాన్‌తో ఒకరు "నేను ఇంకా ఇరువది ఏండ్లు బ్రతుకుతాను. ఏదో కర్మ చెయ్యాలి కదా!" అంటే "గతంలో చేసిన కర్మ పోయినట్లే, భవిష్యత్ కర్మ కూడా పోతుంది" అన్నారు. "కర్మలు ఎలా పోతాయి" అంటే భగవాన్ "మరచిపోతే పోతుంది" అన్నారు. మీరు ఎంత కంట్రోల్‌గా ఉన్నా ఒక్కోసారి ప్రారబ్ధం వల్ల నోరు జారతారు. నష్టాన్ని కొనితెచ్చుకొంటారు. జరిగిపోయిన విషయాలు తలపెట్టుకొని మనస్సును పుండు చేసుకోకండి. నూటికి నూరుపాళ్ళు భగవంతునిపై విశ్వాసం ఉంటే ప్రారబ్ధం మిగులుతుందా?

21. వ్యాసులవారు "నీవు కల్పించే మాయలో మేము కొట్టుకు పోతున్నాము. ఉన్నది నీవు ఒక్కడివే. నీ పాదల మీద భక్తి లేకపోతే భోగ త్రయాలైన ధనకాంక్ష, స్త్రీ కాంక్ష, కీర్తి కాంక్షలలోనే ఉంటాము". భగవాన్ "ఏ సంఘటన వల్లా దుఃఖపడకూడదు. పాఠాలు నేర్చుకొని మారు మనస్సును పొందాలి. వివేకం పెంచుకోవాలి" అన్నారు. ఐన్‌స్టీన్ సద్బుద్ధిలోనూ, మంచితనంలోనూ గొప్పదనం ఉంది. ఏ మాయ వల్ల అజ్ఞానం వచ్చిందో ఆ ప్రకృతి గుణాలను దాటితేగానీ సత్యం తెలియదు. జ్వర కారణం నశించే వరకు జ్వరం తగ్గదు. ఏ సమస్య వల్ల ఈ ప్రకృతిలోకి వచ్చామో ఆ సమస్య (సంస్కారం) నశించేవరకు ఈ ప్రకృతిని జయించలేము. భగవంతుని శక్తి తెలిసేవరకు ఈ ప్రకృతి నుండి బయట పడలేము. "ఏ అవగాహనా లోపంలో పడ్డామో ఆ అవగాహన కలిగే వరకు ఆ సమస్య నిన్ను వెంటాడుతూ

ఉంటుంది" అన్నారు. దేహం చెడ్డది కాదు. కానీ అహంకారాన్ని పెంచే గుణం (దేహాభిమానాన్ని కలుగజేసే గుణం) దేహానికి ఉంది. ఆ కారణం నశించే వరకు నీకు సత్యం తెలియదు. భక్తులు ప్రారబ్ధాన్ని కూడా అనుభవించనక్కర్లేదు. నేను అనుభవిస్తున్నాను అనే భావన భక్తిలో కొట్టుకు పోతుంది. వ్యాసులవారు పద్దెనిమిది పురాణాల సారము ఒక్క వాక్యంలో ఇలా చెప్పారు "ఇతరులను పీడిస్తే పాపం వస్తుంది. ఉపకారం చేస్తే పుణ్యం వస్తుంది" అన్నారు. దుష్టులకు దూరంగా ఉండాలి. వారితో విరోధం పెట్టుకో కూడదు. వాతావరణ కాలుష్యం వల్ల శరీరానికి కాలుష్యం పట్టి శరీరం పతనమవుతుంది. కానీ చెడు స్నేహాల వల్ల మనస్సులోకి కాలుష్యం ప్రవేశిస్తుంది. అనేక నీచ జన్మలు తీసుకొస్తుంది. కోపం వల్ల చాలామంది శత్రువులను తెచ్చుకుంటారు. భయం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం చెడిపోతుంది. మీకు ఏరకమైన తలంపు వచ్చినా ఒకటి గుర్తుపెట్టుకోండి ఒకటి మనస్సులోంచి, రెండవది శరీర సంబంధమైన దానివల్ల. ఈ రెండు మనం కాదు అనుకుంటే తలంపులు ఆగిపోతాయి. మన స్వభావాన్ని మనం మార్చుకోకపోతే మనం బాగుపడం. ఆత్మజ్ఞానం కలుగదు.

22. మన జీవితానికి ఏవో సమస్యలు వస్తున్నాయని కర్రలు, కత్తులు పుచ్చుకునేది మనమే. రెండూ అబద్ధాలే. భగవాన్ దృష్టిలో వ్యక్తిగతమైన ఆత్మలేదు. అడిగేవారు ఉబలాటం కొద్దీ ఆజన్మ, ఈజన్మ అంటూఉంటే అలాగే అనేవారు. ఒకరు భగవాన్‌తో "ఆ పళ్ళు వారి తోటలోనివే" అనగా "ఈశ్వరుడు మన నోట్లోపడడానికి మన దగ్గరకు పంపించాడు. ఇవి మనవే. వ్యక్తిభావన అలా తలపెట్టుకోవడం వల్లనే కర్మలు చుట్టుకొని కొత్త జీవితానికి నాంది పలుకుతాయి. లాభనష్టాలు పూర్వజన్మ సంస్కారం వల్ల వస్తాయి. అవి అన్నీ వ్యావహారిక సత్యాలు" అన్నారు. వేదంలో చెప్పిన కర్మ అంటే "నీ వ్యక్తిభావన తొలగించుకునే పని" అని అర్థం. బాహ్యమైన పనులు కాదు. పుణ్యం కూడా జీవుణ్ణి బంధిస్తుంది. ఏ కారణం వల్ల తగువులు, విభేదాలు ఉంటాయో ఆ కారణం తొలగేవరకూ ఆ సమస్య తీరదు. శాస్త్రం అర్థం





కాకపోవటానికి కారణం మన గర్వమే. ప్రాణము, మనస్సు మనం కాకపోయినప్పటికీ అవి వ్యక్తమవుతున్నాయి. మన గమ్యం ఏమిటో నిరంతరం ఆలోచించుకోవాలి. మనకు రాబోయే జన్మ రాకుండా ఈ జన్మ సార్థకం చేసుకోవాలి. జీవితంలో అనేక సంఘటనలు జరుగుతాయి. అవి అన్నీ పాఠాలు నేర్చుకోవటానికే. అనేక మొట్టికాయలు తగిలాక "అయ్యో భగవంతుడు చెప్పిన మాట ముందే విని ఆచరిస్తే ఈ దెబ్బలు తగలకపోను" అనిపిస్తుంది. దుర్యోధనుడు, ధృతరాష్ట్రుడు అందరూ పాఠాలు నేర్చుకున్నాక తెలుసుకున్నారు. డ్యూటీ చెయ్యడం పాపం కాదు, అనుబంధం పెట్టుకోవడం వల్లనే పాపం వస్తుంది. నీ ప్రవర్తన మార్చడం కోసం ఇంట్లో వారిని సమకూర్చుతాడు ఈశ్వరుడు. టార్చ్‌లైట్‌ను ఫోకస్ చేసాక అది పాము కాదు తాడు అని తెలిసి భయం పోతుంది. అలాగే నీ బుద్ధిని (దృష్టిని) అంతర్యామిపై పెడితే శాంతి కలుగుతుంది సుఖి అవుతావు.

23 మనిషి పాడైపోవడానికి చెయిన్ రియాక్షన్ కారణం. వారు తిట్టారు, వీరు కొట్టారు అనేదే చెయిన్ రియాక్షన్. మరిచిపోతే ఏమీ లేదు. ఎవరి మీదనైనా కోపం వస్తే దానిని ఫలింపచేయటానికి ఒకరిని పురిగొల్పడం దాని ఫలితం కష్టాలు కలిగించుకోవడానికే. చెడు నీకు కష్టాన్ని కల్గిస్తుంది. చెడ్డ స్నేహితులు నీకు దొరికితే ఆ స్నేహంతో నీవు వేయి జన్మలు వెనుకకు వెళ్ళిపోతావు. ఎవరైతే ప్రతికూల, అనుకూల పరిస్థితుల యందు భగవంతుని అనుగ్రహమే అని సజీవమైన విశ్వాసంతో ఉంటారో వారికి మాయ దారి ఇస్తుంది. మీ సుఖాన్ని జ్ఞానం వైపు తిప్పటానికే మీకు ఇష్టం లేని వాళ్ళను మీ ఇంటిలో పెట్టాడు. మీకున్న మమకారం తగ్గించడానికి, చెడ్డవాళ్ళను కూడా మంచివాళ్ళకు పాఠాలు నేర్పడానికి పెడతాడు భగవంతుడు. సాధకులు దానిని గ్రహించాలి కానీ ప్రతిఘటించకూడదు. దేహం చనిపోతున్నప్పుడు 'నేను చనిపోతున్నాను' అనుకొనే వానికి పునర్జన్మ తప్పదు. చనిపోయే దేహంతో తాదాత్మ్యం ఉంది కాబట్టి పునర్జన్మల్లో వచ్చే దేహంతో మరల అనుబంధం వచ్చేస్తుంది. మనం అంటూ ఏమీ లేము అని తెలుసుకొన్న

వానికి ఈశ్వరవాక్యం అర్థమవుతుంది. లోపల ఒక దేవుడు బయట ఒక దేవుడు అంటూ లేడు. మన దేహబుద్ధి వల్లనే అలా అనిపిస్తుంది. భగవంతుని దయ సంపాదించడానికి మనచేత మాట, తలంపు ఒకటిగా, మంచిగా ఉండాలి. గతించిన వారి జ్ఞాపకాలు తొందరగా దుఃఖాన్ని తీసుకొస్తాయి. మంచివాళ్లు, చెడ్డవాళ్లు అనే చిల్లర విషయాలు వదిలేయండి. వాళ్లను ఈశ్వరుడే నిర్ణయించాడు. రాగద్వేషాలు పెట్టుకోకుండా ఉదాసీనంగా ఉండాలి. వస్తువు పోతే అది నాది అనుకుంటే దానిని వెదకడానికి పరుగెడతాము. ఆ వస్తువు నాది కాదు ఋణం తీరిపోయింది అనుకుంటే దుఃఖం రాదు. పరుగులేదు. భగవంతుని పాదాలచెంత "నేను అనే తలంపు చచ్చిపోతే లోకం లేదు - నాది లేదు - పరుగు లేదు".

24. నీవు అంటూ ఏమీలేవు. ఉన్నావు అనుకోవడం వల్లనే శరణాగతి లాంటి అనేక మార్గాలతో అన్ని మతాలు వచ్చాయి. విషయం అర్థం అయితే స్పష్టత వస్తుంది. అది వస్తే నారాయణుడు వ్యక్తం అవుతాడు. ఒక్కటే అనేక రకాలుగా కనిపిస్తే భయం కలుగుతుంది, లోకం మీద మోహం కలుగుతుంది. నానాత్వంలో ఉంటే మృత్యువు తప్పదు. పుట్టుక, జన్మ మన చేతుల్లో లేదు. వచ్చే జన్మలో ఎక్కడ పుడతామో ఎంతకాలం ఉంటామో తెలియదు. మనకు మిగిలింది బడాయిమాటలు, బడాయి చేష్టలు. తల్లి లేకుండా బిడ్డరాదు. అసూయ లేకుండా కోపం రాదు. ద్వైతంలోనుండే అన్ని గుణాలు వస్తాయి. మీకు ప్రకృతిలో అందం కనిపిస్తే ఎంత బాగుంది అనిపిస్తుంది. దానికన్నా కోటిరెట్లు అందం నీ హృదయంలో ఉంది. అది తెలియక ప్రకృతిలోని అందాలే నిజమని దానితోనే సంతోషిస్తాము. సినిమాల్లో ముఖ్యమైన పాత్రధారులపై హెడ్‌లైట్ ఫోకస్ చేస్తారు ఆ ఆకారాలు స్పష్టంగా కనిపించడానికి. అలాగే మన తెలివితేటల్ని మన బలహీనతలపై ఫోకస్ చెయ్యాలి. మన బలహీనత ఎంత ఉంది? అది మనకు ఎంత అశాంతిని తీసుకొస్తుంది అనే గ్రహింపు రావాలి. ఒక వ్యక్తి నీకు భిన్నంగా కనిపించినంతకాలం భయం, అసూయత కలుగుతుంది. వేదన చెందుతావు.





25. కాళిదాసు రఘువంశంలో "అన్ని భోగాలు నీకు అందుబాటులో ఉన్నా నీ మనస్సు వికారం చెందకుండా ఉండాలి" అన్నారు. ఖాళీగా ఉన్న మనస్సులోకి కామం, చిరాకు బయలుదేరతాయి. డబ్బు, చదువు, గౌరవం సంపాదించడం కన్నా మంచి మనస్సు సంపాదించడం కష్టం. కారణాలు అన్నింటికీ కారకుడు శ్రీకృష్ణుడు. ఇలా విరోధిగా తయారయ్యాడు ఏమిటి? అనుకొంటాము. దానికి కారణం ఆయనే. శరీరానికి ప్రాణం కావాలి. చైతన్యానికి ప్రాణం అక్కరలేదు. మనుషుల ప్రేమలు కుటుంబ సభ్యులకు మాత్రమే. దానిని నమ్మడానికి వీల్లేదు. ఆకాశంలో మబ్బులు ఎలా వస్తాయో చెప్పలేము. మనుషుల యొక్క చాపల్యమైన ప్రేమ అటువంటిదే. దేవుని ప్రేమలో చపలత్వం లేదు. దానిని నమ్మాలి. ఆడించేవాడు కృష్ణుడే. ఆడేవాళ్లము మనము. మనం ఈ పని చేస్తున్నాము అనుకోవడంలోనే సంసారంలో బంధించబడుతున్నాము. ఉన్న సత్‌పదార్థం ఒక్కటే ఇంతమంది ఆడతారా! నేను-నాది అనేవాడు యూనివర్సల్ కాలేడు వాడు ఎంత గొప్ప విలువలతో ఉన్నా. లోకవాసన కన్నా సారా త్రాగడం మంచిది. సారామత్తు నాలుగు గంటలే ఉంటుంది. లోకవాసన జన్మలోకి దొర్లింపచేస్తుంది. లోకవాసన ఉన్నది లేనట్టుగానూ, లేనిది ఉన్నట్టుగానూ భ్రమింపచేస్తుంది. మనకి మొదటి శ్వాస తెలియదు, తుది శ్వాస తెలియదు. మాకు అన్నీ తెలుసునని ఎలా అంటారు? మన ప్రారబ్ధాన్నిబట్టి ఇంట్లోవాళ్ల సిద్ధమవుతారు. వారిపట్ల మనకు ఇష్టం లేకపోయినా మనం శాంతంగా ఉండి బయటకు వెళ్లిపోయి సుఖండా ఉండటం మంచిది. ఇవి అన్నీ నిజాలు కావు. దుఃఖ పడడానికి, బాధ పడడానికి ఏమీ లేవు. విరోధులు అపకారం చేస్తే బాధపడటం, మనతో స్నేహంగా ఉండి అపకారం చేస్తే ఎక్కువ బాధపడటం అనేది ఒక బలహీనత. దానిని ఓర్చుకోవాలి. అదే సాధన. దేహం నేను అయితే అలా అనుకోవడంలో తప్పలేదు. కానీ మనం దేహం కాదు. మనం ఎన్నిరకాల సాధన చేసినా దేహం నేను అనే బాధ మనలను విడిచిపెట్టడం లేదు. ఈ ఛండాలం అంతా మనం భరించవలసిందే. దేహాత్మబుద్ధి

నశించిన వెంటనే బ్రహ్మాత్మ బుద్ధి కలుగుతుంది. స్నేహాలు, విరోధులు పెద్ద భ్రాంతి. విద్యాకాంక్ష ఉన్నవాడు ప్రశ్న వేస్తే ఏమనుకుంటారో అని సిగ్గుపడితే అభివృద్ధిలోకి రాలేడు. వైరాగ్యం ఉన్నవాడికి ఈ లోకం గడ్డిపరకలా కనిపిస్తుంది. వైరాగ్యం లేనివాడికి గడ్డిపరక బంగారంలా కనిపిస్తుంది. చెడు తలంపులు వస్తే తప్పనిసరిగా చెడు జరుగుతుంది. మంచి తలంపులు వస్తే భవిష్యత్తులో మంచి జరుగుతుంది. ఒక్కరోజు బెంగ పెట్టుకుంటే పదిహేను రోజులు ఆలోచించే శక్తిని, పనిచేసే శక్తిని నష్టపోతాము. అతిగా మాట్లాడటం వల్ల అక్కర్లేని మాటలు వస్తాయి. శక్తిని పోగొట్టుకుంటాము.

26. దేహం మీద ఈగను వాలనివ్వము. అంత శుచిగా ఉంచుకుంటాము. కానీ మనస్సులోకి రాగద్వేషములు అనే కుళ్ళు అంటుకుంటే దానిని నిరోధించలేము. ఇదే పెద్ద మాయ. కనీసం వాటిని రాకుండా చూసుకోవాలి అనే ఆలోచన రావడంలేదు. యోగబుద్ధి కలిగేవరకూ దేహాత్మ బుద్ధి పోదు. బేధబుద్ధి వలన రాగద్వేషాలు, భయము వస్తాయి. కోరిక ఉన్నప్పుడు లోకం సత్యం, దేవుడు అసత్యం అనిపిస్తుంది. బోధ చేసేవాడి నోరు నెప్పి పెట్టాలి కానీ వానికి సత్యం తెలియదు. మీరు సబ్జక్టును శ్రద్ధగా శ్రవణం చేసి ఇంటికి వెళ్ళి మననం చేసుకొని మన పనులను మనం చేసుకుంటూ ప్రశాంతంగా ఉంటే సంతోషిస్తాను. అంతేగానీ నాకు బహుమతిగా కిరీటాలు పెడితే నేను వాటిని ఏమి చేసుకుంటాను? మోక్షం ఎప్పుడు వస్తుందా అని కనిపెట్టుకొని కూర్చోకండి. అలా ఉంటే మీకు భక్తి లేదని అర్థం. నీ చేతిలో ఉన్నది నీవు చెయ్యి. భగవంతుని చేతిలో ఉన్నది భగవంతుడు చేస్తాడు. ప్రస్తుతం సమాజం ఎలా ఉంది అంటే తల్లితండ్రులను చూడకూడదు వారి ఆస్తి ఎప్పుడు వస్తుందా? అని చూడటం. మోక్షం విషయంలో కూడా అలాగే ఉన్నారు. సాధన లేదు, సిద్ధి కావాలి. కుళ్ళిపోయిన కుక్కమాంసం మీదికి నీ మనస్సు వెళ్ళదు. అలాగే నీకు మోక్షకాంక్ష నిజమైతే భోగకాంక్ష మీదికి నీ మనస్సు వెళ్ళనే వెళ్ళదు. వేడిగా ఉన్న ద్రవపదార్థాలను త్రాగాలంటే వాటిని ఫేన్ దగ్గర పెడితే చల్లారుతుంది. అలాగే నీ మనస్సు





ఆందోళనగా ఉంటే నీకు ఇష్టమైన భగవంతుని నామాన్ని జపిస్తే నీ మనస్సు చల్లబడుతుంది. ఆత్మజ్ఞానం భగవంతుడు బహుమతిగా ఇచ్చేదే కానీ మనం అడిగి తీసుకునేదికాదు. నీకు ప్రకృతిరీత్యా వచ్చే బాధలు, శత్రువుల వల్ల వచ్చే బాధలు, ఇంట్లోవారి వల్ల వచ్చే బాధలు, ఇంటి ప్రక్కవారి వల్ల వచ్చే బాధలు ఎన్ని వస్తే అన్నీ రానివ్వండి. నీవు జ్ఞానం సంపాదిస్తే ఈ గోల నిన్ను ఏమీ చెయ్యదు. దేహాన్ని భరించడం కలియుగంలో చాలా కష్టం. జరిగింది భగవంతుని సంకల్పం వల్లనే, అలాగే జరుగబోయేది ఆయన సంకల్పం వల్లనే అనే ధృడ నిశ్చయం ఉండాలి. గతాన్ని, భవిష్యత్తుని స్మరించడం వల్ల వర్తమాన కాలం పాడవుతుంది. భగవంతుని మాటల్లో జీవిస్తే ఆయన వ్యక్తమవుతాడు. మనుషుల్లో ఏనుగులాంటివాళ్ళు, సింహంలాంటివాళ్ళు (జంతు లక్షణాలు కలిగినవారు) ఉంటారు. వాళ్ళ గుణాలను చూడకండి. భగవంతుణ్ణి చూడటం నేర్చుకోండి. నామం వల్ల భగవంతునితో చుట్టరికం కలుగుతుంది. కాలిపోయే చుట్టాలకన్నా భగవంతునితో చుట్టరికం చాలా మంచిది. జ్ఞానం పొందాలంటే సుఖపడాలనే కాంక్ష పోవాలి. సుఖపడే రోజులు రావడం లేదు అనేది ఒక ఆపేక్ష. నీవు అనుకొన్నా అనుకోకపోయినా జరిగేది జరిగి తీరుతుంది.

27. కలియుగంలో ఎవరిని ఎలా హింసించాలనే ఆలోచనలు ఉంటాయి. మనకు ఈశ్వరుడు ఒకడు ఉన్నాడనే విశ్వాసం ఉండాలి. అందరినీ ఆయనే చూసుకుంటున్నాడు. ఎవరిని హింసించినా భగవంతుని హింసిస్తున్నాము అనే భావన రావాలి. ఈ సృష్టిని నడిపించేవాడు ఒకడు ఉన్నాడు. మన వల్ల ఏమీ కాదు అనే విశ్వాసం లేకుండా జీవలక్షణాలు తొలగవు. ఈ దేహం ఎందుకు వచ్చిందో ఆ పనులు పూర్తి అయ్యేవరకు ఈ భూమి మీద తిరుగాడుతూనే ఉంటుంది. దేనికీ ఆందోళన వద్దు. చనిపోవడాలు, పుట్టడాలు, స్వర్గం, నరకం, ధర్మాలు, అధర్మాలు 'నేను' అనే ఒంటిస్తంభం మేడ మీద ఆధారపడి ఉన్నాము. ఆ 'నేను'ను కూల్చితే నీవు ఆత్మగా మిగులుతావు. అందరూ మనల్ని ప్రేమించరు, ద్వేషించేవారు

ఉంటారు. ద్వేషం వల్ల మన మనస్సుకు చలనం కలుగకూడదు. ఎవరినీ చూసి ఈసడించుకోకూడదు. బయట సమస్యల వల్ల సాధన చెడకుండా మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవాలి. నీకు ఆనందం వస్తే అవి నాకు వచ్చేసాయి అని సంతోషపడటం, ఆశ్చర్యపడటం వల్ల అవి కూడా నీకు ఉపయోగపడవు. సృష్టిలో ఏదైనా పాపం ఉంది అంటే అది ఎటాచ్‌మెంట్ వల్లనే, నీవు ఏదో కల్పించుకుంటావు, ఊహించుకుంటావు. దానివల్ల వచ్చే వేదన నీవు కల్పించుకున్నదే. దానికి మరల సాధన మొదలుపెట్టడం. విత్తనం లేకుండా చెట్టు రాదు. నీ మనస్సుకు ఆధారం కామం అది నశించకుండా జ్ఞానం రాదు. కొందరు అనుకొంటూ ఉంటారు మనకు ఎంత భూమి ఉంది అని గర్వపడతారు. అలా ఎందుకు గర్వపడతారో తెలియదు. ఇది అంతా భగవంతుని అనుగ్రహమని వారికి తెలియదు. నేను-నాది అనేది ప్రకృతి విషయం. మమకారం బంధించినట్టు జీవుణ్ణి మరేదీ బంధించదు. మనం ఈ నేను అనే దానిని పోగొట్టుకోవడానికి ప్రయత్నిస్తాము. కాని భగవంతుడు దానిని వదలకుండా నొక్కి పెట్టి ఉంచుతాడు. కారణం ఆ 'నేను' అనే తలంపు ద్వారా ఇంకా ఖర్మానుభవం పొందవలసి ఉంది కాబట్టి. దానిని అలా తొక్కిపెట్టి ఉంచి జీవుణ్ణి జీళ్ళపాకంలా సాగదీస్తాడు. అప్పుడు కాని పూర్ణఎరుక సాధ్యం కాదు. సన్యాసం - సన్యాసం అంటే ఆ నేనుని విడిచిపెట్టడమే. కానీ మనం దానినే పట్టుకొంటున్నాము. సన్యాసం పుచ్చుకునే వారికి మహాత్ములు ఇలా చెబుతూ ఉంటారు. "మీరు ధర్మాన్ని ఆచరిస్తూ ధర్మ ప్రచారం చెయ్యండి" అని, శరీరానికి సన్యాసం ఇవ్వడం అంటే రంగుబట్టలు కట్టుకోవడం కాదు. మనస్సుకు సన్యాసం ఇవ్వకుండా అన్నీ పట్టుకుంటే సన్యాసం అనిపించుకోదు. ఏదైనా కర్మ చేసినప్పడు తెలియదు అనుభవించినప్పడు తెలుస్తుంది.

28. ప్రకృతిలో దుఃఖం లేదు, మమకారంలోనూ, అహంకారంలోనూ దుఃఖం ఉంది. దేహాభిమానం ఉన్నంతకాలం ఈ గౌరవాలు, గొప్పలు మనలను విడిచిపెట్టవు. దేహంతో మనం తాదాత్మ్యం పొందకపోతే బయట





గొడవలు నిన్ను ఏమీ చెయ్యలేవు. దేహప్రారబ్ధం ఎంత బలంగా ఉన్నా నిన్ను ఏమీ చెయ్యలేదు. మన ఇంట్లో రకరకాల మనుషులు ఉంటారు. అలాగే ప్రకృతిలో కూడా ఉంటారు. వారు అంతా మనకు ట్రైనింగ్ కోసం ఏర్పాటు చేసినవారే. దేహాత్మబుద్ధి ఉందా? లేదా? అని గురువు వాళ్ళతో ఎన్నో మొట్టికాయలు మొట్టిస్తాడు. జ్ఞానుల్లా గృహస్తులలో కూడా గొప్ప సాధకులు ఉన్నారు. వాళ్ళ ఇంట్లో మనుషుల వల్ల కలిగే బాధలను చూచి వాళ్ళు ఇలా అనుకుంటారు. మన దేహ ప్రారబ్ధాన్ని బట్టి వాళ్ళు సిద్ధం అయ్యారు. వాళ్ళ ప్రారబ్ధాన్ని బట్టి మనం సిద్ధమయ్యాము అనుకుంటారు. కానీ వేదన పడరు. రాతలు అనుభవిస్తాము - ఊహలు ఊరేగుతున్నాయి. బయట గొడవలు బయటే వదిలేయండి. లోపలకు తీసుకుంటే నీ మనస్సు విషపూరితమై పాడైపోతుంది. ప్రపంచంలో నిన్ను బంధించేది నీ స్వార్థమే. దానిని విడిచి పెట్టడమే త్యాగం. నీవు ఎక్కడికి వెళ్ళినా నీ ముళ్ళకంప (మనస్సు) నీ కూడానే ఉంటుంది. దానిని ఎరుకతో గమనించాలి. జ్ఞాని శరీరం బూడిద అయినా, మాట సజీవంగానే ఉంటుంది. ఔట్‌సైడ్ గొడవలు అంటే పెళ్ళి చేసుకోవడం వల్ల, సంతానం వల్ల ఇవి జరిగాయి అనేవి అన్నీ పెంట గొడవలు. దేహంలో దోషం లేదు, మనస్సులో దోషం ఉంది. పట్టించుకోవలసినవి పట్టించుకోండి. పని చెయ్యండి. ఫలితం మీ చేతులలో లేదు అని గ్రహించి ఫలకాంక్ష అనేది వదిలివేయండి. వివేకానందుడి గురించి ఠాగూర్ ఇలా అన్నారు "స్వామీజీ ఎవ్విర్ థింకింగ్ ఈజ్ పాజిటివ్, నెగిటివ్ థింకింగ్ లేనే లేదు. నేను తరిస్తాను అనే విశ్వాసంతో ఉండేవారు" తరించలేను అనే ఆలోచన వదిలివేయాలి. చిన్న సమస్య పిరికివానికి హిమాలయాల్లా, మహాసముద్రంలా కనిపిస్తుంది. ధైర్యవంతునికి పెద్ద సమస్య చిన్న బోదెలాగ కనిపిస్తుంది. ఆ సమస్యను దాటి వెళ్ళిపోగలడు. ఈ చుట్టాలు ఇలా ఉన్నారేమిటి? ఈ పరిస్థితి ఇలా ఉంది ఏమిటి? సరిహద్దు గొడవలు ఇలా ఉన్నాయి ఏమిటి? అనుకోకండి. వాటిని వాటి ప్రారబ్ధానికి వదిలిపోయండి. భగవాన్ సన్నిహిత సహచరుడు మాధవ శరీరం మరణించిన తరువాత మరు జన్మలో బరోడా

మహారాజుగారి నివాసంలో నెమలిగా జన్మించాడు. ఆరాణిగారు నెమలిని భగవాన్‌కు సమర్పించుకుంది. ఆ నెమలి మాధవ లాగే పుస్తకాలు తిరగేసేది. సంస్కారాలు, అనుబంధాలు అలా ఉంటాయి. కోపం, భయం కలిగిన తరువాతే అసూయత తరువాత బిపి వస్తాయి.

28. నీవు ఇల్లు విడిచిపెడితే జ్ఞానం రాదు. మమకారం విడిచిపెడితే జ్ఞానం వస్తుంది. వివేకం లేనివానికి దారే దొరకదు. ఎదుటివాడు ఏమి అన్నా మరిచిపోండి. వారిపట్ల మీరు ఎలా ఉన్నారు అనేది గ్రహించండి. మీరు ఎదుటివారిని ప్రేమగా చూడలేకపోతే "నేను చెప్పానని ప్రేమగా చూడండి" నేను ఆత్మని అనుకోవడం వేరు, అవ్వడం వేరు. గుర్తింపులు కోరుకున్నావంటే అజ్ఞానం పెరిగిపోతుంది. విషయచింతన స్మరించినా చంపుతుంది. విషయచింతనవల్ల ఆసక్తి కలుగుతుంది. వివేకం తగ్గిపోతుంది. బుద్ధి నెమ్మదిగా నశించిపోవడం ప్రారంభమవుతుంది. చివరకు భ్రష్టుడు అవుతాడు. కష్టసుఖాలు అనే ద్వంద్వాలను సహించడం నేర్చుకోవాలి. చెఱకుగెడను మిషన్‌లో పెడితే రసం వచ్చినట్లే, కష్టసుఖాలను అనుభవించేస్తే సుఖం వస్తుంది. ఈశ్వరుడు కర్త, నీవు అకర్తవు అని తెలిస్తే లోకంలో ఉన్న దుఃఖం అంతా నిన్ను ఆవరించినా నీకు ఏ బాధా రాదు. మనస్సుకు హద్దులు ఉంటాయి. ఆత్మకు హద్దులు లేవు. ఆత్మ ప్రేమ నీకు కలిగితే ఆ ప్రేమ విశ్వవ్యాప్తమవుతుంది. రాగద్వేషాలు పెట్టుకుంటే భౌతికంగా కూడా ఏమీ కలసిరాదు. పైగా వచ్చే జన్మలో బంధంలో పడతాము. మనస్సు ఉన్నంతకాలం ఏదో ఒకటి చింతించకుండా ఉండలేము. అందుకు ఆత్మ చింతన చెయ్యాలి. అలా చెయ్యకపోతే విషయచింతనలో పడిపోతాము. నూటికి నూరు పాళ్ళు మార్పు చెందేది, ఏదైతే ఉందో దానిని ఉంది అనుకోవడమే మాయ. ఆధ్యాత్మిక జీవితానికి గానీ, భౌతిక జీవితానికి గానీ ఆత్మవిశ్వాసం అవసరం. అది ఉన్న వాళ్ళకు లోకం అంతా మంచిగానే కనిపిస్తుంది. ఆత్మవిశ్వాసం లేనివారికి అందరూ పరాయివారిలా కనిపిస్తారు. ఆత్మవిశ్వాసం ఉన్నవాళ్ళు హద్దులు లేకుండా లోకాన్ని ప్రేమిస్తారు. పేదవాడు





పేదవాడు అనుకోకూడదు. ఆత్మ పేదది కాదు, అలాగే ధనవంతుడు ధనవంతుడు కాదు. వాడూ ఆత్మే. తలవంచుకుని తిరిగేవాడు (వినయంగా ఉండేవాడు) దేవుడు అవుతాడు. తల ఎత్తుకు తిరిగేవాడు అహంభావి. జీవుడు అవుతాడు. లోకం మనలను ఉద్రేకపరచడానికి ప్రయత్నిస్తే మనం భయపడకూడదు. అలాగే మనం ఇతరులను భయపెట్టకూడదు. ఇంట్లో వాళ్ళు నీవాళ్ళు కారు. ఇంట్లో ఉంటున్నారు కాబట్టి నీవాళ్ళు అనుకొంటున్నావు. అలాగే నీవు వాళ్ళ దానివి కాదు. నీవు ఆత్మవు. నీవు ఎవరితో స్నేహం చేస్తున్నావో వారి గుణాలు నీకు ఎంతోకొంత సంక్రమిస్తాయి. అవి నీకు ఇష్టం లేకపోయినా వచ్చి తీరుతాయి. మనం కూర్చోవడం బ్రాహ్మణుల ఇంటి వద్ద, లోపల మనస్సులో చేపల వాసన దానివల్ల ప్రయోజనం ఏమిటి? మనందరికి కారణభక్తి ఉంది దేవుని దగ్గరకు వెళ్ళేటప్పుడు కోరికలే గుర్తుకు వస్తున్నాయి. మనస్సు ఇంద్రియాలు, గౌణాలు ఇవి ప్రాధాన్యం లేనివి. ఆ విషయం తెలియక వాటికి ప్రాధాన్యం ఇస్తున్నాము.

29. స్థూల దేహంతోను, సూక్ష్మదేహంతోను, కారణదేహంతోను తాదాత్మ్యం చెందితే జ్ఞానం వచ్చే అవకాశం లేనేలేదు. మీ అలవాట్లలో నుండి సంసార బాధలలో నుండి బయట పడుతూ ఉంటే కొంత నొప్పి ఉంటుంది. దానిని భరిస్తే మీరు సఫలురు అవుతారు. పశువులు గడ్డి దాణా తిన్న వెంటనే పాలు ఇవ్వవు. కొంత సమయం తరువాత పాలు ఇస్తాయి. అలాగే మీరు సాధన చేసిన వెంటనే ఫలితం వచ్చేయాలి అనుకోకండి. కొంత సమయం పడుతుంది. "తప్పు చేయడం కంటే తప్పును సరిచేసుకోవడం లోనే మంచి ఉంది" అన్నారు ఐన్‌స్టీన్. ఆసక్తి పెంచుకుంటే అశాంతి వస్తుంది. బయట కారణాల వల్ల దుఃఖం రావడంలేదు. నీలో దుఃఖం లేదు. నీలో ఉన్న రాగద్వేషాల వల్లే దుఃఖం వస్తున్నది. సత్యంతో తాదాత్మ్యత లేకపోవడం వల్లనే దుఃఖం వస్తున్నది. కామం, క్రోధం అగ్నిలాంటిది. కృతజ్ఞత ఆశించడం వల్ల దేహగతమైన నేను గాలికి పెరిగినట్లు పెరిగిపోతుంది. కాలుకు దెబ్బ తగిలితే కట్టు కట్టించుకుని తగ్గించుకోవచ్చును. మనస్సుకు గాయమైతే

కొందరు మరణించేవరకు మరచిపోకుండా బాధపడతారు. 1.అప్ప, 2.నిప్ప, 3.విషం ఈ మూడింటితోనూ జాగ్రత్తగా ఉండాలి. తినకూడనివి తిన్నా, చూడకూడనివి చూసినా విషం కింద భావించాలి. అసూయ మాటలు చెప్పేవానికి ఎంత దోషం ఉంటుందో, వినివానికి అంతే దోషం ఉంటుంది. అసూయ వల్లనే విమర్శలు వస్తాయి. మనకు కోపం రాకూడదు అనుకున్నా మనస్సు ఉన్నంతకాలం అది రాకుండా ఉండదు. అది సహజం. ఎదుటి వారిపైన, కుటుంబ సభ్యులపైన దయ ఉండవచ్చు. అది ఎంతవరకు ఉండాలో అంత వరకే ఉండాలి. కానీ దయ పేరుచెప్పి రోజూ నీ మనస్సును బయటకు తోలుకుపోతూ ఉంటే లోపల "సున్న" అయిపోతావు. నీ మనస్సుకు అంతర్‌దృష్టి కలుగదు. లోపల బ్రహ్మం తెలియనప్పడు మంచిని చెడు అనుకుంటాము. చెడును మంచి అనుకుంటాము. మాయను జ్ఞానం అనుకుంటాము. నీవు వాటిని మంచిగుణాలు అనుకొని అక్కడే సరిపెట్టుకుంటూ ఉంటే ఒక గోతిలోంచి మరియొక గోతిలోకి పడకతప్పదు. దారి కానరాదు. మనం దేనినైతే విడిచిపెట్టామో దాని గురించి ఆలోచనా స్పృహ నీకు ఉండకూడదు. వాటి విషయంలో విసర్జించాము. ఒడ్డుకు వచ్చేస్తాము అనుకోకు. అవి విజృంభించవచ్చును. అజాగ్రత్త పనికిరాదు.

30. నారదుడు "బ్రహ్మం" యొక్క ఉనికిని చెబుతూ "బ్రహ్మానికి భిన్నంగా దేనిని చూడకుండా ఉండు బ్రహ్మం వ్యక్తమవుతుంది. అగ్ని బ్రహ్మము, నెయ్యి బ్రహ్మము, యజ్ఞము చేయువాడు బ్రహ్మము. నీకు అర్థం అయినది బ్రహ్మము. నీకు అర్థం కానిది బ్రహ్మము. ఇచ్చేవాడు బ్రహ్మము, పుచ్చుకునే వాడు బ్రహ్మము. ఇచ్చేది బ్రహ్మము. ఇవ్వడం అనే క్రియ బ్రహ్మము. బ్రహ్మ కర్మ సమాధి అంటే కర్మలోనే బ్రహ్మాన్ని చూడటం వల్ల సమాధి వస్తుంది" అన్నారు. "మనం ప్రతీదానిని విడివిడిగా చూచి విడిపోవడం వల్ల దుఃఖానికి గురి అవుతున్నాము. మీకు బ్రహ్మానుభవం కావాలంటే బ్రహ్మమునకు భిన్నంగా దేనినీ చూడకూడదు. అలా ఉంటే బ్రహ్మంలో ఐక్యమయ్యే శక్తిని పరమేశ్వరుడు మీకు ప్రసాదిస్తాడు" అన్నారు. అనేకత్వాన్ని చూడటం మానేయండి.





జపంతోనూ, ధ్యానంతోనూ సంబంధం లేకుండా మీ మనస్సు కాలి బూడిద అవుతుంది. ఉన్న వస్తువు ఉన్నట్లుగా మీకు వ్యక్తమవుతుంది. నానాతత్త్వం చూసేకొలది మనస్సు పెరిగిపోతుంది. కొందరిని సుఖపెట్టాలని, తప్ప నడక లోంచి తప్పించాలని చూసినా మన మాట వాళ్ళు వినరు. వాళ్ళ బుద్ధి వాళ్ళను సుఖపెట్టనివ్వదు. నేను అనే తలంపే పెద్ద తప్ప. నేను అనగానే నీకు దేహం స్ఫురిస్తుంది. అది తప్ప అనే సంగతి తెలియకపోతే అనేక తప్పలు నీవు చేసేస్తావు. "మృత్యువును చూచేవాడికి చివరకు మృత్యువే గతి. ఆ వ్యవహారం బాగానే సాఫల్యం పొందాను, ఈ వ్యవహారంలో ఇలా విఫలమయ్యాను" అంటారు. అంతా ఈశ్వర సంకల్పం వల్లనే జరుగుతున్నది అని అనుకోలేకపోతున్నాము. కారణం అహంకారం వల్ల. దానితో కటిక చీకటిలో మగ్గుతూ ఉంటావు. నీవు ఇతరులతో పోల్చుకుంటే బంధంలోంచి బయట పడలేవు. అలవాటు జిడ్డులాంటిది. అది నిన్ను విడిచిపెట్టదు. మనలను చూచేవాడు ఎవడూ లేడు అనడం ఈశ్వరుని అవమానం చేయడమే. నిజమైన శ్రేయోభిలాషి మనలోనే ఉన్నాడు. శరీరం ఉన్నా లేకపోయినా ఆయన ఉన్నాడు, అన్నీ మాకే తెలుసు అనుకుంటే భగవద్గీత చదవడం ఎందుకు? మన బుద్ధికి, ఇంద్రియాలకు అందని విషయాలు ఎన్నో అందులో ఉన్నాయి.

31. వ్యక్తిగతమైన లాభాలు, నష్టాలు, పాపాలు, పుణ్యాలు అన్నీ జీవునికి సంబంధించినవే. భగవంతునికి ఏ సంబంధమూ లేదు. ధాన్యంగా ఉన్నప్పడూ లోపల ఉన్నది బియ్యమే. ధాన్యం అనుకొన్నప్పడు కూడా అవి బియ్యమే. అలాగే జీవుడు జీవుడుగా ఉన్నప్పడు కూడా బ్రహ్మమే. జీవుణ్ణి తీసేస్తే నీవు బ్రహ్మమే. దేహం భోగ వస్తువు కాదు. సాధనా వస్తువు, సాధనకు ఉపయోగపడేది. దానిని ధారణ చెయ్యాలి. అలా చెయ్యగా చెయ్యగా అది గుండెకు పట్టుకుంటుంది. అప్పడు కానీ అది విడిచిపెట్టదు. జ్ఞానాన్ని పెంచుకుంటే సుఖం వస్తుంది, అజ్ఞానాన్ని పెంచుకుంటే దుఃఖం వస్తుంది. అజ్ఞానం బంధ రూపంలో ఉంది కాబట్టి మన మనస్సు బాహ్యాముఖం అయ్యే

కారణం ఉండకూడదు. ఒకవేళ మీ మనస్సు బాహ్యముఖం అయితే దానికి కారణం తెలుసుకుని జాగ్రత్తగా తొలగించుకోవాలి. దేవుడు మాకు అన్యాయం చేసాడు అనుకోకండి. మీకు ఆ దుఃఖం ఎక్కడికి మేల్కొలుపుతుందో ఏ సత్ఫలితాన్ని మీకు కలుగజేస్తుందో మీకు తెలియదు. వాసన మంచిదని భావించి తెచ్చుకున్నాము. అది నష్టమని తెలిసిన తరువాత తొలగించుకోవడానికి ప్రయత్నం చేస్తాము. మనస్సు ఉన్నంతకాలం ప్రయత్నం మానకూడదు. నిద్ర రాకుండా మంచంమీద పడిపోకు. అలా చేస్తే చెడు తలంపులు వచ్చేస్తాయి. నామజపం చేస్తూ కూర్చుని నిద్ర వచ్చినప్పుడు మంచంమీద వాలాలి. బలహీనతలు వాసనలు మనస్సును బాధపెడతాయి. గమ్యం లేని జీవితం మాయ జీవితం. మీ స్వభావాన్ని మార్చుకోవడానికి కొంతకాలం పడుతుంది. దానికి వైరాగ్యం కొంత సహకరిస్తుంది. క్రమశిక్షణ లేకుండా ఆత్మజ్ఞానం కలుగదు. బయట గొడవల్లోకి సాధకుడు దృష్టిని సారించకూడదు. నీకు తలంపులు వస్తూ ఉంటే నీకు నీవు దూరం అవుతావు. కుటుంబ సంబంధాలు, విరోధులు, స్నేహితులు అన్నీ తలంపులే. కానీ భగవంతునితో సంబంధం తలంపు కాదు. మనకు ప్రకృతితో అనుబంధం కలిగితే చెడు అంతా వచ్చేస్తుంది.

32. మీ శరీరం ఇక్కడ ఉండవచ్చును. మనస్సు ఎక్కడో ఉంటే అది దేనితోనో అనుబంధం ఉందని లెక్క. దేనితోనూ అనుబంధం లేని ఒరవడి సాధనకు ఉపయోగం. మంత్రనామజపం అసత్యం నుంచి నిన్ను దూరం చేస్తుంది. మనం ప్రకృతి మాటలతో కూడిన వారితో కలువకూడదు. వారి మాటలు వినకూడదు, వారిని చూడకూడదు. వారి విషయంలో నోరు మూసుకుని ఉండి. అవసరం అయినప్పుడే మాట్లాడాలి, గమ్యాన్ని మరచిపోకూడదు. బయటి దుఃఖాలను బయటే వదిలేయండి. వాటిని లోపలకు తీసుకొని దుఃఖపడకండి. పరాయిబుద్ధి ప్రమాదాన్ని తీసుకొస్తుంది. సొంతబుద్ధి సుఖాన్ని తీసుకొస్తుంది. పూర్వజన్మ పుణ్య సంస్కారాలు లేకపోతే మంచి స్నేహితులు కూడా దొరకరు. ఉద్రేకం వల్ల వాసనలు పెరిగి జన్మలు





పెరుగుతాయి. మనలను ఎంతో ప్రేమించిన వారు మనలను చిన్నమాట అంటే భరించలేము. మనస్సు యొక్క చేష్టలవల్ల శరణాగతి రాదు. దుఃఖం కూడా మంటే. ఆడంబరాన్ని బట్టే అహంకారం వస్తుంది. ఆడంబరమైన దుస్తులు ధరించకండి. ఆడంబరమైన మాటలు మాట్లాడకండి. మంచి వాళ్ళు ఎవరూ తెరమీదకు రారు. తెలివితక్కువ వారే పేపర్లో ఫొటోల కోసం ఆత్రుత పడతారు. అప్పుడే జీవుణ్ణి మాయ కమ్మేస్తుంది. శీలానికి, ఆత్మవిద్యకు గౌరవం ఇవ్వండి. అంతేకానీ గుడికి వెళ్ళి మీ గోత్రం, నక్షత్రం పేరు గొడవలు ఏమిటి? అలాగే సమాజంలో కులాల గొడవలు. సమస్య వస్తే ఎలా సమన్వయం చేసుకోవాలి అనే గొడవ లేదు. బుద్ధికి పదును పెట్టుకునే పని లేదు. జ్ఞానం పట్ల తపన, ముముక్షత్వం కావాలి. మీకు ఏదైనా కనిపిస్తే దానివల్ల సంతోషం వస్తే అది ఒక ఉద్రేకం. అలాగే దుఃఖం వస్తూ ఉంటే అది కూడా ఉద్రేకం. ఇది అంతా మనస్సు యొక్క గారడి. దుఃఖం అంతా కర్తృత్వం వల్లనే వస్తుంది. నీ విపరీత ధోరణి వల్లే వస్తుంది.

33. చెడ్డ మంచిగాను, మంచి చెడుగాను మారవచ్చును. అది నీకు తెలియక విపరీత ధోరణిలో ఉంటావు. నీకు సంపద ఇస్తే నీ మనస్సు పాడైపోవచ్చును. నీకు దుఃఖం వల్లనే నీ మనస్సు పాడైపోవచ్చును. నీకు దుఃఖం వల్లనే నీ మనస్సు బాగుపడవచ్చు. దైవ నిర్ణయానికి శిరసావహిస్తే, విపరీత ధోరణి రాదు. ఇతరులతో వ్యవహారాలు పెట్టుకోకూడదు, ప్రతీ చిన్న సంఘటనకి రియాక్టు అవ్వకూడదు. ప్రకృతి గుణాలను విడిచిపెడితే గానీ సత్యానుభవం కలుగదు. ఇది మంచిది కాదు అనుకున్నది కూడా భగవంతుని అనుగ్రహమే. అంతా భగవంతుని అనుగ్రహమే. మనస్సును గంట గంటకూ పుండు చేసుకోకండి. 'నేను' అనగానే మీకు శరీరం గుర్తుకు వస్తున్నది. 'నాది' అనగానే మనస్సు, శరీరము గుర్తుకువస్తున్నాయి. నిజంగా రెండూ అన్నప్పుడు కూడా భగవంతుడే ఆధారంగా ఉన్నాడు. బయట ఎక్కడా మాయలేదు. నేను-నాదిలోనే ఉంది. నీకు దేహం మీద అభిమానం తగ్గితే కాని దైవం మీద భక్తి రాదు. ప్రేమిస్తే చైతన్యాన్ని ప్రేమించాలి. చైతన్యంలోనే

ప్రేమ ఉంది. అహంకారం ఏమి ప్రేమిస్తుంది. ప్రపంచమూలం అంతా నీ శరీరంలోనే ఉంది. శరీరం అంతా మనస్సులో ఉంది. నీ మనస్సు అంతా ఆత్మలోనే వెలుగుతుంది. శత్రువునైనా ప్రేమించండి కానీ బద్ధకాన్ని సోమరితనాన్ని ప్రేమించకండి. వ్యవహారికంగా చావు పుట్టుకలు నిజమే. నిజానికి చావు పుట్టుకలు మనస్సు కల్పించినవే. అందులో మరి ఏమీ లేదు. నేను నాది విడిచిపెట్టలేకపోతే దానికి ఉపాయం నాది అనుకొన్నప్పడూ భగవంతునిదే. నీది అనుకొన్నప్పడూ భగవంతునిదే అనుకో అలా చేసినప్పడు దేహాభిమానం తగ్గిపోతుంది. విషయాలను స్మరిస్తూ విషయాలను జయించలేము. దానికి బదులు భగవంతుణ్ణి స్మరించాలి. విషయాలను పట్టించుకోకుండా ఉంటే అవే పోతాయి. పుండు అంతా దేహాభిమానంలోనే ఉంది. సృష్టి రహస్యం అంతా ఇందులోనే ఉంది. రాముడు లంకలోకి ప్రవేశించినా అక్కడ ఉన్న రాక్షసులను చంపితేకానీ సీత ఆయనకు దక్కలేదు. అలాగే నీ మనస్సులోనే ఉన్న రాగద్వేషాలను, కామక్రోధాలను అన్నింటిని చంపకపోతే మీ హృదయంలో ఉన్న ఆత్మ మీ చేతికి అందదు. మీ దేహ లక్షణాలను, మీ మనస్సు లక్షణాలను తీసుకొని లోపల ఉన్న ఆత్మకు ఎంతకాలం అంటగడతావో అంతకాలం మీకు ఎంత డబ్బు ఉన్నా, చదువు ఉన్నా, కీర్తి ఉన్నా ప్రయోజనం లేదు. దేశం అంతా తిరిగి బ్రహ్మజ్ఞానాన్ని బోధించాలి అంటే వివాహం ఆటంకమే. కొందరు ఎర్రబట్టలు కట్టుకొని సన్యాసిని అంటారు. ఒకరు సద్గురువు అంటారు. సత్యం ఒకటి ఉందనే విషయం ఆ అనుభవం వారికి రాదు. వారి మాయలో సాధకుడు పడకూడదు. మనిషిని అద్వైత కర్మ బంధించదు, ద్వైత కర్మ బంధిస్తుంది. నీ శరీరానికి చేసుకున్న ఉపకారమే ఇతరులకు చేస్తే నాకే చేసుకున్నాను అనుకోవు. అదే మాయ. ఇతరులు అనేసరికి వేరుబుద్ధి వచ్చేస్తుంది. అమావాస్య రోజున చంద్రుడు లేడని కాదు. అలాగే నీ హృదయంలో జ్ఞాన సూర్యుడు ఉన్నాడు. నీ అజ్ఞానమనే మేఘం మూయడం వల్ల కనబడడం లేదు. అలాగే జ్ఞాన సూర్యుడు లేడు అని కాదు ఇంద్రియాలతో





భోగాలు అనుభవిద్దాము అనే తాపత్రయం వల్లనే జీవుడు హృదయాభిముఖంగా వెళ్ళలేకపోతున్నాడు. అది ఏ ఒక్క ఇంద్రియ భోగం వల్లనైనా చాలు. పదికోట్లు సంపాదించడం కన్నా ఒక చిన్న వాసన నుంచి బయటపడటం కష్టం.

35. మనలను పిల్లలు చూస్తారని ఆశ పెట్టుకోకండి. ఈ విషయం బయటకు చెప్పకండి. ప్రారబ్ధం రీత్యా చూస్తే సరే. చూడకపోతే బాధలేదు. ఏదో ఒక వాసన ద్వారా మనస్సు బయటకు వచ్చేస్తుంది. మైండ్‌కి పుట్టిల్లు హృదయం. పూర్వ జన్మల నుంచి వచ్చిన వాసనలు మైండ్‌ని హృదయం లోంచి బ్రెయిన్‌లోకి తీసుకువచ్చేస్తాయి. దాని క్రియలకు సాక్షీభూతంగా ఉండటమే సాధన. మనస్సు బెంగపెట్టుకుంటుంది. అది నీవు కాదు. అది నీవు అనుకోవడం వల్ల సంతోషాల, దుఃఖాల ప్రభావం నీ మీద పడిపోతుంది. నీవు బెంగపెట్టుకున్నవి అన్నీ నీవు కల్పించుకున్న గొడవలే. "లోపల దుష్టబుద్ధి పెట్టుకొని పైకి మంచి వాడిలా నటిస్తే నిన్ను నీవు మోసం చేసుకొంటున్నావు" అని తిట్టేవారు రామకృష్ణులు. మీ జీవితంలో జరిగే సంఘటనలు, ప్రపంచంలో జరిగే సంఘటనలు నిజం కాకపోయినా నిజం అనుకొంటున్నావు. కాబట్టి వాటి ప్రభావం నీ మీద పడిపోతున్నది. అలా అనుకోవడానికి కారణం దేహబుద్ధి. నీ హృదయంలో ఉన్న నిజంలో నుండే శాంతి వస్తున్నది. కానీ నీవు కల్పించుకున్న గొడవల్లోంచి శాంతిరాదు. ఈ అరాచకానికి అశాంతికి కారణం దేహబుద్ధే. ఎందుకు బెంగపెట్టుకున్నాము అంటే తెలియనితనం వల్ల బెంగ అసత్యంలోంచి వస్తుంది, సుఖం సత్యంలోంచి వస్తుంది. సత్య సాక్షాత్కారం అయ్యే వరకు బెంగలు పోగొట్టుకోలేము. నీవు మంచి చేసినా ఎవరూ చెప్పకోవడం లేదని మాయలోపడి మంచిని వదిలేస్తావు. అదే మాయ. ఈ దొంగ నేనే చెపుతుంది. "నీ మంచి పని ఈ పిట్టగోడ కూడా దాటదు. ఆ పని వదిలేయమని చెపుతుంది. ఈ దొంగ నేను ఈశ్వర సంకల్పం మీద పూర్తిగా డిపెండ్ అవ్వడం నేర్చుకుంటే అది పలుచబడుతుంది. గీతలో "మీ సాధనతో అది పోదు దానిని నా పాదాల దగ్గర వదిలేయండి.

నేను బాగుచేసిపెడతాను" అన్నారు పరమాత్మ. మనస్సు బయట ఆధారాలు వదలగొట్టుకుంటే దానంతట అదే లోపలకి ఉపసంహరించుకొంటుంది. అది సముద్రంలో వేసిన ఉప్ప బొమ్మలా కరిగిపోతుంది. అప్పడు హద్దులు లేని సుఖము, శాంతి, ఆనందము హృదయంలోనుండి సహస్రారాన్ని ఆక్రమించుకొంటుంది. అసూయ మొదట కుటుంబంలోనే ప్రారంభ మవుతుంది. అసూయ దొంగ నేనుకే వస్తుంది. అది పోయేవరకు ప్రయత్నం చెయ్యాలి. పనిలో కూడా కొంత ట్రైనింగ్ అవుతావు. నీ తప్పడు ఆలోచనలు పోతే నీకు సైలెన్స్ వచ్చేస్తుంది. తూకం పెరగాలి అంటే ద్వంద్వాలను తట్టుకోవాలి. స్వచ్ఛత లేకుండా ఆనందం రాదు. నీవు ఏ యోగంలో ప్రయాణం చేసినా ప్రాథమికంగా ముందు నేను దేహమాత్రుడను అనే భావన పోవాలి. ఈశ్వర సంకల్పాన్ని గౌరవించడం నేర్చుకుంటే నీలో తూకం పెరుగుతుంది. ఈశ్వరునిపట్ల గౌరవం వస్తుంది. ఇది శరణాగతి. ఈమార్గం తియ్యగా ఉంటుంది. మిమ్మల్ని ఎవరైనా అవమానిస్తే అది మీరు నిజమని మింగినప్పడు రియాక్షన్ వస్తుంది. ఆ విమర్శను తీసుకోకపోతే నీ దేహాభిమానం పిండి పిండి అవుతుంది.

36. సముద్రంలోని కెరటాలు ఎలా పైకి వస్తూ ఉంటాయో అలాగే నీవు ఉదయం లేచినది మొదలు మరల నీవు పడుకునే వరకు ఏవో ఒక తలంపు వస్తూనే ఉంటుంది, వెళ్ళిపోతూనే ఉంటుంది. నీలో వాసనల యొక్క వేగం జన్మాంతరాలలోంచి వస్తూనే ఉంటాయి. వివేక వైరాగ్యాల వల్ల దానిని అరికట్టాలి. ఇతరుల గొడవల్లోకి వెళితే మనస్సు పెరిగిపోతుంది. భయంవల్ల తలంపులు పెరిగిపోతాయి. మమకారం మిమ్మల్ని బాధపెట్టినట్లు మీ శత్రువు కూడా మిమ్ములను బాధపెట్టరు. మమకారం అతివేగంగా మనలను దుఃఖ పెడుతుంది. నీవు సంతోషించేది, దుఃఖించేది ఏమీ లేదు. అన్నీ నీవు కల్పించుకోవడం వల్లనే. ధనము అధికారము గర్వాన్ని తెచ్చిపెడుతుంది. గమ్యాన్ని మరచిపోకూడదు. బేధబుద్ధి ఉన్నంతకాలం మంచికి మంచి, చెడుకు చెడు వందల జన్మల తరువాత అయినా మిమ్మల్ని చుట్టుకుంటుంది.





మంచి కర్మ చెడు కర్మను తొలగించదు. తొంభై తొమ్మిది పైసలు మంచి చేసినా ఒక్క పైసా చెడు చేసినా లేదా తొంభై తొమ్మిది పైసలు చెడు చేసి ఒక్క పైసా మంచి చేసినా దేనికి అదే అనుభవించాలి. రైలుపట్టాలు ఒక దానికి ఒకటి కలువవు. ఇదీ అంతే. గడియారానికి "కీ" ఇచ్చి ఆగమంటే ఎలా ఆగుతుంది. అలాగే దేహం నేను అనే తలంపు మనస్సుకు "కీ" ఇస్తూ ఉంటే మనస్సు ఎలా ఆగుతుంది. సాధనకు వ్యతిరేక ఆలోచనలు వస్తూ ఉంటే సాధన సాగదు. అనుకూల తలంపులతోనే సాధన సాగుతుంది. మీకు వచ్చే చెడు తలంపులు గతంలో మీరు మంచివి అనుకొని చేసినవే. అలవాటు ప్రకారం వచ్చేస్తాయి. వాటిని ఆదరించకపోతే అవే పోతాయి. కనీసపు సౌకర్యాలు ఉండవచ్చును. విలాస సౌకర్యాలు పనికిరావు. ప్రదర్శన కోసం ఏదీ మంచిది కాదు. మన కోరికలు నెరవేరడానికి భగవంతుణ్ణి ఉపమానంగా పెట్టుకుంటున్నాము. గమ్యంగా పెట్టుకోవడం లేదు. అదే మాయ. చలంగారు అనేవారు "లోక బాధ మీరు ఎలాగూ తీర్చలేరు, మీరు లోకానికి బాధ కలిగించకండి. అలా చేస్తే లోకంబాధ మరింత పెరిగిపోతుంది" అని. తలంపులు లేనివాడు భయం లేకుండా ఉండగలడు. జీవితంలో కష్టం ఒక భాగం. దేహాభిమానం పోతే కష్టం ఏమీ చెయ్యదు. నేను-నాది లోనే పెద్దమాయ అంతా ఉంది. తిట్టేవాళ్ళ వెనుక ఉన్న నారాయణుడిని గమనించండి. అశాంతి మాయమౌతుంది. రంధ్రాన్వేషణ వలన వాళ్ళ దోషాలు మనకు అంటుకుంటాయి. గొప్పలవల్ల దేహాభిమానం పెరిగిపోతుంది. దేహాభిమానం ఉన్నంతవరకే కర్మసిద్ధాంతం. "గౌరవం కన్నా పంది పెంట మెరుగు" అన్నారు శ్రీకృష్ణచైతన్య. అవి అన్నీ మాయలో భాగాలు. జ్ఞానం రావడానికి అవి అన్నీ ఆటంకాలు. పైసా కలసిరాదు.

37. బ్రహ్మం ఒక్కటి అంటే ఒక్కటే అంటున్నారు. మరి మాయ ఎక్కడ నుండి వస్తున్నది? అని ప్రశ్న వేస్తే మాయ బ్రహ్మంలో కల్పితమై ఉంటుంది. లీల కూడా బ్రహ్మంలోనే జరుగుతుంది. తలంపు, మాట, చేత ఈ మూడు భగవంతునికి ఇవ్వమంటే ఆ మూడు ధర్మమార్గంలో, సక్రమంగా

లేకపోతే అవి మనలను చుట్టుకొని కర్మసముద్రంలో పడవేస్తాయి. పరమాత్మ అనుభవం అయితే ఆ మూడింటితోనూ పనిలేదు. అంతా ఈశ్వరానుగ్రహంగా నడుస్తాయి. రామకృష్ణ పరమహంసగారితో ఒకరు తన ప్రక్కన ఉన్న వానిని ఉద్దేశిస్తూ "వీరికి దేవుని మీద నమ్మకం లేదు" అనగా "వాడికి మొట్టకాయలు పడ్డాక కాలం దాన్ని నిర్ణయిస్తుంది. వారి తరఫున నీకెందుకు ఆ బలవంతం అన్నారు. ఏ ప్రారబ్ధం అయితే దశరథుణ్ణి రాజు చేసిందో రాముడిని కుమారునిగా తీసుకొని వచ్చిందో ఆ ప్రారబ్ధమే కుమారుని వియోగంతో మరణించేలా చేసింది. దశరథుడు ఇలా మరణించడం ఏమిటి? అనుకోకండి. అది లీల యొక్క విలాసము. ఈశ్వరుడు కర్మానుసారం తిప్పుతున్నాడు. కాబట్టి మీర సత్కర్మతో తరించండి. ఈ సృష్టిలో అంతులేని సంపద ఉంది. నీకోటాకు సంబంధించినది మాత్రమే నీకు కల్పించాడు ఈశ్వరుడు. దాన్ని గ్రహించాలి. పోలికలతో పరితాపం చెందకండి. జీవితం సుందరమైనది. దానికి మించిన అందం మరియొక దానికి లేదు. కష్టకాలంలో ఓర్పు కావాలి. కష్టాలు కూడా క్రమ పద్ధతిలో కర్మసిద్ధాంతాన్ని బట్టి వస్తాయి. జీవితాన్ని బలవంతంగా ముగించుకోకూడదు. అద్దంలో చూసుకుంటే మన ప్రతిబింబం కనబడుతుంది. అలాగే మీకు ఆధ్యాత్మిక అనుభవం కలిగితే "నేను ప్రారబ్ధం అనుభవిస్తున్నాను అనే వాడు ఉండడు. ప్రారబ్ధం శరీరం అనుభవిస్తుంది. అది నిన్ను ముట్టుకోదు.

38. అతిగా మాట్లాడేవాడికి మనస్సు చాపల్యం ఎక్కువగా కలుగుతుంది. నేను బ్రహ్మము కన్నా వేరు అనే భావన పాతుకుపోయింది కాబట్టి నీకు దుఃఖం విడిచిపెట్టడంలేదు. ఆ భావన విడిచిపెట్టి నేను బ్రహ్మమునే అనే భావన స్థిరపడితే నీకు బ్రహ్మానుభవం కలుగుతుంది. భోగాలు అనుభవించే కొలది భోగాలు పెరుగుతాయి. ఆ భోగాలే నీ మనస్సులో ముద్రలు పడి నిన్ను మరలా ఆ భోగాన్ని అనుభవించమని ప్రోత్సహిస్తాయి. సాధన చేసినా ఫలితం కనబడటం లేదంటే మన స్వార్థమే దాన్ని బలితీసుకుంటున్నది. వైరాగ్యం ఉంటే పని బాగా జరుగుతుంది.





విస్తరిలో నవకాయ పిండివంటలు ఎదురుగా ఉన్నా దానిని గుర్తించలేక నాకు ఆకలిగా ఉంది అన్నం దొరికితే బాగుండును అని ఏడవడం ఎటువంటిదో భగవంతుడు మంచి పుస్తకాలను, మంచి దేవాలయాలను, మంచి సద్గురువులను ఇచ్చినా నీ దేహాన్ని, నీ బుద్ధిని వినియోగించుకోకుండా నాకు జ్ఞానం రావడం లేదు అని ఏడవడం కూడా అటువంటిదే. నీకున్న గుణ సంపదే నీ సౌందర్యం. నీ హృదయంలో ఉన్న సద్వస్తువుని లేదు, లేదు అనుకోవడం చివరకు చావడం. "నామీద, నా మాటమీద గౌరవం లేకపోవడం దరిద్రం" అన్నాడు కృష్ణుడు. దురదృష్టం వస్తే పాతాళ లోకానికి పడిపోయినట్లు బాధపడకూడదు. ఇది అంతా మాయ అని తెలియక ఈ గొడవల్లో కలిసిపోతున్నాము. ఇది అంతా మిమ్మల్ని దారి తప్పించడానికి ప్రకృతి చేసే చమత్కారము. నేను అట్టివాడను, ఇట్టివాడను అనుకొన్నంత కాలం మీరు కోటి ప్రయత్నాలు చేసినా మీకు ఆత్మజ్ఞానం కలుగదు. లోపల అలవాట్లు ఏమిటో చూసుకోండి. ఎవరినీ అనుకరించవద్దు. ఈశ్వరుడు సాధించి పెట్టింది మేము సాధించాము అంటారు. ఈ విషయం తెలియక సాధించడానికి వాడు అంటూ ఒకడు ఉన్నాడా? లేడు. ఇది అర్థం కావాలి. అర్థం అయితే దుఃఖం అంతా ఆవిరైపోతుంది. గర్వం ఉన్నా అది కూడా పోతుంది. ఈశ్వరునితో సంబంధం లేకుండా నా తెలివితో అన్నీ సాధించగలను అని నీలోపల ఎవడైనా చెబుతూ ఉంటే వాడిని తీసివేయడమే సాధన యొక్క లక్ష్యం. అంతకన్నా సాధన ఏదీ లేదు. సాధకులు దాన్ని మినహాయించి చేస్తున్నారు. మన సాధనలో దాన్ని జోడించి చెయ్యాలి. మనం మన పాత అలవాట్లను వదిలించుకొందమని చూస్తాము. అవి వదలము అంటున్నాయి. వాటిని పట్టుకున్నప్పుడు ఎంత ఇష్టంగా పట్టుకున్నామో అంత ఇష్టంగా ఈశ్వరుని మీద ప్రేమ పెట్టుకుంటే అప్పుడు ఆ పాత వాసనలు పోతాయి. మనం కాని దానిని గుర్తించేబదులు మనం ఏదైతే అవునో దానిని గురించి ఆలోచిస్తే కానిది కానట్లుగా పోతుంది. ఉన్నది ఏదో మనకు తెలుస్తుంది.

39. ఎవడైతే సహజంగా జీవిస్తాడో వాడు భగవదనుగ్రహం అర్థించక

పోయినా వాడి మీద భగవదనుభవం వర్షిస్తుంది. మీరు అంతా బాగున్నారు అనుకోండి అది చూచి నేను సంతోషించకపోతే అది ఆధ్యాత్మిక దారిద్ర్యము. "కొందరికి అన్నీ ఉంటాయి ఆధ్యాత్మిక దారిద్ర్యం ఉంటుంది. ఇంట్లో కృష్ణా, రామా అనడు. చెప్పకుంటే వాడి గొప్పలు, లేకపోతే ఇతరులను నిందించడం. ఇటువంటి వారికి చీకటి లోకాలు కనిపెట్టుకొని ఉంటాయి" అన్నారు అరవిందులు. మనిషికి మంచి గుణాలు ఉండవచ్చు అంతమాత్రం చేత వాడు పవిత్రుడు కాడు. గుణవంతుడు మాత్రమే. నూటికి నూరుపాళ్ళు ఎవడికైతే స్వార్థం లేదో వాడు ఒక్కడు మాత్రమే పవిత్రుడు. కొందరు బాహ్యంగా చూస్తే మర్యాదస్తులుగా కనిపిస్తారు. లోపల శుభ్రంగా కుళ్ళిపోయి ఉంటారు. మీరు సబ్జక్టును అర్థం చేసుకుంటే కూర్చున్నవారు కూర్చున్నట్లు ఆత్మజ్ఞానం కలుగుతుంది. దానికి సూక్ష్మ బుద్ధి అవసరం. ఎన్ని మంచి గుణాలు ఉన్నా స్వార్థపరుడులోంచి భగవంతుని తాలూకా శక్తి వ్యక్తం కాదు. నీవు అసత్యమైన దానితో తాదాత్మ్యం పొందుతున్నంతకాలం సత్యమైన నేను దొరకదు. నేను అక్కడ అది సాధించాను, ఇక్కడ ఇది సాధించాను అలా అనుకోమని భగవంతుడు చెప్పలేదు. నీ బుద్ధి మంచిది కాక అలా అనుకొంటావు. నీ పిచ్చిని బట్టి నీవు అలా అనుకుంటావు. నేను ఉంటే అంతా ఉంది, నేను లేకపోతే ఏదీ లేదు. ఈ "నేను" వాక్యాన్ని ధ్యానం చెయ్యాలి. అప్పుడు నీ మనస్సు సత్యం వద్దకు జారుకుంటుంది. అది ధ్యానం యొక్క ఫలం. అది నీ మనస్సుకు తూకాన్ని పెంచుతుంది. దాని లోపలకి తీసుకొనిపోతుంది. నిద్రలో తెలివి తక్కువ వాడు, తెలివైనవాడు, దనవంతుడు, పేదవాడు, అధికారి, అనధికారి అంతా సమానమే. అప్పుడు మీ తెలివితేటలు ఎక్కడికి పోయాయి. దేవుడు వాటిని నీ హృదయంలో దాచిపెట్టి ఉంచాడు. మెలకువ రాగానే నేను అనే తలంపు శిరస్సులోకి విజృంభించింది. నీ తెలివి తేటలు, నీ పాప పుణ్యాలు అంతా పట్టుకొని పో అని ఈశ్వరుడు ఇచ్చేస్తున్నాడు. జాగ్రదావస్థ వీడు ఆ మాటలను మోసుకొని బజారులో తిరుగుతున్నాడు, ఈ రహస్యం గుర్తిస్తే నిజం తెలుస్తుంది.





మాయను మాయం చెయ్యవచ్చును. నీవు ఆరాధించే దేవుని మీద నీకు నూటికి నూరుపాళ్ళు గౌరవం విశ్వాసం ఉండాలి. అప్పుడే ఫలితం నీకు అందుతుంది. ద్వితీయం వల్ల వచ్చే ఆనందం ఒంటరిగా రాదు. దుఃఖమనే ముళ్ళ కిరీటం పెట్టుకొని వస్తుంది. అది మీకు కనబడదు.

40. మా తాతగారి టైంలో సిమెంటు రోడ్డు లేదు, మట్టి రోడ్డు. నేను మట్టిరోడ్డు మీదే తిరుగుతాను అంటే అర్థం ఏమిటి? నవీన టెక్నిక్స్ అర్థం చేసుకోండి. మీరు ఏమి చేస్తున్నా దేహాన్ని మనస్సును చూస్తున్నారు. దేహాన్ని చూస్తే రంగు కనిపిస్తుంది. మనస్సును చూస్తే గుణాలు కనబడతాయి. దేహం నశిస్తే రంగు లేదు, గుణాలు నశిస్తే గుణాలు లేవు. ఈ రెండూ అబద్ధమే, మాయే. మీరు ఇది అంతా వదిలేసి లోపల ఉన్న సద్వస్తువును చూడండి. మీకు వికారాలు రావు. అలా చేస్తే జప, ధ్యానాలు, తపస్సులు లేకుండా మనస్సు దానంతట అది నశిస్తుంది. మీరు ఈ పనిని రవ్వంత అయినా చేసి చూడండి. నోటి నుండి వచ్చే పరుష వాక్యాలు అవి ఎవరైతే అన్నారో వారి పీక పట్టుకొంటుంది. అందరికీ శాంతి, సుఖం కలగాలని హృదయ పూర్వకంగా నిండు మనస్సుతో ప్రార్థన చేస్తే అది మానసిక తపస్సు. ఈ రెండూ లేకుండా జీవుడు పవిత్రుడు కాడు. నానాతత్త్వం చూచేకొలది మనస్సు పెరిగిపోతుంది. అన్నింటిలోనూ ఏకత్వాన్ని చూస్తే మనస్సు దానంతట అది అణిగిపోతుంది. పని మానేస్తే నీవు యోగివి కావు, బూడిద అవుతావు. గాఢనిద్రలో మనకు భయం లేదు. లోకం కనిపించడం లేదు. అయినప్పటికీ మనకంటే వాళ్ళు వేరు అనే ద్వైత భావన వచ్చేటప్పటికి భయం కలుగుతుంది. దేహాన్ని, లోకాన్ని చూచేటప్పటికి భయం కలుగుతుంది. దేహాలను లోకాలను చూచేవాడు ఎప్పుడూ భయంలోంచి విడుదల పొందలేడు. ఈశ్వర ప్రీత్యర్థం నీవు పని చేస్తూ దేవుని వాక్యాలు మాట్లాడడానికే నీ నోరు ఉపయోగిస్తూ ఉంటే ఈశ్వరుని దేవాలయం చుట్టూ నీ కాళ్ళు తిప్పతూ ఉంటే వీటి వలన నీకు చిత్తశుద్ధి కలుగుతూ ఉంటుంది. బాహ్యంగా ఏమీలేదు అని నీకు తెలుస్తూ ఉంటుంది. కళ్ళు,

చెవులు, నోరు వీటిని దుర్వినియోగం చేస్తూ ఉండటం వల్లనే పాడైపోతున్నావు. "పాడు దృశ్యాలను చూడటం, పాడు మాటలు వినడం, పాడు మాటలను మాట్లాడటం వల్లనే పాడైపోతున్నారు అని తెలుసుకోవాలి" అన్నారు గాంధీజీ. అందుకే ఆయన మూడు కోతుల బొమ్మలను టేబుల్ మీద పెట్టుకోమన్నారు. మన నోటితో తినే ఆహారం శుభ్రంగా ఉందో లేదో చూసుకుంటాము. చెవులతో వినే విషయాలలోను, కళ్లతో చూచే దృశ్యాల విషయంలో జాగ్రత్త పడము. చివరి రెండు విషయాలలోను ఎక్కువ జాగ్రత్త కావాలని వేదంలో ప్రార్థించాడు. 105 డిగ్రీల జ్వరంలో ఉన్నప్పుడు వాడి నోట్లో పాయసం పోసినా చేదుగానే ఉంటుంది. అలాగే మనకు అజ్ఞానమనే జ్వరంతోను, మమకారమనే జ్వరంతోను కాలిపోయినప్పడు భగవంతుని యొక్క మాటల విలువ తెలియదు. చిత్తశుద్ధి లేకపోతే ఈశ్వరునిపై ప్రేమ కలుగదు. జిజ్ఞాసే కలుగదు.

41. మిమ్మల్ని చూచి ఎవరైనా అసూయ పడుతున్నారు అనుకోండి వారి గొడవలలో వారిని ఉండనివ్వండి. దానిలో మీరు కలుగజేసుకోకండి. వారి పట్ల మీరు ఎలా ఉన్నారో చూసుకోండి. ఎదుటివారు చెడ్డవారు అనుకుంటే నెమ్మదిగా మీరు చెడ్డవారు అయిపోతారు. మనం ఎవరిని చూచినా వారి అంతరాత్మను చూడాలి. మిగిలిన చూపులన్నీ దొంగ చూపులు. ఇతరులు మనపట్ల ఉన్న రాగద్వేషముల మీద మన జీవితాలు ఆధారపడిలేవు. ఈ సృష్టిలో ప్రతీదీ ఈశ్వర సంకల్పం ప్రకారమే జరుగుతుంది. అట్టి ఈశ్వరుని పాదాలు ఆరాధించకుండా ఆయన దగ్గరకు మనం వెళ్లలేము. అది అలా జరుగుతుందేమో, ఇది ఇలా జరుగుతుందేమో అని ఏదో ఊహించుకుంటూ ఉంటే ఆ జరిగేది మీరు ఎలాగు ఆపలేరు. మీరు ఊహించుకోవడం మానేస్తే సాధనతో సంబంధం లేకుండా భయం తగ్గిపోతుంది. మన ఇంటి దగ్గర తపస్సు చేసుకుంటే బాగానే ఉంటుంది. అరుణాచలంలోనే బాగా తపస్సు జరుగుతుంది అని నీవు అనుకుంటే ఆ తలంపే శనిగాడు. మనలను బాగుపడకుండా శనిగాడు పట్టుకొన్నాడని అర్థం. ఎటాచ్‌మెంట్ లేనివాడితో ఎటాచ్‌మెంట్ పెట్టుకుంటే మనకు ఉన్న





ఎటాచ్‌మెంట్లే పోతాయి. అంతేకానీ మమకారం ఉన్నవానితో మమకారం పెట్టుకుంటే ఒక గుడ్డివాడు ఇంకొక గుడ్డివాడిని పట్టుకున్నట్లే. ఇద్దరూ పతనమవుతారు. ఎటాచ్‌మెంట్ పెద్ద పాపం. మమకారాన్ని విడిచి పెట్టడమే సన్యాసం. రోడ్డు మీద అనేకమంది వెళుతూ ఉంటారు. వారిని చూచి మనకు రాగద్వేషాలు కలగవు. అలాగే ఇంట్లో మనుషుల మీద కూడా రాగద్వేషాలు పెట్టుకోకూడదు. డ్యూటీ అనుకొని పని చెయ్యాలి. తటస్థంగా ఉండాలి. మన ఇంట్లో వారిని తల్లి అని, తండ్రి అని, మావయ్య అని, భర్త అని ఇలా మన శరీర సంబంధాన్నిబట్టి చెపుతాము. అంటే మన శరీరాన్ని కేంద్రంగా పెట్టుకొని దానితో వారికి ఉన్న అనుబంధాన్ని బట్టి చెబుతాము. కానీ బ్రహ్మం అలా కాదు. దానికి ఇంకొక వస్తువుతోగానీ పంచభూతాలతో కానీ సంబంధం లేదు. అది ఒక్కటి అంటే ఒక్కటే. మీరు శరీరం అనుకొన్నారు కాబట్టి వరుసలతో పోల్చి బాంధవ్యాలు చెబుతున్నారు. బ్రహ్మం స్వతంత్రమైనది. దానికి జీవలక్షణాలు అంటవు. మనం వేరు బుద్ధిని, స్వార్థ బుద్ధిని విడిచిపెట్టము. చెడు తలంపులను విడిచిపెట్టము. మనకు ఆత్మజ్ఞానం కావాలి అనుకోవడం వల్ల అది సాధ్యం కాదు.

42. నిన్ను నీవు తెలుసుకో అంటే అర్థం నీవు కాని దానిని నీవు అనుకుంటున్నావు. అది నిజం కాదు. ఉన్న వస్తువు ఒక్కటే. దానిని తెలుసుకోమని అర్థం. నీ దుఃఖ కారణం కుటుంబ సభ్యులు కాదు, స్వార్థం వల్ల, అహంకారం వల్ల దుఃఖం వస్తుంది. అది మూల తలంపైన శరీరం 'నేను' అనే తలంపు వల్లనే వస్తున్నది. దానిని ఆపగలిగితే దుఃఖం నశిస్తుంది. నీవు ఉంటే స్వర్గం, నరకం, లాభం, నష్టం ఉంది. అంతా ఆ "నేను" వల్లనే వస్తున్నది అని గ్రహించాలి. ఆ 'నేను' దేహంగా నీకు తెలుసు, తెలివిగా నీకు తెలుసు, ఆర్థిక పరిస్థితిని బట్టి నీ అంచనా నీకు తెలుసు, నీకు ఉన్న గౌరవం నీకు తెలుసు, నీకు ఉన్న సామాజిక స్పృహ నీకు తెలుసు. అవన్నీ నీవు కాదని జరిగేది ఈశ్వర సంకల్పంగా జరుగుతున్నదని గ్రహించి ఊరక ఉండాలి. గురువు నిన్ను తలుపు సందులో పెట్టి ఎందుకు నొక్కుతాడు

అంటే నీవు కాని దానిని నీవని ఎందుకు అనుకొంటున్నావు? ఆ అలవాటు నుంచి నిన్ను బయటకు తీసుకురావడానికి, ఒకోసారి ఆ తలంపులను కక్కించడానికే. అజ్ఞానం అనేక రకాలుగా ఉంటుంది. దానిని తొలగించు కోవాలనే బుద్ధి నీకు కలగడం లేదు. ఒకటిగా ఉన్నది నేనే అనే గుర్తింపు రావడానికే మహాత్ముల దర్శనం చేసుకోవాలి. నీ నడవడిక వ్యక్తిభావన లేకుండా తెలివిగా ఉండాలి. నేను అనే అహంకారం కలుగజేసుకోకుండా సహజంగా మాట్లాడాలి. 'నేను' ఎవరికీ జీవితంలో భయపడలేదు అంటారు. అవి మోసకారి మాటలు. బ్రహ్మానుభవంలో మాత్రమే భయం లేదు. అనుబంధాల వల్లనే నాన్‌సెన్స్ అంతా వస్తుంది. ప్రపంచంతో సన్నిహితం వల్లనే పాపం వస్తుంది. దానితో నీవు బంధింపబడతావు. ఆ బంధం వల్లనే చావు వస్తుంది. భగవంతుణ్ణి విడిచిపెట్టి 'నేను' ఉన్నాను అని విజృంభించే ఆ 'నేను'ను శిలువ వేయకుండా హృదయంలో ఉన్న భగవంతుడు వ్యక్తం కాడు. మనం పని చేసేటప్పుడు మంచిగా ఉండటం ఒక్కటేకాదు, నీ సంకల్పం మంచిగా ఉంటే అది మన రాబోయే జన్మను నిర్ణయిస్తుంది. సంకల్పంలోను, తలంపులోను జాగ్రత్త కావాలి. మీరు సంపాదించుకున్న గౌరవం, ధనం, అధికారం, పాండిత్యం అన్నీ కూడా బయటే ఉన్నాయి. మనం లోపల ఉన్నాము. అదే శాంతి ఆనందం. అది నీ హృదయంలో ఉంది. బయట ఉన్నవి నిలబడవు. అందులోనుండి శాంతిరాదు. మీరు చేసే పని ద్వారా భగవంతుణ్ణి ఆరాధిస్తూ ఉంటే మీ పని పూర్తి అవుతుంది. మీ కుటుంబమూ బాగుపడుతుంది, దేశం బాగుపడుతుంది. బయట వ్యక్తులతోను, వస్తువులతోను మానసిక అనుబంధం పెట్టుకుంటే రాబోయే జన్మలు పెరుగుతాయి. జీవుని ప్రయాణం పెరుగుతుంది. నీవు స్వతంత్రుడవు, పవిత్రుడవు అవ్వాలంటే స్వాతిసయం ఉండకూడదు.

43. యాతనా శరీరం (మనస్సు) ఎంతకాలమైతే ఉంటుందో అంత కాలం ప్రతీ జన్మలోను నీకు యాతనలు తప్పవు. ఖరీదైన బట్టలు వేసుకొని కార్లలో తిరుగుతూ ఉంటే వారి పని బాగుంది మనం కూడా అలా ఉంటే





బాగుండును అనుకొంటాము. వారు నిజంగా సుఖపడటంలేదు. వారు ఎంత దుఃఖంలో ఉన్నారో తెలియక బాహ్య విషయాలను చూచి బాగున్నారు అని మనం అనుకొంటాము. శరీరానికి రోగం వస్తే రోజూ బాధపడుతూ కూర్చోకండి. రోగాన్ని తొలగించుకుంటే చాలు. అలాగే మనస్సులో ఉన్న దోషాలు తొలగించుకోవాలి. ప్రకృతి అనుబంధాల వల్లనే రోగాలు వస్తాయి. సంతోషం ఎలా ఉన్నా పరవాలేదు. అది వెళ్ళి దుఃఖాలను తీసుకొస్తుంది. మీరు గతాన్ని మరచిపోండి. జరగబోయే విషయాలు గొడవలు ఊహించు కోవద్దు. వర్తమానాన్ని సవినయంగా ఉపయోగించుకోండి. మనం కట్టెలతో పొయ్యి వెలిగిస్తే పొగ ఎక్కువగా ఉంటే గోడలు మసి అవ్వవచ్చును. కానీ భూమి మీద ఉన్న పొగ అంతా ఆకాశాన్ని మసి చెయ్యలేదు. నీ దేహంతో చేసే పనులు, మనస్సులో వచ్చే ఆలోచనలవల్ల నీలో ఉన్న అంతరాత్మ మసి అవ్వడు. ఎందుకు గతాన్ని తవ్వుకొంటావు. భవిష్యత్తును గురించి గాలి మేడలు కట్టుకొంటావు. నీవు మంచివాడివి అయినా, చెడ్డవాడివి అయినా లోపల ఉన్న వస్తువు ఎలా ఉందో అలాగే ఉంది. వాడి దయ సంపాదించుకో. నీకు ఆధారంగా ఉన్నదే నిజం. ఆధారం మీద కల్పించబడింది అబద్ధం. మీరు నామ రూపాలతో తాదాత్మ్యం మీకు లేకపోతే ఇక్కడే ఆయన మీ చేతికి అందుతాడు. మీరు డబ్బు దగ్గర కొంచెం అజాగ్రత్తగా ఉన్నా పరవాలేదు. మాట దగ్గర అజాగ్రత్త పనికిరాదు. మన మాట, చేత, తలంపులు భవిష్యత్తులో దుఃఖాన్ని తీసుకొని రాకూడదు. డబ్బు సంపాదించినప్పడే అది ఎప్పుడు పోవాలో నిర్ణయించబడింది. అది మనకు తెలియదు. ఏదైనా వచ్చింది అంటే అది పోయింది అని అర్థం. ఈ ప్రపంచం అనిత్యం. ఇది క్షణికం, ఎవరూ నావారు కాదు, నేను ఎవరి వారనూ కాదు అనుకుంటూ భగవంతుడు నీకు కేటాయించిన పనిని శ్రద్ధగా చేసుకొని జీవించు. ఈ దేహం చనిపోతే ఏముంది? ఈ తుక్కును తీసుకెళ్ళి ఎక్కడో పడేస్తారు. ప్రాణం పోతే ఇంట్లో వారితో సంబంధం ఏమీ ఉండదు. ఈ విషయాన్ని బాగా అర్థం చేసుకోవాలి. మన మాటలు సక్రమంగా లేకపోతే ఎప్పడు ఎలా

మాట్లాడాలో అలా మాట్లాడకపోతే మన మాటలే మనలను బలికోరుతాయి.

44. ఈ లోకం అత్యంత నీచమైనది. భయం గొలిపేది. రోజూ ఎంత మందికి భయపడతాము. భయం పెరిగే కొలది చనిపోయే 'నేను' పెరుగుతుంది. భయం ఏ 'నేను'కు వస్తుంది? ఈ 'నేను' ఎవరు? అన్ని ప్రశ్నించుకుంటే అది లోపలకి వెళుతుంది. భయం కూడా తలంపే. భయం దేహానికి రాదు. దేహం 'నేను' అనే బుద్ధికి వస్తుంది. అది నీవు కాదు. అందులో నుండి విడుదల పొందితే భయంలేదు. భయం లేని వస్తువు (ఆత్మ) తెలిసే వరకు భయం వస్తూనే ఉంటుంది. బయట గొడవలు తెలుసుకోవడానికి అమెరికా వరకు వెళతావు. నీవు ఎక్కడ నుంచి వచ్చావో తెలుసుకో అంటే ఇక వాడు ఉండడు. అది వాడికి తెలుసుకాబట్టి ఆ పని చెయ్యడు. ఏ జన్మకాజన్మ రోడ్డు మీద దుమ్ము అంతా నొల్లుకుంటాడు. కొంతమందికి బాహ్యపరిస్థితులు బాగానే ఉంటాయి. కానీ ఎప్పుడూ దుఃఖం తోనే ఉంటారు. కొందరికి అవి అనుకూలంగా ఉండవు. కానీ ఎప్పుడూ సంతోషంగా ఉంటారు. దీనిని బట్టి మనిషి దుఃఖానికి కారణం బాహ్యపరిస్థితులు కాదు అని మనకు తెలుస్తున్నది. బాహ్యపరిస్థితుల మీదే మన శాంతి ఆధారపడి ఉంది అనుకుంటే ప్రాథమికంగా మనకు ఏమీ తెలియదని అర్థం. మనకు వాచింగ్ ముఖ్యం. లోపల జరిగేది, బయట జరిగేది పరిశీలనగా చూస్తూ ఉంటే మనకు తెలియకుండానే మనస్సు, శరీరము, ఇంద్రియాలు కండిషన్‌లోకి వస్తాయి. మీకు పరిస్థితులు అనుకూలంగా లేకపోతే వాటిని ఓవర్‌కమ్ చెయ్యగలిగితే శాంతి మిమ్మల్ని వరిస్తుంది. పరిస్థితులు గొప్పవా? ఆత్మ గొప్పదా? అశాంతిని తీసుకొని వచ్చే వారు గొప్పా? మీలో ఉన్న భగవంతుడు గొప్పవాడా? వారి మీద వీరి మీద నెపాలు పెట్టకండి. మనం తప్పించుకొని పోవడానికి అలవాటు పడ్డాము. మీకు దుఃఖం వస్తే తట్టుకోవాలి, సంతోషం వస్తే ఇముడ్చుకోవాలి. మనకి అశాంతి దేనితో తాదాత్మ్యం వలన వస్తున్నదో అని తెలుసుకొని దానిని కత్తిరించాలి. ఈ గోడ ఎవరినైనా బాధపెడుతున్నది అంటే అర్థం ఏమిటి? అది గోడ తప్పా? నీ తప్పా? అలాగే లోకం ఎవరినీ బాధ పెట్టదు. లోకంతో





నీకు ఉన్న అనుబంధంనిన్ను పీడిస్తుంది. నీ నీడను నీవు ఎలా పట్టించుకోవడం లేదో అలాగే నీ దేహానికి సంబంధించిన గౌరవాలు, అగౌరవాలను నీవు పట్టించుకోకు. నీవు దేహం కావు ఆత్మ. ఇతరులు నిన్ను పొగిడినా విమర్శించినా పట్టించుకోకు. వాటివల్ల నీకు ఏ లాభమూ లేదు. వాటిని గాలికి వదిలెయ్యి, నీకు దయాగుణం ఉండటం మంచిదే. కానీ అది నీ పురోగతికి అడ్డురాకూడదు. అది మీ గమ్యం కాదు. అస్తమానూ నాది నాది అనుకోకండి. అది ఈశ్వరునిదే. నీ ప్రారబ్ధాన్ని బట్టి అది నీకు కేటాయించాడు. నాది అనే చిన్న వాసన పునర్జన్మ తీసుకొస్తుంది.

45. బుద్ధిమంతులు వారిని వారు సరిచేసుకుంటారు. ఇతరుల గొవల్లోకి వెళ్లరు. బుద్ధి లేని వారు వారిని వారు సరిచేసుకోవడం మానేసి ఎవరి మీదనో అక్షింతలు వేస్తూ ఉంటారు. రోడ్డుమీద ఉన్న దుమ్ము అంతా పోగుచేసుకుంటారు. వారికి చివరకు మిగిలేది దుమ్ము. "మనం ఏదైనా మంచిపని చేసి అది అందరికీ తెలియాలి అందరూ గుర్తించాలి అని అనుకోవడంకంటే పెద్ద బలహీనత మరియొకటి లేదు" అని శాస్త్రం చెబుతున్నది. మనం అందరం ఇప్పుడు ఉన్నాము, చనిపోయిన తరువాత ఉండము అనుకొంటున్నాము కదా! దేహమే నేను అనే చిన్న తలంపు మీద ఎంత మాయ పెట్టాడో చూడండి. మీరు ఎన్ని సాధనలు చేసినా ఈ తలంపు నుండి బయటకు రాలేరు అనుకోండి మాయలోనుండి బయటకు రాలేరు. పునర్జన్మ తప్పదు. మీకు పది రూపాయలు ఉంటే ఎవరికైనా ఒక రూపాయి ఇవ్వగలరు. పది ఎకరాలు ఉంటే ఒక ఎకరం దానం చెయ్యగలరు. అజ్ఞానంలో ఉంటూ అజ్ఞానాన్ని విడిచిపెట్టలేరు. కారణం అది మనకు పంచదారలా, తేనెలా ఉంది. మనం ఎలా విడిచిపెట్టగలం? గురువు యొక్క అనుగ్రహం లేకుండా దానిని విడిచిపెట్టలేము. దేవుడు అంటే ఉండటమే. మీరు ఎలా ఉన్నారు అంటే మేము ముసలివారము ఉంటారు. చిన్న వయస్సు అయితే పిల్లకాయలమని అంటారు. 'నేను ఉన్నాను' అంటే ఆ ఉండే వస్తువుకు వయస్సు లేదు, గుణం లేదు, రూపం లేదు, నామం

లేదు. అది లేదా అంటే ఉంది. అది దాని యొక్క వైభవం. మీ అశాంతికి ఎవరు కారణమని అనుకుంటున్నారో వారి హృదయంలో కూడా భగవంతుడు ఉన్నాడు. భగవంతుడు లేకుండా దేహం నిలబడదు. మామగారు, అత్తగారు, అన్నగారు, అన్యాయం చేసారని తొంభై రకాలుగా అనుకుంటారు. వారు ఎవరు అన్యాయం చెయ్యడానికి? వారు కర్తలు కారు. భగవంతుడు ఒక్కడే కర్త. అది నీకు అర్థం అయితే దుఃఖం రాదు. మనం ఎక్కువ చదువుకుంటే ఎక్కువ సంపద ఉంటే అందరిలా మనం ఎందుకు ఉండలేకపోతున్నాం. ఇక్కడే పిచ్చి ప్రారంభమవుతుంది. మనం ఇంద్రియాలతోటి, బుద్ధితోటి సంపాదించుకున్న విషయాలతో కలసిపోయి అవే మనం అనుకొని లేనిపోని వికారాలు తెచ్చుకుంటున్నాము. మనం సంపాదించుకున్న వస్తువులు ఇక్కడే ఉంటాయి. కానీ మనలో ఉన్న వికారాలు మరణానంతరం మన కూడా వస్తాయి. ఎందుచేతనంటే కర్మ అనుభవించడానికి నామరూపాలు పెద్ద అడవి. దుఃఖం అంతా నామరూపాల్లోనే ఉంది. గురువనుగ్రహం లేకుండా అందులోనుండి విడుదల పొందలేము. మన మనస్సు శుచి లేకుండా (శుచి అవ్వకుండా) నామరూపాలే అడ్డు వస్తున్నాయి. మనం ఎంతసేపు వీటినే చూస్తున్నాము కానీ లోపల నారాయణుని చూడలేకపోతున్నాము. ఈ రూపం మీద కోపం వస్తే ఇంకో రూపాన్ని పట్టుకొంటాము. అలా రూపాల మధ్య తిరుగుతూ చివరకు ఏదో రూపాన్ని పట్టుకొని చనిపోతాము. రూపాలు పట్టుకొని ఏడుస్తూ చనిపోయేవానికి మరలా రూపం రాక ఏమవుతుంది? అదే పునర్జన్మ.

46. మీ కుటుంబ సభ్యులను నేను ఉద్ధరించాను అని మీరు అనుకొంటున్నారు అనుకోండి మీకు పునర్జన్మ తప్పదు. కొత్త వారిని ఉద్ధరించమని భగవంతుడు మిమ్మల్ని ఇంకో శరీరంలోకి బదిలీ పెట్టేస్తాడు. ఉద్ధరించడానికి అసలు నీవంటూ ఉన్నావా? భగవంతుని సంకల్పాన్ని కాదని నేను ఎవరినో ఉద్ధరిస్తున్నాను అని మీరు అనుకొంటే అంతకంటే మించిన నటన లేదు. మనం చేసే ఘనకార్యాలు ఎలా ఉంటాయంటే చెట్టునుంచి ఒక





ఆకు పడిపోవడానికి సిద్ధంగా ఉంది అనుకోండి సరిగ్గా పక్షి వెళ్ళి అక్కడ వాలింది అనుకోండి ఆకు పడిపోతుంది. పక్షి వాలకపోయినా ఆ ఆకు రాలి పోతుంది. ఆ ఆకును నేనే పడగొట్టేసాను అనుకోవడం ఎటువంటిదో మన ఘనకార్యాలు అలాగే ఉన్నాయి. మీ అమ్మాయికి బాగా చదువు వస్తున్నది అనుకోండి అమ్మాయి బాగా చదువుకొంటుంది అనరు. నేనే చదువు బాగా చెప్పించాను అంటారు. ఇది ఏమి పొగరుబోతుతనం? అమ్మాయికి చదువు కునే యోగ్యత లేనప్పుడు మీరు చెప్పిస్తే మాత్రం చదువు వస్తుందా? అమ్మాయి కష్టపడి చదువుకుంటోంది అనే బుద్ధి రావాలి. బంధువులతోను, స్నేహితులతోను అతిగా ఉండవద్దు. శక్తి, కాలము వృధా అయిపోతాయి. సాధనకు కాలం దొరకదు. వారిని గౌరవించండి. ఎంతవరకూ ఉండాలో అంతవరకే సరిపోతుంది. నెత్తిమీద మోసుకుని తిరగవద్దు. ఉపకారం కోసమే ఉపకారం చెయ్యాలి. ఇష్టం ఉంది కాబట్టి ఉపకారం చెయ్యడం, అయిష్టం ఉందని అపకారం చెయ్యడం ఇలా చెయ్యడం వల్ల పాపం పెరిగి పోతుంది. మనం తొందరగా బాగుపడాలంటే వారు అటువంటివారు, వీరు ఇటువంటివారు అని తీర్పులు చెప్పడం మానెయ్యాలి. దారిద్ర్యాన్ని అనుభవించవచ్చు, అగౌరవం అనుభవించవచ్చు. కానీ దేహాభిమానం పెట్టే పీడ అనుభవించడం చాలా కష్టం. మహమ్మద్ “మనం దారిలో నడచి వెళుతూ ఉంటే ముళ్ళ కంపలు ఉంటే అవి బట్టలకు, శరీరానికి తగలకుండా తప్పించుకొని వెళతాము. అలాగే ఈ లోకంలో రాగద్వేషాలు, అసూయ, లాభ నష్టాలు లాంటి పెంట ఎంతో ఉంది. ముళ్ళ కంపల దగ్గర నీకు ఉన్న జాగ్రత్త ఈ పెంట దగ్గర ఉంటే అవి నిన్ను ఏమీ చెయ్యలేవు. అప్పుడు నీవు స్వర్గరాజ్యాన్ని పొందుతావు” అన్నారు. మనకు దేహబుద్ధి ఉంది కాబట్టి ప్రతీది దేహదృష్టితో చూస్తాము. వాడు గొప్పవాడు, వీడు తక్కువ వాడు అనే వేరు బుద్ధి వస్తుంది. వేరుబుద్ధి తగ్గిపోతే దృశ్యం కూడా తగ్గిపోతుంది. దృశ్యం ఎప్పుడైతే వారించబడిందో చిత్తం ఆత్మవైపుకు ప్రయాణం అవుతుంది. మనస్సును పరిశీలించు, దాని చేష్టలు గమనించు, శోధించు దాని

మూలంలోకి వెళ్ళిపోతుంది.

47. నేను చెప్పింది కొంతమందికి బాగున్నదని, కొందరు బాగా లేదని అంటారు అనుకోండి వారి మనస్సుతో నన్ను చూస్తే ఎలా బాగుంటుంది. లేకపోతే ఎందుకు బాగాలేదు అని వారిని అడిగితే తెలుస్తుంది. మీరు ఎన్ని మంచి పనులు చేసినా అందరు సంతోషించరు. వారి మనస్సుతో చూస్తే వారి కళ్ళతో చూస్తే వారు ఎందుకు సంతోషించడంలేదు అనేది తెలుస్తుంది. అప్పుడు మీకున్న సంతోషం పోదు. ఇతరులు ఎలా ఉండాలి అని నీవు అనుకొంటున్నావో నీవు అలా ఉండడానికి ప్రయత్నం చెయ్యి. నీలో మార్పు లేకుండా ఇతరులలో మార్పు తేలేవు. మన మాట ఎవరికి బాగాలేదో అని అనుకుంటే వారికి అర్థం అవ్వక అలా అంటున్నారా? అని గ్రహించి, అర్థంకాక అలా అంటున్నారు అనుకుంటే వివరంగా చెప్పవచ్చు. ఇష్టం లేక అంటున్నారు అంటే అంతటితో దాన్ని వదిలెయ్యి. చర్చ పొడిగించవద్దు. వారితో స్నేహం తగ్గించుకోండి. మనకు ఏవరైనా సన్మానం చేస్తే ఆ సన్మాన పత్రంలో విలువలకు నేను అర్హుడనా? అనేది చూసుకోవాలి. అంతేకానీ సంతోషం వస్తే వారి మీద ఇష్టం వస్తుంది. అది రాగంగా మారుతుంది. అలాగే ఎవరైనా మిమ్మల్ని విమర్శిస్తే మనస్సుకు బాధ వస్తుంది. అది ద్వేషంగా మారుతుంది. మీ మనస్సు బాహ్యముఖం అవ్వడానికి రాగద్వేషాలే కారణమని గుర్తించి వాటిని తగ్గించుకుంటే మనస్సు హృదయం వైపుకు ప్రయాణమవుతుంది. ప్రమాదం ఎక్కడ వస్తుంది అంటే స్నేహితులు, విరోధులు, ఆస్తులు, డబ్బు బయట ఉన్నాయి. అహంకారం లోపల ఉంది. అది బయట ఉన్నవాటిని పట్టుకొని ఏనుగులా పెరిగిపోతుంది. అది మనకు తెలియడం లేదు. ఏదీ అనుకోకుండా ఉంటే జీవలక్షణాలు పెరగవు. కోరిక, కోపము, భయము ఉంటే వాటి వెనకాల దుఃఖం ఉంటుంది. ఏది ఉండటం వల్ల దుఃఖం వెంటాడుతుందో వాటిని తగ్గించుకోమని భగవంతుడు చెబుతున్నాడు. అవి ఆరిపోతే ఇవీ ఆరిపోతాయి. మా పరిస్థితులు బాగున్నాయి, మా పరిస్థితి బాగాలేదు అనుకోవడం అన్నీ తలంపులే. ఏ





తలంపు వచ్చినా దాని వెనకాల దుఃఖం వచ్చేస్తుంది. సంతోషం తీసుకున్నా అది పరిణామంలో దుఃఖంగా మారిపోతుంది.

48. మనం ఎవరికైనా సహాయం చేయగలం కానీ ఉద్ధరించలేము. ఉద్ధరించాము అనుకొంటే అది మన గర్వానికి గుర్తు. ఎవరైనా అందహీనంగా ఉండవచ్చును. ఆ అందహీనమైన వానిని మీరు ఆక్షేపిస్తారు అనుకోండి ఆ రూపమే మీ కుటుంబంలో పడేస్తాడు ఈశ్వరుడు. మీరు ఏదైనా మంచి పని చేస్తున్నా దానికి మీరు అవలంభించే మార్గం కూడా మంచిగా ఉండాలి. లేకపోతే బుద్ధి విషపూరితమైపోతుంది. మన ఇంట్లో మనుషులు కూడా స్వప్న సమానము. మన శరీరం చనిపోయాక వారితో సంబంధం ఉండదు. ఈశ్వరునితో తప్ప. అన్నింటితోనూ సంబంధం తెగిపోతుంది. ఎవడి దయ వల్ల నీకు మోక్షం కలుగుతుందో వాడు నిన్ను విడిచిపెట్టడు. మరణానంతరం నీ కూడా ఉంటాడు. నీతోనే ఉంటాడు. ఎప్పుడూ నీతోనే ఉండే వాడిని మరచిపోతున్నావు. తాత్కాలికంగా వచ్చిపోయే వారి గురించి నీ జీవితాన్ని వ్యర్థం చేసుకుంటున్నావు. ఈశ్వరుడు మనుషుల్ని ఎందుకు కలుపుతాడో, ఎందుకు విడదీస్తున్నాడో తెలియదు. మనుషులను కలిపినప్పడే ఎప్పడు విడిపోవాలో నిర్ణయిస్తాడు. ఇది మనకు ప్రాణ సంకటం. ఆయనకు ఇది ఒక ఆట. బ్రహ్మానుభవం కలిగే వరకు అది ఆట అని నీకు తెలియదు. అప్పటి వరకు నిజంలాగే కనిపిస్తుంది. నిజం క్రింద కనిపించినంతకాలం దుఃఖం నిన్ను విడిచిపెట్టదు. నీవు చేసేది మంచి పని అయినా మర్యాదగా చెయ్యి. అగౌరవంగా చేస్తే భగవంతుని దృష్టిలో చెడ్డ పని అవుతుంది. అంటే డబ్బు పోతుంది, శని పడుతుంది. ఏ వస్తువుకైతే లాభనష్టాలు లేవో, హెచ్చుతగ్గులు లేవో ఆ వస్తువు మీరై ఉన్నారు. అది మీరై ఉన్నారన్న సంగతి మీకు తెలియకపోవడం వల్ల, జ్ఞప్తికి రాకపోవడం వల్ల అదృష్టం వస్తే ఒక రకంగానూ, దురదృష్టం వస్తే ఒకరకంగానూ ఊగిసలాడుతూ మాయ అనే అగ్నిలో కాలి బూడిద అయిపోతున్నావు. గురు అనుగ్రహం లేకుండా ఈ మాయ అనే అగ్నిలో నుండి బయటకు రాలేవు. వారు చెడ్డవారు అంటే

వారి మీద ద్వేషం పెరుగుతుంది. లేదా వారితో స్నేహం చెయ్యడం మానేయ వచ్చు. అంతేగానీ వారు చెడ్డవారు అంటూ తలుస్తూ ఉంటే వారికంటే ముందు మీరే చెడ్డవారు అయిపోతారు. లేదా వారు మంచివారు అంటే వారి మీద ఇష్టం పెరిగిపోతుంది. ఇవన్నీ పాపానికి దారి తీస్తాయి. మీలో చెడ్డలేకపోతే ఎదుటివాడిలో చెడ్డ కనిపించదు. మంచిచెడ్డలు అనే గడప దాటితే మహా వెలుగు, మహా శాంతి, మహా ఆనందము. సుఖము, శాంతి నీలోనే ఉన్నాయి. ప్రతీ మనిషి ఎక్కడో ఒకచోట ఆగిపోతాడు. కొందరు డబ్బు దగ్గర, కొందరు అధికారం దగ్గర ఆగిపోతారు. కారణం అవే శాశ్వతమని అవి సత్యం కావు అవి అన్నీ మనం కల్పించుకున్న గొడవలు. వాటితోనే ఉంటే మనం లోపలకి వెళ్ళలేము. అలా వెళ్ళకపోతే జ్ఞానాన్ని పొందలేము.

49. ఎవరిని చూచి మీరు ఇష్టపడుతున్నారో వారు ఒకోసారి అపకారం చెయ్యవచ్చును. ఎవరిని చూచి మీరు అయిష్టపడుతున్నారో వారు ఒకోసారి ఉపకారం చెయ్యవచ్చును అది మనం చెప్పలేము. వాటిని వదిలివేయండి. ఇంట్లో వారి ప్రేమలు కూడా కలుషితమైన ప్రేమలు. సమాజంలో అనేక రంగాల్లో అభివృద్ధి గలవాళ్ళు మనకు కనిపించవచ్చు. మనం వారిలా ఉంటే బాగుండును, వీరిలా ఉంటే బాగుండును అనుకుంటాము. మీరు ఎంతమందిలా ఉంటారు? అలా ఉంటే మీరు శుభ్రంగా పాడైపోతారు, కుళ్ళిపోతారు. వారి పద్ధతిలో వారు ఉన్నారు. అలా ఉండాలని మీరు ఎందుకు అనుకోవాలి? మీ నిదానంలో మీరు ఉండండి. జపం చేస్తాను, ధ్యానం చేస్తాను సరిపోతుంది అని అనుకుంటాము. అలా సరిపోదు. మనం సంపాదించుకున్న దానిని సమాజానికి ఉపయోగించక పోతే ఎక్కడో మనస్సులో లోపం ఉంది అని అర్థం. ఆ లోపాన్ని సరిచేసుకోవాలి. అప్పడే ఆచరణ వస్తుంది. ముందు మనం నెమ్మదిగా అధ్యయనం చెయ్యాలి, తరువాత అర్థం చేసుకోవాలి. అప్పడు దాన్ని ఆచరించాలనే బుద్ధి కలుగుతుంది. అప్పడు పరమాత్మ చెప్పినట్లు జీవిస్తే జీవుడికి, ఈశ్వరుడికి ఉన్న బేధం రాలిపోతుంది. అబేధస్థితిని, అభయస్థితిని





పొందుతాడు. బట్టల మీద దుమ్ము దులుపుకొన్నట్లు ద్వేషం వచ్చినప్పడు దాన్ని దులుపుకోవాలి. అలా దులుపుకోకపోతే పోస్టుకార్డు మీద ముద్రలు పడినట్లు మన మనస్సులో ముద్రలు పడిపోతాయి. ఆ ముద్రలు చెరుపుకొని బయటకు రావడం చాలా కష్టం. రోగం దీర్ఘమయ్యే కొలది అందులో నుండి బయటకు రావడం చాలా కష్టం అవుతుంది. నీకు నీవు ఎలా చేసుకుంటున్నావో ఇతరులకు అలా చేస్తే అది అద్వైత కర్మ. ద్వైతంలో ఉన్నంతసేపు బేధంలోనే ఉంటావు. దానిని ఎవరూ ఆపలేరు. మీకు ఎవరి స్నేహం నచ్చకపోయినా దూరంగా ఉండండి. విరోధం పెట్టుకోవద్దు. స్నేహాలు అతిగా పెట్టుకోకూడదు. కుటుంబ సభ్యుల ప్రేమ నిజంకాదు. వారి అవసరాలు వారికి ఉంటాయి. తరువాత మరణిస్తారు. ఒకరిని ఒకరు ప్రేమించుకోవద్దు అని నేను అనడం లేదు. అది సహజమైన ప్రేమకాదు అది మీరు గ్రహించాలి.

50. ఆత్మ నీవై ఉన్నావు అని చెప్పడం దేనికి? అని ప్రశ్నిస్తే ఆత్మ నీవై ఉన్నమాట నిజమే కానీ అది నేను అని నీవు అనుకోవడం లేదు. దేహమే నేను, మనస్సే నేను, ఇంద్రియాలే నేను, సుఖదుఃఖాలు పొందేది నేనే, పుట్టిన వాడిని, మరణించేవాడిని నేనే అని నీవు అనుకొంటున్నావు. ఆ పాడుబుద్ధి నీకు ఉంది దానిని తొలగించడానికే అలా చెప్పారు. లేకపోతే ఆమాట చెప్పవలసిన పనిలేదు. నీ తప్పడు ఆలోచనలోంచి తప్పించడానికి అలా చెప్పవలసి వచ్చింది. నిత్యాన్ని (ఆత్మని) పట్టుకోలేకపోతున్నావు కాబట్టి అనిత్యాన్ని సత్యమనుకొంటున్నావు. “ఈ లీలలో కూడా నన్ను చూస్తూ నన్ను ఆరాధిస్తూ ఉంటే నిన్ను నీవు పొందుతావు” అంటారు పరమాత్మ. అనుకరణ వద్దు, అనుకరణ భయానికి గుర్తు. లోకంలో అందరూ చేసే తప్ప ఏమిటంటే సుఖం బయట ఎక్కడో ఉంది అనుకుంటున్నారు. ఏదో ఒక వస్తువును సంపాదించినట్లు దానిని కూడా సంపాదించాలి అనుకుంటున్నారు. బయట ఉంటే సంపాదించవచ్చు. కానీ అది బయటలేదు. అది మన స్వరూపమే. సబ్జక్టు, ఆలోచన ఈ రెండూ విడిచిపెట్టకూడదు. మనవి బానిస బ్రతుకులు.

రవ్వంత విచారణ చెయ్యకుండా ఎవరి మీదనో మమకారం పెట్టుకొని చాకిరీ చేసి చివరకు చనిపోతారు. ఎవరి గురించి అయినా పని చేస్తే చెయ్యండి. మీ గురించి మీరు విచారణ చేసుకోండి. ఆ బొమ్మల కోసం మీ డ్యూటీ మీరు చెయ్యండి. అంతేకానీ ఆ బొమ్మలను మోసుకొని తిరుగుతూ మీరు ఎవరో మీరు తెలుసుకోవడం మానవద్దు, విచారణ మానవద్దు. కళ్ళు మూస్తే వారికి మీకు సంబంధం లేదు. ఇంటి దగ్గర బోలెడు చాకిరీ చేస్తున్నాము ఎవరూ గుర్తించడం లేదు అంటారు. ఎవరైతే గుర్తించడం లేదు అంటారో వారి దగ్గర అనంతశాంతి, అనంతసుఖం గల హృదయమనే తాళం చెవి లేదు. మీలో అంతర్యామిగా ఉన్న భగవంతుని దగ్గర తాళం చెవి ఉంది. ఆయనను గుర్తిస్తే మీకు మోక్షం వస్తుంది. ఆయన గుర్తింపు లేకపోతే మన పని సున్నా. ఏ పరిసరాలలో ఉన్నా, ఏ పరిస్థితులలో ఉన్నా సర్దుబాటు అయి సాధన చేసుకుంటూ ఉండు. సరిపెట్టుకోకపోతే రోజులు వెళ్ళవు. ఒకోసారి మీకు వచ్చే ప్రతీ తలంపు మిమ్మల్ని బాధపెడుతుంది. ఇటువంటి తలంపులు వస్తున్నాయి ఏమిటి? అని మీకు అనిపిస్తుంది. మనస్సు నేను, దేహం నేను అనుకోవడం వల్ల అవి అన్నీ వస్తున్నాయి. అవి అన్నీ అబద్ధంలోంచే వస్తున్నాయి. అబద్ధంలోంచి వచ్చే తలంపులు మిమ్మల్ని ఎలా సుఖపెడతాయి. అవి అన్నీ అబద్ధంలోంచి వచ్చినవని మీ గుండెకు తాకితే ఆ గ్రహింపు మీకు వస్తే ఆ తలంపులు అన్నీ పోతాయి. మీ తెలివితేటలను మీలో ఉన్న అసూయత మీద ఫోకస్ చెయ్యకండి. మీలో ఉన్న నారాయణుని మీద ఫోకస్ చెయ్యండి. అప్పుడు మీలో ఉన్న అసూయత పోతుంది. గీతలో పరమాత్మ “బుద్ధిమంతుడు ఈ లోకంలో పాపాలను ఎలా వదిలించు కుంటాడో పుణ్యాలను కూడా అలా వదిలించుకుంటాడు. వాడు పుణ్యకార్యా లను చెయ్యడు అని కాదు నేను పుణ్యం చేసాను అనే బుద్ధిని ఈ భూమి మీద ఉండగానే వదిలేసి శుభ్రంగా స్నానం చేసి (మనస్సు) వెళ్ళిపోతాడు. కారణం పుణ్యం చేసాను అనే భావన వల్ల కొన్ని వేల జన్మలు వస్తాయి.

51. పూర్వజన్మ సంస్కారాలనుండి విషయ వాసనలు రావచ్చు.





ఆ వాసనలు బలవంతంగా గెంటడానికి చూడకండి. వాటినుండి పారిపోవడానికి ప్రయత్నించకండి. ఇటువంటి వాసనలు వస్తున్నాయి ఏమిటి? అని కంగారు పడకండి. వాటిని క్లోజ్‌గా పరిశీలనలో పెట్టండి. అప్పుడు అవి నెమ్మదిగా పలచబడి రాలిపోతాయి. అంతేకానీ కంగారు పడితే తరుముకొంటూ వస్తాయి. మనం ఏదైనా సాధించగలం అనుకోవడం వల్లనే మనం పూర్తిగా పాడైపోతున్నాము. మనం ద్వేషించడం నేర్చుకున్నాము. ప్రేమించడం నేర్చుకుంటే ఈశ్వరానుగ్రహానికి పాత్రులమవుతాము. సబ్జక్టు మీకు ప్రోపర్‌గా అర్థం అయితే పరమశాంతిలో ఓలలాడుతారు. వాడు అలా చేసాడేమిటి? వీడు ఇలా చేసాడు ఏమిటి? వాడు అలా చెయ్యడానికి భగవంతుడు అలా ఏర్పాటుచేసాడు. నీకు ఎందుకు ఈ గోల? నీటిలో ఉన్న దుంగ ఎంతలావుగా ఉందో తెలియదు. కంటికి కనిపించే పై భాగమే చూస్తాము. నీటిలో ఉన్న భాగం కనబడదు. అలాగే మన మనస్సులో ఉన్న పై భాగమే మనకు తెలుస్తుంది. లోపల భాగంలో ఉన్న గొడవలు మనకు కనబడటంలేదు. పైభాగం చూసి మంచివారని, చెడ్డవారని తీర్పులు చేప్పేసు కుంటాము. లోపల ఏ బలహీనతలు, ఏ వాసనలు ఉన్నాయో తెలియడం లేదు. అది ఒక్క జ్ఞానికే తెలుస్తుంది. ఒక మనిషికి గర్వం పెరుగుతోంది అనుకోండి భగవంతుడు ఏదో ఒక రూపంలో వాడిని గర్వభంగం చేసేస్తాడు. అది ఏరూపంలో చేస్తాడు? ఎలా చేస్తాడు? ఎక్కడ చేస్తాడు? అనేది మనం చెప్పలేము. గర్వభంగం ఎందుకు చేస్తాడంటే వాడిమీద కోపం వల్ల కాదు. వాడికి వినయం నేర్పడానికి, వాడు బాగుపడడానికి అలా చేస్తాడు. పదిమంది క్షేమం కోరే బుద్ధి నీకు లేనప్పుడు దైవ సాక్షాత్కారం అడగడంలో అర్థం ఏముంది? అహంకారం, మమకారం తగ్గకుండా శాంతి రాదు. ఇంట్లో వారికి మనకి ఉండే సంబంధం తాత్కాలికమైనది. ఈ శరీరం చనిపోతే వారు ఎవరో, మనం ఎవరిమో. ఈ శరీరం మారిపోతుంది. తల్లితండ్రులు మారిపోతారు. పరిశరాలు మారిపోతాయి. అన్నీ మారిపోతాయి. కానీ మనల్ని నియమించేవాడు, మన పరిపాలకుడు

అయిన భగవంతునితో సంబంధం మాత్రం శాశ్వతంగా ఉంటుంది. "నా పాదాలను చేరుకొనే వరకు ఈ చావు పుట్టుకలు నీకు తప్పవు" అన్నాడు పరమాత్మ. మన రేడియో పాడైపోతే స్టేషన్ నుండి మాటలు రావు. అక్కడ పనిచేసినా రేడియో రిసీవ్ చేసుకోలేదు. అలాగే మన మనస్సు పాడైపోయినప్పుడు భగవంతుడు చెప్పే వాక్యాన్ని రిసీవ్ చేసుకోలేము. ధరించేదే దేహం అంటారు. రంగు రంగుల దేహాలు అంటే రంగు రంగుల బట్టలే. శరీరమనే బట్టను ఇంకో బట్టతో కప్పకుంటాము.

52. ప్రహ్లాదుడు "మన ప్రకృతి చదువులు అర్థ, కామాలకు తప్ప దేనికైనా పనికి వస్తాయా?" అన్నాడు. అపూర్వమైన మాట. చదువుల వల్ల ధనం సంపాదించవచ్చు, భోగాలు అనుభవించవచ్చు. చివరకు అన్నీ వల్లకాటిలోకి వెళ్ళిపోవాలి. చదువులు వద్దు అనలేదు. వాటివల్ల భోగాలు అనుభవించవచ్చు. కానీ శాంతి రాదు. అపరా విద్య వల్లనే శాంతి వస్తుంది అని అర్థం. ఎవరైనా ఐశ్వర్యవంతులు అయ్యారు అనుకోండి భగవంతుని దయ వల్ల వారు ఐశ్వర్యవంతులు అయ్యారు అనుకుంటే అసూయత ఎందుకు వస్తుంది? వారికి పది పిహెచ్‌డిలు ఉంటే ఉండనివ్వండి. నీకు నష్టం ఏమిటి? అవి నీకు రావాలి అనుకోవడం వల్లనే అసూయ వస్తుంది. వారికి ఉన్నది ఏదో వారు తింటారు, మనకు ఉన్నది ఏదో మనం తింటాము అనుకుంటే అసూయ రాదు. మనలో అతిశయం ఉంటే పైకి పెద్ద మనుషుల్లా ఉంటాము. లోపల మేము గొప్పవారము, మంచివారము, భక్తిగలవారము, సాధన చేసుకుంటున్నాము అనుకొంటారు. సంవత్సరానికి ఒక రూపాయి చందా ఇచ్చినా మేము దానధర్మాలు చేసేవారము అనకునేవారు కూడా ఉన్నారు. నాకు జ్ఞానం వచ్చేస్తుంది అని అతిశయం పెంచుకుంటారు. మనకు కొంత భక్తి ఉంటుంది. కానీ అవగాహన లేక ప్రత్యేకత ఉంది అని అనుకుంటారు. అక్కడ నుండి పతనం ప్రారంభమవుతుంది. కాబట్టి అతిశయం పనికిరాదు. చావు పుట్టులకతో సహా అంతా ఈశ్వర సంకల్పం వల్ల జరుగుచున్నది అని నీకు అర్థం అయినప్పుడు దేనిని చూసి సంతోషిస్తాము,





దేనిని చూచి దుఃఖపడతాము. భగవంతుడు అలా నియమించాడు అనుకుంటే గర్వంలోను, అవమానపడటంలోను అర్థం లేదు. అది అంతా నీకు తెలియకపోవడం వల్ల అలా చేస్తున్నావు. "నీకు అతి సమీపంలో ఉన్న ఆత్మను నీవు ఎక్కడో వెతుకుతున్నావు? ఇంతకన్నా మాయ ఎక్కడ ఉంది" అన్నారు శంకరాచార్యులవారు. దేహమే నేను అనుకోవడం వల్ల నేను అది సాధించాను, ఇది సాధించాను అనుకుంటున్నావు. అసలు నీవు అంటూ ఉన్నావా? ఇంటి పని విషయంలో డ్యూటీ చేస్తున్నాము అని పని చెయ్యండి. మోస్తున్నట్లు ఉండకండి. హత్య చేసిన వాడిలో కూడా హత్య చేయబడని చైతన్యం ఉంది. 'పాపం' ఎలా ఉంటుందో తెలియని ఆ సద్వస్తువు నీలోనూ ఉంది. నీ మొఖం దానివైపు తిప్పితే నీవు పవిత్రుడవు అవుతావు. మీరు సబ్జక్టు అర్థం చేసుకుంటే మిమ్మల్ని అదృష్టం లేదా దురదృష్టం వెంటాడినా సముద్రంలో కెరటాలు లేస్తూ, పడుతూ ఎలా ఆనందకేళిలో ఉంటాయో అలాగే మీరు ఆనంద సముద్రంలా ఉంటారు. బుద్ధి చలించినప్పడే దోషం వస్తుంది. అది బుద్ధిలోని దోషం. వేరుబుద్దిలో నుండే సంసారం అంతా వస్తుంది. పూర్వజన్మలో శత్రువులే కొంపలో సిద్ధమవుతారు. అక్కడ నుండి గొడవలు ప్రారంభమవుతాయి.

53. పురుషులని, స్త్రీలని వేరుగా లేరు జీవుడే ఉన్నాడు. స్త్రీ శరీరంలో ఉన్న జీవుణ్ణి పురుషశరీరంలోకి మార్చవచ్చు లేదా జంతు శరీరంలోకి మార్చవచ్చు. జీవితం పాఠాలు నేర్పుతుంది. దానిని గుర్తుపెట్టుకుంటే మనం బాగుపడతాము. జూదం సుడిగుండం. ధర్మరాజు అందులో పడ్డాడు, ప్రతీ ఇంద్రియానికి ఒకే ఆకర్షణ ఉంటుంది. అవీ సుడిగుండాలే. రోగ కారణం లోపల ఉన్నంతకాలం ఎప్పడో ఒకప్పడు దుఃఖపడకుండా ఉండలేవు. మనలో ఉన్న చెడ్డను కాల్చి బూడిద చెయ్యడమే సాధన. ఈ సృష్టి అంతా ఏ పరబ్రహ్మం లోంచి వచ్చిందో అది ఎలా నిలబడుతుందో దానిని నీవు పూజలు, జపాలు చేసి పొందలేవు. దానిని హృదయంలో వెతకాలి. నీకు ఆ గ్రహింపు రావాలి. బుద్ధి శుద్ధి అవ్వాలి. లోపల అరిషడ్వర్గాలు అనే రాక్షసులను నీవు

సంహరించాలి. మట్టి, రాయి, బంగారం మూడింటినీ సమానంగా చూచే వానికి మనస్సు లోపలకి వెళుతుంది. మీరు ఎవరికోసం అయితే కష్టపడి, కష్టపడి దెబ్బలు తిని, నిష్ఠూరాలు పడి ధనాన్ని సంపాదిస్తున్నారో వారు వల్లకాటిలోకి వచ్చి మిమ్మల్ని మంటల్లో పడేసిపోతారు అని తెలియక కష్టపడు తున్నారు. అదే మమకారం. అది పోతేగాని జ్ఞానం రాదు. దేహము, మనస్సు ఆరోగ్యంగా ఉంచుకోవాలి. ఆత్మానుభవానికి అవి పనిముట్లు. మనస్సు అశాంతిలో ఉంటే రోగాలు వస్తాయి. దుర్గ అంటే దురాచారాలను మాన్పేది. మోహం పోకుండా మోక్షం రాదు. మర్రిచెట్టు విత్తనం చాలా చిన్నది దానిని పాతితే పెద్ద వృక్షమవుతుంది. కర్తృత్వం అనే బీజం నీకు ఎంత కాలమైతే ఉంటుందో అంతకాలం కోటి జన్మలు ఎత్తినా నీకు మోక్షం కలుగదు. మర్రిఆకు మీద నీటి బిందువు ఎంతకాలం ఉంటుందో తెలియదు. జీవితం కూడా క్షణభంగురం. సాధన ముఖ్యం. ప్రతీ చిన్న విషయం ప్రారబ్ధాన్ని బట్టే జరుగుతుంది. ప్రతీ వ్యక్తికి బెంగ ఎందుకు వస్తుంది అంటే భగవంతుని సంకల్పం పై పూర్తి విశ్వాసం లేకపోవడమే.

54. కంటిలో దోషం ఉంటే వస్తువు స్పష్టంగా కనిపించదు. అలాగే దేవుని మాట నీకు అర్థంకావడంలేదు. అంటే నీలో రాగద్వేషాలు మూలం గానే ఎవరి మీదనైనా ద్వేషం కలిగితే మనస్సు, శరీరము వేడెక్కిపోతుంది, బిపి పెరిగిపోతుంది, ఆకలి చచ్చిపోతుంది, ఆరోగ్యం చెడిపోతుంది. జాగ్రదవస్థ నిజంకాదు. నిజం అని అనుకుంటున్నావు. అందుకనే అలా పాడైపోతున్నావు. అందుచేత ఆ అవస్థలో జరిగేవి అన్నీ మరచిపోవాలి. మరచిపోతే తొందరగా సత్యానుభవం కలుగుతుంది. మీరు ఆ విషయాలు మరచిపోతే మీ శరీరాన్ని ఏసి గదిలో పెడితే ఎలా ఉంటుందో అలా మీరు ఉంటారు. మా కోడలు ఇలా తయారైంది ఏమిటి అనుకోకండి. అది మిమ్మల్ని తిటట్టవచ్చును, ఇంకొకరు అయితే చంపేయవచ్చు. ఆ సంగతి మీకు తెలియదు. మనిషి అనుభవించే భోగాలు ఇసుకలో వేసిన నూనెలాంటివి. తిరిగిరావు తరువాత ఆ భోగాలే రోగాలుగా మారతాయి. బేధానందం అంటే నీకన్నా వేరుగా





ఉండే ఆనందం. అది ఎలా ఉంటుందంటే పైకి ఆనందంలాగానే కనిపిస్తుంది. లోపల రోగం అనే కిరీటం పెట్టుకొని వస్తుంది. అభేదానందం అంటే ఆత్మానందం. నీకంటే వేరుగా ఉండదు. అంత స్వచ్ఛంగా ఆనందం అలా ఉంటుంది. బేధానందంలో భార్య భర్తను చూచి ఆనందించడం, భర్త భార్యను చూచి ఆనందించడం, బ్యాంకులో ఉన్న డబ్బును చూచి ఆనందించడం. అవి పోతే దుఃఖం. ఈ విషయంలో జాగ్రత్త కావాలి. సోమరితనం ఉంటే దురాలోచనలు వస్తాయి. మనస్సు దైవమయమైతే దూరాలోచనలు రావు. భవిష్యత్తు ఎలా ఉండాలో అలా ఉంటుంది. మీరు అనుకున్నట్లు ఉండదు. దానిని గురించి ఆలోచించి మీ మనస్సును పాడుచేసుకోకండి. మీరు ఏదైనా పొరపాటు చేస్తే పొరపాటు చేసానని అస్తమాను అనుకోవద్దు. పశ్చాత్తాపపడితే పొరపాటు నిశ్శేషంగా తొలగిపోతుంది. మీ ఇంట్లోవారికోసం ఎంత కష్టపడి పొరపాట్లు చేసి కోట్లకొలది డబ్బు సంపాదించి వారి కోసమని జీవిస్తూ ఉంటాము. మీ దేహం చనిపోయాక మిమ్మల్ని ఎవరూ తలపెట్టుకోరు సరికదా గది ఖాళీ అయిందని సంతోషిస్తారు. అది మాయ. మీరు సంపాదించిన కోట్లు వారు అనుభవిస్తారు. ఆ డబ్బు సంపాదించడంలో మీరు చేసిన పొరపాట్లు మీ కూడా వచ్చేస్తాయి. డబ్బు అనుభవించేది ఇంట్లో వారు. పొరపాట్లు జీవుడు మోసుకునిపోయి బాధను అనుభవిస్తాడు.

55. మేము ఒంటరిగా ఉండలేకపోతున్నాము అంటారు. చనిపోయిన తరువాత పదిమంది వస్తారా? భక్తి లేక అలా అంటారు. ఒంటరిగా ఉండటం ఏమిటి? మీకు దేవుడు లేడా? దేవుడు లేకుండా నీవు ఉన్నావా? డబ్బు, ఇంట్లోవారు, స్నేహితులు రక్షిస్తారని అనుకుంటున్నావు. రక్షించేది దేవుడే. ఆ బుద్ధి మనకు రావడంలేదు. కంట్రోలర్ మన హృదయంలోనే ఉన్నాడు. వాడు ఒక్కడే నిజం. రాత్రి సమయంలో ఎందుకు నిద్ర పట్టడంలేదు అంటే కోరికలు, వాసనలు మూసేస్తూ ఉంటాయి. కర్మలు చేయడం వల్ల వాసనలు, సంస్కారాలు వస్తాయి. అందుచేత కర్మలు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. నామాన్ని స్మరిస్తే వాసనలు వచ్చి వెళ్ళిపోతాయి. నిద్ర పట్టేస్తుంది. కోరికను

పదిసార్లు తీర్చుకుంటే అదే అలవాటుగా మారిపోతుంది. అది తరువాత వాసనగా మారిపోతుంది. రెండు ఉంటే గలాటాలు. చూచేది అంతా ఒక్కటే అయితే గలాటాలు, వికారాలు, భయాలు ఏమిటి? ఇతరులలో మీరు కనిపిస్తూ ఉంటే దుఃఖం ఎలా ఉంటుంది? మనమూ ఉన్నాము, దేవుడూ ఉన్నాడు అనుకున్నప్పడే బేధబుద్ధి, అశాంతి కలుగుతుంది. ఇతరులకు నీవు చేసే సహాయం నీకు వడ్డీతో సహా తిరిగి వచ్చేస్తుంది. ఈ అదృష్టాలు, దురదృష్టాలలో నుండి బయటకురా! కావలసింది అదే. కర్మలు అనుభవిస్తున్నాము అనుకునే "నేను"లో నుండి బయటకు వస్తే నీవు ఏదిగా ఉన్నావో అందులో నీవు ఉంటావు. మీ సంకల్పం సరిగా ఉంటే నూటికి తొంభై పనులు సక్రమంగానే జరుగుతాయి. పునాదిలో తేడా ఉంటే మేడ ఎంతకాలం ఉంటుంది? అలాగే మీ సంకల్పం సరిగా లేనప్పడు మీరు సాధన చేసినా కృతార్థులు కాలేరు.

56. రూజ్‌వెల్ట్ అమెరికా అధ్యక్షులుగా ఉండి 'నేను' గురించి అద్భుతంగా ఇలా చెప్పారు "మీరు ఏ దేశం వారైనా స్వార్థం, హద్దులు, బలహీనత, దుర్గుణాలు వంటి గుణాలు ఉండవచ్చు. అవి అన్నీ మనస్సు అనే ఇంట్లో ఉన్నాయి. దానిని విడిచిపెట్టాలి. మనం ఇల్లు విడిచి పెట్టకుండా రోడ్డుకి అవతల ఉన్న స్వేచ్ఛా మైదానంలోకి వెళ్ళాలి అనుకోవడం ఎటువంటిదో "నేను"ని విడిచిపెట్టకుండా స్వర్గరాజ్యం కావాలి అనుకోవడం కుదరదు. ఈ నేను హద్దులను నిర్ణయిస్తుంది. వ్యక్తిగతమైన నేనులో ఉండి, విశ్వ మనస్సులోకి ప్రవేశించలేవు. మన ధనము, మన అంతస్తు గొప్పదనే అజ్ఞానంలో బ్రతికినంత కాలం బ్రహ్మం గొప్పది అనే విశ్వాసం కలుగదు. నీవు అలా తలకాయలో బ్రతికినంతకాలం హృదయంలో బ్రతకలేవు. ఎవరైతే హృదయంలో బ్రతుకుతారో వారిని గుణాలు తాకినా వాటి ఆటలు సాగవు. వారు గుణాతీతుడై స్థితప్రజ్ఞుడు అవుతాడు. ప్రారబ్ధం అనుభవిస్తున్నామని కొందరి వేదన, పుణ్యం వల్ల ఇలా ఉన్నామని కొందరు, ఇలా అనేక పిచ్చి మాటలు. ఇవి అన్నీ మనస్సు గోల. నీవు కాని నామ రూపాలు నీకు అంత ఇష్టమైతే స్వర్గరాజ్యంలోకి





ఎలా వెళ్ళగలవు? నీవు మైండ్‌లో ఉన్నావు. అందులోనుండి బయటకు రాలేకపోతే ఏడుస్తూ కూర్చోవాలి" అన్నారు. నాకు 70 సం॥లు వచ్చాయి అంటారు అది మీ శరీరానికి వచ్చాయి. ఈ దేహం ఉండగానే దేహాభిమానం పోగొట్టుకుంటే దేహప్రారబ్ధాన్ని బట్టి అది నడుచుకొనిపోతుంది. దాని తాలూకు సంతోష, దుఃఖాలు మిమ్మల్ని ముట్టుకోవు. అయిష్టము అనేది ప్రత్యేకంగా లేదు. వ్యక్తి భావనే ఇష్టంగానూ, అయిష్టంగానూ మారుతుంది. విషయాలకు అసలు బలం లేదు. నీవు వాటి గురించి ఆలోచించడం వల్లనే వాటికి బలం పెరుగుతుంది. నేనునాది అనేవి అజ్ఞాన జనితాలు. దాని నుండి విడుదల పొందితే శాంతి. 'నేను' వచ్చాక జన్మల గొడవలు, పుణ్యపాపాలు, రాగద్వేషాలు, స్వపరబేధాలు ఇవి అన్నీ వస్తున్నాయి. ఏది వచ్చాక అన్నీ వస్తున్నాయో అది ఎంత అబద్ధమో దాని వెనకాల వచ్చేవి అన్నీ కూడా అంతే అబద్ధం. ఆ "క్లూ" పట్టుకోవాలి. లేకపోతే ప్రవాహంలో కొట్టుకొనిపోతావు. బయటకు రాలేవు. ఈ పనికిమాలిన గొడవలకు వెళితే ఒడ్డుకు రాలేవు. అది చెప్పడానికి వచ్చిన అవతారమే రమణావతారం.

57. గుడిలోకి వెళ్ళి అష్టోత్తరం చేయించుకొని వస్తే పుణ్యం వస్తుంది అనుకుంటారు. అష్టోత్తరం చేసేవాడు జీవుడే, చెయించుకునేవాడు జీవుడే. దానివల్ల పుణ్యం వస్తే దాన్ని అనుభవించేవాడూ జీవుడే. శరీరమే ఉండనప్పడు పుణ్యపాపాలు ఏమి నిలబడతాయి? ఈ గొడవల్లోనే ఉంటే ఇక హృదయంలో ఉన్న నిజమైన స్నేహితుడి దగ్గరకు వెళ్ళే ప్రయత్నం ఎప్పడు చేస్తావు? మీరు వంద కారణాల వల్ల ఇబ్బంది పడుతూ ఉన్నా, దుఃఖపడుతూ ఉన్నా మీకు సబ్జక్టు ప్రోపర్‌గా అర్థం అయితే వంద కారణాలు కాలి బూడిద అవుతాయి. నీవు గుర్తించినా, గుర్తించకపోయినా ఈశ్వరుడు పని చేస్తున్నాడు. ఆ గుర్తింపు కలిగి ఉంటే నీకు ఉన్న అశాంతి నెమ్మదిగా కాలిపోతుంది. నిజమైన 'నేను' నీ హృదయంలో ఉంది అంటే సరిపోదు. ఆ నేను 'నేనే' అని నీకు తెలియాలి. దాని గుర్తింపు నీకు రావాలి. అప్పటివరకు జన్మలు అశాంతి విడిచిపెట్టవు. కాశీ వెళ్ళి గంగలో మునగడం తేలికే. జ్ఞానగంగలో మునగడం

చాలా కష్టం. దానికి సాధన చెయ్యాలి. దానికోసమే దేహాన్ని ఉపయోగించాలి. ఆత్మవిశ్వాసం లేకపోవడం వల్లనే మిమ్మల్ని వాళ్ళు చూడటంలేదు, వీళ్ళు చూడటంలేదు అనే భావాలు వస్తున్నాయి. అసలు ఒకరిమీద ఆధారపడి జీవిస్తున్నాము అని ఎందుకు అనుకోవాలి. యుద్ధంలో ధర్మరాజుకి రక్తపాతం చూచి దుఃఖం వస్తే భీష్ముడు ఎంత తత్త్వబోధ చేసినా శాంతి రాలేదు. దానితో ఆయన ఒక కథను ఇలా చెప్పారు "ఒక బ్రాహ్మణ కుంటుబం తల్లీ కొడుకులతో ప్రయాణం చేస్తూ ఉంటే ఒక పాము కొడుకును కరచి పుట్టలోకి వెళ్ళిపోయింది. ఈ విషయం ఒక బోయవాడు చూచి దాన్ని పుట్టలోంచి లాగి ఆ తల్లితో ఇలా అంటాడు 'మీ అబ్బాయి దీనికాటు వల్లనే చనిపోయాడు. దీనిని మీ కళ్ళముందే చంపుతాను' అనగా తల్లి అంది 'దీన్ని చంపడం వల్ల మా అబ్బాయి బ్రతకడు కదా! దానిని వదిలేయి' అన్నది. దానిపై పాము ఇలా అన్నది 'మేము అందరినీ కరవము. నన్ను యమధర్మరాజు గెంటి పురిగొలిపాడు. అందుచేతనే కరచి చంపాను. మృత్యువు వాడిని చంపింది. నేను చంపలేదు' అన్నది. దుఃఖం, వేదన, అశాంతి అన్నీ కర్తృత్వ రూపంలో ఉంటాయి. కౌరవులు చేసిన పాప కర్మవల్లనే వారు మరణిస్తారు" అని భీష్ముడు చెప్పగా ధర్మరాజుకి శాంతి కలిగింది. మీ కర్మ ఆ కోడలిని, ఆ అల్లుడిని మీ ఇంటికి తీసుకొని వచ్చింది అని మీరు అనుకోవాలి.

58. దేహభావనతో ఆత్మజ్ఞానం పొందడం అంటే మొసలిని నమ్మి నదిని దాటడం వంటిది. నన్ను ఎంతోమంది పొగుడుతున్నారు, ఎంతోమంది సన్మానాలు చేస్తున్నారు అనుకునే ఎందుకూ పనికిరాని మనస్సుని హృదయం లోకి పీల్చుకోవడం దేనికి? దానివల్ల అహంకారం పెరుగుతుంది. మనం నానా తత్త్వాన్ని చూస్తున్నాము. ఏకత్వాన్ని చూడలేకపోతున్నాము. ఆచార్యుల వారు "నేను ఎంత వ్రాసినా, ఎంత చెప్పినా పుణ్యబలం లేకపోతే వాటి ప్రయోజనం లేదు" అన్నారు. మొద్దబ్బాయి మొట్టికాయలు తగిలాకగానీ తెలుసుకోలేడు. పూర్వజన్మ పుణ్యసాధన ఉంటే విషయం చెప్పినది చెప్పినట్లుగా గ్రహించగలడు. చాలామంది వారు అలాంటివారు, వీరు





ఇలాంటివారు అంటారు. వారి వంక ఎవరు చూడమన్నారు. నీ మనస్సులో మురికే అలా చూస్తున్నది. నీ మనస్సును సంస్కరించుకోలేకపోతే ఎవరూ నిన్ను సుఖపెట్టలేరు. ఆత్మానందం మినహాయించి నీ మనస్సు ప్రకృతి విషయాల మీద వాలినా నీకు మోక్షానుభవం కలుగదు. ఈగలా ఉండకు. తేనెటీగలా ఉండు. తేనెటీగ మధురమైన వాటి మీదనే వాలుతుంది. శరీరం నూటికి నూరుపాళ్ళు అబద్ధం. దానికి చావు వస్తే ఆత్మ స్వరూపులమైన మనం చనిపోవడం ఏమిటి? రోజూ సినిమాలు చూస్తే కామక్రోధాలు పెరిగిపోతాయి. మంచి గుణాలను సాధనచేసి ఒక సంవత్సరంలో పొందవచ్చు. కానీ చెడు గుణాలను సాధన చేసి తొలగించుకోవడం చాలా కష్టం. ఇతరులవంక చూడకండి. అలా ఎంతకాలం చూస్తారు. అలా చూస్తే దుఃఖం వస్తుంది. మిమ్మల్ని మీరు చూసుకుంటే మీరు సుఖి అవుతారు. డబ్బువల్ల, చదువువల్ల ఇంద్రియాలు క్రమశిక్షణలోకి రావు. క్రమశిక్షణ గల జీవితం గడపడం వల్లనే ఇంద్రియాలు నీకు వశం అవుతాయి. కామక్రోధాలు వస్తే సృష్టిలోకి వచ్చేస్తాము. మీ పిల్లల్ని మీరు వారిని మీ మీద ఆధారపడేలా చూడకండి. మీకు అకాల మరణం వస్తే వాళ్ళు అనాధలైపోతారు. వారి స్వశక్తి మీద ఆధారపడేలా తయారుచెయ్యండి. అలాగే మీరు కూడా వాళ్ళమీద ఆధారపడేలా జీవించకండి. వాళ్ళు వ్యతిరేకం అయితే మీ అంతిమ జీవితంలో క్షోభ మిగులుతుంది. మీ ఇంటి వద్ద ఏకాంతంగా, ప్రశాంతంగా కూర్చున్నప్పుడు మీకు తలంపులు వస్తాయి. వెంటనే వికల్పాలు, క్రోధాలు, దుఃఖాలు అన్నీ వచ్చేస్తాయి. దాని ప్రధాన కారణం దేహం నేను అనే తలంపు. ఆ సటిల్ పాయింట్‌ని మీరు గుర్తించి అందులోనుండి విడుదల పొందాలి. ఈ చావులు పుట్టుకలు అన్నీ తలంపులే. అన్నీ అజ్ఞానాన్ని (దేహాత్మ భావనను) చుట్టుకొని ఉంటాయి.

59. ప్రార్థించే నోటికన్నా పనిచేసే చేతులు మిన్న అంటే భగవంతునికి ఇష్టం. మీ పట్ల ఎవరికైనా క్రూరత్వం, అసూయ కలిగి ఉంటే వారికి మీరు ఉపకారం చెయ్యాలనే బుద్ధి కలుగకపోతే వారి పరిస్థితులు మీకు తెలియక

పోవడం వల్ల ఆ విపరీత భావాలు వస్తూ ఉంటాయి. వారిని అవగాహన చేసుకునే బుద్ధి లేకపోవచ్చు. వారి మీద మీకు ప్రేమ తగ్గిపోవడం వల్ల అలా జరుగవచ్చు. మనకు భగవంతుడు కావాలని అనుకొంటే సమాజాన్ని అనుకరించకూడదు. సమాజం ఎప్పుడూ రాగద్వేషాలతో ఉంటుంది. మిమ్మల్ని ఎవరైనా విమర్శిస్తుంటే కంగారుపడకండి. ఆత్మవిశ్వాసం చెడగొట్టుకోనక్కరలేదు. అలా చేస్తే అది మీ బలహీనత. విమర్శలకు ద్వేషమే ఎక్కువ కారణం. ఏదైనా పని చేస్తున్నప్పుడు ఎవరో చేస్తున్నారని మనం చెయ్యకూడదు. అది మన అంతఃకరణానికి అనుకూలంగా ఉందా? లేదా? భవిష్యత్తులో దీని ప్రభావం ఎలా ఉంటుంది? దీని వలన మనకు శాంతి వస్తుందా? అన్నీ ఆలోచించి నిర్ణయించుకోవడం స్వధర్మం. ఎవరో చేస్తున్నారని మనం చేయడం పరధర్మం. అది దుఃఖాన్ని ఇస్తుంది. స్వధర్మం సుఖాన్ని ఇస్తుంది అని పరమాత్మ చెప్పాడు. మనం వినేది, చూచేది, ఆలోచించేది, ఊహించినది నిజంకాదు. ఎందుచేతనంటే అసలు వస్తువు మనం చూడడానికి, వినడానికి, ఊహించడానికి అతీతం. అది ఎవరో అనుకోవద్దు. అది మనమై ఉన్నాము. లోచూపు వల్ల ఆ వస్తువు మనకు ఎరుకలోకి వస్తుంది. మీకు బాహ్యంగా ఎన్ని కోట్లు ఉన్నా హృదయంలోకి రానివ్వకు. బయట గొడవలు అన్నీ బయటే ఉంచండి. మీకు ఎంత డబ్బు ఉన్నా, చదువు ఉన్నా ఇముడ్చుకోవడం మానేసి అస్తమాను కక్కేస్తున్నారు అనుకోండి మీ స్వరూపానికి దూరమవుతారు. పంచదార డబ్బాలోకి చీమ వెళితే ఆ డబ్బాలో నుండి బయటకు రాదు. బయట రుచి ఇలా ఉండదని దానికి తెలుసు. అలాగే మనస్సు బ్రహ్మానందసుఖం ఒక్కసారి రుచి చూస్తే ప్రకృతి విషయాల పట్ల ఆసక్తి కలుగదు.

60. మనకు సహృదయం, సద్బుద్ధి ఉంటే మన బుద్ధే మనకు పాఠాలు చెబుతుంది. మన బుద్ధిని కాపాడుకోలేకపోతే మనకు ఎంత ధనం ఉన్నా, ఎంత అధికారం ఉన్నా ప్రయోజనం లేదు. మనం స్వార్థంతో పనిచేయడం వల్ల పాత వాసనలు అలాగే ఉంటాయి. కొత్త వాసనలు





కలసి పునర్జన్మలు పెరిగిపోతాయి. స్వార్థం లేకుండా ఈశ్వర ప్రీతి కోసం పనిచేస్తే పునర్జన్మలు తగ్గుతాయి. చెడ్డ పని చెయ్యాలని ఎవరికీ ఉండదు. చాలామంది చెడ్డపని ఎందుకు చేస్తున్నారు? ఆశ వల్ల అని పరమాత్మ చెప్పాడు. మీకు ఏదైనా కోరిక ఉంది అనుకోండి దానిలో నుండే కోపం వచ్చేస్తుంది. మీ పని ఎవరైనా చెడగొడితే వాడి మీద ద్వేషం, కక్ష వచ్చేస్తుంది. మీకు ఏరకమైన కోరిక ఉన్నా అన్ని చెడ్డగుణాలు ఉన్నట్లే. మీరు ఒక మాట మాట్లాడితే పదిసార్లు ఆలోచించి మాట్లాడాలి. మీకు బయట కారణాల వల్ల సంతోషం వస్తున్నా, దుఃఖం వస్తున్నా, వాటిని బయట వదిలేయండి. వాటిని లోపలకి తీసుకుంటే విషమై మిమ్మల్ని మోక్షానికి రానివ్వదు. దారిలోనే అడ్డంగొట్టి బయటకు గెంటేస్తుంది. భూతకాలం మోసే వాడికి బ్రహ్మజ్ఞానం ఏమిటి? ఇతరులతో పోల్చుకుంటే పాపం పెరుగుతుంది. పెళ్లి అయ్యింది అంటే పెద్ద మాయలో పడినట్లే. ఈ సృష్టి నడవాలి కదా! అందుకే ఈశ్వరుడు అలా నిర్ణయించాడు. అది ఆయన వల. మోహము, సత్యము మనలోనే ఉన్నాయి. మోహాన్ని త్యాగం చేస్తే సత్యానుభవం కలుగుతుంది. సాత్వికబుద్ధి ఉన్నవాడికే కామం చెడ్డది. బుద్ధిహీనులకు, కాముడికి కామం చెడ్డది కాదు. సూర్యుడు అరగంటలో అస్తమిస్తాడు అనుకోండి ఇప్పుడే అస్తమించాలి అనుకుంటే అది జరిగేపని కాదు. అలాగే మన పనులు ఇప్పుడే పూర్తికావాలి అనుకోకూడదు. అది జరిగే టైంలో అది జరుగుతుంది. ఈ ప్రపంచాన్ని ప్రాతిభాసిక సత్యము అంటారు. 'ఉన్న దానిలా కనిపిస్తున్నది' అని అర్థం. దీని అంతరార్థాన్ని పై సంకటస్థితిలో గుర్తుంచుకుంటే దుఃఖం రాదు. మీ సంతానంలో ఒకడు సరిగా చదవడంలేదని మీరు బెంగపెట్టుకోకూడదు. వాడికి మంచి బుద్ధిని కల్పించమని భగవంతుని ప్రార్థించాలి. ఆ ప్రార్థనకు ఫలితం ఉంటుంది. "మన ఇంట్లో మగ బిడ్డ పుడితే సంతోషిస్తారు. పుట్టినవాడు ఏడుస్తాడు. మనం ఏడుస్తూ పుట్టినా సంతోషంతో మరణించాలి" అన్నారు కబీర్.

61. ఒకడికి కాళ్ళు బాగనే ఉన్నా కాలికి బూట్లు కొనే శక్తిలేక బాధ

పడ్డాడు. వానికి ఒకరోజు వంకర కాళ్ళు గలవాడు, బూట్లు తొడగడానికి వీల్లేని వాడిని చూచి వాడికి అప్పుడు ఇలా అనిపించింది "వాడి మీద నేను మెరుగు. నాకు కాళ్ళు సవ్యంగా ఉన్నాయి" అని దేవునికి కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. బాధ పోయింది. "జీవితంలో తృప్తిగలవాడే ధన్యుడు". ఇంగ్లీషు సామెత. ఇతరుల మీద ఆధారపడితే ధర్మానికి విరుద్ధంగా, అన్యాయంగా వ్యవహరించవలసి వస్తుంది. ఇరువది నాలుగు గంటలు మీ గురించి, మీ ఇంటి గురించి ఆలోచిస్తూ ఉంటే ఆత్మజ్ఞానం ఎలా వస్తుంది? శరీరంలో ఎముకలూ వగైరా ఉంటాయి. అది ఒక పురం, మనస్సులో కోరికలు ఉంటాయి అది ఒక పురం. ఇవికాక అనేక జన్మల నుంచి పోగుచేసుకున్న వాసనలు అనే కారణ శరీరం ఉంటుంది. అది ఒక పురం. ఈ మూడు పురాలను ఛేదిస్తేనే జ్ఞానం కలుగుతుంది. నీకు ఏదైనా దుఃఖం మీద పడుతున్నా ప్రతిఘటించకు. ఈ శరీరాలు అన్నీ మాయా శరీరాలు, మనస్సు కల్పించే శరీరాలు. విధురునితో ద్రౌపది అంటుది "ఎన్నో అవమానాలు భరించవలసి వస్తుంది" అంటే ఆయన "మహా విష్ణువును స్మరించుకో. నీ దుఃఖం కనబడదు. అవమానం అవమానంగా కనబడదు. ఆ దుఃఖ మేఘాలు ఎన్ని ఉన్నా ఆయన స్మరణలో కొట్టుకుపోతాయి. ఈశ్వరానుగ్రహం ఉంటే కష్టం సుఖంగా మారిపోతుంది" అన్నారు. మీకు వెయ్యి ఎకరాల పొలం ఉంది అనుకోండి. నాది అనుకోకపోతే సంతోషం రాదు. మీకు ఒక్క ఎకరం ఉంటే అది నాది అనుకుంటే సంతోషం వచ్చేస్తుంది. వాటి ద్వారా సంతోషం తీసుకోకూడదు. తీసుకుంటే పూర్తిగా విఫలం అవుతావు. బయట గొడవలు బయటే వదిలేయండి. మీరు గుడుల చుట్టూ తిరిగినా మంత్రజపాలు చేసినా భయం పోదు. హృదయాంతరాళాలలో మీకు వైరాగ్యం ఉంటే భయం పోతుంది. అజ్ఞానం ఉంటే నీకు కోరిక వస్తుంది. నీకు తప్ప ఆలోచన లేకపోతే ఆందోళన రాదు. మనస్సుతో తాదాత్మ్యం పొందినంతకాలము భయం నిన్ను వెంటాడుతుంది. అంతకాలం బంధువులు, స్నేహితులు, విరోధులు ఉంటారు. అంతకాలం మా చుట్టాలు, మా చుట్టాలు





అని చెప్పకొని తిరుగుతూ ఉంటావు. అది ఒక సంతృప్తి.

62. మీరు చదువుకున్న చదువు నిజమైతే మీరు అణిగి ఉంటారు. మీరు ఎగిరెగిరి పడుతూ ఉంటే మీరు చదివింది మీకు అర్థం అవ్వలేదని అర్థం. రాగద్వేషాలు లేని మనిషిని చూచే కొలదీ చూడాలని అనిపిస్తుంది. అది లోపల ఉన్న జ్ఞానం యొక్క వైభవం. ఎక్కడ భగవంతుడు అంతర్యామిగా ఉన్నాడో అక్కడ నుండి ఈ "నేను" వచ్చింది. అందుచేత అది దేవుడి సొమ్ము. దేవుడి సొమ్ము దేవుడికి ఇచ్చేస్తే పీడ విరగడైపోతుంది. ఆ పని మనకు చేతనవడం లేదు. వాడిని లోపలకు వెళ్ళమంటే ఎగిరెగిరి బయటకు వచ్చేస్తున్నాడు. అలవాట్ల యొక్క వేగం వాడిని బయటకు తీసుకొచ్చేస్తుంది. "అహంకారం సంతృప్తి కోసం పని చెయ్యమని చెప్పలేదు, చిత్తశుద్ధి కోసం పని చెయ్యమని చెప్పాడు పరమాత్మ". కానీ మనం అహంకారం సంతృప్తి అయ్యే పని చేస్తాము. దానికి సంతృప్తి లేని పని చెయ్యము. మనం బొత్తిగా మొద్దుబారిపోయాము. సంకెళ్ళు అనేవి బయట ఎక్కడాలేవు మన కోరికలు, మన సంకల్పాలు, మన తలంపులే మనకు సంకెళ్ళు. అందుచేత సాధ్యమైనంత వరకూ వాటిని తగ్గించుకోవాలి. అవి అంత తొందరగా తగ్గవు. మీరు ప్రయత్నం చెయ్యాలి. ఈశ్వరానుగ్రహం ఉండాలి. భగవంతుడు లేడు అనేవాడు క్రమంగా వినాశనమవుతాడు. మనం డబ్బుని మూట కట్టుకుని తెచ్చుకోకపోయినా పెద్ద పెద్ద కర్మలనే మూటలను కూడా తెచ్చుకున్నాము. మనం పుణ్యం చేసుకున్నా, పాపం చేసుకున్నా ఆ మూటలు ఎన్నో జన్మల నుండి మన కూడా వస్తూ ఉంటాయి. మనం ఏ స్థాయిలో ఉన్నా మూటల వల్లనే తలరాతలు వస్తాయి. భగవదనుభవం పొందేవరకు మనం ఎంత చదువు చదివినా భగవంతుని మాయ నిజంగానే కనిపిస్తుంది. భౌతిక దేహం ఎందుకు వస్తుంది అంటే అది లేకపోతే ప్రారబ్ధం మనకి అనుభవంలోకి రాదు. కర్మ ఎలా చేస్తే తిరిగి జన్మరాదో అలా చెయ్యాలి. శరీరం వచ్చింది అంటే దుఃఖం వచ్చి తీరుతుంది. దుఃఖం రాకుండా ఉండాలి అంటే, శరీరం రాకుండా చూసుకోవాలి. అంటే సత్యాన్ని దర్శించాలి.

భోగదృష్టి, కోరికలు ఉన్నంతకాలం శరీరం వచ్చి తీరుతుంది. ఆసక్తి లేకుండా పని పని కోసమే చెయ్యాలి. పనిచేత మనం బంధింపబడకూడదు. మనస్సు పెరిగే పనులు చెయ్యకూడదు. పాపపు తలంపులు రాకుండా చూసుకోవాలి. ఎక్కువ పాపపు తలంపులు వచ్చేస్తూ ఉంటే పాపం చేసేస్తాము.

63. రూపబుద్ధి, నామబుద్ధి మీద మనస్సు ఆధారపడితే దానికి ఆహారం సమకూర్చుకొంటున్నాము. సాధనా గమ్యం మనో నాశనానికే. ఎవరైతే తనను తాను పోగొట్టుకుంటారో వారికి సత్య వస్తువు దొరుకుతుంది. ఆత్మజ్ఞానం సంపాదించాలంటే ఆత్మ గుణాలైన కళ్యాణగుణాలను సంపాదించాలి. దానితో మనస్సు చంపబడుతుంది. అప్పుడు సహజంగానే జ్ఞానం కలుగుతుంది. చావులు, పుట్టుకలు ఆరోపించబడినవి మాత్రమే. సత్యానికి వీటితో సంబంధం లేదు. దేహంతో తాదాత్మ్యం చెందితే దానిలో మునిగిపోతావు. దేహాన్ని మీ పేరును మరచిపోండి. ఈ క్షణంలో మీరు సత్యాన్ని దర్శిస్తారు. సత్యదర్శనం కాని వానిని లోకం దానిలోంచి బయటకు రానివ్వదు. నిజం మీకు తెలిసేవరకు నిజం మీద ఆధారపడినవి అన్నీ నిజమని అనిపిస్తుంది. సత్యాన్వేషకులకే ఇంట్లో వాళ్ళు శత్రువులవుతారు. వాళ్ళు మనకు కాకుండా పోతారే అనిపిస్తుంది. నిజంగా వచ్చిన భయం కంటే ఊహించుకున్న భయమే ఎక్కువ. రాగద్వేషాలనే బయట గొడవల ప్రభావం మనస్సు మీద పడకుండా చూసుకోవాలి. ఎవరైతే మిమ్మల్ని వ్యతిరేకిస్తున్నారో వారే మీ కడసారి రోజుల్లో మిమ్మల్ని చూడవచ్చు, కాబట్టి ఎవరి మీదా ద్వేషం వద్దు. సత్యాన్వేషణే గమ్యంగా పెట్టుకున్నవారికి కోపము, కోరిక, భయము లాంటి చిన్న చిన్న సంస్కారాలు క్రమంగా నశించిపోతాయి. ఇంద్రియ నిగ్రహము, బుద్ధికి వివేకం పెరిగే కొలది మనస్సు అదుపులోకి వస్తుంది. ఆచార్యులవారు అన్నారు "సంసారంలో సారం లేదు. సారం లేనిది సంసారం. వివేకం పెంచుకుంటే ఆకర్షణలు తగ్గిపోతాయి. రైలు పట్టాలు అక్కడక్కడా వంకర్లు తిరుగుతూ ఉంటాయి. ఆలాగే జీవితం కూడా ఎన్నో వంకర్లు తిరుగుతూ ఉంటుంది. నీకు ఒక ప్రదేశం మీద అనుబంధం ఉంటే నీకు స్వేచ్ఛ లేదు. స్వేచ్ఛ లేకపోవడం పాపంతో





సమానం. నీవు నీ కుటుంబ సభ్యుల మీద లేదా బయట వ్యక్తులమీద శాంతి కోసం ఆధారపడ్డావంటే నీకు అశాంతే. అది స్వేచ్ఛ గల సుఖం కాదు. స్వతంత్రంగా జీవించి ఆ పరమశాంతిని సంపాదించు. ఒక మనిషి యొక్క ఔన్నత్యం బాహ్య జీవితంపై నిలబడేది నిజం కాదు. వారు లోపల కుళ్ళిపోయి ఉంటారు. శరీరాలన్నీ బొమ్మలే. ఒక బొమ్మతో స్నేహం, ఒక బొమ్మతో విరోధం. ఈ ఆటలో ఏడుపు పుట్టిన తరువాత ఈశ్వరుడు తన ఒడిలోకి తీసుకుంటాడు. మనందరం పాడైపోవడానికి కారణం దేహాభిమానమే.

64. అమ్మాయికి పెళ్లి చేసి అత్తవారింటికి పంపించేటప్పుడు తల్లి ఏడుస్తుంది. ఇంతకాలం పెంచాము అని అలాగే జీవలక్షణాలు పోయి ఆత్మానుభవం పొందేముందు ఆ జీవలక్షణాలు విడిపోయేటప్పుడు కొంత దుఃఖం వస్తుంది అని శాస్త్రంలో చెప్పబడింది. నారాయణుడు తన స్వరూపాన్ని ఇవ్వడానికి నీ మనస్సు ఏ పరిస్థితులపైన, వ్యక్తులపైన ఆధారపడి ఉందో వారిచేత తిట్లు తినిపించి బయటకు లాగుతాడు. మమకారం తగ్గడానికి అలా చేస్తాడు. అది గ్రహించి సమాధానపడాలి. వివేకానంద అనుకునేవారు "ఇంట్లో సభ్యుల మీద మమకారం ప్రపంచమంతా విస్తరిస్తే ఎంత బాగుండును" అని. మమకారం ఉండగా చిత్తశుద్ధి రాదు. ఇతరులను పరిశీలిస్తే నీకు ఏమీ కలసిరాదు. చీకటి లోకాలకు వెళ్ళిపోతావు. నిన్ను నీవు పరిశీలించుకోవడం వివేకం. నీవు వేదన పడటం వల్ల నిన్ను ఆశ్రయించిన వారికి ఏ ప్రయోజనమూ లేదు. వారి ప్రారబ్ధ ప్రకారం అంతా నడుస్తుంది. మనస్సులో వేదన పెట్టుకోవడం వల్ల వివేకం చచ్చిపోతుంది. పూర్తిగా పాడైపోతావు. బాహ్యంగా నీ దృష్టి ఉన్నంతకాలం నీకు కల్మషాలు అంటుకోకుండా ఉండవు. పది ఆవులు ఉన్నాయి అనుకోండి మీరు దూడను విడిచిపెడితే అది దాని తల్లిదగ్గరకే వెళ్ళి పాలు త్రాగుతుంది. అదేవిధంగా నీవు చనిపోయి ఏ లోకానికి వెళ్ళినా నువ్వు చేసిన కర్మ నీ దగ్గరకు వచ్చి నామాట ఏమిటి? అంటుంది. అది నీకు అనుభవంలోకి వచ్చేవరకు కర్మ నిన్ను విడిచిపెట్టదు. మీ ఇంట్లో పదిమంది ఉన్నారు అనుకోండి ఎవరి కర్మ

వారిదే. అందుచేత జతలు వేసుకోవద్దు. మీ డ్యూటీ మీరు చెయ్యండి. "నాకు అలా తోచింది అలా చేసాను అంటారు" అది బుద్ధిగతమైనది. శాస్త్రం చెప్పినట్లు చేస్తేనే శాంతి వస్తుంది. "దేహం నేను అనే తలంపుతోనే అనేక జన్మల్లో అనేక పనులు చేసావు. మరల దేహం నేను అనే తలంపుతోనే వాటిని అనుభవించాలి" అన్నారు ఆచార్యులవారు. శరీరంతో చేసే చెడు పనులకంటే మనస్సుతో చేసే చెడు పనులే ఎక్కువ. కళ్ళతో చూసిన ఎన్నో సంస్కారాలు మనస్సుకు అంటుకుంటాయి. విషయచింతన వలన ఎక్కువ పాడైపోతారు.

65. అన్నం తిన్న తరువాత కంచాన్ని కడిగి ఒక ప్రక్కన పెడతాము. అలాగే ప్రపంచంలో ఎంతవరకూ ఉండాలో అంతవరకే ఉండాలి. ప్రపంచ సమీపానికి వెళితే అంటే ప్రకృతి మనుషులతో మమేకమైతే "మనం భగవంతునికి సంబంధించిన వాళ్ళమే అనే ఆలోచన రానివ్వరు". దానితో తిరోగమనమే కానీ పురోగమనం ఉండదు. నీ మనస్సు వెనకాలే దేవుడు ఉన్నాడనే ఆలోచన రావడం లేదు. అన్ని మంచి చెడ్డలకు 'కీ' ఇచ్చేది భగవంతుడే. నీ గుణాలను బట్టి అలా చేయిస్తాడు. ప్రతీవారికి దేహం అంటే చాలా ఇష్టం. ఆ దేహంలో ఇంద్రియాలు ఉన్నాయి. దేహం లేకపోతే భోగాలను ఎలా అనుభవిస్తాడు? నోటి ద్వారా ఎన్నో తినవచ్చు, కళ్ళతో ఎన్నో దృశ్యాలు చూడవచ్చు. దానితో కర్మ చక్రంలో తిరుగుతాడు. బయట భోగం ఎంత అనుభవించినా దానికి పదిరెట్లు దుఃఖం అనుభవించాలి. ఇది యదార్థం. మీ శరీరానికి జ్వరం వస్తే ఓపికగా అనుభవిస్తే అది కూడా తపస్సే. ప్రారబ్ధం కొట్టే దెబ్బలు భరించడం కూడా తపస్సే. ప్రారబ్ధం కోపంగా అనుభవించకండి. ఇష్టంగా అనుభవించండి. లోకంలో కొందరు బాగుపడతారు, కొందరు చెడిపోతారు. బాగుపడేవారి మీద రాగం పెట్టుకోకూడదు, చెడిపోయే వారి మీద ద్వేషం పెట్టుకోకూడదు. వాళ్ళ దగ్గర నుండి పాఠాలు నేర్చుకోవాలి. దానికి భిన్నంగా ఉంటే కాలం పాడైపోతుంది, శక్తి నష్టం అవుతుంది. పుస్తకాలు నేర్పే పాఠాలకన్నా జీవితం





నేర్పే పాఠాల వల్లే జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలి. ఎవరినీ ద్వేషించకూడదు. ఎవరి మీద మమకారం పెట్టుకోకూడదు. సమతూకం గల బుద్ధి ఉంటే రాళ్ళతో కొట్టినా, పూలతో పూజించినా సమానంగానే ఉంటారు. బుద్ధికి స్థిరత్వం లేకపోతే పతనం ప్రారంభమవుతుంది. ఏసు "నీ కళ్ళు తప్పు చేస్తుంటే తప్పు చెయ్యవద్దు అని చెప్పు వినకపోతే పీకి అవతల పారెయ్యి" అన్నారు. ఎందుచేతనంటే "శరీరం మరణించిన తరువాత శాశ్వతంగా నరకంలో ఉండటంకంటే ఇప్పుడు బ్రతికిన కొద్ది రోజులు గుడ్డిగా ఉండటమే మేలు" అన్నాడు. సహనం ఉన్నవాడే సమస్యను పరిష్కరించుకొంటాడు. సహనం సత్త్వగుణంలోంచి వస్తుంది. సత్త్వగుణం వస్తే శాంతి కలుగుతుంది. ఇది కావాలి అనుకోకూడదు. అలా అనుకుంటే కోటి జన్మలు ఎత్తినా తరించలేవు. భగవంతుడు నీకు కేటాయించినది వచ్చి తీరుతుంది అనే విశ్వాసంతో జీవించాలి.

66. గొంగళీపురుగు పచ్చని ఆకుమీద వాలి పూర్తిగా తినేసి ఇంకో ఆకు మీద వాలుతుంది. దానిని తినేస్తుంది. అలాగే అహంకారం ఒక శరీరాన్ని పూర్తిగా కుళ్ళిపోయేలా చేసి, మరో శరీరాన్ని పట్టుకొంటుంది. ఎన్నో తింగరపనులు చేస్తూ సంస్కారాలను పెంచుకుంటూ ఉంటుంది. ఈశ్వరుని దయ లేకుండా ఈ విషయ వలయంలోంచి బయటపడలేము. "ఏదైతే ప్రకటితం కాదో అది అధిష్ఠానం, కనిపించేది లీల" అన్నారు పరమహంసగారు. దీనినే శంకరులు "మిధ్య" అన్నారు. రమణుడు "ఉన్న దానివలె కనిపిస్తున్నది" అన్నారు. ఇతరులను చూసి భయపడితే ధైర్యం తగ్గిపోయి మార్గం తప్పిపోతావు. తులసీదాస్ భార్య రత్నమాల సంసారం ఆరంభంలో భర్త తన మాయలో పడ్డాడని ఇలా అంది "ఈ శవాన్ని చూసి భ్రాంతి పడుతున్నావు. దానివల్ల సంసారం మిమ్మల్ని విడిచిపెట్టదు. గమ్యం తప్పిపోతారు" అంది. "శరీర పోషణకోసం కూడు-గుడ్డ-నీడ కోసం సంపాదించుకోండి, అల్లాను స్మరించుకోండి. ఎక్కువ సంపాదిస్తే సమాజానికి ఖర్చు పెట్టండి. అంతే కానీ ఆ డబ్బు చూసుకుంటూ ఉంటే అల్లాను మరచిపోతారు" అన్నారు మహమ్మద్ ప్రవక్త. దేవుడైనా శరీరం

ధరిస్తే తిప్పలు తప్పవు. శ్రీరామచంద్రుడే దానికి ఉదాహరణ. నిష్ఠ అంటే ఏకాగ్రత. ఓర్పు అంటే సహనం. దేహం మట్టిమయం, మనస్సు దుఃఖమయం, ఆత్మ ఆనందమయం. కర్మ ఖర్చు అయ్యే వరకు దేహం నేను అనే తలంపు పోదు. కర్మ ఖర్చు అయ్యాక దేహం నేను కాదు అనే అనుభవం కలుగుతుంది. ఎవరికైతే వైరాగ్యం, విచక్షణ, వివేకం ఉంటుందో వాడు మూల తలంపును తీసి ఒక ప్రక్కన పెట్టగలడు. అప్పడు నీ కర్మ భారం ఎంత బరువు ఉన్నా ఈశ్వరుడు మోస్తాడు. నీ మనస్సు భగవంతునికి తప్ప ఎవరికి ఇచ్చినా భంగపాట్లు తప్పవు. అశాంతి, దుఃఖం తప్పవు. అందరిలోనూ కలసి ఉండి, సేవ చెయ్యండి. కానీ వాళ్ళు మనవాళ్ళు కాదు మనం ఈశ్వరుని వాళ్ళమే అని ఆయనను గుర్తులో పెట్టుకొని జీవించాలి. దుఃఖానికి రూపం ఉందా? లేదు. నీవు అనుకొన్నట్లు జరిగితే సంతోషం జరగకపోతే దుఃఖం అంతకంటే దుఃఖం ఎక్కడ ఉంది? ఇష్టం లేని తలంపులను నిగ్రహించుకునే శక్తి నీకు వస్తే అది దుఃఖాన్ని తీసుకొనిరాదు. వీరు మనలను ద్వేషిస్తున్నారు అనే తలంపు లేకపోతే దుఃఖం రాదు. అది నేర్చుకో అప్పడు శాంతి కలుగుతుంది. నిరంతరం లోకాన్ని చింతించడం వల్ల మరలా దేహం వచ్చేస్తుంది. కారణం లోకంలో ఉన్న భోగాలను అనుభవించడానికి దేహం అవసరం అంతే కానీ భగవంతుడు జీవునికి దేహాన్ని ఇవ్వాలని ఇవ్వడు. కోరిక లేకపోతే శరీరాన్ని ఇవ్వనే ఇవ్వడు.

67. వృద్ధాప్యంలో మీ కుటుంబ సభ్యులు మిమ్మల్ని చూడటంలేదు అనుకోండి దానిని మీరు పదేపదే అనుకుంటూ ఉంటే మీ మనస్సు వేదనతో కుళ్ళిపోతుంది. అశాంతి వచ్చి పిచ్చిపడుతుంది. మన కాళ్ళమీద మనం నిలబడాలి. ఒక పని మనిషినిపెట్టి వండించుకోవాలి. లేదా వృద్ధాశ్రమానికి వెళ్ళండి. అంతేకాని వారికి ఎంతో ఉపకారం చేసాను అని బాధపడకండి. మనమంతా భగవంతునికి సంబంధించిన వారము. ఇంట్లో వారికి మనకి సంబంధం లేదు. ఇంట్లోకి కోడలు లేదా ఇంకొకరు ఎలాగూ వచ్చేస్తారు. దానిని గురించి పదేపదే అనుకోవడం వలన అశాంతి. మీ సుఖము, శాంతి మీ కోడలు మీద ఆధారపడి ఉందా? ఈశ్వర నిర్ణయంపై ఆధారపడి





లేదా? సాధనాబలం, సొంత ఆలోచన, పుణ్య సంస్కారం ఉంటే ఈ విష వలయంలో లోటును తెలుసుకోవచ్చును. ఏ మనస్సు అయితే నిన్ను హింస పెడుతుందో ఆ మనస్సు నీవుకాదు. ఈమాట నమ్మడం లేదు ఏమిటి? నిద్రలో ఆ మనస్సు ఏమైంది అని గ్రహించు. కర్మను అనుభవిస్తున్నాము అని చెప్పే మనస్స నీవు కాదు అని విశ్వసించడం లేదు ఏమిటి? శాస్త్రం ఇలా చెబుతున్నది “మనో నిగ్రహం లేకపోతే చదువుకున్నవాడైనా, అధికారంలో ఉన్నవాడైనా పశువే” అని. మన తప్పలు, బాధలు నక్షత్ర గ్రహాల కదలికపై లేవు. అవి కేవలం మన భవిష్యత్తును సూచిస్తాయి. దోషం మనలోనే ఉంది అది తెలుసుకోవాలి. ప్రారబ్ధం ప్రారంభమైన తరువాత తెలుస్తుంది. కర్మలు అనుభవిస్తున్నాము అనుకొంటాము. ఇది అంతా ఈశ్వర ప్రణాళికను బట్టి జరుగుతున్నది. ప్రతీ నిమిషము, ప్రతీ చిన్న విషయానికి జాగరూకతతో ఉండండి. మనస్సు మాయలో పడకండి. నీళ్ళు ఏవిధంగా మన శరీరాన్ని శుభ్రం చేస్తాయో అలాగే మనస్సును ఎవరైతే శుభ్రం చేస్తారో వాళ్ళతో మనం స్నేహం చెయ్యాలి. అటువంటి గ్రంథాలు చదవాలి. 1. పరుష వాక్యలు పలుకకుండా ఉండటం వాక్కు తపస్సు. 2. మనస్సులో ఎప్పడూ మంచి తలంపులు తెచ్చుకోవడం మానసిక తపస్సు. 3. మంచి పనులు చేయడం శారీరక తపస్సు. వీటివల్ల జీవుడిని శుభ్రంగా ఉంచితే చైతన్యస్థాయి పెరుగుతుంది. జీవుడు కృతార్థుడు అవుతాడు.

68. నీటిని పల్లానికి వెళ్ళమని చెప్పనక్కరలేదు. దానంతట అదే వెళ్ళిపోతుంది. అలాగే జ్ఞానం, సహనం ఉన్నవారి దగ్గరకు పరుగు పరుగున వెళ్ళిపోతుంది. సహనం లేని వారి దగ్గరకు గెంటినా వెళ్ళదు. మానవులంతా సమానమే అయినా సమదృష్టితో వ్యవహరించాలని లేదు. మనలో ఏదో విశేషం ఉందని అందరూ అనుకోవాలని అనుకొంటాము. అక్కడే మనిషికి అనారోగ్యం ప్రారంభమవుతుంది. కృత్రిమ గౌరవాలకోసం బయటకు పరుగెడతాము. దానివల్ల మనస్సులో మలం పెరుగుతుంది. మనం ‘విమలం’ కావాలి. ఈ ప్రపంచంలో ఇది గొప్పది, అది గొప్పది అని మనం అనుకొంటూ

ఉంటాము. అవి గొప్పవి కావు. మనలోని సంస్కారాల వల్లనే అలా గొప్పగా కనిపిస్తాయి. ఉన్న వైభవం అంతా లోపలే ఉంది. మనం పోగొట్టుకోవలసిన లోపాలు కూడా లోపలే ఉన్నాయి. అన్ని జంతువులకంటే పెద్దది, గొప్పది అయిన జంతువు మనిషే. మిగతా జంతువులకు, ఈ జంతువుకు తేడా ఏమిటి అంటే దీనికి దేవుడు ఆలోచన పెట్టాడు. వీడికి ఉన్న ఆలోచనలు సద్వినియోగం చేసుకొంటే, పశుపతిని (శివుడిని) తెలుసుకొంటాడు. ఉన్నది ఏదో ఉంది. లేనిది ఏదో లేదు. అంటే (భగవంతుడు ఉన్నాడు, సృష్టిలేదు) ఈ మాట మీ బుర్రలో బాగా తిప్పకోండి. మాట, చేత, ఆలోచన వల్ల మనసు పెరగకుండా చూసుకోండి. ప్రపంచాన్ని జయించడం అంటే భూమిని అంతా ఆక్రమించుకోవడం కాదు. ప్రపంచంలో ఉన్న రాగద్వేషాలు, ప్రాపంచిక గొడవలు మీ మెదడులో పడకూడదు. కృష్ణుడు ఒకచోట "నీకూ నాకు అనేక జన్మలు గడిచాయి" అన్నది వ్యవహారిక సత్యం. ఒకచోట "నీవు లేవులేవు నేను లేను ఉన్నది ఏదో ఉంది" అన్నది చివరి తీర్పు. ఆ మాట ఒకస్థాయి గలవారికి మాత్రమే అర్థమవుతుంది. ముందు చెప్పిన వాక్యం వాడి మనస్సు స్థాయినిబట్టి చెప్పినది. రాముని తమ్ముళ్ళు రాముడిని రాముడిలా చూడలేదు. భగవంతుడిగా చూసారు. మన దృష్టిలో వారు అన్నగారు మీలో స్పష్టత వస్తే స్వామిని మీరు విడిచి పెట్టరు. నన్ను స్మరించుకోండి అని పరమాత్మ ఎందుకు చెప్పాడంటే "మీకు బ్రహ్మపదార్థం తెలియకపోయినా అది నేనై ఉన్నాను. ఈ ద్వైతం నేను ఎందుకు చెబుతున్నాను అంటే అద్వైతంలోనికి తీసుకొని వెళ్ళడానికి. రూపం అంటే నీకు ఇష్టం కాబట్టి. బ్రహ్మానికి అసలు రూపం ఉందా? కాని నా రూపాన్ని ఇష్టపడితే నీవు ఏదిగా ఉన్నావో ఆ స్థితిని ఈ రూపం నీకు పట్టి ఇస్తుంది. దాని అర్థం అది" అన్నారు.

69. చైతన్యం అనుభవంలోనికి వచ్చాక ఎవరూ ఎవరికీ ఏమీ కారు. మనస్సు కల్పించినవే కూతుళ్ళు, అల్లుళ్ళు, కోడళ్ళు, తోబుట్టువులు. ఇంద్రియాలకు అందేవి అన్నీ అసత్యాలే. శరీరాన్నిబట్టి చుట్టాలు. చాణక్యుడు





"నీవు పాడైపోతే చూడాలనేవాళ్ళు చుట్టాలేమిటి? మనస్సుతో వాళ్ళను ఎందుకు మోస్తావు. బెంగ ఉంటే అది బరువు అవుతుంది. నీవు ఎప్పుడు చనిపోతావా అని అనుకునేవాళ్ళ గురించి నీవు ఏడవటం ఏమిటి?". ఈ ఒక్క మాట గుర్తుపెట్టుకుంటే చాలు. నీ హృదయంలో భగవంతునికి స్థానం ఇవ్వాలి. ఎవరైతే మిమ్మల్ని తిడతారో వాళ్ళ నోరే నొప్పి పుడుతుంది. మీకు నష్టం ఏమిటి? నీలో చెడ్డను తొలగించుకోవడానికి అవి ఉపయోగ పడతాయని తెలియాలి. నీ శరీరానికి రోగం వస్తే బయటకు గెంటటానికి ప్రయత్నం చేస్తావు. అలాగే నీ స్నేహితులు, చుట్టాలు నీకు నష్టంతెచ్చే వారితో విరోధపడకుండా దూరంగా ఉండాలి. వాళ్ళను మనస్సులోనుండి బయటకు గెంటాలి. ఎవరినైనా చూస్తూ ఉంటే ఇష్టం వస్తుంటే ద్వేషం ఉన్నట్లు లెక్క. ఈ రెండింటిని శని అంటారు. వాటిని తొలగించుకోవాలి. "ఇతరులు ఎంత చెడ్డవారైనా వారి విషయంలో ద్వేషం పనికిరాదు" అన్నారు భగవాన్. అలా ఎందుకు అన్నారంటే ద్వేషం వల్ల మనస్సు బాహ్యముఖమైపోతుంది అని అర్థం. ఏదైతే సత్యమో అది అనుభవంలోకి వచ్చిన వారికి చూడడానికి, వినడానికి ఏమీ లేదు. జ్ఞానికి అంతా మాయే. ఏమి చూస్తాడు? ఏమి వింటాడు? సూర్యుడు ఉదయించగానే చీకటి అంతా కొట్టుకొనిపోతుంది. మనకు అసాధ్యమైనది, దేవుడికి కూడా అసాధ్యమే అనుకోవడం వల్ల భయం కలుగుతుంది. గోవర్ధన పర్వతం పిల్లవాడైన కృష్ణుడు ఎత్తడం ఏమిటి? అది కూడా చిటికెన వ్రేలుతో అని అపనమ్మకంతో తీరా పడేస్తే ప్రమాదమని కొండ క్రిందకు వెళ్ళలేదు. కాని వర్షం బాధకు తట్టుకోలేక చివరకు వారూ వెళ్ళారు. విశ్వాసపాత్రులు ముందే వెళ్ళారు. దేవునికి అంతా సాధ్యమే. లోపల ఉన్న వస్తువు శరీరంలాగ, మనస్సులాగ ఉందేమో అని ఇలా ఊహించు కోవడం వల్ల మనం సబ్జెక్టు విన్నా స్పష్టత రావడంలేదు. మనం ఊహించు కొన్నట్లు అది లేదు. అది ఎలా ఉండాలో అలా ఉంది. మనం మనస్సు అనే జైలులో ఉన్నాము. అది ఎలా చెబితే అలా చెయ్యడానికి అలవాటు పడిపోయాము. ఇలా మనస్సుకు పాలేరుతనం చేస్తూ చనిపోతున్నాము.

మనస్సు అనే జైలునుండి బయటకు వస్తే స్వేచ్ఛ, ఆనందం లభిస్తాయి.

70. శరీరం నీవు అనుకోవడం పెద్ద తప్పు, నీవు ఇంకో తప్పు చేస్తున్నావు. ఇంట్లో వాళ్ళు అంతా నీవాళ్ళు అనుకొంటూ వారి కష్టాల్లో నీవు ఏడుస్తున్నావు. మీ పిల్లలు, మీ మనుమలు, మీ భర్త లేదా మీ భార్య అందరూ మీరే. ఇదేమి పద్ధతి. మీ అబ్బాయికి జ్వరం వస్తే వైద్యం చేయించండి. నీకు వచ్చినట్లు ఏడుస్తున్నావేమిటి? వాడు నీవు ఎలా అవుతావు, నీవు పుట్టినప్పుడు వాడు పుట్టాడా? నీవు చనిపోతే నీకూడా వస్తాడా? లేదా మీ అబ్బాయి చనిపోయినప్పుడు మీరు చనిపోతారా? వాడే నీవు అనుకొంటే ఎంత మూర్ఖత్వము. ఆ గొడవల్లోకి వెళితే అది మహా మాయ. మనం వెయ్యి కళ్ళతో చూచినా చీకటిని ఛేదించి వెలుగును చూడలేము. అసలు మనకు విశ్లేషణ లేదు, వివేకం లేదు. మీరు లోపల అన్వేషణలో ఉండండి. దేహప్రారబ్ధాన్నిబట్టి అన్నీ వస్తాయి. ఇలా జరుగుతున్నాయని, ఇలా జరుగుతుందేమో అని ఊహించుకోవడం వల్ల భయం వస్తుంది. భయం వల్ల లోపల ఎనర్జీ తగ్గిపోతుంది. ఎక్కువ భయపడే వాడికి మరుపు వచ్చేస్తుంది. రోగం తొందరగా వచ్చేస్తుంది. బయట శత్రువులు నిన్ను ఏమీ చెయ్యలేరు. లోపల కామ, క్రోధాలనే శత్రువుల వల్లనే ప్రమాదం. గౌరవం కోసం మనిషి పనిచేస్తే వాడు నీచాతినీచుడు. భగవంతుని ప్రీతికోసం పని చేసేవాడు ఉత్తముడు. అది యజ్ఞము. మీ డబ్బును మీ ఇంట్లో పెట్టుకోండి. మనస్సులో భగవంతుడిని పెట్టుకోండి. నాది-నేను అనే తలంపులే మహాపాపాన్ని తెచ్చిపెడతాయి. సీత లంకలో ఎలా ఉందో వాల్మీకి చెబుతూ నీళ్ళు లేని నదిలాగ, నీళ్ళు లేని కొలనులాగ, గ్రహణం పట్టిన సూర్యునిలా, కాళ్ళతో తొక్కిన పద్మంలా, నిందలు మోసిన కీర్తిలా, నాయకుడు చనిపోయిన సైన్యంలా, ధనం లేని వారు ఎలా ఉంటారో అలా, పూజ చేసుకుంటే మధ్యలో లేచిపోవలసి వస్తే ఎలా ఉంటుందో అలా ఉంది అంటూ భగవంతుని అనుగ్రహం లేకపోతే మనుషులు అలా ఉంటారు అన్నారు. దేహాభిమానం ఉంటే కామం, సిగ్గు పోదు. అందుకే శ్రీకృష్ణుడు చీరలను





దొంగిలించాడు. స్వరూప జ్ఞానం వచ్చాక కోరిక, కామం ఉండవు.

71. శరీరం ఉండగానే భయం, కోపము, అసూయతల యొక్క వేగాన్ని తగ్గించుకో. దేనికీ భయపడకు. భయపడితే నీ అవగుణాలు అన్నీ నీ సుఖానికి అడ్డు వస్తాయి. "బలవంతంగా నీవు ఏ పనీ చెయ్యవద్దు. నీవు కర్మకి యజమానిగా ఉండు. బానిసగా ఉండకు. ఏ ఋణ సంబంధమో, ఏదో చాకిరీ చేస్తున్నాము అని ఏడుస్తూ ఎంతకాలం పనిచేస్తావు" అన్నారు శ్రీకృష్ణుడు. మనం ఎదుటివారి మానసిక ప్రవృత్తిని బట్టి నడుచుకోవడం మంచిది. అలా ఉంటే గలాటాలు ఉండవు. అయితే వారి మనస్తత్వం వలన మనం పాడైపోకుండా ఉండాలి. మన స్వతంత్రం మనం పోగొట్టుకోకూడదు. బాహ్యంగా వారికి అనుకూలంగా ప్రవర్తిస్తున్నప్పటికీ లోపల మన జాగ్రత్తలో మనం ఉండాలి. మరణం పెద్ద త్రాచు పాము. నీ వెనకాలే ఎప్పుడూ ఉంటుంది. అది నిన్ను తరుముకొని వస్తుంది. ఎప్పుడు కాటేస్తుందో తెలియదు. కాబట్టి సాధనలో బహుజాగ్రత్తగా ఉండాలి. అలాగే మనలను నడిపేవాడు ఒకడు ఉన్నాడు. మన దేహప్రారబ్ధాన్ని బట్టి మనలను గెంటేస్తూ ఉంటాడు. తోలుబొమ్మలాటలో తోలుబొమ్మలకు స్వతంత్రం ఉంది అనుకోవడం ఎటువంటిదో మనకు స్వతంత్రం ఉంది అనుకోవడం అటువంటిదే. ఈశ్వర సంకల్పాన్ని అంగీకరిస్తూ ఉంటే దేహబుద్ధి నెమ్మదిగా తగ్గిపోతుంది. నామరూపాలను పచ్చడి చేయాలి. మాంసం యొక్క వికారమే శరీరం. శరణాగతికి నీవు సిద్ధం అవుతూ ఉంటే ఈశ్వరుడిని నీవు ఏమీ అడగకూడదు. బ్రహ్మం తప్పించి నేను-నాది అనేది అసత్యం. దేహప్రారబ్ధాన్ని బట్టి అన్నీ జరుగుతాయి. మీ కుటుంబంలో ఎవరైనా చనిపోతే ఎక్కడికి వెళ్ళిపోయారా అని తత్‌సంబంధమైన కర్మకాండలలో మునిగిపోతాము. కారణం దేహవాసన. మరి పుట్టడానికి ముందు వాళ్ళు ఎక్కడ నుండి వస్తున్నారో అనే ఆలోచన రాదు. అదే మాయ. మనకి విరోధులు ఉండవచ్చు. మనం ఎవరినీ విరోధిగా భావించకూడదు. వైరం వల్ల మనస్సు బాహ్యముఖమై అపకారం చెయ్యాలి అనే ఆలోచనలు

బయలుదేరతాయి. మనస్సులో కల్మషం పోతే ఏ అమృత స్థితిని పొందుతారో, ఎంత వైభవంగా ఉంటారో మీకు తెలియక దానిని పోగొట్టుకోవడానికి ప్రయత్నం చెయ్యరు. మనం చెరువు వద్ద కూర్చుంటే మన ప్రతిబింబం కనిపిస్తుంది. రాయి వేస్తే మన రూపం చెదిరి పోతుంది. అలాగే మన మనస్సులో కుటుంబంతో వచ్చే గొడవలన్నీ పెట్టుకొంటే మనస్సు కల్మషమై సత్యదర్శనం కలుగదు.

72. మన సంస్కారాలు మన హృదయంలో గూళ్ళు కట్టుకున్నాయి. వాటిని వివేక వైరాగ్యాదులతో నశింపు చేసుకోవాలి. లేదా మరణానంతరం అవి మనకూడా వస్తాయి. సత్యానుభవానికి అవి ఆటంకాలుగా మారతాయి. ప్రారబ్ధంలో ఉన్నప్పుడు ఏదైనా తప్పదు. సృష్టి అంతా మనస్సులో ఉంది. మనస్సు అణిగితే చావు పుట్టుకలు అణుగుతాయి. గౌరవం వస్తే గర్వం వస్తుంది. అవి అన్నీ మనస్సులో ఉన్నాయి. మనస్సును వదిలేస్తే గౌరవం, గర్వం పోతాయి. శవబుద్ధిలోనుండి విడుదల పొందటానికి కాలం వచ్చేవరకూ ప్రయత్నం చెయ్యాలి. అప్పడు దేవుని దయ కలుగుతుంది. యోగ్యత వస్తే ఆయన మీ పట్ల దయ చూపిస్తాడు. ఇంకా దయ రాలేదు అని ఎదురుచూడకండి. ఈశ్వరుడు ఈ శరీరాలను ఆయన చేతుల్లో పెట్టుకొని ఆడిస్తున్నాడు. సాధన చేసుకోండి కాని అవగాహన ముఖ్యం. ఆయన పన్నాగాల నుండి, నాటకాలనుండి బయటకు రావాలంటే శరీర అభిమానాన్ని వదిలేయాలి. అప్పడు దేవుడు కూడా ఏమీ చెయ్యలేడు. ఎన్ని గొడవలు వస్తే అన్నీ రానివ్వండి. రక్షకుడు ఒకడు ఉన్నాడని అనుకోండి. ప్రతీ అడుగు ఈశ్వర సంకల్పానికి భిన్నంగా జరగదు. ఆయనే ఉన్నాడు మనం లేము. ఇక మన ఇష్ట ప్రకారం ఏమీ చెయ్యలేము. ఉపయోగం లేని మాటలు అనవసరం. “కుటుంబంలో చిన్న చెడు తలంపుల వల్ల ఆ కుటుంబం నాశనమవుతుంది” అన్నారు వాల్మీకి. కైకేయి చెడు తలంపువల్ల దశరథుడు చనిపోయాడు, రాముడు అడవికి వెళ్ళాడు. ప్రతీ కుటుంబంలోనూ ఇలాంటి చెడు తలంపుల వల్ల సంసారాలు పాడవుతాయి.





దుఃఖం రావడంతో పాపం ఖర్చు అవుతుంది. మనం ఎంత కంగారుపడినా దేహం ద్వారా జరగవలసింది ఉంటే ఆపు చెయ్యలేము. ఏ ప్రారబ్ధం అనుభవించడానికి ఈ దేహం వచ్చిందో అది పూర్తి అయిన వెంటనే ఆ దేహం చనిపోతుంది. ఈ లోపల మనం ఆశ్చర్యపడటం ఎందుకు? ఇలా జరిగిపోయింది అనుకోవడం మన నోరు నెప్పి. ఠాగూర్ దేహాభిమానం గురించి చెబుతూ “ఒకడు బిందె తీసుకొని నదిలో నీళ్ళను ఇంటికి తెచ్చుకొని ఆ నీళ్ళు నావి అంటాడు. నదిలో నీళ్ళు ఉన్నప్పుడు వాటితో తాదాత్మ్యం లేదు. మనం తెచ్చుకున్నప్పుడు కూడా నీళ్ళు నదివే. ఎంత మాయ. అంటే నదిలో నీరు ఎలా పోయినా వాడికి అక్కర్లేదు. వాడి బిందెలో నీళ్ళు పోకూడదు. తాదాత్మ్యం వచ్చినప్పడు ఉన్నాయని, ఖర్చు అయ్యాయని లెక్క వస్తుంది. మనలో దేహాల తాదాత్మ్యం అటువంటిది” అన్నారు.

73. కాలాన్ని మూడు భాగాలుగా చేసుకోవాలి : 1. ఎవరిమీదా ఆధారపడకుండా జీవించాలి. 2. సమాజానికి ఉపయోగపడే పని చెయ్యాలి. 3. ఆత్మజ్ఞానాన్ని సంపాదించాలి. ఆత్మవిశ్వాసం లేకపోతే సాధన విషయం అలా ఉంచండి. భౌతికంగా కూడా ఏమీ సాధించలేము. ఇద్దరు ఉంటే ఒకరిమీద ఇష్టం - ఒకరిమీద అయిష్టం. ఒకటిగా ఉంటే ఇష్టఅయిష్టాలు ఎవరిమీద ఉంటాయి. జీవితం అంటే అలవాట్ల యొక్క సమూహం. నిన్ను నీవు ఉద్ధరించుకొంటూ ఉంటే అసూయ పడేవాళ్ళు లేకపోతే అదే వందకోట్ల ఆస్తి. లోకవిషయాలు ఆలోచిస్తూ ఉంటే కోరికలు కలుగుతాయి. రోజూ కోపం వచ్చేవాడికి వివేకం తగ్గిపోతుంది. శరీరాన్ని ఎక్కువ సుఖపెడితే అది అలవాటు అయిపోతుంది. రాగ-ద్వేషాల్లోంచి కర్మ పుడుతుంది. కర్మను బట్టి జన్మ వస్తుంది. జన్మనుబట్టి కర్మ వస్తుంది. ఇది ఒక విష వలయం. వాల్మీకి “నీ నెత్తిమీద ఏదైనా బరువు ఉంటే ఆ బరువు దింపేసాక హమ్మయ్య బరువు దిగిపోయింది. తేలికగా ఉన్నాను అనుకొంటావు. అలాగే నీ అహంకారమనే బరువు ఈశ్వరుని పాదాల చెంత పెడితే అప్పడు నీకు జీవన్ముక్తి స్థితి” అన్నారు. అంటే అహంకారాన్ని ఖాళీ చెయ్యాలి. అలా చేస్తే

నీకు సంపద ఉన్నా, పాండిత్యం ఉన్నా నిన్ను బాధపెట్టదు. భగవంతుడిని తెలుసుకోవడానికి ప్రేమ కావాలి. ఆ ప్రేమ భగవంతుడే ఇస్తాడు. ఆయన్ని తెలుసుకునే బుద్ధిని కూడా ఆయనే ఇస్తాడు. మన ప్రవర్తన ఎలా ఉంటే ఆయన ఎలా తెలియబడతాడో ఆ ప్రవర్తనను కూడా ఆయనే నేర్పుతాడు. మనకు తెలియబడటం అనేది కూడా ఆయనే చేస్తాడు. ఇక మీరు నేను ఎక్కడ ఉన్నాము. అంటే మన పొగరుబోతుతనంవల్ల మనం ఉన్నాము అనుకొంటాము. తులసీదాస్ "కామం తీగలాంటిది. స్త్రీలకు పురుషుడు, పురుషులకు స్త్రీ పందిరిలా కామమనే తీగ ప్రాకుతుంది. వివాహం దానిని పెంచేస్తుంది" అన్నారు. ప్రముఖస్థానం పొందాలని ఎవరూ అనుకోకండి. మనం కానిది మనం అనుకొనే కొలదీ ఏదిగా ఉన్నావో అది ఎరుకపడదు. భగవంతుడిని తెలుసుకొంటే ఆయనే అయిపోతాము. ఆయన పరిపాలన ఆయనే చూసుకొంటాడు. ఆయన స్వరూపమైన ఆనందాన్ని మనం గ్రహిస్తాము. అంతటా వ్యాపించినవాడే అంతర్యామిగా ఉన్నాడు. నేర్చుకొన్నవన్నీ మరచిపోవలసిందే. సంపాదన, చదువు అన్నీ మరచిపోతాము. దేనిగా ఉన్నామో దానిని విడిచిపెట్టము. శంకరాచార్యులు "సంసారమంటే అరిష్టం" అన్నారు. ఒక కష్టానికి ఇంకొక కష్టానికి మధ్య విరామాన్ని మనం సుఖం అనుకొంటున్నాము. సంసారమంతా కష్టాలమయమే. మన బాధ్యత మనం పూర్తి చెయ్యాలి. మనస్సులో సన్యాసం ఉండాలి. అలా ఉంటే మనకు ఏదీ అంటదు. రాగ-ద్వేషాలు, కామ-క్రోధాలు రెండూ ఒక్కటే. రాగం వల్ల కామం వస్తుంది, ద్వేషం వల్ల క్రోధం వస్తుంది.

74. జరిగిపోయిన గొడవలు రాపాడించుకోకూడదు. దానిని మరచిపోవాలి. ఆ పొరపాట్లు జరగకుండా చూసుకోవాలి. మీ ప్రారబ్ధంలో అది ఒక సంఘటన మాత్రమే. దానిని తలపెట్టుకోకూడదు. తలపెట్టుకొంటూ కూర్చుంటే దేహాలు ఎందుకూ పనికిరాకుండా పోతాయి. మీ ఇంట్లో ఉన్న వెయ్యిరూపాయల నోట్లను పొయ్యిలో పెట్టి కాఫీ కాయడం ఎంత తెలివి తక్కువ తనమో, మీ మనోదేహములను చిల్లర విషయాలకు ఉపయో





గించడం అటువంటిదే. మనకి కనిపిస్తున్న మనుషులనే అర్థం చేసుకోలేము. ఇక కనబడని దేవుడిని ఎలా అర్థం చేసుకుంటాము? మనకి వివేకము, సూక్ష్మబుద్ధి ఉండాలి. విచక్షణ ఉండాలి. అంటే మనకి ఏది మంచిది? ఏది చెడ్డది? ఉపకారం చేసేది ఏది? ఎవరితో స్నేహం చెయ్యాలి? ఎవరితో చెయ్యకూడదు? ఎవరికి దూరంగా ఉండాలి? అని సొంత ఆలోచన ఉండాలి. మనుషులలో చాలామంది గొఱ్ఱెలు. వాళ్ళు అన్నిటినీ అనుకరిస్తారు. మనం పవిత్ర జీవితాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, రెండూ అభివృద్ధి చేసుకోవాలి. వ్యర్థమైన సంతానం వల్ల తల్లి, తండ్రుల జీవితం కాలిపోతుంది. వారిని విడిచిపెట్టలేరు. వారు పాడైపోయినా వాళ్ళను ఉద్ధరించాలని అనిపిస్తుంది. కారణం మమకారం. ఇటువంటి సంతానం లేనివారే అదృష్టవంతులు. మనం దేహగతమైన చరిత్ర చుట్టూ తిరుగుతున్నాము. దానివల్ల మూర్ఖత్వం పెరుగుతుంది. దానిని అతిక్రమించాలి. "ఎవరినీ ద్వేషించకుండా దేనినీ కాంక్షించకుండా ఉంటే వాడే నిత్య సన్యాసి" అన్నారు పరమాత్మ. మనకు లేనిది ఇతరులకు ఉంటే ద్వేషం వస్తుంది. ద్వేషం ఎక్కడ ఉంటే అక్కడ కోరిక ఉంటుంది. కోరికలోనుండే కోపం వస్తుంది. కోరిక మనకు మిత్రుడిలా కనిపిస్తుంది. కాని అది శత్రువు. అది అపకారం చేస్తుంది. అందుచేత సాధకుడు "వారు అలా అన్నారు, వీరు ఇలా అన్నారు అనే అనుకరణ పనికి రాదు. మీ ప్రారబ్ధం మంచిది అయినా, చెడ్డది అయినా మీకు సంబంధం లేదు. అది నీవు కాదు మీ ప్రారబ్ధం నూరు శాతం చెడ్డది అనుకోండి శరీరం మీరు కాదని తెలిస్తే మీ ప్రారబ్ధం మిమ్మల్ని ముట్టుకోదు. మన దేహం మీద మోహం, ప్రేమ ఉన్నంతకాలం దుఃఖం వస్తుంది. ఇంట్లో వాళ్ళ మీద మోహం ఉంటుంది. కారణం వాళ్ళు తన దేహ సంబంధమైన వాళ్ళు అనే భావన వల్ల. మీకు లోక వాసన ఉంది అని కొండగుర్తు. మిమ్మల్ని ఎవరైనా పొగిడితే సంతోషం, విమర్శిస్తే దుఃఖం వస్తుంటే అది మీ బలహీనత అని, లోక వాసన అని గుర్తించి దానిని తొలగించుకోవాలి.

75. మీకు ఏ సంస్థ అయినా బిరుదు ఇస్తే మీరు అనుకుంటారు

"నాలో ఏదో ప్రత్యేకత ఉంది" అని. దానితో దేహాభిమానం పెరిగిపోతుంది. కాబట్టి వాటిని మనస్సులోనికి తీసుకోకండి. మీ దేహం మీద మీకు ఇష్టం ఉన్నంతకాలం మీ ఇంట్లో వారి మీద ఇష్టం పోదు. ఇంట్లో వారికి ప్రారబ్ధం ఉంటుంది. వారి గురించి నీవు ఏమీ చెయ్యలేవు. బాధ్యత చేసి వదిలేయాలి. మన బంధువులకు వాళ్ళ అహంకారం ముఖ్యం. మనం ముఖ్యం కాదు. దేవుడిని ఎవరు గమ్యంగా పెట్టుకుంటారో వారికి దుఃఖం రాదు. అమృతానుభవం పొందేవరకు నీవు వేరు, నేను వేరు అనే భావన పోదు. మీకు వచ్చే భయాలు 90% ఊహించుకోవడం వల్ల వస్తాయి. 30 సంవత్సరాల వయస్సు ఉన్నవానికి భయం వేస్తే తొందరగా ముసలివారు అయిపోతారు. ఎక్కడ ప్రేమ, ఆప్యాయత పెట్టుకోకూడదో అక్కడ వాటిని పెట్టుకుంటే నరకానికి మెట్లు కట్టుకున్నట్లే. అదీ నీ చావుకి కారణం అవుతుంది. నాది నేను అనే తలంపు నిన్ను పట్టేసుకుంది. అది ఎక్కడ పట్టుకుందీ గ్రహించి ఆ సంకెళ్ళను నరుక్కోవాలి. అవి గురువు దయ లేకుండా తెగిపోవు. మీరు గురువుని ప్రేమిస్తే మిమ్మల్ని నిజం దగ్గరకు తోలుకొనిపోతాడు. ఒక కోటేశ్వరుని కూతురు అపహరించబడి చనిపోయింది. ఆ చిన్నారికోసం తండ్రి ఇలా విలపిస్తాడు "అమ్మా! నీవు కోటీశ్వరుడి ఇంట్లో పుట్టడం వల్ల చనిపోయావు. పేదవాళ్ళ ఇంట్లో పుడితే చనిపోయేదానవు కాదు" అని ఆ బాధలో గుండెపోటు వచ్చి మరణించాడు. అదే అనుబంధం. అలాగే మనకు మరో రకంగా ఎదురుపడవచ్చు. అందుచేత అనుబంధం గురువు మీద పెట్టుకోండి. బెంగ ఉన్న వానికి ఎక్కువ భయం కలుగుతుంది. తల్లి ఇతరులతో "మా అబ్బాయి మంచివాడే, బుద్ధి మంతుడే, పెళ్ళి అయ్యాక మారిపోయాడు" అని అంటుంది. మారిపోవడం అంటే ఏమిటో మనకు తెలియదు. "ఈ రహస్యం అంతా కామంలో ఉంది" అన్నారు తులసీదాస్. వ్యక్తి భావనలోంచే గర్వం ద్వేషం వస్తుంది. నువ్వు ఫలానా వ్యక్తిని అనుకుంటున్నావు కాబట్టి ఇంకొక వ్యక్తిని చూచినప్పుడు ద్వేషం, గర్వం రావచ్చును. ప్రారబ్ధాన్ని బట్టే పాండిత్యం,





ఐశ్వర్యం వస్తుంది, పోతుంది. అవి నిజం కావు. శరీరాన్ని చంపడం వల్ల ప్రయోజనం ఏమీ లేదు. నేను-నేను అనే తలంపును చంపాలి. బ్రహ్మానికన్నా తాను వేరు అనే వేరుబుద్ధి ఉంది. శరీరం మనస్సుతో తాదాత్మ్యం చెందుతుంది. ఇలా భౌతిక భోగాలకు అలవాటుపడే నేనును దైవ చింతన చేయించాలి. విషయాన్ని అడిగి తెలుసుకునే వాడికి తొందరగా అజ్ఞానం పోతుంది. సిగ్గుపడి అడగకపోతే రాబోయే జన్మకు కూడా అజ్ఞానం వస్తుంది. ఆహార నిగ్రహం లేకపోతే ఇంద్రియాల మీద, మనస్సు మీద ఆధిపత్యం సాధ్యం కాదు. శరీరాన్ని సాధనకు ఉపయోగించుకోవాలి.

76. మిమ్మల్ని ఎవరైతే చూస్తారు అని అనుకుంటారో వాళ్ళు చూడరు. మాయ అంతా ఇక్కడే పెట్టాడు ఈశ్వరుడు. వాళ్ళ ప్రారబ్ధం వాళ్ళకు ఉంటుంది కదా! నూటికి 5% చూడవచ్చు. మిగిలినవారు చూడరు. అది ప్రారబ్ధాన్ని బట్టి ఉంటుంది. మీ లోపల బలహీనతలు అనే పాపపుసంస్కారాలు మీ మెదడులోకి తెలియాలి కదా! మీరు తప్ప చెయ్యకపోయినా కుటుంబ సభ్యులతో అనరాని మాటలు అనిపిస్తాడు ఈశ్వరుడు. దానికి మీరు కంగారు పడకండి. వాళ్ళద్వారా ప్రేరణ చేయించేది ఆయనే. వాళ్ళ అహంకారం ద్వారా వ్యక్తం చేయిస్తాడు. నిన్ను పవిత్రుడిని చేయడానికి ఆ పని మేలే చేస్తుంది. ద్వంద్వాలలో ఉండి కూడా నిశ్చలత్వంగా ఉంటే మీలో పక్వత వస్తుంది అని అర్థం. సంసారం కూడా రోగం. అది మాయలోంచి వచ్చింది. భగవంతుని దయ ఉంటే మాయ తొలగుతుంది. ఆలోచనబట్టి, తెలివినిబట్టి జన్మ రాదు, కర్మను బట్టి జన్మ వస్తుంది. ఎదుటివాడిలో ఉన్న మంచిగుణాలు కూడా చెడుగుణాలుగా కనబడితే వాడికి అసూయ ఉంది అని కొండగుర్తు. ఉన్నది ఉన్నట్లుగా చూడలేకపోతున్నావు. నీ కళ్ళల్లో ఉన్న దోషం నిజాన్ని నీకు తెలియనివ్వదు. మీకు ఎవరైతే ఇష్టమో వారు మిమ్మల్ని అటూ ఇటూ తన్నుతూ ఉంటే మమకారం తగ్గి వైరాగ్యం వస్తుంది. శరీరం సంసారంలో ఉన్నా మనస్సు సన్యాసిలా ఉంటే ఏదీ అంటదు. అలా కాకుండా శరీరానికి ఎర్ర బట్టలు చుట్టుకొని మనస్సులో సంసారం ఉండకూడదు. వివేకం వల్ల,

విచారణ వల్ల, ఆత్మచింతన వల్ల మీ హృదయంలోంచి వచ్చే సంతోషాన్ని "జాయ్" అంటారు. దానికి ముగింపు లేదు. అది స్వతంత్రమైనది. బాహ్య వస్తువుల మీద, వ్యక్తులమీద, సంపదల మీద నుంచి వచ్చే సంతోషం "ఎంజాయ్‌మెంట్" అంటారు. అది మొదట బాగానే ఉంటుంది. తరువాత విసుగు వస్తుంది. దుఃఖాన్ని తీసుకొస్తుంది. మీ ఇంట్లోవారు ఎవరైనా చనిపోతే దుఃఖం వస్తుంది. ప్రక్కవారు పోతే దుఃఖం రాదు. కారణం ఆవరణ దోషం. అదే జైలు. అలాగే మీ పిల్లలు బాగుంటే సంతోషం వస్తుంది. కారణం మమకారం. మనిషి జీవితాన్ని వాసనలే శాసిస్తాయి. మీరు ఆ వాసనలను బట్టి జీవిస్తారు. ఎవరు చెప్పినా వినరు. మిమ్మల్ని పాలించేవి ఆ వాసనలే కాబట్టి మనలోని వాసనలను, మన శరీరాన్ని, మనస్సును, ప్రపంచాన్ని అంటిపెట్టుకొనేలా చేస్తాయి. బయటకు కదలనివ్వవు. మనకి స్వేచ్ఛ లేదు. గుర్తింపు లేకుండా సమాజానికి సేవ చేస్తే ఆ వాసనలు రాలిపోతాయి.

77. భాగవతంలో ఒక మాట ఉంది "ఒక మేక పిల్ల ఉంటే దాన్ని తోడేళ్ళు పది నక్కలు పీక్కుని భక్షిస్తాయి. అలాగే ఇంట్లో యజమానిని ఇంట్లో పదిమంది సంతానం మాకు ఆ అవసరాలు ఉన్నాయి, ఈ అవసరాలు ఉన్నాయి అని ధనంకోసం పీక్కు తింటారు. నీవు ఎవరి యోగక్షేమాలకోసం నిరంతరం శ్రమపడి జీవిస్తారో చివరకు వారే నక్కల్లా తినేస్తారు. నీ ధర్మాన్ని నీవు నిర్వర్తిస్తూ మమకారం పెట్టుకోకు. మమకారంతో తాపత్రయపడితే నక్కలు సిద్ధంగా ఉన్నాయి. ఇలా ఉంటే మోక్షం మాట ఏమిటి? బాగుపడే వాళ్ళ గురించి సంతోషించి, పాడైపోయే వాళ్ళ గురించి దుఃఖం వస్తే సాధన ఎప్పుడు చేస్తావు? నీకు ఉన్న చుట్టాలు, స్నేహితులచుట్టూ తిరుగుతూ ఉంటే ఎప్పడో ఒకప్పడు చనిపోతావు. కాబట్టి దేహాభిమానం నుండి విడుదల పొందాలి. ఇంట్లో వాళ్ళు బాగుంటే లోపల నుండి సంతోషం తీసుకుంటే కాలప్రవాహంలో దుఃఖంగా మారిపోతుంది. బ్రహ్మంలో నుంచే ఆనందం తీసుకోవాలి. జ్ఞాని హృదయంలో బ్రతుకుతాడు. జ్ఞానికి భిన్నంగా





ఎవరూ లేరు. ఇన్ని రకాల దుఃఖాలు లేవు. కారణాలన్నింటికి కారణం దేహబుద్ధి. దానిని తొలగించుకోవాలి. "నీ మంచికి, నీ చెడుకు కర్తను నేనే" అనే పరమాత్మ మాటను గ్రహిస్తే ఏడుపు ఎందుకు వస్తుంది? తెలియక దుఃఖపడుతున్నాము. కొంతమంది పరిసరాలనుబట్టి బాగుపడిన వారు ఉన్నారు. కొన్ని పరిసరాలలో ఉంటే ఉన్న భక్తి కూడా పోతుంది. మన కర్మలను బట్టి వారు, వారి కర్మలను బట్టి మనము సిద్ధమవుతాము. ఆ కొంపల్లో ఒకరిని చూసి ఒకరు నవ్వుకోడవం, ఒకరిని చూసి ఒకరు ఏడవడం ఇదే మన పని. భక్తి జ్ఞానం లేదు, లోకం గొడవలు, ప్రకృతి గొడవలు చూస్తే పరమాత్మను మరిచిపోతాము. మీ పిల్లల్ని జాగ్రత్తగా పెంచండి. తరువాత వారు చూస్తారు అనుకోకండి. డ్యూటీ చేసాము అయిపోయింది అని అనుకోండి. అంతకు మించి దూరం ఆలోచించకండి. మిమ్మల్ని వాళ్ళు చూడకపోయినా ఆందోళన చెందకండి. సమతూకంలో ఉండండి. మనం అభివృద్ధిలోకి రావడానికి ప్రయత్నం చేస్తే మనలో ఉన్న వాసనలు బుసలు కొట్టడానికి ప్రయత్నం చేస్తాము. మనం సాధన ఇప్పడు మొదలుపెట్టాము. వాసనలు కొన్నివేల సంవత్సరాలనుండి ఉన్నాయి. "ఈరోజు నీకు భగవంతుడు కావలసి వచ్చాడా? నా మాట ఏమిటి? అని మన మీద యుద్ధం చేస్తాయి. మనం అనుకున్నంత తేలిక కాదు. ఆత్మజ్ఞాన సముపార్జనకు, పూర్వ జన్మపుణ్యం సత్కర్మ నిష్కామంగా చేసి ఉండాలి. గురువనుగ్రహం కావాలి. దేహాభిమానం ఊరికే పోతుందా? దానికి మూల్యం చెల్లించాలి. షాపుకి వెళ్ళి చీరలు ఇమ్మంటే ఇస్తాడా? ఎంతోకొంత ధనం చెల్లించాలి. అలాగే వైరాగ్యమనే ధనం చెల్లించి దేహాభిమానం పోగొట్టుకోవాలి. నీ మనస్సు నిర్మలం చేసుకొని, ఎంతోకొంత బుద్ధి సూక్ష్మతను పెంచుకొని వేదాంతాన్ని వినాలి.

78. నదికి ఆనకట్ట కట్టకముందు సముద్రంలోకి నీరు ఎలా వెళ్ళి పోతుందో అలాగే జపధ్యానాలు చెయ్యకపోతే నీ మనస్సు విషయాల మీదకు వేగంగా వెళ్ళిపోతుంది. లోపల వ్యక్తి భావన పెట్టుకొని పనిచేస్తూ ఉంటే

తప్పనిసరిగా ఆ కర్మ మిమ్మల్ని చుట్టుకొంటుంది. ఆ ఫలితం ఎప్పుడో ఒకప్పుడు వచ్చి తీరుతుంది. ఇప్పుడు మీకు సినిమా చూడాలనే కోరిక వచ్చింది అనుకోండి వెంటనే దానిని సినిమా దగ్గరకు తీసుకుపోకుండా సినిమా చూడటం వల్ల మనస్సు విషపూరితమై ఇంద్రియాలకు ఉద్రేకం కలుగుతుంది కదా అని జాగ్రత్తగా ఆలోచించి నిగ్రహించుకొంటారు అనుకోండి మీకు సుఖము, శాంతి అందుతాయి. మనకి ఆత్మజ్ఞానం కలగకుండా చేసే శత్రువు కామమే. శంకరులు "నీకు అందమైన రూపం, ధనం ఉంది అనుకో. దానితో నీవు తాదాత్మ్యం పొందితే అవి కాలప్రవాహంలో కొట్టుకొనిపోతాయి. నీకు వాటి అనుబంధం వల్ల చనిపోయేటప్పుడు గర్వం మిగులుతుంది. దీనివల్ల అశాంతి వస్తుంది" అన్నారు. ఇతరులు ఎవరైనా మిమ్మల్ని పీడిస్తే మీరు పీడించబడకండి. ఎవరిపట్ల నీకు విరోధం వద్దు. వారు నిన్ను విరోధులు అనుకోవచ్చు. అది నీకు అనవసరం. నీవు అందరిపట్ల మిత్రత్వం కలిగి ఉండు. రెండు ఉన్నప్పుడు అసూయ, కోపం, కామం కనిపిస్తాయి. ఒకటిగా ఉన్నప్పుడు ఏమీలేదు. ప్రతీకార బుద్ధివల్ల రజోగుణం పుడుతుంది. నాకు ఎవరు ఉన్నారు? నన్ను చూచేవాళ్ళు లేరని ఎవరి గురించి బాధపడతావు? అన్నీ స్వప్నాలే. మనకు భగవంతుని మీద విశ్వాసం లేదు. ప్రేమ ఎలా వస్తుంది? మనకు వాదించడమే తెలుసు. "మారని రూపాయలను ఎన్నిసార్లు లెక్కపెట్టుకుంటావు? అలాగే అన్నమయ, మనోమయ కోశాలు అనాత్మలు వాటి గురించి ఎందుకు చింత? వాటిని బయటకు గెంటెయ్యి. నీవు చైతన్యానివి" అన్నారు శంకరులు. చిన్న మర్రి విత్తనం మహావృక్షమై ఎన్నోవేల మందికి నీడను ఇస్తుంది. దాని విత్తనం లోని రహస్యాన్ని నమ్మగలమా? అలాగే చిన్న వాసన ఉంటే ఎంతో పెద్ద సంసారం ఏర్పడుతుంది. సత్యానుభవం కలిగితే ఈ శరీరం ఉండగానే మనో నాశనం అయితే ఈ నామ రూపాత్మకమైన సృష్టి నిజం కాదని తెలుస్తుంది. అప్పుడు నీవే ఆశ్చర్యపడతావు. చెప్పడానికి చాలా కష్టపడి చెప్పే విషయాలు ఆత్మ గురించి చెప్పడం అపూర్వమైనది.





79. నీకు ఋణం ఉంటే ఆ బాకీ ఎలా తీర్చి తొలగించుకోవాలని తొంబై రకాలుగా ఆలోచించి ఋణ విముక్తుడవై అప్పులేని వాడే అధిక సంపన్నుడని సంతోషిస్తావు, సుఖపడతావు అలాగే నీ మనస్సు చాపల్యంతో సతమతమవుతున్నప్పుడు ఆ మూల కారణాలను వివేకంతో తొలగించుకొని నిశ్చలత్వం పొందితే బ్రహ్మానందాన్ని పొందుతావు. కారులో పెట్రోల్ అయిపోతే కారు ఎలా ఆగిపోతుందో అలాగే వాసన వల్ల నీ మనస్సు చలిస్తూ ఉంటుంది. వాసనలు నశిస్తే నిశ్చలత్వం పొందుతావు, జీవన్ముక్తిని పొందుతావు. ఒకరిమీద ఆధారపడి జీవించే సంతోషం ఎంతకాలం ఉంటుంది. శాశ్వత సుఖం పొందాలనే కాంక్ష పొంగి, పొంగి రావాలి. అదే నిజమైన ఆధారం అనే భావన రావాలి. నీలో ఉన్న "ఆశ" నీకు పాపాన్ని, శనిని కల్పిస్తున్నదన్న విషయం నీకు గ్రహింపుకు రావాలి. మీ జీవితాలు పచ్చగా ఉండాలనే ప్రేమతో చెప్పే బోధ. లేకపోతే గంటలతరబడి బోధించ వలసిన పని ఏముంది? ఆ విషయం నీకు తెలియడం లేదు. నారాయణుడు అంతర్యామిగా ఉండగా వాడే పెద్ద దిక్కు. దేవుని అనుగ్రహం మించిన అందం, ఆనందం ఎక్కడైనా ఉందా? భౌతిక విషయాల పట్ల ఎందుకు వేదనపడతారు? అందరినీ చూసే ఆయన నిన్ను చూడడా? మురుగునార్ "ఖరీదైన బట్టలు వేసుకొన్నా అలాంటి భోజనం చేసినా దాని వల్ల రజోగుణం వస్తుంది" అన్నారు. ఈ శరీరాన్ని భోగాలు అనుభవించ డానికి ఉపయోగిస్తున్నామా? ఏరోజుకారోజు పరిశీలించుకోవాలి. మనం ఎలుకల బోనులో మాంసం వగైరాలను పెడతాము. ఎలుకలు వాటికి ఆకర్షితమై అందులో చిక్కుకుంటాయి. అలాగే మనం ప్రకృతి ఆకర్షణలో పడిపోతున్నాము. అవి అన్నీ ఈశ్వరుడు పెట్టిన బోనులని తెలియకపడతాము. అవి బోనులని తెలుసుకునే వివేకం ప్రసాదించమని జ్ఞానిని కోరుకోవాలి. రాగము-కోపము ఇవి రెండూ వైరాగ్యము వస్తేనేగాని పోవు. మన హృదయంలో ఉన్న శాంతి మనకి అనుభవంలోకి వచ్చేవరకు ఉద్రేకాలుపోవు. గౌరవం రావాలని చేసే పని కూడా స్వార్థమే. ఇంట్లో సంఘటనల వల్ల

క్షోభను అనుభవించకండి, ఉద్రేకపడకండి. భగవంతుని పాదాలను విడిచి పెట్టకండి. ఆయన దయ అనే అగ్ని మీ ప్రారబ్ధాన్ని కాల్చి బూడిద చేస్తుంది. పిల్లలు స్తంభాన్ని పట్టుకొని గిరగిరా తిరుగుతూ ఆడుకొంటారు. అలాగే భోగాలు వచ్చినా, సుఖాలు వచ్చినా నీ తలకాయను అక్కడ పెట్టకు. పిల్లలకు స్తంభం ఆధారంగా ఉన్నట్లే నీవు భగవంతుని పాదాలు పట్టుకొని జీవించు పడిపోతామనే భయం ఉండదు.

80. “ఇంట్లో పొయ్యిలో చిన్న నిప్పుకణం ఉంటే గాలికి ఎగిరి ఇంటిని కాల్చివేస్తుంది. అలాగే నిప్పు కణంలాంటి చిన్న అజ్ఞానం నీలో ఉన్నా నిన్ను కాల్చి చంపుతుంది” అన్నారు టాల్‌స్టాయ్. ఆసక్తి పెంచుకున్న వారికి బిపి తొందరగా వచ్చేస్తుంది. “వివేకం నా తల్లి, వైరాగ్యం నా తండ్రి, నీ ఆరోగ్యం నీ చేతుల్లో ఉంది. ఏది తినాలి ఏది తినకూడదు అనే వివేకం ఉండాలి. నీవు మంచి వాడివి అనుకుంటే, ఎదుటివారు చెడ్డవాళ్ళు అనుకుంటావు. వారి గుణాలు చూస్తావు. అందుచే ఎవరూ మంచివారు కాదు అనుకోకండి. నీవు మంచి వాడివని భగవంతుడు చెప్పాడా? నీవు ఆత్మవు” అన్నారు బెర్నార్డ్‌షా. క్షమాగుణం ఉంటే గత చెడ్డలు మరచిపోతావు. ఎవరైనా నిన్ను ద్వేషిస్తే తిరిగి వారిని ద్వేషించకు. భగవంతుని పొందడానికి దాన్ని వదులుకోండి. జీవితం పొడుగునా ఎవరికోసం శ్రమ పడతావో వారు నీకు ఏ సహాయం చెయ్యరు. నీ కూడా రారు. వాళ్ళ గురించి నీ మనస్సును కుళ్ళబెట్టుకుంటున్నావు. ఈ కుళ్ళబెట్టుకున్న మనస్సు నీకూడా వస్తుంది. నీవు సమస్థితిని అలవాటు చేసుకోవాలి. ఈ అజ్ఞానం నుంచి బయటకు రా! నీవు దేవునితో సమానమవుతావు. ఎక్కడైతే రూప వికారాలు కనబడతాయో అక్కడ వికారం ఉంటుంది. స్వప్నం నిద్రలో వస్తుంది. జాగ్రదావస్థలో అజ్ఞానం వస్తుంది. దానికీ దీనికీ తేడా లేదు. స్వప్నంలో కనిపించిన మనుషులు జాగ్రదావస్థలోకి వచ్చాక కనబడరు. మీకు జ్ఞానం కలిగితే ఈ లోకంలో కనబడే మనుషులు అంతే. జరిగిన సంఘటనలు కూడా స్వప్నమే. రాముని అరణ్యవాసానికి పంపడానికి కుట్ర పన్నడానికి మందర కైకేయి విశ్రాంతి





మందిరానికి నడిచివెళుతుంది. “అక్కడ మందర నడవడం లేదు. రావణాసురుడి పాపమే మందర రూపం ధరించి వెళుతోంది” అని వాల్మీకి రామాయణం వ్రాసాడు. ఇది మనం ఊహించలేము. ఈ మాటలో ఉన్న అందాన్ని మనం భరించలేము. ఇక ఆత్మని ఎక్కడ భరించగలం? రాముడు అరణ్యవాసానికి వెళ్ళకపోతే సీతాపహరణం జరుగదు. లంక నాశనం, రావణాసురుడి నాశనం జరుగదు. నీవు ఏ పనిలోనూ ఆసక్తి పెట్టుకోకు. అది ఎప్పుడు ఎక్కడ ఎలా జరగాలో అలా జరుగుతుంది. భగవంతుడు నీ పనికి ఫలితాన్ని ఇవ్వడం ఆలస్యం చేస్తే మన మంచికే చేస్తున్నాడు అనుకోండి. నిదానంగా, తొందరపాటు, చిరాకు లేకుండా ఉండండి.

81. మనం బాగుపడడానికి శ్రద్ధ ముఖ్యం. నీవు నిష్కామకర్మలో ప్రావీణ్యుడివి కావాలి. మీరు బెంగపెట్టుకుంటే ఎక్కడో ఒకచోట బంధం ఉన్నట్లే. రీజన్‌కన్నా విశ్వాసం బలమైనది. ప్రారబ్ధానికి మించిన బలమైనది ఈ సృష్టిలో ఏదీ లేదు. ఆ ప్రారబ్ధ ప్రవాహంలో సామ్రాజ్యాలు కొట్టుకు పోయాయి. నేను ఎర్రగా ఉన్నాను, నల్లగా ఉన్నాను, నా రూపం ఇది అని మీరు అనుకొంటున్నారు. నీవు ఆత్మవు ఎరుపు నలుపు రూపాలు లేవు. ఇది అంతా నీ కల్పితము. శరీరం చనిపోతున్నప్పుడు నేను చనిపోతున్నాను, నేను చనిపోతున్నాను అని అనుకుంటే చావు చేతిలో ఓడిపోయినట్లే. చావు నీ చేతిలో ఓడిపోవాలంటే శరీరం మరణిస్తున్నా నేను చనిపోవడం లేదే అనే అనుభవం నీకు రావాలి. అది నీవు బ్రాహ్మీస్థితిని పొందినప్పుడు మాత్రమే నీవు నీవుగా ఉంటావు. మనస్సును ఉద్రేకపరచకూడదు. దాన్ని శాంతంగా ఉంచాలి. మన కాలిలో ముల్లు విరిగితే ఎలా తీసుకొని సుఖంగా ఉంటామో అలాగే మనస్సులో వికారాలు ఉండి అశాంతిగా ఉంటే ఒక్కొక్క దానిని వివేకంతో ఇవి అన్నీ ఎవరికి కలుగుతున్నాయి అని తీసేయాలి. అప్పుడు శాంతి కలుగుతుంది. ఆత్మ విద్యను నీవు సంపాదించాలంటే నీ ఇంద్రియాలను, రాగ-ద్వేషాలను ఉపసంహరించాలి. విజృంభిస్తున్న నీ మనస్సును లోపలికి పంపాలి. ఇన్ని రకాలుగా వాటితో నీవు యుద్ధం చేస్తే

కాని ఆత్మ విద్యరాదు. దానికంటే పవిత్రం చేసే విద్య మరియొకటి లేదు అన్న సంగతి నీవు లోతుగా అర్థం చేసుకోవాలి. మన శరీరంపై ఉన్న మలినాలను సబ్బు పెట్టి కడిగినంత తొందరగా వాసనలు పోవు. మన మనస్సులో ఎన్నో బలహీనతలు అనే మసి ఉంది. జప, ధ్యాన, నిష్కామ కర్మలతో వాటిని శుద్ధిచేయకపోతే జ్ఞానం రాదు. లోకాన్ని జయించమంటే సంసారాన్ని జయించమని చెప్పకుండా చెప్పడం. ఇతరులకు ఏదైనాసాయం చేస్తే ఆ శరీరం కూడా నీదే అనుకోవాలి. అప్పడే వేరు భావనపోతుంది. గాలి లేని చోట దీపం ఎంత స్థిరంగా ఉంటుందో అలాగే మీ మనస్సు, ఇంద్రియాలు అంత స్థిరంలోకి వస్తే అవి మీకు సహాయం చేసి మీకు పూర్ణ స్థితిని తీసుకొనివస్తాయి. మనస్సును, చదివి, చదివి పరిశీలించి దానికి స్థిరత్వం తీసుకొనిరండి. మీరు శ్రవణం చేసి, శ్రవణంచేసి జ్ఞానంతో మనస్సులో ఉన్న కల్మషాన్ని కడుక్కోండి. అశాంతి వల్ల రక్తపోటు పెరిగి పోతుంది. కుటుంబ సభ్యుల పట్ల మమకారం పునర్జన్మను తీసుకొని వస్తుంది. అది దుఃఖాన్ని, రోగాన్ని తీసుకొని వచ్చి చివరకు చంపుతుంది. దాని వల్ల జ్ఞానం రాదు. మమకారం అసత్యంలోంచి వస్తుంది. ఇంట్లో పెంట తియ్యకపోతే ఎలా పెరిగి పోతుందో అలాగే మనస్సులో మమకారం అనే పెంట తియ్యకపోతే పెరిగిపోతుంది. ఎరుక వల్లనే హృదయం ఖాళీ అవుతుంది. మీ ఇంటి పెరటిలో మొక్కలు నాటితే ప్రాణ వాయువు సరఫరా చేస్తూ ఉంటుంది. అలాగే మీకు క్రమశిక్షణ, వివేకం, వైరాగ్యం సంపాదిస్తే శాంతి శోభలు కలుగుతాయి. మనస్సును చూడు, మతమును చూడకు, ధనాన్ని చూడకు.

82. శరీరం చేసే తప్పల కన్నా, మనస్సుతో చేసే తప్పలే ఎక్కువ. చెడు తలంపులు మనస్సులోనే వస్తాయి. దానికి ఎప్పడో ఒకప్పడు సమాధానం చెప్పితీరాలి. నీ మనస్సు నిర్మలమైతే పరమాత్మలో కలుస్తావు. మీకు ఆస్తి ఉంటే దాన్ని చూసుకొని ఆనందం వస్తూ ఉంటే అది తొందరలోనే దుఃఖంగా మారిపోతుంది. ఈ రూపం నాది, ఇది నేను సాధించాను అనే





భావన ఉన్నంతకాలం నీకు కోరికలు రాకమానవు. శరీరం నేను అనే తలంపు వచ్చాక దుఃఖం, రోగం, ముసలితనం, తరువాత చావు వస్తుంది. ఇది తప్పదు. మన కళ్ళకు కనబడేది ఎంత వైభవమైనదైనా అది అంతా సత్యంలా కనిపించినా అది నూరుశాతం అసత్యమే. దేహంతో తాదాత్మ్యం పొందుతూ ఉంటే లోక ఆకర్షణలో కొట్టుకొనిపోతావు. నాకు కొంతమంది మీద ఇష్టం, కొంతమంది మీద అయిష్టం వస్తూ ఉంటే మీరు నష్టపోరు, నేనే నష్టపోతాను. అలా ఉంటే మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. శ్రీరాముడు అంటాడు "కామం కంటే ధర్మం గొప్పది. ధర్మం లేని కామం ప్రమాదం". అంటే దశరథుడు ధర్మం కంటే కామానికి ప్రాముఖ్యం ఇచ్చాడు. కైకకు మాట ఇచ్చి ప్రమాదంలో పడ్డాడు. చదువు, పాండిత్యం ముఖ్యంకాదు. భగవంతుని మాట మీద విశ్వాసం ముఖ్యం. బుద్ధుడు ఒక్క మానవజాతి మీద మాత్రమే ప్రేమ చూపడం కాదు. సృష్టిని అంతా ప్రేమించాడు. అలా ప్రేమించిన వాడు మరియొకడు లేడు. బుద్ధుడి వద్దకు ఒకరు వచ్చి "నాకు దేవుడు ఉన్నాడనే నమ్మకం లేదు" అన్నాడు. "నిజమే" అన్నాడు బుద్ధుడు. మరుసటి రోజు ఇంకొకడు వచ్చి "నాకు దేవుడు ఉన్నాడని పూర్తి నమ్మకం ఉంది" అన్నాడు. దానికి కూడా "నిజమే" అన్నాడు బుద్ధుడు. ఇద్దరికీ కూడా అనుభవం లేదు. మూడవవాడు వచ్చి "దేవుడు ఉన్నాడా? లేడా?" అంటే "సందేహించేవాడు ఒకడు ఉన్నాడు కదా! వాడిని లోపలికి తోలుకొని వెళ్ళు. లోపలకు వెళితే నిర్వాణసుఖం, శాంతిసుఖం ముంచేస్తుంది. అప్పడు దేవుడు ఉన్నాడా? లేడా? అనే సందేహమే రాదు". దీనినే రమణుడు "శరీరం లేని ఎరుక, ప్రపంచము భగవంతుడు లేని ఎరుక దాన్ని జాగ్రదవస్థలో పొందాలి" అన్నారు.

83. కౌసల్యం అంటే నీవు చేసే పని నిన్ను బంధించకూడదు. అలా బంధించకుండా, నేను చేస్తున్నాను అనే భావన లేకుండా చేయడమే యోగం. దానివల్ల అమనస్క స్థితిని పొందుతావు. నీవు కర్మ ఫలితాన్ని ఆశిస్తున్నావు కాబట్టి పుట్టి తీరాలి. ఎందుకు పుట్టాలి అంటే ఫలితాన్ని

అనుభవించడానికి పుట్టాలి. ఇదే మాయ. పరమహంసగారు "నీవు 'నేను' గానే జీవిస్తూ ఉంటే ఆ 'నేను' ఎలా పోతుంది?" అన్నారు. ఇక్కడి మాటలు అక్కడ, అక్కడ మాటలు ఇక్కడ చెప్పడం చెవులకు ఉన్న కామం. టి.వి. ముందు కూర్చోవడం కళ్ళకు ఉన్న కామం. నీవు రోజూ ఇరవై నాలుగు గంటలూ నేను-నాది అనే భావాల చుట్టూ తిరుగుతూ ఉంటే అవి ఎలా పోతాయి. మోక్షం ఎలా సాధ్యం. గాంధీజీ దక్షిణ ఆఫ్రికాలో భార్యతో ఒక సందర్భంలో కోపం వచ్చి ఆమెతో "నీవు పుట్టింటికి పో" అంటే "మీరు నాకు తాళి కట్టారు. ఎక్కడికి పోతాను" అన్నారు. అలాగే మనం నేను-నాది అనే దాన్ని కట్టుకున్నాము. అవి పోవాలంటే ఊరికే పేవు అవి మనల్ని విడిచి పెట్టడం కష్టం. అవి పోవాలి అంటే జాగరూకమైన తెలివి, వ్యక్తిభావన లేని జీవితం కావాలి. మరియు సహనం, వినయం సాధకునకు ఉంటే హృదయం యొక్క లోతులలోనికి వెళ్ళగలవు. సత్యాన్ని నీవు కౌగిలించుకోలేవు. నీ పవిత్రతను చూచి అదే నిన్ను కౌగిలించుకోవాలి. అప్పుడే నేను-నాది పోతాయి. చపలత్వం తగ్గిపోతే అనవసరం లేని ఆలోచనలు తగ్గిపోతాయి. అసంతృప్తి ఉన్న వానికి అసూయ ఉంటుంది. భోగ ప్రవృత్తి మీ మనస్సును బహిర్ముఖం చేస్తుంది. మనిషికి వచ్చే వికారాలు అన్నీ కామక్రోధాల వల్లనే వస్తాయి. కేన్సర్ బాగా వ్యాపించినప్పడు అది ఎక్కడ పుట్టిందో డాక్టర్లు కూడా గుర్తించలేరు. అలాగే వికారాలు ఎక్కడనుండి వస్తున్నాయో మీకు తెలియడం లేదు. నీ మెదడు ఎలా చెపితే అలా వినకు. అది ఒకోసారి కుయుక్తులను పన్నుతుంది. కాబట్టి దాని తలను నరుకు. నీ హృదయం చెప్పినట్లు నడుచుకో. భగవంతుని తెలుసుకోవాలనే పెద్దకోరిక, మనకు వచ్చే చిన్న చిన్న కోరికలను అన్నింటిని తగ్గించేస్తుంది. మనకు బాహ్య విషయాలు మీద ఎంత ఇష్టమో అంత ఇష్టం అంతర్యామి మీద కలిగితే మన మనస్సుకు లోచూపు కలుగుతుంది. భోగాల వలన పాపాలు, రోగాలు వస్తాయి. మన సంసారం కూడా యుద్ధ భూమే. ఇంట్లోవాళ్ళు సమస్యలతో పోరాడాలి. పిరికితనం ఉండకూడదు. ధైర్యంగా సమస్యను పరిష్కరించు



అమృతవాహిని – 2

కోవాలి. దేనికోసం ఎదురు చూడకు? ఉన్నది పోదు - లేనిది రాదు. ఊహించుకున్నవాడే నిరుత్సాహపడతాడు. భక్తులు లోకవ్యవహారాలలోనికి వెళ్ళకూడదు. ఏదో ఒక వర్గానికి ఒరిగిపోకూడదు. వాల్మీకి "మనుషులలో త్రికరణశుద్ధిలేని వక్రబుద్ధి ఉన్నవారు క్రూర జంతువులతో సమానం. ఇతరులపై ఆధారపడితే స్వతంత్రంగా ఆలోచించలేము. బానిసత్వం వస్తుంది" అన్నారు. "రుచికోసం తినకూడదు. మన శరీరానికి ఉపయోగ పడుతుందా? లేదా?" అని గ్రహించి తినాలి.

84. ఏ విషయం పైన అయినా ఎవరైనా అడిగితే 'కాదు అనేచోట కాదు అని' చెప్పాలి. అంతేకాని వాళ్ళకు అనుకూలంగా నిజమని చెబితే మానసిక అశాంతి, పాపం అంటుకొంటుంది. ఏమీ చెప్పనివారిని వక్రబుద్ధి అంటారు. ఇంట్లోవాళ్ళు మనవాళ్ళు కాకపోయినా మనవాళ్ళు అని ఎందుకు అనుకుంటున్నాము? మోహం వల్ల, దేహాత్మబుద్ధి వల్ల. "ఎవరికి ఎవరూ ఏమీ కారు". ఈ వ్యవహారాలు అన్నీ వ్యవహారిక సత్యాలు. లోపలకు వెళ్ళి చూస్తే ఏమీ కారు. గాఢనిద్రలో ఏ సంబంధం ఉంది. ప్రపంచంలో పాపం అంటూ ఏదీ లేదు - స్వార్థం తప్పించి. అది ఉంటే ఎన్ని పాపాలైనా చేస్తాడు. నీ విషయ వాసనలు నిజంగా కనిపించినా అవి దుఃఖాన్ని తీసుకొచ్చేవి అని తెలుసుకొన్న తరువాత కూడా వాటికి వశం అయిపోతే కక్కిన అన్నాన్ని తిన్నట్లే. కక్కిన కూడు తిరిగి చూస్తావా? అసహ్యించుకుంటావు. విడిచి పెట్టి భోగాల్ని మళ్ళీ అనుభవించాలి అనుకోవడం అటువంటిదే. ఇది నిజమని నమ్మితే సొమ్ము, నమ్మకపోతే దుమ్ము. శంకరులు "ఎవ్వరూ నావారు కాదు, నేను ఎవరి వాడను కాదు". ఇది మనకు అర్థం అయితే దుఃఖం ఏమిటి? మనం పనులు, చెడ్డ పనులు భగవంతుడే చేయిస్తున్నాడు అనుకొన్నప్పడు మనిషికి దుఃఖం ఎందుకు? అని ప్రశ్నిస్తే మంచి చెడులు భగవంతుడు నుంచే అనుకో. మంచి పనికి, చెడ్డ పనికి కూడా నేను కర్తని కాను, ఈశ్వరుడే కర్త అని నీకు అనుభవంలోనికి వచ్చినప్పడు నీకు దుఃఖమేల? పొంగు, కుంగు ఉండదు. నామ రూపాల వల్లనే కీర్తికాంక్ష వస్తుంది. దుఃఖం

ఏ నేనుకి వస్తుంది? అని దాన్ని తరచుగా ప్రశించుకుంటే అదే క్రమంగా అంతర్ముఖం అవుతుంది. నేను ఎవడను? అనే ప్రశ్న ఎడ్యుకేషన్ ప్రోసెస్. మెదడుకు పని చెప్పడం అది తేలిక మార్గం. జపధ్యానాల కంటే ఇది తేలిక. చెడ్డ స్నేహాలవల్ల వేదనలు, కష్టాలు, నష్టాలు, దుఃఖాలు తప్పవు. “వాళ్ళు దుర్మార్గులు, వీళ్ళు దుర్మార్గులు అనుకోకు. మన ఇంద్రియాలు, మనస్సు కన్నా దుర్మార్గులు కారు” అన్నారు షేక్స్‌ఫియర్. “బేధబుద్ధి కలుగజేసే శాస్త్రాలు చదువుతూ, అభేద బుద్ధి గల స్థితిని పొందగలవా?” అన్నారు శంకరాచార్యుల వారు. నీ ప్రారబ్ధం నిత్యం, సత్యం కాదు. మమకారం ఉంటే ఏడుస్తూ చనిపోతారు. సంసారం ఎలా నడుస్తుందో అనే భయం, పిల్లల జీవితాలు ఎలా ఉంటాయో అనే భయం, వాళ్ళ భవిష్యత్తు ఎలా ఉంటుందో అనే భయం, ఇంట్లో వాళ్ళు చూడరేమో అనే భయం ఇవన్నీ వెంటాడి దుఃఖం వచ్చేస్తుంది. ఇలా ముని మనుమల దాకా ఆలోచిస్తారు. అదే మాయ. వారి దేహ ప్రారబ్ధాన్ని బట్టి వారుంటారు. ఈ చిన్న విషయం మీకు అర్థం అయితే దుఃఖం రాదు. భయం లేకుండా జీవించడం నేర్చుకోండి.

85. పిల్లలు ఆడుకోవడానికి మైదానం కావాలి. అలాగే ఇంద్రియాలనే మైదానాన్ని మైండ్ ఆడుకుంటుంది. మిమ్మల్ని విమర్శిస్తున్న వారిని, రోడ్డుమీద నిలబెట్టి మాట్లాడేవారిని పట్టించుకోకండి. మీ ఇంటికి వచ్చి మీ హితం కోరేవారి మాటలు మంచివైతే వాటిని పట్టించుకోండి. ద్రౌపదితో కృష్ణుడు “నీవు నా భక్తురాలివైనా నీ కర్మల ఫలితాన్ని తీసేద్దామను కున్నా, నేను నిగ్రహించుకోలేక పోతున్నాను. ఉరి తీసేవాడు ఎంత కఠినంగా ఉంటాడో అలాగ నేను ఉండక తప్పదు” అన్నాడు. మనం అనుకోవడం మన సంకల్పం. ఒంటిమీద ఉన్నది ఫలింపచేసేవాడు ఈశ్వరుడు. తెలియక పోవడం వల్ల తప్పు చేస్తాము. తెలుసుండి అనుభవిస్తాము. దుఃఖానికి, అశాంతికి తల్లి మమకారము. తల్లి లేకుండా బిడ్డరాదు. మమకారం లేకుండా దుఃఖం రాదు. నిజంగా మీరు సత్యాన్వేషకులు అయితే మీ ఇంట్లో వారే శత్రువులవుతారు. అలాగే అసూయతో ఎవరైనా మాట్లాడుతుంటే దాన్ని





మీరు గుర్తించకండి. మీరు సహజంగా మాట్లాడాలి. అస్తమాను అసూయే గుర్తుకొస్తుంటే అది నిప్పు కణంగా మారి మీ మనస్సుకు అంటుకుంటుంది. దానిని వచ్చిన వెంటనే గుర్తించి ఆర్పేయండి. లేదంటే కొంప తగులబడి పోతుంది. అలవాట్లు వేరు, మనం వేరు అనే సంగతి మనకి తెలియడంలేదు. అందులోంచి బయటపడలేకపోతున్నాము. రాగ-ద్వేషాలు, చావుపుట్టుకలు అనే ద్వంద్వాలు అజ్ఞానికి ఎంత నిజంగా కనిపిస్తాయో జ్ఞానికి అవి నూటికి నూరుపాళ్ళు అసత్యంగా కనిపిస్తాయి. ఈ అజ్ఞానం మీరు విడిచిపెట్టేవరకు లోకం మిమ్మల్ని విడిచిపెట్టదు. శాస్త్రవాసన బుద్ధికి సంబంధించిన వ్యాయామం. అసలు వస్తువును తెలుసుకోవాలనే ఆలోచన వారికి ఉండదు. ఆ శాస్త్రవాసన లోకవాసన మీకు ఉంటే ఆ వ్యక్తులు కనబడగానే వారి మీద మీకు ప్రీతి కలుగుతుంది. సబ్జక్టు అర్థం అయితే సత్యం మీద ప్రీతి కలుగుతుంది. పాండిత్యమే ఆత్మ అనుకొంటారు. అది చాలా ప్రమాదం. పాండిత్యం మనస్సుతో సంపాదించేది. అది చమత్కారం. సైకాలజీ అనేది పైపైన ఈదేది. తత్త్వశాస్త్రం నిన్ను తత్త్వంలోకి తీసుకొనివెళుతుంది. ఏదైతే నీవు కాదో దానిని పెళ్ళికూతుర్ని ముస్తాబు చేసినట్లుగా ముస్తాబు చేస్తూ జీవితాంతం ఉంటూ చచ్చిపోతున్నావు. మంచి పనులూ చేస్తున్నారు, బ్యూటీ పార్లర్‌లకూ వెళుతున్నారు మంచి పనులు ఏమిటో, చెడు పనులు ఏమిటో తెలియడం లేదు. ఏ ప్రారబ్దాన్నిబట్టి ఆ కుటుంబంలో పుట్టామో మనకు తెలియదు. అది ఎన్నో జన్మలలో చేసిన కర్మ ఫలితంగా ఆ కుటుంబంలో పుడతావు. కాబట్టి ప్రారబ్దం గురించి ఆలోచించకుండా మనస్సు అంతర్ముఖం అయ్యేలా చేసుకోండి. నీ ఇష్ట, అయిష్టాలను అతీతంగా దైవీప్రణాళికను అనుసరించి జరిగిపోతుంది. దాన్ని కూడా నీవు దాటి వెళ్ళిపోవాలి. అప్పుడు సత్యానుభవం కలుగుతుంది. ఈ విషయంలో నీవు నెమ్మది, నెమ్మదిగా దేహాభిమానాన్ని తగ్గించుకుంటూ రావాలి. వాసనలు బూడిద అయితేనే మహాత్ముడవు అవుతావు.

86. నేను అనే అజ్ఞానంలో ఉన్నంతకాలం నీవు ఎన్ని సాధనలు

చేసినా ప్రయోజనం లేదు. ప్రతీ మనిషి ఇలా ఆలోచించాలి "జీవితం నాకు ఏమి నేర్పింది" అని చదవడం వల్ల, పుస్తకాలు వ్రాయడం వల్ల ఆనందం రాదు. బూరెలు, బూరెలు అంటే రుచి తెలియదు. తింటేనే రుచి తెలుస్తుంది. అలాగే నేను చైతన్యాన్ని అనుకుంటే ఆనందం రాదు. అనుభవం పొందితే ఆనందం వస్తుంది. ఇంట్లో ఉన్న మనుషులతో రాజీ పడటం నేర్చుకున్నావు కదా! అలాగే భగవంతుడు తీసుకువచ్చే సంఘటనలతో రాజీపడు. మీ ఇంట్లో ఉన్న పదిమంది నీ కుటుంబం అనుకొంటున్నావు కదా! నీకు కోరికలు తగ్గిపోతే, దేహబుద్ధి తగ్గిపోతే ప్రపంచం అంతా నీ కుటుంబం క్రిందే కనపడుతుంది. నీ వ్యక్తిగతమైన జీవితం తగ్గిపోతే నీ జీవితం విశ్వవ్యాప్తమవుతుంది. ఎంత పెద్దవాడైనా పరిస్థితుల చేతుల్లో పనిముట్టువే. నీ మనస్సును ఉద్రేకపరిచే పదార్థాలు, స్నేహితులు, సంఘటనల జోలికి వెళ్ళవద్దు. కామ్యకర్మలు చేయడానికి జన్మ రాలేదు. ఏసు "వాడు ప్రేమిస్తున్నాడని నీవు ప్రేమిస్తే అది సాధారణం. ద్వేషించే వాడిని ప్రేమించడం నేర్చుకో. అప్పుడు దేవుడి అనుగ్రహానికి పాత్రుడవుతావు. వైరం వల్ల మనస్సు బాహ్యముఖమై విషపూరితమవుతుంది. స్వభావాన్ని జయించడం చాలా కష్టం. చాలా ప్రయత్నం చెయ్యాలి. దానిని జయించ డానికి అసూయ ఒక సమస్యగా ఉంటుంది. ఇతరుల మీద ఆధారపడితే మనకు ఇష్టంలేని పని చేయవలసి ఉంటుంది. బానిసత్వం వస్తుంది" అన్నాడు. జీవితంలో సత్యం తప్పించి నీకు వచ్చే తలంపులు నిజం కావు. నిజమని అనుకొని ఏది చేసినా అది నీ తలచుట్టూ తిరుగుతుంది. మనమంతా గానుగ ఎద్దులము. భగవాన్ సందేశం మీకు అందకపోయినా అంతర్ముఖమైతే అనుగ్రహం వచ్చి దేహప్రారబ్ధంలోని ఒడిదుడుకులు నీ మీద పడకుండా ఉంటాయి. భగవాన్ సందేశం "నీవు ఆత్మచింతన చేస్తే అనాత్మ చింతనకు దూరం అవుతావు. ఆయన తక్కువగా మాట్లాడాలి అనుకొంటారు. తత్త్వం తెలియడానికే సాహిత్యం. కాని ఇప్పడు పండితులు పాండిత్యం ఆత్మజ్ఞానం అనుకొంటున్నారు. శాస్త్రాలు సూచిస్తాయి. వెతక వలసింది నీ హృదయం





లోనే. పలుకులు బంగారంలా ఉండాలి కాని ములుకుల్లా ఉండకూడదు. పోట్లగిత్త మనకు తారసపడితే ఎలా కుమ్మేస్తుందో గాలి మేఘాలను ఎలా గెంటుకొనిపోతుందో అలాగే మన శరీరాలు కాలం స్వాధీనంలో ఉన్నాయి. మృత్యువు మన శరీరాన్ని కుమ్మి చనిపోయేలా చేస్తుంది. మమకారం తనవారికి హాని జరిగితే ఆ బాధ చిన్న వయస్సులోనే ముసలితనాన్ని తీసుకొస్తుంది.

87. "జరుగబోయేది ముందే తెలిస్తే అది విధి ఎలా అవుతుంది" అని ధర్మరాజుతో భీష్ముడు యుద్ధం అనంతరం బాధ కలిగితే అన్న మాట ఇది. జ్ఞానం పొందని శరీరాలను నడుస్తున్న శవాలు అంటారు. వారి హృదయంలో ఉన్నవాడు మీ ఇంద్రియాలకు, మనస్సుకు బుద్ధికి ఆధారంగా ఉండి వాటిని ఆడించేవాడు ఈశ్వరుడే. ఆయన శరీర రహితుడు. మీరు కూడా అదే కాని అది తెలియడంలేదు. బాహ్యంగా మీకు ఉన్న ధనం, అధికారం, పాండిత్యం, సంతానం వల్ల అది తెలియబడదు. ఇప్పడు మీ రోజులు బాగా ఉన్నాయి అనుకొంటున్నారు. ఎన్ని కష్టాలు వచ్చి నెత్తిమీద పడడానికి సిద్ధంగా ఉన్నాయో మీకు తెలియడంలేదు. మామిడిపండు రుచి మీకు తెలియకపోవచ్చు. తిన్నవానికి తెలుస్తుంది కదా! మన హృదయంలో సత్యం ఉంది. అది తెలుసుకున్నవారికి దాని వైభవం తెలుస్తుంది. ప్రకృతి పదార్థాల విలువ వాటిముందు ఏపాటిది? ఈ విషయం మీరు పరిశీలించుకోవాలి. రామకృష్ణుడు 'నేను' గురించి మాట్లాడుతూ గారడీవాడు చేసే వస్తువులు అన్నీ నిజం కావని తెలుస్తుంది. అలాగే 'నేను' కూడా కల్పించినదే. అది పోయిన తరువాత విషయం తెలుస్తుంది. సంతోషాలు దుఃఖాలు 'నేను' కల్పించినవే" అని దేహానికి ఆహారం ఎంత అవసరమో మనస్సుకు శాంతి అంతే అవసరం. శాంతి విలువ అశాంతిగా ఉన్నప్పడే తెలుస్తుంది. పూర్వజన్మలో మనం చేసే కర్మలే 'విధి' అంటారు. రేపు ఏం జరుగుతుందో మనకు తెలియదు దాన్ని 'విధి' అంటారు. శ్రీకృష్ణ చైతన్య "వివాహం గురించి చెబుతూ 'కుండలో పాలు పోస్తే దానికి చిన్న

రంధ్రం ఉంటే పాలు అన్నీ క్రమంగా కారిపోతాయి. గృహస్థుల మీద నా బాధ అదే" అన్నారు. ఏ ప్రాణికోటిమీద విరోధం పెట్టుకోకూడదు. పెట్టుకుంటే వాళ్ళే గుర్తుకువస్తారు. ఏదైనా ఉంటే అక్కడే పరిష్కారం చేసేసుకోవాలి. గాంధీజీ "నాకు పదవుల వల్ల ఆనందం రాదు, ఆ పదవులు నాకు అవసరం లేదు" అన్నారు. ఏకాలంలో సంతోషం, దుఃఖం రావాలో అది ఈశ్వర నిర్ణయంపై ఉంటుంది. వాటిని మనస్సులోకి తీసుకుంటే అహంకారం పెరుగుతుంది. మన హృదయంలో పవిత్రత లేనప్పుడు లౌకికంగా, తెలివిగా మాట్లాడినా వాటికి జీవితం ఉండదు. పవిత్రత, ఏకాగ్రత, ప్రవీణతలతో మాట్లాడేమాటలే జీవితంలోకి వస్తాయి. విషయ వాసనలు అనే చెడ్డ అలవాట్లు ఇతరులను చూడటం వల్ల నీలో కలుగవచ్చు వాటిని రాపాడించుకోకండి. ఆ అలవాట్లు వదిలేస్తే దాని శక్తి తగ్గిపోతుంది. చాలామంది కులంతోను, వంశంతోను, ధనంతోను, చదువుతోను తాదాత్మ్యం చెంది పాడైపోతున్నారు. సంతోషం వచ్చినప్పుడు నీవు దానిని పట్టుకుంటే దుఃఖం వచ్చినప్పుడు అది నిన్ను పట్టుకొంటుంది, రెండింటిని పట్టించుకోకు. శరీరం ఎక్కడ ఉండాలి అన్నది మన ఇష్టానుసారం జరుగదు. ప్రారబ్దమే తిప్పతుంది.

88. ద్వైతం చాలా ప్రమాదమైనది. మీకు అద్వైత అనుభవం కలిగే వరకు ద్వైతం నిన్ను వెంటాడుతుంది. ద్వైతం అంటే ద్వంద్వాలు. దేహం చనిపోయే రోజుకైనా, చనిపోయే దేహం నేను కాను అని ఆ సద్వస్తువుతో తాదాత్మ్యం రావాలి. చనిపోవడం నేర్చుకోవడం అంటే అదే. ఇంట్లో వారి పట్ల డ్యూటీ చెయ్యి. వాళ్ళు అభివృద్ధిలోకి రావడం, రాకపోవడం వాళ్ళ ప్రారబ్ధాన్నిబట్టి ఉంటుంది. దానికి, నీకు సంబంధం ఏమిటి? పుట్టిన వస్తువుకు ప్రారబ్ధం. పుట్టని ఆత్మకు అది లేదు. నీవు ఆత్మవు. ప్రపంచాన్ని అనుసరించేవాడు ఎవ్వడూ బ్రాహ్మీస్థితిని పొందలేడు. నీకు ఉన్న అనుబంధాలే నీ పాపాలు. అవి ఎక్కడో లేవు. రామకృష్ణుడు నీగదిలో దీపం పెట్టి చీకటిని రా.... రా.... అంటే వస్తుందా? దుఃఖం వస్తుంటే ఆహంకారం పక్కవేసుకుంటుంది. మీలో పాపాలు ఉన్నాయని ఏడవకండి,





దాన్ని పోగొట్టుకోండి. చెడు తలంపులు లోకానికి కట్టేసి బంధిస్తాయి. మంచి తలంపులు లోకవాసనలను తగ్గించి భగవంతుని పాదాల వద్దకు చేరుస్తాయి. సాధారణంగా ఎక్కువ ఆదర్శాలు పెట్టుకున్నవారు ఆచరణలు అంతగా ఉండవు. మనం ఇరవైనాలుగు గంటలూ మన ఆస్తి, మన సంతానం వగైరాల గురించి ఆలోచిస్తాము. బుద్ధుడు, ఏసు, రామకృష్ణుడు ఒక్క నిమిషం కూడా వాళ్ళ గురించి వాళ్ళు ఆలోచించుకోలేదు. వివేకానందుని ఒకరు "బుద్ధుడు భగవంతుడి గురించి ఏమీ చెప్పలేదు అంటే ఆయనే భగవంతుడు" అన్నారు. రాజ్యం వదిలేసాను అనే ఆలోచన కూడా రాలేదు. మీకు వ్యక్తిభావన లేకపోతే అంటే ఆస్తి, వగైరా అనుబంధాలు లేకపోతే తప్ప చెయ్యవలసిన పని ఉండదు. దేహభావనకే పొలం ఉంటుంది, విశ్వాత్మకు పొలం ఉంటుందా? నేను చెప్పే "నేను" నేను కాదని తెలిసేవరకు భోగ ప్రవృత్తి లేదు. మీరు నిరంతరం మీ యోగ క్షేమాల గురించే ఆలోచించకూడదు. దానివల్ల దేహాభిమానం పెరిగిపోతుంది, స్వార్థం వచ్చేస్తుంది, ఆత్మ చింతన రాదు. దానివల్ల స్వరూపానికి దూరం అవుతారు. మనం ఎవరికైనా పది రూపాయలు ఇస్తే పుచ్చుకునేవాడు, ఇవ్వగలిగేవాడు అనుకుంటే అది మనస్సును ఉద్రేకపరుస్తుంది. ఈ రెండు మాటలు వదిలి పంచుకోవడం అనుకోండి. రాగ-ద్వేషాలు విషం. వాటిని మనస్సులోకి వెళ్ళకుండా చూసుకోండి. వెళితే కక్కడం కష్టం. చాలామంది కర్మఫలితంతో అనుబంధం పెట్టుకుంటారు. దానివల్ల ఏమీ కలసిరాదు. నా తెలివివల్ల, కష్టం వల్ల ఇంత సంపాదించాను అనుకుంటారు. ఈశ్వర సహాయం అని అనుకోరు. భోగ కాంక్షలు, కామం, ధనం, కీర్తిని కోరేవారు పూజలు చేస్తారు. ఇవి ప్రపంచాన్ని కమ్మేస్తూ సత్యాన్ని తెలియనివ్వడం లేదు.

89. నీవు సమస్యలను కాదు చూడవలసింది, అవి అన్నీ ఎవరికి ఉన్నాయి అని చూడు. భయం కలిగితే శరీరానికి కలుగుతుందా? చైతన్యానికి కలుగదు కదా! అవి 'నేను' అనే మనస్సుకు కలుగుతుంది. అది పడిపోతే దాన్ని అంటిపెట్టుకున్న భయాలన్నీ రాలిపోతాయి. ఇప్పడే

చూడండి. దొంగ ఇంట్లోకి ప్రవేశం అవ్వకుండా చూసుకోవడం తేలిక. ఇంట్లోకి ప్రవేశించాక పోరాటం కష్టం. అలాగే రాగ-ద్వేషాలు మనస్సులోకి రాకుండా చూసుకో. వచ్చాక పోరాటానికి కష్టపడాలి. మీకు సబ్జెక్టు మీద విశ్వాసం ఉంటే దుఃఖం రాదు. రోజూ మాట్లాడేవారు మాట్లాడకపోతే దుఃఖం. దేహం కేంద్రంగా పెట్టుకున్న ఈ పిరికిపందలకా జ్ఞానం. ఏమిటి? గీతలో "ఆకారం ఉన్నా ఆకార రహితమే నేను" అన్నమాట హృదయగతమైతే శాంతి స్వరూపులు అవుతారు. రాగం వల్లనే ఎక్కువ దుఃఖం వస్తుంది. "లోకం అనిత్యం, అసుఖం, దుఃఖాలయం" అన్న గీతావాక్యంలో నాతో కల్పింపబడిన వాటికి ఆధారం నేనే కాని అందులో నేను లేను. ఈ వాక్యం మీరు అవగాహన చేసుకోవాలి. కోరికకు కోపము, లోభిత్వము సన్నిహితము. జీవుడిని వాని జీవితంలో మలుపు తిప్పే పరిస్థితులు ఉంటాయి. ఇవి ఈశ్వరునికి తెలియకుండా రావు. భోగాలు లేకపోతే సుఖం ఉండదనే భావన మనలో గట్టిగా ఉండిపోయింది. అది అసత్యము. ఎక్కడ దుఃఖం ఉంటుందో అక్కడే మనం తాదాత్మ్యం పొంది ఉన్నాము. అంటే ఇంద్రియాలు, మనస్సు, ప్రపంచం పై అని అర్థం. వ్యవహారిక సత్యం, ప్రాతిపదిక సత్యం అంటే ఉన్న దానిలా కనిపించేవి అన్నీ అసత్యాలే. నీవు చేసే సాధన కృషి వృధా కావు. ఉన్న వస్తువు ఉన్నట్లు చూడలేకపోవడానికి కారణం మోహం. నేను ఫలానా వ్యక్తిని, ఈ శరీరం నాది, ఈ కుటుంబం నాది, ఈ ధనం, ఈ గౌరవం నావి అని అనుకొంటున్నాము కదా! అవి అన్నీ ఎవరికి? మీరు వ్యక్తిగా భావించినంతకాలం వస్తూ ఉంటాయి. అవి ఉన్నంతకాలం జ్ఞానం రాదు. మా బావమరిది మోసం చేసాడు అంటారు. బంధువులు అంటే బంధించేవారు అని అర్థం. పేచీలు వద్దు, మనస్సులోకి వచ్చే ప్రతీ తలంపు ప్రభావం శరీరం మీద పడుతుంది. బుద్ధుడు "మా కుటుంబ సభ్యులు అంతా చాలా సుఖంగా ఉన్నారు అనుకోన్నా, ఎవరితో అయినా అన్నా ఆ మాట మీలో ఒక వాసనను సృష్టిస్తుంది" అన్నారు. నిజానికి అది అంత తప్పు కాదు. సహజంగా అలాగే ఉన్నాము కదా! అని మనకు అనిపిస్తుంది.





అది సుపీరియారిటీ కాంప్లెక్సుకు దారి తీస్తుంది. అది అద్భుతమైన మాట. దాని లోతులు మనం గ్రహించలేము.

90. దేవుని యొక్క సృష్టి మానవునికి దుఃఖాన్ని తీసుకొని రావటం లేదు. మనిషి తన కోరికలను నెరవేర్చుకోవడానికి ప్రయత్నిస్తాడు. అవే దుఃఖాన్ని తీసుకొనివస్తాయి. ఎంతోకొంత శాంతి ఉంటేనే కాని మనకి పునర్జన్మని తీసుకొని వచ్చే సంస్కారాలతో పోరాడలేము. కాబట్టి శాంతి అవసరం. త్యాగబుద్ధి లేనివానికి అహంకారం వదలదు. ఆత్మానుభవం కలుగదు. విద్య వల్ల వినయం వస్తుంది. నాతో నేను శాంతంగా ఉంటే సమాజంలో శాంతి కలుగుతుంది. భయం కలిగే పరిస్థితులు ఉన్నా భయం లేకుండా ఉండడానికి ప్రయత్నించి సాధిస్తే నీవు భయంలేని, నిద్రలేని స్థితిని పొందుతావు. కోపం అగ్నిలాంటిది. కోపం అనే వికారం వల్ల శరీరము, మనస్సు మండిపోతుంది. పాపం సంపాదించినా, పుణ్యం సంపాదించినా శరీరము, మనస్సు, మాట, వీటిని జాగ్రత్తగా నియమించుకోవాలి. అన్ని అరిష్టాలకు మూలం దేహాత్మభావనే. పరమహంసగారు "మానవునకు తిండి, నిద్ర, ధనముతో కాలం సరిపోతున్నది. ఇక సాధన ఏమి చేస్తాడు" అన్నారు. గౌరవాల వైపు వెళితే మనస్సు అంతర్ముఖం అవ్వదు. పనికి, నీకు ఉన్న ముడిని తీసేస్తే అనుబంధం తెగిపోతుంది. నా దేహం నా దేహం అంటున్నాము అది దేహ బుద్ధికి, మోహబుద్ధికి కారణమౌతుంది. కంచి పరమాచార్యులు "కర్తృత్వాన్ని సరాసరి తగ్గించుకోలేని వారు ఆసక్తి తగ్గించుకుంటే అది దానంతట అది క్రమంగా తగ్గిపోతుంది. శరీరానికి అన్నం పెట్టకపోతే శరీరం ఎలా చనిపోతుందో అలాగే అది కూడా" అన్నారు. వేదం "సత్యాన్ని తెలుసుకోవడానికి మాటలు పరిగెత్తాయి, మనస్సు పరుగెత్తింది. ఎంతదూరం వెళ్లినా అందక తిరిగి వెనక్కి వచ్చేస్తుంది. మాట అణగిన చోటే మనస్సు అణుగుతుంది" అన్నది. చనిపోయినప్పుడు ఏకాంతంగా వెళ్ళాలి. కాబట్టి సాధకునకు ఏకాంతవాసం అలవాటు చేసుకుంటే బలహీనతలు తొలగించుకోవచ్చును. ఉద్రేకపడితే నీ ఆలోచనా

సరళి అపహాస్యంగా మారుతుంది. భయం గందరగోళమే. సాధకుడు ప్రతీక్షణం జాగరూకతతో ఉండటం అవసరం. మనకు వందలాది శరీరాలు వచ్చాయి, వెళ్ళిపోయాయి. అందులో జంతుశరీరాలు ఉండవచ్చు. ఏ శరీరం నీది? ప్రారబ్ధమే ఇంట్లో వాళ్ళను తీసుకొచ్చింది. చైతన్యంలో అవి లేవు. మీ బుద్ధికి బుద్ధి చెప్పకోవడం కంటే మించిన సాధన ఏముంది? నీ మనస్సు నీవే బాగు చేసుకోకపోతే నిన్ను ఎవరు బాగుచేస్తారు?

91. అసూయత, ద్వేషం, లాభం, నష్టం, అపకారాలు అన్నీ తలంపులే. పుట్టింది శరీరము. దాని గొడవ వదిలే రూపనామాలను మరచిపోవాలి. కీర్తి కోసం ఏ పనీ చెయ్యకండి. అది పునర్జన్మను తీసుకొస్తుంది. మీకు ఏదో కారణం వల్ల దుఃఖం వస్తుంది అనుకోండి దానిని మీరు అదుపులో పెట్టుకోలేకపోతే మహాత్ముల సన్నిధిలో కుర్చుంటే నిప్పల మీద నీళ్ళు పోసినట్లు మీ దుఃఖం చల్లారిపోతుంది. దుఃఖ కారణం ఏమిటి? అని ఆలోచించే వారు తక్కువ. సొంత ఆలోచన ముఖ్యము. ఎవరైనా విమర్శిస్తే దేవుడే చేస్తున్నాడు అనుకోండి. మన బలహీనతలు తియ్యడానికి అని అనుకోండి. ఉపాదులు అన్నీ పరమేశ్వరుడే అనే భావన కలిగితే వేరు బుద్ధిపోతుంది. ఎదుటివాడు విమర్శించడం వల్ల నీకు దుఃఖం వస్తోంది అనుకుంటున్నావు. దానివల్ల దుఃఖం రావడంలేదు. విమర్శకు నీ మనస్సులో చోటు ఇవ్వడం వల్ల దుఃఖం వస్తుంది. మనకులేని వస్తువు అందంగా ఉంటుంది అనుకొంటున్నాము. దాన్ని కష్టపడి సంపాదిస్తావు, సంపాదించిన తరువాత తెలుస్తుంది అందులో ఆనందం లేదని. ప్రతీ జన్మలోనూ మనకు ఇదేపని. లోకంలో ఆనందం, సుఖం లేదు. దానికి విచారణ ఉపయోగపడుతుంది. మా కుటుంబ సభ్యులు మంచివారు కాదు అనుకోకండి. ఆ సంగతి భగవంతునికి తెలుసు. కొన్ని పాఠాలు నేర్పడానికే. మనస్సును వదిలేస్తే బహిర్ముఖం అవుతుంది. అంతర్ముఖం కావాలంటే సాధన కావాలి. ఈ ప్రపంచాన్ని మనస్సు ఇదే నిజమని భావింపచేస్తుంది. అంతర్ముఖానికి వెళ్ళడానికి ఇష్టపడదు. నామరూపాలు మినహాయిస్తే జగత్తు బ్రహ్మమే.





అంతంలో ఆనందం లేదు, అనంతంలోనే ఆనందం ఉంది. నీ హృదయంలో ఉన్న ఆనందాన్ని నీ కులబుద్ధి, నామబుద్ధి పొంగులా వచ్చి ఆ వెలుగును నీవే కప్పేసుకుని దుఃఖితుడుగా ఉన్నావు. "కళ్ళు లేనివాడు లోకంలో వస్తువులను చూడలేడు. అలాగే రాగద్వేషాలు ఉన్నవాడు సత్యాన్ని దర్శించ లేడు" అన్నారు శంకరులు. ఇంట్లో పని ఉన్నప్పడు చేసుకోండి. అంతేగాని రెండు చేతులూ పనిమీదే పెడితే భగవంతునికి దూరం అవుతావు. నీ శరీరమే నిజం కానప్పడు ఆ శరీరంతో ఎవరినైతే ప్రేమిస్తున్నావో వాళ్ళ శరీరాలు నిజమా? ఆమాత్రం తెలియడం లేదా? పొగ ఉంది అంటే అక్కడ నిప్ప ఉంటుంది. పొగ నిప్పను కనబడకుండా చేస్తుంది. అలాగే నీవు సత్యంలోనే ఉన్నా నీ నామబుద్ధి, రూపబుద్ధి నీకు అవగాహన లేకుండా చేస్తుంది. సత్యాన్ని మరుగుపరుస్తుంది. ఎదుటివాడు మంచివాడా? చెడ్డవాడా? అనే గొడవలు వద్దు. అందరినీ సమానంగా ప్రేమించండి. అది వారికోసం కాదు, మనం బాగుపడటం కోసం. జెకె గారికి ఎవరైనా కాలం చేస్తే "మనం అలాగే పోతామని వైరాగ్యం కలిగింది". అసూయ కుటుంబంలోనే మొదలవుతుంది. తరువాత ఊరంతా పాకుతుంది. మనస్సును విచ్చలవిడిగా తిరగకుండా అదుపులో ఉంచుకొని నియమించు కొన్న వానికి శాంతి, సుఖము కలుగుతుంది.

92. పేరడైజ్ లాస్టులో మిల్టన్ "దైవ రాజ్యాన్ని కీర్తి కాంక్ష వల్ల పోగొట్టు కొంటున్నావు" అన్నారు. మనుషులు ఆలోచిస్తారు, దేవుడు నిర్ణయిస్తాడు. బుద్ధుడు "నా రూపాన్ని, నా నామాన్ని ప్రమాణంగా పెట్టుకొని సాధన చెయ్యకండి" అన్నారు. 200 సంవత్సరాల తరువాత రూపంలేని సాధన ముందుకు వెళ్ళడం లేదని బౌద్ధులు. బుద్ధుని విగ్రహాన్ని పెట్టుకొని సాధన చేసారు. బుద్ధుడు "మనుషులు పుట్టరు, కోరికలు పుడతాయి" అన్నారు. నీకు సినిమా చూడాలని కోరిక పుడితే శరీరం వచ్చి తీరుతుంది. విరోధాలు దేహం కేంద్రంగా పెట్టుకొని సాగుతాయి. ఇంద్రియాలలో కోరికల వల్ల ఈ ప్రపంచం నిజంగా ఉన్నట్లు కనిపిస్తుంది. మన ఇంద్రియాలకు, ప్రపంచానికి

ఉన్న సంబంధం వల్ల అలా నిజమనిపిస్తుంది. బుద్ధుడిని నాకు జన్మ వస్తుందా అని అడిగితే "నీకు ఆశ ఉందా? ఆశ ఉంటే శరీరం వచ్చి తీరుతుంది. ఆ విషయం నన్ను అడుగుతావేంటి? ఈ చిన్న విషయం కూడా నీకు తెలియదా" అన్నారు. నీకు ఆత్మానుభవం కలిగితే కులంతో, దేశంతో, ప్రాంతంతో, మతంతో సంబంధం లేకుండా నీ ప్రేమ అనుగ్రహంగా ప్రపంచానికి పంచుతావు. ఉద్రేకమైన సంఘటన వచ్చినా అదే నిజం అనిపిస్తుంది. దేహం నేను అనే తలంపే కారణం. ఆ తలంపే లోకంగా కనిపించడానికి కారణం. భౌతికమనేది లేనే లేదు. రాగద్వేషాలు కూడా ఎమోషన్స్, పొంగులే. భయం కూడా వికారమే. అది ఆలోచనా శక్తిని తగ్గిస్తుంది. సినిమా చూస్తే ఆ కోరిక పెరుగుతుంది. ఏసు "స్వర్గరాజ్యం నీలోనే ఉంది" అన్నాడు. కృష్ణుడు "నేను నీలోనే ఉన్నాను" అన్నాడు. బుద్ధుడు దానిని సూన్యం అన్నాడు. వివేకం లేనివాడు బ్రతకడం కష్టం. కొందరు తన కుటుంబాన్ని బాధ్యతాయుతంగా, ప్రమాదం రాకుండా మాటల ద్వారా, చేతల ద్వారా జాగ్రత్త పడతారు. కానీ వారే ఇతరులకు సలహా చెప్పేటప్పుడు ఆ కుటుంబం విడిపోయేటట్లు, బంధంలో మగ్గిపోయేటట్లు చెపుతారు. కొంపకు పొగపెడతారు. నీకు అక్కడ వివేకం కావాలి. మీకు ఏ కారణం వల్ల దుఃఖం వస్తున్నా ఏదో బంధం ఉన్నట్టే లెక్క. దురాశ వల్ల మతిమరపు వస్తుంది. తరువాత గతిపోతుంది. స్త్రీ పురుష భేదం ఉన్నా శరీరం వచ్చేస్తుంది. మీకు మోక్షం రావడం లేదు అని అనుకొంటారు వస్తే భరించగలరా? శరణాగతి చేసేవాడు మోక్షం అడగడు. మీరు స్వతంత్రులు అయ్యారా? ఎవరైనా మాట అంటే భరించగలరా? నేను చేసాను అనేమాట అనకండి.

93. ప్రారబ్ధం అనుభవించేవాడు 'కర్త' నీలో ఉండాలి కదా! ఉన్నాడని నీవు అనుకొంటున్నావు. నిజంగా వాడు లేడు. వాడు లేడని తెలిస్తే ఇక ప్రారబ్ధం లేదు. మనం పరిష్కారం చేసుకోలేని సమస్యలను కాలం పరిష్కారం చేస్తుంది. ఏ పని ప్రారంభించినా ఈ పని దుఃఖాన్ని తీసుకొని వస్తుందా అనే వివేకం కలిగి ఉండాలి. అసలు పాపం ఎక్కడ





ఉంది? ఎటాచ్‌మెంటే పాపం. మీరు సంపాదించవలసినది ఏదీ లేదు. హృదయాన్ని ఖాళీ చేసుకొని మీ వాసనలు, అనుబంధాలు ఎలా వ్యవహరించి తొలగించుకోవాలో చూసుకోండి. మీకు సత్యం గోచరిస్తుంది. మీ ఇంట్లో మీరు అవసరంలేని మాటలు మానేసి మౌనంగా ఉంటే మాయ అనేది దూరమవుతుంది. పూర్వజన్మ సంస్కారాలనుబట్టి వాళ్ళు మాట్లాడతారు. సత్యం తెలిసాక నాలో ఉన్నదే లోకంలో ఉంది అనే సత్యం తెలిసాక భయం పోతుంది. బేధభావన వల్లనే భయం వస్తుంది. సౌందర్యం అనేది బయటలేదు ఆత్మలోనే సౌందర్యం ఉంది. అలాగే సుఖము, శాంతి బయట వెతుక్కుంటున్నాము. అది ఆత్మలోనే ఉంది. మీరు సంపాదించు కున్న ధనం చూసుకొని ఆనందిస్తున్నారు. అలాగే ఆత్మ తనంత తాను ప్రకాశించాలి. నీ ప్రయత్నం వల్ల వస్తుందా? మౌనంలోనే దేవుడు ఉన్నాడు. నిజమైన ప్రేమ అందులోనే ఉంది. విషయ సుఖాలవల్ల మనస్సు బాహ్యముఖం అవుతుంది. మీ పూర్వ జన్మల్లో ఆ వాసనలు ఉంటే ఈశ్వరుడు దాన్ని తెలుపు తాడు. అప్పుడు దానిని గ్రహించుకోవాలి, దాన్ని మరచిపోవాలి. అధిగమించాలి. రాగాన్ని, భయాన్ని, క్రోధాన్ని పోగొట్టుకోవడానికి నీ ప్రాణం పోయే వరకు జీవితం పొడుగునా సాధన చెయ్యాలి. భౌతిక సౌందర్యం వాడిపోతుంది. హృదయ సౌందర్యం గొప్పది. భౌతిక శరీరాన్ని ఉపయోగించుకొని హృదయ సౌందర్యాన్ని సాధించాలి. శంకరులు "ఎవరూ ఎవరికీ ఏమీకారు" అంటే "అత్త అని, పిన్ని అని కుటుంబ సభ్యుల మమకారాలు" అన్నారు. గుర్తింపులు కోరుకోకూడదు. సత్యానుభవాన్ని సమాజం ఇవ్వలేదు. "మిమ్మల్ని ఎవరూ మోహపడేటట్లు చేయడంలేదు. మీ దేహబుద్ధే మిమ్మల్ని మోహపరుస్తుంది" అన్నారు శంకరులు. జాగ్రదవస్థలో జీవుడు ఎంజాయ్ చేస్తున్నాడు. అందులో ఏమీ లేదు అనే బుద్ధి మెదడుకు అందాలి. విషయచింతన వల్లనే బుద్ధిపాడైపోతున్నది. దేహభ్రాంతి చావుతో సమానం. మీ సంతానంపై మీకు ఎంత ప్రేమ ఉందో అంతా నామీద ఉండాలని అనుకోకూడదు. వాడి సంతానాన్ని వాడు ప్రేమించుకుంటాడు.

అది ప్రకృతి. వారితో మనం రేష్‌గా ఉండకూడదు. నీ కాళ్ల మీద నీవు నిలబడలేవా? కామ్‌గా కూల్‌గా ఉండాలి. నాది అనేది నాది కాదని తెలియని మూలంగా మనం ఎక్కువగా నాది, నాది అంటున్నాము. అందులో బంధం ఉంది. అవి చైతన్యానికి సంబంధించిన వికారాలు కావు. అనాత్మవి.

94. వినండి, నేర్చుకోండి, భగవాన్‌ని స్మరించుకోండి. తరిస్తారు. లోభిత్వం కూడా నరక ద్వారమే. ఇష్టమైన తలంపు వస్తే శాంతి. ఇష్టం లేని తలంపు వస్తే దుఃఖం. ఇవి బయట పరిస్థితుల వల్ల వచ్చేవి. రెండూ నిజం కావు. లోకం, శరీరం బయట ఉన్నాయి. నిన్ను నీవు సంస్కరించు కోవాలి. మీకు రోజూ ఏమి గుర్తుకువస్తున్నాయి. మీ శరీరం, మీ కుటుంబ సభ్యులు. వాటిని పెనవేసుకొని తిరుగుతూ చనిపోయేవరకు ఇదే పని కదా! భోగం నీవు అనుభవిస్తే అది వాసనగా మారి తలంపు కింద వచ్చి రిపీట్ చెయ్యమంటుంది. అదే సంసారం. కీర్తి అనేది ఒక మానసిక జబ్బు. కొంతమంది దగ్గర డబ్బు ఉండదు. వారికి లోపల ఆశ ఉంటుంది. డబ్బు ఉన్నవారిని చూచి మా చుట్టాలు అంటారు. వాళ్ళు ఇచ్చేది లేదు, వీళ్ళు పుచ్చుకునేది లేదు. ఇక్కడ సమస్య ఏమిటి అంటే వాళ్లని స్మరించే బదులు కష్టపడి మీరే నాలుగు రూపాయలను సంపాదించుకోండి. అది మానేసి మా మేనమామ కొడుక్కి మూడు వందల ఎకరాలు ఉన్నాయి అంటే వాడు మీకేమైనా సహాయపడతాడా? ఎందుకు కాలాన్ని వృధా చేసుకోవడం? కోరికలు అడగడం దురద లాంటిది. మీ ఇంటి వద్ద కూర్చోండి. మంచి తలంపులు వస్తే అవి ప్రపంచం అంతా వ్యాపిస్తుంది. ఐన్‌స్టీన్ "హైలీ కాన్‌సంట్రేషన్ బ్రెయిన్" ఏదైతే ఆలోచిస్తారో అదే అయిపోతారు. ఏకాగ్రత అనే తాళం చెవి మనకు ఉంటే ఆనందం అందుతుంది. మీరు ఎవరివారు కారు, ఎవరూ మీవారు కాదు. అద్వైత అనుభవం వచ్చేవరకు వాడూ, నేనూ ఒక్కటే అనకూడదు. ఒకరు ఇతరులకు ఇచ్చినది తనకే అనుకున్నప్పుడు దానం ఏమవుతుంది. కరెంటు ఎక్స్‌ప్రెస్ అవ్వడానికి బల్బు ఎలా అవసరమో నీలో ఉన్న వాసనలు తలంపు రూపంలో ఎక్స్‌ప్రెస్ అవ్వడానికి





మేటర్ అవసరం. నీలో తలంపులు లేనప్పుడు వాసనాక్షయం అయినప్పుడు ఇంక శరీరం అవసరంలేదు. మీ హృదయంలో మోహం లేదు అనుకోండి ఇక మీరు పాపం చెయ్యరు. మిల్టన్ "మీరు రోజూ పొరపాటు మాటలు, పనులు చేస్తూ ఉంటే మీ సమాధులను ఎవరూ కట్టనక్కరలేదు. మీరే కట్టేసుకొంటారు" అన్నారు. నేను ఒంటరి వాడిని అనే భావం రానియ్యకండి, ఆనందంగా జీవించండి. గాలి పీడలు లాంటివి అంటే దెయ్యాలు పట్టుకొన్నవి వాటివల్ల బాధలకు లోనైతే తులసీదాస్ హనుమాన్ ఛాలీసా పారాయణం చేస్తే ఫలితం కలుగుతుంది. 6+4=10 నీవు 9 అనుకొన్నా పదే, అలాగే నీవు దేహమనుకొన్నా ఆత్మవే. అది నీకు అనుభవంలో లేకపోయినా అదే నీవు అయి ఉన్నావు. నీ బుద్ధి స్వచ్ఛంగా ఉండాలి. శరీరం మనస్సు అనే హద్దులు దాటాలి. ఆ అహంకారబుద్ధిని ఓవర్‌కమ్ చేస్తే ఇతరులు లేకపోతే సముద్రంలో నీరు కూడా నీకు చిన్నదైపోతుంది. నా శరీరం ఉన్నా లేక పోయినా ఇదే నా చివరిమాట. ఆ కర్తృత్వం ఉండనప్పుడు చేసిన కర్మ అకర్మ అవుతుంది.



# 11. సాధనా రహస్యాలు

1. హృదయ గ్రంథులను నీవు ఛేదించాలి. నీ దృష్టి అంతా దాని మీదే గురిపెట్టు. వాడిని వాడు ఉద్ధరించుకోలేనివాడు, వాడి కుటుంబ సభ్యులను ఎలా ఉద్ధరిస్తాడు? వారు ద్వేషించారు, వీరు మెచ్చుకొన్నారు అనేవి స్వప్నాలే. వాటిని అధిగమిస్తే ద్వంద్వాలు లేవు. దుర్యోధనుడు కృష్ణుడితో ఇలా అంటాడు "నీవు బూరా ఊదుతావు అనుకొన్నాను, రథం కూడా తోలుతావా?" అంటే ఆయన పాయసం త్రాగినట్లు ఎంజాయ్ చేసాడు. మనం చిన్న మటా అంటే వేదన పడతాము. ఒక డాక్టరు నాతో "సుఖం అంటే ఏమిటి? నేను వందమైళ్ళ నుంచి వచ్చాను. పురాణాలు, ఉపనిషత్తులు నేను చదువుకొన్నాను. ఒక్క మాటలో చెప్పండి ఉపనిషత్తుల మాటలు నాకు చెప్పకండి" అనగా "మీరు ఉన్నారా" అన్నాను. "ఉన్నాను" అన్నారు. "మీరు లేనప్పడే సుఖం అంటే ఏమిటో తెలుస్తుంది" అనగా రెండవ మాట మాడ్లాడకుండా వెళ్ళిపోయారు. మీలో లోకభావన ఉందో లేదో తెలుసుకుంటూ ఉండండి. ప్రస్తుతం మానవ శరీరం బాగా ఉండవచ్చును, ఒక గంటలో మార్పు రావచ్చును. అలాగే మనస్సు పరిస్థితి కూడా అంతే. చాలా పెద్ద ఆసుపత్రికి నీవు వైద్యం నిమిత్తం వెళ్ళావు. కాని చనిపోయావు. అలాగే విశిష్ఠమైన మానవజన్మ వచ్చిన ప్రయోజనం ఏమిటి? మీకు ఒక లక్ష రూపాయలు ఉంటే దానిని నాలుగు లక్షలు పెంచుకోవాలని తలుస్తావు. కానీ మనస్సును పై అంతస్తులోకి తీసుకొని వెళ్ళాలనే ఆలోచన రావడం లేదు. అది చాలామంది చేసే పొరపాటు. డబ్బు ఎంత సంపాదించినా మరణానంతరం కూడా రాదు. కానీ సాధనాపరంగా ఉన్నతస్థితిని తెచ్చుకొంటే అది మరణానంతరం మీ కూడా వస్తుంది. ఇంట్లో చాదస్తపు మనుషులు, బాధ్యతారాహిత్యంగల మనుషులు ఉండవచ్చు. వాళ్ళ భావాలను తీవ్రంగా తీసుకోకూడదు. తీసుకుంటే మన ఆధ్యాత్మిక ఎదుగుదల ఆగి పోతుంది. ఆనందాన్ని పంచిపెట్టాలి కానీ, దుఃఖాన్ని పంచిపెట్టకూడదు. మనం ఉన్నామని అనుకోవడం వల్లనే దుఃఖం వస్తుంది. ఆ "క్లూ" నీకు అర్థం





అయితే దుఃఖం రాదు.

2. శ్రద్ధ ఉంటే శ్రాద్ధాలు పెట్టండి. లేదా ఊరక ఉండండి. శ్రద్ధ లేని వాడికి శ్రాద్ధాలు ఏమిటి? నిన్ను నీవు బాగుచేసుకునే ప్రయత్నంలో దైవసహాయం వస్తే తీసుకో. కాని దానికోసం ఎదురు చూడకు. ఫలితం మన చేతులలో లేదని పని మీద విరక్తి పెట్టుకోకండి. చిన్న పిల్లలకు లక్క పిడతలు ముందు పడేస్తే వాటితో విసుగు వచ్చేవరకు ఆడుకొని తరువాత వాటిని అవతల పారేస్తారు. అప్పుడు తల్లి దగ్గరకు వెళతారు. అలాగే మనకు భగవంతుడు నామ రూపాలు అనేవి పడేసి అంటే కుటుంబ సభ్యులను కాని, ప్రకృతి అందాలతో మెరిసిపోయే రూపాలను మన ముందు పడేసి, వాటితో మనకు ఆటను పుట్టిస్తాడు. విసుగు పుట్టేవరకు ఆడుకొని తరువాత తల్లిలాంటి భగవంతుని ఆశ్రయిస్తాము. "అసహనం, అమర్యాద, అశ్రద్ధ పనికి రాదు. అజాగ్రత్త పనికిరాదు అంటూ ఒక గురువుగారు, శిష్యులు ఇంటికి వెళుతూ "నా దగ్గర చదువుకొన్నట్లు మర్యాద, ప్రేమ లోకంలో ఉండదు జాగ్రత్త" అన్నారు. అంటే ఇష్టం లేని సంఘటనలు జరిగినా అసహనం పనికి రాదు. రోజూ అన్నీ ఇష్టమైన సంఘటనలే జరగవు. రాముని అనుగ్రహం ఉంటే మన దూషణలు అన్నీ భూషణలుగా మారిపోతాయి" అన్నారు తులసీదాస్. ఆయనే ఇలా అన్నారు. ఒక భక్తుడు భగవంతుని ఇంటికి వెళ్ళి తలుపు తడితే "ఎవరూ?" అని వినిపించింది. అప్పుడు ఆ భక్తుడు "నేను ఫలానా, నా పేరు ఇది, నా శరీర రంగు ఇది" అని చెప్పగా తలుపు తెరువలేదు. నాలో ఏదో పొరపాటు ఉందని గ్రహించి ఒక సంవత్సరం సాధన చేసి ముగ్గి మరలా వచ్చి తలుపు తడితే "ఎవరు" అనగా ఆ భక్తుడే ఇలా అంటాడు "నువ్వే" అనగా తలుపు తెరువబడింది. భగవంతునిలో ఐక్యం అయినాడు. సాధనలో వైభవం అది. "నీవు ఆరోజుకారోజు నిగ్రహం పెంచుకో. ఆగ్రహం పెంచుకోకు" అంటోంది బృహదారణ్యకోపనిషత్తు. సాధన చేసే వాడికి మొదట నిద్ర వస్తుంది. లేదా మనస్సు ఎక్కడికోపోతుంది. అందుచేత దానికి ఏకాగ్రత, పవిత్రత నేర్వాలి. జరిగిపోయిన గొడవలన్నీ గొయ్యి తీసి

పాతిపెట్టు.

3. తల్లి కడుపులో ఉండగా ఏడవ నెలలోనే దేవుడు శరీరంలో దూరుతాడు. అక్కడ నుండి "నేను శరీర మాత్రుడను" అనుకొంటాడు. మాయ అక్కడ నుండే ప్రారంభం అవుతుంది. ప్రపంచాన్ని నాకి నాకి సబ్బు అరిగిపోయినట్టు అరిగిపోతున్నారు. అవతార పురుషులను దర్శించి, స్మరించి, పవిత్రులై సత్యాన్ని దర్శించాలి. విషాన్ని చూచినా, స్మరించినా చావము. కానీ విషయాల్ని చూచినా, స్మరించినా చచ్చిపోతాము. అంటే కొత్త సంస్కారాలలో కూరుకుపోతాము. మనం ఎవరినైనా చూస్తే మీ జీతం ఎంత? మీది ఏ కులం? అని అడుగుతాము. భగవంతుడు చూచేది "జీతానికి తగ్గ పని చేస్తున్నాడా?" అని చూస్తాడు. చల్లటి ఆలోచన, ప్రశాంతమైన ఆలోచన, వివేకం గల ఆలోచన అవసరం. అనిత్యము, క్షణికము, అశాశ్వతమైన ఈ శరీరము, ఈ లోకము అనిత్యము అని తెలుస్తూ సాధన చెయ్యాలి. మన జీవిత విధానం ఇలా ఉండాలి. మన మనస్సును క్రమశిక్షణలో ఉంచుకోవాలి, సాధనలో కూడా క్రమశిక్షణ ఉండాలి. మీకు ఏ దుఃఖం, ఏ అశాంతి వచ్చినా బాధపడకండి. ఆ దుఃఖమే, ఆ అశాంతే దుఃఖంలోంచి ఎలా బయటపడాలో చెబుతుంది. మన ధర్మ ఆచరణే మనకు మార్గాన్ని నిర్దేశిస్తుంది. అశాంతి మీకు వచ్చినప్పుడు గోదావరి వరదలా వస్తుంది. అప్పుడు మీకు కనిపించిన ప్రతీ అపకారిని తిట్టకండి. పుట్టిన మనస్సు మొద్దు. పుట్టని ఆత్మకు తెలివి ఉంది. సమాజపరంగా, కుటుంబపరంగా, ప్రకృతిపరంగా దేహ ప్రారబ్ధాన్ని అనుసరించి నీకు అశాంతి పరిస్థితులు కలిగినా శాంతంగా ఉంటే భగవంతుడు అనుకొంటాడు "అయ్యో ఎంత అశాంతి కలిగినా, పరిస్థితులు ఎలా ఉన్నా దుఃఖం తెచ్చుకోవడం లేదు. వీడికి అనుగ్రహం ఇవ్వకపోతే ఎవరికి ఇస్తాము?" అని ఆ దుఃఖాన్ని తీసి శాంతిని కలుగజేసి మోక్షాన్ని ఇస్తాడు. మీరు ప్రతీ చిన్న విషయానికి ఆందోళన పడుతూ ఉంటే మీ బుద్ధిలో శుచి లేదని అర్థం. దేని సహాయంతో ఇంద్రియాలు, బుద్ధి పని చేస్తున్నాయో అవి అణిగిపోతే సత్యం తెలియబడుతుంది.





4. మనం ఎవరితోనూ మానసిక అనుబంధం పెట్టుకోకూడదు ఒక్క ఈశ్వరునితో తప్ప. సంఘ దోషం ఉంటే దుఃఖం వస్తుంది. మిత్రుల పట్ల అతిగా ఉండవద్దు, శత్రువుల పట్ల ద్వేషభావం పెట్టుకోకూడదు. సమానంగా ఉంటే మీ మనస్సు ఆత్మ గూటిలో పడిపోతుంది. నింద, స్తుతులను ఎవరైతే సమానంగా చూసుకుంటారో వాడే భక్తుడు. అట్టివారే భగవంతుని అనుగ్రహానికి పాత్రులు అవుతారు. "థియరీ" కన్నా "ప్రాక్టికల్"కే ఎక్కువ సమయం కేటాయించాలి. మీరు పుస్తకాలు చదివి ఇతరులకు చెప్పడంతోనే సరిపెట్టుకోకుండా ప్రాక్టీస్ ఎక్కువగా ఉండాలి. మీ రోగానికి డాక్టరు ఇచ్చిన మందును వేసుకొని ఎలా పనిచేస్తున్నదో గ్రహించాలి. పని చెయ్యకపోతే డాక్టర్‌కి చెప్పి తగ్గే మందు కోసం ప్రయత్నం చేస్తాము. అలాగే సాధన పేరు మీద జప, ధ్యానాలు చేసి మనోవ్యధ పోకపోతే నీ సాధన ప్రయోజనం లేదని అర్థం. మీరు ఆ విషయాన్ని గ్రహించి ఆచరించాలి. నీవు ఆత్మవు, ఆత్మకు వ్యధలు లేవు. నీ ఇంటికి వచ్చిన వానిని ఈశ్వర భావనతో చూడు, నీ శత్రువుని కూడా ఆ భావనతోనే చూడు. బేధబుద్ధి లేని వానికి అసూయ, భయం, క్రోధం ఏమిటి? సాధన చేయగా చేయగా సాధనా ఫలితం ఏదో ఒక రోజున కనబడుతుంది. ఈశ్వరుడు నీది నీకే ఇచ్చేస్తాడు. ఏ కోరికా లేని ఈశ్వరుడు మీరు కోరుకున్నది ఆయనకెందుకు? మీకే ఇచ్చేస్తాడు. వాడు దేవుడు. మీకు వచ్చే కష్టం మోక్షం వైపుకు మరలించడానికి ఈశ్వరుడు చేసే పని అది. భీష్ముడు అంపశయ్యపై ఉండగా ధర్మరాజు అంటాడు "మీ కళ్ళ వెంట ఆ కన్నీరు ఎందుకు కారుతున్నాయి. మరణ వేధన వల్ల వస్తున్నాయా?" అంటే భీష్ములవారు ఇలా అన్నారు "భగవంతుడైన శ్రీ కృష్ణుడు మీకు బంధువు, మిత్రుడు, గురువు, సారథి, తల్లి, తండ్రి, హితుడుగా ఉండి కూడా మీకు కష్టాలు వచ్చాయి కదా! ఈశ్వరుని లీలలు ఇటువంటివి కదా! అని వస్తున్నాయి. మరణ వేదన వల్ల కాదు" అన్నారు. శరీరం వల్ల, వాక్కు వల్ల, మనస్సు వల్ల, పాప పుణ్యాలు సంక్రమిస్తాయి. కాబట్టి వాటిని కంట్రోల్ చేసుకోవాలి. అవి ఆత్మజ్ఞానాన్ని పొందడానికి తగిన విధంగా

మలచుకోవాలి.

5. ఆత్మ జ్ఞానానికి ఏకాగ్రత ఒక్కటే సరిపోదు, ట్రైనింగ్ కూడా అవసరం. కాలం కలిసిరావాలి. చేసిన ప్రయత్నం ఊరికేపోదు. పరమ హంసగారు వివేకానందుని గురించి ఇలా అన్నారు "మంచిరోజులు వస్తున్నాయి, ఈ కష్టాలు తాత్కాలికం" అంటే భవిష్యత్తులో జరిగే పరిణామాలు జ్ఞానికి తెలుస్తాయి. ఆయనకు ఆ ధైర్యాన్ని కలిగించడానికి ఇంకా ఇలా అన్నారు "ఇంకా పొద్దుగూక లేదు కదా!" అంటే ఇంకా ఎంతో ఉజ్వల జీవితం ఉంది కదా! అని అర్థం. మిమ్మల్ని మీరు అర్థం చేసుకుంటే దుఃఖం రాదు. కొందరు అన్నీ ఉండి ఏడుస్తూ కూర్చుంటారు. ఇంక ఏడుపేనా పని. ఇంకొక పని లేదా? అంటే వారికి జ్ఞానం లేదని గుర్తు. బాహ్యపరిస్థితుల వల్ల దుఃఖం రావడం లేదు. బాహ్యపరిస్థితులు స్వప్నము. దాన్ని నిజమనుకొని దుఃఖం తెచ్చుకోకూడదు. మనస్సు, వాక్కు, చేత ఒక క్రమంగా నిర్మలంగా ఉండాలి. దేహం నేను అనే తలంపులోనే రోగం అంతా ఉంది. ఆ తలంపే మూల రోగం. అది నశించాలి. గడప దాటలేనివాడు కాశీ వెళతాను అనడం ఎటువంటిదో సాధకుడు దేహ ప్రారబ్ధంలో దుఃఖాలను ఎదుర్కోలేని వాడు ఆత్మానుభవం పొందుతాను అనుకోవడం అటువంటిదే. అద్దె ఇంట్లో ఉన్నవాడు అద్దె కట్టాలి. దేహం కూడా అద్దె ఇల్లు లాంటిదే. దానికి అద్దె రోగాల రూపంలో చెల్లించాలి. అందరూ డబ్బు సంపాదించుకోవాలి, పదవి, కీర్తి సంపాదించుకోవాలి అనేగాని వివేకం ఎంతవరకు సంపాదించుకొన్నాము అనే ఆలోచన రావడంలేదు. ప్రకృతి వస్తువులను అనుభవించడం కన్నా వాటిని కంట్రోల్ చేసుకోవడంలోనే ఆనందం ఎక్కువ ఉంది. "ఆశ కోసం బ్రతకకు. ఆశయం కోసం బ్రతుకు" అన్నారు గాంధీజీ. "మీరు ఎవరితోనైనా మాట్లాడుతుంటే ఆ భావనలో అహంభావన లేకుండా మాట్లాడండి" అన్నారు గాంధీ. మీకు ఇష్టంలేని సంఘటనలు జరుగుతున్నాయి అంటే అది మీ ఆధ్యాత్మిక అభివృద్ధికి, ఔన్నత్యానికి పునాది. పనిచేసేటప్పుడు ఆసక్తి పెట్టుకుంటే అలసిపోతాము.





6. పిచ్చి వానిని ఎవరూ సుఖపెట్టలేరు. కాలగర్భంలో ఏమి ఉందో మీకు తెలియదు. మీ పని ఏదో మీరు చేసుకోండి. ఏ సుఖంతోనూ పోల్చడానికి వీలు లేదో అటువంటి సుఖాన్ని పొందడానికి ప్రయత్నం చెయ్యి. మీరు చెప్పినట్టు మనస్సు వినేలా జీవించాలి. రాగ-ద్వేషాలు పెంచుకోకుండా మనస్సును లోపలికి పంపాలి. సాధన చేస్తే సరిపోదు. ఉపయోగంలేని మాటలు, చేతలు, తలంపులు చెయ్యవద్దు. అవి పంటలో ఉన్న కలుపు మొక్కలు. "నా బలహీనతల వల్లనే సత్యం తెలియబడటంలేదు. నా బుద్ధిని బాగు చెయ్యి" అని భగవంతుడిని ప్రార్థించాలి. అద్వైతానుభవం నీ మనస్సులో పాతుకోవాలి. అంతేకాని అటు, ఇటు చూడకు. ఇతరుల విమర్శలను నీవు పట్టించుకోకు. మనకు అనారోగ్యం ఉంది బాధపడుతున్నాము. డాక్టరు గారు నాలుగు రకాల చేదు మందులు ఇస్తారు. అవి చేదుగా ఉన్నా బాధ నుంచి బయటపడడానికి వాటిని తీసుకొంటాము. అలాగే మీ మనస్సుకు చేదుగా ఉన్నా భగవంతుడు చెప్పిన పనులను నీవు చేస్తే నీవు అహంకారం అనే రోగం నుండి బయటపడతావు. శాంతిని పొందుతావు. ఇష్టంగా, ప్రేమగా చేసే పనులకు ఆటంకాలు ఉండవు. అది భౌతికమైనా, ఆధ్యాత్మికమైనా. కస్తూరిబాయి "అవసాన దశలో ఉన్నాను. ఇండియా రావలసింది"గా దక్షిణాఫ్రికాలో ఉన్న గాంధీజీకి ఉత్తరం వ్రాస్తే ఆయన తిరిగి సమాధానం ఇలా వ్రాసారు "జీవితానికి, మరణానికి బేధం లేదు. నేను చేతిలో ఉన్న పనిని వదిలిరాలేను" అని వ్రాసారు. బేధం లేదని అనుభవ పూర్వకంగా తెలుసుకుంటే దుఃఖం నిన్ను ఏమీ చెయ్యదు. ఆనందం నీలోనే ఉందని అర్థం. మనం ఏ గురు రూపాన్ని ఆరాధిస్తామో అదే మనలను ఆ రూప స్థితికి తీసుకొని వస్తుంది. జీవితంలో పాఠాలు నేర్చుకోవాలి. భవిష్యత్తులో అటువంటి పొరపాట్లు జరగకుండా చూచుకునేవాడే తెలివి గలవాడు. నీ మనస్సు నీవు చెప్పినట్లు వింటే అది మంచి స్నేహితుడు. నీకు ఉపకారం చేసినట్లు ఉంటుంది. జీవితంలో అనేక సంఘటనలు జరుగుతాయి. వాటిని నీవు వివేకంతో పరిష్కరించుకోవాలి.

7. నీ బుద్ధి సరిగా ఉపయోగపడేలా నీవు ప్రయత్నం చెయ్యాలి. నీ ఆరోగ్యం బాగా ఉండటానికి వ్యాయామం చేస్తావు. అలాగే నీ బుద్ధిని నిద్ర పోకుండా తెలివిగా, వివేకంగా ఉండే వ్యాయామం నీవు చెయ్యాలి. అలసత్వం పనికిరాదు. అలా ఉంటే జీవితంలో కష్టాలకు, నష్టాలకు గురి అవుతావు. కొండ గుహలో సింహం ఉంటుంది. మన హృదయ గుహలో పరమాత్మ ఉన్నాడు. ఆ సింహం కన్నా ఎన్నోరెట్లు బలవంతుడు. ఆయనను ఎప్పుడైనా ఎంజాయ్ చేసారా? మీరు హృదయ పూర్వకంగా గుండెలమీద చేయి వేసుకొని చెప్పండి. గాలి ఎంత సహజంగా పీల్చుకుంటామో అలాగే మీరు మంచి పనులు సహజంగా చేయండి. నేను అది చేసాను అని అనుకుంటే వేలాది జన్మలకు సరిపడే వాసనలు అంటుకుపోతాయి. బుద్ధిమంతుడు వాడిని వాడు సరిచేసుకుంటాడు. జరిగిపోయిన గొడవలలో పొరపాట్లు ఇకముందు చెయ్యకూడదని అనుకొంటాడు. బుద్ధి లేనివాడు ఇతరుల మీద నిందలు మోపుతాడు. దుమ్ము అంతా తనలోనికి నొల్లుకొని కుళ్ళిపోతాడు. పుట్టకుండా ఎవ్వరూ చనిపోరు. చనిపోకుండా ఎవరూ పుట్టరు. ఇది దేహానికి సంబంధించిన విషయం. బుద్ధి శుద్ధి అవ్వాలంటే జపధ్యానాదు చేయాలి. శరీరము, మనస్సు, వాక్కు శుచిగా ఉండాలి. భగవంతుని పేర్లు అన్నీ మంత్రాలే. భగవంతుని హృదయం విశాల మైనది. ఎవరు ఏ నామాన్ని చింతించినా అందరూ నన్నే పొందుతారు అన్నాడు వాసుదేవస్వామి. ఇది శరీరమని, ఇది మనస్సని మీకు తెలుస్తున్నది. అలాగే ఇది మనస్సని, ఇది ఆత్మ అని మీకు స్పష్టంగా తెలిస్తే ఆత్మలో ఉన్న సుఖం మీకు తెలుస్తుంది. మంచి చేయడం కన్నా మంచిగా ఉండటం కష్టం. ఎదుటివారికి ఒక పండు ఇవ్వవచ్చు, దారి తెలియకపోతే దారి చూపించవచ్చు, కాని మంచిగా ఉండటం కష్టం. శత్రు, మిత్రుల భ్రాంతులు మనస్సులో ఉంటాయి. మిమ్మల్ని ఎవరైనా మంచివారు అంటే ఆనందం కలుగుతుంది. మీ స్వభావం మంచితనం. అలాగే మిమ్మల్ని ఎవరైనా చెడ్డవారు అంటే కోపం వస్తుంది. నిజానికి మీరు చెడ్డవారు కారు. మీరు





మంచితనాన్నే కోరుకుంటారు. అలా ఉంటే మీకు సంతోషం కలుగుతుంది.

8. సాధన చేసేవారు సంతోషంగా చెయ్యాలి. జప, తపాలు, ప్రాణాయామం మనోనిగ్రహానికి సహకరిస్తాయి. మనం అనాత్మ విషయాలకు ఇచ్చే విలువను ఆత్మ సముపార్జనకు ఇవ్వడం లేదు. దేహగతమైన విషయాలు వికృత ఆనందాన్ని ఇస్తాయి. ఆత్మానందం సహజమైనది. వల్లకాడు దాకా వచ్చే శరీరం బాగుకోసం ఎంతో ఖర్చుపెడుతున్నావు. మరణానంతరం కూడా వచ్చే మనస్సును బాగు చేసుకుందామనే బుద్ధి మనకు కలగడంలేదు. రాత్రి సమయంలో పెరటి తలుపులు, వీధి తలుపులు తాళం వేసేస్తున్నాము. తాళం పడిందో లేదో ఆని నాలుగుసార్లు పరీక్షించుకొంటున్నావు. దొంగలు వచ్చి ఆస్తి దోచుకుపోతారని అలాగే నీ మనస్సును పాడుచేసే తలంపులను, ఆలోచనలను రాకుండా తలుపులు వేసుకుంటున్నావా? మీకు తలుపులు వేద్దామనే ఉద్దేశ్యం లేదా? అసలు తలుపులు లేవా? అలా ఉంటే నీ మనస్సు ఎలా శుద్ధి అవుతుంది? ద్వేషం ఉన్నచోట దోషం ఉంటుంది. బుద్ధి బాహ్యాముఖంగా చూడటం అలవాటైపోయింది. ఇతరులలో దోషాలు కనబడితే నీలో ఉన్న దోషాలు ఎలా కనబడతాయి? ఇటువంటివాడు బాగుపడే సమస్యే లేదు. బాహ్యంగా చూచే బుద్ధిని లోచూపు కలగజేసేవాడే గురువు. ఆయన తప్ప ఈ విషయంలో ఎవ్వరూ సాయం చెయ్యలేరు. భగవంతుడు మనకు అధీనమైనప్పుడు ఆయన మనకు ద్వైతం లేకుండా చేస్తాడు. భగవంతుని సంకల్పం సరిగా అర్థం చేసుకున్నవారికి దుఃఖం రాదు. ఆ వైభవం శరణాగతి వల్ల సాధ్యమౌతుంది. బొంగరం తిరిగి, తిరిగి శక్తి ఉడిగిన తరువాత ఆగిపోతుంది. అలాగే మీ జీవిత కాలంలో ఎన్ని అవమానాలు, సన్మానాలు, అనారోగ్యాలు ఉన్నాయో అన్నీ ఈశ్వర సంకల్పం వల్ల జరిగి చావుతో ఆ జన్మ ఆగిపోతుంది. శ్రద్ధ తగ్గిపోవడం వల్ల సందేహాలు వస్తూ ఉంటాయి. రైల్వే స్టేషన్ చేరితేగాని రైలు ఎక్కలేము. విమానాశ్రయానికి వెళ్ళకుండా విమానం ఎక్కలేము. అలాగే సత్త్వగుణం లేకుండా సత్యాన్ని దర్శించలేము.

9. దారిద్ర్యం నేర్పే పాఠాలు కొన్ని ఉంటాయి. కృష్ణుడు అంటాడు "నీవు ఏదైనా అడుగుతావు అనుకో, నేను ఇవ్వను అనుకో అప్పుడు కూడా నామీద భక్తి, ప్రేమ పోగొట్టుకోకూడదు. పోగొట్టుకుంటే పాడవుతావు" అంటాడు. నీవు ప్రార్థనలు ఎన్ని చేసినా నీకు సహాయం చెయ్యలేదు అనుకో, నీవు ప్రార్థించడం మానలేదు అనుకో అప్పుడు నీ భక్తికి పొంగిపోయి మోక్షాన్ని ఇస్తాడు. సహించే స్వభావం నేర్చుకోండి. మనిషికి ఏదో ఒక నీడ కావాలి. దానిమీద అతిగా మమకారం పెట్టుకుంటే అక్కడే ఆగిపోతావు. ఇది గ్రహించండి. మీరు చనిపోయిన తరువాత ఆ ఇల్లు నీదైనా నిన్ను అందులో ఉంచరు. గురునానక్ అన్నారు "నీవు చనిపోయిన తరువాత గుండు సూది కూడా తీసుకొని వెళ్ళలేవు". ఊరుమీద, పొలాలమీద మమకారం పెట్టుకోకండి. దేహంలేని వానికి పొలం ఏమిటి? ఊరు ఏమిటి? మమకారం పెట్టుకుంటే మరలా సాధన చెయ్యాలి. మనతో భుజింపబడ్డ ఆహారం అంతా పంచభూతాలతో నిర్మితమైనదే. భోజనం దగ్గర జాగ్రత్తగా ఉంటే దానికి మందులతో పనిలేదు. భోజనం దగ్గర నియమం లేనివానికి మందులు వాడినా ప్రయోజనం లేదు. రూపనామాలు మాయ. దాహం లేనివాడు నీళ్ళు త్రాగలేడు, ఆకలి లేనివాడు అన్నం తినలేడు, జిజ్ఞాస లేనివాడు సత్యాన్ని తెలుసుకోలేడు. గుర్తింపుల జోలికి వెళితే ఆధ్యాత్మిక అభివృద్ధి ఆగిపోతుంది. గుర్తింపులు కోరేది మనస్సు. ఈ విషయం గ్రహించండి. ఒక పేదవానికి మీరుకొంత ధనం సహాయం చెయ్యవచ్చును కానీ వాడు కూడా మీ అంత వానిగా ఎదగాలని భావించగలిగితే మీ బుద్ధి మంచి బుద్ధి అని అర్థం.

10. దైవం చెప్పినట్లు మీరు నడుచుకుంటూ ఉంటే అదే సేవ. దానితో మీరు తరిస్తారు. ఇది అమృత మయమైన మాట. బయట ఉన్న రాక్షసులు బాంబులు వేస్తే చనిపోతారు. లోపల ఉన్న కోరిక, కోపము అనే రాక్షసులను మనం చంపలేము. దుఃఖాన్ని భూతద్దంలో చూడటం మానేయండి. ఆంజనేయస్వామి అన్ని అవస్థలలోను, అన్ని వేళలా, రాముని





అంటిపెట్టుకొని ఉన్నట్లుగా మనస్సు ఆత్మని అంటిపెట్టుకొనేటట్లు చేసుకుంటే సత్యానుభవం కలుగుతుంది. మీ రెండునేత్రాలు ఎలా కాపాడుకోగల్గుతున్నారో అలాగే విద్య, తపస్సు రెండూ కాపాడుకోవాలి అని వేదం చెబుతున్నది. కష్టం వస్తే భరించడం కూడా తపస్సే. మీరు ఇతరులను చూసి భయపడితే సూక్ష్మదృష్టి తగ్గిపోతుంది. చాలామంది విమర్శలు ఎందుకు చేస్తారంటే తనని అందరూ మంచివారు అనుకోవాలని అలా విమర్శిస్తారు. విమర్శలు మీరు మొదలుపెడితే మీకు అహంకారం పెరిగిపోతుంది. నీ జీవితంలో ఒక్క గంటకూడా పాడుచేసుకోకుండా సత్యానుభవానికి కృషి చెయ్యి. నీవు జీవన్ముక్తుడవు కావాలి. ఈ క్రియలో నీ సాధన నిజం అయితే నీకు కావలసిన వనరులు తిండి, బట్ట అన్నీ ఈశ్వరుడే సమకూరుస్తాడు. నీవు మాట్లాడుతున్నప్పుడు ఆ మాట నీ అహంకారాన్ని పెంచుతున్నదా? తగ్గిస్తున్నదా? అని చూసుకొని మాట్లాడాలి. అదే నిజమైన సాధన. చనిపోవడానికి ముసలితనం గేటు. దేశభక్తి దైవభక్తికి ప్రిపేర్ చేస్తుంది. నీవు ఆధ్యాత్మికంగా పరమహంస అవ్వాలని ఒకేసారి హైజంప్ చేస్తే పళ్ళు ఊడతాయి. దానికి ప్రిపరేషన్ చాలా అవసరం. సాత్విక బుద్ధితో కూడిన ఆలోచన లేకుండా బ్రహ్మానుభవం కలుగదు. రంపం పెట్టి కోసినా ఆ రెండూ లేకపోతే (దేశభక్తి, దైవభక్తి) సిద్ధి కలుగదు. ద్వైతం మాయ, అద్వైతం జ్ఞానం. వైరాగ్యం లేకుండా ఏకాంతవాసం సాధ్యంకాదు. కోరికలతో మనస్సు కల్లోలంగా ఉంటే ఒంటరిగా గదిలో కూర్చున్నా అది ఏకాంతవాసం కాదు. మనకు మంచి మనస్సు ఉంటే మంచికి ఉపయోగించాలి. చెడుకు ఉపయోగిస్తే క్రమంగా విషపూరితమౌతావు. బంగారంతో కట్టిన ఇంట్లో నీవు పుట్టినా మీకు దేహం వచ్చింది అంటే దుఃఖం వచ్చి తీరుతుంది.

11. గాంధీజీ అన్నారు "రమణుడు, బుద్ధుడు, ఏసు భిక్ష చేసుకున్నారు. మనం అలా ఉంటే బాధలేదు అనుకోండి. మీకు పరిస్థితుల వల్ల పేదరికం వచ్చింది. మీకు ఉపకారం కలిగితే మీరు భాగ్యవంతులు అవుతారు. పేదరికాన్ని వరించడం వేరు, పేదరికాన్ని భరించడం వేరు"

అన్నారు. మంచాలు లేక చాపలను ఆశ్రయించారు. మంచాలు ఉంటే చాపలను వదిలేస్తారు. దేవుడు మన హృదయంలో లేడు, మనమే దేవుని హృదయంలో ఉన్నాము. పిల్లలు ప్లే గ్రౌండ్‌లో ఎలా ఆడుకుంటారో అలాగే మీ మనస్సుతో విన్న భగవంతుని మాటలను మననం చేసుకుంటూ వాటితో ఆడుకోవాలి. విషయం అనుభవంలోకి వచ్చిన తరువాత దానిని ఎంజాయ్ చేస్తారు. మీరు ప్రతికూల పరిస్థితులలో ఎంత జాగ్రత్తగా ఉంటారో. అనుకూల పరిస్థితిలో కూడా అంత జాగ్రత్తగా ఉంటూ సజ్జనులను స్మరిస్తూ ఉండాలి. మీ ఇంటి దగ్గర కూర్చున్నప్పుడు మనస్సు ఎటువైపు లాగుతున్నదో చూసుకోవాలి. అనవసరపు విషయాల వైపు మనస్సు వెళితే ఆత్మవైపుకు మరల్చాలి. ఫాస్ట్ ఈజ్ వేస్ట్, ఫ్యూచర్ ఈజ్ మిస్టరీ, ప్రజంట్ ఈజ్ గిఫ్ట్. సాధన ఎందుకు అంటే సాధకుడు మనస్సు లేకుండా చేసుకోవడానికే. సాధన మనస్సుతోనే చేస్తాము. సహనాన్ని నేర్చుకోవడానికి కూడా సహనం కావాలి. అంటే రియాక్షన్ తగ్గించుకోవాలి. భగవంతుని స్మరించుకుంటూ ఉంటే మీరు పవిత్రులు అయిపోతారు. ఇతర సాధనలు అన్నీ రెండవ పక్షమే. గతిని పొందాలంటే గతాలను చూడకండి. వైరాగ్యం ఉన్న మనిషికి చాపల్యం తగ్గిపోతుంది. మనం అభివృద్ధి చేసుకొనేది 'సెన్స్'ని, 'నాన్‌సెన్స్'ని కాదు. దేహాభిమానం ఉన్న వానికి ఏడుపు వస్తుంది. ఆనందం రాదు. శరీరానికి వచ్చిన జాడ్యాన్ని భరించగలం కానీ మనస్సులో ఉన్న జాడ్యాన్ని భరించలేము. పూర్వజన్మలో వాసనలే మనల్ని బంధిస్తాయి. సమాజ పరిస్థితులు, కుటుంబ పరిస్థితులు ఒకే రకంగా ఉండవు. స్నేహితుల వల్ల సుఖాలు, విరోధుల వల్ల కష్టాలు జరిగిపోతాయి. ప్రకృతి పరిస్థితులు మీ చేతులలో లేకపోయినా మీ బుద్ధిని, మీ ప్రవర్తనను కాపాడుకోవడంలో మీకు స్వతంత్రం ఉంది. ఒక కోపధారితో తగువు పెట్టుకోవడం కంటే సాధన చేసి శాంతిగా ఉండటం మంచిది. వాడిని మనం బాగుచేయలేము.

12. విషయ పిచ్చి ఉన్నవాడు మోహంలో ఉంటాడు, అది నీచ జన్మలకు తీసుకుపోతుంది. ఈశ్వర పిచ్చి ఉన్నవాడు తత్త్వంలో ఉంటాడు.





రెండూ పిచ్చే అయినా ఈశ్వరపిచ్చి ఈశ్వర దర్శనం అయ్యే వరకు ఉంటుంది. తరువాత అది చల్లారిపోతుంది. నీ కన్నా అన్యంగా ఎవ్వరూ లేరని తెలిస్తే భయంలేదు. కర్మ - ఉపాసన - ధ్యానం - జ్ఞానం. ఇదీ వరుసక్రమం. మీరు కుటుంబ సభ్యులతో వ్యవహరించేటప్పుడు 'దున్నపోతా' అని అనకండి. సౌమ్యంగా చెపితే వారు వింటారు, మీరు బాగుపడతారు. వివేకులు సంస్కరించబడిన మాటలు మాట్లాడతారు. 'సెన్స్' విడిచిపెట్టకండి. 'నాన్‌సెన్స్' గొడవల్లోకి వెళ్లకండి. కోపకారణం ఉన్నా కోపం చూపకు. "ద్వేష కారణం ఉన్నా ద్వేషంతో వ్యవహరించకు. ఎవ్వరినీ మొట్టికాయలు మొట్టకండి, ఎవ్వరినీ ముద్దు పెట్టుకోకండి" అన్నాడు న్యూటన్. వైరాగ్యం ఉంటే ఏ ఆకర్షణ కలుగదు. లోకవాసన, దేహవాసన మూలంగానే అశాంతి కలుగుతుంది. సెన్స్ పెరిగేకొలది, నాన్‌సెన్స్ తగ్గుతూ ఉంటుంది. నేను చెప్పడం వల్ల మీకు సబ్జెక్ట్ అర్థం అవ్వడంలేదు. సబ్జెక్ట్‌ని మీరు ఎంతోకొంత స్వీకరించడం వల్ల మీకు అర్థం అవుతుంది. ఆ అర్హత మీలో ఉంది. దీనివల్ల నేను నిమిత్తమాత్రుడను. చెవులు వింటాయి, కళ్ళు చూస్తాయి. కానీ విషయం ఎప్పుడు ఎక్కడ అర్థం అవ్వాలో అక్కడ అర్థం అవుతుంది. నేను లేను, నాది లేదు అని తెలుసుకోవడానికే ఈ సాధన.

13. మనస్సును పాడుచేసుకోకండి. ఈశ్వరుడు ఒకడు ఉన్నాడని ఆయన పాదాలను అంటిపెట్టుకోండి. మంచిరోజులైనా, చెడ్డరోజులైనా ఆయన పాదాలను అంటిపెట్టుకోండి. మీ తెలివి, యుక్తి ప్రమాణం కాదు. భగవంతుడు చెప్పిన మాట ప్రమాణం అని గ్రహించండి. దానివల్ల తలపోటు, తలంపులు తగ్గిపోతాయి. తలంపే అశాంతి. బంధువులతోనూ, స్నేహితుల తోనూ అతిగా ఉండకండి. కాలం పాడైపోతుంది. దేనిని గురించి ఆందోళన పెట్టుకోకండి. కుటుంబ సభ్యులు కాని, మరి ఎవరైనా కాని వారి గురించి దేవుడిని ప్రార్థించండి. నీలో ఉన్న సోమరిపోతు తనానికి శిక్ష పెట్టవలసిందే. అంటే కొందరు అన్నీ వండి కలిపి నోట్లో పెట్టమంటారు. అదే బద్ధకం. అసూయ, ప్రేమ ఫలితాలు కాల ప్రవాహంలో కనబడతాయి. సాధకుడు

దుష్ట సంకల్పం గల వ్యక్తితో మాట్లాడినప్పుడు తన మంచి గుణాన్ని కాపాడుకొంటూ, ఎదుటివారి దుష్ట సంకల్పానికి గురికాకుండా ఉండేవాడు బుద్ధిమంతుడు. మనలో దుఃఖం లేదు అనుకోండి, చెడ్డమాటలతో మాట్లాడే వారి మధ్యలో ఉన్నా దుఃఖం రాదు. కనిపించిన ప్రతివాడికి తీర్పులు చెప్పకు. విషయం అర్థం చేసుకో. నేర్చుకున్నది ఎందుకు ఆచరణలో పెట్టలేకపోతున్నావో గ్రహిస్తూ ఉంటే కొంతకాలానికి ఆచరించడం ప్రారంభమౌతుంది. నిరంతరం వాళ్ళు ఇలా అన్నారు, ఇలా వ్యవహరించారు అనుకోకండి. వారి వారి పూర్వజన్మ సంస్కారాన్ని బట్టి అలా వ్యవహరిస్తారు. ఆ సంగతి మీకు తెలియడం లేదు. అందుకే అలా అంటున్నారు. ఆడించేవాడు ఈశ్వరుడు. దానిని మనం గుర్తించాలి. పని చెయ్యడం మానేసి అంతా బ్రహ్మం అంటే భోజనం ఎలా నడుస్తుంది. అంతా ప్రారబ్ధం అనేది అనుభవానికి సంబంధించినది. కృష్ణుడు చెప్పింది అనుకరణ కాదు, అనుభవం. అంతా బ్రహ్మం అంటే ఇంట్లో నాన్ డ్యూయల్ స్టేట్ గురించి చెప్పడం ప్రయోజనం లేదు. కంచం సహాయం లేకుండా అన్నం తినలేము. అలాగే శరీరం సహాయం లేకుండా జ్ఞానం రాదు. దేహాన్ని జాగ్రత్తగా చూసుకోవాలి. శరీరం విడిచి పెట్టాక చాలా లోకాలకు వెళ్ళవచ్చును. కానీ అన్నీ సాధనకు పనికిరావు.

14. ప్రకృతిలోని సమస్యలు, మనస్సులో వచ్చే సమస్యలు, ప్రారబ్ధం నుంచి వచ్చే సమస్యలు తట్టుకోవాలి. అందుకే ఓం శాంతిః, శాంతిః, శాంతిః అంటారు. మనస్సు ఎప్పుడూ సంతృప్తిలో ఉండటమే పరమ ధనం. దుఃఖ రాహిత్యమే పరమ సుఖం. మనం శాంతిగా ఉంటూ పరమస్థితిని పొందాలి. అది ముఖ్యం. భగవంతుడు ద్వైతం కాదు, అద్వైతం కాదు. ఈ రెంటికీ అతీతుడు. శరణగాతి అంటే నేను లేను నీవు ఉన్నావని. నీ శరణాగతి నిజమైతే సృష్టిలో ఎవరికీ రాని దుఃఖం నీకు వచ్చినా నీ మనస్సు చలించదు. అది శరణాగతి. మీకు తొంభై ఏళ్ళు వచ్చాయి అనుకోండి, అప్పుడైనా నిష్కామ కర్మ నిజమైనది అని తెలిస్తే ఇంతకాలం చెయ్యనిది ఇప్పుడు ఎందుకు అనుకోకండి. "ఆ క్షణంలోనే మొదలుపెట్టు" అంటోంది గీత. అంతా ఈశ్వర





ప్రణాళిక ప్రకారం జరుగుతోంది అనుకుంటే సాధన ఎందుకు? అని కొందరి సందేహం. నీ సాధనాబలం వల్ల బాహ్యపరిస్థితులు, ప్రారబ్ధం ఏమీ చెయ్యవు. అది సాధన ప్రయోజనం. మనం భగవంతుడిని ప్రార్థించడం వల్ల మన బలహీనతలు పోతాయి. కుండను తయారుచేయడానికి ముడిసరుకైన మట్టిని శుభ్రం చేయడానికి అందులో ఉన్న రాళ్ళను, ఇతర వ్యర్థ పదార్థాలను తీసెయ్యాలి. అలా చెయ్యకపోతే కుండ పగిలిపోతుంది. అలాగే ఆధ్యాత్మికంగా పూర్ణత్వం సాధించాలి అంటే లోకవాసన, విషయవాసనలను బయటికి తీసేయాలి. సత్పురుషుల సాంగత్యం వల్ల మనకు సత్త్వగుణం పెరుగుతుంది. నిర్మలత్వం చెందుతాము. పూజ కన్నా, జపం కన్నా భావనాబలం గొప్పది. దానికన్నా ఆత్మ గొప్పది. మీ కళ్ళతో మిమ్మల్ని మీరు చూసుకుంటే సత్త్వగుణం పెరుగుతుంది. ఇతరుల కళ్ళతో చూసుకుంటే అహంకారం పెరుగుతుంది. ఒకరు ఒక సంస్థకు యాభై కోట్లు దానం చేసారు. వారు చేసిన దానాన్ని కొందరి సమక్షంలో ఆ విషయాన్ని తెలుపుతూ ఉంటే దాత అంటారు. ఆ విషయం మాట్లాడవద్దు అని చెయ్యి అడ్డు పెట్టారు. వారు సత్త్వగుణంలో ఉన్న ఉత్తమ సాధకులు. నాకు బాగా నిద్ర పట్టింది అని చెప్పేవారు నిద్రలో బాగానే ఉన్నాడు. వాడిని పట్టుకోండి. అప్పుడు నిజం తెలిసినట్లే మనస్సును బాగు చేసుకునే శక్తి మనకి ఉంది.

15. మీకు జ్వరం ఉంది. ఎవరైనా నీకు జ్వరం తగ్గింది అంటే ఆ మాటలు వినవద్దు. ధర్మామీటరు పెట్టుకొని చూచుకోండి. అలాగే ఎవరు ఏ వాక్యాన్ని చెప్పినా శాస్త్రానికి అనుకూలంగా ఉంటే తీసుకో అనుకూలంగా లేకపోతే పేచీ వద్దు వదిలేయి. వాసనాక్షయం అవ్వకుండా జ్ఞానంరాదు. నాలుగు నెలల్లో ధ్యాన ప్రక్రియ వల్ల మోక్షం వస్తుంది అంటే నమ్మకండి. నీ రాగద్వేషాలు, నీ ఉద్రేకాలు నీ దగ్గరే ఉంటే ధ్యానం వల్లనే వస్తుంది అనుకోకండి. మీ మైండ్‌ని ఏ గంటకు ఆ గంట సమానస్థితిలో ఉంచుకోండి. 6+3=11 అంటే అది నిజమనుకోవడం నీ తెలివి తక్కువ తనానికి నిదర్శనం. నీ మీద నీకు విశ్వాసం లేనప్పుడు ఎవరు ఏదిచెబితే అదే నిజం అనిపిస్తుంది.

ఆ లెక్కలాగానే నీ జీవితం ఉంటుంది, నీ మీద నీకు విశ్వాసం, సబ్జెక్టు మీద విశ్వాసం లేనప్పడే దుఃఖం వస్తుంది. నీ మీద నీకు విశ్వాసం లేనప్పడు ఇక నీకు జ్ఞానం ఏమిటి? మనలో మార్పు లేకుండా ఇతరులలో మార్పు తీసుకొని రాలేము. వాతావరణకాలుష్యంకన్నా భావకాలుష్యం ప్రమాదమైనది. మన శాంతిని మనం కాపాడుకోవాలి. నేను ఎవడను? అనే ప్రశ్నకు నీవే సమాధానం. నీవు ఏదిగా ఉన్నావో దానిలో ఐక్యం కావడానికే ఆ ప్రశ్న ప్రయోజనం. నీవు ఆత్మవు. కానీ మనస్సుతో శరీరంతో తాదాత్మ్యం పొందావు. దేవుని దర్శనంలో ఎంత సౌఖ్యంగా ఉంటావో, దానిని పొందే ప్రయత్నంలో కూడా అంత సౌఖ్యంగా ఉండాలి. గమ్యం చేరిపోయాక ఎంత నిర్మలంగా ఉంటావో నీ ఆధ్యాత్మిక ప్రయాణంలో ఆటంకాలు వచ్చినప్పడు కూడా అంత నిర్మలంగా ఉండాలి. ఇతరుల శరీరం అందంగా ఉంటే ఎంత బాగున్నారో అనుకుంటాము. మనం కూడా అలా ఉండాలి అనుకుంటాము. కానీ దానికంటే హృదయం అందంగా ఉండాలని అనుకోండి. శరీరం అందం మన చేతిలో లేదు, హృదయ సౌందర్యం మన చేతిలో ఉంది. గాంధీజీ "జీవితంలో అంతఃసౌందర్యం యొక్క శక్తి బలీయమైనది" అన్నారు.

16. మన మనస్సు ఎందుకు బయటకు వెళ్ళిపోతుంది అంటే ఇష్టం అయిష్టం వల్ల. వాటిని తీసేస్తే జబ్బు తగ్గిపోతుంది. మీరు సహజంగా ఉండండి. అంతా వచ్చేస్తుంది. సాధనతో పెద్ద శ్రమ పడనక్కర్లేదు. దేవుని వెతకడం కాదు, దేవునికి మనం భిన్నంగా ఉన్నామా? ఉన్నాము అనుకొన్నప్పడే సాధన చెయ్యాలి. ఇతరులు మనలను గౌరవించాలి అనే ఆలోచన రావడం అంటే లోపల వెలితి ఉండబట్టే వస్తుంది. మనం సుఖంగా ఉండడానికి ఇతరులు కారణం ఏమిటి? మీరు సంకల్పించుకొన్న పనిలో నిజాయితీ ఉంటే ఈ జన్మలో కాకపోయినా మరుజన్మలోనైనా ఫలిస్తాయి. లోపల ఉన్న స్వరూపం సమానంగా ఉంది. అందుకే మనం కళ్యాణగుణాలతో నన్ను అలంకరించు అని భగవంతుని కోరుకోవాలి. అరుణాచలేశ్వరుడా నీ ఇష్టం, నా ఇష్టంలా చేసుకునేటట్లు చెయ్యి అని ఆయనను అడగాలి.





మంచి గుణాన్ని మనం ఇతరులలో చూడలేకపోతే మనలో కళ్యాణ గుణాలు లేనట్లే అరుణాచలేశ్వరునికి సద్గుణం ఎప్పడు ఎక్కడ ఇవ్వాలో ఆయనకు తెలుసు. ఎవరి మనస్సు అయితే లోతుగా ఉంటుందో, ప్రశాంతంగా ఉంటుందో, విశ్లేషిస్తే మీరు కూడా దానిని అనుసరిస్తే మీరు కూడా పరి శుద్ధంగా ఉండగలరు. తద్వారా ఈశ్వరానుగ్రహం అందుతుంది. ఆత్మానుభవం మీకు కలుగుతుంది. లోకం ప్రభావం మన మీద పడకుండా చూసుకోవాలి. ఇష్టాలు అయిష్టాలు పెట్టుకొని శాస్త్రాన్ని చదివినా అది తన హృదయాన్ని ఇవ్వదు. పురుషుడు అంటే పూర్వం నుండి ఉన్నవాడు. పంచ భూతాలు ఉన్నప్పడు, లేనప్పడు కూడా ఉన్న పరమాత్మ. శాస్త్రాన్ని గౌరవించడం వల్ల అది అర్థం అవుతుంది. సత్త్వగుణం లేకుండా శాస్త్రం అర్థం కాదు. శాంతిగా ఎందుకు ఉండలేకపోతున్నాము. డబ్బు వల్ల కాదు. మరి దేనివల్ల శాంతిగా ఉండగల్గుతాము అంటే మంచి స్నేహితుల వల్లనే. అదే నిజమైన ఐశ్వర్యం. చెడ్డ స్నేహితుల వల్ల దుఃఖం, అశాంతి వస్తుంది.

17. మన బలహీనతలలో పోరాటమే సాధన. మనకు మనంగా ఎవరికీ మంచి చేయలేకపోవచ్చును. మంచి ఎవరి ద్వారానైనా జరుగుతూ ఉంటే సంతోషించము, మంచి చేసిన వారిని గౌరవించడం తెలియదు. సాధకుడికి ఆ సద్భావన లేకుండా కనీసం చూసి సంతోషించే బుద్ధి లేకుండా రోజూ తెల్లవారుఝామున లేచి స్నానంచేసి, పూజచేసి, గుడికి వెళుతున్నాను, ధ్యానం చేస్తున్నాను అంటే పక్కానికిరావు. మనకి వివేకం ఎక్కువ. ఇతరులు అలా లేరు అనుకోకండి. వాళ్ళు ఏమి సాధన చెయ్యడం లేదు అని ఈసడించుకొంటే నీకన్నా ముందు వాళ్ళు తరిస్తారు. నీవే వెనుక బడతావు. ఆ పిచ్చి గొడవలలోనికి వెళ్ళకండి. ఎవరినైనా చూసి మీకు భయం కలుగుతుంటే మీకు భక్తి లేదని అర్థం. నాకు దుఃఖం లేదు, నేను మరణం లేని ఆత్మను అనుకుంటే దుఃఖం యొక్క వేగం తగ్గుతుంది. అమ్మ కన్నా ఆధ్యాత్మిక వాతావరణం గొప్పది. ఆధ్యాత్మిక అభివృద్ధి గలవారితో స్నేహం గొప్పది.

18. ప్రపంచం మనకి అనేక పాఠాలను నేర్పిస్తుంది, అది కూడా ఉపాధ్యాయుడే. కష్టం, సుఖం దేహానికే వస్తాయి. పవిత్రత లేకుండా ఎన్ని సాధనలు చేసినా సత్యాన్ని పొందలేవు. కల్పితం పుడుతుంది. ఆ కల్పితానికి చాలా బంధాలు వచ్చేస్తాయి. ఈ అడవిలోంచి రాకుండా ఆత్మానుభవం కలుగదు. మనిషికి, మనిషికి మధ్య ఉన్న అనుబంధాలు అన్నీ కల్పితాలే. ఈ మూట అంతటికీ కల్పన అని పేరు పెట్టాడు భగవంతుడు. మామిడి మొక్కను ఎందుకు నాటుతాము? పళ్ళు కాస్తాయని. దానితోపాటు నీడ కూడా మనకు లాభంగా ఉంటుంది. అలాగే మోక్షం కోసం ధర్మాన్ని ఆచరించినా దానితోపాటు సుఖము, శాంతి, భౌతిక పరిస్థితులలో నుండి అశాంతి రాకపోవడం వంటి అనేక లాభాలు వస్తాయి. ధర్మాన్ని ఆచరించే వాడికి బాడీ కంట్రోల్, మైండ్ కంట్రోల్ అవసరం. ధర్మాన్ని ఆచరించకుండా పవిత్రుడు కాలేడు. పవిత్రుడు కాకుండా భావోద్రేకాలు ఆగవు. శాంతిని పొందలేవు. ఉన్నది ఉన్నట్టుగా నీకు అనుభవం అవ్వకుండా సుఖం శాశ్వతంగా ఉండదు. భక్తులు ఎలా ఉండాలి అంటే ఈ లోకంలోకి వచ్చి, వెళ్ళిన గుర్తు లేకుండా ఉండాలి. మంచి తలంపులు, మంచి భావాలు, మంచి ఆలోచనలు, వ్యాప్తి చేస్తూ ఉంటే హృదయంలో ఆ మంచి ఒక్కటైనా నాటుకొంటుంది. మంచివారిలా కనిపించడం కాదు, అందరూ అలా కనిపిస్తారు. కనిపించడం వేరు, మంచిగా ఉండటం వేరు. ఇతరులకు నీవు రకరకాల ఉపకారాలు చెయ్యవచ్చు. కానీ నీవు ఆత్మజ్ఞానం సంపాదిస్తే నీ ద్వారా ఇతరులకు ఎక్కువ ఉపకారం జరుగుతుంది. బాహ్యంగా పెట్టిన అన్నం సాయంత్రానికి అరిగిపోతుంది, బట్టలు ఇస్తే అవి కొంతకాలానికి చిరిగిపోతాయి. నీవు ఆత్మజ్ఞానాన్ని సంపాదిస్తే శాశ్వత శాంతి నీ ద్వారా ఇతరులకు అందుతుంది. నీటిగుంటలో బెడ్డవేస్తే బురద బయటకు చిందుతుంది. నీ హృదయంలో ఏముందో తెలియడానికి ఈశ్వరుడు బెడ్డ వేసి అశాంతిని కలుగజేస్తాడు.

19. నీవు కుటుంబంలో దగ్గరగా ఉన్నా మానసికంగా దూరంగా





ఉండాలి. తామరాకు మీద నీటిబొట్టులా నీవు ఉండాలి. "ఒక మంచి మాట పదిసార్లు చెప్పినా దోషం లేదని వేదం చెప్పింది". ఎవరి మనస్సు వారికే శిక్ష. సబ్జెక్టు మీకు అర్థం అయితే మానసిక ఆరోగ్యం కలుగుతుంది. మన మనస్సును మనం కాల్చుకుంటే క్రమశిక్షణతో శిక్షించుకుంటే మనం సుఖపడతాము. ఇతరులను కాల్చితే (బాధలకు గురిచేస్తే) అది నీకు చెడు కలుగజేస్తుంది. విత్తనం తనను తాను పోగొట్టుకొని చెట్టుగా మారుతుంది. అలాగే దేహాభిమానాన్ని పోగొట్టుకోవాలి. దానితోనే ఉంటే నీకు ఆత్మ సాక్షాత్కారం కలుగదు. చాలామంది డబ్బు బాగా ఉన్నవారు ఇలా అనుకుంటారు. "మాకు టైం సరిపోవడం లేదు టైం ఉంటే ఇంకా సంపాదించుకొందాము" అంటారు. అలాగే మీరు ఆత్మానుభవ సాధనకు టైం సరిపోవడం లేదు అనే భావం వచ్చేలా మీరు సాధన చెయ్యాలి. మీరు కోటి రూపాయల వస్తువును పోగొట్టుకుంటే సంపాదించగలరు కానీ నీ జీవితంలో ఒక్క అరగంట వ్యర్థం అయితే తిరిగి సంపాదించుకోలేవు. ఎవరు ఏ రంగంలో ప్రముఖులైనా వారిని గౌరవించడం మన ధర్మం. అంతర్యామి అనుగ్రహం లేకుండా ఆత్మజ్ఞానం కలుగదు. నీవు ఎన్ని దేవతామూర్తులను ఆరాధించినా ఆయన దగ్గరకు రావలసిందే. భగవంతుడిని చేరుకోవడానికి అనేక మార్గాలు ఉన్నాయి. ఆ మార్గాలనే మతాలు అంటారు. గమ్యం చేరిన తరువాత ఉన్న సద్వస్తువు ఒక్కటే అని గుర్తిస్తావు. ఆకలిగా ఉంటే అన్నం తినగలము. గీత అర్థం అవుతూ ఉంటే ఆచరించాలనే బుద్ధి పుడుతుంది. లోతు గుండె గలవారికి ఆత్మజ్ఞానం కలుగుతుంది. అల్ప మనస్తత్వం గల వారికి ఏమీ తెలియదు. అరుణోదయం కలిగినప్పడు సూర్యోదయం నెమ్మదిగా పైకి వచ్చినప్పడు చీకటి అంతా పోతుంది. అలాగే నీకు చైతన్య స్థాయి పెరిగినప్పడు నీ దేహభావన, నీ కోపతాపాలు, నీ వేదన, నీ రాగద్వేషాలు అనే చీకట్లు పత్తా లేకుండా పోతాయి. పవిత్రత, నేర్పు, ఓర్పు ఏకాగ్రత పెంచుకోండి. అది ఆత్మానుభవానికి సహకరిస్తుంది. ఒక పురాణంలో ఇలా ఉంది "మూడు కోట్లు నమఃశివాయ చేస్తే వచ్చే ఫలితం

ఒక్కసారి అరుణాచలా! అంటే అదే ఫలితం వస్తుంది అని ఉంది. అదే పంచాక్షరి".

20. తపస్సు అనే తాళం చెవి నీకు లేకపోతే లోపల "సత్యం" దొరకనే దొరకదు. నీకు చెడు తలంపులు వస్తూ ఉంటే వెంటనే మొగ్గలోనే తుంచయండి. లేదా ఆ తలంపే మాను అవుతుంది. అప్పుడు రంపం ఉండాలి. సాధకుడు దానిని గ్రహించాలి. వైరాగ్యం లేకుండా, సాధన లేకుండా, అభ్యాసం లేకుండా తూకం కలుగదు. తూకం ఉంటే ఉన్నతమైన ఆలోచనలు వస్తాయి. భగవంతుని స్మరించుకుంటూ ఆహారం తీసుకుంటే అది ప్రసాదం అవుతుంది. సమాజంలో ప్రస్తుతం ఖరీదైనది సహనం. ఇతర వస్తువులను ఎంత ధర అయినా కొనవచ్చును. సహనాన్ని కొనలేరు. జీవకోటి అంతటిలోను గురువును చూడడానికి ప్రయత్నం చెయ్యి. అదే నిజమైన సాధన. సహజంగా ఉండటం అనేది గుణం కాకుండా సహజంగా ఉండాలి. దాని వల్ల హృదయం యొక్క లోతులు పెరుగుతాయి. మిమ్మల్ని చూచి ఎవరికైనా అసూయ కలుగుతుంటే మీకు సహనం ఉంటే దాని నుండి తేలికగా బయటపడవచ్చు. నేను చెప్పే ఈ మాట మంత్రం అనుకోండి. ఇది నాలుగు వేదాల సారం. మీకు తెలిసినా తెలియకపోయినా "అంతా ఈశ్వర సంకల్పం ప్రకారమే జరుగుతున్నది" ఈ వాక్యం మీ గుండెకు అర్థం కావాలి. నీ రక్తంలో కలసిపోవాలి. నీ ఎముకలకు బాగా పట్టాలి. స్మశానంలో చర్మము, వెంట్రుకలు, అన్నీ కాలిపోయిన తరువాత ఎముకలు పూర్తిగా కాలవు మిగిలిన అవశేషాలైన ఎముకలను కాశీలో కలుపుతారు. కాబట్టి ఈ వాక్యము ఎముకలకు పట్టాలి అంటారు. అంటే అంత దృఢంగా నమ్మాలి అని అర్థం. ముప్పది సంవత్సరాల తరువాత ఇద్దర స్నేహితులు కలిసారు. ఒకరు అన్నారు "నన్ను గుర్తు పట్టావా" అంటే గుర్తు పట్టకపోవడం ఏమిటి? నీ ఎముకలను గుర్తు పట్టగలను. అది మాధుర్యానికి గుర్తు. అంతా భగవత్ సంకల్పం వల్లనే జరుగుతున్నది అని తెలుసుకుంటే దుఃఖం రాదు. ఈ సృష్టిని దాటి వెళ్ళిపోగలవు. మంచిగా ఉండటం, వ్యక్తిభావన లేకుండా





ఉండటం గమ్యం కాదు. ఈ సృష్టిని దాటి వెళ్ళిపోవడానికి అవి సహకరిస్తాయి. కాబట్టి అది గమ్యం కాదు. బడిలో ఎందుకు చేరతాము? చదువుకుని బయటకు రావడానికి. అలాగే మనం ప్రకృతిలో ఉండిపోవడానికి రాలేదు. ప్రకృతిలో నుండి బయటపడాలి. నీ భ్రాంతులు, నీ ఆశ్చర్యాలు, నీ బుద్ధిలోని వంకర్లు వాటిని ఓవర్‌కమ్ చెయ్యాలి. ముందు నీ లోపల ఉన్న వాడిని తెలుసుకొంటే వాడే బయట ఉన్నాడని తెలుస్తుంది.

21. ఈ ప్రాంతంలో ఒక విద్యార్థి వయస్సు 25 సంవత్సరాలు. ఐయంటి చేసాడు. నెలకు నాలుగు లక్షలు డ్రా చేస్తున్నాడు. అలహాబాద్‌లో వాడి తల్లితండ్రులు నాతో ఇలా అన్నారు "వీడికి ఫస్టు మార్కు వస్తే నాకు చెప్పడు. ఎవరి ద్వారానో తెలుసుకొని నువ్వు మాకు ఎందుకు చెప్పలేదు అంటే 'అందులో ఏముంది' అంటాడు" అన్నారు. అది అతనిలో ఉన్న వైభవం. కొందరు టాంటాంలు చేసుకుంటారు. నిండు కుండ తొణకదు. శరీరాన్ని మేనేజ్ చేయగలం కాని మైండ్‌ని మేనేజ్ చెయ్యడం చాలా కష్టం. దానికి కాలాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి. మీకు విసుగు వస్తే సబ్జెక్టును గ్రహించి మైండ్‌ని మేనేజ్ చేసుకోవాలి. లౌకికంగా మీకు ఎన్ని అదృష్టాలు ఉన్నా మీరు శాంతచిత్తంగా ఉండటం గొప్ప విషయం. మీ మనస్సును బ్యాలన్స్ చేసుకోవడం గొప్ప విషయం. వివేకానంద "నాకు భగవంతుడు మూడు వరాలు ఇచ్చాడు 'మనుష్యత్వం, ముముక్షత్వం, మహాపురుష సంస్రయః' నేను అదృష్టవంతుడిని" అన్నారు. వారిని ఒకరు "మీ గురువు దేవుడా?" అంటే "నీ దృష్టిలో కాకపోవచ్చు. నా దృష్టిలో దేవుడే" అన్నారు. చెడ్డరోజులు రావచ్చును. మీరు భగవంతుడిని స్మరిస్తూ ఉంటే కష్టం వచ్చే రోజు వచ్చినా అది మిమ్మల్ని బంధించదు. మీరు ఆరోగ్యంగా ఉన్నప్పడే ఆరోగ్యం గురించి శ్రద్ధ తీసుకోవాలి. కాళ్ళు చేతులు బాగా ఆడినప్పడే కాలాన్ని జాగ్రత్తగా కాపాడు కోవాలి. బుద్ధి బాగుపడితే రీజన్ పెరుగుతుంది. రీజన్ తెలిస్తే దుఃఖం నశిస్తుంది. అంటే నాకు వచ్చే దుఃఖానికి కారణం గతంలో నేను చేసుకున్నదే అనే మూల కారణం తెలుస్తుంది. దుఃఖం నశిస్తుంది. శబ్దానికి అర్థం

నిజమైన ఆత్మజ్ఞానం వల్లనే వస్తుంది. ఈశ్వరుని పాదాలమీద కించెత్తు కూడా భక్తి లేని వానికి పాండిత్యం మాటలు ప్రయోజనం ఏమీ ఉండవు. దేహం మీద ఆత్మబుద్ధి పెట్టుకొని చేసే ప్రసంగాల వల్ల వారు పాడవుతారు. అంతేకాదు వాళ్ళను మోసం చేసుకొని, ఇతరులను మోసం చెయ్యడం, ఇలా ఎంతమందిని మోసం చేస్తారు?

22. మనస్సును మూత పెట్టకుండా మోక్షం ఎలా వస్తుంది? ఒంటరి జీవితంలో ప్రారబ్ధం ఎన్ని దెబ్బలు కొడుతుందో తెలియదు. వాటిని సంతోషంగా స్వీకరించి జీవించాలి. రోడ్డు రోలర్ క్రింద తలపెడితే ఎలా ఉంటుందో అలాగే ప్రారబ్ధానికి దయ ఉండదు. ఫిజిక్స్‌లో నోబుల్ ప్రైజ్ తెచ్చుకున్న ఒకాయన ఇలా అన్నారు "సూర్యగ్రహణం గురించి తెలుసుకొని ఈ సృష్టి అంతా మాయ అని తెలుసుకున్నా, తరువాత ఫిజిక్స్ ఏమి చేసుకొంటాము? ప్రయోజనం ఏమిటి? ఖగోళం గురించి, ఖగోళంలో ఉన్నది చెబుతున్నాము. ఆడించే వాడిని తెలుసుకోలేము" అన్నారు. భ్రాంతి ఉన్నచోట శాంతి ఉండదు. ఆహారశుద్ధి ఉంటే బుద్ధి శుద్ధిగా ఉంటుంది. ఇతరులు ఏదైనా చెబితే తేలికగా అర్థం అవుతుంది. మానవ జన్మలోనే తొందరగా వికాశం చెందడానికి అవకాశం ఉంది. ఈశ్వరుని ఐశ్వర్యంతో పోల్చుకుంటే నీ బ్రతుకు ఎంత? నీకు ఇష్టంలేని సంఘటనలు జరిగినా ఈశ్వరునికి తెలియకుండా జరుగవు. దాని గురించి చెమటలు పట్టించు కోవడం, నిద్ర పట్టకుండా చేసుకోవడం దేనికి శుభ్రంగా నిద్రపోండి. పశు లక్షణాలు లేకుండా కొద్దిమందే ఉంటారు. సాధన ఎందుకు అంటే ఈ పశులక్షణాలను తొలగించుకోవడానికే. దానికి క్రమశిక్షణ అవసరం. మాట, చేత, తలంపుల విషయంలో క్రమశిక్షణ ఉండాలి. పశులక్షణాలు లేనప్పడు పూర్ణమానవుడు అవుతాడు. మలయాళ స్వాములవారు ఏర్పేడు ఆశ్రమం నిర్మిస్తున్నప్పడు రెండెడ్ల బండితో బరువైన ఇనుప సామాను మెరకవైపు లాగడం కష్టంగా భావిస్తూ ఉంటే ఒకరు స్వామితో "ఎడ్లకు మెరకవల్ల లాగడం కష్టంగా ఉంది" అనగా స్వామి "గత జన్మలో వాళ్ళు మనుష్యులే. పశు





లక్షణాలు పెంచుకొని పశువులుగా జన్మించారు" అన్నారు. టెక్నాలజీ పెరిగింది, సహనం తగ్గిపోతున్నది. సహనం లేకుండా ఆత్మజ్ఞానం కలుగదు. చలంగారు అరుణాచలంలో ఉండగా విజయవాడ నుండి ఒకరు వచ్చి ఇలా అన్నారు "మీ గురించి వారు తిడుతున్నారు" అనగా వారు ప్రశాంతంగా ఉన్నారు. ఆయన వెళ్ళిన తరువాత నేను వారితో "వారు ఏమన్నా మీ ముఖంలో వికారం రాలేదు ఏమిటి?" అంటే "వారు నెంబర్ వన్ దొంగలు, నిజాయితీ పరుడు అన్నాడు అంటే మనం ఆలోచించాలి కాని వాడి గురించి మనం మానసిక అనారోగ్యం తెచ్చుకోకూడదు. మన మైండ్ గట్టిగా ఉంటేనే ప్రశాంతంగా ఉండగలం" అన్నారు. సాధకునకు ఆ ఓర్పు ఉండాలి. రాగద్వేషాలు లేనివానికి అసలు మనస్సు చాపల్యమే లేదు.

23. లోకంలో ఏమీ లేదు. ఇది అంతా డొల్లతనమే అని తెలిసే వరకు మనస్సు అంతర్ముఖంకాదు. మన బుద్ధి బాగు చేసుకోవడం కంటే మించిన పని ఏముంది? మన కృషే మన కూడా వస్తుంది. ఇది గ్రహించి మసలుకోకపోతే జీవితంలో ఎన్ని బస్తాల బియ్యం తిన్నా దండుగే. భగవంతుడు మనకు ఇచ్చిన సంపదను మనం ఇతరులకు ఇస్తున్నాము. మనది ఏమీలేదు అని తెలుసుకుంటే మనస్సు ఎటూ చెదరదు. మామిడి పిందె రూపం దాల్చినప్పడే దానిని ఎవరి నోట్లో పెట్టాలో అది భగవంతుని ప్రణాళికలో ఉంది. ఆ సంగతి మీకు తెలియదు. అది ఎందరి చేతులు జారి ఎవరు తినాలో వారి చేతికి ఆ పండు అంది వారి నోటిలోకి జారిపోతుంది. ఆ పండు తిన్నవాడే దానికి ఓనర్. కొందరు తిని తినక సంపాదిస్తే, ఒకడు దర్జాగా పేకాట ఆడి తగలేస్తాడు. ఆ డబ్బు వాడి చేతుల మీదుగా ఖర్చు పెట్టే యోగం ఉంది అంతే. గాలికి, మనస్సుకు కుదురు ఉండదు. ఈ రెండింటికి ఏ పనీ లేదు. ఏదో ప్రక్కకు వెళ్ళిపోతాయి. అక్కడ అలజడి తీసుకొని వస్తాయి. గాలిని బంధిస్తే అంటే ప్రాణాయామం చేస్తే మనస్సు ఆగుతుంది. పుణ్యపాప ప్రారబ్ధాలను అనుభవించేది మనస్సే. మనస్సు భగవంతుని పాదాలను ఆశ్రయిస్తే అవి ఏమీ దీనికి అంటవు. ఒకరు

"సాధన చేస్తున్నాము రాణింపు లేదు" అంటే శివానంద "చేనుకి ఒక కంతలో నుండి నీరు పెట్టుకుంటే పీత కన్నాల ద్వారా ఆ నీరు బయటకు వెళ్ళిపోతూ ఉంటే నీళ్ళు మడిలో ఎలా ఉండవో, పంట ఎలా పండదో అలాగే నీవు కుళ్ళిపోయిన వారితోను, చెడు మనుషులతోను స్నేహం చేస్తే నీ సాధన ప్రయోజనం ఏమీ ఉండదు. వాళ్ళ మాటలు వినడం కూడా చెడ్డ అలవాటే. ఆలోచన, మాట, పనులలో అజాగ్రత్తగా ఉంటే నీవు కాశీ వెళ్ళినా మరి ఎక్కడికి వెళ్ళినా ప్రయోజనం లేదు. పని చెయ్యవలసి వస్తే తప్పించుకోకు, పనికోసం నొల్లుకోకు. మధ్యే మార్గంలో పయనించాలి. ఈశ్వర ప్రణాళిక వల్లనే కర్మ బంధంలో పడ్డాము. అది తొలగితేనే ప్రకృతి నుంచి బయట పడతాము. మీ జీవితంలో అనేక సంఘటనలు జరుగుతూ ఉంటాయి. దాన్ని గురించి తలచుకోకండి. పాఠాలు నేర్చుకోండి. నేర్చుకుంటే మరల ఆ సంఘటనలు జీవితంలో పునరావృతం కావు.

24. "మన ఆలోచనలోను, సంకల్పంలోను, ఆచరణలోను, పవిత్రత ఉండాలి" అన్నారు బుద్ధుడు. కట్టెలను రాపాడిస్తే అది అగ్ని రూప మౌతుంది. అలాగే దైవ రూపాన్ని చింతించగా, చింతించగా దైవ స్వరూపాన్ని పొందుతావు. మీ తలంపులు అబద్ధమనే దేహాత్మబుద్ధిలోంచి వస్తున్నాయి. ఆత్మానుభవాన్ని మీరు గ్రహిస్తే ఆ తలంపులు పత్తా లేకుండా పోతాయి. వాటితో పోరాటం అక్కరలేదు. మీకు అశాంతి తీసుకొచ్చే తలంపులు మనస్సులోంచి వస్తున్నాయని తెలిస్తే అవి తొలగిపోతాయి. ఈ సటిల్ పాయింట్‌ని బాగా అర్థం చేసుకోవాలి. మనస్సు నీవు కావు. ఆత్మజ్ఞానం ఉన్న చోట శక్తి ఉంటుంది. శాంతిని మీరు ఎంజాయ్ చేస్తే మీకు శాంతి, శక్తి కలుగుతుంది. "చలి వేస్తే నిప్పు దగ్గర కూర్చోవాలి. చెరువులో దిగ కూడదు. దిగితే చలి ఎలా తగ్గుతుంది? అలాగే నీవు ఏ వస్తువుని పొందు దామని అనుకొంటున్నావో ఆ వస్తువు పొందిన వాని దగ్గరకు వెళ్ళు" అన్నారు షిరిడీ సాయిబాబా. భూమిలో నీళ్ళు ఉన్నాయి పైకి కనిపించవు. తవ్వితే కనబడతాయి. అలాగే అంతటా భగవంతుడు ఉన్నాడు. నీవు నిజాయితీగా





పనిచేస్తే కనిపిస్తాడు. బయట శుచి శరీర ఆరోగ్యం కోసం మాత్రమే. కానీ లోపల శుచి (మనస్సు శుచి) అదే మన కూడా వచ్చేదని గ్రహించాలి. మీకు అశాంతి వస్తే బయట కారణం ఒంపు మాత్రమే. మనం విషాదం లేకుండా ఉండాలి. దుఃఖానికి ద్వైత బుద్ధే కారణం. మనిషి అశాంతికి కారణం లోకవాసనే. మనకు వీపు చిట్లేటట్టు చేస్తే కానీ మనకి భగవంతుని మీద దృష్టి కలుగదు. ఊరికే భగవంతుని మీద దృష్టి కలిగేటంత వివేకులం కాదు మనం. ఇంట్లో వాళ్ళు మీ వాళ్ళు కాదు, దేవుని వాళ్ళు. వాళ్ళ ద్వారా నేర్చుకోవలసిన పాఠాలు నేర్పడానికే దేవుడు వాళ్ళను పంపాడు. అది అంతా లీల. మనిషి పొరపాటు చేయడంలో తప్పులేదు. దానిని సరిచేసుకోవడం లోనే గొప్పతనం ఉంది. స్వప్నంలో బంగారు గొలుసు దొరికిందని సంతోషిస్తే మెలకువ రాగానే అది అంతా స్వప్నమని తెలిపోయింది. అలాగే ధృతరాష్ట్రునికి రాజ్యం పోయిన తరువాత ఈ రాజ్యం పోవడం కూడా స్వప్నమే అని తెలిసింది. సబ్జెక్టులో మీకు క్లారిటీ లేనప్పుడు ప్రతీ మనిషి పొరపాటు చేస్తాడు. అద్దం మురికిగా ఉంటే ప్రతిబింబం కనబడదు. అలాగే వస్తువు మనలోనే ఉన్నా చూచే నేర్పు లేకపోతే వస్తువు లేదు అనుకొంటాము.

25. నీవు కల్పించుకొన్న మానసిక పరిస్థితులను త్యాగం చెయ్యాలి. దేహ ప్రారబ్ధాన్ని మనం విడిచి పెట్టలేకపోతున్నాము అంటే సృష్టికర్త మీద మనకు విశ్వాసం లేకపోవడమే. ప్రారబ్ధం ప్రభావం నీమీద లేనప్పుడు అది నిన్ను ఏమి చేస్తుంది? ఒక నదిని ఈదుకుంటూ అవతలి ఒడ్డుకు వెళ్ళడం జ్ఞానమార్గం. నావ మీద వెళ్ళడం భక్తిమార్గం. భక్తిమార్గం సురక్షితమైనది. సబ్జెక్టు అందుతూ ఉంటే శరీరం ఉండగానే హృదయంలో ఉన్న సమాధి స్థితిని అందుకోగలము. శరణాగతి భావం లేకపోవడం వల్ల దుఃఖం వస్తుంది. ఈశ్వరుని మీద భక్తి ఎందుకు అంటే అనుభవించేవాడిని ఈశ్వరుని పాదాల వద్ద పెట్టావు అనుకో ఇక అనుభవించేవాడు ఎక్కడ ఉంటాడు. అహంకారాన్ని జయించాలి, జయించాలి అనుకుంటే జయించ లేవు. అస్తమానూ దాన్నే తలపెట్టుకుంటూ దాన్ని ఎలా జయించగలవు? మరచిపోతే సరిపోతుంది.

మరుపు రావడం లేదు అంటే దైవభక్తి వల్ల నెమ్మదిగా మరుపు వస్తుంది. ఇంట్లో ఎవరైనా చనిపోతే రోజులు గడిచేకొద్దీ దుఃఖం తగ్గుతుంది. వాళ్ళ నామరూపాలు మరచిపోతాము. కాలం మరిపిస్తుంది. అక్కర్లేని తలంపులు పట్టించుకోకపోతే అవే తగ్గిపోతాయి. జీవితంలో మంచి జరుగవచ్చు, చెడ్డ జరుగవచ్చు. సాధన ఎందుకు అంటే దానితో నీవు తాదాత్మ్యం అవ్వకుండా ఉండడానికి సంతోషాన్ని, బాధను తీసుకోకు. ఓటమి, గెలుపులు పూర్వజన్మ కర్మను బట్టి వస్తూ ఉంటాయి. ఈగలు పుండు ఉన్నచోట వాలుతాయి. అలాగే మంచి మనస్సు లేని వానికి పేచీలు ఉంటాయి. మంచితనం, తెలివి, డ్యూటీ అన్నీ ధర్మంలోనే ఉంటాయి. పనిచేసే వాడే పురుషుడు.

26. మనలను మనం సంస్కరించుకొంటే జీవన్ముక్తి స్థితిని పొందుతాము. మనకు కోపం వల్ల వచ్చే, మోహం వల్ల వచ్చే ఆందోళనల నుండి బయట పడటమే సంస్కరించుకోవడం. మన మాట తియ్యగా ఉండాలి. మనం ఉండే పరిశరాలు శాంతి కలిగేలా ఉండాలి. ఇతరులు మన పట్ల ఎలా ఉన్నా మనకు సంబంధం లేదు. ఇతరుల పట్ల మనం ఎలా ఉన్నాము అనేది చూసుకోవాలి. భగవంతుడు చెప్పినట్లు వ్యవహరించాలి. అన్నం నోటి ద్వారా తింటాము. దాని సారం అన్ని అవయవాలకూ చేరుతుంది. ఈ సమస్త సృష్టి శ్రీకృష్ణుని ద్వారా నడుస్తున్నది. ఆయనకు నమస్కారం పెడితే అందరి దేవతలకు నమస్కారం పెట్టినట్లే. మనకు ఎవరైనా రూపాయల నోట్లు ఇస్తే అవి మంచివా, చెడ్డవా అని పరిశీలిస్తాము. అలాగే మన తలంపులు ఎలా ఉన్నాయి అని గ్రహించాలి. ఖాళీ సమయంలో సత్‌గ్రంథాలు చదవాలి. వాటి మాటల్లో మన ప్రవర్తన ఎలా ఉందని తెలుసుకొని సరిచేసుకోవాలి. భగవంతుని మాట అర్థం కాని వారు వాటిని ఆచరించలేరు. ముందు క్రమశిక్షణ, తరువాత దైవం. రాధ సాధన, కృష్ణుడు (దైవం) సాధ్యం. ఈ రకంగా ఇద్దరూ ఒక్కటే రాధాకృష్ణులు వేరు కాదు. సాధన ఎలా చెయ్యాలో రాధ నుండి తెలుసుకోవడానికి అవకాశం ఉంది. గోపికల ప్రేమలో కోరికలు లేవు. యోగులకు కూడా గోపికల ప్రేమ తెలియదు.





కృష్ణుడు మన హృదయంలోనే ఉన్నాడు. వ్యక్తం కావడం లేదు అంటే మనం లౌకికులము. యోగులు, భక్తులు పనిని ప్రేమరూపంలో చూపిస్తారు. బట్రాజులు మాటలతో సరిపెడతారు. నీ శరీరాన్ని ఆడించేవాడు ఈశ్వరుడు. ఆడించేవాడిని కాదని నీవు ఒక్కపని చెయ్యగలవా? నీవు స్వతంత్రుడవా? ఆ పని చెయ్యడానికి పనిచేసేవాడు ఒక్కడే. భగవంతుని సంకల్పానికి అనుగుణంగా పనిచెయ్యడానికే మనం ఈ భూమి మీదకు వచ్చాము. అనుకొనేది మన సంకల్పం, జరిగేది ఈశ్వర సంకల్పము. శ్రీకృష్ణుడు శరీరం వదిలే సమయంలో ఒకచోట పరుండి కాలు ఊపుతూ ఉంటే పొదలమాటునుంచి వేటగాడు లేడి అనుకొని బాణం వేసాడు. దగ్గరకు వచ్చి క్షమించమని అనగా "సంకల్పం నాది, చేసేవాడవు నీవు నీ తప్పు లేదు, నీకు మోక్షం ఇస్తున్నాను" అన్నాడు. విశ్వాన్ని విశ్వేశ్వరుడులా చూడలేక అది విశ్వేశ్వరుడు కాదు అనుకొంటాము. మన బుద్ధిలో ఉన్న దోషం వల్ల ఈశ్వరుడు చెప్పింది అబద్ధం అనుకొంటున్నాము.

27. అన్య చింతన లేని అనన్య చింతన వల్ల శ్రీకృష్ణుడు నీ యోగ క్షేమాలను నేను చూస్తాను అన్నాడు. వేదంలో పరమాత్మను "ఉన్నది" అని చెప్పిందే కాని స్త్రీ పురుష దేవతలుగా తెలుపలేదు. వేదాన్ని "శబ్దం" అంటారు. వేదం సూచన చేస్తుంది. వేదానుభవాన్ని అనుభవంలోకి తెచ్చుకునేది మనమే. పూజ, జపం, ధ్యానంతో సరిపోదు. కర్మానుభవం కలగాలి. పది మందినీ ప్రేమించేవాడు, సమాజసేవ చేసేవాడు అనే ప్రమాణం మీదనే మనిషిని అంచనా వెయ్యాలి. ధనము, చదువు, అధికారం కాదు తెలివి ఉన్నవానికన్నా ప్రేమ ఉన్నవాడే గొప్పవాడు. ఎవరైనా ఒక పొరపాటు చేస్తే వాడిని ప్రేమతో సరిచేయడానికి ప్రయత్నం చెయ్యాలి. విమర్శించకూడదు. మనం తరించడానికి నాలుగు అక్షరాలు ఉన్న 'నారాయణ' అన్న మంత్రాన్ని స్మరిస్తే చాలు. శ్రీకృష్ణునికి బంధువులు, స్నేహితులు, విరోధులు ఉన్నట్లు మనకు అనిపిస్తుంది. ఆయన కోణంలో ఏమీ లేదు. సమాధిలో ఉన్నది ఒక్కటే. నీ మనస్సుని, నీ కోరికలను నియమించుకోవడమే తపస్సు. బడి

ఉంటే చదువుకోవడానికి వీలుంటుంది. అలాగే గుడి ఉంటే భగవంతుని దర్శనం ఉంటుంది. గుడి లేకపోతే భగవంతుడిని మరచిపోతాము. లౌకికులకు దూరండా ఉండాలి. కనిపిస్తే బాగున్నారా? అంటే సరిపోతుంది. అంత వరకే వారితో అనుబంధం. ఎక్కువ అనుబంధం పెట్టుకుంటే వారి గుణాలు మనకు వస్తాయి. వారిలో కపటత్వం ఉంటుంది. కపట బుద్ధి పోయిన వెంటనే నిశ్చలతత్త్వం. నిశ్చలతత్త్వం వచ్చిన వెంటనే సత్యంలో ఐక్యమవుతాము. కొందరు చివాట్లు పెడతారు, తిరిగి పెట్టించు కుంటారు. ఇది వారి వారి ఇష్టాలతో సంబంధం లేకుండా జరిగిపోతుంది.

28. "ఫలకాంక్ష ఉండకూడదు. అలా అని పని మానకూడదు" అని పరమాత్మ చెప్పిన వాక్యాన్ని ఆచరిస్తే మనం తరించగలం. విష్ణుసహస్ర నామాలలో "తీర్థకర్ణుడు" అనే మాట ఉంది. తీర్థ అంటే శాస్త్రం అని అర్థం. ఏ శాస్త్రాన్ని భగవంతుడు ఇచ్చాడో ఆయన మాటలను ఆచరిస్తే ఆయనలో ఐక్యమవుతాము అని అర్థం. పరమేశ్వరుని దయ లేకపోతే నామం కూడా సరిగా చెయ్యలేము. మన చేతుల్లో ఏమీ లేదు. కానీ అహంకారం వల్ల ఏదో ఉంది, ఏదో ఉంది అనుకొంటాము. "కాళి" అంటే కాలము. శివుని శరీరం మీద కాళి నాట్యం చెయ్యడం అంటే శివుడు అధిష్ఠానం మీదే కాలం ఆధారపడి ఉంది. అంతేగాని శివుని అగౌరవం చేయడం కాదు. మంచివాడు ఇతరులలో గుణదోషాలను చూడడు. అంతర్యామి అనుభవం వస్తే అంతఃకరణం అణిగిపోతుంది. దుర్మార్గాన్ని దూరంగా తరిమి కొట్టి సన్మార్గంలోకి తీసుకొని వచ్చే శక్తి నామానికి ఉంది. దేవుని నామాల్ని స్మరిస్తే దేవుని ప్రతిస్పందన తప్పనిసరిగా ఉంటుంది. రైలు చక్రాలు, రైలు పట్టాలను ఎలా అంటిపెట్టుకొని సురక్షితంగా గమ్యాన్ని చేరుస్తాయో అలాగే నీవు జప ధ్యానాదులను అంటిపెట్టుకొని ఉంటే నీవు గమ్యాన్ని చేరతావు. జపం వదిలినా, అధ్యయనం వదిలినా, విచారణ వదిలినా వ్యసనాలలోకి వెళ్ళిపోయి పాడైపోతావు. మంచి వదిలితే చెడులోకి వెళ్ళిపోతావు. మంచి సంకల్పం రావడమే లక్ష్మీకటాక్షం, ఎలా వ్యవహరించాలి అనేది సరస్వతీ కటాక్షం,





క్రియాశక్తికి దుర్గాకటాక్షం కావాలి. ఈ మూడు ప్రతీవారికీ అవసరమే. "ఈశ్వరుని పాదాలు పట్టుకుంటే వాడికి జన్మలు ఏమిటి? వాడికి పతనం ఉండదు" అన్నారు తులసీదాస్. మూగవాడు మాట్లాడలేడు. గుడ్డివాడు దేన్నీ చూడలేడు. ముముక్షత్వ కాంక్ష లేనివాడు తరించలేడు. మనం ముముక్షత్వం గలవారితో స్నేహం చెయ్యాలి. ప్రకృతి మనుషులతో కాదు, మనం ఎలా ఉన్నాము అంటే మూగవాడు మాట్లాడుతూ ఉంటే, చెవిటివాడు విన్నాడట. మన పరిస్థితి అలా ఉంది. లౌకికుని బుద్ధి వికలమై ఉంటుంది. సత్పురుషుని హృదయం తేటతెల్లగా ఉంటుంది. పాడైపోయే దృశ్యాలను చూడకండి, పాడైపోయే మాటలు వినకండి. అలా ఉంటే మీ కళ్ళు ఎందుకు? మీ చెవులు ఎందుకు? నరం లేని నాలుకను, చెవులను, కళ్ళను అదుపులో పెట్టుకోండి.

29. వాళ్ళు చెడ్డవాళ్ళు అనే గోల నీకెందుకు? ఈశ్వరుడు వాటిని చూసుకొంటాడు. మనమే రాగద్వేషాలతో ఉంటే ఇతరుల గురించి ఎందుకు తీర్పులు చెబుతున్నాము? మీరు ఏ మార్గంలో ఉన్నా అంతఃకరణ శుద్ధి కలగకుండా సిద్ధి కలుగదు. మన మనస్సు ప్రశాంతంగా ఉంచుకో గలిగితే మనకు శాంతి, లోకానికి శాంతి, మరణానంతరం శాంతి పొందుతాము. కాబట్టి అన్ని కాలాలలోనూ ప్రశాంతంగా ఉండండి. సాధన అంటే మనకు తెలియక తెచ్చుకున్న వాసనలను తెలుసుండి పోగొట్టుకోవడం. గుణాలకు లోబడితే జీవుడు, గుణాతీతుడుగా ఉంటే దేవుడు. పైథాగరస్ "భగవంతుడు ఒకడు ఉన్నాడని జాగ్రత్తగా జీవించాలి" అని అన్నారు. ఆత్మజ్ఞానం అనేది భగవంతుడు బహుమతిగా ఇచ్చేదే కానీ అడిగి తీసుకునేది కాదు. నీరు లేని నది, నీరు లేని చెరువు ప్రయోజనం ఉండదు. అలాగే నీకు భగవంతుడు మానవ జీవితాన్ని ఇచ్చాడు. ఆయన చెప్పినట్లు జీవించక పోతే ప్రయోజనం ఏమిటి? అవి గాలి పీల్చుకునే యంత్రాల లాంటివి. మీ ఇంటికి ఎవరైనా బంధువులు వస్తే వారిని ఎలా గౌరవిస్తారో అలాగే మీ హృదయంలో ఉన్న భగవంతుడిని అలా ప్రేమగా ఆరాధించాలి. తుకారాం రంగడుతో ఇలా

అంటాడు "నీమీద నాకు ఉన్న భక్తి వల్ల దేహాన్ని నీకు అర్పించడంలో, ఆ భక్తి జీవనదిలా ప్రవహించడంలో నాలో ఉన్న అజ్ఞానం నాకు తెలియకుండానే నశించిపోయింది. దానితో నేను పోరాటం చెయ్యలేదు" అని. భగవంతుని మీద మీకు ఉన్న ప్రేమ మాటల రూపంలో, చేతల రూపంలో ఉంటే ఆ ప్రేమే జ్ఞానంగా రావాలి. అంతేగాని నీ కామక్రోధాలు నీవు పూనుకొని శుభ్రం చేసుకోలేవు. భగవంతుడు అంటాడు "నా మీద నీకు ప్రేమ నిజమైతే నీ కామక్రోధాలు ఆవు, దూడని నాకి శుభ్రం చేసినట్లు నాకి నన్ను పవిత్రుడిని చేస్తాను. నీళ్ళల్లో పంచదార వేస్తే నీళ్ళు తియ్యగా మారిపోతాయి. అలాగే నీవు ప్రేమపూరితంగా నామం చేస్తే నీ మనస్సు కరిగిపోయి బ్రహ్మాకారం చెందుతుంది. నేను దేవుణ్ణి, నేను దేవుణ్ణి అనుకొంటే పాడైపోతావు. దేవుడు అవ్వడానికి ప్రయత్నం చెయ్యి.

30. మిమ్మల్ని, నన్ను, ఈ జీవకోటిని సృజించినది ఈశ్వరుడు. ప్రేమ పూరితంగా వారిని ప్రేమించి సిద్ధి పొందితే మనం అనుకునే 'నేను' ఎందుకూ పనికిరానిది అని తెలుస్తుంది. ఈ నేను కన్నా తాలింపులో వేసుకునే కరివేపాకు ఉపయోగకరమైనది అని తెలుస్తుంది. మనం చెడ్డ విషయాలకు మొఖం చూపిస్తున్నాము. మంచి విషయాలకు వెన్ను చూపిస్తున్నాము. రూపదృష్టి, నామదృష్టి లేకుండా చేసుకుంటే ముందు చిత్తశుద్ధి కలుగుతుంది. దానివల్ల ఈశ్వర దర్శనం. సాధన అనేది ఒక్క రోజులో చేసేది కాదు. ఆరోజుకారోజు అభివృద్ధిలోకి రావాలి. కుటుంబ సభ్యుల పట్ల అనురాగం కలిగితే లోపలికి వెళ్ళలేము. వాళ్ళ పనులు చేస్తూనే మమకారం తగ్గించుకోవాలి. మీరు పిల్లలకి దేహాన్ని ఇస్తారు. ప్రారబ్ధాన్ని ఇవ్వరు. ప్రారబ్ధాన్ని తల్లితండ్రులు కనలేరు. వారితో కొంతకాలం ఉండి వెళ్ళిపోతారు. స్నేహితుల మీద మనం అభిమానం పెట్టుకోకూడదు. విరోధులకు మనం విరోధిగా ఉండకూడదు. ఎంతోకొంత వైరాగ్యం ఉంటేనే పెళ్ళికూతురికి, పెళ్ళికొడుక్కి పెళ్ళి చెయ్యాలి అని శాస్త్రంలో ఉంది. వైరాగ్యం వల్ల మనస్సు విశ్రాంతి తీసుకుంటుంది. దానివల్ల దేహానికి ఆరోగ్యం,





మనస్సుకు ఆనందం. మన మనస్సును భగవంతుడు ఒకోసారి బయటకు గెంటేసి చూస్తూ ఊరుకుంటాడు. ఏమి నొల్లుకుంటున్నాడో అని అప్పుడు నీవు ఈ చెడు తలంపులు ఇలా వచ్చేస్తున్నాయి ఏమిటి? అని అనుకుంటూ బాధపడతావు. అప్పుడు నీవు భగవంతుని పాదాలను ఆశ్రయించాలి. నీవు ఏదో కల్పించుకోవడం, ఊహించుకోవడం దాని వల్ల వచ్చే వేదన నీవు కల్పించుకున్నదే. దానికి మరల సాధన మొదలుపెట్టడం. మనం అర్హత సంపాదించాలి. అనుగ్రహం దానంతట అది వస్తుంది. సారా త్రాగేవాడికి, పేకాట ఆడేవానికి డబ్బులు ఇస్తే అది అపాత్రదానం అవుతుంది. కలియుగం చీకటి యుగం. మంచి చెడుగాను, చెడు మంచిగాను కనబడుతుంది. అందుకే భగవంతుణ్ణి స్మరించడం మంచిది. ధ్యానమూర్తి నీ మనస్సును ఆక్రమించినప్పుడు, నీ మనస్సును ఆయన పట్టుకొని వాసనాక్షయం చేస్తాడు. బలమైన ఏనుగు సింహాన్ని చూస్తే ఎలా పారిపోతుందో అలాగే ఏనుగు కన్నా బలమైన నీ వాసనలు రామనామం చేస్తే పారిపోతాయి.

31. దేహాన్ని బట్టలతో కప్పకొని దానికి కొంత ఆహారాన్ని ఇవ్వండి. దేహాన్ని సాధనకు ఉపయోగించుకోవడం ప్రధానం. మనం ఆనందంగా ఉండడానికి సుందర ప్రకృతి కూడా సహకరిస్తుంది. మీ కుటుంబంలో ఏదైనా చెడ్డ జరుగవచ్చు. ఆ పరిణామం ఈశ్వరునికి తెలుసు అది మంచికే అన్న అవగాహన కావాలి. అది అమృతంగా మారిపోతుంది అని తెలుసు కోవాలి. మీ ఆధ్యాత్మిక సాధనలో ఆటంకాలు మీకు తెలుస్తున్నాయి. ప్రకృతి వాసనలు మీ హృదయంలోకి వెళ్ళకుండా వాటి ఆకర్షణలకు లోను కాకుండా వాటిని నిరాకరించడమే సాధన. మీకు ఆధ్యాత్మిక ఆకర్షణ లేకపోతే గురువు మీ దగ్గర ఉన్నా ఆయన జీవునిలాగే కనిపిస్తారు. జ్ఞానిని గుర్తిస్తేనే తరిస్తారు. అర్పణ, సమర్పణతో శరణాగతి పొందినవాడే ఆత్మానుభవానికి అడ్డువచ్చే ఆటంకాలను తొలగించుకోగలడు. ఒక పాడైపోయిన ఇల్లు మీకు ఉంది అనుకోండి అందులో నివాసం ఉండలేక దాన్ని తీసేసి డాబా కట్టుకోవాలి అనుకుంటూ కాలాన్ని వెళ్ళబుస్తూ ఉంటే ఇల్లు ఎప్పుడు కూలిపోతుందో అనే

భయంతో ఉండటం ఎలాంటిదో సత్యానుభవం పొందాలంటే నీ పాడు గుణాల దుమ్మును తొలగించకుండా జ్ఞానం కావాలి, సుఖిని అవ్వాలి అనుకోవడం అటువంటిది. నీవు కాని నీ మనస్సును నీవు వదిలిపెట్టాలి. కానీ నీవు అదే అనుకుంటున్నావు. దానిని నీవు ఎలా తొలగించుకోగలవు. దానికి గురువు అనుగ్రహం కావాలి. ఆహార నియమం కలవాడు కామాన్ని జయిస్తాడు. మంచి నడవడిక, మంచిమాట, మంచి తలంపు ఇప్పటికిప్పుడు మీకు ఫలితం కనబడకపోవచ్చును. వచ్చే జన్మలో అయినా కనిపిస్తుంది. మెలకువలో నిద్రపోవడం నేర్చుకోండి. అదే నిజమైన సాధన. శాంతి వచ్చిన తరువాత సుఖం వస్తుంది.

32. మీరు నూటికి నూరుపాళ్ళు తీపిగా ఉన్నా మీకు భగవంతుడు దొరకడు. భగవంతుడు అనుకోవాలి, అయ్యో వీడు పులుపుగా, చేదుగా లేడు. పూర్తిగా తీపిగా ఉన్నాడు. వీడికి మనం తెలియబడకపోతే ఎలా? అని వాడికి తెలియబడతాడు. ఈ విషయం అర్థం అయితే ఆనందం వస్తుంది. అంతర్ముఖమైన వానికి సంపదలు వచ్చినా, ఆపదలు వచ్చినా వాటితో తాదాత్మ్యం పొందకపోవడం వల్ల వానిని అవి ఏమీ చెయ్యలేవు. సంపదల ప్రవాహం, ఆపదల ప్రవాహం మీ మెదడు మీదకు రానివ్వకండి. రానిస్తే బహిర్ముఖంగా ఉంటావు. అంతర్ముఖం ఎప్పడూ నిండుకుండలా ఉంటుంది. నీ లక్ష్యం ఉన్నతంగా ఉంటే నీలో పక్వత వస్తుంది. “సంసారాన్ని భుజాల మీద పెట్టుకో. భగవంతుణ్ణి బుద్ధిలో పెట్టుకో” అని శాస్త్రం చెబుతున్నది. విద్య వల్ల వినయం దాని వల్ల పాత్రత వస్తుంది. ధనం సద్వినియోగం చేయడం వల్ల ధర్మం వస్తుంది. అంతర్ముఖం నేర్చుకుంటే మనస్సు అణిగిపోతుంది. మనస్సు అణిగి ఉండి సత్త్వగుణం కలిగిన వాని ద్వారా సత్కర్మ జరుగుతుంది. కానీ రజోగుణం ద్వారా జరుగదు. సత్వగుణంలో స్పష్టత ఉంటుంది. వివేకం ఉంటుంది. ఇంద్రియాలు అణిగి ఉంటాయి. మన ఇంట్లో భూమిలో వెయ్యి కాసుల బంగారం ఉంది అనుకోండి ఆ విషయం మనకు తెలియకపోతే దరిద్రంతోనే బాధపడతాము.





అలాగే ఆత్మ సంపద నీలోనే ఉంది. దాన్ని అనుభవంలోనికి తెచ్చుకోకపోతే క్షోభతోనే జీవిస్తావు.

33. మీ హృదయంలోనే ఉన్న సత్యవస్తువును పొందడానికి ఏది అడ్డు వస్తున్నదో మనకు తెలుస్తూ ఉంటుంది. వాటిని తొలగించుకోవడానికి ఏకాగ్రత వల్ల సాధ్యం అవుతుంది. మీ అలవాట్లు సాధనకు అడ్డురాకపోవడమే ఏకాగ్రతకు గుర్తు. నీవు ఒక ప్రదేశానికి వెళుతూ ఉంటే అడుగులు లెక్క పెట్టుకోవు. సహజంగానే నడచి గమ్యానికి చేరతావు. అలాగే నీకు భగవంతుని అనుగ్రహం ఎప్పుడు వస్తుందా అని ఊహించకు. ప్రపంచంలో ఏ ఇద్దరు జ్ఞానులను ఈశ్వరుడు ఒకేరకంగా అనుగ్రహించలేదు. ఆ పరిస్థితులను బట్టి ఎప్పుడు ఎక్కడ అనుగ్రహించాలో అలా అనుగ్రహించాడు. తనువు తాను కాదని తెలిసిన వాడు కాలానికి, దేహానికి, ప్రకృతికి అతీతంగా ఉంటాడు. కష్ట, సుఖాలలో సమానంగా ఉంటే ప్రాణాయామ సాధనలకన్నా గొప్ప సాధనగా ఉంటుంది. శరీరాన్ని, మనస్సుని అనుకూలంగా ఉపయోగించుకుంటే అదే తపస్సు. కారణం కనిపించే శాంతి శాంతి కాదు. అది కాల ప్రవాహంలో కొట్టుకుపోతుంది. కారణం లేని శాంతే నిజమైన శాంతి. మనలో సత్య సంకల్పం ఉంటే ఆత్మానుభవం ఎప్పడో ఒకప్పడు నెరవేరుతుంది. మనం బాగుపడాలంటే ప్రకృతి మనుషులతో మమత, ఆసక్తి తగ్గించుకోవాలి. ద్వైతం లేనప్పడు ఆకర్షణ లేదు, ప్రేమ లేదు. సబ్జక్టు చెప్పడం అంటే అది చిటారు కొమ్మ. కొందరు భక్తులు ఎలా ఉంటారంటే వారికి గమ్యం భగవంతుడే, సాధనా భగవంతుడే. శ్రీకృష్ణుడు “ఎవరైతే అందరిలోనూ నన్ను చూసుకొంటున్నాడో మరియు అందరిలోను తనను చూసుకుంటున్నాడో వాడు సమదర్శిని” అన్నారు. అక్కడ ప్రేమ కూడా లేదు. అది పరాకాష్ట. చిటారు కొమ్మ. ఆ స్థితిని మనం అందరం అందుకోవాలి. రాతితో కుక్కను తయారుచేస్తే పరాకున అది నిజమనుకొని భయపడతాము. అలాగే కల్పించబడిన శరీరాలను చూచి వీడు విరోధుడని భయపడుతూ ఉంటాము. నిజం తెలిస్తే భయం ఉండదు. ఈ సృష్టిలో

ఉన్నది భగవంతుడే. మనకు ఈ విషయం అర్థంకాకపోయినా భగవంతుడినే అంటిపెట్టుకొని ఉంటే భగవంతుని దయ కలిగి అర్థం చేసుకునే బుద్ధిని ఆయన ఇస్తాడు. ఈ సృష్టి ఎవరివల్ల తయారైనదీ తెలుసుకుంటే సృష్టి యొక్క రహస్యం తెలుస్తుంది. వట్టిగడ్డి మాత్రమే తినే పశువు పచ్చగడ్డి అనేది ఒకటి ఉంది అది ఎంతో రుచిగా ఉంటుందని తెలియక వట్టిగడ్డినే తింటుంది. అందులో ఏ సారమూ లేదు. టీవీలు, సినిమాలు చూసే బుద్ధికి, ఆత్మరుచి, దాని వైభవం అనుభూతమైతే సినిమాలను వదిలేస్తుంది. కర్మానుష్ఠానం, భక్తి రెండూ జీవితాంతం అలవరుచుకుంటే దాని వల్ల మరణానంతర జీవితంలో కూడా సుఖంగా ఉండవచ్చును. చేతులు పనిమీద, మనస్సు నారాయణుని మీద ఉండాలి. ప్రతీక్షణం ఎవరైతే జగరూకతతో ఉంటారో వారే తరిస్తారు. శరీరం ఉన్న చోట శ్రవణం చేసేవాడు ఉండాలి.

34. ఇల్లు అంటుకున్న తరువాత నీటికోసం నుయ్యి తవ్వి ఆ నీటితో మంటలను ఆర్పుదామనుకొంటే తవ్వే లోపే ఇల్లు కాలి బూడిద అవుతుంది. అలాగే జీవితం అంతిమ కాలంలో భగవంతుణ్ణి స్మరిద్దాము అనుకుంటే రోగాలతో అది సాధ్యం కాదు. చిన్న వయస్సు నుంచే స్మరణ కావాలి. మాకు దిక్కు అంటూ ఏదైనా ఉంటే భగవంతుని పాదాలే. విషయచింతన కలుగుతూ ఉంటే మీకు బుద్ధి ఉంది కదా! ఆ బుద్ధితో విషయ చింతనకు బుద్ధి చెప్పండి. అప్పుడు అది నిలకడగా ఉంటుంది. ఆ బుద్ధి ఎటూ చెదరదు. మన బుద్ధి నిజం కాని దానిని నిజం అని నమ్ముతుంది. దానితో మనం ఒక గోతిలో నుండి బయటపడి ఇంకొక గోతిలో పడతాము. మన బుద్ధికి నిజం గోచరించే వరకు ఒక దుఃఖంలోంచి మరో దుఃఖంలోకి పడటం తప్పదు. సత్యంలో కాలం లేదు, కామం లేదు. గుడిలో దేవుడు ఉన్నాడని గుడి పరిసరాలు కడిగి శుభ్రంగా ఉంచుతాము. అలాగే మన హృదయంలో దేవుడు ఉన్నాడు. దానిని శుభ్రంగా ఉంచాలంటే ఆహార విహారాలలోను, వచ్చే తలంపుల విషయంలోను శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.





అంతర్యామిగా ఉన్న ఈశ్వరుని దగ్గరకు చేర్చే గురువు పట్ల గౌరవం ఉండాలి. శ్రద్ధ గలవాడు అంటే భగవంతుడు ఉన్నాడనే స్థిరమైన నిశ్చయం గలవాడు అని అర్థం. అస్థి అంటే ఉందని, నాస్తి అంటే లేదని. ఆస్థికుడు అంటే భగవంతుడు ఒకడు ఉన్నాడని నమ్మేవాడు. రామకృష్ణ పరమహంస గారు "బృందావనంలో ధూళి, గంగానదిలో జలం, పూరీ జగన్నాథుని ప్రసాదం పవిత్రమైనవి" అన్నారు. భీష్ముడు "మనలను ఎవరైతే తక్కువ అంచనా వేస్తారో వాళ్ల దగ్గరకు వెళ్లవద్దు. కారణం మీ అస్థిత్వాన్ని దెబ్బతీస్తారు" అన్నారు.

35. అద్వైత సిద్ధాంతంలో సాధన లేదు. సిద్ధి ఉంది. పరమాత్మ ఉన్నాడనే విశ్వాసమే సిద్ధి. సాధన ఉంది, సిద్ధి లేదు అంటే నీకు ఆ సద్వస్తువు తెలియడం లేదు కాబట్టి లేదు అనుకున్నా లేదా దానిని తెలుసుకున్నా కొత్తగా తెలుసుకన్నది కాదు. అది ఎప్పుడూ ఉంది. అందుచేత సాధన ఉంది, సిద్ధి లేదు అనడానికి కారణం అది. మీరు అంటే మీకు ఎందుకు అంత ఇష్టం అంటే మీలోనే సుఖము. శాంతి ఉంది. ఆ రెండూ మీలో లేకపోతే మీరంటే మీకు ఇష్టం ఉండదు. ఆచార్యులవారు సాధనా పంచకంలో ఇతరుల పట్ల అతి ప్రేమ మంచిది కాదు, అలాగే అతి సన్నిహితం కూడా మంచిది కాదు అన్నారు. మనస్సు ఉన్నంత వరకు ఎంతోకొంత కోపం తప్పదు. తాడూ, బొంగరం లేని వాడికి కూడా నిద్రలో ఆనందం కలుగుతుంది. అది ఎక్కడ నుండి వస్తున్నది ధనవంతుడు గ్రహించాలి. నిద్ర నుంచి మెలకువ రాగానే మమకారం వస్తున్నది. దానితో ఈ సంపద నాది అనుకొంటారు. దుఃఖం వస్తుంది. ఎవరికైనా కాలు విరిగింది అనుకోండి వాళ్లు మీకు విరోధులు అయితే మీకు ఆనందం వస్తే అది పైశాచిక ఆనందం. మెలకువ వస్తే ఇవన్నీ వస్తున్నాయి. గాఢనిద్రలో అవి లేవు. గాఢనిద్రలోనే మనం నిజ స్థితిలో ఉన్నాము. మెలకువ వచ్చాక మనస్సు యొక్క చేష్టలకు గురి అవుతున్నాము. దానిని మనం గ్రహించాలి. గాఢనిద్రలో ఉన్న స్థితిని మెలకువలో పొందడానికి ప్రయత్నం చెయ్యాలి. అదే సాధన. వ్యవహార దశలో రాగద్వేషాలు ఉండకూడదు. అతి దయ కూడా ఉండకూడదు.

అహంకారాన్ని త్యాగం చెయ్యడమే త్యాగం. దానికి మించిన త్యాగం ఈ సృష్టిలో లేదు.

36. మనం వ్యక్తిత్వాన్ని పోషించుకుంటాము. అలాగే ఉంటే జ్ఞానం రానే రాదు. కాలమనే సర్పం మనల్ని కాటేసే లోపలే మనం జ్ఞానాన్ని పొందాలి. లేదంటే ఎక్కడికి పోతామో తెలియదు. వైద్యుడు నాలుకను పరీక్షించి రోగాన్ని తెలుసుకోగలడు. అలాగే నాలుకతో నాలుగు మాటలు మాట్లాడితే వాడి మనస్సు ఎటువంటిదో తెలుసుకోవచ్చును. "నేను నేనైన నేనును" అంటే నేను ఎవరో కాదు నిజమైన నేనునే అని అర్థం. నీ హృదయంలో సత్యం తెలిసే వరకూ నీ తప్పు ఆలోచనలో నుండి బయట పడలేవు. ఏదో ఒక మాయలో ఉంటావు. ఉపాధి జ్ఞానం పోగొట్టుకుంటే బ్రహ్మజ్ఞానం కలుగుతుంది. అప్పుడు కనిపించే రూపాలు అన్నీ బ్రహ్మంగానే కనిపిస్తాయి. ఉన్న వస్తువు మీద దేహాన్ని మనస్సును కల్పించుకుని దుఃఖానికి గురి అవుతున్నావు. శత్రు శేషం, ఋణ శేషం, నేను శేషం ఉన్నంతకాలం వాటిని నమ్మడానికి వీల్లేదు. మనిషి చనిపోయిన తరువాత ఎవ్వరూ గుర్తించరు. నీవు ధనహీనుడవు అయితే అసలే గుర్తించరు. ఈ సత్యాన్ని గుర్తించి చనిపోయినప్పుడు అందరూ వదిలేస్తారు కదా! ఇప్పుడు అలాగే ఉందాము అని అనుకోవాలి. ఇవి అన్నీ దేహ సంబంధమైన గొడవలు. పువ్వు కాయగా తయారైనప్పుడు పువ్వు రూపం ఉండదు. అలాగే నీవు పక్వానికి వస్తే కర్మ నిన్ను వదిలేస్తుంది. "టెన్షన్ ఎందుకు వస్తుంది అంటే సత్యం ఒకటి ఉంది అది పని చేస్తున్నదనే గుర్తింపు లేకపోవడం వల్లనే. సంతోషాలు, దుఃఖాలు వెంటాడుతున్నా ఈశ్వర నిర్ణయాన్ని శిరసావహించాలి." అన్నారు గాంధీజీ. అది వారి జీవితంలో నేర్చుకున్న అనుభవం. భగవంతుని సంకల్పానికి అనుగుణంగా నడవడానికే ఈ భూమి మీదకు వచ్చాము. ఈ శరణాగతిలో ఈశ్వరుడే ఉంటాడు, భక్తుడు ఉండడు. ఏదైనా అభ్యాసం చేస్తే తేలికగా ఉంటుంది. లేకపోతే కష్టంగా ఉంటుంది. సొంత ఆలోచన లేనప్పుడు చిత్తశుద్ధి లేనప్పుడు ధర్మ, అర్థ, కామ, మోక్షాలకు దూరమైపోతాడు. ఈ





శరీరాలు అన్నీ వాసనామయ దేహాలు. మనిషి చనిపోయిన వెంటనే అహంకారానికి విశ్రాంతి ఇస్తాడు. కోరికలు మొలకెత్తుతూనే ఉంటాయి. అదే దేహం ధరిస్తుంది. తరువాత దేహంతో కోరికలు వృద్ధి చెందుతాయి. జీవుడు ఇలా ప్రయాణం చేస్తూనే ఉంటాడు. దేవునికి మన మీద ఉన్న ప్రేమ ఈ సృష్టిలో ఎవరికీ లేదు. ఆ సంగతి గుర్తించాలి. అప్పడే నీకు అశాంతి నశిస్తుంది.

37. రామచంద్రమూర్తి ఆంజనేయునితో ఇలా అన్నాడు "నా వల్ల నీకు ఉపకారం జరిగే పరిస్థితి రాకుండుగాక". ఈ మాట అందరికీ అర్థం కాదు. ఆయన భావం నాకు కష్టాలు వచ్చాయి కాబట్టి నీవు నాకు సహాయం చేసావు. నీకు కూడా నేను సహాయం చెయ్యాలి అని భావిస్తే నీకు కష్టం రావాలనుకోవడమే. అందుకే ఆ పరిస్థితి నీకు రాకూడదు అనుకోవడం. మనకు సహనం ఉంటే కష్టాలను తేలికగా అనుభవించగలం. అసలు నీవు ఉన్నావా? సాధన చెయ్యడానికి నేను నేను అనేది తలంపే. నీవు ఉంటే సాధన చెయ్యడం చెయ్యకపోవడం. అసలు చనిపోవడం నీ చేతులలో ఉందా? నీకు శరణాగతి ఉంటే నీకు ఇవ్వవలసినది ఇస్తాడు ఈశ్వరుడు. ఏమి జరిగినా మేలే చేసాడు అనుకోండి. కొందరు అనుకొంటారు "మా రోజులు బాగానే వెళ్ళిపోతున్నాయని" వల్లకాటికి వెళు తున్నామని అనుకోరు. దేవుని అనుగ్రహం మన మీద ఉంటే మనకు ఈ బుద్ధి కలుగుతుంది. మన మనస్సు ఆత్మానుభవానికి అనుకూలంగా వెళు తున్నదా? లేదా? అని చూసుకుంటాము. ఇది జీవితానికి ముఖ్యం. మన కోరికలు అన్నీ నెరవేరిపోతే హత్య చేయబడతాము. ఒకనికి భగవంతుడు ప్రత్యక్షమై ఏమి కావాలి అని అడుగగా "నాకు కలిగే కోరికలు అన్నీ సఫలం కావాలి" అనగా అలాగే అన్నాడు. ఇంటికి వెళ్ళి తాటాకు ఇల్లు డాబా కావాలి అనుకొన్నాడు. తరువాత అది నచ్చక మేడ కావాలి అనుకొన్నాడు. అదీ నెరవేరింది. తరువాత నౌకర్లు కావాలని, ఆ తరువాత ఎక్కువ మంది నౌకర్లు కావాలని కోరగా వాళ్ళు ఎక్కువైపోయారు. తరువాత

ఆయనకు వాళ్లను చూసి భయం వేసింది "వీళ్లు అందరూ దెయ్యాలై నన్ను చంపరు కదా!" అనుకొన్నాడు. వాళ్లు దెయ్యాలై చంపేసారు. మన అసందర్భమైన కోరికలు ఇలా ఉండి పతనమవుతాయి.

38. ఇతరులను హింసించడం ఎటువంటిదో మిమ్మల్ని మీరు హింసించుకోవడం కూడా అటువంటిదే. దానికి బదులు భగవంతుణ్ణి స్మరించడం మంచిది. మీ ఆత్మ గూటిలోకి మీరు వెళ్లిపోతారు. శరణాగతి పొందితే మనకు అక్కరలేని తలంపులు అన్నీ రద్దు అవుతాయి. పోగొట్టుకొన్న ధనాన్ని సంపాదించవచ్చు. పోగొట్టుకున్న ఆయుర్దాయాన్ని సంపాదించు కోలేము. కాబట్టి ఆత్మ విద్యను పెంపొందించుకోవాలి. నీవు అనుకొన్న దేహేంద్రియాలు నీవు కావని గ్రహిస్తే సాధన చేసేవాడు ఉండడు. నీవు శరణాగతి చెందడం వల్ల నీ బాధలు పోతాయి. దానికోసం నీవు నిరీక్షించు. వీళ్లు నావాళ్లు, వాళ్లు పరాయివాళ్లు అనుకోవడం భ్రాంతి. నావాళ్లు అనుకున్న వాళ్లే ఒక్కోసారి నష్టం చేస్తారు. అరుణాచలం కొండవైపు చూస్తూ ఉంటే ధ్యానం చెయ్యనక్కరలేదు. చూస్తూ ఉండటం వల్ల గైడెన్స్ వచ్చేస్తుంది. జాగ్రదావస్థలో ఈ రకమైన సాధన చేయడం వల్ల మీకు గాఢనిద్ర స్థితి వచ్చేస్తుంది. ప్రహ్లాదుడు ఆనంద స్వరూపుడు. తండ్రి ఎంత క్షోభ పెట్టినా భగవదానందాన్ని విడిచిపెట్టలేదు. సాధకుడు అలా ఉండాలి. బుద్ధిలో స్పష్టత లేనప్పుడు స్పష్టంగా మాట్లాడలేరు. వివేకానందుడిని ఒకరు ఇలా ప్రశ్నించారు "నేను మంచివాడినేనా?" దానికి ఆయన "నీ జీవితంలో నీవు పడ్డ కష్టాలు, బాధల్లో అవి నీ మనస్సును ముట్టుకోకుండా ఉన్నాయా? శత్రువుల పరంగాగానీ, ప్రకృతి పరంగాగానీ, అనారోగ్య పరంగాగానీ నీ మనస్సు బాధ, క్షోభ లేకుండా ఉంటే అప్పుడు నీవు మంచివాడివని అంటాను". అది అద్భుతమైన, అందమైన సమాధానం.

39. ఆలోచన, మాట, చేత ఒకేరకంగా ఉంటే ఇతరులు నిన్ను ఎంత విమర్శించినా నీకు దుఃఖం రాదు. చాడీలు చెప్పేవారికి దూరంగా ఉండండి. మన సంసారంలో బాధలు అనే మంటల్లో మనం ఉంటే వారు





దాన్ని ఆపరు సరికదా! ఇంకో రెండు చాడీలు చెప్పి దాన్ని పెంచేస్తారు. వారు తేలుతో సమానం. వారి చేతలు మాటల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. తగువులు పెంచి అశాంతిని తీసుకొస్తారు. కాళ్లనిండా బాడితో చెప్పులతో గుడికి వచ్చేవారిని దేవుని దర్శనానికి అనుమతించరు. అలాగే నీ మనస్సు బాడి చేసుకొని, బురదతో దుర్వాసనతో ఉంటే నీలో ఉన్న దేవుడు నిన్ను లోపలకి రానివ్వడు. ఒకవేళ నీవు శుభ్రంగా వెళ్లినా లోపలకి రానివ్వడు. ఎందుకంటే అర్హతను నీవు సంపాదించాలి. నీ నోటిని ఆయన వాడుకోవడానికి, భూమి మీద ఉంచడానికి సమయం కోసం ఎదురు చూస్తున్నాడు. దానికి నీవు ఇంకా అనుభవం రావడం లేదేమిటి? అని గుంజుకోకూడదు. నిరంతరం ఆత్మవిచారణ చెయ్యలేకపోవచ్చును. జపము, సత్సంగము, ధ్యానం చేసుకోండి. కొంత సమయం అధ్యయనం చేసుకోండి. వైరాగ్యాన్ని సంపాదించుకోండి. మీ సఫరింగ్ మీకు శాంతిని, పోరాట పటిమను కలుగజేస్తుంది. కరెంటుపోతే లైట్లు ఆరిపోతాయి. ఫ్యాన్లు తిరగవు. అలాగే మన శరీరం నుండి చైతన్యం తప్పకుంటే ఈ శరీరం కూడా జడ ప్రాయంగా ఉంటుంది. దీనికి సోకులు చెయ్యకు. దేవునికన్నా మనం భిన్నము అనుకొంటున్నాము. దాన్ని తొలగించుకోవడానికే సాధన. ఆ భావాన్ని తొలగించుకుంటే సాధన లేదు. ఏదైతే మనం అయి ఉన్నామో అది అనుభవంలోకి వచ్చేవరకు ఏదో ఒకటి అనుకోకుండా ఉండలేము. ఎక్కువ స్నేహం వల్ల మన కాలం వ్యర్థమవుతుంది. మనకు ముప్పయి సంవత్సరాలకు పూర్వం అతిసన్నిహితంగా ఉన్న వ్యక్తి అనుకోకుండా కలిస్తే ఆయనను ఆనందంగా కౌగలించుకుంటాము. అలాగే నీకు ఆత్మానుభవం కలిగితే చావు నీ శరీరానికి వస్తే చావును నీవు అలాగే ఆలింగనం చేసుకుంటావు శరీరం పీడ పోయిందని. నీవంటూ ఒకడవు ఉన్నావా? ఉన్నాను అనుకొంటున్నావు కాబట్టి సాధన చెయ్యి. జేబులో డబ్బు అతి జాగ్రత్తగా ఉంచుకుంటాము. దానికి విలువ ఉందని, అలాగే అహంకారం మనం అని అనుకోవడం వల్ల దాన్ని వదలిపెట్టలేకపోతున్నాము. అది పెంట అని

తెలుసుకోలేకపోతున్నాము.

40. మనలో ఏ బలహీనత ఉందో ఆ రకమైన వస్తువును లోకంలో చూచినప్పుడు అది గొప్పగా కనిపిస్తుంది. ధనం అంటే మనకు ఇష్టం అయితే ధనవంతులు కనిపిస్తే వారు గొప్పగా కనిపిస్తారు. అలాగే ప్రతీ బలహీనతకు తగ్గట్టుగా గొప్పగా కనిపిస్తారు. కొందరు మంచి వాళ్ళకే కష్టాలు ఎక్కువ అంటారు. భగవంతుడు ఈ జన్మలోనే ఆ మంచివాళ్ళను తరింప చేయాలని సంకల్పించుకుంటే వంద జన్మలలో అనుభవించే కష్టాలను ఒకదాని తర్వాత ఒకటి పంపించి ఈ జన్మలోనే ఆత్మానుభవం కలుగజేస్తాడు. “రాముణ్ణి స్మరించుకొంటూ ఉంటే మనస్సు విశాలమవుతుంది. మనస్సు బుద్ధిని అంటిపెట్టుకొని ఉంటుంది. రామనామం ఒక్కటి చెయ్యడం వల్ల విష్ణు సహస్రనామాలను పారాయణం చేసే వారికి ధనము, సుఖము వస్తుందని సాంప్రదాయంగా చెబుతారు. సుఖం అనుభవించడం వల్ల సుఖం రాదు. ధర్మాన్ని ఆచరించడం వల్ల సుఖం వస్తుంది అని రామాయణంలో సీతామాత అంది. రామాయణం అంతా ముత్యాలమూట. అందరి పాత్రలు ముత్యాలవంటివే. నీవు కల్పించుకున్న గొడవలను వదిలేస్తే ఉన్నది శాంతే. జపం వలన మిమ్మల్ని బాధపెట్టే తలంపులు రావు. మీ మనస్సు ఇష్టదైవం యొక్క నామాన్ని పట్టుకొని ఉంటుంది. జపం తలంపులను దూరం చేసి సత్యాన్ని దగ్గర చేస్తుంది. దేహం వచ్చాక ప్రారబ్ధం వచ్చేస్తుంది. మీ దేహ ప్రారబ్ధం కొట్టే దెబ్బలను మీరు సంతోషంగా అనుభవిస్తే మీ ఉద్రేకం నశిస్తుంది. సమత్వ బుద్ధి, శీలము, ఆత్మ విద్య ఇవి బంగారం. అలవాట్ల విషయంలో జాగ్రత్త వహించాలి. బయట పనులు చేయడం వల్ల బయట గొడవల వల్ల ఆత్మజ్ఞానం రాదు. భగవాన్ ఒక రహస్యం చెప్పారు. “కొందరు అవసరం అయినప్పుడు డబ్బు ఖర్చు పెడతారు. అవసరం లేనప్పుడు ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టరు. అలాగే సాధకుడు అవసరం లేనప్పుడు తలంపు తెచ్చుకొని కాలాన్ని వ్యర్థం చేసుకోడు” అన్నారు. అద్భుతమైన సూచన.

41. దేవుని కన్నా నేను వేరు అనేబుద్ధి రామనామం చెయ్యడం





వల్ల నశింపచేస్తుంది. పూర్వం కన్నా ఇప్పుడు చాలామందికి సంపద ఉంది. పూర్వం వారికి ఉన్న సహనం ఇప్పటి వారికి లేదు. సహనంలోనే శాంతి, సుఖము ఉంది. “రామునికి ఉన్న సహనం భూమికి కూడా లేదు” అంటారు. పశ్చాత్తాపం వల్ల కొన్ని పాపాలు పోతాయి, క్షమించబడతావు. ముఖస్తుతి చేసే వాళ్ళ మాటలను మీ మనస్సులోకి ఎట్టి పరిస్థితులలోనూ స్థానం ఇవ్వకండి. రామకృష్ణులు వివేకానందుని కులంగానీ, తల్లితండ్రులు ఎవరు అని గానీ, ఆర్థిక పరిస్థితి ఏమిటి? అని కానీ సొంత ఇంట్లో ఉంటున్నావా? అద్దె ఇంట్లో ఉంటున్నావా? అని ఎప్పుడూ అడగలేదు. మనవి అన్నీ వ్యతిరేఖమైన ఆలోచనలు పెళ్ళి అయితే కట్నం ఎంత? ఉద్యోగం అయితే జీతం ఎంత? మనం అన్నీ ఇలాంటి ప్రశ్నలు వేస్తాము. అలాంటివి తగ్గించు కోవాలి. మనకు ఏది జరిగినా భగవంతుడు మంచే చేస్తాడు. అనుకొంటే బయటా శాంతే, లోపలా శాంతే. ఇష్టాయిష్టాలు లేకపోతే మనస్సు బాహ్య ముఖం అవ్వదు. మీ మనస్సు హృదయంలో కరిగిపోతే చూడడానికి, చెయ్యడానికి ఏమీ ఉండదు. మనస్సును వదిలేద్దాము అనుకొంటే దాని కన్నా ఇష్టమైనది మనకు ఈ సృష్టిలో ఏదీ లేదు. ఎలా వదులుతాము? అరుణాచలా! అరుణాచలా! అంటే చాలు మన మనస్సును దొంగిలించుకొని పట్టుకుపోతాడు అరుణాచలేశ్వరుడు. అరుణాచలా అంటే తేలిక, లాభం ఎక్కువ. దేహబుద్ధి ఉన్నవానికి దుఃఖం. ఆత్మబుద్ధి ఉంటే లోకంలో ఉన్న దుఃఖం అంతా నీ మీద వాలినా నీకు దుఃఖం రాదు. నీవు ఆత్మవని తెలిసాక తెలుస్తుంది ఏమీ లేని దానికి ఇంత దుఃఖపడ్డాను అని అనుకొంటావు.

42. గాంధారి అంటుంది కృష్ణునితో “నా వంశం అంతా నాశనం చేసావు. అలాగే నీ వంశం అంతా నాశనం కావాలి” అనగా శ్రీకృష్ణుని మొఖంలో ఏ వికారము కలుగలేదు. కారణం పరమాత్మకు వంశం ఏమిటి? వాడు పరమాత్మ. గాంధీజీ అన్నారు “పరమాత్మ నీ హృదయంలో నిండుగా ఉన్నాడు. నీ సాధన కూడా నిండుగా ఉంటే అప్పుడు భగవంతుడు నీకు లభ్యం అవుతాడు” అని. పురాణాలు ప్రార్థన చెయ్యమంటాయి. ఉపనిషత్తులు

ధ్యానం చెయ్యమంటాయి. రెండూ చేస్తే మబ్బులు లేని ఆకాశం ఎలా ఉంటుందో నీకు జ్ఞానం కలిగే ముందు నీ మనస్సు అంత నిశ్చలంగా ఉంటుంది. దానినే అరుణోదయం అంటారు. అంటే బాగా వెలుతురు ఉండదు, బాగా చీకటి ఉండదు. నదులలో నీరు ప్రవహిస్తూ ఉంటుంది. ఆ నీరు అంతా ఆ నదే త్రాగేయడం లేదు. చెట్లు ఫలాలు ఇస్తాయి వాటిని అవి తినేయడం లేదు. అలాగే మీకు తెలివితేటలు సంపద ఉంటే మీరే తినేయకుండా సమాజానికి ఉపయోగపడేలా చేస్తే ఆ సమాజానికన్నా మీకే ఎక్కువ లాభం. దానివల్ల చిత్తశుద్ధి కలిగి మోక్షానికి వెళతారు. అక్కడ ఏదో ఉంది అని మిమ్మల్ని బాహ్యముఖానికి గెంటేసి లోకం యొక్క ఆకర్షణకు మిమ్మల్ని మళ్ళిస్తాడో వాడు గురువు కాదు రాక్షసుడు. సాధు రూపంలో మీ దగ్గరకు అనేకమంది రావచ్చును వేషధారులను చూసి మోసపోవద్దు. బయట చూపు పెంచుకోవద్దు, లోచూపు పెంచుకోండి. ఈశ్వర రూపంలో ఉన్న సమాజానికి చేతనైతే పౌడర్ వ్రాయండి అంతేకానీ మసి వ్రాయకండి. మీ క్షేమాన్ని మీరు ఎలా చూసుకొంటున్నారో సమాజ క్షేమం కూడా అలా చూడండి.

43. మీ మార్గంలో మీరు ఉండండి. మీ ప్రయత్నం మీరు విడిచి పెట్టకండి. మీరు ప్రిపరేషన్ అవుతూ ఉంటే మిమ్మల్ని ఎప్పుడు అనుగ్రహించాలో ఆ ముహూర్తం ఆయనే పెట్టుకుంటాడు. ఆ పని ఆయనకు వదిలేయండి. మీ స్వరూపమే ఆయన మీకు ఇస్తాడు. మీరు ఇక్కడికి ప్రవచనం వినడానికి వచ్చారు. ప్రవచనం వినడం మానేసి చుట్టాల ఇంటికి వెళ్ళి అక్కడ వాళ్ళు పెట్టే పలావులు తినేసి తిరిగి ఇంటికి వెళ్ళిపోతే ఎలా ఉంటుందో మీరు ఈ లోకంలోకి వచ్చిన పని మరచిపోయి దారి తప్పిపోవడం అలాగే ఉంటుంది. అజాగ్రత్త పనికిరాదు. సాధకుడు ప్రతీ క్షణం జాగ్రత్తగా ఉండాలి. లోతైన అవగాహన ఉంటే మీ దుఃఖం అంతా ఆనందంగా మారిపోతుంది. తలంపులు పోవడానికి గురురూప ధ్యానం, నామ జపం, గురువు యొక్క కళ్యాణ గుణాలను స్మరించుకోవడంతో





తలంపులు అవే పోతాయి. శరణాగతి పొందితే తలంపులు రావు. రక్షకుడు గురువే (లేదా ఇష్టదైవం) అనే పూర్ణ విశ్వాసం ఉండాలి. వారిపట్ల ప్రీతి ఉండాలి. నిద్రపోకుండా అతిగా ఆలోచిస్తూ ఉంటే గుండె జబ్బులు వస్తాయి. నిద్రపోకుండా అతిగా శ్రమించడం పనికిరాదు. మధ్యేమార్గం మంచిది. మిమ్మల్ని ఎవరైనా విమర్శిస్తే మూడు గంటలపాటు మీరు మంచి వారని చెప్పడానికి ప్రయత్నం చేస్తారు. మనో పరిధి దాటితే ఏ స్పందనా ఉండదు. సూర్యుని మీద ఉమ్మివేస్తే సూర్యునికి ఏమీ తెలియదు. జ్ఞానిపై విమర్శలు అలా ఉంటాయి. "సత్యం కళ్ళకు కనిపించే దానికన్నా కనిపించనిదే ఎక్కువ నిజం. కనిపించడం లేదని పరమాత్మ లేడని కాదు. సృష్టి నిజం కాదు, సృష్టికి ఆధారంగా ఉన్నది నిజం. దానిని దర్శించాలి. అది ఇంద్రియాలకు మనస్సుకు అందేది కాదు. మనస్సు అణిగితే అది దర్శనమవుతుంది. అది కనిపిస్తే చూడగలం కానీ, చూడాలి అనుకుంటే చూడలేము" అన్నారు భగవాన్. లోపల చూపు మీ మనస్సుకు అలవాటు చేస్తే మీరు ఇప్పుడే ఆత్మ సుఖం అనుభవం పొందుతారు.

44. జీవుడిలో శివుణ్ణి చూసి సేవ చేస్తే అది నిజమైన పూజ అవుతుంది. అది మిమ్మల్ని బంధించదు. లోకజ్ఞానం, ఆత్మజ్ఞానం కలగాలంటే భారతం చదవాలి. ఉపనిషత్తులలో కేవలం ఆత్మజ్ఞానం మాత్రమే ఉంటుంది. అవమానాన్ని ఎలా భరించాలో వ్యాసులు భారతంలో చూపిస్తారు. భగవంతుని లీలలు చదువుతూ ఉంటే ఆయనపై ప్రేమ కలిగి మనస్సు ఆయనపై లీనమవుతుంది. ఉపాసన వల్ల శరణాగతి వస్తుంది. దేశ కాలాలు అంటే మీరు నివసించే ప్రదేశం ఆధ్యాత్మికానికి అనుకూలంగా ఉందా లేదా అనిసాధకుడు గమనించి నడుచుకోవాలి. కాలగర్భంలో ఏముందో తెలియదు. నేటి మిత్రులు రేపటి శత్రువులు అవుతారు. ఒక కాలంలో సంతోషం, ఒక కాలంలో దుఃఖం రావచ్చును. పాము పాకినప్పుడు శబ్దం లేకుండా కదిలిపోతుంది. కాలం కూడా అలాగే నిశ్శబ్దంగా దాని పని అది చేసుకుపోతుంది. కష్టాలతో జీవించడానికి అలవాటుపడాలి. దేవుణ్ణి చిల్లర

విషయాలు తీర్చమని అడుగకూడదు. మోక్షాన్ని ప్రసాదించమని అడగాలి. శరణాగతిలో ఈశ్వరుడు ఒక్కడే అని తెలుస్తుంది. నీలో ఎంతో సహనం ఉంటేగానీ నీలో సంస్కారాలను తొలగించుకోలేవు. సంస్కారాలు అంటుకోకుండా చూసుకోవడం కూడా సాధనలో భాగమే. టైమ్ మేనేజ్‌మెంట్ అంటే కాలాన్ని సద్వినియోగం చేసుకోవడం. నీ శరీర ఆరోగ్యం బాగుంటే తెల్లవారుఝామున 4 గంటలకు లేచి సాధనకు ఉపయోగించు కోవాలి.

45. దేహాభిమానం ఉన్నంతకాలం భగవంతునిలోనే ఉన్నామని తెలియదు. నీవు ఎంత ప్రయత్నం చేసినా ఆ భ్రమ పోదు. "మీ మనస్సులో విషయ చింతన పొడచూపకుండా ఉంటే మీరు పవిత్రులే" అన్నది భాగవతం. జీవితం సుందరమైనది. దానికి మించిన అందం మరియొక దానికి లేదు. కష్టకాలంలో ఓర్పు కావాలి. కష్టాలు కూడా క్రమ పద్ధతిలో ఖర్మ సిద్ధాంతాన్ని బట్టి వస్తాయి. జీవితాన్ని బలవంతంగా ముగించుకోకూడదు. ఆధ్యాత్మిక జీవితానికి అపనమ్మకం ఉండకూడదు. విశ్వాసంతో జీవించాలి. మనో జీవితాన్ని నాలుగు భాగాలు చేసి అందు మూడు భాగాలు ఆధ్యాత్మిక జీవితానికి, ఒక భాగం భౌతిక జీవిత మనుగడకు ఉపయోగించాలి. భౌతిక శరీరంలో రక్తమాంసాలు, ఎముకలు, ఇంద్రియాలు ఉంటాయి. మనస్సులో బాధలు, భయాలు, ఈర్ష్యలు, కోపాలు, తాపాలు అనేవి ఉంటాయి. బయట దేహం అగ్నివల్ల కాలి నశిస్తుంది. సూక్ష్మ శరీరం జ్ఞానంవల్ల, వైరాగ్యంవల్ల కాలి నశిస్తే పునర్జన్మ లేని అమృత స్థితికి వెళతాము. మీ బంగారు నగల్ని మీరు అతిజాగ్రత్తగా దాచుకుంటారు, వాడుకొంటారు. అలాగే భగవంతుని వాక్యాలను అంత జాగ్రత్తగా మీ హృదయంలో దాచుకొని ఆచరించాలి. మనస్సు ఉంటే అవమానాలు, భారాలు, భయాలు ఉంటాయి. బుద్ధుడి మొఖం మీద ఉమ్ము వేసినా వ్యక్తి మరుసటి రోజున క్షమార్పణ కోరగా "అది నాకు గుర్తు లేదు" అన్నారు. అది జ్ఞాన వైభవం. రాగద్వేషాలుల లేని మనస్సే బంగారం. ఇష్టాయిష్టాలు శుద్ధి చెయ్యండి. మనస్సు బంగారమవుతుంది. రామకృష్ణులు సాధనా అవతారం. మనస్సును రాపాడించి, రాపాడించి





నామరూపాలు లేకుండా చేసేవారు. కాలగర్భంలో ఏముందో నీకు తెలియదు. కాలాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఈరోజు ఆరోగ్యంగా ఉండవచ్చు. రేపు అనారోగ్యం రావచ్చును. సాధన రేపు చేసుకుందామని సాకులు చెప్పకొని సాధన విడిచిపెట్టకూడదు. ప్రహ్లాదుడు కష్టపడి, కష్టపడి భక్తిని సంపాదించుకున్నాడు. మనకు ఊరికే భక్తి వచ్చేయాలని అనుకోకూడదు. బాహ్యంగా చేసే ఉద్యోగాలలో పై అధికారి వల్ల అనేక బాధలకు గురి అవుతారు. దానికి కారణం పొట్టగూటికోసం, ఈ పొట్టకోసమే ఇంత కష్టపడితే శాశ్వత ఆనందంకోసం, సుఖంకోసం, జనన మరణాలు లేని ఆత్మజ్ఞానం కోసం ఎంత కష్టపడాలో గ్రహించుకోండి. నిర్గుణాన్ని పట్టుకోవాలంటే సుగుణాన్ని పట్టుకోవాలి. ఆ నిర్గుణమే భగవంతునిగా, కృష్ణునిగా వచ్చాడు. వాడికి శక్తి ఉంది. ఆయన్ని ఆరాధిస్తే సత్యాన్ని పొందుతావు. అరుణాచల కొండగల ఫొటోను చూస్తూ ధ్యానం చేసినా అది నిన్ను నీ హృదయంలోకి వెళ్ళేలా చేస్తుంది.

46. అనుకరణ అజ్ఞానాన్ని పెంచుతుంది. మనం పాడైపోవడానికి ప్రధాన కారణాలు ఉద్రేకాలు. దాని వల్ల శక్తి వృధా అవుతుంది. మూఢ నమ్మకాలు కూడా ఉద్రేకాలే. మనం కుడికాలు ముందు పెట్టాలా? ఎడం కాలు ముందు పెట్టాలా? శకునం ఎవరు వస్తున్నారు? తిథి మంచిదా? ఇలా విభజించుకొని గొడవలు పెంచుకొంటున్నాము. జ్ఞాన మార్గానికి దూరమవుతున్నాము. సాధన బహుజాగ్రత్తగా ఉండాలి. గురువు మీద మీకు ఉన్న ఇష్టం మనస్సు కల్పితం కాదు. భగవాన్‌తో మనకు ఏదైనా అనుబంధం వచ్చింది అనుకోండి మొదట ఆయనను ఏదో ప్రేమిస్తున్నాము, ఆయన మార్గంలో ప్రయాణం చేస్తున్నాము అనుకొంటాము. కొంతకాలానికి అది విడదీయడానికి వీలులేని అనుబంధంగా జన్మాంతర అనుబంధం అనే అనుబంధం కలుగుతుంది. అయితే భక్తులలో చాలామంది ఆ మార్గాన్ని విడిచి పెట్టేస్తున్నారు. అలా చేస్తే ఎవ్వరూ సాయం చెయ్యలేరు. మీరు తొందర పడకుండా నెమ్మదిగానే ప్రయాణం చెయ్యండి. రోడ్డు మీద తిరిగే

పాముల వల్ల మనకు అంతగా ప్రమాదం లేదు. కొంచెం తప్పించుకొని తిరిగవచ్చును. మన ఇంట్లో తిరిగే పాముల వల్ల మనకు ఎక్కువ నష్టం. ఎప్పడు కాటు వేస్తుందో తెలియదు. లోపల గొడవలు ఇంట్లో పాముల వంటివి. ప్రశాంతంగా ఇంట్లో కూర్చుని మనలోని బలహీనతలు జాగ్రత్తగా చూసుకోవాలి. వాటిని తొలగించుకోవడానికి సాధన చెయ్యాలి. మన జీవితానికి ఇదే చివరి రోజు. ఇక రేపు మనం చూడము అనుకొని సాధన చేస్తే వాడికి పట్టుదల పెరిగి తరిస్తాడు. రేపు సాధన చేసుకుందాము అంటే రేపుకి రూపులేదు. మాయలో ఉన్న వానికి దేవుని అనుగ్రహం రాదు. దయగలవానికే దేవుని అనుగ్రహం వస్తుంది. కర్ణుడు ఇలా అనుకొన్నాడు “ఈస్వర సంకల్పమే నెరవేరుతుంది. ఈశ్వర సంకల్పం ఉంది, నా సంకల్పం ఉంది. నా సంకల్పం ఎలా ఉందో ఈశ్వర సంకల్పం అలా ఉండాలి. అని నేను అనుకొంటే నాకంటే తెలివితక్కువవాడు, మూర్ఖుడు ఈ ప్రపంచంలో ఎవరూ ఉండడు” అన్నాడు. ఈ వాక్యం అర్థమైతే వ్యక్తిగతమైన ఆందోళన నుండి బయటపడి శాంతంగా ఉంటారు. బయట ఎంత ఎండగా ఉన్నా ఎసి గదిలో ఉంటే ఎంత సుఖంగా ఉంటారో అంత సుఖంగా మీరు ఉంటారు, ఈశ్వర సంకల్పాన్ని గౌరవిస్తే మన హృదయంలో కొన్ని ఖర్మబీజాలు ఉంటాయి. వాటిని దైవచింతనతోను, సత్పురుషుల సహవాసంతోను ఉంటే విషయ వాసనలు వచ్చినా ఇక్కడ మనకు స్థానం లేదని వెళ్లిపోతాయి. మనం అజాగ్రత్తగా ఉంటే పట్టుకుంటాయి. మాయ అంతా తీసుకొచ్చి దేహగతమైన నేనులో పెట్టడం వల్ల అందులో నుండి విడుదల పొందలేక పోతున్నాము. ప్రయత్నంలో ఎంతవరకు చెయ్యగలుగుతున్నాము అని చూసు కోవాలి. శ్రద్ధ వల్ల అంతా సాధ్యమే. దేవుని సంకల్పమే మన సంకల్పం అనుకునే వానికి ఇక దుఃఖం లేదు. ఎక్కడో మోక్షం వరకు అక్కర్లేదు. ఇక్కడ మీ సంకల్పం వదిలేసి చూడండి ఎంత శాంతిగా ఉంటారో మీకే తెలుస్తుంది.

47. పవిత్రుల దగ్గరే కాదు. ముళ్ళ కంపల వంటి మనుషుల దగ్గర





కూడా వికారం లేకుండా ఉండాలి. నీ ఇంద్రియాలకు అన్ని భోగాలు అందుబాటులో ఉన్నా నీకు వికారం రాకూడదు. అప్పడే నీవు నిజమైన స్థితిలో ఉన్నట్టు లెక్క. ఈ పని మనవల్ల అవుతుంది అనుకుంటే చేయడం. అది మన వల్లకాదు అనుకుంటే అక్కడే వదిలేయడం. శక్తికి మించిన పనులు మన మీద పెట్టుకుంటే అశాంతి వస్తుంది. రైలు ఇంజన్‌తో పెట్టెలను కలపడం వల్ల ప్రయాణం ఎంత స్పీడుగా సాగుతుందో అలాగే నీవు జపం చేయడం వల్ల భగవంతునితో అనుబంధం స్పీడ్‌గా సాగుతుంది. జపం, యజ్ఞం చేసేవారు గుమ్మం దగ్గర కూర్చుని యజమాని వచ్చి లోపలకి దయ చేయండి అనేవరకూ ఉండనక్కరలేదు. నీ అంతట నీవు సహజంగా హృదయ గుహలోకి పడిపోతావు. భగవంతుని మీద ఉన్న భక్తి మూలంగా, నామ స్మరణ వల్ల హాలు దగ్గర ఉండనక్కరలేదు. యజమాని వంటింట్లో ఉంటే మీరు కూడా అక్కడికి వెళ్ళిపోవడమే. అది సరాసరి భగవంతునితో అనుసంధానం ఏర్పడుతుంది. వేల జన్మలనుంచి మిధ్యా నేను నిజమను కోవడం వల్ల దానిని సందేహించలేకపోతున్నాము. మాయ మిధ్యానేను రూపంలో ఉంది. అదే మనలను ఆడిస్తుంది. బ్రహ్మంలో ప్రపంచాన్ని ఆరోపించడం మానేస్తే బ్రహ్మం బ్రహ్మంగా వ్యక్తమవుతుంది. వాడికి మాత్రమే బ్రహ్మానందం అందుతుంది. భగవంతుడు మనకు ఇచ్చినదే ఇతరులకు ఇవ్వగలం. ప్రపంచంలోని సొత్తు అంతా భగవంతుడిదే. మంచిగానీ, చెడు గానీ నీవు ఇతరులకు ఇచ్చేది నీకే వస్తుంది. నీవు ఇచ్చే వాడివని, ఇతురులు తీసుకొనేవారని అనే వేరు భావనకు కారణం అజ్ఞానం మాత్రమే. అజ్ఞానం నశించకుండా వేరుభావన నశించదు. నేను అనే తలంపుకు ఆహారం అందివ్వకుండా ఉంటే అది నశిస్తుంది. అప్పడు మాత్రమే ఉన్నది ఉన్నట్లుగా వ్యక్తమవుతుంది. నోటితో పరుషవాక్యాలు రాకుండా మనస్సుతో చెడు తలంపులు రాకుండా అభ్యాసం చెయ్యాలి. ఇతరుల క్షేమం కోసం పని చెయ్యడం కూడా తపస్సుతో సమానం. నిషిద్ధమైన పనులు చెయ్యడం ఎంత పొరపాటో, చెయ్యవలసిన పనులు చెయ్యకపోవడం అంతే పొరపాటు.

ఈ ప్రపంచం నీలోని లోపాలను చూపిస్తుంది. మనం ఈశ్వరుని స్మరిస్తూ ఆ లోపాలను తొలగించుకోవాలి. మానవుడు తన పనిని తాను చూసుకుంటూ ఇతరుల కోసం కూడా స్వార్థం లేకుండా పని చెయ్యాలి. స్వార్థం ఉన్న వానికి పరమార్థం అందదు, దేహాభిమానం నశించదు. దుఃఖం తలంపుల రూపంలో ఉంటుంది. తలంపులు రాకుండా ఉండటం కోసం సజ్జన సహవాసం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇతరులలో దోషాలు చూడటం మానేసి మనలోని దోషాలను పరిశీలించుకొని వాటి నుండి విడుదల పొందటమే యోగం.

48. కూర చాలా బాగుంది అనుకోండి. తినడానికి మనకు కొంచెమైనా ఆకలి ఉండాలి కదా! తింటే కదా రుచి తెలిసేది. అలాగే దేవుడు దయా స్వరూపుడైనా దైవానుభవం పొందాలి అనే ఆకలి, ఆకాంక్ష కొంచెమైనా ఉండాలి కదా! ఆ జిజ్ఞాస మనకు ఉంటే అదే మనకు పెట్టుబడి అవుతుంది. మనం చెఱకు గెడను కొడవలితో పెట్టి కోస్తూ ఉంటే ఆ చెఱకు గెడ కొడవలికి తీపినే ఇస్తుంది. కానీ చేదును ఇవ్వదు. అది చెఱకు గెడ స్వభావం కాబట్టి. అలాగే ఇతరులు నిన్ను ఎంత ఇబ్బంది పెట్టినా, నీవు చెఱకు గెడలా ఉండాలి. అప్పుడు నీవు దైవానుగ్రహానికి పాత్రుడవు అవుతావు. అప్పుడు దైవం నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. మనకు గమ్యం ఎక్కువగా గుర్తుకు వస్తూ ఉంటే తక్కువ తప్పలు చేస్తాము. నీవు ఏదిగా ఉన్నావో అక్కడ స్థిరంగా ఉండు. అక్కడ రమించు. అదే నిజమైన రతి. అప్పుడు వాడు స్థితప్రజ్ఞుడు అవుతాడు. గారెలు బాగున్నాయి, గారెలు బాగున్నాయి అని వాటిని తింటూ ఎలా ఎంజాయ్ చేస్తూ ఉంటారో అలాగే సంపదల ప్రవాహం, ఆపదల ప్రవాహంలో నిలకడగా ఉంటూ వాటిని ఎంజాయ్ చెయ్యాలి. అవి అబద్ధాలు, అవి ఎలా నిలకడగా ఉంటాయి. ఆ విషయంలో సహనంతో ఉంటే నీకు లోచూపు కలుగుతుంది. కనిపిస్తున్న వస్తుజాలాన్ని, తినుబండారాలను ఎలా ఎంజాయ్ చేస్తున్నారో, అలాగే మౌనాన్ని ఎంజాయ్ చెయ్యండి. దానివల్ల మనస్సులో ఏముందో తెలుస్తుంది.





తరువాత దాన్ని తొలగించుకోవడానికి ప్రయత్నం చేస్తారు. మనం ఇంట్లో విషయాలలో జాగ్రత్తగా ఉంటాము. దేవుని దగ్గరకు వచ్చేసరికి అశ్రద్ధగా ఉంటాము. అశ్రద్ధ పనికిరాదు. ధర్మాన్ని ఆచరించాలి. బుడబుక్కల మాటలు చెప్పడం వల్ల దొంగ నేను చావదు. సాకులు పనికిరావు. మనస్సు ఎలా చిరిగిపోతుందో భగవాన్ ఇలా చెప్పారు "బుడగను ఊదుతూ, ఊదుతూ ఉంటే అది పేలిపోతుంది. అలాగే మీరు ప్రేమించే పరిధిని పెంచుకుంటూ ఉంటే మనస్సు పేలిపోతుంది" అన్నారు. అంటే వీరు నావారు, వారు పరాయివారు అనే బుద్ధి లేకుండా మొఖం చూసి పీటవేసే పద్ధతి మానేసి నీ ప్రేమను విస్తరించు కొంటే మనస్సు నశిస్తుంది.

49. కండిషన్‌లో ఉన్న కారు వంద మైళ్ళ వేగంతో వెళుతున్నా చప్పడు లేకుండా వెళ్ళిపోతుంది. అలాగే సత్త్వగుణం ఉన్నవాడు పనిచేస్తాడు కానీ ప్రతీకారం బహు తక్కువగా ఉంటుంది. రజోగుణం ఉన్నవాడు పనిచెయ్యడు ప్రతీకారం మాత్రమే ఉంటుంది. మనం బోరుకొచ్చిన పాత కార్లలాగా తయారయ్యాము. పొగ, శబ్దం ఎక్కువ వస్తుంది. మనం ప్రతీకార బుద్ధిని సరిచేసుకొందాము అనే బుద్ధి రావడం లేదు. గురువు చేసే పని నీలో ఉన్న శాంతిని, మరణం లేని స్థితిని నీకు అందేటట్లు చేస్తాడు. అనుభవం వచ్చేవరకు అనుమానాలు వదలవు. మీరు సబ్జక్టును ప్రోపర్‌గా అర్థం చేసుకుంటే బాహ్యంగా మీకు ఏమీలేకపోయినా సుఖంగా బ్రతికేయవచ్చును. దీన్ని మీరు అర్థం చేసుకోకపోతే మీకు వెయ్యి కోట్లు ఉన్నా రోజూ దుఃఖమే. జీవుడు అనేవాడు ప్రత్యేకంగా లేడు. కొన్ని గడ్డిపరకలు కలసి గడ్డితాడు అవుతుంది. జీవలక్షణాల సమూహమే జీవుడు. అవిపోతే ఈశ్వర స్వరూపాన్ని పొందుతాడు. సబ్జక్టు మీకు అర్థం అయితే ఏ రకమైన ప్రారబ్ధము మనకు అంటదు. ప్రారబ్ధం నేను అనుభవిస్తున్నాను అనే తలంపు దాటి వెళ్ళిపోతే ఆడించేది ఈశ్వరుని చేతిలో ఏముంది? ఖర్మ చేసేది మనస్సే, ప్రారబ్ధం అనుభవించేది మనస్సే. ఆ మనస్సునే గడప దాటి వెళ్ళిపోతే ఇక ప్రారబ్ధం ఏమిటి? మనకు సాధన లేదు కోరికలు మాత్రం ఉన్నాయి. ఆ కోరికలు

ఫలించినా అది కూడా ప్రకృతే. కోరిక ఫలించడం కూడా ప్రమాదమే. అవి మనస్సుపై ముద్రలు వేసి తప్పకుంటాయి. ఆ ముద్రలే వేలాది జన్మలకు కారణమవుతాయి. వేదాలలో ఉన్న సారమే పురాణాల కథల క్రింద చెప్పారు. మనం ఆ కథలను పట్టుకోకూడదు. అందులో ఉన్న పిండిని సారాన్ని పట్టుకోవాలి. అది మనం నేర్చుకోవాలి. పెద్ద ఓడకు చిన్న రంధ్రం పడితే చాలు మునిగిపోవడానికి. మనం కొంతమందిని ప్రేమించి, కొంతమందిని ప్రేమించకపోతే లోపల చెడు ఉందని అర్థం. చర్మానికి దురద వస్తే తొలగించుకోవడానికి పదిమంది డాక్టర్ల వద్దకు వెళతాము. కానీ మనస్సులో చెడు గుణాలు ఉంటే తొలగించుకోవడానికి ఎక్కడికీ వెళ్లము. సబ్జక్టు మీకు బాగా అర్థం అయితే రాత్రి బాగా నిద్రపడుతుంది. మీరు బ్రతికి ఉన్నంతకాలం సుఖంగా బ్రతకగలరు, వివేకంగా ఉంటారు. మోక్షం పొందుతారు.

50. మీరు మంచి చెప్పినా ఇతరులు వినరు అనుకోండి వారి పని వారిని చేసుకోనివ్వండి. మీ పని చెప్పడం వరకే. మనలను ఇతరులు ఎవరైనా మోసగిస్తున్నారు అనుకోండి వారు తప్పు చేస్తున్నారు అనుకొంటాము. కానీ వాళ్లది ఎంత తప్పో మనది అంతే తప్పు. ఎందుకంటే ఇతరులు మోసం చేస్తుంటే మోసగించబడకుండా ఉంటే తెలివి మనకు లేదు. అక్కడ మన తప్పు తెలియడం లేదు. విచక్షణ లేదు. చెరువులో నీళ్ల అడుగున బురదను అస్తమాను కదిపితే బురద బయటకు వస్తుంది. కెలకడం మానేస్తే బురద అడుగునే ఉంటుంది. మీకు ఏమైనా గొడవలు వచ్చాయి అనుకోండి అస్తమాను కెలుక్కోవద్దు అలా చేస్తే చిన్న గొడవ కూడా పెద్దది అవుతుంది. మన మనస్సుని మనస్సుతోనే ఉద్ధరించుకోవాలి (సరిచేసుకోవాలి) ఎవరో వచ్చి ఉద్ధరిస్తారని ఎంతకాలం కనిపెట్టుకొని ఉంటావు? వివేకాన్ని సమ బుద్ధిని పెంచుకొని నీ మనస్సు చాపల్యాన్ని తగ్గించుకో. నీ ప్రవర్తనను బట్టి నీకూ హుందాతనం వస్తుంది. వాసనాక్షయం చాలా కష్టం. ఎందుచేతనంటే మనం వాటితో కలసి ఉంటాము. ఇంక వాసనలు ఎలా పోతాయి. అవి





అణిగి ఉంటాయి. నీ ప్రయత్నం తప్పనిసరి. భగవంతునికి శరణాగతి చేయడం వల్ల ఆయనే ఉన్నాడు. మనం లేము అన్న విషయం మనకు అనుభవంలోకి వస్తుంది. ఏదైనా కల్పించుకొని మాట్లాడుతున్నాము అనుకోండి మాయ పెరిగిపోతుంది. ఉన్నది లేనట్లుగానూ, లేనిది ఉన్నట్లు గానూ కనిపిస్తుంది. అదే మాయ. ప్రపంచ విషయాలమీద ఏమైనా కోరికలు ఉన్నాయి అనుకోండి దాన్ని కామం అంటారు. భగవంతుడు కావాలి అని అనుకుంటే దానిని భక్తి అంటారు. ఇంతే ఇందులో పెద్ద తేడా ఏమున్నది? బుర్రను గాబరా పెట్టుకుంటారు. మన ముఖం విషయాలవైపు కాకుండా భగవంతుని వైపు తిప్పితే చాలు. మీరు మీ కోరికలను భక్తివైపు మరల్చండి. మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. భగవంతుణ్ణి తప్పించి మీరు ఎవ్వరినీ మీ మనస్సుతో మొయ్యవద్దు. అన్నింటినీ మనస్సుతో మోస్తూ ఉంటే బ్రతికి ఉండగా దుఃఖం, అశాంతి. చనిపోయిన తరువాత నరకం మిగులుతాయి. ఆత్మను వదిలేసి మీ గౌరవాలను, డబ్బును బట్టలు కొలిచినట్లు కొలుచు కోకండి. భగవంతుణ్ణి తెలుసుకోవాలి. బుద్ధిలేని వాని మనస్సు ఎటువంటిది అంటే దీపం లేని వాని ఇల్లు వంటిది అని చెబుతారు. భగవంతుడు మీకు ఇచ్చిన సంపదతో సంతృప్తి చెందండి. తృప్తిలేని వాని ఆశను ఎవరూ తీర్చలేరు. వైరాగ్యం తీసుకొని వచ్చే సుఖం ఏదీ తీసుకొనిరాదు.

51. ఈ శరీరం నాది అని నీవు ఎలా అనుకొంటున్నావో ఈ సృష్టి అంతా నాది అని భగవంతుడు అనుకొంటాడు. భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశాలను భగవంతునికి దేహంగా ఉన్న ఈ సృష్టికి ఉపయోగించండి. మన దేహయాత్ర ఇతరుల మీద ఆధారపడితే బానిసత్వం వస్తుంది. ప్రతీ చిన్న విషయానికి ఇతరుల మీద ఆధారపడితే ఈ భూమి మీద ఉండగానే నరకం అనుభవిస్తారు. తనువు తాను కాదు అని తెలుసుకున్నవాడు కీర్తిని కోరుకోడు. కీర్తి కావాలి, గౌరవం కావాలి, గొప్పలు కావాలి అని మీరు అనుకొంటే లోపల అసలు తూకం లేదని అర్థం. భగవంతుడు మనకు అనుభవంలోకి వచ్చినప్పుడు మనకు రెండవ వస్తువు లేకుండా చేస్తాడు.

ఉన్నది ఒక్కటే. ఎటు చూసినా మనమే. సత్యానుభవం పొందాలంటే కోపం పనికిరాదు. నిర్లక్ష్యం పనికిరాదు. కొందరు చెడ్డవినడం కోసం కనిపెట్టుకొని ఉంటారు. ఎవరైనా బాగుపడ్డారు అని చెప్పడంకంటే వారు పాడైపోయారు అంటే ముందు వాళ్ళకి సంతోషం వచ్చేస్తుంది. మనస్సులో కూడా ఇతరుల మంచి కోరుకోరు. ఎవరైనా చెడు మాటలు చెప్పకపోతే రోడ్డుమీద పడిపోతారు. అది ఒక బురద. ముందు ఆ చెవులలో ఉన్న దురద పోగొట్టుకో. తరువాత సాధన చెయ్యవచ్చును. కొందరు చూపులలో రుసరుసలుగా ఉంటారు. ఆ దోషం తొలగించుకోకపోతే ఖర్మ చక్రంలో తిరుగుతారు. దానికి గురువు సహాయం, సత్పురుషుల సహాయం కావాలి. పాపప్రారబ్ధం అనుభవించేవాడికి భవిష్యత్తులో జాగ్రత్తగా ఉండాలి అని వాడికి తెలుస్తుంది. ధర్మాన్ని ఆచరించాలనే బుద్ధి కలుగుతుంది. ధర్మబుద్ధి లేకుండా ఈశ్వర దర్శనం కలుగదు. అందుచేత పాప ప్రారబ్ధం కూడా భగవంతుని దయే. అదీ మంచిదే. ఎట్టి పరిస్థితిలోనూ మానసిక ఒత్తిడి రాకుండా చూసుకోండి. మనస్సు పొంగిపోకూడదు, కృంగిపోకూడదు. సమానంగా ఉండేటట్లు చూసుకోండి. ఇతరులను పరిశీలించడంకాదు. మిమ్మల్ని మీరు పరిశీలించుకొని అంతర్ముఖమై జ్ఞానం సంపాదించుకోవ డానికి కృషి చెయ్యండి. నీవు ప్రకృతిని, ప్రపంచంలో సంఘటనలను సాత్విక బుద్ధితో పరిశీలిస్తే నీకు వివేకం పెరుగుతుంది. వివేక వైరాగ్యాలు హృదయంలో ఉన్న నిజమైన ఇంటికి నిన్ను తీసుకొనివెళతాయి.

52. మీకు గురువు ఎలా పనిచేస్తాడంటే మీకు గౌరవం అంటే ఇష్టం అనుకోండి. వాటిని భంగం చేసి వాటిలో ఉన్న నిస్సారతను మీ బుద్ధికి అర్థం అయ్యేలా చేసి అవి గమ్యంకావని, ప్రమాదంలో పడతావని, సత్యాన్ని తెలుసుకుంటే మోక్షం వస్తుందని తెలియజేస్తాడు. గురువు మీకు బయటకు కనబడడు. లోపల ఉండి పని చేసుకుంటూ వస్తాడు. మీకు సన్మానాలు, అవమానాలు జరుగుతాయి. అవి అన్నీ భగవంతుడే కావాలని చేస్తాడు. అవి అన్నీ శాపాలు అని మీరు అనుకోవచ్చు. అవి అన్నీ వరాలే. వాటిని





బ్రహ్మానుభవానికి సమాయత్తం చేయడానికి సృష్టిస్తాడు. మీ జేబులో మూడు రూపాయలు లేకపోయినా మూడు రత్నాలు ఉండాలి. 1. శరీరానికి పడని ఆహారం మానెయ్యాలి. 2. రోజూ ఒక గంట ఏకాంతవాసం చెయ్యాలి. 3. బ్రహ్మచింతన ఉండాలి. నదులకు గమ్యం సముద్రం. మీ ఊహలకు, మాటలకు, సాధనలకు, రచనలకు గమ్యం నీ హృదయం. అప్పుడు కానీ రూపబుద్ధి, నామబుద్ధి వదలదు. మీరు ఎవరినీ భయపెట్టవద్దు. ఎవరినీ చూచి భయపడకండి. మీరు ఇతురలను విమర్శించవద్దు. ఇతరులు విమర్శిస్తే మీరు కంగారుపడకండి. మీరు విమర్శిస్తే అహంకారం పెరుగుతుంది. సహనం చాలా అవసరం. జిన్నులో శాంతి ఉంటే నేను తిన్నా శాంతి రావాలి కదా! మరి నాకు ఎందుకు రావడం లేదు? అది సహజంగా అక్కడ ఉండటం వల్ల వచ్చిన శాంతి కాదు. మీ కోరిక నెరవేరడం వల్ల మనస్సు హృదయంలో మునగడం వల్ల వచ్చిన శాంతి అది. అక్కడ కారణం జిన్ను. ఏ కారణం లేకుండా మనస్సు హృదయంలోకి వెళ్ళినప్పుడు వచ్చే శాంతిలో అది నిలబడుతుంది. సాధన అంతా బ్రహ్మం మీదే నిలబెట్టమంటారా? మరి నా పొట్ట మాట ఏమిటి? అని నీవు అడగవచ్చును. బ్రహ్మానుభవం పొందడానికి నీవు చేసే ప్రయత్నంలో నిజాయితీ ఉంటే బ్రహ్మము నీకు అన్నీ సమకూరుస్తుంది అని పరమాత్మ చెబుతున్నాడు. సంస్కరించుకొన్న భక్తుడు ఇలా అంటాడు. “ఓ భగవంతుడా! ఇంతవరకు నా ఆస్తి, నా ఆస్తి అనుకొన్నాను కాబట్టి సమర్పించవలసి వచ్చింది. అంతా నీదే. నాది అంటూ ఏదీ లేదు అని తెలిసాక ఇక సమర్పించడానికి ఏముంది?”. మనమందరం నున్నాలం. కానీ వీరులమని అనుకొంటున్నాము. దీనికి కారణం కర్తృత్వం. ఈ విషయం నీకు అర్థం అయితే దుఃఖం నశించి పోతుంది.

53. పద్దెనిమిది పురాణాలు వ్రాసిన వ్యాసులు వాటి సారాన్ని ఇలా చెప్పారు “నాకు ఏది మంచిది అని నేను అనుకొంటున్నానో అది ఇతరులకు కూడా మంచిదే. నాకు ఏది చెడ్డది అనుకొంటున్నానో అది ఇతరులకు

కూడా చెడ్డదే. ఇతరులు నా పట్ల ఎలా ప్రవర్తించాలి అనుకొంటున్నానో నేను కూడా ఇతరుల పట్ల అలా ప్రవర్తించాలి" అని చెప్పారు. కొంతమంది మనుషులు ఎలా ఉంటారు అంటే అందరూ వారిని గౌరవించాలి అనుకొంటారు. వారు మాత్రం ఇతరులను గౌరవంగా చూడరు. ఇది నీచాతి నీచమైన బుద్ధి. ఏ మనిషి అయినా వాడికి సొంత ఆలోచన లేకపోతే వాడి మీద వాడికి విశ్వాసం లేకపోతే వాడు బాగుపడడు". "ఇతరులను విమర్శించడం కంటే ఇతరులతో విమర్శించబడటం నీ ఆధ్యాత్మిక అభివృద్ధికి మంచిది" అన్నారు వడ్డ్‌వత్. అన్నవాళ్ళు అభివృద్ధిలోకి రారు, పడ్డవారే అభివృద్ధిలోకి వస్తారు. మీ దేహ ప్రారబ్ధాన్ని బట్టి అదృష్టం వచ్చినా, దురదృష్టం వచ్చినా ఎప్పుడూ ఉండదు. వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. పరిస్థితులు మీ చేతిలో లేకపోయినా, ప్రవర్తన మీ చేతిలో ఉంది. ఈ పరిస్థితులను అన్నీ చూస్తూ మీ ప్రవర్తన కాపాడుకోండి. రైలు వెళుతూ ఉంటే గొఱ్ఱె అడ్డు వస్తే రైలుకి నష్టం ఏమిటి? ఆ గొఱ్ఱే పోతుంది. మీలో చెడు వాసనలు ఉన్నా మీరు సత్కర్మ చేస్తూ ఉంటే, విచారణ చేస్తూ ఉంటే, ఆ వాసన వల్ల వచ్చే నష్టం గ్రహిస్తూ ఉంటే ఆత్మజ్ఞానం యొక్క వైభవం శ్రవణం చేస్తూ ఉంటే విషయం మీకు అర్థం అవుతూ ఉంటే ఆ ప్రవాహ వేగంలో ఈ వాసనలు అన్నీ కొట్టుకుపోతాయి. మనం మాట్లాడే మాటల్లో పవిత్రత ఉంది అనుకోండి నీ చుట్టూ ఉన్నవారు చెడ్డవారైనా నీకు ఏ దుఃఖం రాదు. నిదానంగా మీ పని మీరు చేసుకొనిపోవాలి. నిర్మలంగా, నిశ్చలంగా ఉంటే వారికి పవిత్రత కలుగుతుంది. సత్యం ఎరుక పడుతుంది. "అస్తమానుం లోకం గొడవ చెప్పకోకుండా ఒక గంట దేవుని ప్రార్థిస్తే భౌతికంగానూ, ఆధ్యాత్మికంగానూ లాభం పొందుతారు" అన్నారు గాంధీజీ. నీకు ఇష్టంలేని సంఘటన జరిగినా ద్వేషించకండి, దూషించకండి. అది ఈశ్వర సంకల్పం అని అనుకోండి. మీరు సహించే స్వభావం నేర్చుకుంటే సత్వగుణం కలుగుతుంది. అది మోక్షానికి దారి చూపిస్తుంది. మనం భగవంతుని మీద భారం వెయ్యాలి కానీ, ఎంత భారం వేసినా మొయ్యడానికి సిద్ధంగా





ఉన్నాడు. మనకి భయము, అశాంతి ఎందుకు వస్తున్నాయి అంటే మనం ఏదో ఊహించుకొంటున్నాము. అందుచేతనే భయము, అశాంతి వస్తున్నాయి. ఈశ్వరునిపై భారం వేస్తే ఊహలు, సంకల్పాలు రావు. భగవంతుని పూజించడం ఎందుకు అంటే ఉపాసనాబలం కోసం. అది లేకపోతే మోక్షం కలుగదు.

54. వినడం, స్మరించుకోవడం దీనిని మనోయోగం అంటారు. చెవులతో వింటావు. ఎవరు వింటున్నారు? మనస్సు వింటుంది. మరల స్మరించడం ఎవరు స్మరిస్తారు మనస్సే. ఈ మనోయోగం ద్వారా కూడా నీవు జ్ఞానం పొందవచ్చును. మన బుద్ధిలో దోషాలు ఎక్కువ ఉన్నాయని మనకు జ్ఞానం రాదు అని అనుకోకూడదు. వ్యతిరేఖ దృష్టి మరచిపోయి మనం చెయ్యవలసిన కృషి మనం చేస్తూపోతే గమ్యానికి వచ్చేస్తాము. ఏ బలహీనతవల్ల, ఏ వాసన వల్ల మనస్సు బాహ్యముఖం అవుతుందో చూసుకొని ఆ బలహీనతల నుండి తప్పించమని ఈశ్వరుని హృదయ పూర్వకంగా ప్రార్థిస్తే ఆయన సహాయ సహకారాలు అందిస్తాడు. ఆ బలహీనతల నుండి నిన్ను బయట పడేస్తాడు. శవబుద్ధి పోగొట్టుకోవడానికే ఈశ్వరుడు కష్టాలను పంపుతాడు. ఇష్టం లేక కాదు. ఏదో రూపంతోటి, ఏదో నామంతోటి తాదాత్మ్యం పొందినప్పడు నీకు ప్రారబ్ధం. కానీ ఆ పేరు ఆ రూపం నీవు కావని తెలిస్తే ప్రారబ్ధం ఏమిటి? చైతన్యానికి ప్రారబ్ధం ఏమిటి? పుట్టిన దానికి ప్రారబ్ధం. పుట్టని దానికి ప్రారబ్ధం ఏమిటి? ఇక్కడే సమస్య పరిష్కారం అయిపోతుంది. తప్ప, ఒప్పల మధ్య, స్వర్గ నరకాల మధ్య నిన్ను తిప్పడానికి రాలేదు భగవాన్. సత్యంలోకి మేల్కొలపడానికి వచ్చారు. మనం ఉత్తమోత్తములం అవ్వకుండా ఉత్తమ స్థితి అందుకోవడం చిన్న గుడిసెలోకి ఏనుగును తోలితే ఆ గుడిసె పని ఏమవుతుందో మన జీవితం కూడా అలాగే అవుతుంది. అర్హత లేకుండా, అంతస్తు లేకుండా ఆత్మజ్ఞానం పొందాలి అనుకుంటే చివరకు ఆశాభంగం కాని అసలు వస్తువు దొరకదు. చేపలు పట్టేవాడు గేలం వేస్తాడు. గేలానికి మాంసం ముక్క

పెడతాడు, వాడు మనతో మాట్లాడుతూ ఉన్నా వాడి మనస్సు గేలం మీదే ఉంటుంది. చేప రావడం గంట ఆలస్యం అయినా వాడు ఏకాగ్రంగా ఉంటాడు. చేపరాలేదని కంగారు పడడు. చేప మాంసం ముక్కను పట్టుకోగానే బయటకు లాగేస్తాడు. ఈలోపు లాగేస్తే వాడికి చేప దొరకదు. అలాగే మీకు మోక్షం రాలేదని కంగారుపడకండి. మీ బుద్ధి పక్వమైనప్పడు, హృదయం విశాలమైనప్పడు, బేధబుద్ధి రాలిపోయినప్పడు మీకు ఆత్మజ్ఞానం కలుగజేస్తాడు గురువు. గురువు బయట చేసేది తక్కువ. లోపల చేసే వర్కు ఎక్కువ.

55. మనకు నిజంగా భగవంతుని మీద నమ్మకం ఉంటే మనం ఎక్కడికి వెళ్ళినా గౌరవించకపోతే, మంచినీళ్ళు కూడా ఇవ్వకపోయినా మనకు ఎర్రచీమ కుట్టినట్టు కూడా ఉండదు. బాగా గౌరవించినా పొంగు రాకూడదు. అప్పడు భగవంతుని సంకల్పం గౌరవించినట్టు అవుతుంది. మంచి, చెడులు ఈశ్వర సంకల్పం కాదు, అవి జీవుడి కల్పితాలు. తులసీదాస్ మాటలు చూడండి “సింహాసనం మీద ఉన్న రాముని చూడటం లేదు, రావణాసురుణ్ణి చంపిన రాముని చూడటంలేదు, అనేక అవమానాలు, మాటలు పడినా కూడా రాముని ముఖంలో వికారం కలుగలేదు. ప్రశాంతంగా మూర్తీభవించిన శాంతి, జ్ఞానం, సౌందర్యం యొక్క పరాకాష్ట అది. అట్టి రాముని నేను ధ్యానం చేస్తున్నాను” అన్నారు. ఈ వాక్యాన్ని వినండి, శ్రద్ధగా జ్ఞాపకం ఉంచుకోండి, మననం చేసుకోండి. గంటల తరబడి పూజ చేయడంకంటే ఒక్క వాక్యాన్ని అర్థం చేసుకొంటే ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోకి వస్తారు. అత్తరు బట్టలకు రాసుకోండి. తాగితే మరణిస్తారు. అలాగే మీరు పేరుకోసం పని చేసినా, పాండిత్యం ఉంది, ధనం ఉంది అనుకొన్నా కుళ్ళిపోతావు. ఒక అనుభవజ్ఞుడు ఏమంచితనం లేకుండా మనిషి ఉండడు. వాడిలో ఉన్న మంచిని చూడటం మనం నేర్చుకుంటే మనకు ఏమీ శ్రమ లేకుండా, పెట్టుబడి లేకుండా, సాధన పేరు మీద ఏమీ బాధ లేకుండా మనం మంచివారమైపోతాము. వారి మంచితనాన్ని మనం





నేర్చుకుంటే మనం మంచివారమైపోతాము. మీ ఇంట్లో ఎన్ని తినే పదార్థాలు ఉన్నా ఆకలి లేకపోతే తినలేవు. అలాగే నీకు జిజ్ఞాస లేకపోతే జ్ఞానం సంపాదించలేవు. లోపలనుండి అది కెరటంలా రావాలి. నీ బుద్ధిని దగ్గర పెట్టుకొని విషయాన్ని శ్రద్ధగా శ్రవణం చేయడం వల్ల నీకు జిజ్ఞాస కలుగుతుంది. మనం సాఫల్యమవ్వడమే కాదు, ఓడిపోవడం కూడా నేర్చుకోవాలి. అంటే లాభాన్ని, నష్టాన్ని, సమానంగా స్వీకరించే శక్తి లేకపోతే మానసిక ఆరోగ్యం పాడవుతుంది.

56. రాముడు అన్నదమ్ములు ఎప్పడూ చెప్పడు మాటలు వినలేదు. వారి నుండి ఐకమత్యం నేర్చుకోవాలి. చెప్పడు మాటలు వినడం వల్ల కుటుంబాలు పాడవుతాయి. మంచివారు కూడా చెడ్డవారిగా మారిపోవడానికి కారణం చెప్పడు మాటలే. కైకేయి మంధర మాటలు విని పాడైంది. మన మనస్సును పవిత్రం చెయ్యడానికి యజ్ఞాలు చెప్పాడు. దేవయజ్ఞం అంటే దేవతలను పూజించడం. వారికి నమస్కరిస్తే వారి ఋణం తీరిపోతుంది. మనుష్య యజ్ఞం అంటే నీవు సుఖంగా ఉండి, ఇతరులను సుఖంగా జీవించడానికి సహాయపడటం. భూతయజ్ఞమంటే నీ మీద ఆధారపడ్డ జంతువులను మిమ్మల్ని మీరు ఎలా చూసుకొంటున్నారో వాటిని అలా చూడటం. ఋషియజ్ఞం చాలా ముఖ్యం. మీ ఇంటివద్ద పనులు అయినా తరువాత ఖాళీగా ఉన్నప్పడు భగవాన్ చెప్పిన మాటలు, గీత, శాస్త్రాలలో ఏదో ఒకటి అధ్యయనం చేయడం. ఈ యజ్ఞాలు ఆచరించడం వల్ల మనస్సు శుద్ధి అవుతుంది. మనం అనుకుంటున్న మంచి చెడ్డలు, పాప, పుణ్యాలు, జనన మరణాలు, ఈ ద్వంద్వాలకు, లోపల ఉన్న సద్వస్తువుకు ఏమీ సంబంధం లేదు. అది ముందు మనకు గ్రహింపులోకి రావాలి. ఏదైనా ఒక విషయం గురించి చదవడం వేరు, అర్థం చేసుకోవడం వేరు. అర్థం చేసుకుంటే అది హృదయ గతమౌతుంది. విచారణా మార్గం చాలా కష్టమనుకుంటారు. అది కాదు మనకు శ్రద్ధ, భక్తి లేక కష్టం అనుకుంటాము. సబ్జక్టు చదవడంతోనూ, వినడంతోనూ సరిపెట్టు కోకుండా, సబ్జక్టు తెలిసిన

వారితో పరిచయం పెంచుకోవాలి. వారు ఏ స్థాయికి వచ్చారు. మనం ఆ స్థాయికి ఎందుకు రాలేకపోతున్నాము? ఆటంకాలు ఏమిటి? వాటిని ఎలా తొలగించుకోవాలి? అని ప్రయత్నించాలి. దాన్ని గురించి ఆలోచించాలి. సజ్జక్టు విడిచిపెట్టి లోకం గొడవలు చెప్పకుంటే అక్కడ నుండి వెళ్లిపోవాలి. లౌకికులతో స్నేహం మహా ప్రమాదకరం. వారికి లోకమే ప్రమాణం. శాస్త్రం ప్రమాణం కాదు. ఒక గంట సాధన చేసి, రెండు గంటలు లౌకికులతో సహవాసం చేస్తే మన సాధన పోతుంది. పైకి నిగ్రహంగా కనిపిస్తూ లోపల విషయ చింతన పెంచుకుంటే వాడు మిధ్యాచారి. వాడు నిజానికి దూరం అవుతాడు. మనం ఎవరిదైనా జీవిత చరిత్ర తీసుకొని చదివేటప్పుడు బాగా సఫలమైన వారి జీవిత చరిత్ర తీసుకొని చదవాలి. వారు ఎందుకు అభివృద్ధిలోకి వచ్చారు. మనం ఎందుకు రాలేకపోతున్నాము అనే విచారణ ఉండాలి. మనం గమ్యాన్ని మరచిపోతే చిన్ని గొడవలు కూడా పెద్ద గొడవలుగా మారిపోతాయి. మీ మనస్సు పాడవుతుంది. మనం బంగారం కొనాలని అనుకొంటే డబ్బు అవసరం. అలాగే మనస్సుని హృదయంలో నిలబెట్టాలి అంటే సత్వగుణం అవసరం. దానికోసం ప్రయత్నం చేస్తే పేచీలు తగ్గుతాయి. అప్పుడు స్నేహితులు, విరోధులు కనబడరు. ఎవరైనా ఉపకారం చేస్తే దేవుడే వారిచేత ఉపకారం చేయించాడని, అపకారం చేస్తే దేవుడే అతడితో అపకారం చేయించాడని అనుకొంటాడు. వ్యక్తిగతంగా ఉద్రేకం ఏమీ ఉండదు. వాడు చైతన్య స్థాయిని పెంచుకొంటూ ఉంటాడు. కొంతమంది సజ్జక్టు తెలియక పోయినా తెలుసునన్నట్లుగా నటిస్తారు అది చాలా ప్రమాదం. ఏ విషయమైనా ఎంతవరకు తెలుసు, ఎంతవరకు తెలియదు ఆ నిర్ధారణ ముఖ్యం. నీవు మంచి మనస్సుతో మాట్లాడు. చిన్న పని అయినా మంచి మనస్సుతో చెయ్యి. దానికి ఏ పెట్టుబడీ లేదు. నీవు ఆలోచించు, ఇతరులను ఆలోచింపచెయ్యి. నీవు ఉద్రేకపడకు, ఇతరులను ఉద్రేకపడేటట్లు చేయకు.

57. శరీరానికి జబ్బు వస్తే డాక్టర్ ఈ మందులు వాడండి అంటే





నమ్ముతాము. తూచా తప్పకుండా వాడతాము. కానీ భగవంతుడు మన మానసిక అనారోగ్యం గురించి బాగుపడే సలహాలు, మాటలు చెప్పినా మనం నమ్మము. మన ఆధ్యాత్మిక అభివృద్ధికి హృదయం యొక్క లోతులు పెరగాలనే మాటలను మనం నమ్మము. డాక్టర్ చెప్పే మాటలయందు ఉన్న నమ్మకం, భగవంతుడు చెప్పే మాటలయందు లేదు, విశ్వాసం లేదు. నిజంగా నమ్మితే ఎప్పడో బాగుపడతాము. నమ్మినట్లు నటిస్తాము. పిచ్చివానికి మనం ఎంత మంచి మాటలు చెప్పినా వాడు వినడు. మనం లోక పిచ్చ ఉన్నంతకాలం భగవంతుని మాటలు వినము. స్నానం ఎలా చేస్తారో, అన్నం ఎలా తింటారో అంత సహజంగా కష్టాలు వస్తాయి. మీ నీడను చూచి అది మీరు అనుకోరు. ఆ నీడ నేను కాను అనే భావన ఎంత సహజంగా ఉంటుందో ఈ శరీరం నేను కాను అనే భావన అంత సహజంగా వస్తే మీరు ప్రకృతినుండి బయటకు వచ్చి పునర్జన్మ లేని స్థితిని పొందుతారు. లోపల పక్వత లేనప్పడు వేదాంతం మాట్లాడకూడదు. దానివల్ల మనకు లాభం లేదు కదా! నష్టమే వస్తుంది. శబ్ధానికి అర్థం చెప్పేవాడు పండితుడు కాడు. ఆత్మజ్ఞానం కలిగినవాడే పండితుడు. సత్యాన్వేషకుడు లోపలకు దిగడం నేర్చుకోవాలి. రకరకాల మనుష్యులు ఉన్నారు కాబట్టి ఇది లోకం. వారిని ప్రమాణంగా పెట్టుకోవద్దు. శాస్త్రాన్ని ప్రమాణంగా, జ్ఞాని మాటను ప్రమాణంగా పెట్టుకొని జీవిస్తే తరిస్తావు. భగవంతుని మాట ఒక కులానికో, ఒక మతానికో, ఒక ప్రాంతానికో పరిమితమైనది కాదు. అది విశ్వ వ్యాప్తమైనది. ఆయనతో రాజీపడితే నీ ప్రేమ విశ్వవ్యాప్తమవుతుంది. 'నేను' ఉన్నాను అనుకొన్నావు కదా! ఆయన ప్రేమలో ఈ నేను కరిగిపోతుంది. ఆయన సంకల్పంతో రాజీపడితే ఏ సంకెళ్లనుండి, ఏ బందాలనుండి బయటపడాలని అనుకొంటున్నావో, ఏ మాయలోంచి బయటపడాలని అనుకొంటున్నావో నీకు తెలియకుండానే వాటిలో నుండి బయటపడతావు. మీ మనస్సును విషయాలకు అప్పచెప్పే బదులు, బుద్ధికి అప్పచెప్పండి. బుద్ధికి రీజన్ ఉంటుంది. బుద్ధి మన మనస్సును బాగుచేస్తుంది అని పరమాత్మ చెప్పాడు. ప్రతీ మనిషికి అశాంతి,

బాధ ఉంటుంది. అవి జీవలక్షణాలు. వాడికి మోక్షం వచ్చేవరకు వాడికి బాధ లేకుండా ఉండలేడు. ఇష్ట-అయిష్టాలే బాధలు. అవి బాధలని తెలియడం లేదు. ఎవరో ఇతరుల వల్ల బాధపడుతున్నాము అంటారు. వాటిని వదులుకుంటే ఇప్పుడే, ఇక్కడే కూర్చున్నవారు కూర్చున్నట్లు బాధ, అశాంతి తగ్గిపోతుంది. సబ్జక్టు బాగా అర్థం చేసుకోండి. గాఢనిద్రలో మనకు ఇష్టాలు అయిష్టాలు లేవు. అందుచేతనే శాంతంగా ఉండగలుగుతున్నాము.

58. చెట్టుకు కాయ ముగ్గింది అనుకోండి దానిని నీవు రాయతో కొట్టనక్కరలేదు, ఎక్కి కోయనక్కరలేదు. అదే రాలిపోతుంది. మీరు సదాచారంలో ఉన్నారు అనుకోండి, మీ బుద్ధి పక్వానికి వచ్చింది అనుకోండి పండు రాలినట్లుగా మీ మనస్సు పరమాత్మలో లయమవుతుంది. పదిమందిలో కూర్చున్నప్పుడు మొద్దులాగ, కూర్చోకుండా సందర్భాన్ని బట్టి మంచిమాట చెప్పడం వల్ల మన డ్యూటీ మనం చేసాము అనే తృప్తి ఉంటుంది. వారు ఆచరించడం ఆచరించకపోవడం తరువాత విషయం. మన జీవితంలో సంతృప్తి ఉండటం వల్ల రోజులు శాంతంగా వెళ్లిపోతాయి. ఇతరులకు సహాయ సహకారాలు అందరూ చెయ్యలేరు. అలా చెయ్యడానికి మనస్సుని సన్నద్ధం చెయ్యాలి. మన చదువుకు, ఆత్మజ్ఞానానికి ఏ సంబంధం లేదు. వాడు పవిత్రుడు అయితే చదువు లేని వానికి కూడా ఆత్మజ్ఞానం కలుగుతుంది. మీకు వచ్చే ఆలోచన విషయంలోనూ, మాటల విషయం లోనూ జాగ్రత్త వహిస్తే పవిత్రులై నిర్వాణసుఖం పొందుతారు. అన్నం తిన్న వానికి ఆకలి తీరుతుంది. కానీ ఖరీదైన బట్టలు కట్టుకొని సెంట్ రాసుకుంటే ఆకలి తీరుద. బంగారు ఊయలలో కూర్చున్నా ఆకలి తీరదు. అలాగే భగవంతుని పాదాలయందు భక్తి, ప్రేమ ఉంటే నీకు అశాంతి తగ్గుతుంది. వేరే మార్గం లేదు. ఆయన మీద భక్తి పెరుగుతూ ఉంటే విశ్వాసం కుదురుతూ ఉంటే మీకు విసుగు తగ్గుతుంది, సహనం పెరుగుతుంది. బుద్ధిలో దోషాలు ఉంటే బయటకు పోతాయి. నీవు బుద్ధిమంతుడవు కాకపోయినా ఎదుటి వాడు నిన్ను బుద్ధిమంతుడు అన్నా నీకు ఏమి లాభం? నీవు పాడైపోతావు.





నీ బుద్ధిలోని వంకర్లు తొలగించుకోవడానికి ప్రయత్నం చెయ్యి. ఆత్మవిశ్వాసం పెంచుకో. గోపికలు పరమ పవిత్రులు. కోరిక ఎలా ఉంటుందో వారికి తెలియదు. బుద్ధిలేని మనం బుద్ధి ఉన్న వారిని విమర్శించడం. గోపికలు గత జన్మలలో యోగులు, మహర్షులు. మనం పుట్టినప్పుడు గుణాలతోనూ, మాయతోనూ పుడతాము. నూటికి నూరుపాళ్ళు మాయలో ఉంటాము. మాయలోనే చనిపోతాము. భగవంతుడు పుట్టినప్పుడు పుట్టుక అనము, అవతారము అంటాము. మనం ఎక్కడ పాడైపోతున్నాము అంటే భగవంతుడు ఈ మాట చెప్పాడు. అయ్యో ఈ మాట మనకు అర్థం కావడం లేదు దానిని అర్థం చేసుకునే పుణ్యం బలం నాకు లేదు, ఆ బుద్ధి సూక్ష్మత నాకు లేదు, ఆ ఏకాగ్రత నాకు లేదు అని అనుకోవడం మానేసి ఆ మాటలు అన్నీ వ్యర్థం. దాని వల్ల టైం వేస్ట్ అనుకొంటున్నాము. మన కాలాన్ని వృధా చేసుకోకుండా భగవంతుణ్ణి అంటి పెట్టుకొని ఉండాలి. చెట్టును అంటి పెట్టుకొని ఉంటే కాయ ముగ్గుతుంది. అలాగే మనం భగవంతుని మాటలను, ఆయన పాదాలను అంటి పెట్టుకొని ఉంటే పక్వత వస్తుంది, లేకపోతే రాదు. తరించలేము.

59. నోటిద్వారా భగవంతుణ్ణి ఆరాధించడం నేర్చుకున్నావు, పని ద్వారా భగవంతుణ్ణి ఆరాధించడం నేర్చుకోలేదు. అది నేర్చుకుంటే నీకు జ్ఞానం కలుగుతుంది. నోటితో జ్ఞానానికి సంబంధించిన మాటలు చెప్పడం, చేతితో అజ్ఞాన పనులు చేయడం ఇక నీవు దేవుడిలో ఎలా ఐక్యం అవుతావు? మనం అన్నీ తెలుసుకోవడానికి ప్రయత్నం చేస్తాము. మన గురించి మనం తెలుసుకోవడానికి ప్రయత్నం చేయడం లేదు. అదే గొప్ప మాయ. మనం పనికిమాలిన గొడవలు అన్నీ తెలుసుకుంటాము. అది ఉపయోగంలేదు. బాగుపడే ఉపాయం తెలియడం లేదు. నిన్ను నీవు తెలుసుకోవడం అంటే నీవు ఏదిగా ఉన్నావో దాని తాలూకూ వస్తువును తెలుసుకోవడం. మనం చెరువులో వల వేస్తే అది చెరువులో ఉన్నంతసేపు వలలో నీరు ఉంటుంది. బయటకు తీస్తే ఒక్క బొట్టు కూడా నీరు ఉండదు. అలాగే మీరు ఎన్ని

సాధనలు చేసినా, జపధ్యానాలు చేసినా భగవంతుని దయ లేకపోతే ఏమీ లేదు. బయటకు తీసిన వలలో నీరు లేనట్లుగా ఉంటుంది. భగవంతుని అనుగ్రహం ఉంటే అన్నీ ఉన్నట్లే. నేను అందరం ఒక్కటే అన్న విషయం మరచిపోతున్నారు. దేవునికి పుష్పాలతో ఎలా పూజ చేస్తున్నామో మన మాటలతో, చేతలతో, ఆలోచనలతో భగవంతుని పాదాలు దగ్గర అవి పుష్పాలుగా పడాలి. అప్పుడు మనం ఆయన దయకు పాత్రులవుతాము. మీరు ఈ సృష్టికి ఏదైనా ఉపకారం చెయ్యాలనుకుంటే అన్ని కాలాల్లోను అన్ని అవస్థలలోనూ శాంతిగా ఉండండి. ఆత్మజ్ఞానం సంపాదించండి. అప్పుడు మీ ద్వారా సృష్టికి జరిగే ఉపకారం ఎవరి వల్ల జరుగదు. జ్ఞానేశ్వర్ "ఒక గదిలో చీకటిగా ఉంది అనుకోండి, దానిని మనం ఏమీ చెయ్యక్కర్లేదు. దీపం వెలిగిస్తే అదే పోతుంది. అలాగే నీ లోపల దుర్గుణాలు అనే చీకటి పోవాలంటే ఏదో బయట గుడి కట్టించాను, ఆ పని చేసాను ఈ పని చేసాను అంటే పోదు. భక్తి, జ్ఞాన, వైరాగ్యాలు సంపాదించుకుంటే అజ్ఞాన మనే చీకటి పోతుంది. జ్ఞానం ప్రకాశవంతమవుతుంది" అన్నారు. సమాజం తెలివి తక్కువ వారిని వదిలేస్తుంది. ఏదో మనస్సులో దెబ్బతిని వారు అలా అయిపోయారు. వారు మనకి పనికిరారు అని వదిలేస్తారు. అటువంటి వారిని ప్రేమగా చూడటం వల్లకూడా ఈశ్వరానుగ్రహం కలుగుతుంది. పిచ్చి ఆసుపత్రిలో ఉన్నవారే పిచ్చివారు కాదు. నూటికి 80% సమాజంలో పిచ్చివారే. కొందరికి కారణం లేకుండా కోపం వస్తుంది, తిడతారు, ద్వేషిస్తారు. ఇవి అన్నీ పిచ్చి లక్షణాలు. అందరిలో ఉన్నది భగవంతుడే అయినప్పుడు ఎవరిని ద్వేషిస్తాము. పంచదార నీటిలో కరిగిపోతే పంచదార లేదు. అలాగే జ్ఞానికి ప్రపంచం అంతా బ్రహ్మంలో కరిగిపోతుంది. ఇక ప్రపంచం వాడిని బంధించదు. ఆధ్యాత్మిక హృదయంలోకి వెళితే నీ సంస్కారాలు అన్నీ అదే మింగేస్తుంది.

60. "మూసుకో, తప్పుకో" అన్నారు చిన్మయానంద. మూసుకో అంటే ఇంద్రియాల్ని, మనస్సుని మూసుకో అని అర్థం. తప్పుకో అంటే దేహం





నేను అనే భావంలోంచి తప్పుకో. ఇదే వేదాంత సారం అన్నారు. ఒక్క మాటలోనే వేదాంత సారాన్ని చెప్పమని అడిగితే చెప్పిన మాట ఇది. పెళ్ళి ఇంకా నాలుగు రోజులు ఉంది అనగా ఎవరైనా పెళ్ళి విషయం కాకుండా ఏదైనా విషయం ప్రస్తావిస్తే "ముందు పెళ్ళి పనులు చూడాలి తరువాత ఆ విషయాలు మాట్లాడదాము" అంటారు. ప్రతీమాట, ప్రతీ పని పెళ్ళికి సంబంధించినవే ఉంటాయి. అలాగే ఆత్మజ్ఞానం సంపాదించే విషయంలో జీవిత విషయాల పట్ల ఆసక్తి లేకుండా అంతా జ్ఞానం పొందే విషయంలోనే సాధన చేస్తేనే ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది. ఎటువంటి పరిస్థితులలోనూ ఆందోళన పెట్టుకోకూడదు. భగవంతుని ప్రార్థించాలి. పుట్టెడు తెలివి తేటలకన్నా ఆవగింజంత అదృష్టం మంచిది అంటారు. సాధన అంటే కామం అంత ప్రేమగా మారిపోవాలి. కామం అడుగుతుంది, ప్రేమ ఇస్తుంది. మీలో ఏదైనా నేర్పరితనం అంటే ఇతరులకు ఉపయోగించాలి. ఇతరులతో ఏదైనా నేర్పరితనం ఉంటే మీరు నేర్చుకోవాలి. ఈరకంగా ఉంటే నీవు ఉద్ధరించ బడతావు. నీ నేర్పరితనాన్ని ఇతరులతో పంచుకుంటే ఈశ్వరానుగ్రహానికి పాత్రుడవుతావు. మన శాంతికోసం, సుఖంకోసం, ఆనందంకోసం ఇతరుల మీద ఆధారపడకూడదు. వేదాంతం అంతా ఈ రెండు మాటలలో ఉంది. ప్రతీవాడు శరీరము-రంగు, నలుపు-తెలుపు అనే దేహ తాదాత్మ్యం పొందకుండా ఆ భావాలను బయటకు పొమ్మనాలి. కారణం ఆత్మకు రంగు లేదు. ఇంద్రియాల ప్రభావం ఆత్మకు లేదు. "ఎవరిని చూసి అయినా అసూయ పడితే వారిలో నేను లేనా? అంటే నన్ను చూసి అసూయ పడుతున్నావా? అసూయ పనికి రాదురా అని భగవంతుడు చెబుతున్నాడు. నదిలోకి వెళ్ళి కడవలతో నీళ్ళు తెచ్చుకుంటూ ఒకరితో ఒకరు మాట్లాడు కొంటారు. వారి దృష్టి నెత్తిమీద ఉన్న కుండలమీదే ఉంటుంది. అలాగే మనం ఎన్ని పనులు చేసుకుంటూ ఉన్నా, భగవంతుని మీద దృష్టిని విడిచిపెట్టకూడదు" అన్నారు పరమహంసగారు. "ప్రాణవాయువు లేకుండా బ్రతుకగలను, కానీ రామనామం లేకుండా బ్రతుకలేను" అన్నారు బాపు.

భగవంతునిపై విశ్వాసం పైనుండి పోసేదికాదు, లోపలనుండి ఊరేది. మన జీవిత కాలంలో ఏ క్షణంలో ఏ మార్పు చెందుతుందో తెలియదు. పరిస్థితులు బాగా ఉన్నప్పడే సాధన చెయ్యాలి.

61. ఒకసారి లవకుశలు ఆంజనేయస్వామిని బంధించి గొప్ప వాళ్ల మనుకుంటే ఆయన నవ్వుకొని ఇలా అన్నాడు "నేను బంధింపబడాలనే బంధింపబడ్డాను" పిల్లకాయలు మహా బలవంతుడిని ఎలా బంధింపగలరు. అలాగే ఆత్మ ఎవరికి తెలియబడాలి అని అనుకొంటుందో వారికే తెలుస్తుంది. మన ప్రయత్నానికి అనుగ్రహం తోడైతే అది అనుభవమౌతుంది. మన స్వరూపమే నిత్యం. నిత్యాన్ని దృష్టిలో పెట్టుకొని లీలతో జీవిస్తూ నిత్యాన్ని పొందాలి. లీలను పూర్తిగా వదిలేస్తే నిత్యాన్ని పొందలేము. నీవు రాగ ద్వేషాల్ని కంట్రోల్ చేసుకొంటూ నిత్యంలో ప్రవేశించడానికి శమదమాదులు అనే రెండు ద్వారాలు ఉన్నాయి (మనో నిగ్రహం, ఇంద్రియ నిగ్రహం) భగవంతుడు కల్పించే వాటి నుండి బయటపడాలి. మనం వివేకాన్ని, వైరాగ్యాన్ని సంపాదించుకోవాలి. ప్రపంచంలో ఎన్ని గొడవలు జరుగుతాయి. భూకంపాలు, వరదలు, గాలివానలు, అవి సూర్యుడిని ప్రభావితం చెయ్యలేవు. అలాగే నీవు చేసే పనుల ప్రభావం అంతర్యామి మీద ఎలా ఉంటుంది. పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా నిదానంగా ఉండాలి. మోహం మనకు ఉన్నప్పడు మనకు మంచి చెప్పేవాడిని చెడ్డవాడు అనుకొంటాము. బుద్ధిలో స్పష్టతరాదు. మనకు కారణం లేకుండా కోపం వస్తుంది. కానీ కారణం లేకుండా భక్తి రాదు. కారణం లేకుండా భక్తి ఎవరికి వస్తుందో వాళ్ళు తరిస్తారు. నదిలో నీరు ఎలా ప్రవహిస్తుందో అలాగే నీ హృదయంలో ఉన్న ఈశ్వరునిపై అనురాగం, ఆప్యాయత, భక్తి ప్రవహిస్తూ ఉండాలి. భగవంతుని మీద ఇంత ప్రేమ, భక్తి ఎందుకు కలిగింది అని ప్రశ్నించుకొంటే కారణం కనబడకూడదు. కొందరి మనస్సులు కదలవద్దు అంటే కదలవు. అది తపస్సు యొక్క ఫలితం. భగవంతుణ్ణి గమ్యంగా పెట్టుకొని సాధన చేస్తే మీకు ఇంద్రియ నిగ్రహం కలుగుతుంది. ఆయన్ని





గమ్యంగా పెట్టుకోకుండా పనిచేస్తే ఫలితం కనబడదు. నిప్పకు వేడి, నీటికి చల్లదనం ఎలా సహజ లక్షణమో చైతన్యానికి శాంతి, సుఖము, ఆనందము అంతే సహజం. ఈ గుర్తింపు నీవు గ్రహించడమే వివేకం. ఈ విభజన తెలియాలి అంటే వివేకాన్ని సంపాదించుకోవాలి. శాస్త్రం మన క్షేమాన్ని కోరినట్లుగా మన తల్లితండ్రులు కూడా కోరరు. సాధన బాగా జరగాలి అంటే మీ సాధన వాలుగాలిలో సైకిల్ ఎక్కినట్లుగా ఉండాలి. అంటే జరిగిపోయిన గొడవలు అన్నీ మరచిపోవాలి.

62. ధన సంపద ఎలా వృద్ధి చేసుకొంటున్నారో శీల సంపద అలా వృద్ధి చేసుకోవాలి. కూడా వచ్చేది అదే. మననం వల్ల ప్రజ్ఞ పెరుగుతుంది. అంటే పొల్లుకు పొల్లు, బియ్యానికి బియ్యం విడదీస్తుంది. మాయ వాస్తవాలను గుర్తించడమే వివేకం. పారాయణాలు, యాత్రలకన్నా మనో నిగ్రహం ముఖ్యం. వాసనాక్షయం పూర్తి అయితే కానీ జ్ఞానం నిలబడదు. జాగ్రదావస్థ నిజంకాదు, నిజం అనుకొంటున్నావు. అందువల్లనే పాడైపోతున్నావు. ఆ అవస్థలో జరిగేవన్నీ మరచిపోవాలి. మరచిపోతే తొందరగా సత్యానుభవం కలుగుతుంది. ఇతరులకు మీరు ఏమి ఇచ్చినా అంతర్యామిని చూసి ఇవ్వండి. ఏమీ తెలియని వాడు ఏకాదశిరోజున చనిపోతే, అన్నీ తెలిసినవాడు అమావాస్యరోజు చనిపోతాడు. నిద్రలో ఆనందాన్ని ఎరుకలో తెచ్చుకోవడమే మన జీవితగమ్యం. స్నేహాలు కాలాన్ని చంపేస్తాయి. సాధనకు కాలం ఉండదు. అంతా ఈశ్వర సంకల్పం వల్ల జరుగుతోంది అనే విషయం అనుభవంలోకి రావాలి అంటే వంద జన్మలు సాధన చేస్తేగానీ తెలియదు. 'నేను'పోతే ఎలా? అలా అయితే భయం వేస్తుంది అంటారు. సమాధానం రాముని దగ్గర ఆంజనేయస్వామి ఎలా ఉన్నాడో అలా మీరు భగవంతునికి నౌకరిగా ఉండి సేవ చెయ్యండి. మీరు నేనుని పట్టుకోకండి. అబ్రహం లింకన్ కుమారుడు సివిల్ వార్‌లో చనిపోతే లింకన్ భార్య ఏడుస్తూ ఉంటే "వార్‌లో వెయ్యిమంది చనిపోయారు. వాళ్ళు పోయినప్పడు నీ కళ్లల్లో నీళ్ళు రాలేదు. నీ కొడుకు పోయినప్పడే

నీళ్ళు వస్తున్నాయి. అలా అయితో పోయిన వెయ్యిమందిని అవమానించినట్లే" అన్నారు లింకన్. ఈ నేను చెప్పింది నిజం అనుకొంటున్నాము. అది మన అనుభవం. కానీ శాస్త్రం అది నిజం కాదు అని చెప్పినా మనం నమ్మడం లేదు. కారణం మొదట నేను అనే అనుభవం ఉంది. శాస్త్రం చెప్పిన 'నేను' అనుభవంలో లేదు. అందుకే నమ్మడంలేదు. శాస్త్రం చదివినా అది మనకు అనుభవంలో లేక నమ్మినట్లు నటిస్తున్నాము కానీ నమ్మడం లేదు. కోపం కంటే ద్వేషం ఎక్కువ ప్రమాదం. సహనం ఉన్న వానికి హృదయం యొక్క లోతులు పెరుగుతాయి. ద్వేషం ఉన్న వానికి రాత్రిళ్ళు నిద్ర పట్టదు. మీ మనస్సును అడగండి నన్ను ఎందుకు అశాంతిపాలు చేస్తున్నావు? అసలు నీకు ఏమి కావాలి? నన్ను నరకానికి వెళ్ళే రైలు దగ్గరకు తీసుకొని వెళ్ళకు. నేను మోక్షానికి వెళ్ళే రైలు ఎక్కాలి అని దానికి హితవు చెప్పాలి, బోధించాలి.

63. ఆషాఢబూతులు అంటే నమ్మించి దెబ్బకొట్టే నమ్మకద్రోహులు. సాధకులు వారి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఈ సంఘటనను ఉదాహరణగా తీసుకోండి. చిన్న నదిని దాటాలని ఒక తేలు అనుకొంటూ ఉంటే అదే సమయంలో అక్కడకు తాబేలు వస్తే దానితో తేలు అంది "నీవు నన్ను వీపు మీద కూర్చోబెట్టుకొని అవతలి ఒడ్డుకు తీసుకొనివెళ్ళు" అంటే తాబేలు అంది "నీ స్వభావం కుట్టడం, నీతో నేను బాధపడలేను" అంటే "నీవు నాకు ఉపకారం చేస్తుంటే నేను నిన్ను ఎలా కుడతాను. నీ వీపు పెంకు చాలా గట్టిది. దాన్ని కుట్టినా ఏ హానీ జరుగదు కదా!" అంటే ఆ సమాధానం బాగా ఉందని నమ్మి తేలును నది దాటిస్తూ ఉంటే తాబేలు తీరం ఎంత దూరం ఉందని తలను పైకి ఎత్తింది. తేలుకు దాన్ని కుట్టాలనే తలంపు బలంగా వచ్చేస్తుంది. కానీ తాబేలుకు కుట్టనని మాట ఇచ్చాను అనుకొంటుంది. కానీ స్వభావ బలం వల్ల తాబేలు తలపై కుట్టేసింది. తాబేలు తేలుని విదిలించుకొంది. "నీవు నమ్మకద్రోహం చేసావు" అంటే "నీవు చెప్పింది నిజమే నా అలవాట్లు నన్ను గెంటేసాయి. అందుకే నేను నీటిలో కొట్టుకుపోతున్నాను. మరణించవలసిన పరిస్థితిని తెచ్చుకున్నాను" అంది.





ఇద్దరూ చెప్పింది బాగానే ఉంది. అలవాట్ల ముందు ఈ లాజిక్ ఏపాటిదని గ్రహించాలి. కొందరికి మంచితనం ఉంటుంది. ఉపకారం చెయ్యాలనే తలంపు రాదు. మహామేధావులైన వారు కొందరు పేచీలు పెట్టడం, కొంపలు అంటించడం వంటి పని చేస్తారు. వాళ్ళకంటే కోతులు నయం అని శాస్త్రం చెప్పింది. అటువంటి వారికి ఉపకారం చేసినా కాటేయటం మానరు. వారి స్వభావం మారదు. సంఘం నీ పాలిట శత్రువు ఈ తరహా మనుషుల వల్ల వీరు మిమ్మల్ని రెండు కాళ్ళు పట్టుకొని లాగేస్తారు. నిన్ను ఎదగనివ్వరు. నీ శరీరానికి కాలు కుంటితనం ఎలాంటిదో నీ మనస్సులో కుటిలత్వమే మనస్సుకు కుంటితనం. స్వభావం మార్చుకోవడం చాలా కష్టం అని గ్రహించాలి.

64. ఉద్రేకం గల స్వభావం గలవాడు ఏదైనా వ్యతిరేకమైన మాట వస్తే తిరగబడి ఉద్రేకం తెచ్చుకుంటాడు. వ్యాసులవారు అన్నారు "వివేకం, వైరాగ్యం, సామర్థ్యం కలిగి ఉండండి" అని. బయట శత్రువుల కంటే కనిపించని లోపల శత్రువుల వల్ల (గర్వం, అసూయ, లోభిత్వం) హృదయం నల్లగా ఉంటుంది. పైకి చర్మం తెల్లగా ఉంటుంది. వారికి వైరాగ్యం అసలు లేదు. అందుకే వారికి లోచూపు కలగడం లేదు. వారు కాశీలో రెండు నెలలు ఉండాలని వెళతారు. 4 రోజులు ఉండి వచ్చేస్తారు. ఎవరైనా ఎందుకు వచ్చేస్తారు అంటే ఆరోగ్యం బాగాలేదని వచ్చేస్తాము అంటారు. అదే అహంకారం. చాపల్యం కలుగుతూ ఉంటే ఈశ్వరునిపై విశ్వాసం లేదని అర్థం. విశ్వాసం కుదిరితే సాధన లేకుండానే మనస్సు నిశ్చలమవుతుంది. హృదయాభిముఖంగా ప్రయాణం చెయ్యడానికి ఏకాగ్రత ఎంత ముఖ్యమో, పవిత్రత కూడా అంతే ముఖ్యం. నీవు పవిత్రుడివి అయితే ఆ క్షణంలో సత్యంలో ఐక్యం అవుతావు. వివేకంలోంచి పొంగిన వైరాగ్యమే నిలుస్తుంది. పరమేశ్వరుని దయ నీకు లేకపోతే బాహ్యంగా నీకు ఎన్ని ఉన్నా ఏమీ లేనట్లే. అందుచేత మనందరం కష్టపడి నిరంతరం కృషి చేసి భగవంతుని ఆశీస్సులు సంపాదించడం తప్ప మనకు ఇంకో పని లేదు. అదే ముఖ్యమైన పని.

తాత్కాలికంగా ఈరోజు గడిచిపోతే చాలు, ఈ జన్మ గడిచిపోతే చాలు అని ఇలా కురచగా ఆలోచిస్తాము. కానీ మనలో ఉన్న అజ్ఞానాన్ని ఎలా తొలగించుకోవాలి, వ్యక్తిభావన ఎలా తొలగించుకోవాలి అని ఆలోచించడం లేదు. అలా తొలగించుకోకపోతే దాని వల్ల ఎంతో నష్టపోతావు. మనకు ఖర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు ఉన్నాయి. వాటిలో ఏ ఇంద్రియం ద్వారా పొరపాటు జరగకుండా ఉండేలా మమ్మల్ని ఆశీర్వదించు" అని కొందరు సూర్యుడు ఉదయించగానే ఆయనను ప్రార్థిస్తారు. ఇంద్రియాల ద్వారా పొరపాటు జరుగుతూ ఉంటే హృదయంలో ఉన్న ఈశ్వరుడు మనకు అనుభవంలోకి రాడు. నమ్మకానికి పూర్వజన్మ పుణ్య సంస్కారం ఉండాలి. ఆధ్యాత్మిక పుణ్యబలం ఉండాలి.

65. శరీరం సుఖంగా ఉండటం కోసం డబ్బు ఖర్చుపెట్టి బజారులో తిరిగి ఎన్నో వస్తువులు కొనుక్కుంటున్నారు. మరణానంతర జీవితంలో కూడా సుఖంగా, శాంతిగా ఉండడానికి మనం ఏమి చెయ్యాలి అనే ఆలోచన మనకు రావడం లేదు. మంచి పనులు చేసేవారు కూడా ఏదో పుణ్యం వస్తుంది స్వర్గానికి వెళతాము అని ఆలోచించేవారే కానీ ఈశ్వరునిలో ఐక్యం అవ్వడానికి మనం చేసే ప్రయత్నం ఏమీ లేదు. "మంచి తనమే జ్ఞానం" అంటాడు సోక్రటీస్. లోకం కోసం మంచిగా ఉండటం కాదు, ఎదుటివారు చెప్పకోవడం కోసం మంచితనంగా ఉండటంకాదు, చరిత్ర వ్రాయించుకోవడం కోసం మంచిగా ఉండటం కాదు, మంచి కోసమే మంచిగా ఉండండి. మీకున్న మంచితనం నిజమైతే ఆ మంచితనమే హృదయ గుహలో ప్రవేశించడానికి మీకు సహాయ సహకారాలు అందిస్తుంది. వారికి ఈశ్వరుడు మాయను దారి ఇమ్మని మాయను తప్పిస్తాడు. అప్పడు ఈశ్వరునిలో ఐక్యం అవుతాము. మనకు ఎంతసేపు చనిపోయేవరకు ఏమి సుఖం అనుభవించాము, ఏమి భోగాలు అనుభవించాము ఇదే గొడవ. ఇక వేరే పని ఏమీ లేదు. మనం ప్రతీదీ భోగ దృష్టితో చూస్తాము ఆలోచిస్తాము. దాని వల్ల దేహాభిమానం పెరిగి





పోతుంది. దేహాన్ని సాధనా వస్తువుగా తీసుకుంటే సత్యం ఎరుక పడుతుంది. ధాన్యాన్ని మిల్లులో పోస్తే పైపొర పోయి బియ్యం అవుతుంది. అలాగే నీవు సాధన చేసి అహంకారమనే పొరను తీసేస్తే లోపల ఉన్న బ్రహ్మం నీకు వ్యక్తం అవుతుంది. పనిని సింపుల్‌గా చెయ్యాలి. సీరియస్‌గా చెయ్యాలి. ఏకాగ్రతతో చదివితే ఎంత గ్రంథమైనా కొద్దిసేపు చదివితే చాలు. అంతా అర్థం అవుతుంది. వంతెనలు, భవనాలు, ఆనకట్టలు నిర్మించవచ్చు కానీ కర్తృత్వం, స్వార్థం ఉన్న వానిని సహృదయం గల వ్యక్తిగా చెయ్యడం కష్టం. అలవాట్ల యొక్క వేగం వల్ల వ్యక్తికి ఉన్నతునిగా చెయ్యాలన్నా చెయ్యలేము. కేన్సర్‌ని మొదట స్థాయిలో గుర్తించి నివారించవచ్చును. అలాగే వ్యక్తికి కోరిక కలిగిన వెంటనే గుర్తించి దాన్ని తొలగించడం తేలిక. మనకు ఏది మంచిదో మనకంటే ఈశ్వరునికే తెలుసు. కానీ మనం ఏమను కొంటున్నాము అంటే మనకు అన్నీ తెలుసు. ఈశ్వరునికి ఏమి తెలుసు అనుకుంటాము. ధనం ఉండి, అధికారం ఉండి, అన్నీ ఉండి గర్వం లేని వానికే ఈశ్వరానుగ్రహం ఉంటుంది. శరీరం ఉండగానే అశరీర స్థితిని ఎవరైతే ఎంజాయ్ చేస్తున్నారో, వారు బ్రహ్మజ్ఞానం పొందడానికి అర్హులౌతారు. అంటే ఇంద్రియాలను కంట్రోల్‌లో ఉంచుకోవడం, ఏ విషయానికి రియాక్ట్ అవ్వకుండా ఉండటం వల్ల బ్రహ్మజ్ఞానానికి అర్హత కలిగి ఉంటారు. మనకు అజ్ఞానం వల్లనే దుఃఖం వస్తున్నది. అనే వివేకం మనకు కలగడంలేదు. బయట కారణాల వల్ల దుఃఖం రావడంలేదు. పూట గడవని వాడు కూడా ఆనందంగా ఉంటాడు. అన్నీ ఉన్నవాడు ఏడుస్తూ కూర్చుంటాడు. ముందు మనోనిగ్రహం, ఇంద్రియ నిగ్రహం అలవాటు చేసుకోవాలి. అదే నిజమైన పని. కానీ అది పని అని అనుకోవడం లేదు. సంసారం అంటే రిపిటీషన్. ఈరోజు చేసిందే, మరలా రేపు చేయడం, చేసిందే చేయడం. సంసార వాసన ఉన్నవానికి ఆత్మానుభవం పొందాలనే తలంపేరాదు. బుద్ధి స్థిరంగా ఉన్నవాడే నిజమైన సుఖి. ఈశ్వర వాక్యం ప్రమాణంగా తీసుకొని జీవించి తీరాలి. నీ మనస్సు కోతి. ఆ మనస్సును నీవు ప్రక్కన పెట్టాలి. అదే సాధన.

66. అందరినీ ఎవరైతే ఆత్మగా చూస్తారో వారు ఆనందంగా ఉంటారు. ఇంద్రియాలను పొదుపుగా వాడుకోవాలి. అన్ని ఇంద్రియాలను మూసుకొని కూర్చోవడం కుదరదు. చెవులు, కళ్ళు, నోరు మూసుకుంటే రోజులు గడవవు. సాధన అంటే మిమ్మల్ని మీరు సరిచేసుకోవడమే. హృదయాంతరాళాల్లో వైరాగ్యం ఉంటే భయం పోతుంది. జ్ఞానం వల్ల మాత్రమే "నేను పుట్టలేదు" అన్న విషయం తెలుస్తుంది అన్నారు సనత్ కుమారుడు. మనస్సు హృదయంలో ఉండదు. కారణం బయట విషయాల ఆకర్షణలు అందులో ఉండనివ్వవు. సహజంగానే మనస్సుకు కొన్ని సంస్కారాలు ఉంటాయి. అవి మనస్సును హృదయంలో ఉండనివ్వవు. మరి ఎలా కుదురుతుంది. మహాత్ముల దర్శనంతో కొంతసేపు మనస్సును హృదయంలో ఉంచవచ్చును. కానీ బయటకు వెళ్ళిన తరువాత అది బాహ్యాముఖ మవుతుంది. దానిని గురు పర్యవేక్షణలో ఉంచడమే శాశ్వత పరిష్కారం. ఎవడైతే భగవంతుని సంకల్పంతో, తన సంకల్పాన్ని ఐక్యం చేస్తాడో అది ఈశ్వర ప్రణిదానం. దేహప్రారబ్ధాన్ని బట్టి ఒక్కో దేహం ఒక్కో పని చేస్తున్నప్పటికీ మనస్సులో ఈశ్వరుని అంటిపెట్టుకొని ఉండాలి. ఏ పరిస్థితి లోనూ వర్రీ పెట్టుకోకూడదు. దానికి బదులు పరిస్థితుల్ని చక్కబెట్టుకొని భగవంతుణ్ణి ప్రార్థించడం మంచిది. మనకి మనం పతనం అయిపోవాలని కోరుకోము. బయట వాళ్ళను పతనమైపోవాలని కోరుకుంటారు. అక్కడ కూడా నీవే ఉన్నావు. తెలియక వాడి పాడును నీవు కోరుకుంటావు. అంటే నీకు తెలియకుండానే నీ పాడును నీవు కోరుకుంటున్నావు. మనోనిగ్రహం, ఇంద్రియనిగ్రహం ఉన్న వాడే గొప్పవాడు. చదువు, ప్రపంచ కీర్తి సంపాదిస్తే గొప్పవాడు కాదు. పెద్ద మేడల్లో ఉంటున్నా మనస్సులో వంకర్లు ఉంటే ఏడుస్తూనే ఉంటాము.

67. శ్రద్ధ అంటే రాగద్వేషాలను ప్రక్కన పెట్టి భగవంతుడు చెప్పిన మాట మీద నూటికి నూరుపాళ్ళు మనకు నమ్మకం కలగడమే. అది జ్ఞానానికి దారితీస్తుంది. దాన్ని మనం సంపాదించాలి. మిగిలినవి అన్నీ రెండవ





పక్షం, స్వప్న సమానమే. "అందరి హృదయాలలోనూ అంతర్యామిగా నేను ఉన్నాను" అన్న పరమాత్మ మాట మీద పూర్తి విశ్వాసం కుదిరితే మోక్షానికి అర్హత వస్తుంది. మనం అస్తమానం తలకాయతో ఆలోచిస్తాము కానీ హృదయంతో ఆలోచించడం లేదు. ఎంతసేపు తలకాయ గొడవే. నేను తలకాయలో ఉన్నానని భగవంతుడు చెప్పలేదు. హృదయంలో ఉన్నాను అన్నాడు. మనం ఏదైనా పని సాధిస్తే మేము చేసాము అంటారు. పని సాధించకపోతే వారు అడ్డువచ్చారు. వీరు అడ్డు వచ్చారు అని ఎవరి మీదనో నెట్టేయడానికి చూస్తారు. ఇది మనసులో ఉన్న బలహీనత. దానిని తొలగించుకోవడానికి ఈశ్వరుని పాదాల మీద భక్తిలేదు. మనం భక్తులం కాకపోయినా బజారులో భక్తులుగా చలామణి అయిపోతున్నాము. భగవంతుణ్ణి ప్రేమించడం కోసమే ఆయన్ని ప్రేమించాలి. తిలక్‌గారు దేశానికి స్వాతంత్ర్యం సంపాదించాలని వ్యక్తిగతంగా ఎన్ని దుఃఖాలు వచ్చినా పట్టించు కోలేదు. విషాదానికి గురి కాలేదు. ఎందుచేత దేశాన్ని ప్రేమించే ఆ పద్ధతిలో ఆ విశాల హృదయంలో విశాలమైన ప్రేమలో వ్యక్తిగత విషయాలు వారికి బాగా చిన్నవిగా కనిపించాయి. అలాగే మీ గమ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఎన్ని దుఃఖాలు వెంటాడుతున్నా స్థిరబుద్ధితో జీవించాలి. చీమల దగ్గర పంచదార, ఇసుక కలిపి వేస్తే పంచదారను తిని ఇసుకను వదిలేస్తాయి. అలాగే మనం సమాజంలో మంచిని గ్రహించి చెడును విసర్జించాలి. మనకు సినిమాలు చూడడానికి, చెడు స్నేహితులను కలవడానికి సమయం ఉంది. దైవచింతనకు సమయంలేదు. కారణం మన బుద్ధి మంచిది కాదు. చెడుస్నేహాల నుంచి మీరు ఎవరినైనా విడిపిస్తే అది కూడా ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతారు. సత్త్వగుణం యొక్క లక్షణం ఏమిటి అంటే పని చేస్తాడు కానీ ప్రతీకారం చెయ్యడు. లోకంలో సుఖం ఉందని వెదకడం నీ వెఱ్ఱితనానికి గుర్తు. ఆత్మలోనే సుఖం ఉంది. ఇంట్లో మీ పొట్ట వెళ్ళడానికి రాజీపడుతున్నారు. భగవంతుని సంకల్పంతో రాజీపడలేరా? బోదకాలుని చూసి బలం అనుకోవడం ఎటువంటిదో మన ఆధ్యాత్మిక స్థితిని

చూచి మనమే అంచనాలు వేసుకొని పొంగిపోవడం అటువంటిదే. నీ అంచనా నిజం కాదు. ఈశ్వరుని అంచనాలో నీవు ఎలా ఉన్నావో నీకు తెలియదు. మనం సరియైన మార్గంలో ఉన్నామని తెలుసుకోవడానికి కూడా ఈశ్వరుని దయ అవసరం. భగవంతుని మాటను ప్రమాణంగా తీసుకొని నడిస్తే మొట్టికాయలు పడే పరిస్థితి ఉండదు. మాటలు అన్నవానికి దేహబుద్ధి పెరుగుతుంది. పడ్డవానికి దేహాత్మబుద్ధి తగ్గుతుంది.

68. అద్దంలో మీ రూపాన్ని చూసుకుంటే ఆ ప్రతిబింబం మీదే కాని అది మీరు కాదు. అలాగే భగవంతుని నీడలో ఈ ప్రపంచం ఉంది. కాని అది ఆయన కాదు. ఆయన నీడ. ఫొటో మీరు కాదు. ఫొటోను కొడితే మీకు దెబ్బతగలదు కానీ మీకు బాధ కలుగుతుంది. అలాగే ఈ సృష్టి నిజం కాకపోయినా ఈ సృష్టిలో ఉన్న వాటిని కొడితే భగవంతునికి బాధ కలుగుతుంది. కాబట్టి ఎవరినీ బాధపెట్టకు. మనస్సు ఉన్నత స్థితికి వెళ్ళడానికి జపం సహకరిస్తుంది. చేతులతో పనిచేసి మనస్సుతో భగవంతుని స్మరించేవాడు బుద్ధిమంతుని లక్షణంగా గ్రహించవచ్చును. మంచిమాట ఏ ముఖం నుండి వచ్చినా అభ్యంతరం ఉండకూడదు. ఈ పని చెయ్యాలా? చెయ్యకూడదా? అని బాగా ఆలోచించి నిర్ణయించేది వివేకం. ఆ పని చెయ్యడానికి నిర్ణయించుకున్న తరువాత ఆ పని ఎలా చెయ్యాలో నేర్చుకోవాలి. అలా చేయడం నైపుణ్యం. ఆ నైపుణ్యాన్ని నేర్చుకుంటే సరిపోదు. ఆ పనిని సక్రమంగా పూర్తి చెయ్యాలి. ఆ శక్తి ఉన్నప్పుడు అది సామర్థ్యం. ఈ మూడు ముఖ్యం. నీ పేరు మీద నీకు అంత ప్రేమ ఉన్నప్పుడు అందులో ఉండి బయటకు రానప్పుడు ఈశ్వరుని మీద ప్రేమ ఎలా కలుగుతుంది. పేరు నువ్వా? శరీరం నువ్వా? రెండూ నువ్వు కాదు. నీవు కాని దాని మీద నీకు అంత ప్రేమ ఉన్నప్పుడు నీవు ఏదిగా ఉన్నావో దాని మీద ప్రేమ ఎలా కలుగుతుంది? కలుగదు. అసలు మనస్సే అటు వెళ్ళదు. గమ్యాన్ని పొందలేవు. చెడు ఆలోచనలు వస్తూ ఉంటే చెడు చెయ్యకుండా ఉండలేవు. తిండి, శాంతి అనేవి పెద్ద డాక్టర్లు. తిండిని మితంగా సాత్వికంగా తీసుకోవాలి





అని గుర్తుపెట్టుకుంటే ఆరోగ్యం బాగుపడుతుంది. డాక్టర్‌తో పనిలేదు. రెండవది శాంతి అనే డాక్టర్‌ని గుర్తుపెట్టుకుంటే మెంటల్ హాస్పటల్‌కు వెళ్ళనక్కరలేదు. అశాంతి పొందే పరిస్థితే రాదు. పది రోజులు కష్టపడితే మంచి గుణం వస్తుంది. కానీ పది సంవత్సరాలు కష్టపడి సాధన చేసినా ఒక్క చెడుగుణం పోతుందని చెప్పలేము. ఈశ్వరానుగ్రహం లేకుండా బయటకు పోదు. మీరు లెక్క చేస్తున్నారు అనుకోండి తప్పు వస్తే ఏడుస్తూ కూర్చుంటారా? దానిని ఎవరినైనా అడిగి ఆ లెక్క చెప్పించుకొని సఫలం అవుతారు. అలాగే మీలో ఏదైనా లోపాలు ఉంటే ఆ లోపం ఉందని ఏడుస్తూ కూర్చోకండి. సరిచేసుకోవడానికి ప్రయత్నం చెయ్యండి. మిమ్మల్ని మీరు బాగుచేసుకోండి. ఎవరితో సహవాసం చేయడం వల్ల తమోగుణం, రజోగుణం పెరుగుతుందో ఆ స్నేహాల జోలికి, ఆ ప్రాంతం వైపుకి వెళ్ళకండి. మీరు అలా చెయ్యకపోతే మీరు సాధన చేసినా ప్రయోజనం లేదు. చిల్లుకుండలో నీరు పోసినట్లు ఉంటుంది. కళ్ళజోడు అద్దం శుభ్రంగా లేకపోతే దానిని శుభ్రంగా క్లీన్ చేసుకొని పెట్టుకుంటాము. లేకపోతే ఏదీ చదువలేము. ఏమీ కనబడదు. అలాగే బుద్ధిలో దుమ్ము పడకుండా అంటే అరిషడ్వర్గాలు చేరకపోతే అది నిర్మలంగా, నిశ్చలంగా ఉంటే భగవద్గీత అర్థం అవుతుంది.

69. మీరు శరీరమని, బుద్ధి అని, మనస్సు అని ఏదో అనుకోవడం వల్ల అబద్ధం నిజం ఎలా అవుతుంది? అది మీరు నిజమనుకుంటే అనుకోవచ్చు కానీ అది నిజంకాదు. నిజం మీకు తెలిసేవరకూ మీకు జన్మ రాహిత్యం లేదు. నీకు ఆనందం కలిగినప్పుడు అక్కడ 'నేను' ఉంటుంది. అది పోయినప్పుడు అక్కడ 'నేను' ఉంటుంది. ఆ నేను ఉన్నంతవరకు ఆనందం వస్తూ ఉంటుంది, పోతూ ఉంటుంది. ఆ నేను ఎవరో తెలిసే వరకు ఆనందం స్థిరపడదు. భగవంతుని అనుగ్రహం ఉంది అని తెలియ డానికి కూడా సాధన కావాలి. అది ఉందని తెలియకపోతే ప్రయోజనం ఏమిటి? స్పందన వచ్చినప్పుడు, అవకాశం వచ్చినప్పుడు పట్టుకోవాలి. ఆ

స్పందన వచ్చినప్పడు ప్రతిస్పందన నీవైపు నుండి ఉండాలి. అప్పడు నీవు ఒడ్డుకి వచ్చేస్తావు. నీకు వచ్చే కష్టాలు అన్నీ నీవు సహిస్తే దానికి మించిన సాధన ఉందా? నీవు ఎంతటి ప్రాజ్ఞుడవైనా, ఎంతటి వివేకివైనా ఈశ్వరుడు నీ హృదయంలో ఉండి నిన్ను, నీ బుద్ధిని, నీ ఇంద్రియాలను నీ మేధకు అందకుండా ఆయన ఆడిస్తూ ఉన్నాడు. జన్మల తరబడి, జన్మల తరబడి సాధన చేసిన ఫలంగా కపటత్వం లేని స్థితికి నీవు వస్తే దానంతట అదే సత్యం నీకు తెలియబడుతుంది. జ్ఞానికి ఇతరులు లేనప్పడు ఇతరుల నుండి గుర్తింపులను, గౌరవాలను ఏల కోరుకుంటాడు? జీవుడే ఈ గుర్తింపులను గౌరవాలను కోరుకుంటాడు, రామచంద్రమూర్తి యొక్క శరీర సౌందర్యం, ఆ గుణ సంపదతో భూమి మీదకు ఎందుకు వచ్చాడంటే మన ఉపాసన కోసం, మనం తరించడానికి. నామరూపాలు మరచిపోయి ఏ పని చేసినా సత్కర్మ చేసినట్లే. మనస్సు పవిత్రం అవ్వకుండా ఏ పని చేసినా ప్రయోజనం లేదు. ఆధ్యాత్మిక సంపదను మనం సంపాదించుకోవాలి. మన ఇంటిని దానితో నింపుకోవాలి. దూరదృష్టి, ప్రణాళికాబద్ధమైన జీవితం, క్రమశిక్షణ, ఈశ్వరునిపై అచంచలమైన విశ్వాసం కలిగి ఉండాలి. దాని వల్లనే సత్య దర్శనం అవుతుంది. "దయ గలవాడు దయను ఎలా విడిచిపెట్టడో, నిన్ను నేను వదలను" అంటాడు సీతతో రాముడు అరణ్యవాసానికి వెళ్లినప్పడు. అది కళ్యాణ గుణం. త్రికరణ శుద్ధితో చేసే ఖర్మ వల్ల ఈశ్వర కటాక్షం, గురు కటాక్షం కలుగుతుంది. అంతరదృష్టి ఉన్న శాస్త్రవేత్త భౌతిక విషయాల్లోని మర్మాన్ని కనిపెట్టగలడు. కలియుగంలో కొంచెం నామం, కొంచెం శ్రవణం, కొంచెం నిష్కామ ఖర్మ చేసినా ఫలితం అనంతంగా ఉంటుంది. ఏదీ అడగకుండా ఉదాసీనంగా ఉంటే రావలసినది వస్తుంది. ఆత్మ గురించి ఆత్మ తెలుసుకోవాలి. జీవుడు తెలుసుకోలేడు. నరాల పరిస్థితి చల్లగా ప్రశాంతంగా ఉండాలి. చాలామందికి అది ఉండదు. మనకు అర్హత ఉంటే సుఖము, శాంతి, భౌతిక వస్తువులు అన్నీ మన దగ్గరకే వస్తాయి.

70. "నీ బుద్ధిని సరిచేయడానికి ప్రారబ్ధమనే దెబ్బలు కొట్టి బుద్ధిలో





ఉన్న వంకర్లను సరిచేస్తాడు ఈశ్వరుడు. మనోదేహాలతో తాదాత్మ్యం చెందడం వల్లనే అనేక దెబ్బలు తగులుతున్నాయని అనిపిస్తుంది. నీ మనస్సును ఆత్మవైపు తిప్పితే ఎన్ని దెబ్బలు తగిలితే నీకేల? కళ్లతో చూచేవి, చెవులతో విన్నవి ఈ భోగాలు అన్నీ కాకి రెట్టతో సమానం అని భావించే వానికి సత్యానుభవం కలుగుతుంది" అన్నారు ఆచార్యులవారు. వేదాలసారం "శాంతిగా ఉండమని" అన్నది. పరమహంసగారు వివేకానందుల వారి కష్టాలను ఇతరులకు చెప్పగా "ఈరోజు అమావాస్య ఇప్పటి సమయం రాత్రి 8 గంటలు ఈ క్షణంలోనే తెల్లవారాలంటే సాధ్యమవుతుందా? ఆ టైము వస్తే మహా వెలుగులో ఉండి ప్రపంచానికి బోధిస్తాడు. అంతా భగవంతుని సంకల్పం జరుగుతుంది" అన్నారు. మీ అందరి జీవితాలలో ఏది జరగాలో అది జరుగుతుంది. పెద్దలకు నమస్కారం పెట్టడం వల్ల మనకు వినయం, వివేకం కలుగుతుంది. వివేకం అంటే గడుసుతనంకాదు. ఇది సత్యం, ఇది అసత్యం అని వేరు చేయగలిగేది. దీని పరిణామం దుఃఖం. దీని పరిణామం శాంతి అనే పరిశీలనా శక్తి ఉంది అంటే ఎంతో సత్కర్మ పూర్వ జన్మలో చేయకపోతే ఆ వివేకమే రాదు. "దుష్టుడు ఉన్నచోట, పాములు ఉన్న చోట జాగ్రత్తగా ఉండండి" అన్నారు వాల్మీకి. కారణం వారు అశాంతిని తీసుకొస్తారు. సహనం లేని మనిషికి చిన్న విషయం కూడా పెద్ద విషయంగా కనిపిస్తుంది. దేహంతో తాదాత్మ్యం పొందకపోతే ఎంత చెడ్డ ప్రారబ్ధమైనా హాయిగా అనుభవించవచ్చును. ఇతరులను బోను ఎక్కించడానికి చూస్తున్నారు. మీ మనస్సును బోను ఎక్కించండి. శాంతిని కాపాడు కోకపోతే లోపల ఉన్న సత్యం నీకు అనుభవంలోకి రాదు. వార్తాపత్రిక రోజూ చదవడం వల్ల మనస్సు అపవిత్రం అవుతుంది. ఎలా అంటే వంటింట్లోకి వెళ్లాక మసి అంటుకోకుండా ఉండదు. ప్రతీ చిన్న విషయానికి రియాక్ట్ అయితే సత్వగుణం రాదు. మొక్కకు నీరుపోసి పురుగులు పట్టకుండా మందులు కొట్టి ఎలా కాపాడుకొంటావెూ అలాగే సత్వగుణాన్ని జాగ్రత్తగా పోషించుకుంటూ వస్తే హృదయంలో ఉన్న సౌందర్యం మనకు గోచరిస్తుంది.

మనం సంపూర్ణంగా రాగ ద్వేషాలు లేకుండా ఉంటేనే ఎదుటి మనిషిని సరిగా అర్థం చేసుకోగలం. ఈ భూమి మీద తిరుగుతున్నప్పడే ఎంత సాధన చెయ్యాలో అంత సాధన చేసి రాగద్వేషాలను తగ్గించుకోవాలి. మన స్వభావాన్ని ఒక్క రోజులో మార్చుకోలేము. నెమ్మదిగా మార్చుకొంటూ రావాలి. పూర్వజన్మ సంస్కారాలు అనేకం ఉంటాయి. షడన్‌గా బ్రేకు వేస్తే ప్రమాదమే. గమ్యాన్ని మరచిపోకుండా మన స్వభావాన్ని మార్చుకోవడానికి ప్రయత్నం చేస్తూ ఉంటే ఫలప్రదమవుతావు.

71. వివేకం వచ్చాక ప్రపంచం ఒక రకంగా కనిపిస్తుంది. వివేకం లేనప్పడు ప్రపంచం మరో రకంగా కనిపిస్తుంది. అలాగే వైరాగ్యం లేనప్పడు ఒక రకంగా ఉంటుంది. వైరాగ్యం వచ్చాక ఒక రకంగా ఉంటుంది. మనకు వైరాగ్యం లేదు అనుకోండి ప్రతీ వస్తువు మనల్ని ఆకర్షిస్తుంది. వైరాగ్యం ఉంటే లోకంలో ఏదీ నిన్ను ఆకర్షించదు. మేము ఈ దేవుడికి పూజ చేస్తున్నాము, ఆ దేవుడికి పూజ చేస్తున్నాము అంటారు అదికాదు మీకు ఇష్టమైన దేవుడిని పూజించుకోండి. లోపల వివేక, వైరాగ్యాలు పెంచుకుంటూ రావాలి. అలా పెంచుకోకుండా బయట ఏదో సాధిస్తున్నాము అంటే దాని వలన నీకు అజ్ఞానం నశించదు. కడుపులో పుండు ఉంది. పైన కొబ్బరి నూనె వ్రాస్తే ఎలా తగ్గుతుంది. అజ్ఞానం మన లోపలే ఉంది. అది పోయే విధానం జాగ్రత్తగా చూసుకోవాలి. మీరు ఏదో ఒక గంట జపం చేసి ధ్యానం చేసి తరువాత మనస్సును బయటకు వదిలితే ఇక సాధన ఏమిటి? నిరంతరం మనస్సు మీద నిఘా ఉండాలి. దానికి బయటకు వెళ్లిపోవడం అలవాటు. దానిని వెనక్కి తీసుకురావడం నీవు అలవాటు చేసుకో. ఎన్నిసార్లు బయటకు వెళితే అన్నిసార్లు వెనక్కి తీసుకురా. దాని పని అది మాననప్పడు, నీ పని నీవు మానకు. ఇలా కొంత కాలానికి దానికి బయట తిరుగుడు అలవాటు ఆగిపోతుంది. మన మనస్సుకు హృదయంలో ఉన్న శాంతి, సుఖం తెలిసాక ఇక మనం తోలినా బయటకు వెళ్లదు. "ఓం సాక్షిణే నమః" అనుకోండి. దానివల్ల మీకు పైసలు కలసి రాకపోయినా, గొప్పలు





రాకపోయినా మీకు చెడు తలంపులు రావడం ఆగిపోతాయి. మీకు చిత్తశుద్ధి కలుగుతుంది. ఇంట్లో పిల్లల గురించి అయినా మీరు మాటలు బాగా మాట్లాడాలి. మీరు మాటలు తింగర తింగరగా మాట్లాడితే మీ అలవాట్లు అన్నీ మీ పిల్లలకు వచ్చేస్తాయి. ఏకాగ్రత ఎంత సహజంగా ఉండాలో ఉపనిషత్తు ఇలా అంది "నీవు శ్వాసను ఎంత సహజంగా తీసుకుంటావు దానికి నీ ప్రయత్నం ఏమీ చెయ్యవు. తీసుకోలేకపోతే శరీరంలో ఏదో దోషం ఉందని అర్థం. అలాగే ఏకాగ్రత అంత సహజంగా ఉండాలి" అంది. రామకృష్ణుడు "నీ బుద్ధి ఒక లీటరు పోసే గిన్నె ప్రమాణం, భగవదనుభవం దానికి కోటానుకోట్ల రెట్లు పరిమాణంలో ఉంది. దానిని నీ బుద్ధి పరిమాణంతో ఎలా కొలుస్తావు? విశాలమైన బుద్ధి కావాలి" అన్నారు. ఎంత ధనం ఉన్నా, ఎంత కీర్తి ప్రతిష్టలు ఉన్నా కొందరు హృదయంలో బీదగానే ఉంటారు. బయట ఉన్న సంపదను, కీర్తిని హృదయంలోకి రానివ్వరు. వారు ఈశ్వరుని ప్రార్థించనక్కర్లేదు. ఈశ్వరుడే వారిని అనుగ్రహిస్తాడు. "ఒక మంచి పని కూడా నీ చేతులతో చెయ్యకపోతే ఈ చేతులను ఏమీ చేసుకుంటావు" అన్నారు రాగూర్. మనిషిని మహాత్మునిగా చెయ్యడానికి చెడ్డ గుణాలు ఉన్న వానిచేత మంచి వారికి కష్టాలు కల్పిస్తారు. పవిత్రుణ్ణి చెయ్యడానికి చెడ్డవాళ్ల పాత్రను ఈశ్వరుడు ఉపయోగించుకుంటాడు. నీ మనస్సు ఎక్కడ నుండి వచ్చింది? బ్రహ్మం నుండే వచ్చింది. నీవు ఏమి చెయ్యాలి? బ్రహ్మంలో నీ మనస్సును ఉంచాలి. మనస్సు లోక చింతన చేస్తుంది. ఏది చేస్తామో అది అవుతాము. ఇది రహస్యం.

72. పదిసార్లు ఆలోచించి ఒక మాట మాట్లాడు, పదిసార్లు ఆలోచించి ఒక పని చెయ్యండి. మనం మంచి వాళ్లను తలపెట్టుకోకుండా ఎప్పడూ చెడ్డవాళ్లనే తలపెట్టుకుంటాము అనుకోండి ఎప్పడు వాళ్లే జ్ఞాపకం వస్తూ ఉంటారు. కోరికలు నెరవేరే కొలది దేహం నేను అనే బుద్ధి పెరుగుతుంది. మన కోరికలు అన్నీ నెరవేరుతున్నాయని సంబరపడిపోతాము. కానీ మీరు లోపల కుళ్లిపోతూ ఉంటారు. జరిగేది ఇదే. సంసారమనే పెద్ద

చెట్టుకు బీజం 'కామం'. అందులో నుండే కోరికలు వస్తూ ఉంటాయి. దానిలో నుండే కోపం, కామం వస్తూ ఉంటాయి. ఇది మహా శని అన్నాడు కృష్ణ పరమాత్మ. భయం, కోపం, కోరిక ఉన్నవాళ్ళు సరాసరి నరకానికి వెళ్ళిపోతారు. నిజమైన 'ఉండటం' అంటే మనస్సుకు, శరీరానికి, దేవతలకు దేవుళ్ళకు, లోకాలకు అతీతంగా ఉండటమే. నీలో పవిత్రత ఉంటే నీకు బాహ్యంగా శత్రువుగా ఉన్నవాడు నీకు రెండు చేతులు ఎత్తి నమస్కరిస్తే అతనిలో మార్పు వస్తుంది. విషయాల మీద మనస్సులో ఉన్న రుచులు స్వప్రయత్నంతో పోగొట్టుకోవాలి. పది లంకణాలు కడితే విషయభోగాలు మీద ఆసక్తి లేకపోవచ్చు అది తాత్కాలికం. రోగం తగ్గిన తరువాత మరలా అంతా మామూలే. మీరు, మేము ఒక్కటే అన్న సంగతి తెలియకపోవడం వల్లనే ద్వేషించడం జరుగుతుంది. బుద్ధుడు ఈ మూడు రత్నాలను జ్ఞాపకం పెట్టుకోండి అన్నారు. 1. శీలాన్ని పోగొట్టుకోవద్దు. 2. దయను విడిచి పెట్టవద్దు. 3. ఎదుటివారి క్షేమాన్ని కోరడంలో పేదరికం ఎందుకు? కొందరి కళ్ళు కక్షతో, ద్వేషంతో నిండిపోతాయి. విషం కక్కుతారు. సాధువుల కళ్ళు వెన్నెలలా చల్లగా ఉంటాయి. అలా ఉండాలి సాధకుడు. 4. వివేకం, ప్రజ్ఞ విడిచిపెట్టకు. పరాయిబుద్ధి చాలా ప్రమాదం. ఈ మూడు త్రిరత్నాలు అంటారు. బుద్ధుడు భగవంతుని పేరు ఎత్తడు. మనిషిని మనిషిగా చూస్తాడు. నీ బాగు ఏదో నీవు చూసుకో. ఈ సృష్టి ప్రారంభమైన తరువాత సమాజంలో కన్నీళ్ళు అన్నీ ఒకచోట పోగుచేస్తే సముద్రంలో ఎంతనీరు ఉందో అన్ని కన్నీళ్ళు ఉంటాయి. నేను ఈ సృష్టిలో కన్నీళ్ళు రాకుండా చెయ్యడానికి వచ్చాను" అన్నారు. భక్తి, కర్మానుష్టానం అవసరం. నామ స్మరణ వల్ల మీ మనస్సు పవిత్రం అవుతుంది. మీకు స్వప్నాలు లేని నిద్ర వస్తుంది. కాలం కలసి వస్తుంది. పరమేశ్వరునితో అనుబంధం ఉంటే సూక్ష్మదృష్టి కలుగుతుంది. ఇతరులు నిన్ను పీడిస్తూ ఉంటే తట్టుకోవడం చాలా కష్టం. కానీ తట్టుకుంటే ఈశ్వరుని దయ కలుగుతుంది. ఈశ్వర దయ తప్పించి ఈ సృష్టిలో ఏదీ లేదు. ఉంది అనుకుంటే అది అంతా





మాయ. గురువుకు వీడికి మనం బోధించాలి అనే బుద్ధి కలిగేలా మన ప్రవర్తన ఉండాలి.

73. కబీర్ "మిమ్మల్ని ఎవరైనా విమర్శించినా అవి చైతన్యం వరకు వెళ్ళవు. వాటి గురించి కలత చెందకు. నీ ప్రారబ్ధం అంతే. ఎవరైనా నిన్ను బాగా విమర్శిస్తే నీవు వెళ్ళి వాళ్ళ ఇంటి ప్రక్కన ఇల్లు అద్దెకు తీసుకొని జీవిస్తే వాళ్ళ తిట్ల వల్ల నీ ప్రయత్నం లేకుండా నీ దేహభావన పోతుంది" అన్నారు. మీ అందరికీ ఆత్మానుభవం కలుగుతుంది. ఆయన ఎలా అనుగ్రహించాలో అలా అనుగ్రహిస్తాడు. ఏ సంకట పరిస్థితులు కల్పిస్తాడో మీకు తెలియదు. గురువు పట్ల విశ్వాసం పెంచుకుంటే నూటికి 90 మార్కులు మీకు వస్తాయి. "నీవు లోకాన్ని అంతా సంపాదించినా, ఎన్ని ఘనకార్యాలు చేసినా, ఎంత వైభవంగా జీవించినా, ఆత్మజ్ఞానం సంపాదించకపోతే అవి అన్నీ వ్యర్థం" అన్నాడు ఏసు. వాలి మరణ సమయంలో వాలి భార్య "నీవు కోపం వల్ల, నీ సోదరుడు కామం వల్ల పాడైపోయారు. ముందు మన సంసారం పాడు చేసుకున్నాము" అన్నది. ఐకమత్యం లక్ష్మితో సమానం. మనం ఎవరినీ ప్రేమించలేము, కామిస్తాము. కానీ ప్రేమించినట్లు నటిస్తాము. నటిస్తే జీవ లక్షణాలు పెరుగుతాయి. జీవ లక్షణాలు పోయిన తరువాతే మనకు సత్యం దర్శనమవుతుంది. అప్పడు సమాజాన్ని ప్రేమించగలము. శాంతి లేనివాడు ఎవరినీ ప్రేమించలేడు. నేను బ్రహ్మము కంటే వేరుగా ఉన్నాను అనే తలంపుని విడిచిపెట్టడమే నీ సాధన యొక్క లక్ష్యం. దానివల్ల శాశ్వతమైన శాంతి సంప్రాప్తమవుతుంది. నిరాడంబరంగా జీవించడం వలన ఆధ్యాత్మికంగా ఔన్నత్యం కలుగుతుంది. సత్వగుణం మంచి స్నేహితుని వంటిది. పని చేసి మరచిపోతే సత్వగుణం కలుగుతుంది. అవమానాన్ని సహించగలిగితే సత్వగుణం పెరుగుతుంది. మాటలోనూ, పనిలోనూ, తలంపులోనూ దయకలిగి ఉండండి. విమర్శలను భరించడం, క్రమశిక్షణ అది సాధకునికి ఉంటుంది. మూడు గుణాలకు తల్లి మాయ. వాటిని దాటినవాడు మాయను దాటుతాడు. కష్టాన్ని - సుఖాన్ని మీరు తాకకుండా ముందుకు

వెళితే మాయ మీకు దారి ఇస్తుంది. దానితో తాదాత్మ్యం పొందుతూ ఉంటే మాయ మీ పీక పట్టుకొంటుంది. సత్వగుణాన్ని అభ్యసిస్తే రాగ-ద్వేషాలనే సుడిగుండం నుంచి విడుదల పొందవచ్చు. సత్త్వగుణం వల్ల మోహం నశిస్తుంది. మంచితనానికి తలవంచి నమస్కరించాలి. అది అమృతానుభవమునకు పునాది. అనుకూలమైన సతి, నచ్చిన ఉద్యోగం లేకపోయినా సౌమ్యంగా ఉన్న వాడిని సుఖం అంటిపెట్టుకొని ఉంటుంది. దేహం కూడా నీడ వచ్చినట్లు వారి కూడా నమ్రత ఉంటుంది. నిప్ప మీద చేయి పడితే నొప్పి ఎంత తీవ్రంగా ఉంటుందో నీ స్వభావాన్ని మార్చుకునేటప్పడు అంత బాధగా ఉంటుంది. అప్పడు నీవు తట్టుకోవాలంటే అర్హత, యోగ్యత ఉండాలి. దానికి సత్కర్మ, పూర్వజన్మ పుణ్యబలం ఉండాలి. అంత పునాది ఉంటే నీవు తట్టుకో గలవు. భక్తిని పెంచుకోవాలి. ఆత్మజ్ఞానం సంపాదించాలి అంటే సరిపోదు. ఒక ప్రక్క ఆత్మజ్ఞానాన్ని సంపాదించు కుంటూ రెండవ ప్రక్క గుణ సంపదను పెంచుకుంటూ రావాలి. అది లేకపోతే ఫలితం లేదు.

74. "గౌరవం కోసం ప్రాకులాడే వారి సలహాలు తప్పగా ఉంటాయి. కాబట్టి వారి సలహాలను తీసుకోకూడదు" అని రీసెర్చిలో తేలింది. జప ధ్యానములు లేకుండా మనస్సును బహిర్ముఖానికి వదిలేస్తే వాడి వాసనను బట్టి మనస్సు బజారులోనికి పరిగెత్తుకొని పోతుంది. మనస్సును నియంత్రించుకోవాలి. మనకి భగవంతుణ్ణి పట్టుకోవాలని లేదు. మన బాహ్య గొడవలతోటి, ధనం, అధికారంతోనే తాదాత్మ్యం పొంది ఉన్నామని, వీడికి మనం అక్కర్లేదు అని భగవంతుడు మనలను పట్టుకోడు. పట్టుకుంటే ఆత్మజ్ఞానం వచ్చేస్తుంది. "మీకు ఎక్కడైనా భరించలేని దుర్వాసన వస్తుంటే మీరు అక్కడ కూర్చోలేరు. కంగారుపడి బయటకు వెళ్ళిపోతారు. మరి లోపల దుర్గంధం ఉన్నా మనుషుల దగ్గర కూర్చుంటున్నారు. అది మీకు తెలియడం లేదు" అన్నాడు బుద్ధుడు. అలాంటి మనుషుల దగ్గర కూర్చుని స్నేహం చేస్తే ఆ అలవాట్లలో పడిపోయి సాధన మానేసి బ్రష్టులు అవుతారు. చేతులతో దేవునికి నమస్కారం పెట్టండి. నోటినిండా భగవంతుని నామాన్ని





జపించండి. అది శ్రద్ధగా, భక్తిగా ఏకాగ్రతతో మనం ఉద్ధరించబడాలనే తపనతో చేస్తే మీరు పరమహంసలు అవుతారు. వంద కుటీరాలు నిర్మించి దానం చేసినా, వందకోట్లు దాన ధర్మాలు చేసినా, మీరు జ్ఞానం పొందితే కొన్ని కోట్లు మంది బాగుపడతారు. ఆత్మసాక్షాత్కారం ఎవరికి కలుగుతుంది అంటే తన జీవితాన్ని భగవంతునికి అంకితం చేసిన వానికి. బాపూజీ జీవితం సమాజ రూపంలో ఉన్న భగవంతునికి అంకితం చేసారు. పదిమంది ఉన్నప్పడు అందరూ పెద్ద మనుషులే. ఒంటరిగా ఉన్నప్పడు ఏ తలంపులు వస్తున్నాయి? చూసుకుంటూ ఉండాలి. అది పెద్దరికం. చెడు తలంపులు వస్తే ఇలా ప్రార్థించండి. నాకు ఇటువంటి తలంపులు రాకుండా చెయ్యి. నిన్ను తెలుసుకోవడానికి ఉపయోగపడే తలంపులు నాకు కల్పించు తండ్రీ" అని ప్రార్థించు. ఎదుటివాళ్ళు మెచ్చుకోవడానికి మంచితనంగా ఉండటం నిజమైనదికాదు. మంచితనం సహజంగా ఉన్న వారికే బ్రహ్మానుభవం కలుగుతుంది. "ఎవరిని గురించి బాధ పడకూడదో, ఏడవకూడదో వారి గురించి ఏడవకు. నీవు వాళ్ళ గురించి బాధపడటమేమిటి?" అన్నాడు పరమాత్మ. మాయను తట్టుకోలేని వానికి ఈశ్వర దర్శనం ఎలా కలుగుతుంది? హృదయంలో నుండే ప్రేమ వస్తుంది. మనస్సులోంచి కోరిక వస్తుంది. ఎవరి సమక్షంలో నీకు శాంతి, సుఖము వస్తున్నాయో వారి సన్నిధి కోరుకోవాలి. సైకిల్ నేర్చుకునేటప్పడు చాలాసార్లు పడిపోతాము, దెబ్బలు తగులుతాయి. అలాగే నడక నేర్చుకునే పిల్లవాడు పడిపోయినా, దెబ్బలు తగిలినా నడక నేర్చుకోవడం మానడు. అలాగే ఆధ్యాత్మిక సాధనలో విఫలం చెందవచ్చుకానీ సాధన విడిచిపెట్టకూడదు.

75. ఇక్కడ మాటలు అక్కడా, అక్కడ మాటలు ఇక్కడా చెబుతూ ఉంటే అది తప్ప అని నీ హృదయం చెబుతుంది. అది వినాలి కదా! లేదా నీ తలకాయ ఎందుకు? దేవుని దగ్గర ఈ మాటలు ఎలా చెల్లుతాయి. "లాజిక్ అంతా తలకాయలో ఉంది. నీ తలకాయ పాడైపోవడానికే ఆ లాజిక్" అన్నారు ఐన్‌స్టీన్. అందరి క్షేమం కోరుకోవడం లేదు అంటే లోపల దోషం

ఉండటం వల్లనే. మనో నిగ్రహం ఉంటే శారీరక సౌకర్యాలు సరిగా లేకపోయినా సుఖంగా ఉండగలరు. మేడల్లో ఉండి ఏడ్చేవారు, తాటాకు ఇంట్లో ఉండి సుఖంగా నిద్రించేవారు ఉన్నారు. ప్రపంచంలో దోషాలు శోకాలు చూస్తూ ఉంటే మీకు వైరాగ్యం కలిగి లోకం అనిత్యం. అసుఖం అని గ్రహిస్తారు. ఒక మహా సర్పం వచ్చి మీ శరీరాన్ని చుట్టబెట్టుకుంటే మీరు దాని నుంచి అయినా బయటకు రాగలరు కానీ అహంకారంలోంచి బయటకు రాలేరు. కోరిక, కోపము, లోభిత్వము ఇవి నిన్ను చంపకముందే వాటిని నీవు చంపెయ్యి అంటోంది శాస్త్రం. కోపాన్ని నీవు చంపలేదు అనుకో అదే వచ్చి ఏదో ఒక రోజున నిన్ను చంపేస్తుంది. అసూయను నీవు చంపకపోతే ఆ అసూయవల్ల నీవు కాలి చనిపోతావు. సాధన దగ్గర శ్రద్ధ కావాలి. మీ ఇంట్లో ఎవరైనా పోతే శ్రాద్ధకర్మలు చేయండి. ఇక్కడ మీరు అన్నం ముద్ద పెడితే మీ పూర్వీకులు అప్పటికి ఏదో జన్మలోకి వెళ్ళిపోయారు అనుకోండి మీరు పెట్టిన అన్నాన్ని ఈశ్వరుడు వారు తినే ఆహారంగా మార్చి వారికి పెడతాడు. జంతు జన్మలు అయితే పచ్చగడ్డిగా మార్చి పెడతాడు. మీరు పెట్టింది ఏదో రూపంలో అందుతుంది. దానికి ఒక వ్యవస్థ ఉంది. అది పితృ యజ్ఞము. ఆప్తులు అంటే చుట్టాలు, స్నేహితులు కాదు. ఎవరికి అయితే ఇంద్రియ నిగ్రహం, మనో నిగ్రహం ఉంటుందో, ఎవరైతే మన క్షేమాన్ని కోరతారో ఎవరైతే తపస్సు చేసి పవిత్రులు అయ్యారో వారి వాక్యాలు ఆప్తవాక్యాలు. సమర్థత ఉన్నవాడు గౌరవాన్ని కోరుకోడు. వాడి సమర్థత మీదే ఆధారపడతారు. గౌరవం అనేది బానిసత్వం. గౌరవం వదిలేస్తే లోక వాసన పోతుంది. బాహ్యంగా సుఖపడటం కాదు ఆత్మసుఖం మీకు అందుతుంది. ఒక వేశ్య యొక్క దాస్యం నుంచి బయటకు రాగలడు. కానీ కీర్తికాంక్షలో నుండి బయటకు రాలేడు. అది మనస్సును అదుపులో లేకుండా చేస్తుంది. బుద్ధిమంతుడికి ప్రచారం అక్కర్లేదు. నిన్ను మరియొకరు పొగిడినా లేదా నిన్ను నీవు పొగుడుకున్నా అల్లరే కానీ ఏమీ ప్రయోజనం లేదు. యశోద నిద్రిస్తున్న కృష్ణుణ్ణి నిద్రలేపడానికి ఇలా పిలిచేది.





"గోవిందా, దామోదరా, మాధవా తెల్లవారింది గోవులను మేతకు తోలుకొనివెళ్ళాలి" అని. కనీసం మనం ప్రాణ ప్రయాణ టైంలో ఈ నామాలను స్మరించుకుంటూ ఉంటే తరిస్తాము. దేహానికి ప్రారబ్ధం వస్తే రంతిదేవుడు చలించలేదు, అది ఆయన గొప్పతనం. "ఏ ప్రారబ్ధం అనుభవించడానికి ఈ శరీరం వచ్చిందో ఆ ప్రారబ్ధమే ఈ శరీరాన్ని పోషిస్తుంది" అన్నారు. ఆయన కష్టసుఖాలకు చలించలేదు. కష్టం వస్తే ప్రారబ్ధానికి వచ్చింది అనుకునేవారు.

76. రామకృష్ణ పరమహంసగారిని ఎవరైనా పరీక్షించడానికి వస్తే "నన్ను పరీక్షించడానికి, ఇంకా పరిశుద్ధుణ్ణి చేయడానికి అమ్మ పంపిస్తున్నది" అనేవారు. పరిపూర్ణ శరణాగతి అదే. బ్రహ్మం గురించి నాకు తెలియడం లేదు అనడం వేరు, బ్రహ్మమే లేదు అనడం వేరు. ఏదో ఉంది. నాకు తెటలయడం లేదు అనుకునే వాడు దాని గురించి ప్రయత్నం చేస్తాడు బాగుపడతాడు. అసలు ఏమీ లేదు అనుకునే వాడు బాగుపడటం కష్టం. జాగ్రదవస్థలో మనస్సు స్థిరత్వం ఏకాగ్రత సంపాదిస్తే అప్పుడు సమాధి వస్తుంది. మనకు అనుకూలమైన మాట విన్నా, ప్రతికూలమైన మాట విన్నా వాటిని లోపలకు తీసుకోకూడదు. బయటే వదిలేయాలి. అప్పడే మనస్సుకు ఏకాగ్రత కుదురుతుంది. బ్రహ్మాన్ని గురించి శాస్త్రం చెప్పినది వినడం వేరు, అనుభవం వేరు. సాధనకు ఉపయోగపడే అంశం భాగవతంలో గజేంద్ర మోక్షం. భగవంతుడు నీకోసం పని చెయ్యడు. నీవు ఆయన కోసం ప్రయత్నం చేస్తే నీతోపాటు ఆయన పనిచేస్తాడు. అంటే ప్రయత్నం అవసరమని అర్థం. రైలు గమ్యాన్ని చేరిన తరువాత పెట్టెలను వదిలేసి ఇంజిన్ వెళ్ళిపోతుంది. అలాగే గతంలో జరిగిన సంఘటనలను మనస్సులో నుంచి వదిలేస్తే నిశ్చలంగా ఉంటావు. మనలను మనం బాగుచేసుకోవాలి అని అనుకొన్నప్పడు ఈశ్వరుడు మనకు ఇష్టమైన వారితో తిట్టిస్తాడు. ఆ విషయం తెలియక వారిపై కోపం తెచ్చుకుంటాము. ప్రారబ్ధాన్ని ఆపే శక్తి నీకు లేదు. అది వరదలా వచ్చి మిమ్మల్ని కొట్టేస్తుంది. ఆపడానికి ప్రయత్నం చేసినా ఆగదు. ఆ ప్రారబ్ధాన్ని దేహానికి వదిలేసి మనస్సుని ఈశ్వర పాదాల చెంత పెడితే ఆ

దెబ్బలు మీకు తగలవు. జీవుడు ఈ పని తక్కువ, ఆ పని ఎక్కువ అనుకొంటాడు. దేవుడు అలా అనుకోడు. కాబట్టి మనస్సును మచ్చిక చేసుకొని జీవితాన్ని సత్యం వైపుకు మళ్ళించుకోవాలి. చైతన్యంలో మనం మేల్కొన్నప్పుడు మనస్సును శక్తివంతంగా అది లోపలకి లాగేసు కొంటుంది. అప్పుడు ఎటుచూసినా శాంతే. ప్రపంచంలో ఏం జరుగుతున్నదో తెలుసుకొనవచ్చును. కానీ హృదయంలో ఏంజరుగుతున్నదో తెలుసుకోవడం కష్టం. దీనికి లోతైన ధ్యానము కావాలి. "సిగ్గు, అభిమానం విడిచిపెడితే కోట్లు సంపాదించవచ్చు. ఎన్నో భోగాలు అనుభవించవచ్చు" అన్నారు రాజేంద్ర ప్రసాద్. బతృహరి "వాడు అలా ప్రవర్తించాడు, వీడు ఇలా ప్రవర్తించాడు అని ఎందుకు అనుకోవడం. గుణాల దోషాల వల్ల, నక్షత్ర దోషాల వల్ల అలా ప్రవర్తిస్తారు" అన్నారు. తొందరపాటు, ఓర్పు లేనివాడు నక్షత్ర శాస్త్రాన్ని అర్థం చేసుకోలేడు. అందులో లోతైన విషయాలు ఎన్నో ఉన్నాయి. శంకరులు "కక్కిన అన్నంపై ఎవరికైనా దృష్టి ఉండదు. అలాగే నీకు దేహం నేనుకాను అనే అనుభవం నీకు కలిగితే శరీరంతో కూడిన అనుభవాలను నీవు అల చూస్తావు. దున్నపోతు మెడలో దండ వేస్తే అది ఉన్నా, ఊడినా దానికి లెక్కలేదు. అలాగే ఆత్మానుభవం పొందిన వాడికి దేహం ఉన్నా, పోయినా లెక్క చెయ్యడు" అన్నారు. "దుఃఖం అంతంలో సుఖం ఉంటుంది" అన్నారు షేక్స్‌ఫియర్. ఒక తల్లితో కూతురు "నేను చచ్చిపోతాను అంటే నీ ప్రారబ్ధంలో చనిపోయే యోగం ఉంటే చనిపో నేను సుఖంగా ఉంటాను" అన్నది. పిరికితనం నిర్ణయాలు తీసుకోలేదు. అప్పటికప్పడు సమాధానంతో ఆ సమస్య తీరిపోతుంది. అంతేగానీ బ్రతిమలాటలు, బుజ్జగింపులతో సమస్యలు పరిష్కారం కావు. పీడించే సంతానం కంటే పిల్లలు లేకుండా ఉండటమే మంచిది అనుకొంటారు.

77. ఈశ్వర సంకల్పం ఉంటే ఎవరు చెడగొట్టాలన్నా పని జరిగి పోతుంది. కోపంగా ఉన్నప్పడు మాట్లాడటం మానెయ్యాలి. లేకపోతే పొరపాటు మాటలతో క్షమాపణ చెప్పకోవలసి వస్తుంది. శాస్త్రాన్ని ప్రమాణంగా





పెట్టుకొని పనిచేస్తే (జీవిస్తే) నీకు దోషాలు అంటుకోవు. ఇతరుల మార్గాలలో నీవు ఆలోచించకు. నీ ధర్మాన్ని విడిచిపెట్టవద్దు. పవిత్రుణ్ణి అగ్నిహోత్రంతో పోలుస్తారు. భగవంతుని మీద ప్రీతి, విశ్వాసము ఎప్పడైతే తగ్గిపోతుందో అప్పడు ఇంద్రియాలను, మనస్సును జయించలేము. ఆయన మీద విశ్వాసమే మనోనిగ్రహానికి సహకరిస్తుంది. మనం గుడికి వెళ్ళినప్పడు ప్రసాదం పెడతారు అది ఏ రకమైన ప్రసాదం అయినా ఇష్టంగా స్వీకరిస్తాము. అలాగే మీకు ఏ రకమైన ప్రారబ్ధం వచ్చినా ఇష్టంగా స్వీకరించాలి. స్వతంత్రంగా బ్రతకండి. అవకాశం ఉన్నంతలో ఎవరికైనా సేవ చెయ్యండి. లోక క్షేమం కోసం మనలను మనం అర్పించుకొని చేస్తే అది యజ్ఞం అవుతుంది. దాని వల్లనే మనస్సు నిర్మలమవుతుంది. ఆత్మానుభవానికి మనస్సు సమాయత్తం అవుతుంది. మీ చేతులు పనిమీద ఉండాలి, మనస్సు భగవంతుని మీద ఉండాలి. బాగుపడవలసినది మనస్సు. న్యూటన్ "సాధనతో కూడిన శ్రద్ధ కావాలి, సహనంతో కూడిన శ్రద్ధ కావాలి. శక్తిపాతం లేకుండా ఆత్మజ్ఞానం కలుగదు. అది నీ హృదయంలోనే ఉంది" అన్నారు. మన ఆలోచనా శక్తి బ్రహ్మం మీద కేంద్రీకరించాలి. మీరు ప్రశాంతంగా ఉన్నప్పడు భగవాన్ కళ్ళలోకి పది నిమిషాలు చూడండి. మీ పని పూర్తి అయిపోతుంది. మీరు పెద్ద పెద్ద పుస్తకాలు చదవక్కర్లేదు అలా చేస్తే సరిపోతుంది. మనస్సు నిశ్చలమవుతుంది. మీరు గంటల తరబడి ధ్యానం చెయ్యండి. ఒక్క అంగుళం లోపలకి వెళ్ళండి. అప్పడు అంతర్ముఖ ప్రయాణం ఎంత కష్టమో తెలుస్తుంది. మోసేవాడికే బరువు తెలుస్తుంది. మొయ్యని వానికి బరువు తెలియదు. మీరు సాధన చేస్తే మెలకువలు తెలుస్తాయి. ఐన్‌స్టీన్ "బుద్ధితో చేసే పని నాది. నా స్వభావానికి అనుగుణంగా చేసేదే స్వధర్మం. పరాయి వారు చేసే పనిని అనుకరించడం పర ధర్మం" అన్నారు. కోరికా, కోపం కన్నా భయం ప్రమాదమైనది. భయం వల్లనే వివేకం తగ్గి గుండె వేగంగా కొట్టుకొంటుంది. జంతువులకు మనిషిలోని వాసనలు పసిగట్టే శక్తి ఉంటుంది. భయం అనే వాసన ప్రాచీనమైనది. మనలో

మలిన వాసనలు బుసలు కొడుతూ ఉంటాయి. బుద్ధుని చూచిన పులి వారిలో భయం లేదని, చూపు ద్వారా గ్రహించి వెనక్కి వెళ్ళిపోయేవి. భయపడే వారి మీదకే పులులు వస్తాయి. "మీకు స్థలాలు ఉన్నా, సంతానం బాగా చదువుకున్నా వాటి దగ్గర విశ్రాంతి తీసుకోకండి. నాయందే విశ్రాంతి తీసుకోండి" అని వాసుదేవస్వామి చెప్పారు. ఎందుకంటే అవి నిజమైనవి కావు. మార్పు చెందే అవకాశం ఉంది. దానితో దుఃఖం వస్తుంది. భయం వల్ల శక్తి తగ్గిపోయి పీనుగులు అవుతారు. "అసత్యానికి, దుర్మార్గానికి గాలి కొడతారు కొందరు" మనం మంచి తనానికి గురుప్రేమకు గాలి కొట్టాలి. ఎవరైనా ఒక వాక్యం మాట్లాడుతున్నప్పుడు అది వారి అనుభవమా? చిలుక పలుకులా? అని గ్రహించాలి.

78. మీ మనస్సుతో మీరు బంధుత్వం కలిగి ఉండండి. వ్యతిరేకం కాకండి. దాన్ని మీ ఆధీనంలో ఉంచుకోండి. అంతేకానీ కుళ్ళిపోయేలా చేసుకోకండి. ఐన్‌స్టీన్ "అందరి తలకాయ వంటిదే ఈ తలకాయ నా నుండి వచ్చే ఆలోచనలు అన్నీ దేవుని దగ్గర నుండి వచ్చేవే. మీరు దేవుని ధ్యానం చెయ్యండి" అన్నారు. సామాన్య సంసారంతో ఉన్నవారే సాధారణంగా ఎవరికో ఒకరికి సాయం చేస్తూ ఉంటారు. డబ్బు పెరిగిన తరువాత అంతకు ముందు ఉన్న వితరణ తగ్గిపోతుంది. వివేకానంద "మీరు ఏదైనా మంచి పని చెయ్యాలన్నా మామూలు మధ్య తరగతి ప్రజల మీదే ఆధారపడండి. ధనవంతుల మీద ఆధారపడవద్దు" అన్నారు. ఇంట్లో ముసలివారు ఉంటారు. వారు మన మీద ఆధారపడి ఉంటారు. "నీవు ఉద్రేకాలు, కక్షలు ఉన్నప్పటికీ నన్ను పొందడానికి వాటిని తగ్గించుకో" అన్నాడు. మీ శరీరాన్ని భోగాలకు ఇచ్చేసి, మీ మనస్సును లోకంలో ఉన్న ఆకర్షణలకు ఇచ్చేసి మీరు ఎప్పుడు సాధన చేస్తారు? మీ ఇష్టం వచ్చినట్లు మీరు ఉంటే మరణం ఆగుతుందా? వికారంలో ఉన్న మనస్సు రామనామం చేస్తే నిర్వికారమౌతుంది. సత్యానికి సంబంధించిన సుఖం మీకు తెలియాలి. గురువు పట్ల కృతజ్ఞత కలిగి ఉండాలి. సాధకుడు దేహం, మనస్సు పరిశుద్ధంగా ఉంటే గానీ ఆత్మజ్ఞానం





కలుగదు. మనస్సు ఒక దెయ్యం. మీరు దానికి ఏదో ఒక పని చెప్పకపోతే అది మిమ్మల్ని తినేస్తుంది. ఒకడు దేవుని గురించి తపస్సు చేసి అన్ని పనులు చేసే దెయ్యాన్ని ఇమ్మన్నాడు. అది సమకూరింది. అది అన్ని పనులూ చేసేస్తుంది. పని చెప్పకపోతే నన్నే తినేస్తుందని ఆయన ఒక గెడను పాతి క్రిందికి, పైకి తిరగమని దాని పీడ వదిలించుకున్నాడు. అలాగే మనస్సును శ్వాస మీద పెడితే దాని పీడ వదిలించుకోవచ్చును. నీరు లేని చెరువుకు విలువ లేదు. డబ్బులేని వానికి బంధువులు ఉండరు. అలాగే తత్త్వం తెలిసిన వానికి బంధువులు, సంసారం ఉండదు. బహిరంగ సాధన అంటే పూజ, అభిషేకం, ధూప, దీప, నైవేద్యాలు. అంతరంగ సాధన అంటే విచారణ ద్వారా భగవత్ తత్త్వాన్ని తెలుసుకోవడం. గీతలో ఈ వాక్యం మరచిపోకుండా ధ్యానం చెయ్యండి. "సర్వత్ర సమ బుద్ధి కలిగి ఉండండి. అన్ని భూతాల హితం కోరండి" అని. ద్వంద్వాలలోంచి బయటకి రావడమే సాధన. భక్తి మార్గంలో ఉన్నవారు బాహ్య అర్చన చేస్తారు. జ్ఞానమార్గంలో ఉన్నవారు అంతరంగాన్ని శోధన చేస్తారు. ఆధ్యాత్మిక మార్గంలో మనస్సుతో చేసే దృఢ సంకల్పమనే సత్సంకల్పానికి ప్రయోజనం, మేలు ఎక్కువగా ఉంటుంది.

79. వివేకం అంటే ఇది చెడు తలంపు, చెడు పని అని తెలిసి ఉండాలి. అందులో పడకుండా జాగ్రత్త పడాలి. అలాగే విషయాలు తెలియాలి. వాటిపట్ల ఆకర్షణ కలుగకూడదు. నిరంతరం నీ కామ్య కర్మల గురించే నీవు ఆలోచిస్తూ ఉంటే నీ యోగక్షేమాల గురించి ఈశ్వరుడు ఆలోచించడు. నీకు ఎప్పుడూ అంతర్ దృష్టి కలుగదు. స్వార్థాన్ని ఒకోసారి తగ్గించుకోలేము. క్రమక్రమంగా తగ్గించుకోవాలి. భౌతిక భోగాలపై కించిత్తు ఆశ ఉన్నా నిర్వాణ సుఖం దొరకదు. గీతలో పరమాత్మ "నీ పూర్వ జన్మలు తెలుసు, భవిష్యత్తులో ఏ తల్లిదండ్రులకు పుడతావో తెలుసు. ఏ సంతానాన్ని కలిగి ఉండాలో నీ కర్మ పరిపాకానికి తగ్గ సంతానాన్ని నీకు సమకూర్చాలి. నీ పరిసరాలు, నీ పొరుగు ఎక్కడ ఏర్పాటు చెయ్యాలి అనేది నేను నిర్ణయిస్తాను. నీకు స్వేచ్ఛ లేదు" అన్నాడు. ఈ ప్రపంచంలో గర్వ పడడానికి

ఏముంది? పరమాత్మను మరచిపోకండి. ఈ జీవుడి తండ్రి ఈశ్వరుడే ఆయన్ని పొందేవరకు జన్మలు తప్పవు. జీవుడు ఆయన అంశే. అసలు మీరు లేరు.. నాది అనుకొన్నది ఏదీ నీది కాదు. కర్మ ఫలితానికి కారకుడవు కాకుండా ఉండు. అలా ఉంటే మంచి చెడు కర్మల ఫలితం నిన్ను చుట్టుకోవు. లేకపోతే చుట్టుకుంటాయి. అలాగని కర్మలు మానకు, ఫలకాంక్ష లేకుండా పనిచెయ్యి. పని చేసేటప్పుడు ఈ నేర్పు ఉంటే అది యోగంతో సమానం. ద్వంద్వాలలో కూడా నిశ్చలత్వంగా ఉంటే మీలో పక్వత ఉంది అని అర్థం. కామ, క్రోధాలు ఎక్కువగా ఉంటే సాధన చెయ్యలేరు. మీరు ఎవరికైనా సలహా చెబితే మీ మాట వినరు. కారణం వారి ప్రారబ్ధం మరో రకంగా ఉంటుంది. కాబట్టి ఇతరుల విషయాలలో జోక్యం పనికి రాదు. బుద్ధిమంతుడు అయినవాడు కర్మలో అకర్మను, అకర్మలో కర్మను చూస్తాడు. కృష్ణునికి కర్మల మీద ఆసక్తి లేదు. మరియు కర్మ ఫలితంపై ఆసక్తి లేదు. అలా చేస్తే కర్మ మనలను చుట్టుకోదు. అహంభావన లేకుండా చేస్తే అది అకర్మ అంటే నీవు చేసినా చెయ్యని వాడితో సమానం. మధ్వాచార్యులు "నీవు పని చేస్తున్నావు, దేవుడు పని చేస్తున్నాడు నీవు ఈ పని 'నేను' చేసాను అనుకొంటున్నావు. దేవుడు అలా అనుకోడు. కారణం దేవునికి ఇతరులు లేరు. అది అకర్మ. అది ఆయనకే సాధ్యం. నీవు కూడా అలా చేస్తే నీకు దుఃఖం రాదు" అన్నారు. స్వప్నం మన స్వాధీనంలో లేదు. వాసనలను బట్టి భగవంతుడే ఆ స్వప్నాన్ని కల్పించాడు. స్వప్నంలో పనిచేయడం లేదు. మంచం మీదే పడి ఉన్నావు. కార్లలో, విమానాల్లో తిరగడం లేదు. దేనిని చూస్తున్నావు. అదే అకర్మలో కర్మను చూడటం. నీ జీవితం కూడా అంతే బ్రహ్మాకార వృత్తిలో నీవు మేల్కొన్నప్పుడు ప్రస్తుత జీవితాలు, గత జీవితాలు స్వప్నాలని తెలుస్తాయి. ఈ జీవిత స్వప్నం పొడవుగా ఉంటుంది. కాబట్టి నిజమనిపిస్తుంది. ముముక్షత్వం కావాలి అనుకునే వాడికి వివేకము, వైరాగ్యము, ముముక్షత్వం, ఆరోగ్యమైన మనస్సు ఉండాలి. కొందరికి ఎనభై సంవత్సరములు వచ్చేస్తాయి. ద్వేషించడం, మోసం చెయ్యడం తిరిగి వాటిలోనే పడటం. అంతకన్నా





దూరంగా ఆలోచించలేరు. వారికి మంచి ఆలోచన భగవంతుడు ఇవ్వలేదు. ఇప్పుడైనా ఈ నిజాన్ని గ్రహించి సాధన చెయ్యాలి.

80. మేము బుద్ధిమంతులమని మీరు అనుకుంటున్నారు. మీరు బుద్ధిమంతులని లోపల బ్రహ్మాం అనుకోవాలి. మీ నెత్తిమీద మీరే అక్షింతలు వేసుకోవడం ఏమిటి? ఎవరైతే పని చేస్తున్నా చెయ్యనివానిలా ఉంటాడో వాడు బుద్ధిమంతుడు. "మీరు కాశీలో రేవు కట్టించారు" అని నేను అనక ముందు మీ మనస్సు ఎలా ఉందో నేను అన్నప్పుడు కూడా అలా ఉంటే మీరు బుద్ధిమంతులు. నేను అన్నాక మీకు సంతోషం వస్తే వ్యక్తి భావన ఉన్నట్టు లెక్క. నీవు ఇతరులను బాధపెట్టవద్దు. ఇతరులు నిన్ను హింసించినా నీవు హింసకు గురికావద్దు. సహనం ఉండాలి. వారి వలలో పడకుండా ఉండటమే సాధన. ఋజుత్వం, సరళత్వం అనేవి నీవు తెచ్చిపెట్టుకున్నట్లు కాకుండా సహజంగా ఉండాలి. సర్వ సాధారణంగా మనం మాట్లాడేటప్పుడు ముందు నేను వచ్చేస్తుంది. ఆ 'నేను' తగ్గించి, ప్రక్కన పెట్టి మాట్లాడితే అది సౌమ్యంగా ఉండి ఎదుటివారి గుండెలకు పడుతుంది. తెలివితేటలు తక్కువ ఉన్నా పరవాలేదు. నిదానంగా, నెమ్మదిగా ఉండగలిగితే ఈశ్వరుడు అనుగ్రహిస్తాడు. భగవంతునికి నీకు మధ్య బేధం ఉంది అనుకొంటున్నావు. అది లేదు. నీవు కల్పించుకొంటున్నావు. ఆ కల్పితాన్ని సాధన చేసి పోగొట్టుకోవాలి. దీనినే అక్షరమణ మాలలో "నీవు నేను అణగ నిత్య ఆనంద మయముగా జీవించు అరుణాచలా" అన్నారు. అంతర్యామి పెట్టే పరీక్షలకు మనం ఆగాలి. అదే నిజమైన సాధన. గురువు నీవు పడే తిప్పలు చూస్తాడు. నీవు పక్వానికి వచ్చాక జ్ఞానాన్ని కలుగజేస్తాడు. అయితే మన సాధన మనం మానకూడదు. అసలు పని లేకుండా ఏ శరీరం ఉండదు. కాలక్షేపం అవ్వకపోతే అదే పెద్దపని. అందులో మనసు నలిగిపోతుంది. అందుకే భగవంతుని లేదా గురు నామ రూపాలను పట్టుకోవాలి. శ్రీరంగంలో నగర వీధుల్లో రంగనాధుడు ఊరేగుతూ ఉంటే రామానుజులు శిష్యుణ్ణి పిలుస్తాడు రంగడు ఊరేగుతున్నాడు చూడడానికి రా! అని పిలుస్తాడు. "రోడ్డు మీద

ఊరేగేవాడు మీకు పెరుమాళ్ళు నా పెరుమాళ్ళు మీరు నేను పాలు కాచుకుంటున్నాను. నేను రాను అన్నాడు". అది గురుభక్తికి ఉదాహరణ. ప్రపంచంలో ఎవరికీ లేని చెడ్డ ప్రారబ్ధం నీకు ఉంటే నీ మనస్సును అంతర్ముఖం చేస్తే అది ఏమీ చెయ్యదు. "సూదిలోకి దారం పెడతాము. దారంలో ఒక పోగు రేగిపోయింది అనుకోండి సూదిలోకి దారం వెళ్ళదు. అలాగే నీ మనస్సు సంసారంలోకి వెళుతూ ఉంటే నీకు బ్రహ్మానుభవం కలుగదు" అన్నారు పరమహంసగారు. మన అమ్మతో నీవు మంచిదానవు అని చెబుతూ అమ్మమాట ఒక్కటీ వినకుండా ఉంటే అమ్మ మన గురించి ఏమనుకుంటుందో అలాగే దేవుడు మంచివాడు అని చెప్పకుంటూ దేవుని వాక్యాన్ని ఒక్కటీ ఆచరించకపోతే ఆయన కూడా అమ్మలాగే అనుకొంటాడు. పునాది లేని కొంప ఎలా ఉంటుందో, విశ్వాసం లేని సాధన అలా ఉంటుంది. అందుచేత ప్రారబ్ధం ఎటుగాలి వేస్తే అటు ఎగిరిపోకుండా ఈశ్వరునిపై దృఢ విశ్వాసం కలిగి ఉండండి.

81. మనం అభివృద్ధిలోకి రావడానికి ప్రయత్నిస్తే మనలో ఉన్న వాసనలు అనే పాములు బుసలు కొట్టడానికి ప్రయత్నిస్తాయి. మన సాధన మధ్యలో ప్రారంభించాము. వాసనలు కొన్ని వేల సంవత్సరాల నుండి మన కూడా ఉన్నాయి. ఈ రోజు నీకు భగవంతుడు కావలసి వచ్చాడా? నా మాట ఏమిటి? అని మన మీద యుద్ధం చేస్తాయి. అది మనం అనుకున్నంత తేలిక కాదు. ఆత్మజ్ఞాన సముపార్జన, దానికి పూర్వజన్మ పుణ్యం, సత్కర్మ నిష్కామంగా చేసి ఉండాలి, గురువనుగ్రహం కావాలి. దేహాభిమానం ఊరికే పోదు. దానికి మూల్యం చెల్లించాలి. బట్టల షాపులోకి వెళ్ళి చీర ఊరికే ఇమ్మంటే ఇస్తాడా? దాని ఖరీదు చెల్లిస్తే ఇస్తాడు. అలాగే వైరాగ్యమనే ధనం చెల్లిస్తే దేహాభిమానం పోతుంది. నీ మనస్సు నిర్మలం చేసుకొని ఎంతోకొంత బుద్ధి సూక్ష్మతను పెంచుకొని దాన్ని వినాలి. అప్పుడు విషయం గ్రహిస్తావు. స్వార్థం లేని వానికి ఎవరి మీదా కోపం ఉండదు. నీ బుద్ధికి అది రాదు, ఈశ్వరుని ఆజ్ఞను బట్టి వస్తుంది. కొంతమందికి ఏదైనా తినాలని





ఉన్నా ఎవరినీ అడుగరు. ఈశ్వరుని ఆజ్ఞ అయితే ఎవరో ఒకరు పెడతారు అనుకొంటారు. మనిషికి రెండు చేతులే. భగవంతుడికి వెయ్యి చేతులు. రెండు చేతులు ఉన్నవాడు పెట్టకపోయినా వెయ్యి చేతులు ఉన్నవాడు పెడతాడు అనుకుంటారు. మనో చాపల్యం నూరుశాతం ఆగిపోవాలి అంటే వైరాగ్యం కావాలి. దూడను కట్రాడుకు కట్టేస్తే ఎలా పడి ఉంటుందో అలాగే జపం వల్ల మనస్సు పడి ఉంటుంది. దేహాన్ని ఏదైతే పీడిస్తున్నదో ఆ కామమే మనచేత చెడ్డపని చేయిస్తుంది. అది ఒక మహాశని. ఆ అవగాహన కావాలి. శ్రీకృష్ణచైతన్యులవారు పూజకు పూలు కోస్తుంటే ఒకరు సహకరిస్తే ఆయన్ని నీవు ఎవరు నాయనా! అనగా ఆ వ్యక్తి "నేను వేదాంత విషయాలు వింటూ ఉంటే నీవు శరీరానివి కాదు, మనస్సువి కాదు అంటున్నారు. నాకు అది అనుభవంలో లేదు. దేహమే నేను అనుకొంటున్నాను. మీకు ఏమని చెప్పను" అనగా చైతన్యులు "నీవు సత్యమే చెప్పావు. వేదాంతం చెప్పినది నిజమే దానికి తపస్సు కావాలి, సహనం కావాలి. ఇప్పుడు మనం కోసే పూల చెట్టును ఎవరో నాటారు. ఇప్పుడు ఇది ఫలిస్తున్నది. అలాగే సాధన చేస్తూ ఉంటే ఎప్పుడో ఒకప్పుడు ఈశ్వరుని దయ వల్ల 'నేను ఆత్మను' అనే అనుభవం అవుతుంది. మొక్కను నాటి శ్రద్ధగా నీరు పోసి పెంచితేగానీ పుష్పాలు రావు. అలాగే దేహాత్మబుద్ధి పోవడానికి సాధన కావాలి" అన్నారు. వాచస్పతి మిశ్రా పెళ్ళి చేసుకొని బ్రహ్మసూత్రాలకు భాష్యం వ్రాయడంలో భార్యను మరచిపోయాడు. భోజనం పెడితే తింటున్నాడు. ఇలా ఇరవై ఐదు సంవత్సరాలు గడిచిపోయింది. అప్పుడు భార్య అంది "మీరు నన్ను పెళ్ళి చేసుకున్నారు. మనకు వృద్ధాప్యం వచ్చింది. ఉత్తరకర్మలకు ఒక బాలుడు కావాలి ఎవరిని దత్తత చేసుకుందాము?" అనగా పెళ్ళి సంగతి అప్పుడు గుర్తుకు వచ్చింది. "నిజమే బ్రహ్మ సూత్రాలకు భాష్యం వ్రాసాక సంతానం ఎందుకు?" అన్నాడు. వాళ్ళ మెదడు ఎక్కడ ఉండాలో అక్కడే ఉంది. ఐన్‌స్టీన్ ఈ తరగతికి చెందినవాడే.

82. మీకు ఇష్ట-అయిష్టాలు ఉంటాయి. కారణం ఎవరు చెప్పగలరు.

అవి మనకు తెలియకుండా వస్తాయి. చేతులు లేనివాడు చెట్టు ఎలా ఎక్కగలడు? అలాగే ఇష్ట-అయిష్టాలు పెట్టుకుంటే సత్యానుభవం ఎలా కలుగుతుంది? వాసనలు పెంచుకుంటే మనస్సు ఎలా ఆగుతుంది? మనస్సు నిశ్చలమైతే అంతా ఆనందమే. మనస్సు, బుద్ధి, ఇంద్రియాలు ఏ వెలుగులో ప్రకాశిస్తున్నాయో ఆ వెలుగును మనస్సు చూడలేదు, ఆ వెలుగు పై వాటిని చూస్తుంది. మనస్సు నశిస్తే ఎటుచూసినా ఆనందమే. నటరాజు నాట్యం చేస్తూ ఉంటే ఒక పాదం మనవైపు చూపడం అంటే నన్ను ఆశ్రయించు అని అర్థం. నిప్పు మీద చెయ్యి వేస్తే కాలకపోతే అది నిప్పు ఎలా అవుతుంది. అలాగే నీకు వినయం లేకపోతే నీవు సంపాదించుకున్న విద్య విద్యా? నిజమైన ఆత్మవిద్య కలిగితే నీకు వినయం కలుగుతుంది. విద్యవల్ల అహంకారం పెరిగితే ఆ పాడైపోయే చదువు ఎందుకు? మీకు సుఖ పడాలని ఉందా? గడచిపోయిన గొడవలు అన్నీ మరచిపొండి. ఏరోజు ఎలా జరగాలో అలా జరుగుతుంది. వేదన పడకండి. మీ దేహం ఏ ప్రాంతంలో ఉండాలో ఎక్కడ చనిపోవాలో అది అంతా ఈశ్వర ప్రణాళికను బట్టి జరిగిపోతుంది. నీవు ఈ లోపు గుంజుకున్నా ప్రయోజనం లేదు. అన్నిటికీ 'కర్త' 'నేను' అని ఎందుకు ఏడుస్తావు? ఆయన కర్త అని తెలియక పోడవం వల్ల అవసరమైతేనే మాట్లాడేవారి మాటలు కఠినంగా ఉండక మృదువుగా నిర్మలంగా ఉంటాయి. ఆ మాటలు మనకు శాంతిని చేకూరుస్తాయి. ఇతరులను నిందించే వారి మాటల యొక్క ప్రభావం ఎవరి మీదా ఉండదు. ఎవరూ పట్టించుకోరు. "పంది మలం తింటుంది, మనం అన్నం తింటున్నాము. ఇంద్రియ భోగాలు అది, మనం అనుభవిస్తున్నాము. సత్యాన్వేషణ చేయకుండా చనిపోతే దానికి మనకు తేడా ఏముంది?" అన్నారు శంకరులు. కొంతమందికి తెలివి ఉంటుంది, సహనం ఉండదు. కొంతమందికి సహనం ఉంటుంది, తెలివి ఉండదు. ఆధ్యాత్మిక అభివృద్ధి పొందాలంటే రెండూ అవసరమే. మనం ఏపని చేసినా నిరాడంబరంగా, నిరహంకారంగా, నిర్మల బుద్ధితో చేస్తే నీ బుద్ధి బాగుపడుతుంది. దానికి





మించిన పని ఈ లోకంలో ఏమీ లేదు. మాటల ద్వారా, శారీరకంగా, మానసికంగా, ఎవరినీ హింసించనివాడు మహాత్ముడు అవుతాడు" అన్నారు బెర్నాడ్‌షా. వైరాగ్యం మనస్సును బహిర్ముఖం అవ్వకుండా చూస్తుంది. మనస్సు అలా స్థిరంగా ఉన్నప్పుడు అభ్యాసం చేస్తే దానికి అంతర్ దృష్టి కలుగుతుంది. జీవితంలో ఒక్కసారి ఆత్మశాంతి రుచి చూస్తే మనస్సు వేగంగా బయటకు వెళ్ళిపోతున్నప్పటికీ ఆ అనుభవం వెంటనే మరలా లోపలకు గెంటేస్తుంది. ఆ అనుభవాన్ని రుచి చూచినవారు ఎవ్వరూ దాన్ని కాదన జాలరు. అది మీకు స్పష్టంగా తెలుస్తుంది. మీరు అందరి పట్ల దయ కలిగి ఉండండి. క్రూరత్వం పనికిరాదు. వారు ఎటువంటి వారైనప్పటికీ, బాహ్యంగా మీకు ఎంత అపకారం చేసినప్పటికీ మనస్సులో వారి క్షేమాన్ని కోరుకుంటే ఈశ్వరానుగ్రహం మీకు కలుగుతుంది. కాబట్టి ఈ విశిష్టతను మీరు అలవరచుకుంటే మరణానంతరం అవి మీ కూడా వస్తాయి. మీరు తరిస్తారు. శారీరక ఆరోగ్యం చెడిపోతే ఇంక నీవు సాధనకు పనికిరావు. రాగద్వేషాల నుండి ఎవడైతే విడుదల పొందుతున్నాడో వాడు మోక్షం కోసం కష్టపడ వలసిన పని లేదు. వాడిని మోక్షం సహజంగా వరిస్తుంది.

83. ఎవరి మనస్సు అయితే పూర్తిగా ప్రకృతి మీద ఆసక్తి లేకుండా తగ్గిపోతుందో వాడి మనస్సు లోపలికి ఉపసంహరింపబడుతుంది. అక్కడ ఉన్న శాంతి జుర్రుకోవడం ప్రారంభిస్తుంది. జీవునికి మూలం బ్రహ్మమే. అందులోంచే జీవ పదార్థం వచ్చింది. మనస్సు మూలంలోకి వెళ్ళే కొలది బ్రహ్మంలో ఐక్యం అవుతాడు. నామం సహజంగా జరిగే వరకూ నామజపం చేస్తూ ఉండాలి. అంటే నీవు నిద్రలోనుండి లేచిన వెంటనే నామం గుర్తుకు రావాలి. అప్పుడు లోచూపు కలుగుతుంది. సత్యం తనలోకి లాక్కుంటుంది. మీ అమ్మాయి ఇతర దేశాలలో ఉన్నా లేదా దూరంగా ఉన్నా అమ్మాయి మీద ఉన్న ఇష్టం వల్ల సహజంగా ఆ రూపం గుర్తుకు వచ్చేస్తుంది. ఇష్టం లేకపోతే గుర్తుకురాదు. అలాగే మీకు నామం గుర్తుకు రావడం లేదు అంటే భగవంతుని మీద ఇష్టం లేదని అర్థం. జపధ్యానాలు లేని తలకాయలు

దెయ్యాల కొంపతో సమానం. చావడం, పుట్టడం తప్పించి ఏ ప్రయోజనం లేదు. సౌందర్యం రూపం ధరించి వెళుతూ ఉంటే ఎంత అందమో అనుకుంటారు. అలాగే అపకారం చేసిన వానికి కూడా ఉపకారం చేసే మంచితనం ఉన్నవారు ఉన్నారనుకోండి వారు ఎంతమంచి వారో అనిపిస్తుంది. తల్లి చంటిపిల్లను చంకను వేసుకొని కబుర్లు చెబుతూ అన్నం తినిపిస్తుంది. అలాగే మనస్సు చెడు సంస్కారాలలో ఉన్నప్పుడు మంచి మాటలతో బుజ్జగించి సత్యానుసంధానం చెయ్యాలి. ధనము, చదువు, తెలివి ప్రకృతిలో భాగాలు సత్సంఘం చేసే పనులు ఆ మూడు చెయ్యలేవు. భగవాన్ ఉపదేశాల సారం ఒక్కమాటలో చెప్పాలంటే మనస్సు లేకుండా చేసుకుంటే అప్పుడు అమనస్క స్థితిని పొందుతారు. అప్పుడు సత్యం ఎరుక పడుతుంది. అప్పుడు శరీరం మరణిస్తూ ఉన్నా తాను మరణించనని తెలుసు కుంటావు. మనం కాని మనస్సును మనం అనుకోవడం వల్ల మనం ఏదిగా ఉన్నామో అది మనకు తెలియదు. నాకంటే సర్వజ్ఞుడు నాలో ఒకడు ఉన్నాడని మనస్సు గుర్తించాలి. ఎవని బుద్ధి వికశిస్తుందో వానికి ఈశ్వరుని దయను గుర్తించడానికి అర్హత కలుగుతుంది.

84. మీరు ఏదో చదవడం కన్నా అనుష్టాన వేదాంతం ముఖ్యము. విషయచింతన నుండి ఎంతవరకూ అర్థం అయితే అంతవరకూ బయట పడడానికి ప్రయత్నం చెయ్యండి. శీలాన్ని కాపాడుకోవాలి. "శీలం లేని తెలివితేటలు, తెలివి లేని శీలం సమాజానికి ఉపయోగపడవని" ఒక ఋషి చెప్పాడు. నిన్ను నీవు పొగుడుకునే అలవాటు ఉంటే, నీలో గర్వం ఇసుమంత ఉన్నా ఆత్మసాక్షాత్కారం పొందాలనే తపన పట్టుదల నీ లోపల నుంచి రాదు. నీకు జ్ఞాన సంపద రావాలంటే గుణ సంపద ఉండాలి. మీ శరణాగతి నిజమైతే అసలు మీకు అశాంతే రాదు. నీకు ఆత్మానుభవం పొందే ముందు దేవుడు నీకు కఠినమైన పరీక్షలు పెడతాడు. నీవు తట్టుకోలేకపోతే పునర్జన్మకు గెంటేస్తాడు. ఒక వేద పండితుడు నావ మీద నదిని దాటుతూ ఉంటే నావ నడిపే వానితో "నీకు తర్క మీమాంసలు తెలుసా?" అని అడిగాడు. "అవి





నాకు రాదు" అన్నాడు. అప్పుడు ఆ పండితుడు "నీ జీవితం వృధా" అన్నాడు. కొద్ది సమయానికి నావ సుడిగుండంలో పడగా నావికుడు "స్వామీ! మీకు ఈత వచ్చా" అనగా "రాదు" అన్నాడు. "మీ జీవితం వృధా అయినది" అన్నాడు. అతను ఈదుకుంటూ ఒడ్డుకు వచ్చాడు. అలాగే ఎన్ని విద్యలు నేర్చుకున్నా అహంభావనలో కూడిన దేహాత్మబుద్ధి పోకపోతే మృత్యువు వచ్చి మిమ్మల్ని కబళిస్తుంది. మరణం చేతికి మీరు దొరికేస్తారు. సాధారణ మానవులు నిషిద్ధ కర్మల వంటి పొరపాట్లు చేస్తారు. ఆ పాపాలు పోతాయని నదులలో స్నానాలు చేస్తారు. తరువాత దేవతామూర్తుల ముందు లెంపకాయలు కొట్టుకుంటారు. మరుసటి రోజునే తప్పులు చేస్తారు. సత్పురుషులతో స్నేహాలు చేయాలనే తలంపు రావడంలేదు. బలహీనతల లోంచి బయట పడాలనే బుద్ధి రావడంలేదు. ఆత్మసముద్రంలో స్నానం చేసే వరకు ఎన్ని పనులు చేసినా ప్రయోజనం లేదు. నీ అస్థిత్వం దేహానికే పరిమితమైనప్పుడు ఎదుటి వాడు కూడా దేహంగానే కనిపిస్తాడు. అప్పుడు భయం ప్రారంభమవుతుంది. మనస్సు బయటకు వచ్చి ఇంద్రియాలకు సంబంధించిన విషయాలలో విహరిస్తుంది. దూసుకుని వెళ్లే మనస్సు వెనక్కి రావాలంటే గురువనుగ్రహం ఉండాలి.

85. నిన్ను విమర్శించేవాడిది తప్పులేదు. ఆ విమర్శకు నీవు దుఃఖం తెచ్చుకోవడం నీ తప్పు. నీ పని ఏదో నీవు చేసుకో. దుఃఖం తెచ్చుకోకుండా వివేకంగా సమాన బుద్ధి కలిగి ఉండు. పరమహంసగారు "మనలను ఇతరులు అవమానం చేసినా సహనం కోల్పోకూడదు. భగవంతుణ్ణి, ఆయన లీలలను అంగీకరించకపోతే నా మాటకు విలువ లేదు" అన్నారు. మీ ఆత్మ జ్ఞానానికి అడ్డువచ్చే తలంపులను విడిచిపెట్టడం కూడా త్యాగమే. సాధకుడు శ్రవణాన్ని సాధనగా వినాలి. నీ మనస్సును నీవు బాగుచేసుకుంటే అది నిన్ను బాగుచేస్తుంది, ఈశ్వరుని దరికి చేరుస్తుంది. మీరు బజారులో ఏదైనా వస్తువు కొన్నప్పుడు వస్తువు మన్నిక ఎలా ఉంటుంది అని చూసుకొని కొంటారు. అలాగే మీరు చేసే పనులలో విలువలు ఉన్నాయా? లేక ఆ పని

పొందడంకోసం చేస్తున్నామా అని చూసుకోవాలి. అక్కడ పని సాధించడం ముఖ్యం కాదు. దాన్ని అవలంభించే విధానం సక్రమంగా ఉంటే మీ బుద్ధి ఏకాగ్రమౌతుంది. మనస్సు బాగుపడుతుంది. దాని ద్వారా మీరు శ్రేయస్సును పొందుతారు. మనస్సుతోను, ఇంద్రియాలతోను, బుద్ధితోను ఉన్న మాయను కక్కితే ఆ ముడి తెగిపోతే అప్పుడు ఉన్న వస్తువు ఉన్నట్లు లేని వస్తువు లేనట్లు మీకు తెలుస్తుంది. కంచి పరమాచార్యుల వారిని సాధన ఎంత వరకు చెయ్యాలి అని అడిగితే “నీవు ఎక్కడికి వెళ్ళినా పదవులు, ఆస్తులు లేకపోయినా ‘నేను-నేను’ అంటున్నావు కదా! అది కనిపించకుండా పోయే వరకు సాధన చెయ్యాలి” అన్నారు. బాగుపడే వానికి చిత్తశుద్ధి, వివేకం, చిత్త ఏకాగ్రత కావాలి. దేహంతో కామవాసనలు తీర్చుకోవచ్చు అని భావిస్తే అవి దేహభావన పెంచుకోవడానికి సహకరిస్తాయి. రాముడు సత్పురుషులతో చుట్టబడి ఉంటాడు. వాడికి చెడు ఆలోచనలు రావు. వానరసైన్యం లేకపోయినా యుద్ధభూమిలో ఆయన గాంభీర్యం తగ్గదు. నదులు సముద్రంలో కలసినా కలవకపోయినా సముద్రం గాంభీర్యం ఏమాత్రమూ తగ్గదు. అలాగే జ్ఞానికి భోగ భాగ్యాలు కలిగినా కలగకపోయినా గాంభీర్యం తగ్గదు. సహనం వల్ల ఏదైనా సాధించవచ్చు. అసహనం వల్ల ఏదీ సాధించలేము.

86. శాంతి జ్ఞానేశ్వర్‌ని జ్ఞాన దేవుడు అంటారు. ఆయన అన్నారు. నీకు సుఖపడాలనే కోరిక ఉన్నంతకాలం కోటి జన్మలు ఎత్తినా సుఖపడలేవు. నీకు సుఖపడాలనే కోరిక లేదు అనుకో దుఃఖం వచ్చినా, సుఖం వచ్చినా దాని స్పృహ నీకు ఉండదు. ఇది గొప్ప కీలకం. దుర్వాసనలు అన్నీ నీ మనస్సులోనే ఉన్నాయి. మనస్సు ‘నేను’ అనే బుద్ధి నీకు పోలేదు. ఇంకా శాంతి ఏమిటి? అది వేరు పురుగు, నీవు ఆకులకు ఎండ్రిన్ కొడితే పోదు. దాని మూలంలో తవ్వితేకానీ ఆ పురుగు కనబడదు. దాన్ని సంహరిస్తేనే పోతుంది. మీ అబ్బాయి పెళ్ళి అవ్వక మునుపు ఒక రకంగానూ, పెళ్ళి అయిన తరువాత ఒకరకంగానూ ఉంటాడు. పెళ్ళి అంటే మీ అబ్బాయి ఒక స్త్రీ దేహాన్ని కోరుకుంటాడు. మీ అబ్బాయికి సుఖం కావాలి. తల్లితండ్రులకంటే వాడి





సుఖం వాడికి ముఖ్యం. వీడికి సుఖపడాలనే కోరిక ఉంది కదా! ఆ కోరిక ఆ అమ్మాయి నెరవేరుస్తుంది. ఆ ఎంజాయ్‌మెంట్‌లో వాడు నెమ్మదిగా తల్లితండ్రులను మరచిపోతాడు” అన్నారు. వ్యవహారాలలో దక్షత ఉండాలి. అమాయకుంగా ఉండకూడదు. కొందరికి దక్షత ఉంటుంది. మీరు వారిని సలహా అడిగితే నేర్పుగా చెబుతారు. సమస్యలు పరిష్కరించుకోవాలి. భయంతో ఉండకూడదు. ఆహార నియమం లేనివారికి వారి బుద్ధిలో స్పష్టత రాదు. అది లేనప్పుడు ఏది నిత్యం, ఏది అనిత్యం అనే విభజన చేసుకోలేడు. మనస్సులో దైవీ సంపద ఉందా? అసుర సంపద ఉందా? అని మీకు తెలుస్తుంది. ఏకాంతం మీకు స్కానిగ్ లాంటిది. చైతన్యస్థాయి పెరిగినవారికి ఆడంబరం కలుగదు. ఇతరులచే గుర్తించబడాలనే ధ్యాసే ఉండదు. ధర్మాన్ని ఆచరించేవానికి ఏ సాధనా అవసరం లేకుండా మనో నాశనం అవుతుంది. దానితో ఆయన ఇంద్రియాలు ఎలా ఉండమంటే అలా ఉంటాయి. జీవుడు బాగుపడితే హృదయంలో నిలకడగా ఉంటాడు. నిందకు, స్తోత్రానికి పట్టించుకోకండి. అందులో దోషం ఉంది. మరణ భయం, అగౌరవ భయం, రోగ భయం లాంటివి కలిగితే మీ సాధన జరుగదు. మర్యాదలేని మాటలు, అగౌరవం వంటి మాటలు, పేచీ మాటలు, అన్నీ మనస్సు వల్లనే వస్తాయి. మీ గౌరవం పెరిగేలా మాట్లాడకూడదు. వాళ్ళు బాగుపడేలా నిర్మలంగా మాట్లాడటం వాక్కు తపస్సు. అది కావాలి. భయం లేని మనిషి ప్రశాంతంగా స్థిరంగా ఉంటాడు.

87. సౌభాగ్యాలతో, దౌర్భాగ్యాలతో తాదాత్మ్యం చెందకపోతే శాంతి. అట్టివారికి ఏకాగ్రత, ధారణ, జ్ఞాపకశక్తి ఎక్కువ ఉంటుంది. చదువు బాగా వస్తుంది. మితాహారాన్ని తీసుకోవాలి. చేతులతో పని చేసుకున్నా మనస్సులో వైరాగ్యం కావాలి. “రాముణ్ణి మీ మాంసపు నేత్రాలతో చూడటం కాదు, మిమ్మల్ని రాముడు చూడాలి” అన్నారు వాల్మీకి. ఈశ్వర ప్రణాళికను బట్టి ఈశ్వరుడు మీ దేహాన్ని తోలుకొని వెళతాడు. మీ ఊహలు, సంకల్పాలు నెరవేరవు. మీకు నిద్రలో ఎక్కడా దుఃఖం లేదు. మీకు తలంపు వచ్చిన

తరువాత దుఃఖం వస్తుంది. అంటే దుఃఖం తలంపు రూపంలో ఉంది. నామాన్ని శ్రద్ధగా చేస్తే చెడు తలంపును తరిమేయవచ్చును. మీరు నిజ స్థితిలోనికి వెళ్ళడానికి నామం సహకరిస్తుంది. మీరు ఒకరిని చెడ్డవాడు అంటే అతడినే మంచివాడు అని చెప్పేవాళ్ళు చాలామంది ఉంటారు. ఒకరిని మంచివాడు అంటే చెడ్డవాడు అని చెప్పేవాళ్ళు చాలామంది ఉంటారు. ఇవి అన్నీ మనో కల్పితాలు. తీర్పులు చెబితే మీ కాలాన్ని పాడుచేసుకున్నట్లే. సమస్యను పరిష్కారం చేసుకోవాలి అనుకున్నప్పుడు నలుగురూ కలిసి కూర్చుని మాట్లాడుకోవాలి. ఒక అవగాహనకు రావాలి. దేవుడు ఉన్నాడని నమ్మకం ఉంటే నీ మనస్సుని వాడికి ఇచ్చెయ్యి. లేడు లేడు అనుకుంటే నీ మనస్సును బోను ఎక్కించి విచారణ చెయ్యి. పూర్వజన్మ దోషాలంటే ఎన్ని జన్మలని వెనక్కి వెళతావు. దానికే అవిద్య కారణం. అది సరియైన సమాధానం కాదు. ఆత్మవిద్య ద్వారా అవిద్య పోతుంది. దోషం దుఃఖ రూపంలో ఉంటుంది అనుకుంటే దానికి ముగింపు లేదు. శరణాగతి చేపిన వాడికి రాగద్వేషాలు ఉండకూడదు. ఉంటే శరణాగతి చెందనట్లే. మనకు నాలుగు దెబ్బలు తగులుతూ ఉంటే మనకు అతీతంగా ఒక శక్తి మనలను నడుపుతున్నదని తెలుస్తుంది. నీకు చింతన, వేధన లేకుండా ఉంటేనే నీ చింతలను భగవంతుడు తీసుకుంటాడు. అదే భక్తి, అదే శరణాగతి. తలంపుల మీద ఆసక్తి పెట్టుకోకు. బుద్ధుడు "ఈ జన్మలో ఎవరికీ ఉపకారం చెయ్యకపోతే మరుజన్మ దరిద్రపు జన్మ వస్తుంది. ఉపకారం చేసి అనవసరంగా ధనాన్ని ఖర్చుపెట్టామని ఏడ్చే వాడికి మరుజన్మలో ఎంతో సంపద ఇచ్చి ఏదీ తినకుండా రోగాలతో బాధ పడవలసి వస్తుంది" అన్నారు. ప్రసాదం అంటే అనుగ్రహం. బుద్ధుడు ఖర్మ మార్గాన్ని చూడలేడు. మనిషి దుఃఖ స్పర్శ లేని ఆనందాన్ని పొందాలనే దృష్టితో ఉండేవాడు.

88. "నీ హృదయంలో ఉన్న ఈశ్వరుణ్ణి శరణు వేడుకో" అన్నారు వాసుదేవ స్వామి. మరి ఆయన ఎవరు? ఈశ్వరుడే కదా! అది మనల్ని మాయలో పడేయడానికి "నారాయణ పరబ్రహ్మం సర్వకారణ కారణం".





దీనిని నిత్యం స్మరించుకుంటే దుఃఖం రానే రాదు. శ్రీ చక్రం పూజించడం అంటే అమ్మవారిని పూజించడం. దానివల్ల శాంతి కలుగుతుంది, ధనం సమకూరుతుంది. పని చేసి వదిలి వేయడమే కాదు, దాన్ని మరచిపోవడం త్యాగం. "లింగం" అంటే సాకారం కాదు. నిరాకారం కాదు. దానికి మధ్యన ఉన్న మూర్తి. మనం లింగాన్ని ఆధారం చేసుకొని ఆత్మ స్వరూపాన్ని అందుకోవడానికి గుర్తుగా దాన్ని పెట్టారు. "ఫ్రెంచ్ తత్త్వవేత్త" ఆధ్యాత్మికంగా ఏడుసార్లు పడిపోయినా ఎనిమిదవసారి లేవండి. మీ బుద్ధి, మీ డబ్బు మీ జేబులోనే ఉంచుకోండి. ఎవరినో నమ్మి వాడికి ఇవ్వకండి. మంచి స్వభావం లేనివారు కూడా మంచి స్వభావంగా కనిపించి మిమ్మల్ని సర్వనాశనం చేస్తారు. మోసపోకండి. గాంధీజీ అన్ని ఆకర్షణలకు, పదవులకు దూరంగా ఉన్నారు. శాస్త్రీజీ అన్ని పదవులు చేసి దేనినీ అంటుకోకుండా ఉన్నారు. ఎటువంటి పరిస్థితులలోను కంగారు పడకండి, ఉద్రేక పడకండి, తెలివిని పోగొట్టుకోకండి. "ఉన్నాను" అంటే అర్థం ఏది అయితే ఉందో అది నేనై ఉన్నాను అని. దేహం యొక్క ప్రారబ్ధాన్ని బట్టే అంతా జరుగుతుంది అనుకున్నప్పుడు ఇక సాధన ఎందుకు? అంటే బహిర్ముఖం కాకుండా ఉండడానికి. భగవంతుడు నీకు ఏది అనుగ్రహిస్తే దానితో సంతుష్టుడవై ఉండాలి. అదే పరిపూర్ణ శరణాగతి. జపం అంటే స్ప్రింగ్ మంచంలాంటిది. కూర్చుంటే అణుగుతుంది. లేస్తే మళ్ళీ మామూలే. అలాగే జపం చేసినంత సేపు మనస్సు అణుగుతుంది. వదిలేస్తే మామూలే. జపంతోపాటే ఈ సంతోషాలు, విషాదాలు, గర్వాలు ఏ నేనుకి వస్తున్నాయి? సత్యానికి రావడం లేదు, అసత్యానికే అని గుర్తిస్తే నెమ్మదిగా ఆత్మవైపు జరుగుతావు. ఈ విచారణ గుడ్డితనంగా చేయడం కాదు. ఒక వివేకమైన పద్ధతిలో చేస్తే ఇది జపధ్యానాల కంటే తేలిక.

89. "అయామ్ దట్ అయామ్" అంటే "ఉన్నది ఏదో నేనే ఉన్నాను". ఉన్నది వేరు నేను వేరు అని కాదు. అని అర్థం. భగవంతుడు అంటే ఎవరిని స్మరిస్తే నీకు యదార్థమైన శాంతి కలుగుతుందో అదే

భగవంతుడు. మనం ఎవరికైనా ఉత్తరం వ్రాసేటప్పుడు ఆ ఉత్తరం ఆ వ్యక్తికి చేరుతుంది అనే విశ్వాసంతో వ్రాస్తాము. అలాగే మన వేదన, ఆర్తి భగవంతుడికి చేరతాయనే పరిపూర్ణ విశ్వాసంతో సాధన చెయ్యాలి. ఉత్తరం చేరడానికి ఒక వ్యవస్థ ఉంది. అలాగే ఈశ్వరునిపై మనకు ఉన్న ఆర్తి వారు సాక్షీభూతంగా చూస్తున్నారు అనే విశ్వాసం ఉండాలి. పోస్టుమేన్ మీదు ఉన్న నమ్మకం, విశ్వాసం పరమాత్మ మీద లేదు. తిలక్ "నీవు నేర్చుకున్న (జీవితంలో) పాఠాలు నీవు గ్రహించి పరివర్తన చెందాలి అనేవారు" తెలుసుకోవడం అంటే బుద్ధితో తెలుసుకోవడం కాదు. అనుభవానికి రావాలి. మనస్సుకు ఆధారంగా ఉన్నది నీకు తెలియక పోయినా నీ మనస్సు నీకు తెలుస్తుంది కదా! నీ శరీరం నీకు తెలుస్తున్నది కదా! ఆ రెండింటినీ పవిత్రం చేసుకుంటే, నీకు నిజమైన వైరాగ్యం ఉంటే మీరు భరించలేనంత ఆనందం మీ శిరస్సు మీద పడుతుంది. మీ మనస్సు మిమ్మల్ని బాధపెట్టదు. బయట పరిస్థితులు మీకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా మీ మనస్సు మీద పడకుండా చూసుకోవాలి. అప్పడే మీరు సాధన చేస్తున్నట్లు. ఒక మనిషిని చంపడం ఎంత పాపమో, మనిషిని అపార్థం చేసుకోవడం కూడా పాపమే. వాలి సుగ్రీవుణ్ణి అపార్థం చేసుకున్నాడు. సోక్రటీస్ "మీరు ఏది ఆలోచిస్తే అదే అవుతారు. మీరు దానిని పరీక్షించుకోండి" అన్నారు. మనం భగవంతుని సంకల్పాన్ని అంగీకరించాలి. రాత్రి నిద్రలో సుఖంగా ఉంటున్నాము. పగలు ఏడుస్తున్నాము, రాత్రి నిద్రలో 'నేను' లేదు, పగలు 'నేను' ఉంది. ఈ 'క్లూ' గమనిస్తే చాలు 'నేను'ని విడదీసుకోలేకపోతున్నారు. ఇంత కష్టపడవలసిన పనిలేదు. విమర్శలు వద్దు, అనవసరపు మాటలు వద్దు. భగవాన్ "నీ ప్రారబ్ధం బలంగా ఉన్నా నీవు ఆత్మజ్ఞానంలో ఉంటే నీకు క్షోభ రాకుండా చేస్తుంది. అది ఆత్మ విద్య యొక్క వైభవం. మంచిగానీ, చెడుగానీ జరిగినా బుద్ధుడు "క్షణం-క్షణం" అనేవారు. నువ్వు ఎవరి క్షేమం కోరుతున్నావో వాళ్ళు బాగుపడినా, బాగుపడకపోయినా నీకు బ్రహ్మానుభవం పొందడానికి అర్హత వస్తుంది.





90. ముగింపు లేని సుఖము, శాంతి, ఆనందము నీవు పొందాలి అంటే సత్యవస్తువును తెలుసుకొని తీరాలి. అది నీ ఇష్ట-అయిష్టాలపై ఆధారపడి లేదు. అది స్వతంత్రమైనది. శంకరులు "గోవిందా నాకు సంపద వచ్చినా, అధికారం వచ్చినా నా ముఖంలో అవినయం రానివ్వకు" అన్నారు. శారదానందని వివేకానందుడు "నీకు కోపం తెప్పించలేకపోతున్నాను. నేను ఈ ప్రపంచం అంతా తిరిగినా, ఆత్మజ్ఞానం సంపాదించినా నీ శరీరంలో మనిషి రక్తం లేదు. చల్లగా ఉండే చేపరక్తం ఉంది. ఎన్ని తిట్టినా ప్రక్కకు తిప్పకోవు ఎదురుగానే ఉంటావు. క్వయిట్‌గా ఉంటావు" అన్నారు. సహనం, సత్వగుణం ఉన్నవాడికే గ్రంథం అర్థం అవుతుంది. దానిని సంపాదించాలి. నీవు సుఖంగా లేవు అంటే నీ అవగాహన సరిగాలేదు, నీవు నిజస్థితిలో లేవు. అనవసరంగా దీనిలో దేవుని కల్పిస్తున్నావు ఏమిటి? ఒక సామెత "కాళ్ళు గెడపలు దాటడంలేదు, మాటలు కొండలు దాటిపోతున్నాయి" ఇతరులకు ఉపకారం చేస్తున్నాను అనుకుంటే అహంకారం వచ్చేస్తుంది. హయ్యర్ పవర్‌లో మీరు నడవవలసిందే ఇష్ట-అయిష్టాలు కలిగినప్పడు మీరు నిగ్రహంగా ఉన్నారా? వాటి ప్రభావం మీ మీద పడుతున్నదా? అనేది మీ ఆధ్యాత్మిక అభివృద్ధికి సంకేతం 'నేను' లేనప్పడు అవమానం పొందడం అంటూ లేదు. సబ్జక్టు ఓరియంటెడ్‌గానే మనం ఉండాలి. నిత్యఖర్మల వల్ల మీకు తెలివితేటలు పెరుగుతాయి. జీన్సు వల్ల కూడా వస్తాయి. ధర్మస్థలి మంజునాథుడు నివశించినది. ప్రాయశ్చిత ఖర్మలు చేయించుకుంటారు. మధ్వాచార్యులు స్థాపించినది. అర్చకులు వైష్ణవులు. ప్రాయశ్చిత ఖర్మలు అంటే పశ్చాత్తాపం పొందడం వల్లనే ఖర్మలు సమిస్తాయి. మారు మనస్సు పొందుతారు. మనం హృదయంలో లయం అయితే ఈశ్వరానుగ్రహం వర్షం కురిసినట్లు కురిపించి తనలో లయం చేసుకుంటాడు. అంతేకాదు భౌతిక అవసరాలు కూడా సమకూరుస్తాడు. "అనుగ్రహం అటునుంచి రావాలి కాని ఇటునుంచి వచ్చే అనుగ్రహం ఎంత? మన ప్రయత్నం ఎంత?" అని ఒక అమ్మగారు అన్నారు. కానీ ఎంత నీవు తెలుసో అంతే ప్రయత్నం

చెయ్యి పాడైపోయిన మనస్సు బాహ్యముఖం అవుతుంది, స్వచ్ఛమైన మనస్సు అంతర్ముఖం అవుతుంది. బాహ్యముఖమైన మనస్సు ప్రారబ్ధం అనుభవిస్తుంది. అంతర్ముఖమైన మనస్సుకి ప్రారబ్ధం ఏమిటి?

91. నామం చేసేటప్పుడు మనస్సు చలిస్తుంది అంటారు. మీరు ఇతరులకు డబ్బు ఇచ్చినా, ఇతరుల నుంచి డబ్బు తీసుకున్నా శ్రద్ధగా లెక్క పెట్టుకుంటారు. అప్పుడు మీ మనస్సు చలించదు. అంటే మీకు డబ్బు మీద ఉన్న శ్రద్ధ నామం మీద లేదు. ఈశ్వరుడు ఒకడు ఉన్నాడని నమ్మకం ఉంటే నూటికి 90 మార్కులు వస్తాయి. నీ ప్రవర్తనగానీ, నీ శీలంగానీ పోగొట్టుకుంటే తిరిగి సంపాదించడం కష్టం. మనస్సు కల్పించే విషయాలు నిద్రలో లేవు. ఇప్పుడు ఉన్నాయి కాబట్టి జాగ్రదావస్థలో మనకు నిజం తెలియడం లేదు. ఇప్పుడు నీవు సాధన చేసి వాటిని పోగొట్టుకుంటే ఆ 'నిజం' నీకు అనుభవంలోకి వస్తుంది. ప్రారబ్ధాన్ని భగవంతుడు (గురువు) తెలియనివ్వడు. ఖర్మఫల కాంక్షనే ఆసక్తి అంటారు. ఖర్మలలో హెచ్చుతగ్గులు లేకుండా చూసుకోవడమే యోగము. మనకు చేసిన అపకారి మీద మనకు కోపం ఉన్నా సత్వగుణంతో మాట్లాడితే మనలో ఉన్న కోపము అనే అగ్ని చల్లారిపోతుంది. అంతేకాని ముఖం ప్రక్కకు పెట్టుకొని ఎంతకాలం దాక్కుంటాము. మిమ్మల్ని ఎవరైనా పేరుపెట్టి గౌరవంగా పిలిస్తే మీకు గౌరవం వస్తూ ఉంటే, వారి మీద ప్రేమ వస్తూ ఉంటే అలాగ భగవంతుని నామాన్ని ప్రేమతో, గౌరవంతో స్మరిస్తూ ఉంటే మీ మీద ఆయనకు ఇష్టం కలగదా? మీ సంతానం మీద ఉన్నంత ప్రేమ నామం చేస్తున్నప్పుడు భగవంతుని మీద ఉండాలి అని అర్థం. పరమాత్మ దర్శనం పొందేవరకు నీకు ప్రకృతి మీద ఆసక్తి పోదు అని వాసుదేవస్వామి గీతలో అన్నారు. ఎవరి శరీరం వారు చూసుకుని పొంగిపోతున్నారు. పైనతోలు కప్పి ఉంది అంతే. రేపు ఈ శరీరం ఉంటుందో ఊడుతుందో తెలియదు. శరీరాన్ని మంచి పనులకు ఉపయోగించుకోవాలి. మమకారం ఉంటే చావు వెంటనే వచ్చేస్తుంది. సత్యం మీద జిజ్ఞాస ఉంటే మీ వయస్సు అతిపెద్దదైనా ఇరవై సంవత్సరాల





వయస్సులో ఉన్నట్లు ఉంటారు. ప్రపంచాన్ని జయించిన అలెగ్జాండరును "మీ తండ్రి గారు ఏమి ఇచ్చారు" అంటే "హద్దులు లేని ధైర్యాన్ని ఇచ్చారు" అన్నారు. పిరికితనం పతనాన్ని సూచిస్తుంది అని గ్రహించాలి. సాధనవల్ల శాస్త్రజ్ఞానం వల్ల అనుభవం కలుగుతుంది.

92. టాల్‌స్టాయ్ సాహిత్యంలో "భగవంతుడు ఒక చెప్పలు కుట్టే భక్తునికి కనిపించగా మా ఇంటికి రమ్మని అడుగగా రేపు వస్తాను అన్నాడు. మరునాడు ఉదయం బాలునిగా వచ్చి నాకు చెప్పలు కుట్టవా అని అడిగితే నాకు ఈ రోజు భగవంతుడు కనిపిస్తాడు కుట్టడం కుదరదు అన్నాడు. మధ్యాహ్నం మధ్యవయస్కునిగా, సాయంత్రం వృద్ధునిగా కనిపించినా తిరస్కరించాడు. మరుసటిరోజు కనిపించగా నిన్నరాలేదేమిటి? అన్నాడు. "నేను నిన్న మూడు సమయాలలో ముగ్గురు వ్యక్తులుగా కనిపించాను. నీవు నా మాటలను తిరస్కరించావు" అన్నాడు. అంటే ఈశ్వరుడు అంతర్యామి అని అర్థం. ప్రశాంత చిత్తం సంపాదించండి. కోరికలు లేకపోతే ప్రారబ్ధం అనుభవించేవాడు ఉండడు. నీ ప్రాణం పోయే సమయంలో సత్యంతో తాదాత్మ్యం పొందితే సిద్ధపురుషుడవు అవుతావు. చేతిలో డబ్బు ఉంటే బజారులో వస్తువు కొనుక్కోవడం ఎంత తేలికో నీవు అంతర్ముఖుడవు అయితే ఆత్మజ్ఞానం సంపాదించడం అంత తేలిక. "పేదవాడిని చూచి ఎవరి మనస్సు అయితే ద్రవిస్తుందో వాడు మహాత్ముడు అవుతాడు" అన్నారు వివేకానంద. వాళ్ళు మావాళ్ళు అంటారు. నీ శరీరమే నీది కానప్పుడు ఎవరు నీవారు? రామకృష్ణుడి దగ్గరకు నలుగురు భక్తులు వచ్చి ఎదురుగా కూర్చోనగా ఆయన లేచి వారి మధ్య కూర్చున్నారు. ఆ స్త్రీలు కొంచెం దూరం జరిగారు. దాని గురించి ఆయన నేను పురుషుడను మీసాలు, గెడ్డాలు ఉన్నాయి అనేకదా! మీ దగ్గర కూర్చోవడానికి నేను సిగ్గుపడటంలేదు. మీరు సిగ్గుపడుతున్నారు. మీరు దేహాత్మ భావనలో ఉన్నారు. దాని గురించి చెప్పడానికే నేను వచ్చి మీ మధ్యలో కూర్చున్నాను" అన్నారు. ఆయన మరో సందర్భంలో ఒకరితో "శాలువాలు ఇచ్చి లౌకికునిగా తయారుచెయ్యకండి"

అన్నారు. కొన్ని ప్రాంతాలలో కక్షలు ఎక్కువగా ఉంటాయి. ఎవరైనా వారిని చంపుతారని అనుమానం వస్తే ముందుగానే వెళ్ళి వీళ్ళే చంపేస్తారు. అలాగే రాగద్వేషాలు మనలను చంపకముందే మనమే వాటిని చంపాలి అప్పుడు ఆనందంగా ఉండవచ్చును. మనం పుట్టని వస్తువుతో తాదాత్మ్యం చెంది ఉంటే ఏ గొడవా ఉండదు. పరమాత్మను సంతోషపెట్టే పనులు మనం చెయ్యాలి అనే విచక్షణాజ్ఞానం పెంచుకుంటే వారి అనుగ్రహానికి పాత్రుల మవుతాము. శరీర అవసరం లేకుండా నీవు ఆనందాన్ని పొందితే నీకు పునర్జన్మ రాదు. వాడు చెడ్డవాడు అయితే వాడితో స్నేహం మానెయ్యి. మిగతా విషయాలు నీకు అనవసరము. వాటిని భగవంతుడు చూసుకుంటాడు. నీ గొడవ నీవు చూసుకో. ఇతరుల మీద తీర్పులు చెప్పడం వల్ల నీ మనస్సుకి కల్మషం వస్తుంది.

93. నీ మనస్సులో బలహీనతలు ఎక్కువగా ఉంటే వాళ్ళు ఉన్నట్లు మనమూ ఉందాము అనిపిస్తుంది. మనం మనలా బ్రతకాలి. బుద్ధుడు "భౌతికమైన వ్యవసాయం చేయడం కంటే, ఆధ్యాత్మిక వ్యవసాయం చేయడం కష్టం. చేను ఊడ్చాలంటే దమ్ము, ఊడుపు, మందు కావాలి. నీకు జ్ఞానం రావాలంటే ముందు మనస్సును సంస్కరించుకోవాలి, నీ బుద్ధిని నిదానంగా పెట్టుకోవాలి. అది ఇంకా కష్టం" అన్నారు. లోపల బయట అనేది అబద్ధం. నిద్రలో అది ఉందా? మీ స్నేహాలు నిలబడాలంటే సహృదయం ఉండాలి. అతడిలో తరువాత ఏ చెడు సంఘటన జరిగినా మన ఆలోచన ఎలా ఉండాలి? అదే మనకు తారసపడితే మనం ఎలా ఉంటాము అనే ఆలోచన ఉండాలి. ఒకరి కష్టసుఖాలు ఒకరు తెలుసుకోవాలి. సహృదయం ఉన్న వానికి నీ కష్టం చెప్పుకుంటే నీ దుఃఖం పంచుకుంటాడు. నీకు సగం దుఃఖం తగ్గిపోతుంది. భగవాన్ సిద్ధాంతం మీద మీకు విశ్వాసం ఉంటే మీకు దుఃఖం రాదు. సాధన ఎందుకు అంటే ప్రారబ్ధం బలంగా ఉన్నా అది మీదపడదు. ఆ సాధనలు గుడిలో లైన్‌లో దర్శనాలు కావచ్చు, సత్యనారాయణ వ్రతాలు కావచ్చు, నదులలో స్నానాలు కావచ్చు, ప్రార్థనలు, బోధలు అన్నీ మీ





మీద దుఃఖం పడకుండా ఉండడానికే. నిన్ను నీవు తెలుసుకో అంటే నీకు ఆధారంగా ఉన్న చైతన్యాన్ని తెలుసుకోమని అర్థం. నీకు అర్హత ఉన్నప్పుడు సమాజం నిన్ను గుర్తించకపోయినా ఈశ్వరుడు నిన్ను గుర్తించి నిన్ను ఎక్కడ కూర్చోబెట్టాలో అక్కడ కూర్చోబెడతాడు. కొండ మీద ఉన్న దీపాన్ని ఎవరూ చూడకుండా ఆపలేరు. మన కాళ్ళమీద మనం నిలబడాలి. కుటుంబ సభ్యులు, బంధువుల మీద ఆధారపడకండి. మీ శాంతి కోసం వాళ్ళ మీద ఆధారపడితే లోపల నుండి వచ్చే శాంతి నిలబడదు. నీకు దెబ్బ తగిలితే ఏడుస్తూ కూర్చోవు మందు రాసుకొని మానేలా చేస్తావు. అలాగే ఆధ్యాత్మిక జీవితంలో గతాలు గుర్తుకు తెచ్చుకుంటే పెద్దవి అయిపోతాయి. (ఆ గాయం మానడం కష్టం) గతం మరచిపోవాలి, మరచిపోకపోతే మానై పోతుంది. ఇతరులు కనిపించినపుడే భయం కలుగుతుంది. గాంధీజీ "చనిపోతు న్నప్పడు కూడా జీవించి ఉంటామని గుర్తుపెట్టుకోండి" అన్నారు. వినడం కూడా సాధనలో భాగమే. ఒక మనిషి మనతో ఎందుకు మాట్లాడుతున్నాడు అని గ్రహించాలి. దేహం మీద, మనస్సు మీద, మీ బుద్ధి వాలకుండా చూసుకోండి. ఉపాసన తగ్గిపోతే లోకమనే అడవిలో పడిపోయి బయటకు రాలేము.

94. నీవు చెప్పే విషయం ముందు నీవు ఎంజాయి చెయ్యాలి. వివేకానంద "నా పద్ధతిలో నేను మాట్లాడాలి. నా గురువు చెప్పినట్లు నేను చెప్పకూడదు. అనుకరణ పనికిరాదు. అవి మాటల విషయంలోనైనా, వస్త్రధారణ విషయంలో అయినా" అన్నారు. పాయసం ఎదురుగా ఉండగా ఆనందం కోసం ఎదురు చూస్తావా? ఆత్మానుభవం అయ్యాక విషయ సుఖాలు నిన్ను ఆకర్షిస్తాయా? దేహ సంబంధమైన భోగ వస్తువులే నీ సుఖానికి కారణమవుతూ ఉంటే చచ్చేవరకు నీవు దేహం మీద ఆధారపడ వలసినదే. అప్పుడు ఉన్న వస్తువు ఉన్నట్లు తెలియదు. ఆత్మ శాంతి రాదు. సహనం వల్ల చాలా సమస్యలు పరిష్కారం అవుతాయి. మనో మూలంలోకి వెళ్ళడానికి సహనం మీకు సహకరిస్తుంది. ప్రేరణ ఇస్తుంది. గుణాలు వస్తూ

ఉంటాయి, పోతూ ఉంటాయి. అందులో ఉన్నంతకాలం సంసారంలో ఉండవలసిందే. కట్టెలు మోసేవాడు గమ్యం చేరాక క్రిందికి దింపాక అమ్మయ్య అనుకొంటాడు. జ్ఞాని కూడా దేహం పోయిన తరువాత అలా తేలికపడతాడు. కానీ మనం అలా అనుకోము బాబోయ్ చనిపోతున్నాము అనుకొంటాము. నీవు ఎక్కడికి వెళతావు? ఖర్మలు అనుభవించడానికి ఇంకో శరీరం సిద్ధంగా ఉంది కదా! మీ ఖర్మానుభవానికి ఈశ్వరుడు మీకు ఇంకొక శరీరం ఇచ్చి తీరతాడు. ఈ ప్రపంచం అంతా జయించినా అది ఆత్మలాభంతో సరిపోదు. జయించిన సుఖం కొద్దికాలం తళుక్కు మంటుంది. తరువాత కాలప్రవాహంలో కొట్టుకుపోతుంది. దేహమే నశించి పోయినప్పుడు ఇక ఏమి మిగులుతుంది? మనం నోటితో మాట్లాడుతూ ఉన్నా, ఒక పని చేసినా, మనస్సుతో ఆలోచించినా భగవంతుని దయ సంపాదించడానికే అదే కేంద్రంగా పెట్టుకోవాలి. 'తపస్సు' అంటే మన శరీరాన్ని, మనస్సును, ఇంద్రియాల్ని స్వాధీనం చేసుకునే విధానాన్ని తపస్సు అంటారు. బుద్ధుణ్ణి ఒకరు "నాకు శరీరం వస్తుందా? రాదా?" అని అడిగితే "నీకు దాహం వేస్తే నీళ్ళు త్రాగుతావు. ఆకలి వేస్తే అన్నం తింటావు. అలాగే దేహం అవసరం అనుకుంటే వస్తుంది, లేకపోతే రాదు. అది నీకు లోచూపు కలిగితే తెలుస్తుంది" అన్నారు.

95. ఓర్పు లేకుండా నేర్పురాదు. ఒక పని బాగా చెయ్యడమే నేర్పు కాదు. ఆ పనిలో ఫలితం నిన్ను అంటుకోకుండా చెయ్యడమే నేర్పు. గుణాలను బట్టి భోగాలు అనుభవిస్తారు. కామరహితుడైతే కానీ ఆత్మ జిజ్ఞాస కలుగదు. ఆత్మానుభవం కలిగిన వానికి మాత్రమే స్త్రీ పురుష భేదం పోతుంది. సత్పురుషుల సహవాసం వల్ల జిజ్ఞాస కలుగుతుంది. ఇతరులు విమర్శించినా సత్వగుణం వదలకూడదు. అత్తగారిని చూచే ప్రారబ్ధం ఉంటే ఇష్టంగా చూడండి. చూడకపోతే ఆమె ఏదైనా ఆత్మహత్య చేసుకుంటే పాత ఖర్మ అలాగే ఉండిపోతుంది. కొత్త ఖర్మ మరలా చుట్టుకుంటుంది. కోపం వల్ల జ్ఞాపకశక్తి, అవగాహనాశక్తి తగ్గిపోతుంది. దొంగలు ఇంట్లోకి వస్తే ప్రమాదం





అలాగే రాగద్వేషాల్ని లోపలకి రానివ్వకండి. ప్రతిఘటన స్వభావం కలవారికి శాంతిరాదు. మీ ఇంట్లోకి పాము వస్తోంది అనుకోండి. గుమ్మంలోకి వచ్చేవరకు దాని వంకే చూస్తూ ఉంటే అది లోపలకి రాదు, వెనక్కి వెళ్ళిపోతుంది. అలాగే రాగద్వేషాలు మీలో ప్రవేశించినప్పడు వాటిని చూస్తూ ఉంటే మనస్సులోనికి ప్రవేశించవు. భగవంతుణ్ణి మననం చేసే వాడిని ముని అంటారు. రైలు పట్టాల మీద వెళుతుంది. పట్టాలు వెళ్ళవు. అలాగే ఆత్మకు మార్పులేదు. ఆలోచనలు ఆత్మ వెలుగులోనే బ్రతుకుతాయి. మంచి పని చేసి మీ బుద్ధి ఎలా ఉందో చూసుకోవాలి. మంచి మంచి కోసమే చేస్తున్నామా? ప్రచారం కోసం చేస్తున్నామా? అని గమనించాలి. సత్త్వగుణం కాపాడుకొంటే శుద్ధ సత్వగుణం వస్తుంది. శ్వాస మీద ధ్యాస మంచిదే. శ్వాస వదిలాక అంతకుముందు అణిగిఉన్న వాసనలు విజృంభించి "నన్ను అణచివేస్తావా?" అని కక్షతీర్చుకొని పది కోరికలను తెస్తాయి. మనస్సు మీద నిఘా మంచిది. కుటుంబపరంగా, సమాజపరంగా సమస్యలు వస్తున్నాయి, దేనికి వస్తున్నాయి? శరీరానికి రావు. 'నేను' కే వస్తున్నాయి. ఆ 'నేను' ఎవరో చూసుకో. మదము, మాత్సర్యము ఇవి అన్నీ వేరుగా కనిపిస్తాయి. వాటికి మొదటి కారణం కోరికే. కోరిక కోపానికి జన్మనిచ్చింది. తరువాత అన్నీ అనుసరిస్తాయి. ధనం పెరిగేకొలది ప్రఖ్యాతి పెరిగి గర్వాన్ని పెంచుతున్నది. దాని వల్లనే మానవుడు కుళ్ళిపోతాడు. మాత్సర్యం అంటే అసూయ ఇవి అన్నీ రూపాంతరాలే. స్వ, పర బేధం లేని వానికి దుఃఖం ఎలా వస్తుంది?

96. శాస్త్రాలు మన బుద్ధికే పరిమితం "మీరంతా నాలో ఉన్నారు నేను మీలో లేను అని గీతా శ్లోకంలో అన్నమాటకు నన్ను నన్నుగా చూడలేక జీవుడిగా శరీరంగా చూస్తున్నారు. నన్ను నన్నుగా చూస్తే ఇవి ఏమీ లేవని తెలుసుకుంటారు. అసత్యాన్ని అసత్యంగా గుర్తించేవరకూ నన్ను గుర్తించలేరు. మనం దేవుడంతటి వాళ్ళము అయితే కాని కృష్ణుణ్ణి చూడలేము. ఆయన వ్యక్తం కాడు. "నేను మిమ్మల్ని పిలిచేవరకూ పుడుతూ చస్తూ బ్రతకవలసిందే"

అన్నాడు. నీ ప్రవర్తన నా అనుగ్రహానికి పాత్రుడయ్యేలా ఉండాలి. ఎవ్వరూ పాపులమని అనుకోవద్దు. నీ హృదయంలో ఉన్న ఈశ్వర ప్రసాదంలో ఎవరు ఓలలాడుతారో వాళ్ళ బలహీనతలు అన్నీ క్షణాల్లో కాలిపోతాయి. ఈశ్వర శక్తిని పెంచుకొని దోషాలను తగ్గించుకోండి. దరిద్రం నీచమైనది కాదు. పిరికితనమే నీచమైనది. 'నేనే కర్తను' అని భగవంతుడు చెబుతున్నాడు. అయినప్పటికీ నీ కర్తృత్వ బుద్ధి పోవడంలేదు. దానివల్ల దుఃఖం తప్పదు. చదువుల యొక్క లక్ష్యం విషయంలో ఉన్న సమాచారాన్ని అందియ్యడమే కాదు, ఏకాగ్రత, పవిత్రత, నైపుణ్యం సంపాదించడానికే చదువుల లక్ష్యం. మనం నోటితో తినే ఆహారం మన శరీరానికి బలం అనుకొంటున్నాము. కానీ చెవులతో వినే మాటలు, కళ్ళతో చూసే దృశ్యాలు అంతా మనస్సుకు ఆహారమై అది పోషించుకోబడుతుంది. సినిమా ఎంత ఆసక్తిగా చూస్తారో, బుద్ధితో అంత ఆసక్తిగా విషయాన్ని ఆలోచించగలరా? బుద్ధికి సోమరితనం పోవాలి. నది వెళ్ళి సముద్రంలో ఎంత ప్రశాంతంగా కలుస్తుందో అలా నీవు నామ రూప బుద్ధిలోంచి విడుదలై అంతర్యామిలో ఐక్యం కావాలి. శరీరం పొరపాటు చెయ్యవచ్చు. మనస్సు పొరపాటు చేస్తే అంతర్యామి గ్రహిస్తాడు. దానిని మరచిపోకు. విధి తరుముకొని వస్తే సామ్రాజ్యాలే కొట్టుకొని పోతాయి. మన రెండు ఎకరాల పొలం ఎంత?

97. ఇతరులు అపకారం చేసినా ద్వేషించకపోతే అంతర్యామి మిమ్మల్ని అనుగ్రహిస్తాడు. మనస్సు బాగుపడాలి. పవిత్రత ఏకాగ్రత అయితేగానీ మనస్సు అంతర్ముఖం కాదు, సూక్ష్మం కాదు. వాక్కు మౌనం, మానసిక మౌనం అవసరం. అప్పుడు ఈశ్వరుడు నీ ఇంద్రియాలను లాగేసు కొంటాడు. నీ బుద్ధి స్థిరమవుతుంది. జార్జివాషింగ్‌టన్ తల్లి అంది కుమారునితో "నీకన్నా అధికుల్ని చూచి అసూయ పడకుండా ఉండు" అనగా ఆయన అద్భుతంగా ఇలా అన్నారు "నన్ను నేను తక్కువ చేసుకోను. అసూయ వల్లనా చైతన్యస్థాయి తగ్గించుకోను" అని. శరీర భావన లేనివాడు గుర్తింపులను కోరుకోడు. సబ్జక్టు మీద మీకు స్పష్టత వస్తే అప్పటికప్పుడు





మీకు శాంతి కలుగుతుంది. అనేకం అంటే కల్పించబడినదే. వేరుగా కనిపించకపోతే శాంతి కలుగుతుంది. శ్రీకృష్ణచైతన్య తన శిష్యునితో "నీవు మంచివాడివి. ఇతరులు నిన్ను గౌరవించకపోయినా నీవు ఇతరులను గౌరవిస్తున్నావు. బుద్ధిమంతుడవు, ఫలకాంక్ష లేదు" అనగా ఆయన "తొందర పడకండి నా ముక్కులో గాలి పోయాక అనుకోండి" అన్నారు. అంటే మాయ బలీయమైనదని అర్థం. ఒక పుస్తకాన్ని మనం ఈ రోజు రాత్రి 45 పేజీలు చదివి నిద్రపోతే రేపు ఉదయం 46వ పేజీ నుండి చదువుతాము. అలాగే మనం చేసిన సాధనలు కూడా పూర్వజన్మలో ఎక్కడ ముగిసిందో ఈ జన్మలో అక్కడ నుంచి సాధన ప్రారంభమవుతుంది. నీవు చేసే సాధన వృథాపోదు. మన క్షేమాన్ని కోరని వాళ్ళ గొడవలు మనకు ఎందుకు? దానివల్ల వైరభావం వస్తుంది. మనం తటస్థంగా ఉండాలి. ఎవరైనా ప్రమాద మైన మనుషులు మనదగ్గరకి వచ్చినప్పుడు వారి వలలో మనం పడకూడదు. వారితో మనం విరోధం పెట్టుకోవద్దు. వారి గుణాలు రకరకాలుగా ఉంటాయి. దాన్ని బట్టి ఖర్మలు చేస్తారు. దాన్ని వదిలేయి లోపల ఉన్న పరమాత్మను చూడటం నేర్చుకో. తపస్సు వల్ల కవిత్వం, విద్య అబ్బుతుంది. మాండుకోపనిషత్తులో కారికలలో గౌడపాదుడు "నిత్యఖర్మ సమాజ శ్రేయస్సు కోసం చేసే పని కూడా అఖర్మ క్రిందే వస్తుంది. ఖర్మ అంటే శాస్త్రం చెప్పినట్లు చేయడం. విఖర్మ అంటే శాస్త్ర విరుద్ధమైనది". దీనిపై గుజరాత్ శ్రీధర్‌స్వామి "ఏ మంచి పని చెయ్యకపోతే జీవితంలో ఖర్మ చుట్టుకొంటుంది" అన్నారు. ఈ మాట రామకృష్ణ మఠం వారికి ఇష్టం.

98. శరీరంలో రోగ నిరోధక శక్తి బాగా ఉంటే సామాన్యంగా సంక్రమించే రోగాలను తేలికగా బయటకు గెంటేయగలవు. అలాగే మీరు సాధన చేస్తూ ఉంటే దేహాత్మభావన పోక తలంపులు వస్తూ ఉంటే గత జన్మలలో సాధనాబలం తక్కువగా ఉండటం కారణం. మీ సాధనా బలం ముందు మీ పూర్వజన్మ వాసనలు బలం ఎక్కువగా ఉండటం వల్ల మీరు సఫలత కాలేకపోతున్నారు. దేహాత్మబుద్ధి అనే విషవలయం పోయేవరకు

దేహభావన పోదు. దానికి నిరంతరం సాధన కావాలి. గురువు దయ కావాలి. 'భోక్తరామ్' అనే పదానికి మద్వాచార్యులు నీకు ఉన్న ఒక లీటరు పట్టే గిన్నెలో నాలుగు లీటర్ల పాలు పొయ్యగలవా? నీ గత జన్మలలో ఆర్జించిన మంచి, చెడు పనులు ఈశ్వరుని వద్ద నిలవ ఉన్నాయి. ఒకే జన్మలో నీవు అనుభవించలేవు. ప్రతీజన్మలోను కొంత కొంత ఇచ్చి అనుభవింపచేయిస్తాడు. అన్నీ ఒకే జన్మలో ఎలా అనుభవిస్తావు?" అన్నారు. దీనిపై రామానుజులు, శంకరులు "ఆయనే కర్త, ఆయనే భోక్త" అన్నారు. ఈశ్వరుడు ఒకడు ఉన్నాడు అనే విషయం మరచిపోకండి. ఆత్మానుభవం అయిన తరువాత "నీవు మంచిపని చేసావు, నీవు బాగా మాట్లాడావు అంటే ఆ మాటలపై రోత పుడుతుంది. ఆత్మవైభవం చెప్పడానికి ఈ లోకంలో ఉపమానం లేదు. 'ఎరుక' అంటే దైవం. అది మూడు అవస్థలలోను ఉంటుంది. దానిని అనుభవంలోకి తెచ్చుకోవాలి. జెకె అన్నారు "నేను సుఖ పడడానికి కారణం నేను దేనిని లెక్క చెయ్యను" అన్నారు. లోపల గుణాలు పోవాలి. అవి గురువు సహాయం లేకుండా పోవు. మీ చేతిలో ఉన్న పండు మీరు నాకు ఇవ్వవచ్చును, గుణాలు అంత తేలికగా పోవు. ఒక్కోసారి ఉన్నవి పోతాయి. దానివల్ల దుఃఖం రానివ్వకు. వచ్చేదానిని రావద్దు అంటే అవి రాక మానవు. బుద్ధుడు "ఈపాడు లోకం నిన్ను గుర్తించకపోయినా నీ సత్కర్మలు పరలోకంలో నీకు స్వాగతం పలుకుతాయి" అన్నారు. మీరు మైండ్‌ని ఓవర్‌కమ్ చెయ్యాలి. వైరాగ్యం వల్ల మనస్సు బహిర్ముఖం కాదు. అభ్యాసం అంతర్ముఖం చేస్తుంది. బుద్ధుడు సాధనలో ఉండగా "నేను గొప్ప ధనవంతుడిని" అని ఎప్పుడూ అనుకోలేదు.

99. "ఎవరూ ఎవరికీ ఏమీ కారు" ఈ విషయం చంటిపిల్లల విషయంలో పనికిరాదు. చిన్న పిల్లల విషయంలో మమకారం పెట్టుకోకపోతే వాళ్లను పెంచలేము. వాళ్లు ఎదిగిన తరువాత అనుకోవాలి శూన్యస్థితి వల్ల నేను ఫలానా అనే తలంపులు రావు. సరస్వతీ కటాక్షం లేకపోతే సమాధానం చెప్పలేము. నీకు సత్యానుభవం అయితే మనస్సును అదుపులో ఉంచుకోలేక





పోతున్నాను అనే తలంపు రాదు. రూప సౌందర్యం కన్నా గుణ సౌందర్యం గొప్పది. గుణ సౌందర్యం లేకపోతే ఆత్మానుభవం కలుగదు. సైకాలజీ కన్నా ఫిలాసఫీ అర్థం చేసుకోవడం కష్టం. 'నేను' ఉండగా దేహాన్ని 'ఇది' అనకూడదు. గాంధీజీ "నా మార్గం మీకు నచ్చకపోతే నన్ను విడిచి వెళ్లిపోండి. నేను మాత్రం నా మార్గంలోనే ఉంటాను" అన్నారు. సన్మార్గంలో ప్రయాణం చేసేటప్పుడు మీకు అనేక ఆటంకాలు వస్తాయి. అప్పుడు నియమాలు వదిలి పెట్టవద్దు. ధైర్యంగా నడవాలి. భగవంతుడు పనిష్మెంటు ఎందుకు ఇస్తాడు అంటే పొరపాటు తిరిగి చెయ్యకుండా ఉండటంకోసం శిక్ష విధిస్తాడు. అది కూడా దయే. గురువు వద్ద "బలహీనతలను అధిగమించలేకపోతున్నాను" అంటే తిరిగి చెయ్యకు అని అంటారు. అక్కడ ఏదో ఉంది అని అనుకుంటే తెలుసుకోవాలని ఉంటుంది. ఏమీ లేదని గ్రహిస్తే తెలుసుకోవాలనే భావనేరాదు. గీతాసారం "నేను అందరి హృదయాలలో ఉన్నాను" అన్ని సంపదలు, చదువులు ఉన్నా అణిగి ఉంటే ఈశ్వరానుగ్రహం మీ మీద వర్షిస్తుంది. మౌనం మనో నాశనంలోంచి వస్తుంది. దక్షిణామూర్తి మౌనంలోంచి సాధకులకు వందలాది సందేహాలు కాలిపోతాయి. అనుభవం కొన్ని క్షణాల్లో జరిగింది. గీతను ఎంజాయ్ చేస్తే బాహ్య రూపాల ఎంజాయ్‌మెంట్‌కి దూరం అవుతాము. దేహం యొక్క ప్రారబ్ధం జ్ఞాపకరూపంలో వ్యక్తమవుతుంది. దానిని అనుభవింపచేస్తుంది. దానిని మరచిపోండి. వాక్యం వ్రాసేటప్పుడు మధ్యమధ్య కామాలు పెడతాము. కామా పెట్టినప్పుడు వాక్యం పూర్తికాదు. ఫుల్‌స్టాప్ పెట్టినప్పుడు పూర్తి అయినట్టు లెక్క. మన జన్మలు అన్నీ కామాలు. జ్ఞానం వచ్చినప్పుడు మాత్రమే జీవునికి ఫుల్‌స్టాప్. పిల్లల మీద తల్లికి ఎంత ప్రేమ ఉంటుందో చెప్పేవానికి వినేవాని మీద అంత ప్రేమ ఉండాలి. పూర్వజన్మలో చేసిన పుణ్య ఖర్మఫలంగా శ్రవణం చెయ్యాలనే బుద్ధి కలుగుతుంది. ఏ శక్తి అయితే మీ చేత శ్రవణం చేయించిందో ఆ శక్తే మీకు మోక్షం వచ్చేవరకూ వదలదు. సందేహం వద్దు.

100. నామ రూపాలన్నీ భ్రాంతులే. ఆ భ్రమలు పోతే సత్యం

తనంతగా తానుగా వ్యక్తమవుతుంది. స్వరూపానికి దగ్గరగా ఉండు. ప్రపంచానికి దూరంగా ఉండు. మహాత్ముల దయ ఎలా ఉంటుందంటే ఒక చెయ్యి మరో చెయ్యిని తాకితే మనకు స్పష్టంగా తెలుస్తుంది. జ్ఞాని దయ మనకు అంత స్పష్టంగా తెలుస్తుంది. నిప్పుమీద చెయ్యిపెడితే వేడి ఎలా తెలుస్తుందో అలాగే సాధన చేసి అనుభవం వచ్చాక అది మీకు తెలుస్తుంది. కృష్ణుడు గోపికలతో ఆడుకోవడం అనే సంఘటనలు చదువు కోవడం వల్ల మీలో కామం మాయమవుతుంది. గోపికలకు శ్రీకృష్ణుడు దూరమవ్వడం ఆ విరహం చదవడం వల్ల కామంతో మీకున్న బంధం తెగిపోతుంది. ఈ విషయం మీ అనుభవంలోకి వస్తే మనకోసం వ్యాసుడు చెబుతున్నాడు అనే విషయం అంతవరకూ తెలియదు. గోవిందా అని మూడుసార్లు అనుకొని భోజనం చెయ్యాలి. అందరి జీవితాలలోని కొన్ని టర్నింగ్ పాయింట్స్ ఉంటాయి, వస్తాయి. దానినే షేక్స్‌ఫియర్ "సముద్రంలో కొన్ని కెరటాలు లోపలికి తీసుకొనిపోతాయి. కొన్ని కెరటాలు ఒడ్డున పడేస్తాయి. అలాగే ప్రతీ వాని జీవితంలోనూ" తులసీదాస్‌కి భార్య మాటల వల్ల మార్పు వచ్చింది, అలాగే కళింగ యుద్ధంలో అశోకుడికి. శ్రీనాన్నగారు "మీరు అందరూ నాకు ప్రియంగా ఉండాలనుకుంటే నా హృదయానికి దగ్గరగా ఉండాలనుకుంటే నేను చెప్పిన ఈ మాటను అమృతంగా ఆచరించి మీరు తరించండి. గీతలో రెండవ అధ్యాయం పదహారవ శ్లోకం 'ఉన్నది ఏదో ఉంది, లేనిది ఏదో లేదు, ఉన్నది లేకపోవడం అంటూ లేదు, లేని దానికి ఉండటం అంటూ లేదు. ఇది నిశ్చయం'. ఈ శ్లోకం నాకు చాలా ఇష్టం. ఇది నా హృదయానికి దగ్గర" అన్నారు. మీరు శాంతిలో ఉంటే మీకు ఏమి కావాలి. శాంతి మీలో నుండే రావాలి. బయటనుండి రాదు. మనస్సు పరిశుద్ధంగా ఉన్నప్పుడు సత్యాన్ని దర్శిస్తారు. ఉండటంలో శాంతి, సుఖము ఉంది. చిల్లర గొడవలలోనికి వెళ్ళకండి. భగవదనుభవానికి ఏ ఆటంకాలు వస్తున్నాయో గుర్తించి తొలగించుకోండి.

101. మీ ఇంట్లో వాళ్ళు ఎవ్వరూ నిన్ను గుర్తించడం లేదు అని





వాపోకండి. ఈ పనికి మాలిన మాటలు మీరు మొయ్యకండి. కోపం తెచ్చుకున్న వాడికి వివేకం తక్షణం చచ్చిపోతుంది. చెడ్డమనిషి అవుతాడు. అగౌరవాన్ని భరించడం నేర్చుకోండి. బుద్ధుడు స్నేహితునితో "చెన్నా! నీవు ఇప్పుడు బాగుపడవు ఈ శరీరం మరణించిన తరువాత బాగుపడతావు. నీకు నా మాటల విలువ తెలియడం లేదు" అన్నాడు. కారణం వాడికి మొదట అడవికి తీసుకొని వెళ్ళింది నేనే కదా! ఇప్పుడు విళ్ళంతా వచ్చారు అని అహంకారం ఉండేది. వాడు బుద్ధుడు దగ్గరికి వచ్చేవాడు కానీ బయటకు వెళ్ళిపోయేవాడు. చెడు సహవాసాలు చేసేవాడు. త్రికరణశుద్ధి ఉన్నవాని శిరస్సు మీద ఈశ్వరుని దయ వర్షిస్తుంది. "శరీరం అంత దరిద్ర వస్తువు ఇంకొకటి లేదు" అన్నాడు బుద్ధుడు. ఈ మాట నాకు ఆశ్చర్యం వేసింది. శ్రీకృష్ణుడు కూడా చెప్పలేదు. గౌరవం, అగౌరవం దేహానికే కదా! నిప్పుకు వేడి ఎంత సహజమో దేహానికి దరిద్రం అంత సహజం. సభ్యత లేని అజ్ఞానులు సమాజంలో ఎక్కువ. వాళ్ళ భావాలు పట్టించుకొంటే నీవు కూడా బుద్ధి లేనివాడివే. ఎవరికో కలరా వస్తే నాకు రావాలి అనుకోవు కదా! పనికిమాలిన మాటలు మొయ్యకండి. అన్నం తినేటప్పుడు మనస్సు ప్రశాంతంగా ఉంచుకొని తింటే అది ప్రసాదమవుతుంది. ఖర్మని భక్తిగా చేస్తే అంతర్యామి సంతోషిస్తాడు. తృప్తి చెందుతాడు. మోక్షానికి వెళ్ళే తలంపు ఉండాలి. శాంతి ఉండాలి. ఆహారాన్ని ఇష్టంగా తినడం వల్ల ప్యూరిటీ వస్తుంది. మీరు కుటుంబం లేదా పరిశరాలతో బలవంతంగా సంబంధాలు చెడగొట్టుకోకుండా సహజంగా జీవిస్తే మీకు ఆత్మానుభవం కలుగుతుంది. సాధనలో బలహీనతలు తొలగించుకుంటూ ఉంటే చెట్టు నుండి ముగ్గిన పండు రాలినట్లు ఆత్మానుభవం అవుతుంది. కస్తూరిభా గాంధీజీని రాత్రి 12 గంటలకు నిద్రలేపి "తెల్లవారుఝామున 4 గంటలకు మిమ్మల్ని అరెస్టు చేస్తారు కదా! ఇంకా నిద్ర ఏమిటి?" అంటే "ఎప్పుడో 4 గంటలకు కదా! ఈ లోపు నిద్రపాడుచేసుకోవడం ఏమిటి?" అని నిద్ర పోయారు. అది శరణాగతి. మనస్సును పవిత్రం చెయ్యాలి, ఏకాగ్రం చెయ్యాలి.

102. చావు శరీరం నుండి మనలను బలంగా విడదీస్తుంది. ఈశ్వరుడు క్రూరంగా వ్యవహరిస్తాడు. రాగం, భయం, క్రోధాలు వదులుకో. యజ్ఞ, దాన, తపస్సులను సంపాదించు. 'ఛారిటీ' కంటే మెదడులో వచ్చే స్పష్టత గొప్పది. హృదయంలో ఉండటం నేర్చుకుంటే మనస్సు నశిస్తుంది. అన్నం ఉడకడానికి పాత్ర అడుగున మంట అవసరం. అన్నం ఉడికిన తరువాత మంటతో పనిలేదు. అలాగే నీ మనస్సు చలిస్తూ ఉంటే ఉపాసన అవసరం. నిర్వాణస్థితిని పొందిన తరువాత ఉపాసన అక్కర్లేదు. సహనం లేనప్పుడు ఇష్టంలేని పనులు చేదుగా ఉంటాయి. జ్ఞానం గురించి చెప్పడం ఏమిటి? ఇవ్వడమే. భర్త పోయిన ఒక సంపన్నురాలితో పొరుగువారు ఆవిడ ఒంటరిగా ఉన్నప్పుడు "మీ అత్తగారు, మావగారు మంచివారు కాదు" అంటే "ఇటువంటి మాటలు చెబితే మా ఇంటికి రావక్కర్లేదు" అన్నది. వాళ్ళు విషాన్ని ఎక్కించి వాళ్ళ అవసరాలు తీర్చుకుంటారు. అనుగ్రహం వల్లనే సాధన చేస్తాము. తెలివితేటల వల్ల రాదు. అంతా ఈశ్వర సంకల్పం వల్ల నడుస్తోంది అని చదవవచ్చు. దుఃఖ సమయం వచ్చినప్పుడు అనుభవం లేక దుఃఖం వస్తుంది. రామకృష్ణుడు "రాగద్వేషాలు, వాసనలు కుక్కలతో పోల్చారు. కుక్కలు దెబ్బ వేస్తే పోతాయి కానీ కుక్కలకు మాంసం పెడితే ఎలా పోతాయి. అలాగే కోరికలపై దెబ్బ వేస్తే మనస్సు స్వాధీనంలో ఉంటుంది" అన్నారు. ఈ ప్రపంచ గొడవలు మీరు మొయ్యనక్కర్లేదు. కింద పెట్టండి. అవి బరువు. అప్పుడు మీకు సమాధానం దొరుకుతుంది. సబ్జక్టు విషయంలో చాలా బలం కావాలి. దానికి విశ్లేషణ చెయ్యాలి. నైతిక బలం కన్నా అవి గొప్పవి. రాగద్వేషాలను అనుభవించాలి. పారిపోకూడదు. విడదీసి చూసుకో. ఏముంది ఈ లోకంలో? నాలెడ్జ్ అనేది పవర్. అది ఉన్నది నలుబది, సద్విద్యలో ఉంది. ఏ భగవత్ రూపాన్ని అయినా అత్యంత ప్రీతిగా భావించి ప్రేమించి ఆరాధించాలి. జీవిత విధానంలో అంతర్ముఖమై ఉండాలి. కామరాజ్ నాడార్ సిఎంగా ఉండగా "నాల్గవ తరగతి చదివిన మీరు సిఎం ఎలా అయ్యారు?" అనగా "నాకు కామన్ సెన్సు ఉంది, నాన్‌సెన్స్ గొడవలు రానియ్యను" అన్నారు.





మనిషికి అది కావాలి.

103. పరిస్థితులు ప్రారబ్ధానికి వదలండి. మీరు శాంతంగా ఉండాలి. దేహ భ్రాంతి చావుతో సమానం. నిన్ను నీవు పోగొట్టుకోకపోతే బ్రహ్మానుభవం కలుగదు. ఇతరులకు నీవు ఎంత ఎక్కువ సాయం చేస్తే అంత సహాయాన్ని నీవు పొందుతావు. నీ పని ఓర్పుగా చేస్తే అదే యోగం అవుతుంది. జీవితం నీవు అనుభవించడంలోనే తెలివితేటలు వస్తాయి. ఊరికే గాలిలోంచి రావు. నీకు ఎవరికీ ఏమీ ఇవ్వాలనే బుద్ధిలేదు అనుకో తరువాత జన్మలో మీ అమ్మకు ఎంత ఉన్నా నీకు ఇవ్వాలనే బుద్ధి ఉండదు. అది ఈశ్వరుడే చేస్తాడు. ఇరవై సంవత్సరాల కుర్రాడు 80 ఏళ్ళ అనుభవంగా మాట్లాడతారు కొందరు. కొంతమందికి అరవై సంవత్సరాల వయస్సు ఉన్నా మెచ్యూరిటీ రాదు. అనుభవంతోనే తెలివితేటలు వస్తాయి. మీ మనస్సులోకి వచ్చే కష్టాలు తట్టుకోవడానికి మీ మనస్సుకు శక్తి కావాలి. అది శరణాగతి వల్ల వస్తుంది. మీకు అశాంతి వస్తే ఎందుకు వస్తున్నది? ఎప్పుడు వస్తుంది? ఎలా వస్తుంది? అని ఆలోచించారా? ప్రారబ్ధం ఖర్చు అవ్వడానికి ఈశ్వరుడు ఎవరితోనో ఒకరితో తిట్టిస్తాడు వినయంలేని మనిషికి అసలు జ్ఞానమేరాదు. భగవంతుడు పనిచేస్తున్నాడు, నేను పనిచేస్తున్నాను అనుకుంటే ఖర్మ చుట్టుకొంటుంది. ఒకరికి సాహిత్యం అంటే ఇష్టం. దానిని ఎంజాయ్ చేస్తారు. అలాగే డబ్బు, అధికారం దానివల్ల ప్రయోజనం లేదు. చుట్టుప్రక్కల వారికి ఎవరికైనా కలరా, మశూచి, పొంగు లాంటివి వస్తే మనకు కూడా వస్తాయని భయపడతాము. కానీ ఎదుటివాడిలో ఉన్న రాగద్వేషాలు మనకు వస్తాయని భయపడకు మనం అజ్ఞానంలో కూరుకు పోతాము. అప్పడు శరీరానికి ఇచ్చే విలువ మనస్సుకు ఇవ్వడం లేదు. ఇక ఆత్మ ఎలా తెలుస్తుంది? భక్తిలో దేవుడు ఉంటాడు, జీవుడు ఉంటాడు. శరణాగతిలో జీవుడు ఉండడు దేవుడే ఉంటాడు. నేను లేను నీవే ఉన్నావు అంటారు. శరణాగతికి పునాది, విశ్వాసం ఉండాలి. తొమ్మిది మాసాలు నిండిన గర్భిణీ తన గర్భంలో ఉన్న బిడ్డను ఎంత జాగ్రత్తగా చూసుకొంటుందో, కాపాడుకొంటుందో ఆధ్యాత్మిక సాధన చేసేవారు వారిలోని

మంచి గుణాలను అలా కాపాడుకోవాలి. శాస్త్రంలో చెప్పింది "అసలు మీ మంచి గుణాలను హృదయపూర్వకంగా ప్రేమిస్తూ ఉంటే అన్నీ వచ్చి మీ పాదాల వద్ద ఉంటాయి. కంటికి విషయాలు, నాలుక రుచులను అడుగుతుంది. అజీర్తిగా ఉన్నా ఆ కోరికలను మీరు ఓడించాలి. మన భక్తి, సాధన ఎలా ఉంది అంటే పురిటి మంచం మీద శిశువు పడుకున్నట్లు ఉంటుంది. ఆ బిడ్డను చంపడానికి కత్తులు అక్కరలేదు. బలవంతుడు ఒక్క చేత్తో చంపేస్తాడు. అలాగే మన బలమైన వాసన సాధనను ప్రక్కన పడేస్తుంది. మనం సాధనను బలం చేసుకొని వాసనను పడగొట్టాలి. విలువైన జీవితాన్ని దానికే కేటాయించాలి. బ్రాహ్మణులు వేదాలు చదువుకొన్నవారే కానీ ప్రస్తుతం చౌదరీస్ వేదాలు వల్లిస్తున్నారు. పదవుల్లోనూ, ధనంలోనూ వారే గొప్పవారు దానికి వారిలో ఉన్న క్రమశిక్షణ కారణమనిపిస్తున్నది. శంకరాచార్యులు ఒకరితో "నీవు ఇంద్రియగతమైన జీవితాన్నే చెబుతున్నావు అది ఎంత కాలం ఆరోగ్యంగా ఉంటుంది? రోగాలు, ముసలితనం చనిపోటవమే కదా! ఆత్మ గతమైన జీవితం శాంతి, సుఖం, ఎప్పుడూ ఉండటమే" అన్నారు. ఒకరి భార్య భర్తతో "ఇక మాటలు లేవా" అంటే భర్త "మాట్లాడితే ప్రేమ ఉన్నట్లు లేకపోతే లేనట్లేనా?" అన్నారు. హాజ్‌బారన్ తక్కువ మాట్లాడేవారు. దానిపై ఒకరు ఆయనతో "మిమ్ములను గర్వం గలవారని ప్రజలు అనుకోవచ్చు కదా!" అంటే "నాకు గర్వం ఉందో లేదో స్వప్నంలో తెలుస్తాయి కదా ఎవరు ఏమనుకుంటే నాకేల" అన్నారు. కొందరు తక్కువ మాట్లాడతారు. మీకు ఆత్మానుభవం అయింది అనుకో నీ శరీరం కూడా మధురంగా ఉంటుంది. భగవాన్ శరీరాన్ని చూచే కొలది చూడాలనిపిస్తుంది. అలాగే ఆయన కళ్ళు చూచే కొలది చూడాలని పిస్తుంది. ఎందుచేతనంటే బ్రహ్మం తాలూకు లైట్‌ను ఆ కళ్ళు వ్యక్తం చేస్తాయి. మీరు సాధనాపూర్వకంగా ఎక్కువ ఏమీ చెయ్యనక్కరలేదు. దట్ ఇట్ సెల్ఫ్ ఈజ్ బిగ్గెస్ట్ సాధన.



అమృతవాహిని – 2

# 12. గురువైభవం

1. గురువుకు పురిటి కంపు ఉండదు. అంటే తల్లి గర్భం నుంచి వచ్చాను. నేను శరీరమాత్రుడను అనే భావన ఉండదు. శ్రీకృష్ణుడు పుట్టలేదు పుట్టిన వానిలా కనిపిస్తాడు. దేహాభిమానంతో ఉన్న నీవు దేహాభిమానం లేని వానిని ఎలా గుర్తిస్తావు? శ్రీకృష్ణుడు రుక్మిణితో "రుక్మిణీ నీకంటే నా ప్రతిరూపమైన శివునికంటే మరియు బలరామునికంటే నాకు భక్తులు అంటే ఇష్టం" అన్నారు. మనం తరించాలనే విన్నపాన్ని మన్నించి అజ్ఞానం నుండి విడుదల చేసే గురువుకు కృతజ్ఞత కలిగి ఉండాలి. మీ గురువు నిజ గురువు అయితే మీ శరీరానికి మరణం వస్తే ఆనందంగా మరణించాలి. గురువు అనుగ్రహం ఉన్నవారు రక్షించబడితీరతారు. గురువు దర్శనం జరిగిన తరువాత సాధకునకు దుఃఖం వస్తే వాడు గురువు కాదు. గురు దర్శనంతో ఆనందం రావాలి. నాకు ఆత్మజ్ఞానం కలుగకపోతే జనాన్ని పోగుచేసుకునే బుద్ధి కలుగుతుంది. నాకు ఆత్మజ్ఞానం కలిగితే జనం గుంపులుగా పరుగున నా దగ్గరకు చేరతారు. గురువు జ్ఞానదాత. భూమిలో పండిన పంటలు తింటూ మనం బొండాంలా తయారు అవుతున్నాము. చివరికి భూమిలో కలసి పోతున్నాము. శరీరానికి స్నానాలు చేయించి, పౌడర్లు వ్రాసినా చావు తప్పడం లేదు. వీటికి అతీతంగా మనలో పరమాత్మ ఉన్నాడు. నకిలీ నేను నిజమను కున్నంత కాలం సాధన ఏమి చేస్తాము నీ శరీర మనోబుద్ధులు నీవు కావు. అది నీవు అనుకొంటున్నావు. అది నీవు కాదని గురువు చెబుతాడు. ఏది నీవో అది నీవు అయ్యేటట్లు చేస్తాడు. అది గురు వైభవం. నా చూపుల్లో చల్లదనం ఉంటే నేను మిమ్మల్ని చూస్తున్నాను అంటే మీకు ఉన్న దుఃఖం ఆరిపోవాలి. ఇతరులకు బోధించడం కాదు. మన కళ్ళల్లో ఏదైనా దోషం ఉంటే తొలగించుకోవాలి. కొందరికి చెవులతో వినేటప్పుడు చెడుమాటలు చెప్పేవారు ఉంటే వారికి ఇష్టం. చెవులలో గులిమి తొలగించుకోవడం, కంటిలో మేహచుక్కలు తొలగించడం డాక్టర్లు చేస్తారు.

మనిషి మానసంలో ఉన్న చెడు సంస్కారాలు గురువు మాత్రమే తొలగిస్తాడు. మోక్షం వచ్చాక నాకు మోక్షం వచ్చింది అనేవాడు ఉండడు కదా! అన్నారు బుద్ధుడు.

2. ఈ గొప్పలు, తిప్పలు, ఈ బంధాలు, భయాలు, ఈర్ష్యలు ఈ రూపాలు అన్నీ చైతన్యంలో కల్పించబడ్డాయి. వాసన బయటకు వెళ్ళేటప్పుడు అది మిమ్మల్ని పీడించివేస్తుంది. మీమీద ప్రేమ కొలది మీలో ఉన్న సూక్ష్మాతి రూపంలో ఉన్న రాగబంధాలను పెద్దవి చేసి వాటిని నీవు ఎదుర్కొనే శక్తిని నీకు ఇచ్చి వాటిని తొలగిస్తాడు గురువు. మీకు దుఃఖపడే యోగం ఉంటే, ఇష్టం లేని తలంపులను మాటిమాటికీ పంపుతాడు ఈశ్వరుడు. "నాకు ఆ ఇష్టం లేని తలంపులు రాకూడదు" అనుకున్నా అవి రాకమానవు. కానీ మీకు గురువనుగ్రహం ఉంటే వాసనలు అనే బండరాళ్ళు అన్నీ కొట్టుకు పోతాయి. ఆవరణ దోషం ఏమి చేస్తుందంటే "మా అబ్బాయి తాగి బయటకు వెళ్ళాడు ఏమైపోతాడో" అని, అలాగే ఒక అమ్మగారు "మా అల్లుడు తీవ్రవాది మా అమ్మాయిని ఏం చేస్తాడో" అలాగే ఒకామె "మా మనమరాలు పరిస్థితి ఏమవుతుందో" అంటుంది. ఇది అంతా మనవాళ్ళచుట్టూ మనం వేసుకున్న బందులదొడ్డి. అదే ఆవరణ దోషం. ఒక్క గురువు అనుగ్రహం వల్ల మాత్రమే ఆవరణ దోషం నుండి బయటపడగలము. యాత్రలు చేసిచేసి కాళ్ళు అరిగి పోయినా, దానాలు చేసి చేసి చేతులు అరిగిపోయినా గురువు యొక్క అనుగ్రహం ముందు సాటిరావు. నాకు జనాన్ని పోగుచేసుకునే ఉద్దేశ్యం లేదు. అదే ఉంటే తెల్లవాళ్ళను వందలాది మందిని నాచుట్టూ తిప్పకోగలను. నాకు ఈశ్వరుడు ఇచ్చిన అనుగ్రహం ముఖ్యం. జనం వల్ల అనుగ్రహం రాదు. మీకు కష్టాలు వస్తే మీ గురువుకు తెలియకుండా రావు. అవి మీ గురువు పంపించినవే. ఎందుకంటే నీలో తూకం ఎంత ఉందో తూచి నీకు దానిని అధిగమించే శక్తిని కల్పించి మిమ్మల్ని ప్రేమలో ముంచేవాడే గురువు. గురువనుగ్రహం లేకుండా ఈ సృష్టిలో ఎవ్వరూ ఈ ఊబి నుండి గట్టు ఎక్కలేరు. అజ్ఞానమనే ఊబిలోనే ఉండిపోతారు. గురవునుగ్రహం





లేకుండా "ఈ కనిపించే సృష్టి అంతా స్వప్నము అనే సంగతి మీకు తెలియదు" అని వ్యాసులవారు రెండు చేతులు పైకెత్తి చెప్పారు. గురువుని ఎన్నుకోవడంలో పొరపాటు జరిగితే ఆ పొరపాటు ఎన్నుకొన్న వానిదే కానీ గురువుది కాదు.

3. గురువుతో మానసిక అనుబంధం పెట్టుకొన్నా చాలు బాగు పడతారు. నీవు భౌతికంగా ఆయన దగ్గర ఉండటం కుదరకపోయినా సమస్యలు ఏమీ లేవు. మీకు జున్ను సమకూరింది అనుకోండి మీ అమ్మాయి దూరప్రాంతంలో ఉంది అనుకోండి మీరు ఏమనుకొంటారు "అయ్యో! అమ్మాయి ఉంటే తినేది. దానికి జున్ను అంటే ఎంతో ఇష్టం" అని బాధపడతారు. అలాగే మీ గురువు తాను పొందిన అమృతస్థితిని నీతో పొందింపచెయ్యాలని, అయ్యో పొందలేకపోతున్నాడని బాధపడతాడు. మీ అమ్మాయి మీద మీకు ఉన్న ప్రేమకన్నా ఎన్నోరెట్లు మీ గురువుకు మీమీద ఉంటుంది. మీ కుటుంబ సభ్యులు నిన్ను వదిలినా, నీ గురువు నిన్ను వదలడు. తన స్థితిని పొందేవరకు శాస్త్రం "నీవు ఆత్మవిశ్వాసం కలిగి ఉండు" అని చెప్పి వదిలేసింది. గురువు అలా చెప్పి ఊరుకోడు. నీకు ఆత్మ విశ్వాసం ఎలా కలగాలో మీ ఇంటిలో ఏదో ఒక పరిస్థితి కల్పించి ఆత్మవిశ్వాసం కలిగిస్తాడు. వాడు గురువు. మిమ్మల్ని ఆసుపత్రిలో (బాధల్లో) ఉంచడు పదిరోజులలో తీసుకొని వచ్చేస్తాడు. అంటే ప్రారబ్ధం ప్రకారం కొంత అశాంతి కలిగినా కొద్ది సమయంలోనే అందులోనుండి విడుదల చేస్తాడు. సిద్ధి, బుద్ధి ప్రదాయకుడు వినాయకస్వామి. మూడు అవస్థలకు ఆధారంగా ఉన్నవాడు పరమాత్మ. రామకృష్ణపరమహంసగారి శిష్యుడు "సాధనలో సాధక బాధకాలను తెలుపగా ఆయన నీకు ప్రపంచం మీద ఉన్న వ్యామోహాన్ని తినివేస్తాను" అన్నారు. వాడు గురువు. మీకు కోటిరూపాయల ఆస్తి ఉంది అనుకోండి మీరు మీ అమ్మాయికి కోటిరూపాయల ఆస్తి ఉంటే బాగుండును అని దానికోసం ప్రయత్నం చేస్తారు. సఫలం కావచ్చును. భౌతికంగానే ఈ చిన్న మనసుకే ఇంత శక్తి ఉంటే అభౌతికమైన గురు ప్రేమకు ఎంత శక్తి

ఉంటుందో తెలుసుకోండి. ఇది కుండ సంబంధం కాదు. స్మశానంలో దహన క్రియతో అటు శవం కేసి చూడకుండా ఇంటికి రావడం కాదు. అలా సంబంధం తెగిపోదు. మరుజన్మకు వస్తుంది. నిన్ను తరింపజేస్తుంది. వివేకానందను కొందరు విద్యార్థులు ఆకర్షిస్తే వారి తల్లిదండ్రులు అనుకునేవారు "ఈయన మన పిల్లలను పాడుచేస్తున్నాడు" అని. దానిపై వివేకానంద అంటారు "విద్యార్థుల అభివృద్ధి కోసం మీ మాటలు పడవలసి వస్తున్నది". గురువు యొక్క వేదన అది.

4. మీ చెయ్యి మంచుగడ్డ మీద ఉంచితే చల్లగా ఉంటుంది. మీరు మల్లెచెట్టు దగ్గర ఉంటే వాసన వచ్చితీరుతుంది. చెరకురసం నోటిలో పోసుకుంటే తీపి తెలుస్తుంది. అలాగే జ్ఞాని చూపు, స్పర్శ, మాట మీకు ఇష్టం లేకపోయినా మీకు తెలియకుండానే అనుగ్రహం వస్తుంది. మీరు ఒక మహాగురువును దర్శించారు అనుకోండి. ఆయన మీ వంక చూడలేదు అనుకోండి మీరు బాధపడతారు. కానీ గురువు ఆత్మ. మీ పాచి ముఖాలను ఆయన ఏమి చూస్తాడు? ఆత్మను చూడటం ఏమిటి? గురువు మౌనం అత్యంత బలీయమైనది. నిప్పు కాల్చకపోతే అది నిప్పు కాదు. ప్రేమించలేని వాడు జ్ఞాని కాదు. జనాన్ని పోగుచేసుకోవడం, భక్తులను పోగుచేసుకోవటం నా ఉద్దేశం కాదు. మీ దుఃఖాన్ని తినడంకోసమే నేను ఉన్నాను. జ్ఞానికి తెలియదు వారి ద్వారా కాంతి తరంగాలు లోకానికి అందుతున్నాయని. నావల్ల కాంతి తరంగాలు లోకానికి అందుతున్నాయి అని అనుకొంటే వాడికి జ్ఞానం లేదని గుర్తు. వారికి తనకన్నా భిన్నంగా లోకం ఉందని భావించరు. అంతా మౌనంగా జరిగిపోతున్నప్పుడు మాటలతో పని ఏముంది? మాటలతో పని లేదు. మీ శరీరానికి తొంబై రోగాలు ఉన్నాయి అనుకోండి అవి స్మశానానికి వెళ్ళిన తరువాత కాలిపోతాయి. కానీ కాలని రోగాలు రెండు ఉన్నాయి అవి నాది నేను ఇవి గురువనుగ్రహంతో పోవాలి. రామకృష్ణ పరమహంస గారి వద్దకు కొత్తగా వస్తున్న వారితో ఆయన అంటారు. "నీవు నా దగ్గరకు వస్తున్నావు" అనగా ఔనండి "మీ మీద ఏదో ప్రేమ కలుగుతుంది"





అంటే నీవు బాగుపడే రోజులు వచ్చాయి. కాబట్టే ప్రేమ కలుగుతుంది అన్నారు. అది గురువైభవం. గురువు హృదయం మాధుర్యం, గురువు రూపం మాధుర్యం, గురువు మాట మాధుర్యం. సూర్యుడు కాంతికి దాత, గురువు శాంతికి దాత. గురువు ఒడిలో మనంతమనం కూర్చోలేము. ఆయన కూర్చోబెట్టుకుంటే కూర్చోగలం. గురువు తనను ప్రేమించేలా చేస్తేనే గురువును మనం ప్రేమిస్తాము. లేదంటే గురువును మనం ఎలా ప్రేమించగలం?

5. రాముడిని చూచిన వెంటనే శబరికి ఇంద్రియ, మనో చాపల్యములు ఆగిపోయాయి. సమాధిస్థితి పొందినది. అది గురువైభవం. భగవదనుభవం. భగవాన్ సమక్షంలో నలుగురు ఉండగా ఒకరితో ఎక్కువ మాట్లాడుతున్నారు. ఒకడు తనతో మాట్లాడటంలేదని బాధతో మాట్లాడడానికి ప్రయత్నిస్తే ముఖం ప్రక్కకు తిప్పకున్నారు. కోపం వచ్చి బయటకు వెళ్ళి పాత హాలు దగ్గర ఉన్నాడు. మిగిలిన ముగ్గురు బయటకు వెళ్ళగా ఈ బాధ పడే వాడిని చెయ్యి ఊపి దగ్గరకు రమ్మన్నారు. "నీకు మాటలు అక్కర్లేదు, వాళ్ళకు కావాలి, నీవు ఉన్నత స్థితిలో ఉన్నావు" అన్నారు. గురువు అలా వ్యవహరించి తిట్టుకునేలా చేస్తాడు. ఆఖరున ఒక తన్ను తన్ని ఆత్మగూటిలో పడేలా చేస్తాడు. గురువు నీలో వారిపై ఎన్ని వ్యతిరేఖ ఆలోచనలు ఉన్నాయో రానిచ్చి తరువాత తన ఒడిలోకి తీసుకుంటాడు. గురువు నిశ్శబ్దంగా పనిచేస్తాడు. గురువు యొక్క సహచర్యం వల్ల హృదయంలో ఏదో ఉంది? ఏదో ఉంది అనిపిస్తుంది. కానీ నీ మనస్సు ఆలోచనలు రాలిపోతే సత్యం ఎరుక పడుతుంది. ఫిలింలో బొమ్మలు చిన్నవిగా ఉంటాయి. కానీ ప్రొజక్టర్ ఆన్ చేస్తే తెరమీద పెద్దవిగా కనిపిస్తాయి. అలాగే నీకు ఉన్న సంస్కారాలు నీ మెదడులోకి ఈశ్వరుడు పైకి తిప్పినప్పడు కానీ ఆ తలంపులు నీకు తెలియవు అప్పడు నీవు అనుకొంటావు "అమ్మో ఎన్ని సంస్కారాలు ఉన్నాయో" అని బాగా తెలుసుకుంటాము. దాని బలం ఎంత ఉందో అంతకన్నా బలాన్ని నీ గురువు నీకు కలుగజేసి ఆ తలంపులను కాల్చే శక్తిని నీకు గురువు ఇస్తారు. ఆత్మానుభవం కలుగజేస్తాడు గురువు. చైతన్యానికి

పెద్ద మనుషులు ఏమిటి? సమాజంలో మేము గొప్పవాళ్లము అనుకొంటారు. ఇది మనస్సు కల్పించేది. దాని జైలులో పడకు. దానిని గ్రహించాలంటే గురువు ప్రార్థిస్తే అది చల్లబడి పోతుంది. తరువాత అది నశిస్తుంది.

6. ప్రారబ్ధంలో ఏదైనా దోషం ఉంటే పొరపాటు మాట వస్తుంది. అలాగని వారు చెడ్డవారు అనుకోకండి. వాడు మంచివాడే కానీ అది దోష ఫలితం అని గ్రహించాలి. ధర్మరాజు యుద్ధంలో అర్జునుని చేతలు చూచి ఎందుకురా ఆ గాండీవం, గుణ్ణాలను త్రోలు. కృష్ణుడు గాండీవం పట్టుకుంటాడు" అన్నాడు. ధర్మరాజు మంచివాడే ప్రారబ్ధ విశేషం అటువంటిది. దానిపై అర్జునుడు "నన్ను అంటే బాధపడను. నా గాండీవాన్ని అన్నవాడిని చంపుతాను" అన్నాడు. ఇక్కడ రెండూ మాయే. ఈ తగువును పరమాత్మ మాటలతో ధర్మరాజును తిట్టించి అంటే చంపడమే ఆరకంగా శపథాన్ని నెరవేర్చి సఖ్యత చేకూర్చాడు. గురువు చేసే పని కూడా అలాగే ఉంటుంది. లోపల ఉన్నవాడు స్వచ్ఛంగా ఉన్నాడు, స్వతంత్రంగా ఉన్నాడు. కృష్ణుని గురించి ఒకరు "ఇలా చేసాడేమిటి?" అంటే భగవాన్ "ఆయన స్వతంత్రుడు. అడగడానికి నీవు ఎవరవు?" అన్నారు. గురువుతో బాహ్య ప్రదర్శన అక్కర్లేదు. అది మధుర భావన. మురుగునార్‌కు భగవాన్‌తో ఉన్న సంబంధం అటువంటిది. మురుగునార్ చివరగా కూర్చునేవారు. పిలిస్తే భగవాన్ సన్నిధికి వచ్చేవారు. బుద్ధికి, మనస్సుకు గుర్తింపులు కావాలి. గురువు బుద్ధికాదు ఆత్మ. గురువు తీర్పులు చెప్పడు. మిమ్మల్ని సంస్కరించి ఆత్మాకారం చెందేలా చేస్తాడు. సహనం లేకుండా హృదయం యొక్క లోతులు తెలియవు. మీ కోరికలు నెరవేరితే ఆ శాంతి కొంతకాలమే ఉంటుంది. కానీ గురువు నుండి వచ్చే శాంతి శాశ్వతంగా ఉంటుంది. అది కాలానికి అతీతంగా ఉంటుంది. కొలమానాలకు అతీతంగా ఉంటుంది.

7. సూరి నాగమ్మగారికి తల్లి మూడు సంవత్సరాల వయస్సులోనూ, తండ్రి పది సంవత్సరాల వయస్సులోనూ చనిపోయారు. ఆమె భర్త ప్రేమకు కూడా కరువైనది. రామాయణం, భాగవతం చదువుకునే వారు. శాంతి





దొరకలేదు. ఆమె భగవాన్‌ని దర్శించడానికి వెళితే కళ్ళు మూసుకున్నారు. ఐదు నిమిషాల తరువాత కళ్ళు తెరిచి మొదట ఆమె వంక చూచారు. అప్పుడు ఆమె "భగవాన్ నా జీవితాన్ని చదివారు, నాకు రక్ష దొరికింది" అనుకున్నారు. వారి సన్నిధిలో వారు మాట్లాడిన పది మాటలు వ్రాసి చూపించారు. "ఎంత బాగా వ్రాసావు" అన్నారు. ఆ మాటలే రమణాశ్రమ లేఖలుగా ప్రసిద్ధికెక్కాయి. భగవాన్ పది నిమిషాలలో మరణిస్తారు అనగా వారిని పలుకరించే ప్రయత్నం చెయ్యక "భగవాన్ కేన్సర్‌తో బాధపడటం కంటే చనిపోవడమే మంచిది" అనుకొన్నారు. అది మధుర భక్తి. దాన్ని మాటలతో చెప్పలేము. ఆమెకు భగవాన్ మరణించలేదని ఎక్కడికీ వెళ్లలేదని అనిపించింది. ఈ సృష్టి అంతా మాయ అని తెలుసుకుంది. ఒకరికి భార్య అంటే చాలా ఇష్టం. ఆమె మరణిస్తే ఆ బూడిదను చూసి ఇలా అన్నారు "నా ప్రేమ మూర్తి నా భార్య బూడిదగా వచ్చింది. చివరకు గంగానదిలో కలిపితే గంగామాత భరిస్తుంది" అన్నారు. అలాగే మన పాపాలను గురువు భరిస్తాడు. నీవు గురువును విమర్శించినా, ఆయన మీద పేడ చల్లినా, అత్తరువు చల్లినా ఆయన పని ఆయన చేసుకొనిపోతాడు. ఏసు ఈ ఒక్క వాక్యంతో ప్రపంచ ప్రఖ్యాతి పొందాడు. తనను చిత్రహింసలు పెడుతూ పరుష వాక్యాలతో బాధపెడుతున్నప్పుడు "తండ్రీ! వారు ఏమి చేస్తున్నారో వారికి తెలియడం లేదు. వారిని క్షమించి ఆశీర్వదించు" అన్నాడు.

8. మీరు ఎంత తెలివైన వారు అయినా మనస్సు హృదయాభి ముఖంగా ప్రయాణమైనప్పుడు నా మాటల ప్రయోజనం మీకు కనిపిస్తుంది. షిరిడీ సాయినాధుణ్ణి ఒకరు ఇలా అన్నారు "మహాత్ములను దర్శించిన వారికి పుణ్యం వస్తుందా?" అనగా బాబా "ఒక చెట్టును చూపిస్తూ ఆ చెట్టుకు ఎన్ని పిందెలు ఉన్నాయి? అన్నీ పళ్ళు అవ్వవు. కొన్ని పక్షులు తినేస్తాయి. కొన్ని కోతులు తింటాయి. అలాగే అనేక రకాలుగా చెట్టునుండి విడిపోతాయి. కాని కొన్ని మాత్రమే పండ్లు అవుతాయి. అలాగే గురువును చివరి వరకూ అంటిపెట్టుకున్నవారే తరిస్తారు" అన్నారు. నీవు ఎన్ని గ్రంథాలు చదివినా,

ఎంత పాండిత్యం సంపాదించినా మహాగురువు సన్నిధిలోంచి వచ్చిన శాంతి తరంగాలు పైవాటికి ఏమీ సరిపోవు. జ్ఞాని ఏదైనాచెబితే దానినే రెండవసారి చెబితే అది చాదస్తం కాదు. అది మంత్రం అన్నారు ఒకరు. గురువు మీ బుద్ధిని ఆత్మమీద ప్రసరింపజేస్తాడు. ఈ సృష్టి మాయ, భగవంతుని లీలలు చూచిన వానికి ఆనందమే. గురువు నిన్ను ఎలా బాగుచెయ్యాలో చూస్తూ ఉంటాడు. నిరంతరం ఆయనకు వేరే పని లేదు. అభిప్రాయాలు లేవు. నాతో నాలుగు మాటలు చెప్పించేది గురువనుగ్రహమే. నలుగురు విరోధుల మధ్య పడిపోకుండా ఇలా నిలబడడానికి కారణం అనుగ్రహమే. గురువు నీ వాసనలలో నుండి బయటపడడానికి కొన్ని సంకటాలను కల్పిస్తాడు. నీలో మార్పు రాకపోతే తిరిగి మరలా తలుపు సందులో పెట్టి నొక్కడానికి చూస్తాడు. ఎలాగైనా నీ అజ్ఞానంలోంచి బయట పడేలా చేసి ఆనంద సాగరంలో ఈదులాడేలా చేస్తాడు. అన్నీ గురువు కల్పించినవే. నీనెత్తిమీద ఎన్ని మొట్టికాయలు మొట్టాలో? కాళ్లతో ఎన్ని తన్నులు తన్నిస్తాడో అన్నీ గురువే చేయిస్తాడు. ముందు విషయం చెబుతాడు వినికూడా నీ ప్రవర్తన మార్చుకోకపోతే సంకట పరిస్థితులు కల్పిస్తాడు. గురువును జ్ఞానదాత అంటారు.

9. మీరు విషయ చింతనలో ఉంటే మిమ్మల్ని ఆత్మ చింతనలోకి తీసుకొని వస్తాడు. గురువు అంతర్యామిగా ఉంటాడు. ఆయనకు ఏమీ తెలియదని అనుకోకండి, ఈ మనస్సును ఎలా అధిగమించగలను అని బాధపడకండి? నిరాశ చెందకండి, కంగారు పడకండి, ఆందోళన పడకండి. వాటి సంగతి ఆయన పరిష్కారం చేస్తాడు. వందల జన్మల వాసనలను మీ సహస్రారంలోనికి తీసుకొనివచ్చి సఫరింగ్ చేసి బయటకు లాగి కాల్చేస్తాడు. మీ గురువు మీకు జ్ఞానం ఇస్తానని చెప్పడు. ఇచ్చేటప్పుడు చెప్పడం దేనికి? భగవంతుడు నీకు స్వేచ్ఛ ఎక్కడ ఇచ్చాడు అంటే ప్రారబ్ధంతో తాదాత్మ్యం పొందకుండా ఉండడానికి. మంచి జరిగితే నా తెలివితేటల వల్ల జరిగింది అనుకోవద్దు. చెడు జరిగితే అమాయకత్వం వల్ల జరిగింది అనుకోవద్దు.





దేహ ప్రారబ్ధాన్నిబట్టి జరిగింది అంతే. సాధనా బలంతో తాదాత్మ్యం పొందకుండా ఉండగలవు. సమాజభాష, దైవభాషతో గీత, భాగవతం వ్రాసారు. సమాధిస్థితిలో చెప్పిన భాష అది. రేపు ఏమి జరుగుతుందో తెలియనివారు భాగవతం, భగవద్గీతలను విమర్శిస్తారు. కాఫీ కప్పులో పోస్తూ ఉంటే నిండిన తరువాత అది పొరలిపోతుంది. అలాగే మీకు వెయ్యి ఆవుల పాలు ఉంటే మిగిలినవి ఇతరులకు పోస్తాము. అలాగే మీకు ఆత్మానందం కలిగితే నీవు అనందం పొందడమే కాదు నీ నుండి అనేక మందికి ఆనందాన్ని పంచవచ్చును.

10. మౌనం బంగారం అయితే మాట వెండి. మీరు ఉబలాట పడుతున్నారు కాబట్టి మాట్లాడుతున్నాను. నాకు మౌనంలోనే ఉండాలని ఉంది. జీవసమాధి చేసేవాడి ముక్కులో గాలిని వాడే లాగేసుకుంటాడు. సదాశివ బ్రహ్మేంద్రులవారు జీవసమాధి పొందారు. అంటే బ్రతికి ఉండగానే వారి సమాధి దగ్గర కూర్చుంటే భరించలేని శాంతి కలుగుతుంది. ఆయన సమాధిలోకి వెళ్లినప్పుడు ఇలా అన్నారు. ఒకరు కాశీ నుంచి ఒక లింగం తీసుకొని వస్తారు. దానిని సమాధిపై ఉంచండి. ఇక్కడ ఒక చెట్టు మొలుస్తుంది అని వారు త్రికాలజ్ఞానులు. రాముడు ధర్మావతారం. కృష్ణుడు ప్రేమావతారం. కాంచీపురంలో ఒక ఆళ్వార్ పెరుమాళ్లపై అద్భుతమైన కవిత్వం వ్రాసారు. ఆ దేశరాజు సంతోషించి తనపై కవిత్వం వ్రాయమని అనగా ఆయన తిరస్కరించడంవల్ల దేశ బహిష్కరణ చేసారు. ఆ రాత్రి పెరుమాళ్ళు రాజుకు స్వప్నంలో కనిపించి "ఆయనను దేశ బహిష్కరణ చేయిస్తే నేను మాత్రం ఇక్కడ ఎందుకు నేనూ వెళ్లిపోతాను" అనగా రాజు వెంటనే ఆళ్వారులను బ్రతిమాలి ఇక్కడే ఉండమన్నాడు. దేవుని వైభవం అది. "కాకులు చంద్రుణ్ణి ఎలా చూడలేవో ఖర్మఫలకాంక్ష గలవాళ్ళు జ్ఞానాన్ని పొందలేరని జ్ఞానదేవుడు అంటారు". నాకు కాళ్ళు ఉన్నాయి, చేతులు ఉన్నాయి. "సముద్రాన్ని ఇవతలి నుండి అవతలకు ఈదేస్తాను, గాలిలో విమానంలా పయనించగలను" అనడం ఎలాంటిదో "గురువు సహాయం

లేకుండా మోక్షాన్ని పొందేస్తాను" అనడం కూడా అటువంటిదే.

11. "మీరు ఆత్మజ్ఞానం సంపాదిస్తే సమాజానికి మీ ద్వారా జరిగే మేలు ధనవంతుల, దాతృత్వం వల్ల, ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల జరుగదు" అన్నారు భగవాన్. మరణ సమయంలో బుద్ధుడు ఆనంద్‌తో "ఈ స్థలంలో బుద్ధుడు శరీర త్యాగాన్ని చేసాడనే గుర్తు కూడా అక్కర్లేదు. సాధారణ మనిషిని దహనం చేసినట్లే చెయ్యి" అన్నారు. వివేకానంద బుద్ధిని గురించి "అపూర్వమైన ప్రేమ, అపూర్వమైన ధైర్యం గల ఆయనను చిన్న చిన్న మనస్సులు తెలుసుకోలేవు. నిష్కామ భావన, ఇంద్రియాతీతమైన ప్రేమ" అన్నారు. మీ చెడ్డ ఖర్మలలో నుండి నేను మిమ్మల్ని విడుదల చేసాను అనుకోండి అదే సత్కర్మ. రాముడు అరణ్యవాసానికి వెళుతూ తల్లి కౌసల్యతో 'వెళ్ళి వస్తాను' అనగా ఆమె 'ధర్మాన్ని ఆచరించు' అనలేదు 'ధర్మమే నీ స్వరూపం' అంది. బుడబుక్కల మాటలు చెప్పేవారి వల్ల దొంగ నేను పోదు. ధర్మాన్ని ఆచరించడం వల్ల తొలగిపోతుంది. జ్ఞాని వైభవం "మనలో ఆయనను చూచుకొంటాడు, ప్రకృతి మనుషులు కొలతలు వేస్తారు. జ్ఞానిలో కొలతలు లేవు. గాంధీజీ జీవిత చరిత్రలో మంచి వ్రాసారు, చెడ్డా వ్రాసారు. చెడ్డ ఎందుకు వ్రాసారని ఇతరులు అడిగితే "ఆ పొరపాటు మీకు జరుగ కూడదని" బదులు చెప్పారు. పూర్ణజ్ఞాని మహాసముద్రుడు. జ్ఞాని మనలను ప్రేమించాలని ప్రేమించడు. ప్రేమించకుండా ఉండలేడు కాబట్టి ప్రేమిస్తాడు. ఆయన ప్రేమ జుర్రుకున్నవారు ధన్యులు.

12. తెలుసున్న వ్యక్తి కనిపించినపుడు గురువు చూడకుండా వెళ్ళిపోతాడు. అది వ్యక్తిగతమైన స్పందనకాదు, నీ వాసనలు బయటకు గెంటడానికి చేసే పని. అది ఒక డ్రామా అని తెలుసుకున్నవారు ధన్యులు. అక్కడ జీవుడు లేడు చైతన్యమే ఉంది. గురువుకు జనం లేకపోయినా, ధనం లేకపోయినా, కీర్తి లేకపోయినా గురువు గురువే. పరమహంసగారు మహేంద్రనాథ్ గుప్తాతో "ఏమి చెప్పమంటారు నాకు శరీరం ఉందనే విషయం మరచిపోతున్నాను. నాకు అహంకారం ఉండడానికి కారణం





మీకు బోధించడానికే 'నేను'ను ఈశ్వరుడు ఉంచాడు" అన్నారు. గురువు అంటే మీ నిజమైన ఇంటికి తీసుకెళ్ళేవాడే. ఇంద్రియాలకు లోకం అంటే ఇష్టం. జీవుడు ఆ ఇంద్రియాల సహాయంతో ప్రకృతి అనే మహాసముద్రంలో పడిపోతాడు. అందులోనుండి బయటపడలేడు. నిరంతరం గురువుని స్మరించడం వల్ల బయటపడతాడు. ఇంట్లో వారిమీద, సమాజంమీద కోపం వస్తే సరిచేసుకోండి. వారిని ప్రేమించండి. నేను చెప్పానని ప్రేమించండి. అప్పుడు మీకు ఏది శ్రేయస్సో ఆ జ్ఞానాన్ని మీకు సమకూరేలా చేస్తాను. శరీరానికి రోగం వచ్చినా, మనస్సుకు సంతోషం వచ్చినా, దుఃఖం వచ్చినా అవి మనం కాదు. అవి మనం అనుకొని చావు పట్టుకులలో కొట్టుకొనిపోతున్నాము. దానిని గురువే ఆపగలడు. మరి ఎవరివల్లా కాదు. గురువుకు సృష్టితో పనిలేదు. నీతో పని ఏముంటుంది? ఆయన చేసేది ఆయన చేస్తారు.

13. భూప్రదక్షిణ వినాయకుడు చెయ్యకపోయినా శివపార్వతులకు ప్రదక్షిణ చేసి వారి నుండి పండును పొందాడు. తనకు దక్కలేదని సుబ్రహ్మణ్యుడు కోపంతో ఫళని వచ్చాడు. వారిని అక్కడ దండాయుధ స్వామి అంటారు. కన్యాకుమారి చెంతఉన్న తిరుచెందూర్‌లో తారకాసురుడు అనే రాక్షసుణ్ణి సంహరించాడు. చెన్నై దగ్గర తిరుత్తణిలో శాంతి సుబ్రహ్మణ్యుడిగా స్థిరపడ్డాడు. 'స్వామి మలై' కుంభకోణం దగ్గరలో ఉంది. అక్కడ శివునకు ఓంకారం గురించి బోధించాడు. ఇలా తమిళనాడులో ఆయనకు ఆరు క్షేత్రాలు వెలిసాయి. సంకల్పమే వల్లీదేవి. ఆ సంకల్పాన్ని నెరవేర్చడానికి శక్తిని దేవయాని ఇస్తుంది. అంటే క్రియ, శక్తులు రెండూ సుబ్రహ్మణ్య శక్తులే. తమిళ భాషను కల్పించినది మురుగ (అంటే సుబ్రహ్మణ్యుడు). ఆయన ఆత్మవిద్యను సులభంగా తెలుపుటలో అగ్రగణ్యుడు. ఆ ఆత్మజ్ఞానమే రూపం ధరించి వచ్చింది. అదే రమణుడు. మనంతట మనం చదివినది విద్య. గురుముఖతా నేర్చుకున్నది అధ్యయనం. దీనితో త్వరగా అభివృద్ధి సాధించవచ్చు. కంటికి కనిపించేవాడు గురువు.

కనిపించని వాడు దేవుడు. కనిపించే గురువు మీద విశ్వాసం లేనప్పుడు, కనిపించని దేవుని మీద ప్రేమ ఉంది అంటే అది బూటకం. తనని తాను మోసగించుకోవడమే. బుద్ధుణ్ణి ఒకరు “నాకు బోధ చెయ్యమని” అంటే “రేపు మీ ఇంటికి వస్తాను భిక్షకు” అని భిక్షా పాత్రలో దుమ్ము వేసుకొని అందులో “భిక్ష వేయమని” అనగా ఆ సాధకుడు “ఆ పాత్రలో దుమ్ము ఉంది కడిగిరండి” అనగా బుద్ధుడు “అందులోనే వేయవచ్చుకదా!” అనగా “దుమ్ముతో ఉన్న పాత్రలో ఎలా భిక్షను వేయగలను?” అంటే బుద్ధుడు “నీ మనస్సులో కుట్రలు, విషయ వాసనలు పెట్టుకున్నావు. నీకు ఏమి బోధ చెయ్యమంటావు” అన్నాడు.

14. మీ గురువుకు మీరు ఇచ్చే పండు ఎంతఇష్టంగా తీసుకొంటాడు అంటే వాటిని ఎప్పుడూ చూడలేనట్లు అపూర్వమైనవిగా గొప్పవిగా భావించి తీసుకుంటాడు. ఆ పండు ఆయనకు అవసరం లేదు. ఎప్పుడైనా నీ మనస్సు అనే పుష్పాన్ని లేదా ఫలాన్ని దొంగిలించడానికి అని నీవు గ్రహించాలి. జ్ఞాన వైభవం ఎలాంటిది అంటే ఇంతవరకూ మీరు విన్న మాటలు అన్నీ ఆత్మానుభవంతో రోతగా అనిపిస్తాయి. భగవాన్ “నాకు వినడానికి, చూడడానికి వేరుగా కనిపించడం లేదు” అని అన్నారు. కొంతమంది గురువులు జ్ఞానం గురించి చెప్పడంకాదు, జ్ఞానాన్ని ఇవ్వడమే మీరు ఎంతో కష్టపడి ఎంతో సంపాదించారు అనుకోండి. మీ పిల్లలు అంత శ్రమతో వాళ్ళు సంపాదించాలి అని అనుకోకుండా మీ సంపదను వారికి ఇచ్చేస్తారు. అలాగే కొందరు గురువులు తన శిష్యులను అంత కష్టపడకుండానే సాఫల్యం పొందేలా చేస్తారు. రామకృష్ణులను వారి శిష్యులు “మీరు ఎంతో కష్టపడి సిద్ధి పొందారు, మేము అలా చెయ్యగలమా?” అంటే “పూర్వం చెకుముకి రాళ్ళతో దీపం వెలిగించుకునేవారు ఎంతో శ్రమపడి. నేను దీపం వెలిగించాను దానిని బట్టి మీరు జ్ఞాన దీపాన్ని వెలిగించుకోండి” అనేవారు. కోటి గ్రంథాలు చదవడం కంటే, కోటి తీర్థాలు సేవించడం కంటే, కోటి సాధనలు చేసినా గురువు అనుగ్రహం లిప్తమాత్రం ఉంటే చాలు. ఆ





అనుగ్రహానికి ఏ సాధనలు సాటిరావు. గురువు మన దగ్గరకి రావాలి. ఆయన ఒడిలో కూర్చోవడానికి ఆయన ఆమోదించాలి. డిమాండ్ చేస్తే నీకు భక్తి లేదని అర్థం. గురువు అంటే మీరు ఏదిగా ఉన్నారో దానిని పొందేలా చేసేవాడే. మన అలవాట్లు అనేకంగా ఉండి గమ్యానికి అడ్డు తగులుతున్నాయి. వాటిని చూపు ద్వారా అనేక రకాలుగా సైలెంట్‌గా తుడిచి వేస్తాడు. వాడు గురువు. రామకృష్ణ పరమహంసగారి శిష్యులు బ్రహ్మానంద కొంతకాలం ఆయన సంసార జీవితం అనుభవించారు. ఆయనతో పరమహంసగారు “నీవు భవిష్యత్తులో సంసారంలోకి వెళ్లలేవు” అన్నారు. దేవుడు ఎటువంటి వరం ఇస్తాడో సిద్ధిపురుషుడు ఇచ్చే వరం కూడా అటువంటిదే. తేడా లేదు.

15. డాక్టర్ నీ శరీరంలోని రోగాలను తగ్గించాలి. అలాగే గురువు నీ మనోరోగాలను తగ్గించాలి. వాడే గురువు. ఒక తల్లికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. తల్లి రోడ్డుమీద నడిచివెళుతోంది. చిన్నపిల్లవాడు చంకలో ఉన్నాడు, పెద్దవాడు తల్లిచెయ్యి పట్టుకొని నడుస్తున్నాడు. ఒక కుక్క మొరుగుతూ వచ్చింది. చెయ్యి పట్టుకున్నవాడు కంగారుపడి తల్లి చెయ్యి వదిలేసిన ఫలితంగా క్రిందపడిపోగా దెబ్బలు తగిలాయి. చంకలో ఉన్నవాడు క్షేమంగా ఉన్నాడు. గురువు ఎవరినైతే ఎన్నుకున్నాడో వాడు చంకలో ఉన్న పిల్లాడిలా ఏ ప్రమాదమూ ఉండదు. గురువును మనం ఎన్నుకుంటే జారిపడే అవకాశం ఉంది. గురువుని తప్పించి మరో గురువు వద్దకు వెళ్ళిపోయే అవకాశం ఉంది. పతనమయ్యే అవకాశం ఉంది. శంకరులు అనుగ్రహ స్వరూపుడు, తేజోస్వరూపుడు, బోధస్వరూపుడు. పెద్దవాళ్ళకి కూడా తిప్పలు తప్పవు అనడానికి భీష్ముడు శిఖండి చేతిలో మరణించాడు. ప్రారబ్ధంలో అది ఉంది. అంతే. దానికీ జ్ఞానికి సంబంధం లేదు. దానితో ముడి పెట్టకూడదు. ఏసుక్రీస్తు శిష్యులతో ఉండగా అప్పటి సాంప్రదాయవాదులు ఇలా అన్నారు “ఈ రోజు ఉపవాసం చెయ్యవలసిన రోజు మీరు చెయ్యడం లేదేమిటి? అనగా ఏసు ఇంట్లో పెళ్ళి అవుతూ ఉంటే ఉపవాసం చెయ్యండి అనడం ఎలా ఉంటుంది? అవతారపురుషుని, జ్ఞాని సమక్షంలో

ఉపవాసాలతో పనిలేదు అన్నారు.

16. అవతార పురుషుడు అంటే రాముడు, కృష్ణుడు మాత్రమే అని కాదు. బయట రాక్షసులను చంపిన వారనేకాదు. అరిషడ్వర్గాలు అనే అంతర్ రాక్షసులను చంపే శంకరులు, రమణులు, రామకృష్ణులు కూడా అవతార పురుషులే. రామకృష్ణుడు "ఏసు రాజెర్స్‌ను బ్రతికించినట్లు నేను చనిపోయిన వారిని బ్రతికించలేను" అనగా శిష్యులు అన్నారు మీరు అలాంటి పని చెయ్యకండి. దానివల్ల మాకు వ్యక్తిభావన పెరుగుతుంది. శిష్యులకు అది ఉపయోగం కాదు" అన్నారు. పొగిడినా, విమర్శించినా సహజంగా ఉంటే లోపలకు వెళ్ళే మార్గం కనబడుతుంది. అప్పుడు గురువు నిన్ను లోపలకు వెళ్ళే ప్రయత్నం చేయిస్తాడు. ప్రారబ్ధం బలంగా ఉంటే దానిని తట్టుకొనే శక్తి కూడా గురువే ఇస్తాడు. గురువు మాట, రాత అనుగ్రహమే. ఒక మామిడి పండు ఇస్తే అదీ అనుగ్రహమే. గురువు అనుగ్రహం ఉంటే మీరు ఊహించిన దానికన్నా బలమైన వాసనలు మీకు ఉంటే అవి కూడా ఆయన అనుగ్రహం వల్ల కొట్టుకుపోతాయి. అరుణాచలం మొదట జ్యోతిరూపం, తరువాత శివరూపం, తరువాత గిరిరూపం, తరువాత అర్చనకై లింగరూపం ధరించాడు. పరమాత్మ మన అహంకారం ఇంకో మనిషికి జ్ఞానం ఇవ్వగలదా? ఒక పరమసత్యం ఉంది. అది కోపం లేకుండా, ద్వేషం లేకుండా ఉంది. మనం అలా ఉంటే అది వ్యక్తమవుతుంది. లోపల ఉన్న స్వార్థాన్ని మీ చేతులతో కాల్చివేస్తేగానీ బ్రహ్మానుభవం కలుగదు. భగవాన్ అలా చేసి బ్రహ్మానుభవం పొందలేదు. అరుణాచలేశ్వరుడే దానిని తీసుకొని వారికి ఆత్మానుభవం కలుగజేసారు. జ్ఞాని సాకార దైవము.

17. "ఏ సంఘటన మన జీవితాన్ని మలుపు తిప్పుతుందో మనకు తెలియదు" అన్నారు షేక్స్‌పియర్. ఆయన దర్శించి మనచేత దర్శింపచేసేదే వారి దర్శన గ్రంథాలు. వారు దర్శించినది మనకు చెప్పకపోతే మనకు తెలియదు. వారు కారణ జన్ములు. ఆ వాక్యాలు చెప్పడం అందిరికీ సాధ్యం కాదు. మనకు కోరికలు ఉన్నా అందరూ మనం కోరికలు లేనివారము





అనుకోవాలి. అది మన మోసపూరిత గుణం. పరమహంసగారికి విసినకర్ర విసురుతూ ఉంటే వేడిగా ఉందని "విసినకర్రని తడిపి విసర"మన్నారు. విసిరేవాడు "మీకు కోరికలు ఉన్నాయా?" అనగా ఆయన "ఉంటే ఉండనియ్యవయ్యా అవి ఏమీ యుద్ధం చెయ్యవులే" అన్నారు. ఆ మాటకు వారికి ఏవిధమైన ఆందోళన లేదు. అది జ్ఞాని వైభవం. విశ్వప్రేమ ఒక్క జ్ఞానికి మాత్రమే సాధ్యమవుతుంది. తినుబండారాల దుకాణంలోకి వెళ్ళి తీపి పదార్థాలను ఎన్నుకొంటూ ఉంటే దుకాణదారుడు "ఇవి మంచి రుచికరమైనవి, రుచి చూడండి, బావుంటే కొనండి" అంటాడు. అలాగే ఈశ్వరుడు ఆయన శాంతిని, సుఖాన్ని మనకు కొంత రుచిచూపించి తనవైపు లాక్కోవడానికి కొంత శాంతిని అలా అందిస్తూ ఉంటాడు. ఇనుప చెంబును నీళ్ళల్లో వేస్తే సంవత్సరాలు గడిచినా కరుగదు. మనం చేసే యాత్రలవల్ల, చిల్లరపనుల వల్ల "నేను" అనే తలంపు పోదు. ఆంజనేయ స్వామి రామునితో "నా నేనును నీకు సేవకుడిగా ఉంచుతున్నాను. నువ్వే నేనని తెలుసుకోవడానికి ఈ నేనును పోగొట్టుకోవడానికి" అని అన్నారు. కంసాలి వద్ద బంగారం ఉంటేనే సరిపోదు. దానిని అందమైన నగగా చేసే నేర్పు ఉండాలి. అలాగే పండితుని దగ్గర బంగారంలాంటి మాటలు వల్లించే కెపాసిటీ ఉంటే సరిపోదు. ఆ మాటలు సాధకుని హృదయంలోకి వెళ్ళే నేర్పు, శక్తి పండితునకు ఉండాలి. అది ఒక్క జ్ఞానికే సాధ్యం అవుతుంది. సత్యం ఎక్కడ ఉందో ఆ స్థానం (చోటుని) ఆ మాటల ద్వారా చూచే నేర్పుని కలిగిస్తాడు. పరమహంసగారి వద్ద ఒకరు "క్రీస్తు నా ద్వారా మాత్రమే తరించగలరు" అది వారికి అహంకారం. అలాగే బుద్ధుడు, మహమద్. వివేకానంద "వారి అహంకారాన్ని చూచేబదులు మీ అహంకారాన్ని పోగొట్టుకోండి" అనగా రామకృష్ణుడు "పూర్ణచంద్రునిలో మచ్చ ఉంటుంది. కానీ అది కాంతిని, చల్లదనాన్ని ఆపలేదు. మహాత్ములవి అంతే" అన్నారు.

18. గురువు భక్తుడిని దుఃఖ స్పర్శలేని ఆత్మస్థితికి తీసుకొనిరావాలి. బాధ కలిగినా ఆ స్పృహ లేకుండా గురువు చెయ్యాలి. బయట గురువు నీ

హృదయంలోకి నిన్ను పంపాలి. అది చెయ్యలేకపోతే వాడు రాక్షసుడు. గురువు నిర్మలంగా రాగద్వేషాలు లేకుండా ఉండాలి. బ్రహ్మానుభవం పొందిన వాడై ఉండాలి. శిష్యునికి "తాను ఆత్మానుభవం పొందాలనే తపన కలుగ జేయాలి. ఆ స్థితిని పొందేలా కృషి చెయ్యాలి. వాడు గురువు. ఆడంబరం లేకుండా ఉండాలి. పనిచేసేటప్పుడు గుఱ్ఱంలా పనిచెయ్యాలి. అమాయకంగా ఉండకుండా వ్యవహారజ్ఞానం కూడా గురువుకు ఉండాలి. ప్రతీదీ కూడా గురువే. గురువుకు, ఆయన దేహానికి సంబంధం లేదు. దేహం ఉన్నప్పుడు కూడా గురువు దేహం కాదు. ఏదైతే అనుగ్రహిస్తుందో దానికి చావులేదు. చనిపోయేది అనుగ్రహించలేదు. గురువు ఎక్కడ ఉన్నా ఆయన అనుగ్రహం ప్రవహిస్తూనే ఉంటుంది. మనకు యోగ్యత లేక దాన్ని పట్టుకోలేకపోతున్నాము. మన జేబులో ఉన్న పది రూపాయల కాగితం పోగొట్టుకోము. అది పోవాలని అనుకోము. అది మనది అనుకొంటున్నాము కాబట్టి. అది ఎప్పుడైనా మనకు తెలియకుండా పోయింది అనుకోండి పోయింది అనుకుంటాము. అలాగే గురువనుగ్రహం మనకు ఉంటే మనం అనుకొంటున్న మన అహంకారాన్ని జారిపోయేటట్లు చేస్తాడు. కానీ మన తెలివితేటల వల్ల మనం పోగొట్టుకోలేము. అంతర్యామిపట్ల మీరు ఎంత గౌరవంగా ఉంటారో అంతర్యామి దగ్గరకు తీసుకొనివెళ్ళే గురువుపట్ల అంత గౌరవంగా ఉండాలి. మీకు నేను అనే తలంపు వచ్చేటప్పటికి శరీరాన్ని చూసుకుంటాము. ఫలానా రూపం, ఫలానా నామం, ఫలానా వృత్తి ఇంతటి వాడిని, అని నీవు కాని దానితో నీవు చుట్టేసుకుని ఏదిగా ఉన్నావో దాని ఎరుక లేక కోట్లాదిజన్మలు కొట్టుకుపోతున్నావు. మిమ్మల్ని ఎవరో తీసుకొని వెళ్ళి దట్టమైన అడవిలో పడేస్తే ఇల్లు మీదే అయినా మీ ఇంటికి మీరు రాలేరు. ఎవరో దారి చూపించాలి. అజ్ఞానమనే అడవిలో ఉన్న మిమ్మల్ని జ్ఞానమనే ఇంటికి గురువు చేర్చాలి. ఒక మహాచైతన్యం సునామీలా వచ్చి మనలను అనుగ్రహించాలి. అప్పుడే నిన్ను నీ నిజగృహంలోకి మేల్కొలుపుతాడు. నీవు తొంభై జన్మలలో తొంభై సాధనలు చేసినా అవి ఆయన అనుగ్రహం ముందు ఎందుకూ





పనికిరావు. అయితే గురువు ముందు మనకి భక్తి కలగడం కష్టం. ఎందుచేతనంటే ఆయన మన కళ్ళ ఎదుట కనిపిస్తూ మనతో కలసి తిరుగుతూ ఉంటాడు. అదే మాయగా తోస్తుంది. ఈపని అసాధ్యం మన వల్ల కాదు అని ఒకోసారి అనిపిస్తుంది. ఈశ్వరుని ప్రార్థిస్తే అది సాధ్యం చేసి పెడతాడు. ఆయన గోవర్ధన పర్వతాన్ని ఎత్తాడు. గొప్పలకోసం కాదు, జీవకోటికి ఉపకారం అలా చేస్తాడు.

19. పుష్పం దగ్గర మీరు కూర్చుంటే సువాసన రాకుండా ఉండదు. అలాగే హోలీ కంపెనీ అట్టిది. నీకు తెలియకపోయినా వారి వైబ్రేషన్స్ మీమీద పనిచేస్తాయి. ఏ వాసనచేత, ఏ అలవాటుచేత నీవు పీడించబడుతున్నావో చూసి నీకు తెలియకుండానే రహస్యంగా ఆపరేషన్‌చేసి దానిని తీసివేస్తాడు. నీకు సహాయ సహకారాలు అందినట్లు కూడా నీకు తెలవనివ్వడు. అది సహజంగా సాధారణంగా జరిగిపోతుంది. అది జ్ఞాని యొక్క వైభవం. రాక్షసులు ఎక్కడో లేరు. మనకున్న వేరుబుద్ధే రాక్షసులు. వేరుబుద్ధిలో నుండే రాక్షసగుణాలన్నీ వస్తూ ఉంటాయి. జ్ఞానాన్ని గురించి చెప్పేవాడు గురువుకాదు. జ్ఞానాన్ని పంచి ఇచ్చేవాడే గురువు. గేదెలు, ఆవులు ఎన్ని రంగులలో ఉన్నా పాలు ఒకటిగానే తెల్లగా ఉంటాయి. గురువులు చెప్పే పద్ధతిలో తేడా ఉండవచ్చు కానీ సబ్జక్టు ఒక్కటే. వారు జ్ఞానం గురించి చెబుతారు. గురువు "చనిపోవడంలో అల్పత్వం నీ కళ్ళకు కనిపించేలా ఎత్తి చూపిస్తాడు". నీవు భోగాలలో ఉన్నా అందులో ఏమీ లేదనే నిస్సారత నీ బుద్ధికి అందేలా చేస్తాడు. గురువుకి నిన్ను రక్షించడమే పని, నిన్ను శిక్షించడం కాదు. ఒకవేళ శిక్షించినట్టు కనిపించినప్పటికీ అది కూడా రక్షించడమే. గురువు యొక్క దయ మాటలకు అందదు. అందనప్పుడు గురువుకూడా ఎలా చెప్పగలడు. అందుకే దక్షిణామూర్తి మౌనం వహించాడు. గురువు మీరు చెప్పే ప్రారబ్ధపు క్లేసాల మాటలు వింటూ "అలాగా అమ్మా" అంటూ మీకు తెలియకుండానే కాలాన్ని దూరాన్ని మీ కర్తృత్వ బుద్ధిని దాటించి తనలో కలుపుకుంటాడు. గురువు ఒకరివంక దయగానూ,

మరియొకరి వంక కోపంగానూ చూడవచ్చు. అక్కడ బాగుపడడానికి దయ అవసరం, ఇక్కడ బాగుపడడానికి కోపం అవసరం. వాడు బాగుపడటం తప్పించి ఆయనకు ఏమీ అక్కరలేదు. సహృదయం సద్బుద్ధి ఉంటే ఎవరైనా లోపల ఉన్న దయకు పాత్రులు అవుతారు. గురువు ముందుగా అవగాహన చేసే బుద్ధిని ఇస్తారు. తరువాత దానిని అధిగమించే శక్తిని ఇస్తారు. ఆయనమాత్రం నిశ్చలంగా, నిర్మలంగా పనిచేసుకొని వెళ్ళిపోతాడు. భగవంతునిలో చాలా గొప్పగుణం ఉంది. ఆయనలో ఉన్న దయాగుణం రూపుదాల్చితే వాడే గురువు. మీరు చేసే ప్రాణాయామములు, ధ్యానాలు, పూజలు, జపాలు కంటే గురుపాదాల మీద భక్తి చాలు మనం ఉద్ధరించబడ డానికి. ఆయన పాదాలే మనల్ని అమృతస్థితికి తీసుకొని పోతాయి. ఈ తలంపులు, ఆ తలంపులు వస్తున్నాయనే గోల నీకేల? అవి అన్నీ వారి దయవల్ల రాలిపోతాయి. నారాయణునికి నమస్కారం అంటే "ఓ నారాయణా! నీవు ఉన్నావు నేను లేను అని అర్థం. మనం ఉన్నాము అనుకోవడం వల్లనే దుఃఖం వస్తుంది. లేము అనుకుంటే దుఃఖం ఎలా వస్తుంది.

20. ఇప్పుడు మీరు ప్రపంచ విషయాలలో ఎంత అనుబంధం పెట్టుకున్నారో గురువుతో అంత అనుబంధం పెట్టుకుంటే మీలో ఉన్న బలహీనతలు అన్నీ ధ్వంసం అవుతాయి. ఏకారణం వల్ల మీ మనస్సు బహిర్ముఖం అవుతున్నదో ఆకారణం గురువు అనుగ్రహం వల్ల మీకు తెలియకుండా బయటకు పోతాయి. కారణం లేకపోతే కార్యం ఉండదు. దుఃఖ కారణం అజ్ఞానం. అది పోతే దుఃఖం పోతుంది. నీకు సాధన చేయాలనే తలంపు పుట్టించేవాడు, మీచేత సాధన చేయించేవాడు, మిమ్మల్ని శాంతి సామ్రాజ్యానికి అధిపతిని చేసేవాడు గురువు. ఇంత చేస్తున్నా అది మీకు తెలియాలని ఆయన అనుకోడు. వాడు గురువు. గురువు మనకు చేసే సహాయం శాస్త్రం కూడా వర్ణించలేదు. అది మన మాటలకు అందేది కాదు. జన్మాంతరంలోనుండి వచ్చిన వాసనలను బట్టి మనస్సు ఒక్కో విషయం మీద వాలుతూ ఉంటుంది. ఆ విషయం మీద నుండి మీ





మనస్సును మళ్ళించే శక్తిని గురువు నీకు ప్రసాదిస్తాడు. ఇతర విషయాలను చింతించకుండా మిమ్మల్ని అడ్డుకొని మీ మనస్సుని ఆత్మమీద నిలబడేటట్లు చేసేవాడే గురువు. ఆత్మచింతన తప్పించి ఏది చింతించినా అది ఏ రూపంలో చేసినా శిక్ష వడ్డీతో సహా చెల్లించవలసిందే. మేము డబ్బు సంపాదించాము, మేము చాలా తెలివైనవారము, మేము గొప్పవారము ఇలా అనుకొంటూ ఏవో బోట్లు పెట్టుకొని బ్రతుకుతున్నారు. ఇలా మనం పాడై పోతున్నాము అని గురువు ఏమి చేస్తాడంటే ఏవో సంఘటనలు క్రియేట్‌చేసి ఆ బోట్లు అన్నీ ఊడగొడతాడు. నీ మనస్సును ఆత్మగూటిలోకి పడేస్తాడు. ఒక వస్తువును నేను గట్టిగా పట్టుకొన్నాను అనుకోండి నా చేతి నుండి మీరు లాగడం కష్టం. అహంకారం దేహాన్ని గట్టిగా పట్టుకొని ఉంది. దాని పిడికిలి లోంచి బయటకు రావడం చాలా కష్టం. అది మనలను తొందరగా విడిచి పెట్టదు. మీరు ఎన్ని గుళ్ళు చుట్టూ తిరిగినా, ఎన్ని యాత్రలు చేసినా, ఎన్ని నదులలో మునిగినా ఒక బ్రహ్మ జ్ఞాని యొక్క దయ లేకుండా మీకు బ్రహ్మజ్ఞానం కలుగదు. కలిగే అవకాశం లేదు అని శాస్త్రం చెబుతుంది.

21. గురువనుగ్రహం ఉంది అంటున్నారు అది మాకు అర్థం కావడం లేదు అంటారు ఏమి చెయ్యాలి? అంటారు. గురువనుగ్రహం ఉంది అనుకోవడం వేరు, ఉండటం వేరు. మీరు ఆరోగ్యంగా ఉండటంవేరు, మీరు ఆరోగ్యంగా ఉన్నారు అని మేము అనుకోవడం వేరు. మీరు ఉన్న స్థితిలో గురువు అనుగ్రహించటం అర్థంకాదు. అర్థమైతే జ్ఞానులు అయిపోతారు. దానికి అర్హత మైండ్ సమాయత్తం కావాలి. మీకు అర్థం అయినా కాకపోయినా గురువనుగ్రహం ఉంది. అది మీ ఇష్టఅయిష్టాల మీద ఆధారపడి లేదు. ఎవరైతే కష్టపడతారో వారికి కష్టం విలువ తెలుస్తుంది. ఒక జ్ఞాని విలువ మరోజ్ఞాని మాత్రమే గుర్తించగలడు. దానికి వైరాగ్యం కావాలి. మనం ఎలా తయారయ్యాము అంటే గురువును మనం ప్రేమించ కూడదు, గురువనుగ్రహం మన మీద వర్షంలా కురవాలి అనుకుంటారు. ఇది పెద్ద మోసం. ఈ చిన్న విషయం మనకు అర్థం కావడంలేదు. గురువు

అంటే బ్రహ్మం. అది ఎవరికి తెలియబడాలో, వారికే తెలియబడుతుంది. మనం కాని మనో శరీరాలతో తాదాత్మ్యం పొందడం ఇలా అనేక జన్మల నుంచి అలవాటు పడిపోయాము. సిగరెట్లు కాల్చడం, పేకాట, త్రాగుడు వలె నీవుకాని దేహాన్ని నీవు అనుకోవడం ఒక అలవాటు. దేహం నీవుకాక పోయినా దాన్ని నేను అనుకోవడం అలవాటుపడిపోయాం ఆ అలవాటు నుండి గురువు అనుగ్రహం వల్ల మాత్రమే బయటపడగలము. నరేంద్రుడు రామకృష్ణునితో "నాకు ఏమీ బాధలేదు. నా బాధ అంతా మీరు తీసుకున్నారు ఇక నేను మోసే భారం ఏమీ లేదు. నా భారం మీరు తీసుకోవడమే కాదు మీరు తీసుకున్నట్లు నాకు తెలుస్తున్నది అన్నారు. దానిపై పరమహంసగారు "ఎంత బాగా గ్రహించావు" అన్నారు. పక్వచిత్తులు గురుకరుణను అలా గ్రహిస్తారు. మీ ప్రారబ్ధంలో పదిరోజులు అనుభవించే బాధ ఉంటే దానిని మీ గురువు 10 గంటలలో అనుభవింపజేసి మిమ్మల్ని బయటకు లాగేస్తాడు. వాడు గురువు. కొంతమంది గురువులు మాటలతో పనిలేకుండా మౌనంతో అనుగ్రహిస్తారు. గురువు యొక్క సమక్షంలో నీవు ఎప్పుడూ పొందలేని పరమ ప్రశాంతత నీకు అందుతుంది. మీ తల్లితండ్రుల ద్వారా, మీ స్నేహితుల ద్వారా, బంధువుల ద్వారా పొందలేని శాంతిని, సుఖాన్ని గురువు సమక్షంలో అనుభవిస్తావు. అన్ని సందేహాలు ఆయన సమక్షంలో తీరిపోతాయి. ఆయన దయ నీ హృదయంలో రహస్యంగా చప్పుడు లేకుండా ప్రవేశిస్తుంది.

22. గురువు మీరు రాంగ్ థింకింగ్‌లో ఉంటే అడ్డుపడతాడు. మనకెందుకు వాడి గొడవ అని ఊరుకోడు. ఎందుచేతనంటే ఆయన అలా చెయ్యకపోతే మీరు గమ్యం తప్పిపోతారు. ఈశ్వరుని స్మరించాలనే బుద్ధి కూడా గురువనుగ్రహం లేకుండా సాధ్యపడడు. గురువు అంటే ఆత్మ. ఆయనలో ఐక్యం అయ్యే వరకూ ఆ అనుగ్రహం విడిచిపెట్టదు. అది రెండు రోజులు, మూడు రోజుల ముచ్చటకాదు. అది జన్మాంతర అనుబంధం. గురువు మనలను తీసుకోకపోతే ఆయన జ్ఞానవైభవం మనకు ఎలా తెలుస్తుంది. మనం ఎన్ని సంవత్సరాలు బ్రతికినా గురువనుగ్రహం లేకపోతే





ఎంతకాలమైనా అలా బయట చూస్తూనే ఉంటాము. లోపల ఏముందో చూచుకొందామనే తలంపేరాదు. మనకు పుణ్యబలం లేకపోతే లోచూపే కలుగదు. మహాప్రవాహంలో గడ్డిపరక ఎంత వేగంగా కొట్టుకుపోతుందో గురువు యొక్క మౌనం నీ మనస్సును హృదయంలోకి అంతవేగంగా గెంటుకుపోతుంది. మీ ఇంటిలో ఎన్ని తినుబండారాలు ఉన్నా ఆకలి లేకపోతే తినలేరు. అలాగే నీకు జిజ్ఞాస లేకపోతే జ్ఞానం సంపాదించలేవు. లోపల నుండి అది కెరటంలా రావాలి. నీ బుద్ధిని దగ్గర పెట్టుకొని విషయాన్ని శ్రద్ధగా శ్రవణం చెయ్యి. అలా చేయడం వల్ల నీకు జిజ్ఞాస కలుగుతుంది. మనం సఫలం అవ్వడమే కాదు, ఓడిపోవడం కూడా నేర్చుకోవాలి. అంటే కష్టాన్ని, లాభాన్ని సమానంగా స్వీకరించే శక్తి లేకపోతే మానసిక ఆరోగ్యం పాడవుతుంది. నీటిలో చేప ఎలా ఆనందంగా ఉంటుందో అలాగే జ్ఞాని ఆనంద సముద్రంలో, శాంతి సముద్రంలో ఈతలు కొడుతూ ఉంటాడు. పూర్వజన్మ నుండి మనం చేసుకున్న పుణ్యం పంటకు వస్తే అప్పుడు ఈశ్వరుడు గురు రూపంలో వస్తాడు. చిన్న గుంట దగ్గరకు వెళ్ళి రాయివేస్తే బురద బయటకు ఎలా వస్తుందో మీలో బలహీనతలు ఉన్నాయనుకోండి, వాటిని మీకు తెలియడానికి ఈశ్వరుడు ఎవరి నోటినో వినియోగించుకొని కెలుకుతూ ఉంటాడు. గురువు వాటిని తొలగించుకోవడానికి శక్తిని ఇస్తాడు, మోక్షాన్ని ఇస్తాడు.

23. నిజం చెప్పాలంటే నాన్నగారు లేరు, సుబ్బమ్మ, ఎల్లమ్మ లేదు, ఎవ్వరూ లేరు. ఉన్నది భగవంతుడు ఒక్కటే. మనలను ఎక్కడైనా కూర్చోబెడితే ఆయనే కూర్చోబెట్టాడు. శరీరాన్ని ఇచ్చినది, తీసుకున్నది, గాలి పోసింది, తీసింది కూడా ఆయనే. ఈశ్వరుని యొక్క శక్తి తెలియకపోవడం వల్ల శరణాగతి పొందలేకపోతున్నాము. ఆయన చేతిలో మనం ఒక పని ముట్టు మాత్రమే అనే భావన మనకు బలంగా రావాలి. గురువు ఒక్కోసారి మిమ్ములను ఒడిలోకి తీసుకొని లాలిస్తాడు, ముద్దు పెట్టుకుంటాడు, ఒకోసారి నాకు సంబంధం ఏమిటి అని గెంటేస్తాడు. ఆయన ఏమి చేసినా మనలను

అనుగ్రహించడానికే. అనుగ్రహించిన వారు ధన్యులు. అది గుర్తించడానికి మనకు పుణ్యబలం కావాలి. ఎక్కువ కాలం బ్రతకాలని, అలాగే తొందరగా చనిపోవాలని అనుకోవడంవల్ల భగవంతుణ్ణి అగౌరవపరచినట్లు అవుతుంది. ఆయన సంకల్పంలో ఎలా ఉంటే అలా జరుగుతుంది. నీకు తెలుసున్నా తెలియకపోయినా ఈశ్వర సంకల్పమే జరుగుతుంది. శరీరం పని చెయ్యడానికి వెలుతురు ఎంత అవసరమో మనస్సుకు శాంతి అంతే అవసరం. మనం నేను నేను అంటున్నది మూల తలంపు. దానిని నీచేత విచారణ చేయించి ఆ మూల తలంపును దాని మూలంలోకి తీసుకొని వెళ్ళడమే గురువు చేసే పని. సాధన చేస్తున్నాము, చేస్తున్నాము అనుకొంటావు. మీ చేత సాధన చేయించేది ఆ గురువే. ఇది అంతా గురువు అనుగ్రహమే. గురువు అనే వేటగాడు నీ అహంభావన అనే జంతువును చంపడానికి ప్రతీ జన్మలోనూ నిన్ను వెంటాడుతూ ఉంటాడు. వాడిపని పూర్తి అయ్యే వరకు నిన్ను విడిచిపెట్టడు. నీలో ఉన్న అజ్ఞానమనే చీకటిని పోగొట్టే బాధ్యత తన మీద వేసుకొంటాడు. నీవు గుర్తించినా గుర్తించకపోయినా ఈ జన్మలోనే కాదు రాబోయే జన్మలలో అయినా తన పని పూర్తి అయ్యే వరకు నిన్ను వెంటాడుతాడు. గురువు అనుగ్రహం లేదు అని నీవు అనుకున్నప్పడు కూడా ఆయన ఏమీ అనుకోడు. ప్రతీ తీపి పదార్థంలోను పంచదార ఎలా ఉంటుందో అలాగే జ్ఞాని మాట్లాడే ప్రతీమాటలోనూ కరుణ ఉంటుంది. ఆ మాట దేవుడై ఉన్నది. మీ వాసనలు మీకు బరువైన రాయిలా కనిపించినా అది రాయి కాదు. ఆయనకు నలుసుతో సమానం. ఎఱ్ఱచీమను తీసి బయటకు వేసినట్లు నీలో ఉన్న వాసనలను అలా బయటకు విసిరేస్తాడు.

24. నీ ఇష్టదైవం లేదా నీ గురువుపై మినహాయింపులు లేని శరణాగతి నీకు ఉండి, నీ సంకల్పమే, నా సంకల్పం అన్నప్పడు తలంపులు రావు. మనస్సు నెమ్మదిగా అణిగిపోతుంది. నశించిపోతుంది. సబ్జెక్టును అర్థం చేసుకోకుండా మేము ఏదో చేస్తున్నాము అంటే ఏదో చేయడం వల్ల ఏదో రావచ్చు కానీ, ఆత్మజ్ఞానం రాదు. ఆ పని చెయ్యండి మీకు ఈ పుణ్యం





వస్తుంది, ఈ పని చెయ్యండి మీరు స్వర్గానికి వెళతారు అని ఇటువంటి మాటలు చెబుతూ ఉంటే వినేవాడికి ఇష్టంగా ఉంటుంది. కాబట్టి చెప్పేవాడు చెబుతాడు. మీకు ఎలా చెబితే సంతోషిస్తారో అలా చెబుతున్నారు కానీ మిమ్మల్ని ఎక్కడికి తీసుకొని వెళ్ళాలో వారికి తెలియడం లేదు. అది ఒక్క సద్గురువుకే తెలుస్తుంది. ఎక్కడికి తీసుకొనివెళితే నిజమైన ఆనందం అందుతుందో అది ఆయన తెలుసుకోకుండా మిమ్మల్ని ఉబ్బించే మాటలు, మిమ్మల్ని నరకానికి తీసుకొని వెళ్ళే మాటలు ఎందుకు? తాత్కాలికంగా సంతోషం కలిగించే మాటలు మేము చెప్పకూడదు. అలా చెబితే మీరు దారి తప్పిపోతారు. శవాలను కాల్చిన బూడిద, ఎముకలు గంగానది శాంతంగా భరిస్తుంది. అలాగే జీవకోటిని గురువు భరిస్తాడు. భగవంతుడు తోటి, గురువుతోటి విరోధం పెట్టుకోకండి. పెట్టుకొని మీరు చేసేది ఏమీ లేదు. నీవు ఎలా రాజీపడతావో అలా రాజీపడు. రాజీపడకపోతే నీకు మిగిలేది క్షోభ, నరకం, అశాంతి, పాడులోకాలు. ఆయన సంకల్పాన్ని గౌరవిస్తే అశాంతి నశిస్తుంది. గురువు ఏమిచేస్తాడు అంటే మీకు ఉన్న తెలివితేటలను సబ్జెక్టు మీద ఫోకస్ చేయిస్తాడు. జ్ఞాని లోపలకు చూస్తే ఆనందం, బయటకు చూస్తే లీలానందం. భగవంతుని యొక్క లీలలు చూచినవానికి ఆనందమే. ఈశ్వరుడు గురువు ద్వారా పనిచేస్తాడు. ఆ సంగతి తెలియక గురునింద చేస్తారు. గురువు దగ్గరకి వెళ్ళేటప్పడు పెద్దరికాలు కోరుకో కూడదు. మన గర్వం అక్కడ చూపించకూడదు. కొందరికి మనస్సులో ఏవో వికారాలు ఉంటాయి ఆవి ఆయన దగ్గర కక్కుతారు. గురువు వాటిని తొలగించడానికి చూస్తాడు. వాటితో తాదాత్మ్యం పొందడు. పొందితే గురువు కాదు జీవుడే. ఏ జీవుణ్ణి ఎప్పడు, ఎక్కడ, ఎలా అనుగ్రహించాలో అన్నీ చూసుకుంటాడు. ఈ విషయంలో సాధకుడు తొందరపడకూడదు. తొందరపడితే శిష్యుడే నష్టపోతాడు. మనం నిజమైన భక్తులమైతే మనం ఆయనను అడిగేది ఒక్కటే. భక్తి అనే భిక్ష పెట్టమని అంతకంటే అడిగేది ఏమీ లేదని.

25. నేను రమణ మహర్షి గురించి ఏదో చదివి భక్తుడిని కాలేదు

లేదా ఏ పెద్దలైనా చెబితే భక్తుణ్ణి కాలేదు. అది జన్మాంతర అనుబంధం. అలా గెంటుకుంటూ వచ్చింది. అంతేకానీ నాకు వారికి ఎవరూ మధ్యవర్తులు లేరు. ఆయన అంతట ఆయన నాకు ఎరుకలోనికి వచ్చేవరకూ ఆయన అంతట ఆయన తెలియబడేవరకు వారి గురించి తెలియదు. కనీసం వారి పేరు కూడా వినలేదు. టీచింగ్ మాట వదిలేయండి అది జన్మాంతర అనుబంధం. మనస్సు స్వాధీనంలో లేదేమిటి? ఇలా అయిపోతున్నాము ఏమిటి? అని కంగారు పడకండి. గురువు మీద భక్తి విశ్వాసాలు నిలబెట్టుకోండి. చేయవలసిన పని అంతా ఆయనే చేస్తాడు. మేము సాధన చేస్తున్నాము అని గర్వపడకండి. మీ సాధన ఒక పైసా, మిగిలిన తొంబై తొమ్మిది పైసలూ గురువే చేస్తాడు. మీరు కంగారుపడుతున్నా ఆయన కంగారు పడడు. మిమ్మల్ని నెమ్మదిగా ప్రిపేర్ చేస్తాడు. మీకు అర్హత వస్తే అనుగ్రహం ఇవ్వడానికి ఒక్క క్షణం కూడా ఆగడు. మన గురించి మనకంటే గురువుకే ఎక్కువ తెలుసు. ఆయన దగ్గర మన జీవితాలు అన్నీ తెరచిన పుస్తకాలు. నీలో ఈ వాసన ఉందని నోటితో చెప్పడు. ఆవాసన నీకు ఉందని తెలియజేసి దానిని ఇష్టంగా అనుభవించేలా చేసి బయటకు లాగి కాల్చి బూడిద చేస్తాడు. నీ బలహీనతలు అన్నీ ఒక్కసారి తియ్యడు. నీవు తట్టుకోవాలి కదా! ఒకదాని తరువాత ఒకటి లాగి కాల్చి బూడిద చేసి నీవు ఏదిగా ఉన్నావో దానిలో ఐక్యం చేసేవరకూ నిన్ను వదలడు. ఒక్క భగవంతుని ప్రేమ మాత్రమే నమ్మదగ్గది. మనకు తల్లితండ్రులు, స్నేహితులు, సాధన, మోక్షం సమస్తమూ ఆయనే. ప్రతీ జ్ఞాని సముద్రం లాంటివాడు. నదులు మహాప్రవాహంలా వెళ్ళి సముద్రంలో కలసినా సముద్రానికి వచ్చే లాభం ఏమీ లేదు. నదులు కలవకపోయినా నష్టంలేదు. అలాగే మహాజ్ఞాని దగ్గర భక్తులు వెళ్ళి కూర్చోవడం వల్ల ఆయనకు లాభం లేదు. వెళ్ళకపోవడం వల్ల వచ్చిన నష్టం ఏమీలేదు వాడు ఎప్పుడూ నిండుగానే ఉంటాడు. అసలు బాహ్య ప్రవృత్తీ ఉండదు. మహాత్ములు బయట ఏదో పనిచేస్తూ ఉన్నా లోపల వారి శాంతికి ఏమీ భంగం ఉండదు. అతిపరిచయం వల్ల గురువు కూడా





లోకువైపోతాడు. ఆయనపై భక్తునకు చులకన వస్తుంది. నీకు విషయం అర్థం కాకపోతే అర్థమయ్యే బుద్ధిని ప్రసాదించేది గురువు. గురువు హృదయం ఆకాశమంత విశాలంగా ఉంటుంది. అలాగే శిష్యునకు గురువుపట్ల అంతులేని విశ్వాసం ఉండాలి. మహేంద్రనాథ్ గుప్తాను రామకృష్ణుడు కూర్చున్న దోమతెర మంచం మీదికి కూర్చోవడానికి రమ్మంటే గురువు ప్రక్కన కూర్చోవడం ధర్మం కాదని సందేహిస్తూ ఉంటే రామకృష్ణులు అంటారు "నీవు నా మహేంద్రుడవు, నేను నీ రామకృష్ణుడను" అని. అది అపార ప్రేమకు గుర్తు.

26. చిన్న మర్రి విత్తనంలో మహావృక్షాన్ని చూచిన వానిని 'విజన్' అంటారు. నరేంద్రునిలోని వైభవాన్ని రామకృష్ణుడు చూచారు. అది 'విజన్' అంటారు. "దేవుడు - గురువు ఒకేసారి నాముందుకు వస్తే ముందుకు గురువుకి దండం పెడతాను, ఎందుకంటే ఆ దేవుణ్ణి చూపించింది గురువే కాబట్టి" అన్నారు కబీర్. చెడ్డపిల్లలు ఉంటారు, చెడ్డ తల్లి ఉండదు. అలాగే చెడ్డభక్తులు ఉండవచ్చు కానీ, చెడ్డ గురువు ఉండడు. గురువు ఒక కాలానికి, ఒక దేశానికి, ఒక దేహానికి పరిమితమైనవాడు కాదు. నీలో మంచి గుణాలను, చెడ్డ గుణాలను తీసేసుకుంటాడు. మనం గురువును ప్రేమించడం వేరు, గురువు మనలను ప్రేమించడం వేరు. వివేకానంద, తల్లి రెండు పూటలా అన్నం తినాలని, తాను స్నేహితుల ఇంటివద్ద తినేశానని అబద్ధం చెప్పేవాడు. గురువుగారితో ఇంటి వద్ద తిన్నానని అబద్ధం చెప్పేవాడు. దీనిపై పరమహంసగారు ఆయనతో "కాళీని ప్రార్థించు" అంటే "అలా చెయ్యను" అన్నాడు వివేకానందుడు. "అయితే నీ తరపున నేను ప్రార్థిస్తాను" అంటే "నా గురించి అడుగవద్దు" అనేవారు. "అయితే నీ గురించి కలకత్తా వీధుల్లో అడుక్కొని నీకు పెడతాను" అనేవారు. వారి అనుబంధం అటువంటిది. జ్ఞాని ఎవరినీ నీవు బుద్ధిమంతుడవు కాదు అని చెప్పడు. చెప్పకుండానే నిన్ను బుద్ధిమంతుణ్ణి చేస్తాడు. శ్రీకృష్ణచైతన్య వారి సేవకులు మస్తాన్‌ని ఉద్దేశించి "నీవు నాకు ఎంతో సేవ చేసావు, చేస్తున్నావు. నీకు

ఏమి కావాలి?" అంటే మస్తాను "గురువుగారు! మీరు లేని లోకాన్ని నేను చూడలేను. మీరు జీవించి ఉండగానే నన్ను సాగనంపండి" అనగా "నీవు ఎంత పవిత్రుడవు" అన్నారు. తరువాత వారి చేతులమీదుగా అతన్ని సమాధి చేసారు. వివేకానందునితో పరమహంసగారు "నీవు ఎవరినో గొప్పవారు అనుకొంటున్నావు. వారికన్నా నీవు గొప్పవాడివి. నీవు పుట్టుకతోనే మహాత్ముడవు" అన్నారు. గాంధీగారి కొడుకు త్రాగుడులాంటి చెడ్డ అలవాట్లతో ఉంటే "నీకు కష్టం వస్తే బాపు ఉన్నాడని మరచిపోకు" అన్నారు. కలకత్తాలో కొడుకు ఉద్యోగం చేస్తున్నాడు అతనికి భార్య పోతే కొంతకాలానికి బాపూజీకి ఇలా ఉత్తరం వ్రాసాడు 'పెళ్ళి చేసుకుంటాను' అని. బాపూజీ తిరిగి ఉత్తరం ఇలా వ్రాయించారు. "నీవు భార్య పోయి బాధపడుతున్నావు. అలాగే భర్తపోయి బాధపడే అమ్మాయిని చూచి పెళ్ళి చేసుకో" అని వ్రాసారు. రాగ ద్వేషాలు లేకపోతే మనస్సు చలించదు. ఏ హృదయ గుహలో అయితే భగవంతుడు ఉన్నాడో అక్కడకు నిన్ను తోలుకొనిపోయే వాడే గురువు. మీ కోరికలతో, మీ తలంపులతో సంబంధం లేకుండా మీ పని నెరవేర్చేవాడే నిజమైన గురువు. మీకు తలంపులను రానివ్వడు. తలంపు రాకపోతే శక్తి వృధా అవ్వదు. గురువును మీరు ఎన్నుకుంటే మీరు గురువును మార్చేసి ఇంకో గురువు అంటూ వెళతారు. గురువే మిమ్మల్ని ఎన్నుకుంటే తన ఒడిలోనికి తీసుకుంటే మీరు తరించే వరకూ ఆ బాధ్యత గురువుదే. మన ఇంట్లోవారు పరాయివారు కానీ గురువు పరాయివాడు కాదు. ఆయన మన హృదయంలో సజీవంగా సత్యంగా ఉన్నాడు.

27. రామకృష్ణపరమహంసగారితో ఒకరు మీరు చదువుకోలేదు, పిహెచ్‌డి చదివిన వారు కూడా చెప్పలేని బోధ ఎక్కడ నుంచి వస్తున్నది. అంటే "చంటి పిల్లలకు అన్నం పెట్టేటప్పుడు అమ్మ కలిపిన అన్నం నోట్లో పెట్టిన వెంటనే వెనకాల ఉన్న అన్నాన్ని ముందుకు పెట్టి కలుపుతుంది. అలాగే "నేను చెప్పే మాటలు ఒకదాని తరువాత ఒకటి, ఒక విషయం చెప్పడం పూర్తి అయిన వెంటనే మరో విషయాన్ని అమ్మే అందిస్తూ ఉంటుంది. నేను ఏదో





ఆలోచించి వేదనతో చెప్పడానికి ఎప్పడు గురికాలేదు" అన్నారు. ద్వైతంలో ఉన్న మనిషిని అద్వైతంలోకి తీసుకురావడానికి వచ్చిన అవతారమే సుబ్రహ్మణ్యుడు. సమాజం అంటే అనేక రకాల కూరగాయలు వేసిన సాంబారులాంటిది. అనేక రకాల గుణాలు కలవారు సమాజంలో ఉంటారు. వారినందరినీ ఆత్మగా చూడడంతో దుఃఖం అంటుకోదు. "శత్రువుని శత్రువుగా చూడకుండా మిత్రుడుగా చూడగలగాలి. అది ఈశ్వరుని దయ లేకుండా సాధ్యంకాదు" అన్నారు సనత్‌కుమారుడు. ఒకోసారి మనకు అలౌకిక ఆనందం వచ్చి ముంచేస్తుంది. ఉక్కిరిబిక్కిరి అవుతాము. అది మన సాధన తెలివితేటలను బట్టి రావడంలేదు. గురువు అనుగ్రహం వల్లనే పొందుతావు. వేదం అంది "నీకు అధికారము, సంపద, కీర్తి ప్రతిష్ఠలు ఎన్నో ఉండవచ్చును కానీ నిద్రలో ఆ సుఖానికి సాటిరావు. నిద్ర సుఖంలోనే ఇంత ఆనందాన్ని గ్రహిస్తూ ఉంటే ఆత్మసుఖం ఇంకా ఎంత ఆనందంగా ఉంటుందో గ్రహించండి అన్ని పరిస్థితుల్లోను గురువు పట్ల విశ్వాసం వదలకుండా ఉంటే నీలోని మమకారాన్ని తీసి నిన్ను తనంత వానిగా చేస్తాడు. ఒక్కోసారి గురువు మనకు లేనివి ఇస్తాడు, ఒక్కోసారి మనకు ఉన్నవి ఊడగొడతాడు. కారణం మీరు సమానస్థితిలో ఉన్నారా? లేరా? అని చూచుకుంటాడు. మీరు సమానస్థితిలో లేకపోతే మట్టిలో కలిపేస్తాడు. అంటే పునర్జన్మకు పంపేస్తాడు. కొందరు కళ్ళకు పెట్టుకునే కళ్ళజోడు పోయింది అని వెతుక్కుంటారు. ఎవరో చెబుతారు నీ కళ్ళజోడు నీ ముఖానికే ఉంది అని. అంటే నిజమే దొరికేసింది అని సంతోషపడతారు. అసలు అది పోలేదు కదా! దొరకడానికి. అలాగే మీరు మోక్షంలోనే ఉన్నారు. అది ఎప్పడు తెలియబడుతుందో ఆ అనుభవం రావడంలేదు అని వాపోతారు. దానిని గురువు అది నీవే అనే అనుభవాన్ని కలుగజేస్తాడు. గురువు చేసే పని అదే. తాడిచెట్టు ఎంత ఎత్తుగా ఉంటుందో అంత లోతుగా నీ వాసనలు ఉన్నాయి. గురువు అంత లోతులలోనికి దిగి దానిని నీ సహస్రారానికి తీసుకొచ్చి చూపిస్తాడు. అప్పడు నీవు ఇంత పెద్ద వాసన

ఉందా? అనుకొంటావు. దానిని గురువు బయటకు ప్రవహింపజేసి గెంటివేస్తాడు. వెయ్యి జన్మలకు సరిపడే సంస్కారాలు మీ గురువు కాల్చి మిమ్మల్ని శుద్ధి చేసి ఇస్త్రీ మడతలా చేసి సత్యానుభవం కలుగజేస్తాడు. గురువు అనుగ్రహంతో లోపల శాంతి నీకు అందజేస్తాడు.

28. "శాంతిగా ఉండండి" అని నేను మీకు బోధిస్తూ నా ప్రారబ్ధం బలంగా, అశాంతి గొలిపేదిగా ఉంటే నేను అశాంతిలో ఉంటే నేను భక్తుల ముఖానికి పేడ వ్రాసిన వాడిని అని అర్థం. నేనే పతనావస్థలో ఉంటే మీకు నేను ఏమిచెయ్యగలను? అని అర్థం. ఏసు అంటాడు "నా మాటల్లో శక్తి పవిత్రత వల్ల నదులు, సముద్రాలు, ఖండాలు దాటి ప్రపంచమంతా వ్యాపిస్తాయి. వాటి శక్తి వల్ల అవి వ్యాప్తమవుతాయి. ఎవరి సహాయం అక్కర్లేదు" అన్నారు. నారాయణ అంశ ఉంటేనే ఎవరైనా నరులకు బోధించగలరు. గురువు శిష్యుని పక్వతను బట్టి తగిన మాట చెబుతాడు అర్హత, యోగ్యత, జీర్ణించుకునే శక్తి లేకపోతే వాడు పాడవుతాడు. ఆధ్యాత్మిక మార్గంలో శిష్యునికన్నా గురువే ఎక్కువ కష్టపడాలి. తపస్సు గొప్పదని విశ్వామిత్రుడు అంటే దానికంటే సత్పురుషుల సహవాసం గొప్పదని వశిష్ఠుడు నిరూపించాడు. రామకృష్ణ పరమహంస దొరకకపోతే వివేకానంద ఎక్కడ ఉన్నాడు. చదువుకుని, పెళ్లి చేసుకొని, చనిపోయేవాడు. ఒక మహాత్ముని చూపువల్ల లోపల ఉన్న అజ్ఞానానికి నిప్పు అంటుకొంటుంది. గురువు దయ అనే ఇంజన్‌తో నీకు అనుబంధం కుదిరితే చాలు నీ పని పూర్తి అయిపోయినట్లే. ఎంతో బరువుతో, ఎన్నో పెట్టెలు ఉన్నా ఇంజన్ లాగేస్తుంది. నీలో ఎంత అజ్ఞానం ఉన్నా వారి సహాయం వల్ల అవి కాలిబూడిద అవుతాయి. మనస్సుకు వచ్చే అదృష్టం, దురదృష్టం ఈ గొడవలు పూర్తిగా వదిలివేయాలి. పట్టించుకోవద్దు. మీకు గురువు మీద ప్రేమ, విశ్వాసం, శ్రద్ధ విడిచిపెట్టకుండా ఉంటే నీలో పనికిరానిది మింగేసి పనికి వచ్చేది నీకు ఇస్తాడు. వాడు గురువు. మనం ఏదైనా తిన్నప్పుడు బాగానే ఉంటుంది. కక్కు వచ్చాక మన కక్కు చూచి మనకే అసహ్యం వేస్తుంది. అలాగే మీలో ఉన్న





బలహీనతలలోని చెడ్డను గురువు నొక్కుతాడు. అప్పుడు మీరు కక్కకుండా ఉండలేరు. కక్కిన తరువాత బలహీనతలో ఉన్న చెడ్డ మీకు తెలుస్తుంది. బలహీనత వల్ల వచ్చే నష్టం మీకు అర్థం అయ్యేలాగ చెప్పి మీ బుద్ధికి దాన్ని పట్టించి అప్పుడు దానిని పోగొట్టుకునే శక్తిని కూడా ఆయనే ఇచ్చి మిమ్మల్ని తరింపచేస్తాడు. వాడు గురువు. మూడు గుణాలు దాటిన వాడికి నమస్కారం పెడితే మనకు ఆశీస్సులు ఉంటాయి. నమస్కారం పెట్టిన వానికి డబ్బు ఏమీ ఖర్చు కాదు. వాడి ద్వారా ఈశ్వరుడు అనుగ్రహిస్తాడు, ఆశీర్వదిస్తాడు. అరుణాచల గిరిరూపం, గురురూపం ఒక్కటే. ఈశ్వరుని కృప మీకు అందదు. గురువు ద్వారా అందుతుంది. కాలువ నీరు సరాసరి మీ పొలాలకు అందదు. ప్రభుత్వం నిర్ణయించిన తూముల ద్వారా, బోదెల ద్వారా వస్తుంది. అదే గురువు యొక్క కృప. గురువు యొక్క అనుగ్రహం లేకుండా ఎంత చదివినా అర్థంకాదు. ఆంతరంగిక శిష్యులు ఎవరంటే రామకృష్ణులు ఇలా అన్నారు "నేను దిగంబరంగా కూర్చున్నా నా ప్రక్కన కూర్చుంటాడు. నన్ను చూసి నేను సిగ్గు పడను. వారి శరీరమే నా శరీరము. వారి బట్టలే నా బట్టలు" అన్నారు అందమైన సమాధానం. మీ ఇంటికి (మీ హృదయంలోకి) వెళ్లడానికి ఏమి అడ్డుతగులుతున్నాయో గ్రహించి వాటిని తొలగించుకోండి. వందజన్మల వాసనలు మీకు ఉంటే అవి మీకు కనబడకుండా దాగి ఉంటాయి. వాటిని గురువు బయటకులాగి మీకు తెలియకుండా మంటపెడతాడు.

29. గురువు మీద గౌరవం లేకపోతే గురువు చెప్పిన మాటలు మన మనస్సుకు పట్టవు. గురువు అంటే ఈశ్వరుని ప్రతినిధి. మనం సరియైన మార్గంలో ప్రయాణం చెయ్యడంలేదు అని మనకు తెలియడానికి కూడా ఈశ్వరానుగ్రహం లేకుండా మనకు తెలియదు. నీనెత్తిమీద బరువు ఉంటే ఎవరైనా బయటవాళ్ళు సాయంచేసి భద్రంగా దించుతారు. నీ అహంకారంలో ఉన్న బరువైనరాళ్ళు గురువు ప్రవచనం వల్ల, శాస్త్ర ప్రమాణాల ఆధారంగా జీవించి నీవే తొలగించుకోవాలి. బయటవాళ్ళు తొలగించరు.

మీ చుట్టాలు మీకు ఉత్సవ సమయంలో వెండిచెంబులు, వెండిగ్లాసులు ఇవ్వవచ్చును లేదా ఏదైనా సాయం చెయ్యవచ్చు. కానీ మీ మనస్సును వారు బాగుచెయ్యలేరు. మీరే బాగుచేసుకోవాలి. ఒకోసారి మీకు తరచుగా ఒకే వాసన వస్తూ ఉంటుంది. అది ఎంతో శక్తివంతంగా ఉంటుంది. అది పోదు అని మనకు అనిపిస్తూ ఉంటుంది. మీరు కంగారుపడనక్కరలేదు. ఎంత బలీయమైన వాసన అయినా గురువు అనుగ్రహంలో కొట్టుకొని పోతుంది. నీవు ఎవరిమీదా తీర్పులు చెప్పకపోతే నీమీద తీర్పులు చెప్పేవాడు ఉండడు. గురువుపట్ల నీకు ఉన్న సజీవమైన ప్రేమకు సాటియైన సాధన మరియొకటి లేదు. జ్ఞానియొక్క చూపు మనలో ఉన్న పొరపాట్లను సరిదిద్దుతుంది. నోటితో చెప్పవలసిన పనిలేదు. పూర్వజన్మలో సత్కర్మ చేసి ఉంటే జ్ఞాని మౌనం అర్థమవుతుంది. నీలోపల ఎవరిగా ఉన్నావో ఆ నిజతత్త్వం మరచిపోయావు. ఎన్నోయుగాలుగా దాని తాలూకు స్మృతి నీకు కలుగజేసేవాడే గురువు. కోరికా, కోపము ఇవే మన శత్రువులు. లోపల ఉన్న శత్రువులను వదిలేసి బయట శత్రువుల మీద ఎలా పగ తీర్చుకొందాము, వాడిని ఎలా అవమానిద్దాము అని చూస్తూ అంటావు. నీ మనస్సుకు అంతర్‌దృష్టి కలుగజేసి శత్రువులు ఎవరో నీకు తెలియజేసి వాటినుండి విడుదల చేసేవాడే గురువు. అంతర్ శత్రువులే నిజమైన శత్రువులు అని తెలుపుతాడు గురువు. భౌతికంగా రెండు దేహాలను కలపడానికి మనం కళ్యాణాలను చేస్తున్నాము. అలాగే జీవుణ్ణి పరమేశ్వరునితో ఐక్యం చేయడానికి మనం ప్రయత్నం చేయాలి. అది ఆధ్యాత్మిక కళ్యాణం. దానికి గురువే పురోహితుడు.

30. నాకు భగవాన్‌కి శారీరక, మానసిక అనుబంధం వల్ల ఆకర్షింపబడలేదు. అది చైతన్యస్థాయికి సంబంధించినది. ఆ అనుబంధం ఇట్టిదని చెప్పడానికి వీల్లేదు. మాటలతో చెప్పలేను. వ్రాతలతో వ్రాయలేను. బంధువుల, స్నేహితుల అనుబంధం కాదు. అది నిజమైతే ఏ చిన్న కారణంవల్లనైనా ఊడిపోయేది. ఇంగ్లాండ్‌లో 'బాత్'లో నా ప్రవచనానికి ముందు నా గురించి





ప్రారంభంలో పరిచయవాక్యంలో ఇలా అన్నారు "భగవాన్ బిడ్డ భగవాన్ గురించి చెప్పడానికి వచ్చారు అని". మీ ఎడబాటును సహించలేక ఈరోజు ఈ శరీర అసౌకర్యాన్ని లెక్కచెయ్యకుండా సహిస్తూ మాట్లాడవలసి వస్తున్నది. ఉన్న సత్పదార్థం ఉందా లేదా అనే అనుమానం కలుగుతూ ఉంటే సద్గురువు కళ్లను చూస్తూ ఉంటే అది ఉందని నిశ్చయించుకోగలము. బడిలో పాఠాలు చెప్పే గురువు నీవు బాగుపడు అని చెబుతాడు. సద్గురువు అలా చెప్పడు. సైలెంట్‌గా బాగుపడేలా చేస్తాడు. కొన్నిచేపలు బురదలో ఉంటాయి. వాటిని పల్లెవాడు మట్టిని కెలికి బయటకు తీస్తాడు. అలాగే నీకు తెలియని నీలో ఉన్న చిన్న సంస్కారాలుగా అడుగున ఉన్నవి కెలికి నీ సహస్రారానికి అందేలా చేసేటప్పుడు అప్పుడు తెలుస్తుంది. ఇన్ని ఉన్నాయా? అని నీకు కీర్తికాంక్ష లాంటివి బయటకు కనిపించకపోయినా అప్పుడు నీకు తెలుస్తుంది. ఈ పని అంతా గురువు చేసేదే. గురువు అంటే మహా శాంతి సముద్రం. సముద్రం ఎంత లోతుగా ఉంటుందో, ఆకాశం ఎంత విశాలంగా ఉంటుందో గురువు అలా ఉంటాడు. మనం ఉపాధికి సంబంధించిన 'నేను' అనే తలంపుతో శర్మగారు, వర్మగారు, రెడ్డిగారు, చౌదరిగారు, నాయుడుగారు అని జీవిస్తున్నాము. గురువు శాంతి సముద్రంలోకి లాగేసి దాన్ని నామ రూపాలు లేకుండా చేస్తాడు. గురువు నీ బాహ్యదృష్టిని పలచబడేలా చేస్తాడు. గురువుతో అనుబంధం జన్మాంతరం నుండి వస్తూ ఉంటుంది. "నక్షత్రాలను లెక్కపెట్టవచ్చు. ఎడారిలో ఇసుకలో రేణువులను లెక్కపెట్టవచ్చు. కానీ రామునిలోని కళ్యాణ గుణాలను లెక్కపెట్టలేము" అన్నాడు తులసీదాస్. నీలో అజ్ఞానం ఉందని తెలిపేవాడు దానిని ఎలా పోగొట్టుకోవాలో ఆ శక్తిని నీకు ఇచ్చేవాడు గురువే. మీరు భగవంతుణ్ణి తెలుసుకోవడానికి ప్రేమని, శక్తిని, తెలివిని ఆయనే ఇస్తాడు. ఆయన ఎక్కడ ఉన్నా ఆ పని జరుగుతుంది.

31. శివానంద శిష్యుడు విష్ణుస్వామి మిలటరీలో పనిచేసాడు. ఆయనకు ఒక తలంపు వచ్చింది. "ఎవరికీ నమస్కారం పెట్టకూడదు" అని గురువు గారికి కూడా పెట్టకూడదని. వానికి నమస్కారం పెట్టే అలవాటు

చెయ్యడానికి శివానంద ముందుగా శిష్యునకు నమస్కారం పెడితే తిరిగి పెట్టడంతో నమస్కారం అలవాటయింది. ఆయన గెడ్డం నున్నగా గీసుకొనగా శివానంద్ ఇలా అన్నారు. “ఒరేయ్ నీవు ఆత్మానుభవానికి వచ్చావు. గెడ్డంపై అంత టైం పాడు చేసుకోవడం ఎందుకు?” అన్నారు. అలాగే లుంగీ కిందకు కడితే రోడ్డుమీద దుమ్ము అంతా లాక్కుని వస్తుంది. సన్యాసికి మోకాళ్లకు, అరికాళ్లకు మధ్యలో కట్టుకోవాలి అని చెప్పి మిలటరీ అహంకారాన్ని తీసేసారు. గురువు పట్ల సజీవ విశ్వాసం ఉంటే ఈ శరీరం చనిపోయినా ఇంకో శరీరంలో ఉన్నా మీ విశ్వాసమే మిమ్మల్ని గురువు దగ్గరకు తీసుకొనిపోతుంది. బయట గురువుతో సన్నిహితంగా ఉంటూ ఆయన మీద ప్రేమ కలిగేటట్లు చేసుకొని మరల ఆ ప్రేమను నెపంగా పెట్టుకొని మనపట్ల దయ చూపి మనలను అనుగ్రహిస్తాడు. దానితో మన పని పూర్తి అవుతుంది. జ్ఞాని వైరాగ్యమనే కత్తితో దుఃఖపడే జీవుణ్ణి నరికేసి ఆత్మానుభవం కలుగజేస్తాడు. గురుపాదాల మీద విశ్వాసం కుదిరిందా! ఇంజిన్ రైలుపెట్టెల్ని ఎలా లాక్కొని పోతుందో అలాగే భక్తులను సత్యానుభవం వైపు తీసుకొని పోతాడు గురువు. గురువు బోధ స్వరూపుడుగా ఉండాలి. భక్తులకు బరువుగా ఉండకూడదు. ఇంట్లో ప్రేమలు అహంకారపూరితమైనవి. జ్ఞాని ప్రేమ హద్దులు లేనిది, పరిమితం లేనిది. భగవంతుడు నాకు కేటాయించిన ఈ పనిని ఇష్టంగా చెప్పాలి. మీకు చెప్పాలని లాంఛనంగా కాదు. అర్పణభావంతో చెప్పాలి. మామూలుగా నీవు నిద్రలో ఉంటే కేకేస్తే లేస్తావు. అలాగే నిన్ను జీవన్ముక్తుణ్ణి చెయ్యడానికి అజ్ఞానమనే నిద్రలోనుండి మేల్కొలపడానికి గురువు చేసే బోధ పాలికేకవంటిది. ఆచార్యునిలో జ్ఞానం, అనుగ్రహం, దయాస్వరూపం, విషయాన్ని అందంగా చెప్పే నేర్పు ఉంటుంది. గురువును కొందరు సాధకులు ఎన్నుకొంటారు. కానీ గురువు సాధకుని ఎన్నుకొనే పద్ధతి కూడా ఉంటుంది. నన్ను భగవాన్ ఎన్నుకొని ఒడిలోకి తీసుకొని ముద్దుపెట్టుకున్నారు. బత్తాకాయలపైన తోలు ఉంటుంది, లోపల తొనలు ఉంటాయి, వాటి మధ్య జుట్టులాంటి తోళ్ళు ఉంటాయి, తొనలలో రసం ఉంటుంది. బత్తాయి కాయ





భగవంతుడు అయితే అందులో ఉన్నరసం గురువు. సాధనకు ఎక్కువ ప్రయోజనం గురువు వల్ల ఉంటుంది. ఏది తెలుసుకుంటే సుఖి అవుతారో దానిని తెలుసుకోవడానికి మీకు ఇష్టం లేకపోయినా దానిని తెలుసుకునే బుద్ధిని కలుగజేసేవాడే గురువు. తెలియజెప్పేవాడు గురువే. తెలియబడేది గురువే. గురువు కృప ఎలా వస్తుంది అంటే ఎంత వెదికినా ఆయనపట్ల భౌతికమైన కారణం కనిపించకూడదు. ఆ ప్రేమ కావాలి. అదే నిజమైన ప్రేమ. గురువు నీకు జ్ఞాపకమొస్తూ ఉంటే హృదయంలో ఆ ప్రేమ నదికి వరదవస్తే ఎలా పొంగిపోతుందో అలా ప్రేమ ప్రవహించాలి. మనం చనిపోయిన తరువాత మన శరీరానికి వారసులు నిప్పు పెడతారు. అది నశిస్తుంది. కానీ సూక్ష్మశరీరాన్ని గురువు నిప్పు పెడతాడు. అది భౌతిక అగ్నికి కాలదు. గురువు నిప్పు పెట్టేస్తాడు. అది పూర్తిగా కాలడానికి సమయం పడుతుంది. అజ్ఞానం పూర్తి అయితేకాని ఆ నిప్పు ఆరదు. ఇప్పుడు మనం అరుణాచలేశ్వరుని నోట్లో ఉన్నాము. ఆయన మనలను ఉయ్యడు, మింగడు. రెండూ చేసినా ఫరవాలేదు. నోట్లో వేసుకొని చప్పరిస్తూ ఉంటాడు. ఆ చప్పరించడం వల్ల దుఃఖం వస్తుంది. సహనంతో జీవిస్తే మనలను మింగేసి ఆయన శాంతిని ప్రసాదిస్తాడు. చప్పరించడం అంటే మనలో వగరు, చేదు, పులుపు అవి అన్నీ పోయి తీపిగా ఉన్నప్పడు మింగుతాడు.

32. బుద్ధుని ప్రేమ ఈ భూమి మీద ఎక్కడా కనిపించదు. ఆయన ఒక మనిషిని చూచాడంటే చాలు ఆ అపూర్వమైన ప్రేమ సత్యాన్ని దర్శింపచేస్తుంది. బుద్ధుని శరీరం చనిపోయినా మన హృదయంలో సజీవంగా ఉన్నాడు. మనం బ్రతికి, చచ్చి ఉన్నాము. ఆయన ప్రేమ విశ్వవ్యాప్తమైనది. ప్లేట్లో ఫలహారం పెట్టి నీ చేతికి అందిస్తే నీకు ఎంత సుఖంగా ఉంటుందో అలాగే ఆచార్యులదయ ఉంటే సాధకునికి ఎన్ని అసౌకర్యాలు ఉన్నా అన్నీ సుసాధ్యమే. చాలామంది విద్యాదానం, అన్నదానం, ద్రవ్యదానం మంచిది, గొప్పది అనుకుంటారు. సాక్షాత్తు సుఖాన్ని అందించే జ్ఞాన దానమే గొప్పది. ఎక్కడ కామం లేదో అక్కడికి మేల్కొలిపే వాడే గురువు. అప్పుడు మనం

ఇంద్రియాలతోను, బుద్ధితోను, మనస్సుతోను మేల్కొని ఉన్నాము. ఎరుకలేదు. ఇంటి దగ్గర ఒక గంట పని చెయ్యమంటే పని చేస్తాము. కానీ పది నిమిషాలు నిజం గురించి ఆలోచించమంటే ఆలోచించము. సాధకునికి జ్ఞానమివ్వడం ముఖ్యం. ఎలా ఇచ్చారు అనేది ముఖ్యం కాదు. కొందరు మౌనం ద్వారానూ, కొందరు బోధద్వారానూ జ్ఞానం ఇవ్వగలరు. అభ్యాసం అంటే మనస్సు ఎక్కడికి వెళ్ళిపోతే అక్కడనుండి వెనుకకు తీసుకొని రావడం. మనస్సు ఎక్కడ సుఖంలేదో అక్కడికి వెళ్ళిపోతుంది. దానిని సత్యాను సంధానం చెయ్యడమే. ఏ వాసన అయితే మీరు తొలగించుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారో అవి ఇతరులలో కొందరికి లేవు. గత జన్మలో నీకు ఏది ఉపయోగపడదో దానిని నీవు ప్రేమించావు. దానిని ఇప్పుడు తొలగించు కోవడానికి ప్రయత్నిస్తే "నేను వేల జన్మలనుండి బ్రతుకుతున్నాను. నా సంగతి ఏమిటి? నీ సంగతి చూస్తాను" అని వాసన తిరగబడుతుంది. అప్పుడు గురువు చెప్పిన మాటలు గుర్తుకు వచ్చి నీ సంగతి ఏమిటో నేను చూస్తాను అని మనం అంటే దానితో యుద్ధం ప్రారంభమవుతుంది. గురువు సహాయం, భగవంతుని సహాయం లేకుండా ఆ యుద్ధాన్ని జయించలేము. రొట్టె ముక్కను చెఱకు పానకంలో ముంచుకొని తింటారు. అలాగే నీకు వివేకం ఉన్నా, చెఱకురసం లాంటి గురువు దయ లేకపోతే నీవు గమ్యాన్ని చేరలేవు. ఎన్ని విద్యలు ఉన్నా ఆత్మ విద్య లేకపోతే ప్రయోజనం ఏమిటి? వాసనలు కనిపించని సంకెళ్ళ లాంటివి. కనిపించే సంకెళ్ళను గొడ్డలిపెట్టి నరుక్కోవచ్చును. కనిపించని సంకెళ్ళు నరకడానికి గురువనుగ్రహం కావాలి. బ్యాటరీ లైటులో బ్యాటరీ అయిపోతే అక్కడ స్విచ్ ఉన్నా లైటు వెలుగదు అలాగే నీ మనస్సులో ఉన్న వాసనలు అనే మూట నెత్తిమీద పెట్టుకొని తిరుగుతూ శాంతిలేదని వాపోతున్నావు. గురువు అనుగ్రహం వల్ల వాసనలు అనే మూట దింపి అవతల పడవేస్తే నీ మనస్సు శాంతంగా ఉంటుంది. పునర్జన్మలు ఉండవు.

33. గురువులలో కొందరు ఇలా అనుకొంటారు. ఈ భక్తురాలు





యొక్క ఖర్మఫలితాన్ని వాయిదా వెయ్యగలం కానీ, తొలగించలేము. ఈశ్వర నిర్ణయాన్ని మనం కాదని తొలగిస్తే ఈ ఖర్మానుభవానికి మరో శరీరానికి అవకాశం కల్పించాలి అని ఊరక ఉంటారు. మనం దుఃఖిస్తే ఆయనా దుఃఖిస్తాడు. ఈ విషయాలు ఎవరైనా భగవాన్‌కు ఏకరువు పెడితే "అరుణాచలేశ్వరుని అనుగ్రహం ఎలా ఉంటే అలా జరుగుతుంది" అనేవారు. రామకృష్ణుల వద్దకు "మా పిల్లలకు పెళ్ళిళ్ళు కావడం లేదు, మా అబ్బాయి మాతో మాట్లాడటంలేదు, మాకు ఈ కష్టాలు వచ్చిపడ్డాయి" అని ప్రకృతి విషయాలు మాత్రమే చెబితే వాళ్ళు వెళ్ళిన తరువాత వారు కూర్చున్న స్థలాన్ని గంగాజలంతో కడిగించేవారు. అమ్మతో "ఇటువంటి వారిని నా వద్దకు పంపిస్తున్నావు ఏమిటి?" అంటే "ఓపిక పట్టు కొద్దికాలానికి సమర్థులు వస్తారు" అనేది. సాధారణంగా అనుబంధం దుఃఖాన్ని తీసుకొని వస్తుంది. మన ప్రయత్నం మనం చెయ్యాలి. ఈశ్వర నిర్ణయం ఎలా జరగాలో అలా జరుగుతుంది. రామకృష్ణులకు ఏదైనా చెడువాసన వస్తే అమ్మతో నాకు చెడు వాసనలు వస్తున్నాయి అని ఏడ్చేవారు. వివేకానంద రామకృష్ణునితో ఎంతసేపూ నాతోనే మాట్లాడుతున్నారు మిగిలిన వారితో కూడా మాట్లాడండి అంటే "నీతో మాట్లాడకుండా ఉండలేను" అనగా కొంతసేపు అయిన తరువాత ఏకాంతంగా ఉన్నప్పుడు ఒకరు "వివేకానంద మీరు అనుకున్నంత భక్తుడు ఏమీ కాదు, వాడు సిగరెట్లు కాలుస్తున్నాడు" అనగా "పెద్ద అగ్నిహోత్రంలో చిన్న రాయి వేస్తే ఆ అగ్ని ఆరిపోతుందా? వాడి మంచి గుణాలలో ఒక చెడు గుణం ఉన్నా అతని అభివృద్ధి ఆగదు" అన్నారు. చీకటిలో ఉన్న వారికి దీపం ఎంత అవసరమో అజ్ఞానంలో ఉన్నవానికి గురువు కూడా అంతే అవసరం. సాధకులకు అన్నిటికంటే గురువు అనుగ్రహం ముఖ్యం. శరీరంలో ఉన్న మలం 'ఎనిమా' చేయడం వల్ల బయటికి పోతుంది. కానీ అరిషడ్‌వర్గాలు అనే మలం, నీవు అనేక జన్మలలో చేసిన నిషిద్ధ ఖర్మలు గురువు అనుగ్రహంతో మాత్రమే బయటకు పోతాయి. గురువు ప్రవచనం శ్రద్ధగా శ్రవణం చేయడం వల్ల చాలా దోషాలు పోతాయి. ఆ బోధ వల్ల

నీలో ఆ మలదోషాలు తొలగించుకోవాలి అనే బుద్ధి ఏర్పడుతుంది. మధుబాబుతో రామకృష్ణుడు "నీ బలహీనతల్ని కూడా కలుపుకుని ప్రేమిస్తున్నాను" అన్నారు. అది గురువు వైభవం. సాధకునకు గురుజ్ఞాన దానం వల్ల మాత్రమే బ్రాహ్మీస్థితి కలుగుతుంది. అది గురువుకు మాత్రమే సాధ్యం. మనస్సుతో చేసే సాధన కంటే ఈశ్వరానుగ్రహం గొప్పది. మనం ఒక్క అడుగు వేయగలం ఆయనే పది అడుగులు వేసుకొచ్చి మనలను ఆయనలో కలుపుకుంటాడు. రామకృష్ణుడు శరీరాన్ని విడిచిపెడుతూ "నా శక్తిని మీకు ప్రసరింపచేయడం వలన, నా అనుగ్రహం వలన, మీ ఇంద్రియాలు, మీ మనస్సు మీ స్వాధీనంలోకి వస్తాయి. తేలికగా మీకు సత్యానుభవం కలుగుతుంది" అన్నారు. గురు ఋణం తీర్చుకోవడం చాలా కష్టం. మనో దేహాలకు అతీతంగా ఉన్నవాడే గురువు. రామకృష్ణ పరమహంసకు మానస పుత్రుడైన బ్రహ్మానంద (రాఖాలు)తో ఆయన "శరీర బాధతో అందరిలాగే బాధపడే నన్ను అవతార పురుషుడని అంటారేంటి?" అనగా ఆయన "మీరు ముమ్మాటికీ అవతారపురుషులే. మీరు మా విశ్వాసాన్ని కదిపినా చలించదు" అన్నారు. ఐన్‌స్టీన్ బ్రహ్మానంద మాటలు చదువుతూ ఉండేవారు.

34. ప్రేమ, శాంతి లేనివాడు గురువు కాదు. మొత్తం జీవకోటిని సమానంగా ప్రేమించేవాడు, అత్యంత సహనం కలవాడు గురువు. కొంతమంది భక్తుల ఆయనను తిరస్కరించినా "ఇప్పుడు తిరస్కరిస్తున్నాడు కానీ, ఒకప్పుడు ప్రేమించాడు కదా! ఈ తిరస్కరించడం వదిలేసి, ఆ ప్రేమను పట్టుకొందాము" అనుకొంటాడు. వాడు గురువు. మంచిని తీసుకుంటాడు, చెడును వదిలేస్తాడు. మీకు నాలుగు మాటలు చెబుతున్నాను అంటే అది కేవలం గురువు అనుగ్రహమే. నేను సొంతంగా ఆలోచించి కష్టపడి చెబుతున్నాను అనుకుంటే అది గురువుకు ద్రోహం చేసినట్లే అవుతుంది. రమణ మహర్షి శరీరం ఉండగా లాభం పొందినవారి కంటే శరీరం పోయినప్పుడు లాభం పొందినవారే ఎక్కువమంది ఉన్నారు. అక్కడ శరీరం





కాదు చైతన్యమే పని చేస్తున్నది. శరీరం మరణిస్తుంది. అనుగ్రహించేది, మారు మనస్సు తీసుకొని వచ్చే చైతన్యానికి మరణం లేదు. రామకృష్ణులు గురువులను తయారుచేసే గురువు. ఆయన "నేను ప్రపంచాన్ని స్వప్నంలో కూడా ఎంజాయ్ చేయలేదు. మీరు వందమందికి సాయం చేయలేకపోవచ్చును. ఒక్కరికి చేసినా గొప్ప విషయమే" అన్నారు. ఆత్మవిద్య వల్లనే ఆత్మ లభ్యం అవుతుంది. ఇంద్రియాలు, బుద్ధితో సేకరించే తెలివివల్ల అది లభ్యం అవ్వదు. ఆచార్యునకు చదువు ఉండాలి, గురువుకు చదువు అక్కర్లేదు, అనుభవం ఉంటుంది కాబట్టి. అనుగ్రహం విషయంలోకి వచ్చేటప్పటికి గురువు ఆచార్యుడు సమానమే. ఏనుగు ఈగలకు, దోమలకు లొంగదు; సింహానికే లొంగుతుంది. నీ అహంభావన ఏనుగులాంటిది. అది సింహంలాంటి గురువుకే లొంగుతుంది. రామకృష్ణునికి వారసత్వంగా వచ్చే ఆస్తిని అమ్మేయడం వల్ల రామకృష్ణుడి సంతకం రిజిస్ట్రార్ ఆఫీసులో పెట్టాలి కదా! సంతకం పెట్టమంటే "జీవాత్మ బుద్ధి ఉన్న వానికి ఆస్థి ఉంటుంది. చైతన్యానికి ఆస్థి ఉంటుందా? సంతకం పెడితే ఆస్థి మీద హక్కు ఉన్నట్లే కదా!" అన్నారు. తరువాత ఈయన ఎలాగూ దావా వేయడని అన్నగారి సంతకంతో రిజిస్టర్ అయినది. గురువు సహాయం లేకుండా సత్యానుభవం పొందాలనే కాంక్ష సాధకునకు కలుగదు. అలవాట్లు స్థిరపడి పోతే దానిని వాసన అంటారు. అది జ్ఞాన సముపార్జనను చెడగొడుతుంది. దేహవాసన పట్టుని డబ్బుపెట్టి తొలగించుకోలేవు. సాధన చేసినా పోదు. అది గురు సన్నిధిలోనే తొలగిపోతుంది. ఇనుప సంకెళ్ళు నరుక్కోవచ్చును కానీ గురుబంధాన్ని తెంచుకోలేము. వివేకానందతో రామకృష్ణులు "నేను నీ రామకృష్ణుడను, నీవు నా నరేంద్రుడవు" అన్నారు. రోజూ మీ ఇల్లు ఎలా తుడుచుకొంటున్నారో అలాగే నీ మనస్సులో దుమ్మును రోజూ తుడుచుకో. గురువు చెప్పే మాటలు శ్రవణం చేస్తూ ఉంటే నీవు పవిత్రుడవు అవుతావు. మోక్షం వరిస్తుంది. రామకృష్ణుడు నరేన్‌తో "నీవు కిటికీలోనుండి వీధిలో ఉన్నవి ఎలా చూస్తున్నావో అలాగే నాద్వారా సత్యాన్ని చూడు" అంటారు.

35. ప్రారబ్ధం ఎవరైనా అనుభవించవలసిందే. అయ్యప్ప దీక్షితులును శంకరులతో పోల్చవచ్చును. ఉపనిషత్తులు, వేదం బాగా అధ్యయనం చేసి విశ్లేషించి చెప్పేవారు. ప్రవచనం ఒక గంట మాత్రమే చెప్పేవారు. ఆయన నిరంతరం కడుపు నొప్పితో బాధపడేవారు. ప్రవచనం చెప్పే ఆ గంట ఆ నొప్పిని ఆయన కూడా ఉండే వ్యక్తికి బదలాయించి ప్రవచనం అయ్యాక ఆయన తీసేసుకునేవారు. కొందరు అనేవారు పూర్తిగా నొప్పిని తీసేసుకోవచ్చు కదా! అంటే "కర్మసిద్ధాంతంలో అది సాధ్యం కాదు. దీనివల్ల మరో జన్మ ఎత్తవలసి ఉంటుంది" అన్నారు. నాకు మీమీద ప్రేమ, ఆప్యాయత, మీరు బాగుపడాలనే చిత్తశుద్ధి లేకపోతే ఎన్ని గంటలు ఇలా ప్రవచనం చేసినా మీ కాలం వ్యర్థమైనట్లే. మీకు ఏ ప్రయోజనం కలుగదు. రాముడు అంటే రంజింపచేసేవాడు, ఆనందాన్ని కలుగజేసేవాడు. శారదామాత రామకృష్ణుడి గురించి "ఆయన సమాధిస్థితిలోనే ఆనందం పొందడం కాదు, వ్యవహార దశలో కూడా ఆనంద స్థితిలో ఉంటారు" అన్నారు. అరణ్యవాసానికి రాముణ్ణి పంపడంలో మందర, కైకేయి పాత్రల వల్లనే జరిగింది అని అంటూ ఉంటే రాముడు "అలా అనకండి. కైక ప్రారబ్ధంలో ఆ పనిని ఈశ్వరుడు చేయించాడు" అన్నారు. రాముని గొప్పతనం అందులో ఉంది. గురువుకు ఆచార్యుని లక్షణాలు ఉండనక్కర్లేదు. కానీ ఆచార్యునికి గురువు లక్షణాలు ఉండాలి. రామకృష్ణుడు, రమణుడు గురువులు. శంకరులు, రామానుజులు, మద్వాచార్యులు వీరు ఆచార్యులు. గురువులు వారి అనుభవాలు చెబుతూ ఉంటారు. అవి వేదానికి బంగారం తూచినట్లుగా సరిగ్గా సరిపోతుంది. ఆచార్యులు గీత, బ్రహ్మసూత్రాలు, ఉపనిషత్తులు తీసుకొని విషయాన్ని విపులంగా తెలుపుతారు. గురువు యొక్క మౌనం మనస్సు ముగ్గిన వారికే తెలుస్తుంది. గురువుకు మనం బాగుపడాలనే సంకల్పం వస్తే అది మీకు తెలియకపోయినా ఆ సంకల్పం నెరవేరుతుంది. గురువు మీ హృదయంలోకి లాగేసుకొన్నప్పుడు అది అతిబలీయంగా ఉంటుంది. ప్రకృతి మిమ్మల్ని ఏమీ చెయ్యలేదు. గురువుకు





మీ బుద్ధి శుద్ధి చెయ్యడం తప్పించి వేరే పని ఏమీ లేదు. శుద్ధి చెయ్యకపోతే అనుగ్రహం తీసుకోలేవు. గురువు నీ కోరికను నెరవేరుస్తాడు. అప్పడు నీవు సమానంగా ఉన్నావా? లేదా? చూసుకొంటాడు. ఒకోసారి తలంపు సందులో పెట్టి నొక్కుతాడు. అప్పడు సమానంగా లేకపోతే తాత్కాలికంగా ప్రక్కన పెడతాడు. పూర్తిగా వదలడు. గురువు అనుగ్రహం వస్తూ ఉంటే నీవు ఉక్కిరిబిక్కిరి అవుతావు. అప్పడు సృష్టి అంతా గడ్డిపరకలా కనిపిస్తుంది. సత్యాన్వేషణకు శత్రువులు ఎక్కడ ఉంటారు. గురువు అనుగ్రహంతో దానిని తేలికగా అనుభవించే శక్తిని కలిగిస్తాడు. గురువు అనుగ్రహం మీ బుద్ధికి, ఇంద్రియాలకు, మీ మాటకు అందదు. అది అనుభవైకవేద్యము. గురు రూపంలో ఉన్న ఈశ్వరుని దయ లేకుండా పరమస్థితిని పొందలేవు. మనం మన పొట్టకోసం పని చేస్తాము. మహర్షులు మహాత్ములు ప్రజలకు ఉపయోగపడే సంస్థలను అభివృద్ధి చేయడానికి వారు పని చేస్తారు.

36. ఒక అజ్ఞాని ప్రక్కనే జ్ఞాని కూర్చున్నా అజ్ఞాని జ్ఞానిని చూడలేడు. అది అజ్ఞానికి రాత్రిలాంటిది. అలాగే భోగప్రవృత్తి ఉన్న వాని దగ్గర జ్ఞాని కూర్చున్నా జ్ఞానికి ఆ భోగప్రవృత్తి కనబడదు. అజ్ఞాని అనుభవించే భోగ ప్రవృత్తి జ్ఞానికి రాత్రి. మీ చెడ్డబుద్ధిలోంచి మిమ్మల్ని మీ తల్లితండ్రులు బయటకు తీసుకొనిరాలేరు. అది గురువుకే సాధ్యము. ఒక్క బ్రహ్మజ్ఞాని మాత్రమే శాంతిని అందించగలడు. బుద్ధుడు "నా రూపము, నా నామము మరచిపోండి. నా హృదయంలో ఏముందో, నా మాటలో ఏముందో అది గ్రహించండి" అన్నారు. బుద్ధుని చూపులో కామం, కోరిక, ప్రపంచం లేదు. బింబిసారుని రెండవ భార్య బుద్ధునికి వ్యతిరేఖి. అతనిని చూడకూడదు అనుకొంది. అతను లేనప్పడు బుద్ధుడి సుందరవనం చూడడానికి వెళ్ళింది. అది చూస్తూ కాలం తెలియలేదు. తిరిగి వెళ్ళేటప్పడు బుద్ధుడు ఎదురయ్యాడు. అతని కళ్ళను చూచి ఆశ్చర్యపోయింది. ఆయన చూపు ఆమెలో మార్పు తీసుకొనివచ్చింది. ద్వేషించిన ఆమె ఆయన్ని ఉద్దేశించి "ఆచూపు ఎంత బాగుందో దానిముందు నా రూపం యొక్క అందం ఏపాటిది?" అనుకొంది.

అది బుద్ధుని వైభవం. ఒక్క మహిమకూడా చెయ్యనివాడు బుద్ధుడు. మహిమలు చేసి బాహ్యముఖం చెయ్యకూడదని బుద్ధుడు మనిషిగా జీవించాడు. "అందరినీ దహనం చేసే స్మశానంలోనే ఈ శరీరాన్ని దహించండి" అన్నారు. అది వ్యక్తిభావన లేని జీవితం. ఏసు "ఓ పీటర్ నీవు మంచివాడిని అనుకొంటున్నావు. నీకు ధనకాంక్ష ఉన్నదనే విషయం నీకు తెలియడంలేదు" అన్నాడు. మన హృదయంలో ఉన్న వాసనలు తలంపులోకి వస్తేకానీ తెలియదు. గురువుకు నీలో వాసనలు ఏమున్నాయో తెలుసు. గురువు నీ ఆశను బట్టి నీకు ఆత్మానుభవం ఇవ్వడు. నీ అర్హతను బట్టి ఇస్తాడు. పూర్వం గోదావరికి వరద వస్తే నల్లఇరుగుడు దుంగ కొట్టుకొని వస్తున్నదని దానిని పట్టుకున్నాడు. తీరా చూస్తే అది ఎలుగుబంటి. అది ఎలుగుబంటి అని తెలిసి ఒడ్డున ఉన్నవాళ్ళు "వదిలేసి రారా అంటే దానిని నేను వదిలేసాను, అది నన్ను వదలడం లేదు" అన్నాడు. ఆలాగే అలవాట్ల యొక్క వేగంలో పడితే వాటిని వదిలించుకొందాము అన్నా అవి వదలవు. అవి గురువు అనుగ్రహం వల్లనే పోతాయి. జన్మలు, పుట్టుకలు, చావులు మన అజ్ఞానానికే కనిపిస్తాయి. బ్రాహ్మీస్థితి కలిగితే అవి అన్నీ స్వప్నాలు అని తెలుస్తాయి. ఏనుగుకు స్వప్నంలో సింహం కనిపిస్తే నిద్రలో నుండి మేల్కొంటుంది. అబద్ధమైన సింహం వల్ల నిద్రలో ఉన్న ఏనుగు ఎలా మేల్కొంటుందో అలాగే గురువు మన అజ్ఞానంలోనుండి మేల్కొలిపి ఆత్మానుభవాన్ని కలుగజేస్తాడు. బాహ్యంగా నీకు ఎన్నో క్లేసాలు వచ్చినా అన్నీ తొలగిపోతాయి. దీన్ని మీ అనుభవంలోకి తీసుకొనివెళ్ళాలి. ఈ సమావేశాల లక్ష్యం అదే. దుఃఖాన్ని ఎన్ని రోజులు దగ్గర పెట్టుకుంటారు. ఉన్న స్థితిని ఉన్నట్లుగా తెలియజేయాలి. ఈ విషయంలో మాటల ద్వారా సరిగా చెప్పలేక పోతున్నాను అని అనిపిస్తున్నది. గురువు అనుగ్రహం మీకు లేదు అనిపిస్తూ ఉంటుంది. లేదు అనుకోవడం ఒక తలంపు. అనుగ్రహం తలంపు కాదు. అది గురువు నుండి నిరంతరం ప్రవహిస్తూనే ఉంటుంది. గురువుకు శరణాగతి చెందితే ఈ ప్రశ్న రాదు.





37. మీరు ఇక్కడ పుణ్యం చేసుకోండి, మరో లోకంలో పుణ్యం అనుభవించండి అని అరువు బేరాలు చెప్పము. మీకు చెక్కు ఇచ్చి చనిపోయిన తరువాత చెల్లుతుంది అంటే ఆ మాటకు అర్థం ఏమిటి? మాకు ఉన్న ఆనందాన్ని మీకు కొంత పంచాలి. ఈ సమావేశాల లక్ష్యం అదే. సత్యంలో కాలం లేదు. అందులో టైం తెలియక కాలాన్ని పొడిగిస్తున్నాము. మేము చెప్పే ప్రయత్నం మెకానికల్‌గా చెప్పడంలేదు. మీ హృదయంలో ప్రవేశించడం వల్ల మీరు నన్ను వదలడం లేదు. నేను మిమ్మల్ని వదలలేక పోతున్నాను. అందుకే ఎక్కువ సమయం ప్రవచనం చేస్తున్నాను. నాన్నగారు రమణ మహర్షి ఫొటో దగ్గర కూర్చున్నప్పడు ఇలా భావించారు "ఇప్పడు మీరు శరీరంలో లేరు కదా! అనుకొంటే నీవు అనుకొన్నట్లు శరీరంలో లేకుండా ఉండని మాట నిజమే. కానీ 'నీ వెంటే ఉన్నాను' అనే సందేశం వచ్చింది. అంటే నీ చర్యలను నేను చూస్తున్నాను అని అర్థం, బ్రిటన్‌లో శ్రీ నాన్నగారిని ఈరకంగా సంబోధిస్తారు 'చైల్డ్ ఆఫ్ భగవాన్, క్రౌండ్ పుల్లర్ అని. దేవతలకు, దేవతలకు చుట్టరికాలు ఉంటాయి. మనుష్యులకు, మనుషులకు చుట్టరికాలు ఉంటాయి. కానీ సుబ్రహ్మణ్యునికి, నాకు చుట్టరికం ఉంది. ఆయన దేవతాపురుషుడు మేము మానవులము. ఇది రెలిటివ్‌గా కనిపిస్తుంది. ఆయన విగ్రహం ఎక్కడ కనిపించినా నమస్కారం పెట్టాలని అనిపించదు. ఇష్టం లేక కాదు. ఇంట్లో వాళ్లను గౌరవించడం ఏమిటి? అని. అది జన్మాంతర అనుబంధం ఉంది. పూజ చెయ్యకపోయినా హృదయంలో అనుబంధం ఉంది. ఆయన నా హృదయానికి అత్యంత సన్నిహితుడు. శివుని జ్ఞాన నేత్రం నుంచి వచ్చిన తేజస్సుని గంగ భరించలేక గంగానది ప్రక్కన ఉన్న శరవణభవ తటాకంలో పడింది. అందులోనుండి 'సుబ్రహ్మణ్యుడు' అనే రూపం వచ్చింది. ఆ పిల్లవాడిని ఆరుగురు కృత్తికలు పెంచారు. ఆ ఆరుగురి స్థనాల నుండి ఆరు ముఖాలతో పాలు త్రాగాడు అందుచేతనే షణ్ముఖుడు అంటారు. తిథి లెక్కలో ఆరవ రోజు షష్ఠి అందుకే సుబ్రహ్మణ్య షష్ఠి అంటారు. శివుని నుండి వెలువడి బట్ట తీసి వైరాగ్యంతో

గోచీ పెట్టుకొని పళనిలో ఒక కొండమీద కూర్చున్నాడు. ఆయన భూమి మీదకు వచ్చిన పని పూర్తి చేసుకొని, రాక్షస సంహారం పూర్తిచేసి విశ్రాంతిగా ఉన్నదని తిరుత్తణిలో శాంతి సుబ్రహ్మణ్యునిగా ఉన్నాడు. అరుణగిరి నాధునికి అరుణాచలానికి సంబంధం ఉంది. త్యాగరాజులాగే గొప్ప రచయిత సుబ్రహ్మణ్యుని అనుగ్రహంతో "తిరుప్పంగలె" వ్రాసారు. అంతా సుబ్రహ్మణ్యుని మీదే వ్రాసారు. తమిళయన్స్ ఎక్కువగా పాడతారు. ఒక పని మనిషిని మహేంద్రనాథ్ గుప్తా మొదటిసారిగా వెళ్ళినప్పుడు రామకృష్ణుని గురించి "మీ గురువుగారు చదువులేని వాడు అందరికీ వేదాంతం ఎలా చెబుతాడు" అంటే ఆమె అంది "కంఠంలో అన్ని విద్యలూ ఉన్నవానికి కాలేజీ చదువులు ఎందుకు?" అని సమాధానం చెప్పింది. నీకు భయం కలిగినప్పుడు గురువు నీకు వైరాగ్యాన్ని ఇస్తాడు. ఇరకాటాల్లో, బాధల్లో ఉంటే నిన్ను అందులోనుండి బయటకు తీసుకొస్తాడు. లక్ష్మీదేవి, సరస్వతీ దేవి అనుగ్రహం ఉన్నా గురువనుగ్రహం లేకుండా ఎంత సాధన చేసినా ఆత్మసాక్షాత్కారం కలుగదు.

38. దుఃఖ స్పర్శలేని విద్యను బోధించేవారిని బోర్న్ టీచర్స్ అంటారు. పరమహంసగారు ఒక న్యాయాధిపతితో నీవు గుళ్ళపుస్వారీ చెయ్యవద్దు అన్నా మానలేదు. ప్రమాదంలో మరణించాడు. ఆయన అనేవారు "గోడ అవతల ఏముందో మనకు తెలియదు. కన్నం ఉంటే బయట మైదనాం తెలుస్తుంది. ఆ గోడకు ఉన్న కన్నమే (పరమాత్మ) నేను. నా ద్వారా మీరు భగవదనుభవం పొందుతారు" అన్నారు. మహేంద్రనాథ్ గుప్తా రామకృష్ణుని చితాభస్మాన్ని నోట్లో వేసుకొని నీళ్ళు త్రాగుతూ ఉంటే "అలా ఎందుకు చేస్తున్నారు" అంటే "ఈ దేహం పవిత్రమైనది కాదు. వచ్చే జన్మలో అయినా ఆ స్థితిని పొందుదామని. నాకు ఎన్ని డిగ్రీలు ఉన్నా ఆ దేహ వైభవం ఎక్కడ ఉంది?" అన్నారు. ఆయనతో పరమహంసగారు "నేను ఈ భూమి మీదికి రావాలంటే వస్తాను. నాకు స్వతంత్రం ఉంది. మేము జీవకోటి వారము కాదు ఈశ్వరకోటి వారము" అన్నారు. తన మరణం తేదీ పదహారవ తేదీ అని గుర్తించి అదే రోజున శరీరం వదిలారు. మహేంద్రనాథ్‌తో ఆయన





"నీవు మోక్షం కోసం ప్రయత్నం చెస్తున్నావు. మంచిదే కానీ బుల్లి నరేంద్రుడు సిద్ధి పొంది పుట్టాడు. పదిమంది తరించడానికి పుట్టాడు" అన్నారు. రామకృష్ణునితో ఒకరు "నేను పదిహేను రోజుల క్రితం పెళ్ళి చేసుకున్నాను" అంటే "పదిహేను రోజులనుండి ఏడుస్తున్నావా" అన్నారు. ఈ అమాయకంగా ఉన్న మాటలు ప్రపంచం అంతా వ్యాపించాయి. బుద్ధుని అంత ప్రభావం చూపాయి. రామకృష్ణునితో "ఈ కేన్సర్ రోగం ఏమిటి మీకు?" అంటే "ఈ శరీరానికి అద్దె చెల్లించాలి కదా!" అనేవారు. ఆయన కేశవచంద్రసేన్‌తో "నా పేరు పేపర్లో వ్రాసి బ్రహ్మజ్ఞానిని చెయ్యగలవా? భగవంతుడు నన్ను బ్రహ్మజ్ఞానిని చెయ్యాలి అనుకుంటే ఎవరు ఆపగలరు?" అన్నారు. శంకరులు "తల్లికి అంతిమ కాలంలో నిర్వికారాన్ని గురించి బోధిస్తూ ఉంటే ఆమె బోధను అందుకోలేకపోతున్నదని మహావిష్ణువు రుపాన్ని ధరింపజేసి ఆమెను మహావిష్ణువు స్మరణలో పెట్టి విష్ణువులో ఐక్యం చేసారు". నీ గురువు సాయం చేస్తాడు. నీవు ఒక్క అడుగు వేస్తే ఆయన తొమ్మిది అడుగులు వేసి నిన్ను ఆదుకుంటాడు. ఆ ఒక్క అడుగూ వేయలేవా? నాకు ఆ వాసన బాధపెడుతున్నది అంటే రామకృష్ణుడు "తీసేస్తాను" అంటాడు. అది గురువు వైభవం.

39. నిజంలో ఉంటే చర్చ ఏముంటుంది? దానికి గురువు అనుగ్రహం కావాలి. గురువు నీ వాసనల్ని ఆపరేషన్ చేసి నీకు తెలియకుండా తీసేస్తాడు. రామకృష్ణునితో ఒకరు "మేము అభివృద్ధిలోనికి వస్తున్నామని తెలుస్తున్నది అంటే నీ వాసనలు తీసేయడం వల్ల గ్రహించావు" అన్నారు. నాన్నగారి గురించి రోజర్ వ్రాసిన పుస్తకం "ట్రావిల్ సీక్రెట్ ఆఫ్ ఇండియా"లో నాన్నగారు బావరాజుగారి అత్తగారిని గమనిస్తున్నప్పుడు ఫిజికల్‌గా లేదా సాధనలో ఉన్న శిష్యుల వాసనలు గురువు ఎలా తీస్తాడో గ్రహించాడు. దానిపై నాన్నగారు "క్లీన్ అబ్జర్వర్ ఆయన" అన్నారు. బ్రంటన్ మాస్టర్ మహేంద్రనాథ్ గురించి వ్రాస్తూ "ఆయన చెప్పిన మాటలు మరచిపోయాను ఆయన మాటలు, ఆయన సంబంధం పవిత్రమైనవి. కళ్ళకు కనిపించే మనిషికన్నా ఎంతో పవిత్రుడు" అన్నారు. సాధనలో నిజాయితీ ఉంటే గురువనుగ్రహం

వస్తుంది. నీ సాధనే గురు అనుగ్రహంగా మారిపోతుంది. అది వచ్చినప్పుడు భౌతికంగా నీకు తెలుస్తుంది. ప్రయత్నమే సాధన. మీరు మీరుగానే ఉన్నారు. కానీ అది మీకు అనుభవం లేదు. దానికి గురువనుగ్రహం కావాలి. మాటలు చెప్పి మనలను అంతర్ముఖం చెయ్యనివాడు గురువుకాదు. మన హృదయానికి సన్నిహితంగా ఉన్న గురువును మనం గుర్తించలేకపోతున్నాము. శరీర సంబంధీకులను గౌరవిస్తున్నాము. అహంకారాన్ని సంతృప్తి చెయ్యడానికి వారు హృదయానికి దూరంగా ఉన్నారు, కానీ దగ్గర వారు అనుకొంటున్నాము. రామకృష్ణుడు ఏ పాండిత్యం గలవాడిని గౌరవించలేదు. ఏదీ నీ సొంతం కాదు. తెలివి కూడా భగవంతుడు ఇచ్చినదే. ఆత్మజ్ఞాని నాలుగు మాటలు మాట్లాడినా సరిపోతుంది. అజ్ఞాని ఎక్కువ మాట్లాడినా ప్రయోజనం లేదు. మీరు బాగుపడటం ముఖ్యం. మిమ్మల్ని ఏదో అవతార పురుషుని కట్రాడుకు కట్టాలని కాదు. సబ్జక్టు ముఖ్యము. ఇద్దరు దేవుళ్ళు ఉంటే ఒకరు పెద్ద, ఒకరు చిన్న. ఉన్నది ఒక్కటే అయినప్పుడు పేర్లు ఎందుకు? గోవిందపాదులు శంకరాచార్యులను మీరు ఎవరు? అంటే “అదీ కాదు, ఇదీ కాదు అంతటా వ్యాపించి ఉన్న వాడిని” అనగా గ్రహించి “నీవు అద్వైత బోధ చేసి దాన్ని స్థాపించు” అన్నారు. ఏసు “ముగింపు లేని సుఖము, శాంతి, ఆనందము పొందాలంటే సత్యాన్ని తెలుసుకొని తీరాలి. అది నీ ఇష్టఅయిష్టాలపైన, నమ్మకాలపైన ఆధారపడిలేదు. అది స్వతంత్రమైనది” అన్నారు. గురువుగా ఉండాలని ఎవరూ అనుకోకండి. దానివల్ల ప్రతిబంధకాలు ఎక్కువై స్వేచ్ఛ లేకుండా చేస్తారు. మీరు ఏదిగా ఉన్నారో ఆ స్థానాన్ని జ్ఞాని పొందాడు కాబట్టి ఆయన ద్వారా జ్ఞానం, ఆనందం ప్రవహిస్తుంది. ఐశ్వర్యం అంటే జ్ఞానమే. “రామకృష్ణుని సాన్నిధ్యంలో నా పూర్వపు భావనా తరంగాలు మారిపోయేవి” అనేవారు వివేకానంద. అందరిలా చనిపోతే ప్రయోజనం ఏమిటి? అనుకొనేవారు. శరీరం నీవు కాదు అని భగవంతుడు ఎంత గట్టిగా చెప్పినా నమ్మలేకపోతున్నాము. ఎందుకు ఆ తలంపు అంతగా అనుకునేటట్లు చేస్తున్నది? భగవంతునికి





ఈ దుర్మార్గం ఏమిటి? అంటే నీవు పూర్వజన్మలలో చేసిన పాపాలు శరీరం ద్వారానే అనుభవింపచేస్తాడు. దేవుడు మంచి చెడులను అనుభవింపచేస్తాడు. గురువు వాటిని పదిశాతం అనుభవింపచేసి ముందుకు తీసుకొనిపోతాడు.

40. గురువు నీవు ఎటువంటి పరిస్థితులలో ఉన్నా శపించడు. గురువు ఇస్తాడు, కానీ కొట్టడు. మీరు బిడ్డలు కదా! దేవుడు జడ్జి. బుద్ధుడు శరీరం ధరించకముందు మనుషులను దేవునికి బలి ఇచ్చేవారు. జ్ఞాని అనుగ్రహం శిష్యుని మీద నిశ్శబ్ధంగా పని చేస్తుంది. ఆయనకు ద్వితీయం లేదు. బుద్ధుడు సత్సంగంలో మౌనంగా ఉండేవాడు. వారితో మమేకమై ఉండేవాడు. మనలో ఒకరిగా ఉండేవాడు. కలసిపోయి ఉండేవాడు. అందుకే క్రీస్తు కంటే ఎక్కువ గౌరవం వచ్చింది. నేను అర్తమూరు గ్రామ భక్తులకు, కుటుంబ సభ్యులను నన్ను చీరలమీద పుష్పాలువేసి నడిపించకండి స్వాములు వస్తే అది మీ ఇష్టం. నా పద్ధతి ఇది. నేను మీ కుటుంబ సభ్యుడను. నేనూ మీలాంటి వాడినే. భజంత్రీలు అక్కర్లేదు. మహాత్ములను మనకు చూడలని ఉంటే ముందు మన రాగద్వేషాలను ఇంటి దగ్గర వదలి వారిని దర్శించాలి. వారి దయ అపరిమితంగా ఉంటుంది. నదిని నీవు ఈదనక్కర్లేకుండా నిన్ను తన నావలో కూర్చోబెట్టుకొని శాంతిసాగరానికి చేరుస్తాడు. ఆ వైభవం ఏ లోకంలోనూ దొరకదు. జన్మల తరబడి, యుగాల తరబడి మీరు శ్రవణం చేసినప్పటికీ అమనస్క స్థితికి చేరిన వాడి వీక్షణం వల్ల ఒక్క క్షణంలో అజ్ఞానం నశిస్తుంది. ఆ మౌనస్థితి అటువంటిది. గురువు ప్రవచనం చెవుల ద్వారా మనస్సులోకి వెళుతుంది. అది కూడా ప్రసాదమే. బుద్ధుడు సార్‌నాథ్ వెళుతూ ఉంటే ఒక వ్యక్తి బాధపడుతున్నాడు. “బాధ ఎక్కడ? నీ దుఃఖంలోంచి బయటకు తీసుకొని వచ్చే దారి చూపిస్తాను. శాంతిని నీకు ఇస్తాను. నన్ను అనుసరించు” అన్నారు. ఇవ్వడం అంటే ఇవ్వడమే. శంకరులు తల్లితో “భౌతికంగా భర్తకు భార్యే శాంతి. కానీ నాకు పెళ్ళి అయిపోయింది. అది ముగింపు లేని శాంతితో” అన్నారు. అంగుళీ

మాలకుడు బుద్ధుణ్ణి చూచి ముందుకు వస్తూ "ఆగు.... ఆగు...." అనగా "నా మనస్సు ఎప్పుడో ఆగిపోయింది. ఆగవలసినవాడివి నీవే" అనగా దగ్గరకు వచ్చాక అతని కత్తి ఆగిపోయింది. క్రింద పడేసాడు. ప్రశాంతం అయిపోయాడు. అంత క్రూరంగా ఉన్న మనిషి నిర్మలం అయిపోయాడు. బుద్ధుడుకి హైలీ కాన్సన్‌ట్రేషన్ మైండ్. బుద్ధగయలో బుద్ధుడు చెట్టువైపు రెప్పవేయకుండా నుంచుని కదలకుండా 12 గంటలు చూచాడు. ఆత్మానుభవం అయిన తరువాత పుస్తకాలు చూచి చెప్పడం కాదు అనుభవంతో చెప్పాలి. బోధకు బయలుదేరాడు. తన ఆనందాన్ని సాధ్యమైనంత వరకు ఇతరులకు అందేలా చూచాడు. ప్రపంచంలో బాధ సముద్రం అంత ఉంది. ఈ భిన్నమైన కన్నీళ్ళు దానిని ఎంతవరకూ ఆపాలో అంతవరకూ ఆపేసి చూచాడు. బుద్ధుడు సభ్యత గల మనిషి. ఆయనకి సబ్జక్టే ముఖ్యం. సుజాత భోజనంతో శరీరం నిలబడింది. కుమ్మరి వాడి భోజనంతో ఈ శరీరం ఉండదు. ఇది శరీర ధర్మము. అతన్ని ఏమీ అనవద్దు" అన్నాడు.

41. బుద్ధుడు చేతిలో నాలుగు చెట్టు ఆకులను పట్టుకొని సాధకులతో "నా చేతిలో ఉన్న నాలుగు ఆకులను లెక్క పెట్టవచ్చును. ఈ మహావృక్షంలో ఉన్న ఆకులను ఎలా లెక్కపెట్టగలము అలాగే జ్ఞానం గురించి ఎంతో వుంది. మీకు ఉపకరించే కొన్ని మాటలను నేను పరిమితంగా మీకు ఉపయోగపడేలా చెబుతున్నాను" అన్నారు. ఇది అద్భుతమైన మాట. బుద్ధుడు సిద్ధులను ప్రదర్శించలేదు, కానీ విషయం సాధకులకు ఉపయోగ పడేలా అతని బుద్ధికి అందేలా సిద్ధిని ప్రదర్శించేవాడు. బాహ్యంగా అది కూడా ఎవరికీ తెలిసేదికాదు. అది సిద్ధిని ప్రదర్శించడంకాదు అతను ఆధ్యాత్మిక ప్రగతికి ఎదగడానికి మాత్రమే. మైండ్‌ని నిర్వాణ స్థితికి సమాయత్తం చేయడానికే. నాకు ఒక ధనవంతుడు ధనమిస్తాను అన్నాడు. "మంచి పనికి ఉపయోగించండి" అంటే ప్రస్తుతం ఈ సంస్థ నడుస్తున్నది. చాలు. అవసరమైనప్పడు చూద్దాము అన్నాను. మహాత్ములు స్లోగా, స్టడీగా, సైలెంట్‌గా పనిచేస్తారు. పక్వత ఎంతవరకూ ఉందో, మీ బ్రెయిన్ ఎంత





వరకూ స్వీకరిస్తుందో అంతవరకూ అనుగ్రహిస్తారు. అది ఖాయం. గురువు శరీరం పడిపోయినా అనుగ్రహం, అనుబంధం వెంటాడుతుంది. మీరు ఏ లోకాలకు వెళ్ళినా చూసుకుంటాడు. ఈ జన్మ చక్రంలోంచి బయటకు వచ్చేవరకూ లోకాలు మారినా, పరిస్థితులు మారినా, జ్ఞానం ప్రసాదిస్తాడు. శరీరం నిజంకాదు, శరీరం వస్తుంది. ముసలిది అవుతుంది, చనిపోతుంది. ఆ చనిపోయేది అనుగ్రహించదు. నీవు గురువు శరీరం లేకపోయినా మానసిక అనుబంధం విడిచిపెట్టకూడదు. ఆయన మౌనం కూడా ఉపదేశమే. గురువుకు ద్వేషం తెలియదు. ద్వేషం, శపించడం, ఇటువంటి పనులు చేద్దామన్నా వారికి చేతకాదు. ఆ పనులు ఎలా చెయ్యగలడు. వారికి చేతనైన పని అనుగ్రహించడమే. ఇక ఏమి చెప్పమంటారు. బుద్ధుడు హైలీ ఎవాల్వ్‌డ్ సోల్. టీచర్లు అంతా శాస్త్రాలలో చెప్పినది చెబుతారు. బుద్ధుడు అనుభవంతో చెప్పినది. వివేకానందుడు ఏకాగ్రత ఉండేది. రామకృష్ణుడు మనస్సు లేని స్థితి. గురువు చూస్తూ ఉంటాడు. ముగ్గిస్తాడు. ఏ కాలంలో ఏ మలుపు తిప్పాలో ఏ సమయంలో ఏది చేయాలో అన్నీ చేస్తాడు. ప్రతీ జన్మలోనూ నిన్ను గమ్యానికి చేరేవరకూ వెంటాడతాడు. మీకు నిజం తెలిసాక "ఇన్ని జన్మలనుండి వెంటాడుతున్నాడా" అని తెలుస్తుంది. మీ హృదయంలో ఉన్న శాంతి ప్రపంచానికి అంతకూ పంచి పెట్టవచ్చును. నేను సుఖంగా ఉన్నాను. శరీరం ఉన్నా లాభం కనబడటం లేదు. శరీరం పోయినా నష్టం కనిపించడం లేదు. మీరు కూడా ఆ స్థితిని పొందవచ్చును. అభ్యాసం చేసే బుద్ధి కూడా గురువు అనుగ్రహమే. అది నీ సొంతం కాదు. అభ్యాసం చేస్తున్నాను అనేవాడు దొంగ నేను.

42. మీకు ఎప్పడు ఎక్కడ ఏది అవసరమో మీరు మరచిపోయినా గురువు మరచిపోడు. మీకు మైండ్ ఉంది కాబట్టి మరుపు వస్తుంది. గురువు మరచిపోయే సమస్యే లేదు. ఆయన అంతటా ఉన్నాడు. చెయ్యవలసిన డ్యూటీ చేసి పక్కానికి వచ్చాక శక్తిపాతాన్ని అనుగ్రహిస్తాడు. మీ మనస్సులోని బలహీనతలతో పోరాడండి. భగవంతుని అనుగ్రహం

వస్తుంది. నిర్వాణ అనుభవం కోసం ఎదురు చూడకండి. దానివల్ల దుఃఖం వస్తుంది. అది ఎప్పుడు, ఎక్కడ ఇవ్వాలో ఈశ్వరుడు నిర్ణయిస్తాడు. రామకృష్ణ పరమహంసను కొలవలేము. ఆయన అవతార పురుషుడు. ఒకరితో ఆమెను నన్ను చూడడానికి రమ్మనమని చెప్ప అనేవారు. భగవాన్ అలా అనేవారు కాదు. నిన్ను నీవు ఎంతగా ప్రేమించుకుంటున్నావో జ్ఞాని మన పట్ల అంత ప్రేమ, కరుణ, అనుగ్రహం ఉంటుంది. అది తప్ప ఆయనలో ఏమీ లేదు. బుద్ధుడి ఇంటినుండి వెళుతూ చెన్నుడితో "నాలో ప్రేమను కుటుంబ సభ్యులకే పంచమంటావా? వారి శోకం మాత్రమే ఆర్పితే సరిపోతుందా? నా ప్రేమను పరిమితం చెయ్యను. ప్రపంచానికి అందజేయాలి" అన్నాడు. గురువు మీతో మాట్లాడుతూ, తిరుగుతూ మీలో ఉన్న బలహీనతలను గ్రహించి కాల్చి బూడిద చెయ్యడమే గురువు యొక్క లక్ష్యం. గజం బద్దతో బట్టలు ఎలా కొలుస్తామో అలాగే ఒక మనిషిని కొలిచేటప్పడు వారి ధనం, విద్య, అధికారం కొలవకూడదు. హృదయం ఎలా ఉంది అని కొలవాలి. బుద్ధుడు ఎక్కడ కూర్చుని బోధ చేస్తాడో అదే స్థలంలో మేము కూర్చుని మాట్లాడుకుంటే ఈ చెయ్యి, ఆ చెయ్యిని తాకితే స్పర్శ ఎంత స్పష్టంగా తెలుస్తుందో అలాగే బుద్ధుని అనుగ్రహాన్ని మేము అనుభవించాము. మానవ జాతిని అంత అత్యంతగా, అపూర్వంగా, అద్భుతంగా, అంత ఉదారంగా ప్రేమించిన వ్యక్తి లేడేమో అంత సంస్కృతి బుద్ధుడిది. సేవ గురించి ఆయన "ఎవరికైనా ఏదైనా ఇస్తే ఎందుకిచ్చాను అని బాధపడటం కంటే ఎవరికీ ఏమీ ఇవ్వకపోవడమే మంచిది. అంటే ఏడుపు ముఖాలతో ఇవ్వకుండా శాంతంగా ఇవ్వమని అర్థం" అన్నారు. ఒకరు ఆయనతో ఈ అలవాటు నాకు పోవడం లేదేమిటి? అంటే "నాకు ఏ అలవాటు లేదు. నన్ను తలపెట్టుకో. ఆ అలవాటు దానంతట అదే పోతుంది. సత్యానుభవం పొందినవానిని ప్రేమిస్తే అది పోతుంది" అన్నారు. శ్రీ నాన్నగారు ఇలా అన్నారు "ఇది నా స్వానుభవం. నేను కృష్ణ భక్తుడిని కాకపోయినా పూరీ జగన్నాధుని ఫొటో నాకు ఒకరు చూపిస్తే నేను తదేకంగా పరిశీలనగా





చూస్తూ ఉంటే నా శరీరం మాయమైనది. మూడు శరీరాలు నిజం కాదని అంతా శూన్యమైపోయింది. నేను ఉన్నట్లు తెలుస్తున్నది. దీనిని ఎవరు కాదన్నా అది నా అనుభవం"అన్నారు.

43. కంచి పరమాచార్యులు ఇతరుల కోసం జీవించినట్లు గ్రహిస్తాము. శ్రీకృష్ణ చైతన్యుల గురించి వివేకానంద "ఆయన శరీరం ఉన్నా శరీరం లేనట్లే జీవించారు" అన్నారు. అది మన బుద్ధికి అందదు. విష్ణు పురాణం, విష్ణు వైవిక్తక పురాణం, భాగవతం, భారతం లాంటివి ఎనిమిది పురాణాలు చదివితే శ్రీ కృష్ణ వైభవం తెలుస్తుంది. నేను ఎప్పడూ జపధ్యానాలు చెయ్యలేదు. మేము దత్తుళ్లము. జపధ్యానాలు చేసేది మైండే. బుద్ధుడు నిర్వాణం పొందిన తరువాత యాబదిరోజులు కదలలేకపోయాడు. అంతులేని ఆనందంలో ఊగిపోయాడు. ఆయన ఎవరిని చూచినా వానిలోని బలహీనతలు అణిగిపోయేవి. నేను విక్రమ్‌తో ఇలా అన్నాను "నీకు నోబుల్ ప్రైజ్ వస్తుంది. అప్పడు ఈ శరీరం ఉండదు" అని. రాముడికి, కృష్ణుడికి జ్ఞానంతో పాటు శక్తి ఉంది. కృష్ణుడు ఎవరినైనా శిక్షించాలి అంటే చెయ్యి వేస్తే వెయ్యి ఏనుగుల బలం మీదపడి చనిపోయాడు. శ్రీనాన్నగారు ఒంటిమెట్ట కోదండ రామాలయాన్ని దర్శించి రాముల వారి విగ్రహం పన్నెండు వందల సంవత్సరాలది. ముసలిదిగా ఉందే అనే తలంపు వచ్చింది. తలంపు రాగానే నాన్నగారికి "ఇదేనా నీవు చూచేది" అనిపించింది. శ్రీనాన్నగారితో ఒక అమ్మగారు ఇలా అన్నారు "మా అబ్బాయి నిద్రపోయే ముందు 'అమ్మా! నాన్నగారి స్వీట్ వాయిస్ వినిపిస్తే తొందరగా నిద్రపోతాను' నాల్గవ తరగతి చదివే ఆ అబ్బాయికి ఎవరో చెబితో అన్నమాటలు కావు. వాడి హృదయంలోంచి ఫీలై అన్న మాటలు. మీరు నాకు చేసే సన్మానాల కన్నా, ఆ మాట చాలా స్వీట్‌గా ఉంది. అవి హృదయాంతరాళాల్లోంచి వచ్చిన మాటలు" అన్నారు. మలేషియాలో ఉద్యోగం చేస్తున్న ఒక అబ్బాయి ఈరోజున నన్ను చూడడానికి వచ్చాడు. నేను "మీ తాతయ్యను చూచి వచ్చావా" అని అడిగాను. "ఫోన్ చేసాను" అన్నాడు. దాని అర్థం మిమ్మల్ని చూస్తే సంతృప్తి

అవుతుంది అని అనుకొన్నాను అని చెప్పాడు. అతడిని ఈశ్వరుడే తీసుకొచ్చాడు. వాసనలు గురువు నీకు చూపించి వాటి బాధ తెలిపి బయటకు తీస్తాడు. అది చట్టం. నీవు ఒక సంవత్సరం అనుభవించ వలసినది ఒక గంటలో నీతో అనుభవింపచేస్తాడు. వాడు గురువు. ఒక వర్తకుడు బుద్ధుని వద్దకు వచ్చి కూర్చున్నాడు వర్షం వల్ల సరుకు అమ్ముడు అవ్వడం లేదని బాధను గ్రహించిన బుద్ధుడు ఆనంద్‌తో వాడు వారం రోజులలో చనిపోతాడు. అతనితో ఆ విషయం చెప్ప. అనగా ఆ వర్తకుడు సరుకునంతా భక్తులకు పంచిపెట్టాడు. వాడు అన్ని గొడవలూ వదిలేసాడు అంతర్ముఖమైపోయాడు. ఆత్మానుభవమార్గంలోకి వెళ్ళిపోయాడు. పాములు నాకు మూడుసార్లు తారసపడ్డాయి. ఒక అడుగు దూరంలో వచ్చినా వెనక్కి వెళ్ళిపోయాయి. బహుశా నా ప్రారబ్ధంలో పాములతో కరిచే ప్రారబ్ధం లేకపోవచ్చు లేదా పాములకు తెలుసు మనకు వీడు అపకారం చేయడు అనుకొన్నప్పడు మనల్ని కరవవు.

44. భగవాన్‌ది సైలెంట్ ప్రేమ, రామకృష్ణుడికి మాటల్లో ప్రేమ ఉండేది. పవహారీ బాబా గృహంలో ఉన్నప్పడు మౌనంగా ఉండేవారు. అన్నంలో టమోటాలు కలుపుకొని తినేవారు. వివేకానంద ఆయనతో మీరు గృహంలోనే ఉంటే సరిపోతుందా? ఇతరులకు సహాయం చెయ్యరా? అనగా "నీ మనస్సును అంతర్ముఖం చేసేవారు సహాయకులు కారా? అని కోపంగా మాట్లాడేవారు. బాబా ఒకప్పడు దొంగ. ఒక జ్ఞాని చూపుతో అంతటివాడు అయ్యారు. ఆ స్టుపిడ్ ఉన్నాడు అనుకొంటున్నావా? అన్నారు. ఆస్ట్రేలియా క్రికెటర్ తండ్రి గ్రహబలాన్ని గృహబలంతో జయించవచ్చును. (ఐకమత్యంతో) సంపద పెరుగుతుంది" అన్నారు. ఎవరిమీద అయినా అయిష్టం ఉంటే దూరంగా ఉండండి. పేచీలు పెట్టుకోవద్దు. గతంలో అపకారం చేసేవాళ్లను మరచిపోండి. సహారీబాబా వివేకానందునితో ఎవరో ముక్కు మూసుకుని తిరుగుతున్నారని నేను ముక్కు మూసుకొని తిరగనా? ఆధ్యాత్మిక సహకారం కన్నా భౌతిక సహకారం గొప్పదా? అన్నారు. ఒక ప్రొఫెసర్ బుద్ధుని గురించి





"లైట్ ఆఫ్ ఏషియా" అని ఒక పుస్తకం రాస్తే లక్ష ప్రతులు అమ్ముడైపోయాయి. ఆయనే ఏసు గురించి "లైట్ ఆఫ్ వరల్డ్" అని వ్రాస్తే ఒక్క పుస్తకం అమ్ముడుపోలేదు. రామకృష్ణ పరమహంస పదహారు మందిని ఎన్నుకొని తన సందేశాన్ని ప్రపంచం అంతా వ్యాప్తిచేసుకున్నారు. జ్ఞాని అనుగ్రహం మీ బుద్ధికి అందదు. వెయ్యి జన్మలు పట్టే వాసనలను ఒక్క దెబ్బతో కత్తిరించగలడు. సురేంద్రనాథ్ బెనర్జీ "భగవంతుని ఒక చూపు చాలు వాసనలు పోవడానికి" అన్నారు. రామకృష్ణునితో ఒకరు "ఉద్యోగం ఉందని పెళ్ళి చేసాము. ఉద్యోగం మానేయడం మోసం కాదా? అని మీ అత్తింటివారు అంటున్నారు" అంటే "అదీ నిజమే కదా!" అనేవారు. దానిపై ఒకరు "ఆరోగ్యం బాగాలేదు అందుకే ఉద్యోగం మానేసాను అనండి అపవాదుపోతుంది" అంటే "నేను బాగానే తిరుగుతున్నాను గదా! ఎలా నమ్ముతారు" అన్నారు. అసలు కపటం లేదు. నాకు బుద్ధుడు ఇష్టమే. కానీ రామకృష్ణుడిలో కపటం లేదు. అది చాలా గొప్పది. కొందరు తమ పిల్లల్ని చూపుతో కంట్రోల్ చెయ్యగలరు. భౌతికమైన వ్యక్తికే అంత శక్తి ఉంటే జ్ఞాని చూపు ఎంత మార్పు తెస్తుందో మీరే గుర్తించండి. కార్యాకారణాలకు అతీతంగా జ్ఞాని అనుగ్రహించగలడు. పెరుమాళ్ళస్వామి భగవాన్‌ని విమర్శించిన పుస్తకం ఉంది దానిని "లైబ్రరీలో పెట్టండి" అనగా "అది ఎలా సాధ్యం" అంటే "అందులో ఏముంది? తెల్లకాగితంపై నల్ల అక్షరాలు" అన్నారు. గురువు వద్దకు మనం వెళ్ళడం వేరు, మన దగ్గరకు గురువు రావడం వేరు. వాసనా క్షయం ముఖ్యం. అది జీవిత గమ్యం. అది గురువు చేసే పని. దాని ఎరుక లేకుండా తియ్యడం కుదరదు.

45. మీకు అశాంతి, దుఃఖం ఉంటే గురువు మిమ్మల్ని ఆనంద సముద్రంలో ఉంచుతాడు. అప్పడు అనవసరంగా ఏడ్చాము అనిపిస్తుంది. మీ దుఃఖాలు నిజం అనుకుంటే వేదన కలుగుతుంది. అవి స్వప్నాలు, కల్పించుకున్నవి అని అప్పడు తెలుస్తుంది. శంకరాచార్యులవారు వ్రాసినవి రెండు వందల గ్రంథాలు ఉన్నాయి. ఆయన కేదార్‌నాథ్ గుడి వెనుక అదృశ్య

మైనారు. కానీ ఆయన చేతిలో దండ అలా ఉంది. భజగోవిందం కాశీలో వ్రాసారు. శంకరులు నాలుగు మఠాలు స్థాపించారు. ద్వారక, బదరీ, శృంగేరీ, హృషీకేష్. హృషీకేశ్వరుడు ఇంద్రియాలకు ప్రభువు. ఆయన అనుగ్రహం లేకుండా నీ ఇంద్రియాలు క్రమశిక్షణలోకి రావు. నా అనుగ్రహం మీ మీద లేదు అనుకోకండి. నా దయ లేకపోతే మీరు ఇక్కడికి రానేరారు. నా అనుగ్రహం లేకపోతే మీరు ఇక్కడికి రానేరారు. మీరు గురువును ఎన్నుకొంటే అమావాస్య రోజున ఒక గురువు, పౌర్ణమినాడు ఒక గురువు మార్చేస్తారు. అదే గురువే మిమ్మల్ని ఎన్నుకొంటే ఆత్మానుభవం కలిగే వరకు వదలడు. జ్ఞానం గురించి చెప్పడమేమిటి? ఇవ్వడమే. మిల్టన్‌కి చివరి కాలంలో గుడ్డితనం వచ్చింది. "ప్రపంచంలో చాలా ఆకర్షణలు ఉన్నాయి. దాన్ని వల్లనే సత్యం తెలియబడటం లేదు" అన్నారు. మీలో ఏ విశేషం ఉన్నా భగవంతుడు ఇచ్చినదే. గాంధీజీ మహదేవ్ దేశాయ్ పోయినప్పుడు "ఈశ్వరుడు మహదేవ్ దేశాయ్‌ని తీసుకునిపోయాడా?" అని ఏడ్చారు. అలాగే గాంధీజీ మరణించినప్పుడు రాజాజీ "నౌ బాపూజీ బికేమ్ ఇమ్మోర్టల్" అన్నారు. గురువు మీద మీకు ప్రేమ తగ్గిపోయినా గురువు మిమ్మల్ని ప్రేమించడం మానడు. మీ శరీరాలు రాలిపోయినా మిమ్ములను వెంటాడి తన స్వరూపం మీకు ఇచ్చే వరకూ వదలడు. గురు, శిష్యుల గురించి కబీర్ బాగా చెప్పాడు. "ఈశ్వరానుగ్రహమే మిమ్మల్ని ఇక్కడకు తీసుకొని వచ్చింది". కంచి పరమాచార్యులవారు విజయవాడలో ఒక సభలో వాల్మీకి రామాయణంలో ఒక శ్లోకంలోని అంతరార్థాన్ని ఆయన హృదయం అంతరార్థాన్ని విడదీసి చెబుతూ ఉంటే మహాపండితుడు, కవి విశ్వనాథ సత్యనారాయణగారు ఆశ్చర్యంగా ఓహో వాల్మీకి ఆయన అంతరంగాన్ని తరచి చెబుతున్నారు అని ఊగిసలాడారు. (నాన్నగారు ఆ సభలో ఉండి ఆ సంఘటన ప్రత్యక్షంగా చూచి చెప్పారు.) ఈ పని చేస్తే భవిష్యత్తులో ఏ దుఃఖం వస్తుంది అని ఆలోచించి వ్యవహరించండి. ఈశ్వరుడు గురు రూపంలో ఉండి మనలను నడిపిస్తున్నాడు. రామకృష్ణుడి కన్నా





వివేకానందుడు గొప్పవాడు అనడం తప్పు. పునాది వేసినది రామకృష్ణుడు అని గ్రహించాలి.

46. నీవు గురువుకు విషం పోసిన కప్పు ఇచ్చినా గురువు నాకు కాఫీ ఇస్తున్నాడు అనుకొంటాడు. వాడు గురువు. ఆయన శిరస్సుపై అమృత వర్షం కురిపిస్తాడు. దక్షిణామూర్తి సనత్‌కుమారుణ్ణి జ్ఞానిని చేసాడు అని ఒక ప్రక్కనుంచి మాట్లాడతారు. అది కాదు ఆయన అప్పటికే పక్వానికి వచ్చాడు. అది ఆలోచించరు. ఆయన రాతిలాంటి మనిషికాదు. తులసీదాస్ భార్య తులసీదాస్‌తో "నా మీద ఉన్న ప్రేమ రాముని మీద ఉంటే తరిస్తావు" అనగా గుమ్మం దాటకుండానే వెళ్ళిపోయాడు. రామచరిత మానస్ వ్రాసాడు. రామకృష్ణుడు "ఇక్కడకు వచ్చి శరణాగతి చేసాక మీ బాధ్యత తీరిపోతుంది. ఇక నాదే బాధ్యత" అనేవారు. భగవాన్ గైడెన్స్ లోపల నుండి వచ్చేది అంటే మారు మనస్సు కలుగజేసేవారు "నేను ఇంటి దగ్గర కూర్చుని ఒంటరిగా పరిశీలిస్తే మీ పట్ల ఎంతోకొంత ప్రేమ ఉంది కానీ దానికన్నా మీరందరూ నాపట్ల ఎక్కువ ఆప్యాయత చూపిస్తున్నారు. ఒకరకంగా మీకే నేను ఋణపడి ఉన్నాను. ఈ టీచింగ్ రెండవ పక్షం. కాబట్టి మీ ప్రేమ నేను మరువలేను. మరవటానికి వీలులేనిది శరీరం ఉన్నా లేకపోయినా నా స్మృతిలో ఉండిపోతుంది" మనకు తల్లి అయినా, తండ్రి అయినా, దేవుడు అయినా గురువే. మనకు ఏదైనా కష్టం వచ్చినప్పుడు గురువు ఇచ్చిన రక్షణ బంధువులైనా ఇవ్వలేరు. శాంతీ జ్ఞానేశ్వర్ దున్నపోతులతో వేదం చెప్పించేవారు. ఆయనకు ఇద్దరు అన్నదమ్ములు. ఒక తోబుట్టువు ఉంది. ఆమె ఇంటి వద్ద వేదం చెప్పేది. ఒక సందర్భంలో కొందరు భక్తులు ఒక గంట ముందు వచ్చి కూర్చొనగా ఆమె స్నానం చేసి దిగంబరంగా హాలులోకి రాగా భక్తులు చూచి బయటకు వెళ్ళి మామూలు సమయానికి వచ్చేవారు. ఆమె వేదం చెప్పడానికి వచ్చి "మీరంతా ఇందాక ఎందుకు వెళ్ళిపోయారు" అనగా "మీరు బట్టలు లేకుండా ఉన్నారు కదా!" అనగా "ఇందులో ఏముంది? గోడమీద పగులే కదా!" అన్నారు. ఆమెకు స్త్రీ, పురుష భేదం తెలియదు.

ఇది భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు చెప్పారు. జ్ఞానేశ్వర్, తుకారాం ఒక గ్రామస్తులే. పునాకు 30 కీలోమీటర్ల దూరం మాత్రమే. ఒక వ్యక్తి జ్ఞానేశ్వర్‌కు "తన మహిమలు చూపాలని పులి మీద స్వారీ చేస్తూ ఉండగా చెల్లెలు మన ఎదురుగా వెళ్ళి స్వాగతం ఇద్దామని అన్నది. తనను ఆనుకొని ఉన్న గోడను వెళ్ళు అనగా ఆ గోడ కదలి వెళ్ళింది. అది చూసి ఆ వ్యక్తి ఆయన కాళ్ళమీద పడి శరణు వేడారు. శ్రీనాన్నగారు పాలకొల్లులో ఒక అపార్ట్‌మెంట్ ప్రారంభోత్సవానికి వెళితే "శ్రీ నాన్నగారి టవర్సు" అని వ్రాసి ఉంది. ఆ భవన యమానితో "ఆ పేరు చూచి నాకు సంతోషం వస్తూ ఉంటే నేను అహంకారంతో ఉన్నట్లే" అన్నారు.

47. గురువు మీరు చేసే కర్మను కూడా ఆయన నెత్తిమీద పెట్టుకొని మోసి ఆయన స్వరూపాన్ని మీకు ఇవ్వడానికి ప్రయత్నం చేస్తాడు వాడు గురువు. అరుణాచలంలో ఆశ్రమానికి "శ్రీ నాన్నగారి ఆశ్రమం" అని పేరు పెట్టారు. నాన్నగారు అనేవారు "భగవాన్ నాకంటే వేరా! కాబట్టి నేను ఆయనకు నమస్కారం పెట్టుకోవడం కూడా అలవాటు లేదు. భగవాన్ దేవతా స్వరూపుడని ఒక ఋషి భావన. ఏమీలేదు కుటుంబ సభ్యులే అనిపిస్తుంది. మోహం అనే సముద్రం దాటాలంటే అందులో ఎన్నో మొసళ్ళు ఉంటాయి. దానికి దయాపూరితమైన గురువు దొరకాలి. భగవాన్ అనుగ్రహం వలన ఈ శరీరం ఉన్నా, ఊడిపోయినా ఒక్కటే అనే అనుభవం నాకు వచ్చేసింది. శరీరం ఉండటం వల్ల లాభమూ లేదు. అది పోవడం వల్ల వచ్చే నష్టమూ లేదు అని నాకు అనిపిస్తున్నది. నేను చెప్పే మాటలను ప్రోపర్‌గా నా హృదయంలో ఉండి ఏ స్పిరిట్‌తో ఆ మాటలు వస్తున్నాయో ఆ మాటలు మీరు ఉన్నది ఉన్నట్లుగా అర్థం చేసుకోవడమే నన్ను గౌరవించడం. (ఇది 16-09-1984 సం॥లోని అనుగ్రహ భాషణం) నేను మాటను తేలికగా చెబుతున్నాను దానిని అర్థం చేసుకోవడం అంత తేలిక కాదు. నా ఒంటి మీద చొక్కా ఉంది. ఆ చొక్కాను తీసి ప్రక్కన పెట్టాను, చొక్కా ఉన్నప్పుడు నేను ఎలా ఉన్నానో, తీసినప్పుడు కూడా అలాగే ఉన్నాను. అలాగే జ్ఞాని





దేహం ఉన్నా లేకపోయినా ఒక్కటే. వాడిలో ఏ మార్పులేదు. నేను చెప్పే విషయాలు మీరు అర్థం చేసుకొంటే మీకు తెలియకుండానే మీరు ఆత్మను తెలుసుకోవడానికి ఉపయోగపడతాయి కాబట్టి మీకు మీరే ఉపయోగం చేసుకుంటారు. రామకృష్ణుడు అంటారు "కొంతమంది బద్ధజీవులు ఉంటారు చేపలను రాళ్ళమీద వ్రాసినట్లుగా వ్రాసినా వారికి మోక్షం రాదు" అని. నేను పెద్ద పెద్ద సాధనలూ చెయ్యలేదు. పెద్ద పెద్ద చదువులూ చదవలేదు. హిమాలయ పర్వతాలకూ వెళ్ళలేదు. ఈ స్టేజీ మీద కూర్చోబెట్టి ఇలా నాలుగు మాటలు మాట్లాడించేది భగవాన్ దయ, ప్రేమ. అది ఆయన అనుగ్రహం. గురువు నీలో ఉన్న చెడ్డను కక్కిస్తాడు. చాకలి బట్టలు ఉతికినట్లుగా కాని ఎన్ని కొట్టినా నీకు దెబ్బతగలదు. మత్తు పెడతాడు గురువు. ఎవరైనా నన్ను అర్థం చేసుకుంటే నాకు ఏనుగు మీద కూర్చున్నట్లు ఉంటుంది. మీ ఓట్లు, నోట్లు నేను ఆశించడం లేదు. అర్థం చేసుకునే హృదయాన్ని నేను ఆశిస్తున్నాను. ఇజ్రాయిల్ నుంచి వచ్చిన భక్తుడు "నాకు గురువు కావాలి. ఏదో సపోర్టు కావాలి కదా! అంటే అరుణగిరిని, భగవాన్‌ని ఎన్నుకో" అనగా ఆయన కాదు "మీ రూపం మీద నా మనస్సు పడిపోయింది" అనగా "ముల్లును ముల్లుతోనే తియ్యాలి. నా రూపం, నీ రూపం అబద్ధమే. ఒక అబద్ధాన్ని పట్టుకొని ఇంకో అబద్ధాన్ని తీసేసుకో. నీకు రూపబుద్ధి పోయినప్పుడు నా రూపం నీకు అవసరం లేదు" అన్నాను. నా ముక్కులో గాలి ఉన్నంత కాలం ఆచార్యులవారి గురించి కొంత చెప్పాలి. మీకు ఇక్కడికి రావలనే భ్రాంతి ఉంది. మీరు వచ్చారు. ఈ రూపం లేదని తెలుసుకున్నారు. చూడలేదనే తలంపు పోయింది గతంలో ఎంతకాలం ఉంటారు.

48. మోక్షం అంటే శాశ్వతంగా దుఃఖం రాకూడదు. అంటే మీరు మరణశయ్యమీద ఉన్నా దుఃఖం రాకూడదు. నీలోపల ఉన్న శాంతి అందితే దేవేంద్రులు దర్శనమిచ్చి నిన్ను స్వర్గానికి తీసుకొని వెళతాను అంటే వద్దు ఈ సుఖం, శాంతి ముందు అది ఎంత? అని రాను అంటావు. అదే మోక్ష సుఖం. నీవు స్వప్నములో ఎన్నో లోకాలు, దేశాలు వెళ్ళావు. నీ గెడప దాటలేదు

అవి అన్నీ నీ మనస్సులో కల్పించబడ్డవి. అలాగే నీకు జ్ఞానం కలిగితే పూర్వజన్మలు, ప్రస్తుత జన్మ నీ మనస్సు కల్పించినవే అని తెలుస్తుంది. అదే నిర్వాణ సుఖం. అదే స్వర్గరాజ్యం. నీవు పొందిన ఆనందం కన్నా దేవతలు పొందే ఆనందం గొప్పది. దానికన్నా ఇంద్రుడు పొందే ఆనందం గొప్పది. దానికన్నా బ్రహ్మదేవుడు పొందే ఆనందం గొప్పది. నీవు ఆత్మానందం పొందితే నిన్ను సృష్టించిన బ్రహ్మదేవునికే నీ ఆనందం చూసి అసూయ వస్తుంది. అదే బ్రహ్మానంద వైభవం. సంకల్పం వచ్చిన తరువాత నిగ్రహించడం వేరు. అసలు సంకల్పం రావడం వేరు. అది సత్యానుభవంలోనే సాధ్యం అవుతుంది. కైవల్యం అంటే కేవలంగా ఉన్నది. ఈశ్వరుని ఈశ్వరుని కోసమే ప్రేమించడం. నిర్మలంగా నేచురల్‌గా ఆయన మీద ప్రేమ ఉంటే నీకు మోక్షాన్ని ఇస్తాడు. "మనం కష్టపడకుండా ఏదీ రాదు. కష్టపడకుండా ఏదైనా వచ్చినా దాని విలువ తెలియదు అలాంటిది స్వర్గరాజ్యం ఎలా వస్తుంది" అన్నారు డికెన్.

49. మోక్షంలో శరీరాలు ఉండవు. మోక్షం వచ్చేవరకూ శరీరాలు ఆగవు. ఇది సిద్ధాంతం. బుద్ధుడు "చనిపోయినప్పుడు నూరుశాతం శాంతిలో ఉంటే పునర్జన్మ రాదు" అన్నారు. మనిషికి అశాంతి వల్లనే పునర్జన్మ వస్తుంది. సహజంలోనే ఆనందం ఉంది. సుఖం ఉంది. అనుబంధం లేని శాంతిని పొందడమే నిజమైన శాంతి. ఇది రాజీలేని సూత్రం. ఉన్నతమైనది. దేహం నేను అనే తలంపు ప్రస్తుతం మీకు ఉంది. చైతన్యమే నేను అనే అనుభవం మీకు కలిగితే బంధం మోక్షం అనే తలంపే రాదు. మృత్యువుకు సంబంధించిన స్ఫురణ అనేది అమృతం. అదే మోక్షం. జ్ఞానం వచ్చిన వానిని మరల ఈ సృష్టిలో కలపడు ఈశ్వరుడు. అది అనుగ్రహ కార్యం. చెఱకు గెడను రసం తీసిన తరువాత పిప్పి ఎటువంటిదో నీకు ఆత్మానందం కలిగిన తరువాత లోకం గొడవలు అటువంటి పిప్పి గొడవలే అని గుర్తిస్తావు. నీరు ఏవిధంగా పల్లానికి వెళుతుందో అలాగే వినయం ఉన్న చోటుకి జ్ఞానం, సంపద, మోక్షం వస్తాయి. నిర్వాణ సుఖం బయటకు కనిపించేది కాదు. భౌతిక దృష్టికి కానరాదు. అది నీ హృదయంలో ఉంది. అది స్వతంత్రమైనది.






మామిడిపండు తిన్నట్లు, సినిమా చూచినట్లు అనుకొంటున్నావు. అలా ఊహించుకోకు. అది అనుభవైకవేద్యం. మీరు ఊహించిన దానికంటే గొప్పగా ఉంటుంది. అందుచేత ఊహించకు. అలా ప్రకృతి సుఖాల వలె ఉంటుందని ప్రమాదంలో పడకుండా ఉండటం కోసం ముందు జాగ్రత్తగా చెబుతారు. కొంతమందికి ఇంటి దగ్గర కష్టం వస్తే దేవుని స్మరించడం, అలాగే ఆరోగ్యం బాగా లేకపోయినా అత్తగారు కోడలను తిట్టినా, కోడలు అత్తగారిని తిట్టినా ఏదో కారణం వల్ల దేవుడు జ్ఞాపకం వస్తాడు. సంసారం బాగా ఉంటే గర్వం బాగాలేకపోతే ఏడుపు. డబ్బు ఉంటే గర్వం. డబ్బు లేకపోతే సంసారం ఎలా గడుస్తుంది అని గొడవ. అంతేగానీ అసలు మోక్ష మార్గంలో ఎంతమంది ఉన్నారు. మనం పురుషులైనా, స్త్రీలైనా, ఏ కులమైనా, ఏ మతమైనా, ధనవంతులైనా, పేదవారైనా, పండితులైనా, పామరులైనా, మోక్షాన్ని పొందడమే మన గమ్యం. నీకు అద్వైత అనుభవం కలిగినప్పుడు ఒక్క బొమ్మ మీద కూడా నీకు ఆకర్షణ కలుగదు. మనకు దేహబుద్ధి ఉన్నంతకాలం భగవంతుని మాటలు వినాలి. వాటిని ఆచరించాలి. తర్కాలు అక్కరలేదు. ఎదురుగా పలావు కనిపిస్తూ ఉంది. తినేయాలని ఉంది అంటే అది మోక్షమా? అది శాంతా? అది జ్ఞానమా? అలా భయపడి ఎన్నాళ్ళు సృష్టిలోకి రాకుండా దాక్కుంటావు? భోగాలు అన్నీ నీ ఎదురుగా ఉన్నా నీకు వికారం రాకూడదు. మోక్షం అంటే అది.

50. నీకు ఏ క్షణంలో అయినా ఎరుక కలిగితే అదే కడసారి జన్మ. అప్పుడు ఆ ఎరుక ఎలా ఉంటుంది అంటే ఒక చెయ్యి రెండవ చెయ్యిని పట్టుకుంటే స్పర్శ ఎలా తెలుస్తుందో అంత స్పష్టంగా ఆ వస్తువు తాలూకా వైభవం నీకు తెలుస్తుంది. అది నీవే అన్న సంగతి నీకు తెలుస్తుంది. దేశ సరిహద్దులను దాటకుండా యూరప్ వెళ్ళాలి అనుకోవడం ఎలాంటిదో నామరూపాలను దాటకుండా మోక్షం పొందాలి అనుకోవడం కూడా అటువంటిదే. సమాధిలో సుఖాన్ని మీరు పొందడం కాదు సుఖమే మీరు అయిపోతారు. వరద నీటిలో గడ్డిపరక వేస్తే చాలా వేగంగా కొట్టుకొని

పోతుంది. అలాగే చైతన్యం లోపల మేల్కొన్నప్పుడు మన మనస్సు అనే గడ్డి పరకను కొన్ని క్షణాలలో లోపలకి లాగేసుకొంటుంది. ఇక పుణ్యం, పాపం అని లెక్కలు వేసేవాడు ఉండడు. మీరు శాంతి ప్రవాహంలో కొట్టుకొనిపోతూ ఉంటే మీ శరీరానికి చావు వచ్చినా మీకు తెలియదు. మోక్షం అంటే తాను ఉన్నానని తెలుస్తుంది. జ్ఞానంగా, సుఖంగా, శాంతంగా ఉంటాడు. శరీర స్మరణ ఉండదు. వాడు శాంతిలో ఊగిసలాడతాడు. అమృతత్వం అంటే మృత్యువు రాకముందే మృత్యువును జయించడం. సత్యానుభవం కలిగితే ఈ భోగభాలు, ఈ సృష్టి, అంతా నీటి బుడగలాగ కనిపిస్తాయి. ఈ సంపద, గౌరవాలు గడ్డిపరకలా కనిపిస్తాయి. అద్వైత అనుభవం ముందు కాశీ ఎంత? రామేశ్వరం ఎంత? అరుణాచలం ఎంత? ఈశ్వరునితో ఏకత్వం మనకు కలిగితే దానితో సమానమైన అనుభవం, దానికి మించిన అనుభవం లేనే లేదు. "ఉండటం" అన్నది నేనై ఉన్నాను. భగవంతుని గురించి ఇంతకన్నా బాగా చెప్పినది ఏమతం లోనూ లేదు. మోక్షం అనేది కర్మఫలం కాదు, జ్ఞానఫలం. భగవాన్ తమ్ముని మనుమడు శ్రీ నాన్నగారిని ఉద్దేశించి "భగవాన్‌కు శరీరం లేదు మీకు శరీరం ఉంది తేడా ఏముంది? మీరు ఎందుకు మాట్లాడాలి?" అన్నారు. భగవాన్‌కు ఉన్న క్రేజ్ నాకు ఉందా? అది కూడా ఆయనే అనిపించి ఉండవచ్చు. గురువు "మీరు బాగుపడండి, మిమ్ములను మీర సంస్కరించుకోండి, సద్బుద్ధిని కలిగి ఉండండి అని చెప్పవలసిన పనిలేదు ఆయన్ని దర్శించినంత మాత్రంచేతనే మీలో పై భావాలు కలుగుతాయి. గురువు మనకు చేసే ఉపకారాన్ని 'అనుగ్రహం' అంటారు. శిష్యుని ప్రారబ్ధం యొక్క వేగాన్ని కొట్టే దెబ్బలను ఈశ్వరుడు పంపుతూ ఉంటే వాటిని తట్టుకొనేటట్లు చేస్తాడు. వాడికి ఎన్ని ఉన్నాయో అన్నీ పంపమని ఈశ్వరునికి సవాల్ చేసేవాడే గురువు. మట్టిలాంటి శిష్యుని మనస్సును బంగారంలా చేసేవాడు గురువు.

ఓం తత్ సత్


అమృత వాహిని - 2
అమృత వాహిని - 2
సద్గురు శ్రీ నాన్నగారు, జిన్నూరు